# ఈనాడు ఆదివారం

2 జనవరి 2011




## ఒక ప్రణాళిక

జీవితాన్నే మార్చేస్తుంది!




## టోపీరాజా

ఇక్కడున్న ప్రముఖ నటుడు ఎవరో కనిపెట్టారా?

## ఎవరీమె?

రవితేజ పట్టుకున్న ఈ బ్యూటీ ఎవరో గుర్తుపట్టగలరా?

## ఇదిగో 'తోక'

ఇక్కడున్న ట్యాగ్‌లైన్ల ఆధారంగా సినిమాపేర్లు చెప్పగలరా?

1. (వీడికి క్యాప్షన్ కూడా వేస్తే)
2. మళ్ళీ మొదలైంది
3. దమ్ముంటే కాస్కో
4. The boss
5. మంచికి మంచి... పంచ్‌కి పంచ్
6. కొంచెం కొత్తగా.. కొంచెం భిన్నంగా...

## ఒక్కరే...

1. ప్రాణం ఖరీదు సినిమాలో నూతన్‌ప్రసాద్‌ని పెళ్లాడిన 'సీత'?
2. ఎన్టీఆర్‌తో ఆమె తొలిచిత్రానికి కథారచయిత జంధ్యాల.
3. కె.బాలచందర్ దర్శకత్వంలో వచ్చిన తెలుగు తమిళ చిత్రాల్లో చిరంజీవి, రజనీకాంత్‌లను పెళ్లిచేసుకున్న నటి?
4. దాసరి నారాయణరావు దర్శకత్వంలో వచ్చిన అత్యధిక చిత్రాల్లో నటించిన హీరోయిన్లలో ఒకరు?
5. ద సిటాడెల్ అనే ఆంగ్ల నవల ఆధారంగా దర్శకేంద్రుడు రూపొందించిన చిత్రంలో ఒక కథానాయిక?
6. విజయబాపినీడు దర్శకత్వంలో చిరంజీవితో ఒకేఒక్క సినిమాలో నటించిన హీరోయిన్?

## 'విక్టరీ' స్పెషల్

1. వెంకటేష్ సినిమాల ద్వారా తెలుగు తెరకు పరిచయమైన హీరోయిన్లు ఎంతమందో తెలుసా?
2. సౌందర్యతో వెంకటేష్ ఎన్ని సినిమాలు చేశాడు?
3. ఇక్కడున్న వాటిలో వెంకటేష్‌కు నంది అవార్డు తెచ్చిన చిత్రం?
   A. ప్రేమ B. స్వర్ణకమలం
   C. ధర్మచక్రం D. కలిసుందాం రా
4. వెంకటేష్ బాలనటుడిగా కనిపించిన సినిమా?
5. చిరంజీవి, వెంకటేష్, నాగార్జున, బాలకృష్ణ... ఈ నలుగురూ కనిపించే ఓ చిత్రం?

## కామెడీ గెటప్

కొన్ని క్యారెక్టర్లను సుపరిచిత హీరోలే కాదు, మన కమెడియన్లూ వేశారు. అలా ఎవరెవరు ఏయే గెటప్ వేశారో చెప్పగలరా?

| | |
|---|---|
| 1. అలీ | ఎ. పెదరాయుడు |
| 2. వేణుమాధవ్ | బి. ఇంద్ర |
| 3. ఎమ్మెస్ నారాయణ | సి. శివాజీ |
| 4. బ్రహ్మానందం | డి. బాషా |
| 5. సునీల్ | ఇ. అపరిచితుడు |

## మంచు పాటలు

1. 'లబ్లీ మై హీరో... మజాగా ముద్దిస్తా రారో' అంటూ చిరంజీవిని కైపెక్కించిన భామ?
2. 'మేఘాలే తాకిందీ హైహైలెస్సా...' ఎవరి దర్శకత్వంలో!
3. 'అందాల ఆడబొమ్మ... ఎంత బాగుంది ముద్దుగుమ్మ' అంటూ బాలకృష్ణతో స్టెప్పు లేయించిన సంగీత దర్శకుడు ఎవరు?
4. 'తాజ్‌మహల్'లో శ్రీకాంత్, మోనికాబేడీ పాడుకున్న మంచుపాట చెప్పగలరా?

## ద్విపదచిత్రం

ఇక్కడ కొన్ని పదాలున్నాయి. ఈ పదంలోని మొదటి రెండు అక్షరాలూ ఓ సినిమా పేరుకి మొదటి, ఆఖరి అక్షరాలు. అలాగే పదంలోని చివరి రెండక్షరాలూ మరో సినిమా పేరులోని మొదటి, ఆఖరి అక్షరాలు. ఆ సినిమాలేంటో కనుక్కోండి(ఆధారాల కింద వాటిలో నటుల పేర్లూ ఉన్నాయి).

1. ఆరుముళ్లు (జగపతిబాబు, చిరంజీవి)
2. వాడు రాడు (వెంకటేష్, బాలకృష్ణ)
3. బొమ్మ బాట (ఎన్టీఆర్, రాజేంద్రప్రసాద్)
4. వీడు నారి (ప్రకాష్‌రాజ్, బాలకృష్ణ)
5. టూడీ చిత్రం (వెంకటేష్, నరేష్)



## ద్విముఖం

ఇందులోని ఇద్దరు హీరోయిన్లు ఎవరు?

(సమాధానాలు 29లో)

# లోపల...


చురుక్కు చమక్కు 4

మా ఇంటిపేరు ప్రేమ మందిరం 5

సిల్లీపాయింట్ 6

అవీ... ఇవీ... 11

కథ 12

హాయ్ 15

ఒకే ఒక్కసారి ఏడ్చాను! 18

అభివృద్ధికి వారధి 20

కలవారి కూతురు 21

పనిలేని ఉద్యోగాలు 22

రుచి అభిరుచి 23

బాలవినోదిని 24

'జిమ్ కార్బెట్'లో షికారు! 26

రాశి ఫలం 28

సమీక్ష 29

పదవినోదం 30




**గెలుపు రాత! 7**

దిక్సూచి, కాలిక్యులేటర్, క్యాలెండరు, గడియారం, వ్యక్తిత్వవికాస గ్రంథం... అన్నీ కలిసినా చేయలేని పనిని ప్రణాళిక చేస్తుంది. జీవితానికో లక్ష్యాన్నీ స్పష్టతనూ ఇస్తుంది.



**ఆరెంజ్... 2011 ఫ్యాషన్ కలర్! 16**

టీనేజీ క్రేజీ దుస్తుల్లో... అతివల సంప్రదాయదుస్తుల్లో... ఇక ఆరెంజ్ అందంగా మెరవనుంది. ఎందుకంటే ఈ ఏడాది ట్రెండీ ఫ్యాషన్ కలర్ అదేమరి.

చురుక్కు


మహారాష్ట్ర వర్షబాధిత రైతు
కేంద్రం
రాష్ట్ర వర్షబాధిత రైతు
శ్రీధర్


లాలూ
ఆర్జేడీ


కిరణ్
ఎంఎల్యేలు

చమక్కు


మమత
చిదంబరం
బుద్ధదేవ్‌పై చిదంబరం విమర్శ
బుద్ధదేవ్



మా తల్లిదండ్రులు ఎవరో తెలీదు. ఊహ తెలియక ముందే ప్రేమ మందిరంలో అడుగుపెట్టాం. అందరి ప్రేమను అందుకున్నాం. అక్కడ పెరుగుతూ తోటివారిని ప్రేమించడం నేర్చుకున్నాం. మరి మా 'ప్రేమ మందిరం' కథ చెబుతా వింటారా...

# మా ఇంటిపేరు ప్రేమ మందిరం

నా పేరు ప్రేమ మందిరం గాయత్రి. మా తమ్ముడి పేరు ప్రేమ మందిరం రాఖీ ప్రేమ్. అక్క పేరు ప్రేమమందిరం ద్రాక్షాయణి. మా కుటుంబంలో ఇంకా చాలామంది ఉన్నారు. మమ్మల్ని అంతా అనాథలంటారు. మాకు మాత్రం అలా అనిపించదు. అయినా అనాథలకు ఇంత పెద్ద కుటుంబం ఉంటుందా చెప్పండి. ఎక్కడెక్కడో పుట్టిన మమ్మల్ని ఒక చోట చేరదీసిన గొప్ప మనిషి కామేశ మహర్షి. ఈయన తూర్పు గోదావరి జిల్లా అమలాపురంలో కామాక్షి పీఠాధిపతి. ఈ పీఠం ఆవరణలోనే మా ప్రేమ మందిరం ఉంది. మా కుటుంబ పెద్ద మహర్షిగారే. మా గురించి పూర్తిగా చెప్పేముందు మహర్షి గారి గురించి కొన్ని విషయాలు చెప్పాలి. ఆయన తల్లిదండ్రులు బెహరా సుబ్రహ్మణ్యం, వెంకటరత్నమాంబ. మహర్షిగారి తండ్రి ఇంజినీరు. మహర్షిగారు కూడా ఇంజినీరింగ్ పూర్తిచేశారు. చిన్నప్పట్నుంచీ ఆయనకి సమాజసేవ, ఆధ్యాత్మిక భావనలంటే ఆసక్తి. దాంతో 1967లో 'కామాక్షి పీఠం'... ఆధ్యాత్మిక కేంద్రాన్ని ప్రారంభించారు. అక్కడ మహర్షి గారు, ఆయన తల్లి రత్నమాంబ ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించేవారు.

★ ★ ★

1986లో గోదావరికి భయంకరమైన వరదలు వచ్చాయి. ఆ దెబ్బకు కోనసీమ అతలాకుతలమైంది. ఆ వరదల్లో నిరాశ్రయులైన ముగ్గురు పిల్లల్ని ఎక్కడ చేర్చాలో తెలియక ఓ ప్రభుత్వ అధికారి మల్లగుల్లాలు పడుతుంటే మహర్షిగారు వెళ్లి వారిని పెంచే బాధ్యత తీసుకుంటానన్నారు. అలా ముగ్గురు పిల్లలతో మొదలైంది మా ప్రేమ మందిరం. ఇప్పటివరకూ 117 మందికి ఆశ్రయం ఇచ్చింది. ప్రస్తుతం 45 మందిమి ఇక్కడ ఉంటున్నాం. రెండేళ్ల పిల్లల నుంచి పెళ్లి వయసు వచ్చినవారి వరకూ అందరూ ఉన్నారు. అందరి బాగోగులూ మహర్షిగారే చూసుకుంటారు. పండగలకు కొత్త బట్టలు కొనిస్తారు. మంచి చదువులు చదివిస్తారు. చదువుతో పాటు నృత్యం, సంగీతం, నటన... ఇలా ఇష్టమైన విభాగంలో శిక్షణ తీసుకోమని ప్రోత్సహిస్తారు. మేం నటించిన 'ఓ చిన్న ప్రయత్నం' అనే లఘుచిత్రానికి 2009లో నంది అవార్డు వచ్చింది. దీన్లో బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలను చూపించారు. అన్నట్టు ఆ సినిమాలో నేనూ నటించాను. ఈ సినిమా తీసిన చందూ అన్నయ్య ఇల్లు మా ఇంటి పక్కనే ఉంటుంది. మాతో పాటే ఆడుకునేవాడు, చదువుకునేవాడు. ఆ చిత్రం దూరదర్శన్‌లో వచ్చినపుడు చూసి మేమంతా సంతోషించాం. చదువు పూర్తయిన తర్వాత ఉద్యోగంలో చేరేవరకూ మేం ఇక్కడే ఉంటాం. ఉద్యోగం రావడం లేదా పెళ్లి తర్వాత ఎవరి కాళ్లమీద వాళ్లు నిలబడాల్సిందే. ఇక్కణ్నుంచి వెళ్లి ఉద్యోగులుగానే కాదు చిత్రకారులు, హరికథ కళాకారులు... ఇలా విభిన్న రంగాల్లో స్థిరపడిన వారు ఉన్నారు. అమ్మాయిలకు మా కుటుంబ పెద్ద మహర్షి గారు దగ్గరుండి పెళ్లిచేస్తారు. ఇప్పటివరకూ అలా 24 మంది అమ్మాయిలకు పెళ్లిచేశారు. మా అక్కలూ అన్నయ్యలూ మమ్మల్ని వదిలి పూర్తిగా ఏమీ వెళ్లిపోరు. పండగలూ పబ్బాలపుడు వస్తుంటారు. కాస్త సమయంలోనూ ప్రేమ మందిరాన్ని పుట్టిల్లుగానే భావించి వచ్చేవారూ ఉంటారు.

★ ★ ★

ఇంతకీ మా ఇంటి పేరు 'ప్రేమ మందిరం' ఎలా అయ్యిందో చెప్పలేదు కదూ... ఇక్కడి పిల్లల్లో చాలా కొద్దిమందికి మాత్రమే అమ్మా నాన్న ఎవరో తెలిసేది. అలా తెలిసినపుడు వారి ఇంటిపేరుతో బడిలో చేర్పిస్తారు. మాలో కొందరిని రోజుల పిల్లలుగానే ఇక్కడ చేర్చారు. అందులో నేనూ ఉన్నాను. నాలాంటి పిల్లల తల్లిదండ్రుల గురించి ఎవరికీ తెలియదు. అందుకని ఇక్కడే పేరు పెడతారు. బడిలో చేర్చినపుడు ఇంటిపేరు తప్పనిసరి కదా, దాంతో మా మహర్షిగారికి పెద్ద చిక్కొచ్చిపడేది. ఇంటిపేరు లేకపోతే బడిలో చేర్చుకోమని, భవిష్యత్తులో ఉద్యోగం కూడా రాదని టీచర్లు చెప్పేవారు. అందుకే చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా ఉన్నపుడు మహర్షిగారు ఈ సమస్య ఆయనకు వివరించడంతో మా ఇంటిపేరు 'ప్రేమమందిరం'గా రాసుకునే అవకాశం కల్పించారు. ఈ ఇంటిపేరుతో ప్రస్తుతం ఎనిమిది మందిమి ఉన్నాం.

ప్రారంభంలో ప్రేమ మందిరం నిర్వహణను మహర్షిగారి సొంత డబ్బు, కామాక్షి పీఠానికి వచ్చే ఆదాయంతో సాగించేవారు. పిల్లల సంఖ్య క్రమంగా పెరుగుతుండటం చూసి స్థానిక నాయకులూ ఉద్యోగులూ ఆర్థికసాయం చేయడం మొదలుపెట్టారు. దాంతో మాకు ఎలాంటి లోటూ లేకుండా మహర్షిగారు చూసుకోగలుగుతున్నారు. మా అందరి ఆలనా పాలనా చూడ్డానికి వాణి అమ్మ మాకు తోడుగా ఉంటారు.

ఇదండీ మా కథ. ఈసారి కోనసీమకు వచ్చినపుడు మా ప్రేమ మందిరాన్ని తప్పక సందర్శిస్తారు కదూ!

– వై.సూర్యకుమారి, న్యూస్‌టుడే రాజమండ్రి కల్చరల్

## అందరికీ ప్రవేశం...

– కామేశమహర్షి

రెవెన్యూ అధికారులూ పోలీసులూ ఎక్కడైనా అనాథ పిల్లల్ని గుర్తిస్తే మాకు అప్పగిస్తారు. కొన్నేళ్ల కిందట పశ్చిమ గోదావరి జిల్లా పూళ్ల గ్రామంలో ఒక కుటుంబంలో భార్యాభర్తలిద్దరూ ప్రమాదంలో చనిపోతే వారి నలుగురు పిల్లల్నీ ఇక్కడకు తీసుకొచ్చారు. కులమతాలూ, ప్రాంతాలకు అతీతంగా అందర్నీ చేర్చుకుంటాం. బ్రహ్మచారినైన నాకు ఇంతమంది పిల్లల ఆలనాపాలనా చూసే అవకాశం భగవంతుడి వరంగా భావిస్తాను.



# సిల్లీ పాయింట్

★ ఆపిల్ కంపెనీ ప్రారంభించిన మొదట్లో కంపెనీ డైరెక్టర్లకు గుర్తింపుకార్డులు ఇవ్వాలనుకున్నారట. అందులో వ్యక్తి పేరు, నంబరు పెట్టారు. అయితే ఆపిల్ వ్యవస్థాపకుడు స్టీవ్‌జాబ్స్ తనకు '0' కావాలని పట్టుబట్టి మరీ తీసుకున్నారట. అది నంబర్‌వన్ కంటే ముందుంటుందిగా!



**కోలా(ఎలుగుజాతి జంతువు) అంటే అసలు నీళ్లు తాగనిదని అర్థం. అవి తమ జీవితకాలంలో దాదాపుగా నీళ్లు తాగవు. యూకలిప్టస్ ఆకులు తిని బతుకుతాయి.**

**'నైకీ' అనగానే షూలు గుర్తుకొస్తాయి. నిజానికి ఆ పేరు... గ్రీకు పురాణాల్లోని విజయానికి అధిదేవతది. ఆమెకు రెక్కలు కూడా ఉంటాయి.**



ఆల్చిప్పలు ఒకేసారి 20 కోట్ల వరకూ గుడ్లు పెడతాయి. కానీ, వాటిలో పెరిగి పెద్దయ్యేవి వందల్లో ఉంటాయయంతే!

**★ చీమల్లోని శ్రామిక చీమలు మూడేళ్ల వరకూ బతుకుతాయి. అదే రాణీ చీమల జీవితకాలం సుమారు 30 సంవత్సరాలు.**

★ యూకేలో ఇంటర్‌నెట్ వినియోగించే వారిలో సుమారు 65 శాతం ప్రజలు ఆన్‌లైన్ షాపింగ్ చేస్తారు.




**లె ట్రెయిన్ డె నుల్లె పార్ట్ (ద ట్రెయిన్ ఫ్రమ్ నోవేర్)... ఫ్రాన్స్‌కి చెందిన మిచెల్ డాన్సెల్ రాసిన ఈ నవలకు ఓ ప్రత్యేకత ఉంది. వాక్య నిర్మాణంలో కనీసం ఒక్కటంటే ఒక్క 'క్రియ' కూడా ఉపయోగించకుండా రాయడం దీని ప్రత్యేకత.**

★ ఇప్పటివరకూ ప్రకటించిన నోబెల్ బహుమతుల్లో సుమారు 17 శాతాన్ని అందుకున్నవాళ్లు యూదులే. విచిత్ర మేంటంటే... ప్రపంచ జనాభాలో యూదులు కేవలం 0.2 శాతమే.

★ యూరోపియన్ గోధుమరంగు కుందేళ్లు ప్రసవానికి కొన్ని రోజులముందే రెండోగర్భాన్ని పొందగలవు. అంటే ఒకేసారి రెండు గర్భాలను ధరించగలవన్నమాట.

**★ మన శరీరంలో ఉండే తెల్లరక్త కణాల కంటే సుమారు 700 రెట్లు ఎక్కువ ఎర్రరక్త కణాలుంటాయి.**

★ క్రిస్మస్ సందర్భంగా ప్రపంచ వ్యాప్తంగా అనేక దేశాల్లో శాంతాక్లాజ్‌కు ఉత్తరాలు రాస్తుంటారు. ఇది కెనడాలో 1982లోనే ప్రారంభమయింది. అలాంటి వాళ్లందరికీ సమాధానాలు పంపేందుకు కెనడా ప్రభుత్వం 13వేల మందిని నియమించింది. 'కెనడా పోస్టు'లో శాంతాక్లాజ్ చిరునామా... శాంతాక్లాజ్, ఉత్తరధ్రువం, కెనడా, H0H 0H0.

★ ప్రపంచంలో అత్యధికకాలం ప్రసార మయిన వంటల కార్యక్రమం 'హస్తా లా కోకినా'. మెక్సికోలోని 'ఛానల్4'లో ప్రసార మయ్యే ఈ కార్యక్రమం 1960 డిసెంబరు 1న ప్రారంభమయింది. ఇప్పటివరకూ 11,200కు పైగా ఎపిసోడ్లు వచ్చాయి.

**మహిళల్లో హార్మోన్ల చికిత్సకు ఉపయోగించే ప్రిమారిన్ అనే మాత్రలను... గర్భం ధరించిన గుర్రాల మూత్రంతో తయారు చేస్తారు.**




★ ఇప్పుడంటే మనం గొడుగును వానలో తడవకుండా ఉండేందుకు వాడుతున్నాం గానీ దాన్ని కనిపెట్టింది అందుకోసం కాదు. ఎండపొడ పడకుండా ఉండేందుకు దీన్ని రూపొందించారు. యూరప్‌లోని మహిళలు 1500 ప్రాంతంలో వీటిని ఎక్కువగా ఉపయోగించేవారు.

**మానవ శరీరంలో మరే భాగంతోనూ కలవకుండా ఉన్న ఎముక... గొంతు భాగంలో ఉండే హైడ్. 'యు' ఆకారంలో ఉండే ఈ ఎముక స్వరపేటిక పైభాగంలో ఉంటుంది. మనం మాట్లాడటంలో కీలకపాత్ర పోషిస్తుంది.**




**పిగ్గీ బ్యాంకు అనే పేరు పంది(పిగ్) వల్ల రాలేదు. మధ్యయుగంలో 'పిగ్' అని పిలిచే నారింజ మట్టితో తయారుచేసిన జాడీల్లో ఉప్పూ పప్పులను దాచుకునేవారు. తరవాత్తరవాత వాటిలో డబ్బులూ దాచుకోవడం మొదలుపెట్టారు. అందుకే దీన్ని 'పిగ్గీబ్యాంకు' అంటారు.**





ప్రణాళిక ఉన్నవారికీ లేనివారికీ ఒకటే తేడా. ప్రణాళిక ఉంటే, మనం చూడాలనుకున్నదే చూస్తాం. ఆలోచించాలనుకున్నదే ఆలోచిస్తాం. ప్రణాళిక లేకపోతే, ఏది కనిపిస్తే అదే చూస్తాం. ఏది తోస్తే అదే ఆలోచిస్తాం. పరిపూర్ణ జీవితానికి పక్కా ప్రణాళిక ఉండాల్సిందే!

# ఒక ప్రణాళిక

## జీవితాన్నే మార్చేస్తుంది!

'నీ చేతిలో విల్లుందా?'

'సిద్ధంగా ఉంది. ఇప్పుడే, వింటినారి బిగించాను'

'బాణం?'

'ఎక్కుపెట్టి వదిల్తేచాలు, రివ్వున దూసుకెళ్లిపోతుంది'

'ఆలస్యమెందుకు? లక్ష్యానికి గురిపెట్టు?'

'లక్ష్యమా! అదెక్కడుంది?'

ఎంత అద్భుతమైన విల్లు అయితేనేం. ఎంత పదునుదేలిన బాణం ఉంటేనేం. లక్ష్యాన్ని చూడలేకపోతున్నప్పుడు, గురిపెట్టాల్సిందేదో గురుతే లేనప్పుడు.

ఆలోచన స్పష్టంగా ఉన్నప్పుడు లక్ష్యం స్పష్టంగా ఉంటుంది. లక్ష్యం స్పష్టంగా ఉన్నప్పుడు అమలు స్పష్టంగా ఉంటుంది. అమలు స్పష్టంగా ఉన్నప్పుడు...భవిష్యత్ కళ్ల ముందు కనిపిస్తూ ఉంటుంది. ఆ స్పష్టత, ఆ భవిష్యత్ దర్శనశక్తి, ఆ దూరదృష్టి... చక్కని ప్రణాళిక ద్వారానే సాధ్యం. నేటికీ రేపటికీ మధ్య మనం కట్టుకునే కలల వంతెన ప్రణాళిక. కలకూ నిజానికీ మధ్య మనం నిర్మించుకునే రంగుల రాచబాట ప్రణాళిక. రివ్వున ఎగురుతున్న గాలిపటానికీ హుషారుగా ఎగరేస్తున్న పిల్లాడికీ మధ్య మాంజా లాంటిది ప్రణాళిక. పక్షి నింగికి ఎగిరేముందు ఒక్కసారి రెక్కలల్లార్చుకుంటుందే, అదే ప్రణాళిక! సింహం శత్రువు మీదికి ఉరుకుతున్నప్పుడు చుట్టూ పరికించి చూస్తుందే, అదే ప్రణాళిక! చెరువులోని చేపపిల్ల చిట్టిపొట్టి పురుగుల్ని గబుక్కున మింగేయడానికి ముందు ఒక్క క్షణం నిశ్శబ్దంగా గమనిస్తుందే, అదే ప్రణాళిక!

ఓ పదేళ్ల వ్యవధిలో హార్వర్డ్ విశ్వవిద్యాలయంలో చదువుకున్న వందమంది విద్యార్థుల మీద ఓ అధ్యయనం చేశారు. అందులో ఎనభైమూడు మందికి అసలు లక్ష్యాలే లేవు. పద్నాలుగు మందికి లక్ష్యాలున్నాయి కానీ, ఎలా సాధించాలనే ప్రణాళికలేదు. ముగ్గురికి మాత్రం...స్పష్టమైన లక్ష్యాలున్నాయి, అక్షరబద్ధమైన ప్రణాళికలున్నాయి. పదేళ్ల తర్వాత చూస్తే...ఆ పద్నాలుగుమందీ మిగతా ఎనభైమూడుమందికంటే...పదిరెట్లు ఎక్కువ సంపాదిస్తున్నారు. ఆ ముగ్గురూ పద్నాలుగుమంది కంటే వందరెట్లు ఉన్నతమైన స్థానాల్లో ఉన్నారు.

అదీ ప్రణాళిక శక్తి!

మరి, మీ ప్రణాళిక ఏమిటి? అసలు మీకంటూ ఓ ప్రణాళిక ఉందా? ఉంటే, సంతోషం. ఆ మ్యాపు ప్రకారం ముందుకెళ్లండి. అసలు ప్రణాళికే లేదా? అయినా ఫర్వాలేదు. కొత్త సంవత్సరంలో సరికొత్తగా ప్రారంభించండి. ప్రణాళికా రచనలో ఐదు దశలున్నాయి. ఒకటి- ఆలోచన, రెండు- లక్ష్యం, మూడు- వ్యూహం, నాలుగు- అమలు, ఐదు- బేరీజు.

### ఆలోచనే ఆయుధం



మనిషి ఆలోచనా జీవి. ఎప్పుడూ ఏదో ఒకటి ఆలోచిస్తూ ఉంటాడు. ఆ ఆలోచనలు నిద్రలోనూ వదిలిపెట్టవు. రోజూ మనకు అరవైవేల ఆలోచనలు వస్తుంటాయి. అందులో తొంభైశాతం నెగెటివ్ ఆలోచనలే. చాలా సందర్భాల్లో, ఒకే ఆలోచన పదేపదే బుర్రను తొలిచేస్తూ ఉంటుంది. ఒక్కటీ పనికొచ్చేది ఉండదు. మన మనసుకు ఓ పరిమితి ఉంది. ఒకసారి ఒక విషయాన్ని మాత్రమే ఆలోచిస్తుంది. ఆ ఒక్క ఆలోచనా గాలివాటంగా వచ్చేదే ఎందుక్కావాలి? మనం ఎంచుకున్నదే కావచ్చుగా! మనం ఏం ఆలోచించాలన్నది మనమే నిర్ణయించుకోవచ్చుగా. అదేం అసాధ్యం కాదు. సాధనతో సమకూరుతుంది. ప్రాణాయామంలో, ధ్యానంలో జరిగేది అదే.

నోబెల్ సాధించాలి, వ్యాపారవేత్తగా పేరు తెచ్చుకోవాలి, సంపన్నుల జాబితాలో స్థానం సంపాదించాలి...ఇలా ఓ పట్టాన నిద్రపోనివ్వని పాజిటివ్ ఆలోచనలకు స్పష్టమైన రూపం వస్తే, అదే లక్ష్యం. ఈ దశలోనే 'ఎలా' అన్న ప్రశ్న తలెత్తేది. ఎదగాలనుకుంటాం. ఎలా ఎదగాలో తెలియదు. సాధించాలనుకుంటాం. ఎలా సాధించాలో తేల్చుకోలేం. ఈ సమయంలో ఎటెళ్లాలో తెలిపే దిక్సూచి కావాలి. ఏ దారి మనల్ని గమ్యానికి చేరుస్తుందో తెలిపే రోడ్ మ్యాప్ కావాలి. ఎంత సమయంలో ఎంత దూరం వెళ్లగలమో లెక్కగట్టడానికి కత్తిలాంటి కాలిక్యులేటర్ కావాలి. ప్రతినిమిషం, ప్రతిగంటా గంటకొట్టి వెన్నుతట్టడానికి గడియారం కావాలి. రోజులు గడిచిపోతున్నాయని చెవి మెలేసి మరీ గుర్తుచేయడానికి క్యాలెండరు కావాలి. పరిపూర్ణమైన ప్రణాళికలో ఈ సాధన సంపత్తి అంతా ఉంటుంది.

### ముడిసరకు సిద్ధమా?

ప్రణాళిక రాసుకోడానికి ఖరీదైన నోటు బుక్కూ రంగురంగుల స్కెచ్ పెన్నులూ అక్కర్లేదు. భాష అత్యద్భుతంగా లేకపోయినా ఫర్వాలేదు. కానీ రాతలో నిజాయతీ ఉండాలి. ప్రతి అక్షరంలో ఆత్మవిశ్వాసం తొణికిసలాడాలి. మనం శక్తిమంతులం. సృజనాత్మక వ్యక్తులం. ఒక్కసారి గుర్తుచేసుకోండి. చిన్నప్పుడు ఎంత స్వేచ్ఛగా ఉంటాం! ఎంత గొప్పగా ఆలోచిస్తాం! ఆకాశంలో విమానం కనిపించగానే, 'పెద్దయ్యాక పైలెట్ అవుతానోచ్' అని ప్రకటించేస్తాం. 'నీ మొహం! ఆ చదువు చదవాలంటే బోలెడంత డబ్బు కావాలి'

# విజయాక్షరాలు

**మాట మంత్రాక్షరం. స్తబ్ధతను తరిమే చైతన్య అస్త్రం. దిశ చూపే దిక్సూచి. చీకటిని గెలిచే దివిటీ. పుస్తకాల్లో రాసుకోండి. గోడమీద అతికించుకోండి. హృదయాల్లో ప్రతిష్ఠించుకోండి. ప్రణాళికా రథానికి ఈ విజయాక్షరాలే...ఇంధనాలు.**

"శ్రమ నీకు ఆయుధమైతే, విజయం నీకు బానిస అవుతుంది."

"అసాధ్యమైన దాన్ని ఆశించు. కనీసం అత్యుత్తమమైనదైనా అందుతుంది."

"విజయం అంటే, ఆశించినదాన్ని సాధించడం కాదు. సాధించవలసిన దాన్ని అందుకోవడం."

"వనరులూ వసతులూ కాదు, ఎవరి విజయానికైనా ఆలోచనా విధానమే మూలం."

"వైఫల్యం నిరాశకు కారణం కాకూడదు. కొత్త ప్రేరణకు పునాది కావాలి."

"ప్రయత్నించనిదే ఫలితం లభించదు. సింహమైనా పడుకుని ఉంటే ఆహారం వచ్చి నోట్లోపడదు."

"గెలవాలన్న తపన ఉన్నచోట, ఓటమి అడుగైనా పెట్టలేదు."

"ఈ రోజు మన జీవితం, నిన్నటి ఆలోచనల ఫలితమే."

అంటూ ఆశల మీద దోసెడు నీళ్లు చల్లేస్తారు పెద్దవాళ్లు. టీవీలో కిరణ్‌బేడీని చూడగానే 'ఐపీఎస్ ఆఫీసర్ని అవుతా' అని పబ్లిక్ స్టేట్‌మెంట్ ఇచ్చేస్తాం. 'బక్కపీచు వెధవా, నీకు పోలీసు ఉద్యోగమెందుకు? '... నిర్దాక్షిణ్యంగా కలల్ని కాలరాచేస్తారు చుట్టూ ఉన్న జనం. ఎదిగేకొద్దీ మన కలలు కురచైపోతాయి. ఆత్మవిశ్వాసం చిక్కిశల్యమై పోతుంది. పట్టాచేతికొస్తే అదే పదివేలని సర్దుకుపోతాం. గుమస్తా ఉద్యోగమైనా చాలనుకునే స్థితికి వచ్చేస్తాం. వ్యక్తిత్వ వికాస నిపుణుడు రాబిన్‌శర్మ ఇలాంటి పరిమితుల్ని 'కనిపించని కంచెలు' అంటాడు. ముందు ఆ మాయల ముళ్లపొదల్ని పెకిలించి వేయండి. అవి మీ దరిదాపుల్లో కూడా ఉండటానికి వీల్లేదు. ఇప్పుడు మీ ప్రణాళికా రచనకు ఎలాంటి అడ్డంకులూ ఉండవు. పసివాడిగా ఉన్నప్పుడు ఎలా ఆలోచించారో అలానే ఆలోచించండి. మీలో అంతర్లీనంగా ఉన్న సృజనంతా వెలికితీయండి. అందమైన కలలు కనండి. అపారమైన ఆత్మవిశ్వాసాన్ని పోగుచేసుకోండి. గొప్పగొప్ప లక్ష్యాల్ని నిర్దేశించుకోండి. కంచెల్లేవ్. కందకాల్లేవ్. సరిహద్దుల్లేవ్. శృంఖలాల్లేవ్. ఇప్పుడు, మీ జీవిత ప్రణాళికకు ఓ రూపం ఇవ్వండి.

అభిరుచి, ఇష్టం, వ్యక్తిత్వం, నైపుణ్యం, కలలు, కళలు, పరిమితులు, ప్రాథమ్యాలు... ఏ ఒక్కటీ వదలకుండా కాగితం మీద పెట్టండి. ఇవన్నీ తెలియని విషయాలేం కాదు. కానీ అక్షరాల్లో రాసుకున్నప్పుడు వచ్చే స్పష్టత వేరు. మన నిజరూపం ఏమిటో మనకు అర్థమైపోతుంది. వ్యక్తిత్వవికాస శిక్షకులు దీన్నే 'కోర్ కాంపిటెన్సీ' అంటారు. ఉదాహరణకు...చార్లెస్ డార్విన్ మతబోధకుడిగా పనిచేశాడు. ఉపాధ్యాయుడిగా పనిచేశాడు. చిన్నాచితకా ఉద్యోగాలు చాలానే చేశాడు. జీవశాస్త్రవేత్త...అన్నదే ఆయన నిజరూపం. మీ నిజరూపం ఏమిటో మీకు ఈ పాటికే అర్థమై ఉంటుంది.

విద్యార్థికి- ఇంజినీరింగ్, మెడిసిన్, ఆర్కిటెక్చర్, ఆర్ట్స్, కామర్స్. పట్టభద్రుడికి- ఉద్యోగం, వ్యాపారం, సేవ. రిటైర్డ్ ఉద్యోగికి- విశ్రాంతి, పార్ట్‌టైమ్ ఉద్యోగం, ఆధ్యాత్మిక జీవితం.

...వేయిదార్లు కనిపించవచ్చు. లక్ష అవకాశాలు తలుపుతట్టవచ్చు. శతకోటి ఊరింపులు ఉంటే ఉండవచ్చు. 'రాళ్లున్నా రప్పలున్నా సమస్యలున్నా సుడిగుండాలున్నా.. ఇదే నా దారి. ఆ నడకలోనే ఆనందం పొందుతాను. ఆ సవాళ్లనే సమర్థంగా ఎదుర్కొంటాను. అసలు నేను ఈ పనిచేయడానికే పుట్టాను. నా జీవిత పరమార్థమే ఇది' అనిపించే వ్యాపకానికే మన ఓటు వేయాలి. దాని చుట్టే కలల్ని అల్లుకోవాలి. లక్ష్యాల్ని నిర్మించుకోవాలి. జీవిత ప్రణాళికలో తొలివాక్యం దాంతోనే ప్రారంభం కావాలి. ఐదేళ్ల తర్వాతో పదేళ్ల తర్వాతో మీరు ప్రపంచానికి పరిచయం అయ్యేది ఆ గుర్తింపు తోనే. మీరు లేకపోయినా మిమ్మల్ని గుర్తుంచుకునేది కూడా ఆ కారణంగానే.

ఒక్కసారి నిజరూపం తెలుసుకున్నామా...ఇక విశ్వరూపం మొదలవుతుంది. అది ఏ కలెక్టరు ఉద్యోగమో కానక్కర్లేదు. మోస్ట్ గ్లామరస్ వృత్తుల జాబితాలో లేకపోవచ్చు. ప్రపంచానికంతా చిన్నచూపు ఉండవచ్చు. జీతమూ అంతంతమాత్రమే కావచ్చు. అది చదువే అయితే, ఏ ఇంజినీరింగో మెడిసినో కావాలన్న నిబంధన కూడా లేదు. మీ మార్గాన్ని మీరు ధైర్యంగా సగర్వంగా ఎంచుకోండి. వినదగునెవ్వరు చెప్పిన. కానీ అంతిమ నిర్ణయం మీదే. 'మీకు నచ్చిన చదువే చదవండి. మీకు నచ్చిన పనే చేయండి. ఇంతకు మించిన విజయరహస్యం లేదు' అంటారు నోబెల్ విజేత వెంకటరామన్ రామకృష్ణన్. కెరీర్ విషయంలో, జీవిత లక్ష్యాల విషయంలో... లాజికల్‌గా ఆలోచించడం కంటే హృదయలాజికల్‌గా ఆలోచించడమే ఉత్తమం.

అదిగో... చిటారుకొమ్మన మిఠాయి స్వప్నం... మునుపటికంటే స్పష్టంగా కనిపిస్తోందిప్పుడు. గురిపెట్టడమే ఆలస్యం. ఆయుధాలకు పదును పెట్టుకోండి.

## వ్యూహాత్మకంగా...

భూమి సూర్యునిచుట్టూ తిరిగినట్టు... ప్రధాన లక్ష్యాల చుట్టూ ఉపలక్ష్యాలూ అనుబంధ లక్ష్యాలూ తిరుగుతూ ఉంటాయి. రక్షణ దళాల్లో చేరడమన్నది ప్రధాన లక్ష్యం అనుకోండి. ప్రెసిడెంట్ మెడల్ సాధించడం, పంద్రాగస్టు పరేడ్‌లో పాల్గొనడం...ఇలాంటివన్నీ ఉపలక్ష్యాలు. అసలు లక్ష్యం సాధిస్తేనే ఈ కొసరు కలలు నిజమవుతాయి. ప్రణాళికలో స్వల్పకాలిక లక్ష్యాలుండాలి, దీర్ఘకాలిక లక్ష్యాలుండాలి. రెంటికీ మధ్య లింకులూ తప్పనిసరి. స్వల్పకాలిక లక్ష్యాలన్నవి నిచ్చెన మెట్లలాంటివి. దేనికదే ప్రత్యేకమైనా... అంతిమంగా దీర్ఘకాలిక లక్ష్యానికి ఉపయోగపడాలి. మనల్ని అన్నిటికంటే పైమెట్టుకు తీసుకెళ్లాలి. ప్రణాళికలో ప్రాథమ్యాలు ముఖ్యం. ముందు దృష్టిపెట్టాల్సిన అంశాలేమిటి? ఆతర్వాత, అంతుచూడాల్సిన విషయాలేమిటి? అన్న స్పష్టత ఉండాలి. బహుళజాతి సంస్థలో ఉద్యోగం తెచ్చుకోవడం అన్నది ఓ మేనేజ్‌మెంట్ పట్టభద్రుడి స్వల్పకాలిక లక్ష్యం మాత్రమే. అంతటితో ఆగిపోతే అక్కడే మిగిలిపోతాడు. చీఫ్



" పరాజయం అంటే, నువ్వు చేసే పనిని వదిలి పారిపొమ్మని కాదు, ఆ పనిని మరింత శ్రద్ధగా నేర్పుగా పట్టుదలగా చేయమని అర్థం. "

" విజయం ఒక గమ్యం కాదు. గమనం మాత్రమే. ఎన్నిసార్లు ఓడినా గెలవడానికి జీవితంలో మరో అవకాశం ఉంటుంది. "

" ఒక పని కష్టమని మనం దాన్ని చేయడానికి భయపడం. మనం భయపడతాం కనుక ఆ పని కష్టమనిపిస్తుంది. "

" ఎదురుచూస్తూ కూర్చోవడం కాదు, ఎదురునడుస్తూ పోవడమే విజయరహస్యం. "

" విజయశిఖరాలు సోమరులకు అందవు. పట్టుదలతో కృషిచేసే వారికి అవి తలవంచుతాయి. "

" గొప్ప లక్ష్యాన్ని సాధించాలని ప్రయత్నించి విఫలం కావడం నేరం కాదు. గొప్ప లక్ష్యం లేకపోవడం నేరం. "

" విజేత వెనక ఉండేది అదృష్టమో మంత్రదండమో కాదు... చక్కని ప్రణాళిక, కఠిన శ్రమ, అంకితభావం. "

" అసంభవం అన్న పదం అసమర్థుల నిఘంటువుల్లోనే కనిపిస్తుంది. "

" వజ్రసంకల్పం కలిగిన వ్యక్తి ప్రపంచాన్నే తన అభీష్టానికి అనుగుణంగా మలచుకుంటాడు. "

" ప్రతి చిన్న అవాంతరానికీ సంకల్పాన్ని మార్చుకునేవారు లక్ష్యానికి దూరమవుతారు. అంతరాలు కలిగేకొద్దీ సంకల్పాన్ని దృఢతరం చేసుకుంటూ పోవాలి. "





ఎగ్జిక్యూటివ్ ఆఫీసరు స్థాయికి ఎదగాలన్నది దీర్ఘ కాలిక లక్ష్యం. ఒక రోజులో, ఒక ఏడాదిలో సాధించేది కాదది. కొన్నిసార్లు జీవిత కాలం పట్టవచ్చు. ఆ లక్ష్యానికి అనుగుణంగా మనల్ని మనం తీర్చిదిద్దుకోవాలి. వ్యక్తిత్వానికి మెరుగులు దిద్దుకోవాలి. నైపుణ్యాలకు పదును పెట్టుకోవాలి. మన ఆలోచనలూ అభిరుచులూ అలవాట్లూ ప్రధాన లక్ష్యం చుట్టూ ముడిపడినపుడే అది సాధ్యమవుతుంది. ప్రణాళికకు తగినట్టుగా ఆలోచించేలా మన మెదడును ట్యూన్ చేసుకోవాలి. లక్ష్యానికి ఉపకరించేలా మన అలవాట్లను తీర్చిదిద్దుకోవాలి. ఎదుగుదలకు సహకరించేలా మన అభిరుచుల్ని పెంపొందించుకోవాలి. అంతెందుకు, లక్ష్యమే మన సర్వస్వం కావాలి. నిర్ణీత వ్యవధుల్లో ఎదుగుదలను సమీక్షించుకోవడం, జయాపజయాల్ని బేరీజు వేసుకోవడం, పరిస్థితులను బట్టి ప్రణాళికలో మార్పు చేర్పులు చేసుకోవడం చాలా అవసరం.

## అదే ప్రపంచం

ఒక్కసారి ప్రణాళిక సిద్ధం చేసుకుంటే, మనం ఆలోచించే పద్ధతే మారిపోతుంది. సినిమా చూస్తున్నా, టీవీ చూస్తున్నా, పేపరు తిరగేస్తున్నా, పుస్తకం చదువుతున్నా, నిద్ర పోతున్నా... మన బుర్రలోని సృజనాత్మక విభాగం ప్రణాళిక గురించే ఆలోచిస్తూ ఉంటుంది. అవసరమైన పాయింటు తగలగానే, గిల్లిమరీ గుర్తుచేస్తుంది. రోజువారీ జీవితంలో కూడా బోలెడంత తేడా కనిపిస్తుంది. 'చల్తా హై...' ధోరణి దరిదాపుల్లోకి కూడా రాదు. మన అలవాట్లు కూడా లక్ష్యానికి అనుగుణంగా మారిపోతాయి. 'అలవాట్లే నీ గెలుపు ఓటముల్ని నిర్ణయిస్తాయి' అంటాడు స్టీఫెన్ కోవే (సెవెన్ హ్యాబిట్స్ ఆఫ్ హైలీ ఎఫెక్టివ్ పీపుల్). లక్ష్యసాధకులెవరూ సూర్యుడు నడినెత్తిన వచ్చేదాకా నిద్రపోరు. లక్ష్యం నిద్రపోని వ్యధ కూడా. ప్రణాళిక ద్వారా మనం సాధించబోయే విజయాలు జీవితం మీద కొత్త ఆశలు చిగురింపజేస్తాయి. ఆశావాదాన్ని నూరిపోస్తాయి. ఎదురుదెబ్బలూ చేదు అనుభవాలూ మనల్నేమీ చేయలేవు. స్నేహితుల ఎంపికలోనూ ఆ ప్రభావం కనిపిస్తుంది. మన ఆలోచనా స్థాయికి చేరుకున్నవారికే మిత్ర బృందంలో చోటిస్తాం. ఎవరైనా చేరుకోకపోతే, ఎలా చేరుకోవాలో నేర్పిస్తాం. అవసరమైతే చేయిపట్టుకుని నడిపిస్తాం. అన్నిటికీ మించి బాధ్యత అలవడుతుంది. ఎందుకంటే, మన ప్రణాళికకు మనమే జవాబుదారులం. ఐదేళ్లలోనో పదేళ్లలోనో అనుకున్నది సాధించకపోతే ఆ అక్షరాలు నిలదీస్తాయి.

## ఆర్థికంగా...

కేవలం డబ్బు వల్లే ఎవరూ సుఖపడిన దాఖలాల్లేవు. కానీ డబ్బు లేకపోవడం వల్ల కష్టాలపాలైన వారు చాలా మందే ఉన్నారు. ఎవరు అవునన్నా, ఎవరు కాదన్నా డబ్బు ప్రాధాన్యం డబ్బుదే. భవిష్యత్ అవసరాలకు సరిపడినంత, కుటుంబ బాధ్యతలకు తగినంత సంపాదన అవసరమే. ఆ సంపాదించిన దానిలో ఎంత పొదుపు చేశామన్నదీ ముఖ్యమే. ఆ పొదుపును ఎంత తక్కువ సమయంలో ఎంత సురక్షితంగా రెట్టించామన్నది ఇంకా ముఖ్యం. స్టాక్ మార్కెట్, పబ్లిక్ ప్రావిడెంట్ ఫండ్, మ్యూచువల్ ఫండ్స్, చిట్స్, రియల్ ఎస్టేట్... అందుబాటులో ఉన్న అవకాశాల్ని పరిశీలించాలి. సురక్షితమైన మార్గాల్ని ఎంచుకోవాలి. అవసరమైతే నిపుణుల సాయం తీసుకోవాలి. నెలవారీ ప్రణాళికతో మొదలు పెట్టి... రిటైర్మెంట్ దాకా ప్రతి దశకూ పక్కా ప్రణాళిక ఉండాలి. ఒక్కసారిగా కోటి రూపాయలు సంపాదించడం అసాధ్యమే కానీ, పాతికేళ్ల ప్రణాళికతోనో ముప్పై ఏళ్ల ఆర్థిక వ్యూహంతోనో కోటి రూపాయలు పొదుపు చేయడం పెద్ద కష్టమేం కాదు. పాతికేళ్ల కుర్రాడు నెలకు ఆరువేల చొప్పున పబ్లిక్ ప్రావిడెంట్ ఫండ్ ఖాతాలో జమ చేసినా... రిటైర్మెంట్ నాటికి కనీసం అరకోటీశ్వరుడు అవుతాడు. కుటుంబానికి ఆరోగ్యబీమా, మనం లేనప్పుడు ఆదుకోడానికి టర్మ్ పాలసీ, ఓ వెచ్చని నీడ... ఆర్థిక ప్రణాళికలో భాగమే. పొదుపు-మదుపులకు సంబంధించి నెలవారీ లక్ష్యాలూ వార్షిక లక్ష్యాలూ దశాబ్ద లక్ష్యాలూ రిటైర్మెంట్ లక్ష్యాలూ... సవివరంగా సిద్ధంచేసుకోవాలి.

ఓ పాలకుడు పొరుగురాజ్యాన్ని ఆక్రమించుకోడానికి బయల్దేరే ముందు, గురువుగారి దర్శనానికి వెళ్లాడు. అదే సమయానికి ఓ పేదవాడూ వచ్చాడు. ఆ నిరుపేద తన జేబులో భద్రంగా దాచుకున్న రూపాయి నాణాన్ని గురువుగారి చేతిలో పెట్టాడు. 'నాకెందుకు నాయనా! ఇక్కడ ఎవరైనా పేద వాళ్లుంటే ఇవ్వు' అని సలహా ఇచ్చారాయన. ఆ దరిద్రుడి దానాన్ని పుచ్చుకోడానికి ఎవరూ ముందుకు రాలేదు. స్వామీజీ అదంతా చూస్తున్నారు. 'అదిగో... ఆ రాజుగారికి ఇవ్వు! పాపం, ఎన్ని సిరిసంపదలు ఉన్నా చాలడం లేదు. మళ్లీ దండయాత్రకు బయల్దేరుతున్నారు. అంతకంటే నిరుపేద ఇంకెవరుంటారు' అని ఆ పేదవాడితో చెప్పారు.

ఆ మాటతో రాజుగారికి జ్ఞానోదయమైంది. సంపాదనకైనా, సంపాదించాలన్న ఆశకైనా ఓ పరిమితి ముఖ్యం. ఆ సంతృప్తి లేకపోతే మనశ్శాంతి కరవవుతుంది. వారెన్ బఫెట్,

అజిమ్ ప్రేమ్‌జీ లాంటి ఏ కొద్దిమందిలోనో ఆ సంతృప్తి కనిపిస్తుంది. మనం ఎంత సంపాదించినా... అందులో ఐదుశాతమో పది శాతమో సమాజానికి కేటాయించాలన్న నిర్ణయం తీసుకుంటే, ఆ నిర్ణయాన్ని మన ప్రణాళికలో భాగం చేసుకుంటే ఆస్తులతోపాటు ఆత్మసంతృప్తీ పెరుగుతుంది.

## వికాస యాత్ర...

ఆయనో పెద్ద పారిశ్రామికవేత్త. వ్యాపారాన్ని అంతర్జాతీయంగా విస్తరించిన ఘనుడు. ప్రధానులు, రాష్ట్రపతులు కూడా ఆ కుబేరుడి అపాయింట్‌మెంట్ కోసం ఎదురుచూస్తుంటారు. అంత డబ్బుంది. అంత పరపతి ఉంది. వందల కోట్ల వ్యాపార సామ్రాజ్యాన్ని వారసులకు అప్పగించి, ఆరోజే పదవీవిరమణ చేయబోతున్నాడు. చేతిలో చిల్లిగవ్వకూడా లేకుండా జీవితాన్ని ప్రారంభించిన ఆ విజేతకు వీడ్కోలు పలకడానికి మహామహులంతా సిద్ధంగా ఉన్నారు. ఆయన మాత్రం దిగాలుగా తన ఛాంబర్లో కూర్చుని దేని కోసమో వెతుకుతున్నాడు. ఓ ఉన్నతోద్యోగి ధైర్యంచేసి అడిగాడు...'సర్! ఏదో ముఖ్యమైన కాగితం కోసం వెదుకుతున్నట్టున్నారు'. 'కాగితం కోసం కాదయ్యా! నేను పోగొట్టుకున్న జీవితం కోసం'...దిగాలుగా జవాబిచ్చాడు వ్యాపారవేత్త. జీవితమంటే... కెరీర్, డబ్బు మాత్రమే కాదు. బంధాలు, ఆసక్తులు, అభిరుచులు, అనుభూతులు, ఆరోగ్యం, ఆధ్యాత్మికత కూడా! ఆ కోణమూ లేకపోతే మన ప్రణాళిక అసమగ్రమే.

ప్రతి ఆరోగ్యవంతుడి తలమీదా ఓ కిరీటం ఉంటుంది. అది రోగిష్టివాళ్లకు మాత్రమే కనబడుతుంది. పోగొట్టుకున్నాకే ఆరోగ్యం విలువ తెలుస్తుంది. కానీ ఒకసారి పోగొట్టుకుంటే తిరిగి తెచ్చుకోవడం చాలా కష్టం. బాల్యం నుంచే ఆరోగ్యకరమైన అలవాట్లను పెంపొందించుకోవాలి. యవ్వనంలో పెడదార్లు పట్టకుండా జాగ్రత్తపడాలి. నడివయసు వచ్చాక కనీసం ఏడాదికోసారి పూర్తిస్థాయి వైద్య పరీక్షలు చేయించుకోవాలి. ఊబకాయం, అధిక రక్తపోటు, మధుమేహం వంటి సమస్యలు అతి సాధారణమైపోయిన రోజుల్లో... అసలు ఆ రోగాలు మన దరిదాపులకు రాకుండా ఉండాలంటే, ఎన్ని జాగ్రత్తలు తీసుకోవాలో అన్నీ తీసుకోవాలి. పొరపాటున మన జోలికి వస్తే వాటిని ఎలా నియంత్రణలో పెట్టాలన్నదీ ఆలోచించాలి. వైద్యం, ఆహార విధానం, వ్యాయామం, జీవనశైలి...దేన్నీ తక్కువచేయలేం. ఆరోగ్య ప్రణాళిక అంతిమ లక్ష్యం...నా ఇంట్లో మందుల అరతో అవసరమేలేని రోజంటూ రావాలి అన్నదే.

హాబీలకూ ప్రణాళికలో స్థానం ఉండాలి. ఈ ఏడాది కూచిపూడిలో అరంగేట్రం చేయాలి... రెండేళ్లలో నేను వేయాలనుకున్న పెయింటింగ్స్ పూర్తిచేసి ఓ ప్రదర్శన పెట్టాలి...ఐదేళ్లనాటికి రచయితగా నాకంటూ ఓ గుర్తింపు తెచ్చుకోవాలి... ఇలా హాబీ మనలోని సృజనని వెలికితీస్తుంది. ఆ శక్తిలో కొంత వృత్తిజీవితానికీ మళ్లించుకోవచ్చు.

నేర్చుకునే మనసుండాలే కానీ, వృక్షాలు మాట్లాడతాయి. రాళ్లు ప్రవచిస్తాయి. సెలయేళ్లు గ్రంథాలవుతాయి. ప్రయాణాల్ని మించిన వ్యక్తిత్వ వికాసమార్గం లేదు. కొత్తకొత్త ప్రదేశాలు, కొత్తకొత్త పరిచయాలు, కొత్తకొత్త స్నేహాలు, కొత్తకొత్త అనుభవాలు... జీవితానికి కొత్త ఉత్సాహాన్నిస్తాయి. కొత్త ఆలోచనల్ని ప్రసాదిస్తాయి. ఏడాదికి కనీసం పదిహేనురోజులు ఏదో ఓ కొత్త ప్రదేశానికి వెళ్లడానికి కేటాయించుకోండి. అందుకయ్యే ఖర్చులు, చేసుకోవాల్సిన ఏర్పాట్లు, అనువైన సమయం, బస, భోజనం...తదితర వివరాలన్నీ పర్యాటక ప్రణాళికలో భాగం.

పాతికేళ్ల వయసులోనూ నలభై ఏళ్ల వయసులోనూ ప్రపంచం మీ కళ్లకు ఒకేలా కనిపించిందంటే, మీరు పదిహేనేళ్ల కాలాన్ని వృథా చేసినట్టే. ఎదిగేకొద్దీ పరిణతి చాలా ముఖ్యం. ఉత్తమ సాహిత్యం, సత్సాంగత్యం మన ఆలోచనల మీద ప్రభావం చూపిస్తాయి. ఆధ్యాత్మికత ప్రభావమూ చాలా ఉంటుంది. ఇది వికాస ప్రణాళిక.

పర్యాటకం, ఆర్థికం, హాబీలు, ఆరోగ్యం వగైరా వగైరా దేనికదే విడిగా అనిపిస్తున్నా అంతస్సూత్రం ఒకటే. మీకిష్టమైన కూచిపూడిలో పద్మశ్రీ అవార్డు అందుకోడానికి వీల్‌చెయిర్ మీద వెళ్లకూడదనుకుంటే మీరు ఆరోగ్యంగా ఉండాలి. నచ్చిన ప్రాంతానికి వెళ్లడానికి ఎవరి దగ్గరో చేయి చాచాల్సిన దుస్థితి రాకూడదంటే, ఆర్థికంగా ఉన్నత స్థితిలో ఉండాలి. ఇవన్నీ ఒకదానితో ఒకటి విడదీయలేని అంశాలే. మీరూ మీ ఆలోచనలూ మీ అలవాట్లూ మీ లక్ష్యాలూ మీ విజయాల్లా!





## వైఫల్యం వస్తే...

ఎడిసన్ కథ మనకు తెలిసిందే. తన ప్రయత్నంలో ఎన్నోసార్లు విఫలమయ్యాడు. ఓ దశలో నిరాశ కమ్మేసింది. ఇక తనవల్ల కాదేమో అనుకున్నాడు. అప్పుడే ఓ మిత్రుడు వచ్చాడు. ఎడిసన్ మొహంలో కనిపిస్తున్న నిరాశానిస్పృహల్ని చూడగానే అతనికి విషయం అర్థమైపోయింది.

'నీకు అన్నిటికంటే ఇష్టమైన పనేమిటి' అనడిగాడు...

'బల్బు తయారు చేయడం' నిర్వేదంగా చెప్పాడు ఎడిసన్.

'మరి, ఎందుకింత నిరాశ? '

'వేయిసార్లు విఫలమయ్యాను మిత్రమా'

'అలా ఎందుకనుకోవాలి? నీకు ఇష్టమైన పని వేయిసార్లు చేసే అవకాశం వచ్చిందని అనుకోవచ్చుగా'

వైఫల్యాల్ని పాజిటివ్ ఎనర్జీగా ఎలా మార్చుకోవచ్చో ఎడిసన్‌కు అర్థమైంది. ఈసారి ఓటమి భయంలేకుండా పరిశోధన చేశాడు. విద్యుత్‌దీపాన్ని ఆవిష్కరించాడు.

నరేంద్ర ముర్కుంబీ అనే యువకుడు నానా కష్టాలూ పడి ఓ చక్కెర ఫ్యాక్టరీని కొన్నాడు. ఎంత ఆలోచించినా దాన్ని నష్టాల్లోంచి ఒడ్డుకేయడం ఎలానో అర్థంకాలేదు. దాదాపు ఆరునెలలు ఫ్యాక్టరీలోనే గడిపాడు. తిండీ నిద్రా అక్కడే. ఓ మూలనపడేసిన చెరుకు పిప్పితో సహా...అణువణువూ పరిచయమైపోయింది. అప్పుడొచ్చిన ఆలోచనే... చెరుకు పిప్పితో విద్యుదుత్పత్తి! ఆయన నాయకత్వంలోని గాయత్రి షుగర్స్ పదేళ్లలో వేయికోట్ల టర్నోవరును అధిగమించింది. వైఫల్యం నేర్పే పాఠాలు ఇంత గొప్పగా ఉంటాయి.

పడుతూలేస్తూ సరిదిద్దుకుంటూ సరిపుచ్చుకుంటూ ఓ అడుగు వెనకేస్తూ రెండడుగులు ముందుకేస్తూ మొండిగా, ధైర్యంగా ముందుకెళ్లడమే జీవితం. ఆ ప్రయాణంలో ఓ ఆసరా... ప్రణాళిక. ★



# ఇంట్లోనే మాయిశ్చరైజర్

**చ**లికాలంలో మార్కెట్లో దొరికే మాయిశ్చరైజర్లు బోలెడు. కానీ కృత్రిమ పదార్థాలతో తయారయ్యే వాటిని వాడటం ఇష్టంలేదా... అయితే ఇంట్లోనే తయారుచేసుకోదగ్గ మాయిశ్చరైజర్లివి...

✦ నాలుగైదు చుక్కల జోబా నూనెకు అంతేమోతాదులో కొబ్బరినూనె, రోజ్ వాటర్ కలిపి రాత్రిపూట పడుకోబోయే ముందు రాసుకోండి. ఈమిశ్రమం చర్మంలో తేమను కాపాడటమే కాదు, చక్కటి సువాసనను కూడా ఇస్తుంది.

✦ గ్లిజరిన్, రోజ్‌వాటర్‌లను సమానమోతాదులో తీసుకుని రంగరించండి. తర్వాత దాంట్లో కొన్ని చుక్కల నిమ్మరసం పిండి పలుచగా అయ్యేలా చేయండి. రోజూ రాత్రి పడుకోబోయే ముందు ఈ మిశ్రమాన్ని రాసుకోండి. ఇది మంచి మాయిశ్చరైజర్‌లాగా పనిచేయడంతోపాటు చర్మంపై ఉండే మచ్చల్ని తొలగించి నున్నగా కాంతులీనేలా చేస్తుంది.

✦ ఒక స్పూన్ బాదంపప్పుల పొడి, మరొక చెంచాడు పాలపొడి తీసుకుని వాటికి రెండు టీస్పూన్ల గ్లిజరిన్ కలపండి. ఆ మిశ్రమంలో ఒక్కొక్క టీస్పూన్ చొప్పున నిమ్మరసం, బాదం నూనె కలపండి. ఆల్మండ్ ఆయిల్‌కు బదులు ఆలివ్ నూనె కలిపినా చక్కటి ఫలితాలనిస్తుంది.

✦ ఇన్ని కష్టాలెందుకంటారా... అయితే, చర్మాన్ని మృదువుగా ఉంచే విటమిన్లూ కొవ్వులూ కొబ్బరినూనెలో పుష్కలంగా ఉంటాయి. రోజూ రాత్రిపూట కొబ్బరినూనె రాసుకున్నా చాలు.

# ఏవేవి ఎప్పుడంటే...

**గ**ర్భిణులకు 400 మై.గ్రా. ఫోలిక్‌యాసిడ్ మాత్రలు సిఫారసు చేస్తారు వైద్యులు. రక్తహీనతకు ఐరన్ టాబ్లెట్లూ... ఎముకల పటిష్ఠతకు కాల్షియం బిళ్లలూ... ఇలా రకరకాల విటమిన్ సప్లిమెంట్లు వాడటం సాధారణమైపోయిందీ రోజుల్లో. కానీ అవి ప్రభావవంతంగా పనిచేయాలంటే ఒక పద్ధతి పాటించాలి.

★ ఎ, డి, ఇ, కె విటమిన్లను 'ఫ్యాట్ సాల్యుబుల్ విటమిన్లు' అంటారు. కొవ్వు అధికంగా ఉండే నూనె పదార్థాలను తినేటప్పుడు ఈ సప్లిమెంట్లను తీసుకుంటే ఫలితం బాగుంటుంది.

★ బి విటమిన్లను ఉదయం పూట తీసుకుంటే మంచిది.

★ సి విటమిన్ టాబ్లెట్లను ఖాళీ కడుపుతో వేసుకోకూడదు.

★ ఐరన్ టాబ్లెట్లను అన్నం తింటూ మధ్యలో వేసుకుంటే బాగా పనిచేస్తాయి.

★ విటమిన్ టాబ్లెట్లు వేసుకోవడానికి పావుగంట ముందూ... వేసుకున్న తర్వాత పావుగంట దాకా కాఫీ, టీలు తాగకూడదు.

★ విటమిన్ సప్లిమెంట్లను ఏదో గుర్తొచ్చినప్పుడు కాకుండా... వైద్యులు చెప్పిన పద్ధతిలో రోజూ ఒకేవేళకు వేసుకోవడం మంచిది.

★ వైద్యుడు సిఫారసు చేసిన పరిమితికి మించి ఎక్కువరోజులు విటమిన్ టాబ్లెట్లు వేసుకోకూడదు. మోతాదు మించితే విటమిన్లు కూడా విషంతో సమానమే.

★ విటమిన్ సప్లిమెంట్లనేవి మీ శరీరానికి రోజువారీ కావాల్సిన పోషకాలు పూర్తిస్థాయిలో అందనప్పుడు మాత్రమే వాడే ప్రత్యామ్నాయం. అందుకే తినే ఆహారంలో అన్నిరకాల పోషకాలూ ఉండేలా చూసుకుంటే ఇలాంటి టాబ్లెట్ల బాధ తప్పుతుంది.

★ కొన్ని రకాల వ్యసనాలూ జీవనశైలి లోపాల కారణంగా కూడా సప్లిమెంట్లు వాడాల్సిన దుస్థితి కలుగుతుంది. ఉదాహరణలకు... సిగరెట్లు తాగేవారి శరీరం వారు తినే పదార్థాల్లోని సి విటమిన్‌ను పూర్తిగా గ్రహించదు. ఇలా కోరి విటమిన్‌లో పాలు తెచ్చుకునే బదులు ఆ దుర్వ్యసనాలకు దూరంగా ఉండటమే మంచిది.

అవీ ఇవీ

# అల్పాహారం మానొద్దు

**చి**న్నప్పటి నుంచి మీకు ఉదయాన్నే అల్పాహారం తినే అలవాటుందా?

ఉంటే మీ గుండె ఆరోగ్యం సురక్షితం. మధుమేహం మీ దరిచేరే అవకాశం చాలా తక్కువ. అసలు చిన్నప్పటి నుంచీ బ్రేక్‌ఫాస్ట్ తీసుకునే అలవాటే లేదంటారా... అయితే మీకు రెండు ప్రమాదాలు పొంచి ఉన్నాయని చెబుతున్నారు మెంజీస్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (టాస్మానియా) పరిశోధకులు. ఆస్ట్రేలియాలో గత 20 ఏళ్లుగా 2000 మందిపై నిర్వహించిన అధ్యయనంలో తేలిన సత్యాలివి. ఉదయాన్నే ఏమీ తినని వారి రక్తంలో చెడు కొలెస్ట్రాల్ స్థాయులు అధికంగా ఉంటాయనీ వారి నడుము చుట్టుకొలత కూడా బ్రేక్‌ఫాస్ట్ తినేవారితో పోలిస్తే అధికంగా ఉంటుందనీ తేలింది. ఎంత హడావుడిగా ఉన్నా పొద్దునపూట ఎంతో కొంత పోషకాహారం తీసుకోవడం పిల్లలకు చిన్నప్పటి నుంచే అలవాటు చేయాలని సూచిస్తున్నారు వారు.



# సామర్థ్యానికి పొగ!

**అం**గస్తంభన వైఫల్యం... నలభైలు దాటిన కొందరు పురుషులు ఎదుర్కొనే సమస్య ఇది. ఇక వారికి పొగతాగే అలవాటు కూడా ఉంటే ఆ సమస్య ఎప్పటికీ తగ్గదని హెచ్చరిస్తున్నారు పరిశోధకులు. సాధారణంగా... అంగానికి తగినంత వేగంతో రక్తం సరఫరా అయితే స్తంభన కలుగుతుంది. పొగతాగేవారిలో రక్తనాళాలు క్రమేపీ సంకోచిస్తాయి. దీనివల్ల రక్తసరఫరాలో అడ్డంకులు ఎదురై అంగస్తంభన సమస్య ఏర్పడుతుంది. అంతేకాదు... ఈ అలవాటు గుండె ఆరోగ్యానికి కూడా పొగబెడుతుంది కాబట్టి ధూమపానం మానేయాలని సూచిస్తున్నారు వారు. గుండె ఆరోగ్యాన్ని పరిరక్షించుకునేందుకు చేసే ప్రయత్నాలన్నీ అంగస్తంభన వైఫల్యాన్ని కూడా దూరం చేస్తాయని చెబుతున్నారు. కనీసం మూడు పదుల వయసులోనైనా సిగరెట్ అలవాటు మానేసిన వారిలో అంగస్తంభన వైఫల్యం ముప్పు చాలావరకూ తగ్గిందని వారి పరిశోధనల్లో తేలింది. వింటున్నారా పురుషులారా... బహుపరాక్!



# మమకారం

– అలపర్తి రామకృష్ణ

"అత్తయ్యా, అన్నీ బ్యాగుల్లో సర్దేశాను" అంది పుష్యమి నుదుటికిపట్టిన చెమట చీరకొంగుతో తుడుచుకుంటూ.

"లడ్లు, సున్నుండలు స్టీలు డబ్బాల్లో పెట్టావా? జున్నుపాలు స్టీలు క్యానులో పోశావా? ఏం మర్చిపోలేదుగదా" మరోసారి కోడల్ని ప్రశ్నించింది చిలకమ్మ.

"మొన్న మీరు కొన్న పట్టుచీర కూడా మీ బట్టలబ్యాగులో పెట్టాను. మీరు చెప్పినవన్నీ సర్దేశాను" అంది పుష్యమి.

"అమ్మా, లడ్లు చేశారా... నాకు పెట్టలేదేమే" బ్యాగుల దగ్గరకొచ్చి వెతకబోయింది రాగిణి.

మనవరాలి రెక్కపట్టుకుని విసురుగా పక్కకులాగింది చిలకమ్మ.

"ఎప్పుడూ తిండి రందే. ఏమీ తిననివాళ్ళ లాగా మొహంవాసిపోతూ ఉంటారు. వాళ్ళను అవతలకు తీసుకువెళ్ళు" గద్దిస్తున్నట్లు అంది చిలకమ్మ.

బిక్కమొహం వేసుకుని తల్లికి అతుక్కుపోయింది రాగిణి.

కూతురు తల నిమిరి "నాయనమ్మ అత్తయ్య వాళ్ళింటికి వెళ్తుంది కదా, బావకి ఇష్టమని లడ్లు చేసుకుని వెళ్తుందిలే. నాయనమ్మ ఊరికి వెళ్ళేటప్పుడు అల్లరిచేసి విసిగించకూడదు. రేపు నీకు ఏం కావాలంటే అవి వండిపెడతానుగా" కూతుర్ని బుజ్జగించింది.

మనవడు వచ్చి బ్యాగులమీద కూర్చుని "నాయనమ్మా, నేనూ హైదరాబాద్ వస్తాను" అన్నాడు.

చివాల్నలేచి మనవడిని పక్కకు నెట్టింది చిలకమ్మ. బ్యాగుల్లో పెట్టినవి ఎక్కడ పాడైపోతాయోనని ఆదుర్దాపడింది.

అత్తగారు పిల్లల్ని కసిరినప్పుడు మనస్సు చివుక్కుమన్నా మారుమాట్లాడకుండా పిల్లల్ని అవతలకు తీసుకెళ్ళి ఏవో మాటలుచెప్పి మాయపుచ్చింది పుష్యమి.

కూతురు దగ్గరకు వెళ్ళేటప్పుడు తనచేతే తినుబండారాలన్నీ చేయించి తీసుకువెళ్తుంది అత్త. పిల్లలకు కొన్ని లడ్లు, సున్నుండలు తీసి వేరే ఉంచమని చెబుతుందేమోననుకుంది. కానీ ఆ ప్రస్తావనే తేలేదామె.

పట్టుచీర కొనేటప్పుడు కూడా అత్తగారితో పాటు తనూ బట్టలషాపుకు వెళ్ళింది. కంటికి ఇంపైన పసుపురంగు, నీలం బోర్డర్‌తో, చక్కని కలబోతతో చూడముచ్చటగా ఉందా చీర. తనకు బాగా నచ్చింది.

"ఈ చీర చాలా బాగా ఉంది అత్తయ్యా" అంది అత్తగారితో పుష్యమి.

"మీ అమ్మను అడిగి కొనుక్కో, దీపావళి పండుగ దగ్గరకొచ్చింది గదా" అంది చిలకమ్మ పుసుక్కున... కోడలు బాధపడుతుందనే వివరంలేకుండా.

"మన స్వప్నికకు ఈ చీర చాలా బాగుంటుంది" అంది.

అత్తగారి మొహంలో సంతోషం చూసి తృప్తిపడింది.

అత్తగారికి కోపం తెప్పించడం తనకు ఇష్టంలేదు. తను పేదపిల్లని తెలిసి దూరపు బంధువైన చిలకమ్మగారు తనను కోడలిగా చేసుకుంది. తనకేలోటూ రాకుండా భర్త, అత్తగారు చూసుకుంటున్నారు. అత్త తననేం రాచిరంపాన పెట్టడంలేదు. కాకపోతే ఆమెకు కూతురంటే పంచప్రాణాలు. కొడుకు పిల్లలకంటే కూతురి పిల్లలమీద మమకారం పాళ్ళు ఎక్కువ.

బ్యాగులూ బుట్టలూ అన్నీ కలిపి మొత్తం పది శాల్తీలు అయ్యాయి.

"ఇంత లగేజీ ఎందుకే" బస్టాండు దగ్గర విసుక్కున్నాడు చిలకమ్మ కొడుకు.

"ఆడపిల్లకు పెళ్ళిచేసి అత్తగారింటికి పంపాక, చేతులు దులుపుకుని కూర్చోకూడదురా అబ్బాయ్. పెట్టుపోతల్లో ఏ లోటూ రాకుండా చూసుకోవాలి" అంది చిలకమ్మ.

"అక్కకు పెళ్ళయి పదేళ్ళయ్యింది. ఇంకా పెట్టుపోతలు ఏమిటే? "

"నీకేం తెలుసు. రేపు నీ కూతురు రాగిణికి పెళ్ళయ్యాక నువ్వా పంపాల్సి ఉంటుంది. ఆడపిల్ల మనస్సు కష్టపడకుండా చూసుకోవాలి".

హైదరాబాద్ బస్సు వచ్చింది.

చిలకమ్మ లగేజీ చూసి కండక్టరూ విసుక్కున్నాడు.

★ ★ ★

బస్సులో చిలకమ్మ కూర్చున్న సీటు కుదురుగా లేదు. ఓ పక్కకు ఒరిగినట్లుగా అన్పించింది. నిద్రపట్ట లేదామెకు.

కూతురు గుర్తుకువచ్చింది.

పెళ్ళయ్యాక ఏడు సంవత్సరాలకుగానీ తను గర్భవతి కాలేదు. పిల్లల కోసం భర్త కలవరించేవాడు. ముద్దులు మూటగట్టే ఆడపిల్ల తొలిచూరి కాన్పులో పుట్టేసరికి ఆయన ఎంతో ఉప్పొంగిపోయాడు. ఆ తర్వాత మగబిడ్డ. మీసం తిప్పి రొమ్ము విరుచుకు తిరిగేవాడాయన. ఆ ఆనందం ఆవిరికావడానికి ఎక్కువకాలం పట్టలేదు. రైలు ఎక్కబోతూ కాలుజారి రైలుపెట్టెకూ ప్లాట్‌ఫారానికీ మధ్య ఇరుక్కుపోయాడు. రైలు కదిలి నుజ్జునుజ్జయ్యాడు.

పదెకెరాల మాగాణి ఉండటంతో పెద్దగా ఆర్థిక ఇబ్బందులు ఎదురవలేదు. పొలం కౌలుకు ఇవ్వకుండా తనే వ్యవసాయం పనులు చేయించేది. పశువుల సావిడిలో ఎప్పుడూ పాడిగేదెలు ఉండేవి. పాలు అమ్మి నాలుగు డబ్బులు వెనకేసుకుంది. ఆర్భాటాలకు పోకుండా అవసరమైనప్పుడే ఖర్చుపెడుతూ పిల్లల్ని పెద్దవాళ్ళని చేసింది. పిల్లలిద్దరూ ఎప్పుడూ తన మాట జవదాటి ఎరుగరు. తను ఏది చెబితే అదే వేదవాక్కు వాళ్ళకు.



స్వప్నిక పట్టు పరికిణీ, ఓణీ వేసుకుని వెండిపట్టాల అడుగులతో ఇంట్లో తిరుగుతూ ఉంటే ఎంతో మురిసిపోయేది. కొడుకు బాగా చదువుకుని అమెరికానో బెంగళూరో వెళ్ళిపోతే కూతుర్ని ఇంట్లోనే ఉంచేసుకోవచ్చనుకుంది. ఊళ్ళో సంబంధం కోసం ప్రయత్నించింది. తను అనుకున్నవి ఏవీ జరగలేదు.

కొడుక్కి చదువు అబ్బకపోవడంతో వ్యవసాయంలోకి దింపక తప్పలేదు. పొరుగూరి అమ్మాయిని ఇష్టపడి పెళ్ళి చేసుకున్నాడతను. పొలంపనులు చెయ్యటంలో దిట్ట అయ్యాడు. కూతురికి చదువు అబ్బి హైదరాబాద్‌లో ఉద్యోగం చేస్తోంది.

పుష్యమి తల్లిదండ్రులకు పొలమూ పుట్రా

ఏమీలేదు. రెండెకరాలు కౌలుకు చేస్తూ, రెండు పాడిగేదెలు పెట్టుకుని సంసారం నెట్టుకువస్తున్నాడు ఆమె తండ్రి. కూతురి పెళ్ళి ఖర్చులు కూడా భరించలేని స్థితిలో ఉంటే చిలకమ్మే పెళ్ళి ఖర్చులు పెట్టుకుంది. కోడలు చూడ ముచ్చటగా పొందికగా ఉండటం, ఇంటిపనంతా చేసుకుపోవడం, ఇరుగూ పొరుగూతో సఖ్యతగా మెలగడం చిలకమ్మకే కాదు, బంధువులందరికీ నచ్చింది. 'చిదిమిదీపం పెట్టుకోవచ్చు' అనే వాళ్ళు అందరూ. కూతుర్నీ అల్లుడినీ పండగలకు పిలిచి కొత్తబట్టలు పెట్టి, నాలుగురకాల పిండివంటలు చేసే స్థోమత తల్లిదండ్రులకు లేదని పుష్యమికి తెలుసు.

'కూతురికి ఏ లోటూ రాకుండా చూసుకుంటున్నావ్. అణకువ ఉన్న కోడలుపిల్ల దొరికింది. నీకేం చిలకమ్మా, అదృష్టవంతురాలివి' అని ఊళ్ళో అమ్మలక్కలు అంటూ ఉంటే పొంగిపోయేది.

'మీరు వచ్చినప్పుడల్లా ఓ బండెడు సామాను మోసుకొస్తారు. ఎందుకండీ ప్రతిసారీ ఇవన్నీ? ' అనేవాడు అల్లుడు శ్రీపతి హైదరాబాద్ వెళ్ళినప్పుడల్లా.

'కన్నకూతురు కోసం మోసుకురాక తప్పుతుందా నాయనా' అనేది తను.

శ్రీపతితో స్వప్నిక పెళ్ళి కూడా అనుకోకుండా జరిగింది. ఊరి సర్పంచ్‌కు మేనల్లుడవుతాడు శ్రీపతి. తన కూతురునిచ్చి పెళ్ళి చేయాలనుకున్నాడు. ఆయన కూతురేమో గుంటూరులో తనతోపాటే మెడిసిన్ చదివిన కుర్రాడిని ప్రేమించి, రిజిస్టర్ మ్యారేజ్ చేసుకుంది తండ్రికి చెప్పకుండానే.

'ఇదిగో చిలకమ్మా, మా మేనల్లుడు యోగ్యుడు, నిదానస్థుడు. మా చెల్లెలికి ఒక్కడే కొడుకు. హైదరాబాద్‌లో పెద్ద సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఉద్యోగం. నెలకు లక్ష రూపాయల జీతం. ఐదెకరాల మాగాణి, పదెకరాల మెట్ట కూడా ఉంది. నిలువెత్తు ధనం పోసినా అటువంటి అల్లుడు దొరకడం కష్టం. మీ అమ్మాయి ఎటూ హైదరాబాద్‌లోనేగదా ఉద్యోగం చేస్తోంది. మీ అమ్మాయికీ మా మేనల్లుడికీ ముడివేసేద్దాం. నా మాట కాదనరు' చెప్పుకుపోయాడు సర్పంచ్.

ఆయనమాట కాదనలేకపోయింది. కాపురానికి కూతుర్ని హైదరాబాద్ పంపక తప్పలేదు. కూతురు ఎప్పుడూ తన కళ్ళ ఎదుట ఉండాలనుకుంటే దేవుడు మరొకటి తలచాడు.

తన ఒళ్ళో కూర్చుని ముద్దుముద్దు మాటలు చెప్పిన స్వప్నిక రెక్కలు వచ్చి ఎగిరిపోయింది. ఇంగ్లిషులో ధాటీగా మాట్లాడుతుంది. ఒక్కమాటా అర్థమయ్యిచావదు. తన పక్కన కూర్చుని తీరిగ్గా నాలుగుమాటలు మాట్లాడే సమయం ఉండదు. పగలంతా ఆఫీసు, రాత్రి పూట మొగుడూ, పిల్లలతో ఏవేవో కబుర్లు చెబుతూ ఉంటుంది. అంత దూరంనుంచి కన్నతల్లి వచ్చింది కదా ఎక్కువ సమయం



తల్లిదగ్గర గడుపుదామనే ధ్యాస ఉండదు.

తనకేమో ప్రతిక్షణం కూతురి ధ్యాసే. కూతురికి సంబంధించిన ముచ్చట్లే తనను చుట్టుముడుతూ ఉంటాయి.

అది పసిబిడ్డగా ఉన్నప్పుడు 'ఉంగా, ఉంగా' అంటుంటే భర్తకు చెప్పుకుని ఎంత మురిసిపోయిందో. ప్రపంచంలో ఏ పసిపిల్లా తన కూతురు అన్నట్లు అనదనుకుంది. ఆ పిల్ల ముద్దుమాటలూ మురిపాలతో మనస్సు నిండుపాలకుండే అయ్యేది.

స్వప్నిక బడికి వెళ్ళేటప్పుడు 'అంత సేపు బడిలో ఏం చెబుతారు? తొందరగా పిల్లల్ని ఇంటికి పంపిచ్చేస్తే బావుణ్ణు' అనుకునేది. ఆ కాస్త ఎడబాటు కూడా తట్టుకోలేకపోయేది.

తొలిరాత్రి తడబడే అడుగులతో శోభనం గదిలోకి కూతురు వెళ్తుంటే సిగ్గుతో ఎర్ర మందారమైన ముఖాన్ని చూసి సంబరపడింది గానీ, ఆ రాత్రి ఒంటరిగా తన గదిలో పడుకున్నప్పుడు కూతురికీ తనకూ మధ్య దూరం పెరిగిందని దిగులుపడింది. తెల్లవారు జామున ఆ గదిలోనుంచి వచ్చేసి తనపక్కనే ఒత్తిగిలినప్పుడు కూతురి ఒళ్ళంతా తడిమి పులకించిపోయింది.

దానికి పిల్లలు పుట్టారు. తమిద్దరి మధ్య మరింతదూరం పెరిగింది. పెళ్ళయిన కొత్తలో రెండుమూడు నెలలకు ఒక్కసారన్నా తను కన్పించకపోతే బెంగపడిపోయేది. పిల్లలు పుట్టాక తన ధ్యాసే దానికి లేదు. ఎప్పుడూ తన పిల్లల గొడవే. మరో విషయం ఫోన్లో మాట్లాడేదికాదు. కూతురికి ఆసరాగా ఉంటుందని తను హైదరాబాద్‌లో ఉంటే 'నీకు పిల్లల పెంపకం తెలీదు. గారాబం చేస్తావ్. మాటిమాటికీ హైదరాబాద్ రాకు. చదువు మానేసి నీ చుట్టూ తిరుగుతారు' అనేసింది ఓరోజు.

ఏటిలోని కెరటాలు ఏరుదాటి ఎలా వెళ్ళవో అలాగే మనసు లోపలి మమకారమూ ఎక్కడికీ పోదు. అది ఎన్ని అన్నా తను కూతురింటికి వెళ్ళకుండా ఉంటుందా!

నిద్రలోకి జారుకుంది చిలకమ్మ.

★ ★ ★

వెలుగు రేఖలు వచ్చి కళ్ళలో గుచ్చుకోవడంతో మెలకువ వచ్చింది చిలకమ్మకు. వనస్థలిపురం వచ్చేసింది. నింపాదిగా బస్సు దిగింది.

శ్రీపతి కారు తీసుకువచ్చి సుష్మ థియేటర్ దగ్గర నిలబడ్డాడు.

లగేజీ కారులో చేర్చుకుని వెనుకసీట్లో కూర్చుంది చిలకమ్మ.

"ఈరోజు నేను వస్తున్నానని అమ్మాయికి తెలుసుగదా. ఆఫీసుకు సెలవుపెట్టిందా బాబూ? " శ్రీపతిని అడిగింది చిలకమ్మ.

"ఆఫీసులో అర్జంటు పని ఉందట. సెలవు పెట్టడానికి వీల్లేదట" అన్నాడతను.

"పిల్లలన్నా ఇంట్లో ఉంటారా, నేనున్న నాలుగురోజులూ" మళ్ళీ అడిగింది చిలకమ్మ.

"మీ అమ్మాయిని అడగండి" అన్నాడు శ్రీపతి ముసిముసినవ్వులు నవ్వుతూ.

కూతురు ఏం సమాధానం చెబుతుందో చిలకమ్మకు తెలుసు.

'నువ్వు వచ్చావని వాళ్ళు స్కూలు మానెయ్యాలా? పిల్లల్ని చూడాలీ, కూతుర్ని చూడాలంటూ నెలరోజులు తిరక్కముందే పరుగెత్తుకుంటూ వస్తావ్. నువ్వు ఒక్కదానివే కన్నావా కూతుర్ని'... అదీ కూతురు చెప్పే సమాధానం.

అందుకే అల్లుడుగారు తన మాటలకి నవ్వుకునేది.

ఇంట్లోకి వెళ్ళగానే బ్యాగులు విప్పబోయింది చిలకమ్మ.

"ముందు మొహం కడుక్కుని కాఫీ తాగు. ఆ తర్వాత నువ్వు తెచ్చినవి చూపిద్దువుగాని" అంది స్వప్నిక.

కాఫీ తాగాక స్టీలుక్యాన్లు తీసి తను తీసుకువచ్చిన లడ్లు, సున్నుండలు, మైసూర్‌పాక్ పిల్లలకు ఇవ్వబోయింది.

"ఇవి మాకొద్దు అమ్మమ్మా. వెజిటబుల్‌పఫ్, పిజ్జా అయితే తింటాం" అంది మనవరాలు.

ఆ మాటలు చిలకమ్మకు నీరసం తెప్పించాయి.

"ఇంట్లో చేసినవన్నీ ఇక్కడకు తీసుకొచ్చావా అక్కడ తమ్ముడి పిల్లలకు ఏమన్నా ఉంచావా? " అడిగింది స్వప్నిక.

ఇంట్లో వండినవన్నీ పట్టుకొచ్చేసింది. మనవరాలు నోరుతెరిచి అడిగినా విదిలించి పారేసింది. వాళ్ళకు పెట్టకుండా ఇక్కడకు తీసుకువస్తే వీళ్ళు అవి ఇష్టంలేదంటున్నారు... ముఖం వాడిపోయింది చిలకమ్మకు.

"నీ బుద్ధి నాకు తెలుసుగా... వండినవన్నీ ఇక్కడకే తీసుకొచ్చి ఉంటావ్... వీళ్ళకు అవి నచ్చవుగానీ వెళ్ళేటప్పుడు అన్నీ తిరిగి తీసుకుపో" కసిరినట్లు తల్లితో అంది స్వప్నిక.

కూతురికి తను కొన్న పట్టుచీర బ్యాగ్‌లో నుంచి తీసి చూపించింది చిలకమ్మ.

"పసుపురంగు నీకు ఇష్టమని పుష్యమే ఈ చీర ఎంపికచేసింది" కూతుర్ని ప్రసన్నం చేసుకోవడానికి అంది చిలకమ్మ.

"నీ కోడలిక్కూడా చీర కొన్నావా? " అడిగింది స్వప్నిక.

న్యూస్‌పేపరు మొహానికి అడ్డంపెట్టుకుని తల్లీకూతుళ్ళ సంభాషణ ఆసక్తిగా వింటున్నాడు శ్రీపతి.

"దానికి మనం కొనడం ఏమిటి? వాళ్ళ అమ్మానాన్నలు కొంటారులే".

"వాళ్ళ ఆర్థిక పరిస్థితులు నీకు తెలుసు కదమ్మా. ఏమీ కొనివ్వలేని స్థితి వాళ్ళది. నువ్వే వదినకు అవసరమైనవన్నీ కొనివ్వాలి. నాకు చీర కొనాలని అనుకుంటే ముందు వదినకూ అదేరకం చీర కొనాలి" అంది స్వప్నిక.

కూతురి మాటలు విని చప్పబడిపోయింది చిలకమ్మ. చీర మడతలు విప్పి చూపిస్తున్నప్పుడు కలిగిన ఉత్సాహం నీరుగారిపోయింది.

ఆరోజు రాత్రి తల్లి పక్కన పడుకుని ఆమె చేతిని తన చేతుల్లోకి తీసుకుని నెమ్మదిగా చెప్పడం మొదలుపెట్టింది స్వప్నిక.

"అమ్మా, నామీద ప్రేమతో కొత్తబట్టలూ పిండివంటలూ ఇక్కడకు తీసుకువస్తున్నావ్ బాగానే ఉంది... ఇంటి ఆడబడుచుకు పెట్టుపోతల్లో ఏ లోటూ జరగనివ్వకూడదని వదిన కూడా అనుకోవచ్చు. నువ్వు చేసే ప్రతి పనినీ ఎదురుచెప్పకుండా సమర్థించవచ్చు. కానీ ఆమె మనస్సులో గూడుకట్టు



కునే అసంతృప్తిని నువ్వు ఎప్పుడన్నా గమనించావా? మంచి చీర కొనిపెట్టలేని తల్లిదండ్రుల నిస్సహాయ స్థితి గుర్తుకువచ్చి పుష్యమి వదిన ఎంత బాధపడుతుందో నీకు తెలుసా?

అందుకే నీకు చెప్పేది... బండెడు సామాను వేసుకుని ఇక్కడకు రాకు. ఇక్కడ మాకేం లోటులేదు. నువ్వు ఎప్పుడు రావాలంటే అప్పుడు రా. నన్నూ పిల్లల్నీ చూసి వెళ్ళు. కానీ నీతోపాటు అరటిగెలలూ పట్టుచీరలూ జున్నుపాలూ పట్టుకురాకు".

కూతురు చెప్పేది మౌనంగా వింటూ ఉండిపోయింది చిలకమ్మ.

"పుష్యమి చాలా ఓర్పూ సహనం గల అమ్మాయి. తేనెలూరే తియ్యటి మనస్సు ఆమెది. అందరి శ్రేయస్సూ కోరుతుంది. నీ మాటకు ఎప్పుడన్నా ఎదురుచెప్పిందా? ఆ అమ్మాయి వజ్రం. ఎప్పుడూ తుప్పు పట్టదు. అలాంటి అమ్మాయిని సంతోషపెట్టాల్సిన బాధ్యత మనమీద ఉంది. కన్నవారి పేదరికం తలచుకుని బాధపడుతుంది. కానీ ఆమె బాధను గమనించి ఎదుటివాళ్ళు జాలిపడితే భరించలేదు. ఆ విషయం మనం గమనించి ప్రవర్తించాలి. ఆమె పరాయిమనిషి కాదనీ మన సంపద, సౌభాగ్యం ఆమె చల్లని మనస్సులోనుంచి వచ్చినవనే భావన కలిగించాలి. 'కన్నకూతురికంటే నా కోడలే నాకు ఎక్కువ' అనుకునే మనస్థితికి నువ్వు రావాలి. తను మనింటికి వచ్చాకే మనకి అన్నీ కలిసి వచ్చాయి" అంది స్వప్నిక.

తల్లికి మరో విషయం కూడా స్పష్టంగా చెప్పేసింది.

"రేపు నువ్వు మంచానపడితే సేవలు చేయాల్సింది నీ కోడలే! మేం ఎక్కడో దూరంగా ఉంటాం. మా ఉద్యోగాల్నీ పిల్లల్నీ వదిలి నీ దగ్గరకువచ్చి నీకు సేవలు చేయలేం. అందుకని నువ్వు నీ కోడలిని కూతురికంటే ఎక్కువగా చూసుకోవాలి".

కూతురు చెప్పిన విషయాలన్నీ చిలకమ్మ మెదడు పొరల్లో దూరిపోయాయి.

...ఊళ్ళో బస్సు ఎక్కేటప్పుడు 'వెళ్ళొస్తాన్రా అబ్బాయ్' అని కొడుకుతో అందిగానీ కోడలితో ఒక్కమాట కూడా మాట్లాడలేదు తను. అదేం పట్టించుకోకుండా నవ్వుతూ చెయ్యి ఊపిన కోడలి రూపం కళ్ళల్లో మెదిలింది. అద్దం లాంటిది కోడలి మనసు. తన రూపం ఆ అద్దంలో నిలిచిపోవాలి... మనసుకు కమ్మిన తెరలు విడిపోసాగాయి చిలకమ్మకు. ★

# హాయ్



## అందాల తాళ్లు!

అమ్మాయిల యాక్సెసరీస్ అనగానే ఏదో ఒక మెటల్‌తో తయారై ఉండాలని రూలా? ఏదో ఒక స్టోన్ తప్పనిసరి అని నిబంధనా? లేదు కదా! యాక్సెసరీస్ దేంతో తయారైతేనేం, అందంగా ఉండటమేగా అంతిమ లక్ష్యం. అందుకే దారాలతో తయారైన నెక్లెస్‌లను తయారు చేశారు రష్యన్ డిజైనర్ ఎలిస్‌మార్క్స్. వివిధ రంగుల దారాలతో రకరకాలుగా ముడులు వేసి ఇవిగో ఈ అందమైన నెక్లెస్‌లను రూపొందించారు. కాస్త కొత్తగా ఉన్నాయని చాలామంది వీటిని కొంటున్నారు.



## ఓ మై ఫ్రెండ్...

ఫ్రెండ్‌షిప్ పెంచుకోండి... ఆయుష్షు పెంచుకోండి! నిజమే, స్నేహం మనిషి జీవితకాలాన్ని పెంచుతుందని చెబుతున్నారు నిపుణులు. దానికి చక్కని మార్గం ఇంటర్‌నెట్‌లో సోషల్ నెట్‌వర్కింగ్ అంటున్నారు. ఎందుకంటే ఈరోజుల్లో స్నేహితులతో హాయిగా కబుర్లు చెబుతూ గడిపే అవకాశం ఎంతమందికి ఉంటోంది? ఉద్యోగాలూ చదువులూ లక్ష్యాలూ... ఎవరి బిజీ వాళ్లది. కాబట్టి ఫ్రెండ్‌షిప్‌ని కాపాడుకోవాలంటే చక్కని మార్గం సోషల్ నెట్‌వర్కింగ్. 'ఏదో ఒక సోషల్ నెట్‌వర్కింగ్‌లో ఉంటే స్నేహితులతో నిత్యం కనెక్ట్ అయి ఉంటాం. మన భావోద్వేగాలను షేర్ చేసుకుంటుంటాం. దానివల్ల మనలో కొన్ని పాజిటివ్ ఫీలింగ్స్ కలుగుతాయి. అవి మనలో ఒత్తిడిని తగ్గిస్తాయి. అంటే ఆరోగ్యానికి జరగాల్సిన హాని తప్పినట్టే కదా' అంటారు ముంబైకి చెందిన వైద్యుడు హరీష్. ఇదే అంశంపై అమెరికాలోనూ ఓ సంస్థ కొంతమంది యువకులపై పరిశోధనలు చేసింది. ఫ్రెండ్స్‌తో నిత్యం టచ్‌లో ఉన్నవారికి రోగ నిరోధక శక్తి కూడా పెరుగుతుందని తేల్చింది.

## కొంచెం రఫ్!

ఫ్రెంచ్ బియర్డ్... గోటే.. స్ట్రాప్... ఇలాంటి స్టైల్స్ అన్నీ చూసేశాం. ఇప్పటి ట్రెండ్ ఫుల్‌గా గడ్డం పెంచడం! ముఖం ఆకారాన్ని బట్టి కొన్ని జాగ్రత్తలు తీసుకుని గడ్డాన్ని పెంచితే మరింత మ్యాన్లీ లుక్ వస్తుంది అంటున్నారు స్టైలిస్టులు. అవేంటో చూద్దాం.

- ❖ కొందరి ముఖం ఆకారం గుండ్రంగా ఉంటుంది. అలాంటివారికి మొత్తం గడ్డం అంతగా బాగోదు. కాదూ, అలాగే కావాలనుకుంటే గడ్డం భాగంలో హెయిర్ కాస్త ఎక్కువ పెంచాలి. చెంపలు కూడా మరీ పెద్దవి కాకుండా చూసుకోవాలి.
- ❖ పొడవైన ముఖం ఉన్నవాళ్లు చెంపల భాగంలో హెయిర్‌ని కాస్త ఎక్కువ పెంచుకోవాలి. గడ్డం భాగంలో తక్కువ ఉండేట్టు చూసుకుంటే బాగుంటుంది.
- ❖ పలకల ముఖం ఉన్నవారికి వీలైనంత తక్కువ ఫేషియల్ హెయిర్ ఉంటేనే లుక్ ఉంటుంది. చెంపల్ని సన్నగా పొడవుగా పెంచితే మరింత అందం వస్తుంది.
- ❖ కొందరికి ముఖం చాలా విశాలంగా ఉంటుంది. అలాంటివారు ఫేషియల్ హెయిర్‌ను ఏ మాత్రం పెంచినా ముఖం ఇంకా పెద్దదిలా కనిపిస్తుంది. కాబట్టి మీసాన్ని బాగా పెంచి గడ్డాన్ని లైట్‌గా ఉంచుకుంటే మంచి లుక్.
- ❖ ముఖ్యంగా కోలగా ఉన్నవాళ్లకి ఏ స్టైలైనా సూటౌతుంది. కాబట్టి చెంపలూ ఫేషియల్ హెయిర్‌ని ఎలా నచ్చితే అలా పెంచుకోవచ్చు.



## రుచి లేదు!

బాబాయ్, అబ్బాయ్... ఇద్దరూ ఓ విందు భోజనానికి వెళ్లారు. అక్కడ బఫే ఏర్పాటు చేశారు. ముందుగా వెళ్లిన అబ్బాయ్ భోజనం చేసేశాడు. కాసేపటి తరువాత అక్కడికొచ్చిన బాబాయ్ ప్లేటు తీసుకుని దానిపై ఉన్న పేపర్ నాప్కిన్‌ని అనుమానంగా చూస్తున్నాడు. దాన్ని ఎందుకిచ్చారో అతడికి అర్థం కావడం లేదు. ఈలోపు అబ్బాయ్ వచ్చాడు. 'వద్దు బాబాయ్... దాన్ని మాత్రం తినకు. అది ఏమాత్రం రుచిగా లేదు.' అన్నాడు!

# ఆరెంజ్
## 2011 ఫ్యాషన్ కలర్!

**ఒకటా రెండా... ప్రకృతిలో వేనవేల వర్ణాలు... వెలకట్టలేని సోయగాలు... దేని అందం దానిదే. అందుకే ఈసారి ఏ రంగుని ఎంపికచేసుకుందామా అనుకుంటూ రంగులరాట్నాన్ని గిర్రున తిప్పుతూ ఓ చోట రెప్పవేయడం మర్చిపోయింది ఫ్యాషన్‌సుందరి. ఆ చూపు ఆగినచోట భానూదయాలు... అరవిరిసిన గుమ్మడిపూలు... విరగకాసిన నారింజపండ్లు... కలగలిసిన పసుపుకుంకుమలు... అంతే... ఆ వన్నెల్ని ఎప్పుడెప్పుడు సింగారించుకుందామా అని ఆరాటపడుతూ ఈ ఏడాది ట్రెండీ ఫ్యాషన్ కలర్ 'ఆరెంజ్' అంటూ ప్రకటించేసింది.**



నెదర్లాండ్స్ వర్ణం ఆరెంజ్. అక్కడ రాజకుటుంబాన్నీ ఆరెంజ్ అనే పిలుస్తారు. అందుకే 'ప్రిన్స్ ఆఫ్ ఆరెంజ్' అనే పదం ఇప్పటికీ అక్కడ వినిపిస్తుంది. రాణి పుట్టినరోజున సూర్యుడు నారింజవర్ణంలో కనిపిస్తే శుభకరంగా భావిస్తారు. ఆ ఏడాది వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుందని నమ్ముతారు.

✦ డచ్ జాతీయ ఫుట్‌బాల్ జట్టుని కూడా 'ఆరెంజ్' అనే పిలుస్తారు. అందుకే సాకర్ సమయంలో అక్కడంతా ఆరెంజ్ దుస్తుల్లోనే కనిపిస్తారు. ప్రస్తుతం వారి జాతీయ జెండాలో ఎరుపు రంగు కనిపిస్తోంది కానీ 17వ శతాబ్దం వరకూ అక్కడ ఆరెంజ్ రంగే ఉండేది.

✦ రంగుకే కాదు... ఆరెంజ్‌లకీ నెదర్లాండ్స్ పెట్టింది పేరే. ఏటా అక్కడ కమలాపండ్ల అలంకరణలతో భారీవేడుకను నిర్వహిస్తారు.

✦ ఆరెంజ్ అనే పదం 'నారింజ' అన్న సంస్కృతపదం నుంచి పుట్టుకొచ్చింది. అంతకు ముందు ఈ రంగుని ఆంగ్లేయులంతా ఎల్లోరెడ్ అనే పిలిచేవారట.

✦ మన జాతీయజెండాలోని మూడు రంగుల్లో ఇదీ ఒకటి. కాకపోతే దీన్ని మనం కాషాయం(శాఫ్రాన్)గా పిలుస్తాం.

✦ అమెరికా జైళ్లలోని ఖైదీలు ఎక్కువగా ఆరెంజ్ రంగు యూనిఫామ్‌నే ధరిస్తారు. ఎందుకంటే ఒకవేళ వాళ్లు పారిపోయినా సులభంగా గుర్తుపట్టేందుకేనట ఈ ఏర్పాటు.

✦ ఐరోపా, అమెరికాల్లోని అనేక యూనివర్సిటీలు, క్రీడా విభాగాల యూనిఫామ్ ఈ రంగే.

✦ ఆకులన్నీ నారింజవర్ణం దాలుస్తున్నాయంటే చలికాలం ప్రారంభమైనట్లే. అంటే ఇది కాలం మారడాన్నీ సూచిస్తుంది. ఎందుకంటే యూరప్‌లో చాలా చెట్ల పండుటాకులదీ ఆరెంజ్‌వర్ణమే.

### ఆరెంజ్... ఆధ్యాత్మికం!

తేజోవంతంగా కనిపించే ఈ రంగు ఆధ్యాత్మికతనీ ప్రతిబింబిస్తుంది. హిందూ సాధువులతోపాటు థెర్వాడ సంప్రదాయాన్ని అనుసరించే బౌద్ధసన్యాసులు కూడా ఎక్కువగా ధరించేది కాషాయవర్ణాన్నే. కొద్దిమంది మాత్రం ముదురు ఎరుపురంగు ధరిస్తారు.

### ఎప్పుడెప్పుడు..?

ఒత్తిడిలో ఉన్నప్పుడూ ఏదైనా షాక్‌లో ఉన్నప్పుడూ...

✦ జీవితం బోరింగ్‌గానూ చిరాగ్గానూ అనిపించినప్పుడూ...

✦ ఏదైనా పనిలో పూర్తిగా నిమగ్నమవ్వాలని అనుకున్నప్పుడూ...

✦ సృజనాత్మకంగా ఆలోచించాలనుకున్నప్పుడూ...

✦ బాధాకరమైన సంఘటనలనుంచి తేరుకోవాలనుకున్నప్పుడూ...

✦ ఆశావాదంతో ఉత్సాహంగా ముందుకుసాగాలనుకున్నప్పుడూ...

... ఆరెంజ్ కలర్ దుస్తులు ధరిస్తే ఫలితం ఉంటుందట.

దుస్తులు మాత్రమే కాదు... కార్నీలియన్, ఫైర్ ఓపల్, సన్‌స్టోన్, టాంజరీన్... వంటి ఆరెంజ్ కలర్ రత్నాలను ధరించడం లేదా ఇంట్లో పెట్టుకోవడంవల్ల ఉత్సాహంగా ఉంటుందట. సృజనాత్మకత పెరిగి చుట్టుపక్కల వాతావరణంలోని మార్పులను తట్టుకోగలుగుతారట. పైగా భావోద్వేగాలు అదుపులో ఉంటాయట. గది గోడలతోపాటు కర్టెన్లూ బెడ్‌షీట్లూ ఆరెంజ్‌కలర్ వాడితే ఉల్లాసపూరిత వాతావరణంలో ఉన్న ఫీల్ కలుగుతుందట.

### ఆనందవర్ణం...

ఎరుపురంగు ఉష్ణానికి ప్రతీక అయితే పసుపు ఆహ్లాదానికి చిహ్నం. ఎరుపు, పసుపు రంగుల కలయికతో ఏర్పడిన నారింజరంగులో ఆ రెండింటి లక్షణాలూ కనిపిస్తాయి. ఎరుపులోని తీవ్రతకి పసుపులోని చల్లదనం తోడవడంతో ఇది ప్రశాంతంగా ప్రకాశిస్తుంది. అందుకే వర్ణపటంలోనూ ఎరుపు, పసుపుల మధ్యలోనే కనిపిస్తూ పొద్దుపొడుపులోని ఆనందాన్ని పంచే గోరువెచ్చని సూరీడుని ప్రతిబింబిస్తుందీ నారింజవర్ణం.



### ఆరెంజ్ ఆరోగ్యం

✦ శక్తినీ సమన్వయాన్నీ ఐక్యతనీ ఈ రంగు ప్రతిబింబిస్తుంది. అందుకే ఇది శక్తిమంతమైనదిగా వ్యాధుల్ని తగ్గించేదిగా చెబుతారు కలర్‌థెరపిస్టులు. ముఖ్యంగా దీన్ని చూడటం లేదా ధరించడం వల్ల రక్తప్రసారంతోపాటు జీర్ణశక్తీ పెరుగుతుందట.

✦ దృష్టిదోషాల్ని నివారిస్తుందనీ క్యాన్సర్లని తగ్గిస్తుందనీ గుండె పనితీరుని మెరుగుపరుస్తుందనీ మొత్తంగా రోగనిరోధక శక్తిని పెంచుతుందనీ చెబుతుంటారు.

✦ ఆకలిని పెంచుతుంది. అందుకే ఫుడ్‌కలర్స్‌లో ఎక్కువగా ఈ రంగునే వాడతారు. చూడగానే వాటిని తినాలనిపించడానికి వాటి రంగే ప్రధాన కారణం.



ఆరోగ్యాన్ని పెంపొందించే యాంటీ ఆక్సిడెంట్ల శాతం నారింజవర్ణంలోని క్యారెట్లు, టొమాటోలు, గుమ్మడి, టాంజరిన్‌లు, పీచ్‌లు, షారోన్‌లు, అప్రికాట్‌లు, కొన్ని రకాల చెర్రీలు... వంటి వాటిల్లోనే చాలా ఎక్కువగా ఉంటాయి.

✦ సి-విటమిన్‌కు సమృద్ధికారకాలైన ఆరెంజ్‌ల గురించి ప్రత్యేకంగా చెప్పాల్సినపనే లేదు. చల్లదనాన్నీ తాజాదనంతో కూడిన సౌందర్యాన్నీ అందించడంలో కమలాతొక్కలదే పైచేయి.

### నారింజ అదిరింది!

టీనేజీ క్రేజీ దుస్తుల్లో...అతివల సంప్రదాయ దుస్తుల్లో... ఇక ఆరెంజ్ అందంగా మెరవనుంది. ఎందుకంటే ఈ ఏడాది ట్రెండీ ఫ్యాషన్ కలర్ అదేగా మరి. దీన్ని ఏ రంగుల్లో మేళవించాలా అని మరీ అంతగా ఆలోచించేయాల్సిన అవసరం లేదు. ఎందుకంటే ఆరెంజ్‌కి అసలుసిసలైన కాంబినేషన్ బ్లూనే మరి. నీలాకాశంలో జారిపోతున్న సూరీడు అంత అందంగా కనిపించేదందుకే. ఆరెంజ్ కాంబినేషన్ లేని బ్లూకి అందమే ఉండదన్నది విఖ్యాత చిత్రకారుడు విన్సెంట్ వాన్ గో అభిప్రాయం కూడా.

✦ ఆకుపచ్చతో దీని జోడీ సహజాతి సహజం. ఎందుకంటే పచ్చని చెట్లకి పూసే పూలల్లో చాలావాటిది ఈ రంగే మరి. అందుకే చీరల్లో లంగాఓణీల్లో ఈ రెండింటి సమ్మేళనం అద్భుతం.

✦ నలుపుతో తిరుగే లేదు. బ్లాక్‌ప్యాంట్ ఆరెంజ్ టాప్ వేస్తే అమ్మాయి అదుర్స్... అబ్బాయి ఢమాల్స్!

✦ తెలుపుతో నారింజవర్ణం హాయిగా కలిసిపోతుంది. దోస్త్ మేరా దోస్త్ అన్నట్లు చల్లని స్నేహగంధాల్ని వెదజల్లుతూ చూపులకూ ఆహ్లాదంగా కనిపిస్తుంది. వేసవిలో ఈ కాంబినేషన్ బెస్ట్.

✦ పదిమందిలో కొట్టొచ్చినట్లు కనిపించాలనుకుంటే ఆరెంజ్ తప్పక ధరించాల్సిందే. ఎక్కడున్నా ఠక్కున గుర్తించవచ్చు. ముఖ్యంగా చలికాలం బద్ధకాన్నీ వానాకాలం నీరసాన్నీ వదిలించి ఉత్సాహాన్ని రేకెత్తించడంలో నారింజవర్ణాన్ని మించింది లేదు మరి. సో... లెట్స్ గో ఫర్ ఆరెంజ్! ★



















# ఒకే ఒక్కసారి ఏడ్చాను!

**పదహారేళ్లకే మోడలింగ్ కెరీర్...
ఇరవై ఏళ్లకి మిస్ఇండియా కిరీటం... 21 సంవత్సరానికి
మిస్‌వరల్డ్ పట్టం... అంతులేని ప్రజాభిమానం... దటీజ్ ఐశ్వర్యారాయ్.
అందానికి నిలువెత్తు అర్థం. పదహారేళ్లుగా చూస్తున్నాం...
ఆ అందంలో వీసమెత్తు తరుగులేదు. ఆ ఆకర్షణ చిన్నమెత్తు కరగలేదు.
కెరీర్ ఆరంభించి ఇన్నేళ్లు కావస్తున్నా క్రేజ్
ఏమాత్రం తగ్గని 'ఫిఫ్టీ కేజీ తాజ్‌మహల్'
ఐషూ చెబుతున్న కబుర్లు విందామా...**

నాన్న నేవీ ఉద్యోగి కావడంతో ఇంట్లో చాలా తక్కువగా ఉండేవారు. సో, ఇంట్లో అమ్మా అన్నయ్యా నేనూ ముగ్గురమే ఉండేవాళ్లం ఎక్కువగా. ఏదో సాధించాలని చిన్నప్పటి నుంచే కలలు కంటూ ఉండేదాన్ని.

★ అన్నయ్య ఆదిత్య నాకన్నా మూడేళ్ల పెద్ద. వాడికి సంగీతం అంటే చాలా ఇష్టం. ముఖ్యంగా పాప్ మ్యూజిక్. ఎక్కడెక్కడి నుంచో ఆడియోక్యాసెట్లు(అప్పటికింకా సీడీలు రాలేదు మరి) సేకరించి ఇంటికి తెచ్చేవాడు. అమ్మేమో పాత హిందీపాటలు వినేది. దాంతో నాకు అటు పాతకాలం మెలొడీలూ ఇటు పాప్‌మ్యూజిక్ రెండిటి మీదా ఆసక్తి కలిగింది. అప్పుడు సంగీతం నేర్చుకుంటానంటే నేర్పించింది అమ్మ. కొన్నాళ్లు హిందుస్థానీ క్లాసికల్, మరికొన్నాళ్లు కర్ణాటక సంగీతం నేర్చుకున్నా. కానీ రెండూ మధ్యలోనే మానేశాను. కొన్నాళ్లు భరతనాట్యం కూడా నేర్చుకున్నాను.

★ సినిమాలు మాత్రం అందరు మధ్యతరగతి పిల్లల్లాగానే ఎప్పుడన్నా ఒకటీ అరా చూసేవాళ్లం. ఆదివారంనాడు దూరదర్శన్‌లో వచ్చే సినిమాలు చూడ్డమే. డీడీలో వచ్చే చాయాగీత్ ప్రోగ్రామ్ చాలా ఇష్టంగా చూసేదాన్ని. వారాంతాల్లో మాకు దూరదర్శనే పెద్ద వినోదం. ఆదివారం పొద్దున్నుంచీ రాత్రి దాకా ఒక్క ప్రోగ్రాం కూడా వదలకుండా చూసేవాళ్లం. హోమ్‌వర్క్ కూడా చేసేవాళ్లం కాదు. దాంతో సోమవారం పొద్దున్న హడావుడిగా లేచి గబగబా బరికేసి(రాసేసి) అయిష్టంగా స్కూలుకెళ్లేవాళ్లం.

★ దూరదర్శన్‌లో సాధారణంగా పాత సినిమాలే వేస్తారు కాబట్టి వీసీపీ (వీడియో క్యాసెట్ ప్లేయర్) అనే మాట వింటే చాలు భలే ఎగ్జయిటయిపోయేవాళ్లం ఆరోజుల్లో. వీసీపీ తెచ్చుకుని కొత్త సినిమాలు చూడ్డమంటే అదో పెద్ద లగ్జరీ కింద లెక్క. మేం కూడా అప్పుడప్పుడూ వీడియో క్యాసెట్లు తెచ్చుకుని చూసేవాళ్లం.

★ ఆర్యవిద్యామందిర్‌లో చదివేటప్పుడు నేనెప్పుడూ క్లాస్ ఫస్ట్ వచ్చేదాన్ని. టీచర్లందరికీ నేనో తెలివైన పిల్లననే నమ్మకం. పదో తరగతిలో కూడా నేనే క్లాస్‌ఫస్ట్ అనుకున్నారు. కానీ... నేను ఏడోస్థానంలోనో ఎనిమిదో స్థానంలోనో వచ్చాను.

నా ఇగో మీద పెద్ద దెబ్బ ఆ సంఘటన.

జీవితంలో నేను ఏడ్చిన ఒకేఒక సందర్భం అది. ఇంటర్‌లోనూ రెండోస్థానానికే పరిమితమయ్యా. మిస్ఇండియా పోటీల్లోనూ అదే జరిగింది. ఆ ఏడాది మిస్ఇండియా నేనేనని మీడియా మొత్తం కోడై కూసింది. కానీ ఫలితం... సుస్మితాసేన్ ప్రథమస్థానంలో వచ్చింది. నేను సెకండ్ ప్లేస్‌లో ఉన్నాను. అప్పటికి నెంబర్‌వన్ స్థానం విలువేంటో నాకు తెలిసొచ్చింది. ఆ పొరపాటు మళ్లీ జరక్కూడదనే మిస్‌వరల్డ్ పోటీల్లో చాలా జాగ్రత్తగా చురుగ్గా ఉన్నాను. అప్పుడు మాత్రం నేననుకున్నది సాధించాను.

★ మొదట్నుంచీ నేను పెద్దగా ఫ్యాషన్స్‌ని ఫాలో అయ్యేదాన్ని కాదు. అమ్మానాన్నా కుట్టించిన బట్టలే వేసుకోవడం. వేసుకున్నప్పుడు హాయిగా ఉంటే చాలనుకునేదాన్ని. ఆ మాట కొస్తే ఇప్పటిక్కూడా అంతే. ఏది కొత్త ఫ్యాషనో నాకు అస్సలు తెలియదు. డిజైనర్లు కుట్టిచ్చే దుస్తులు ధరిస్తానంతే. కాలేజీలో చదివేటప్పుడు ఎక్కువగా సల్వార్‌కమీజులూ అప్పుడప్పుడూ జీన్స్, షర్ట్ వేసుకునేదాన్ని.

★ ముంబైలోని జైహింద్, రూపారెల్ కాలేజీల్లో ఇంటర్మీడియెట్ చదివాను. జీవశాస్త్రం, జంతుశాస్త్రం నాకిష్టమైన సబ్జెక్టులు. అందుకనే ఇంటర్మీడియెట్‌లో బైపీసీ తీసుకున్నా. అలాగని డాక్టర్నవ్వాలని మాత్రం ఎప్పుడూ అనుకోలేదు. అలాంటి వృత్తిలోకి అడుగుపెట్టాలంటే ఎంతో అంకిత భావం కావాలి. ఆరోజుల్లో నాకంత డెడికేషన్ ఉండేది కాదు. ఆవిషయం తెలుసు కాబట్టే ఎప్పుడూ ఆ దిశగా ఆలోచించలేదు. తర్వాత ఆర్కిటెక్చర్(డిగ్రీ)లో చేరాను.

★ ఇంటర్ సెకండియర్ చదువుతున్నప్పుడు మా ఇంగ్లిష్ ప్రొఫెసర్ వచ్చి ఒక మ్యాగజైన్ ఫీచర్‌కి మోడల్‌గా చేస్తావా అని అడిగారు. ఆమె ఫొటోజర్నలిస్ట్ కూడా. నా జీవితంలో వచ్చిన తొలి మోడలింగ్ ఆఫర్ అది. మొదట్లో సంకోచించాను. కానీ ఆమె ఎన్నో విధాల చెప్పి నన్ను ఒప్పించారు. నా తొలి మేకప్‌మేన్ భరత్‌గొడాంబే. ఆయన నన్ను చూసి మోడలింగ్ పరిశ్రమలో అందరికీ చెప్పేశారు. ఒకటిరెండ్రోజుల్లోనే నా గురించి ఇండస్ట్రీ మొత్తానికి తెలిసిపోయింది. వెంటనే వరసపెట్టి అవకాశాలు. మొదట పనిచేసింది

ఒక టాల్కమ్ పౌడర్ యాడ్‌కి. తర్వాత పెప్సీ యాడ్‌తో దేశవ్యాప్తంగా పాపులర్ అయ్యాను. ఆ యాడ్‌లో అమీర్‌ఖాన్‌తో 'హాయ్, అయామ్ సంజు' అనే డైలాగ్‌ని అభిమానులు ఇప్పటికి కూడా గుర్తుచేస్తూనే ఉంటారు. ఆ డైలాగ్ చెప్పడానికి నేను 19 టేకులు తీసుకున్నాను.

★ మిస్ ఇండియా పోటీల్లో పాల్గొంటున్నప్పుడే సుభాష్‌ఘయ్, జె.పి.దత్తా, యశ్‌చోప్రా వంటి దిగ్గజాలు తమ సినిమాల్లో హీరోయిన్‌గా అవకాశం ఇస్తామన్నారు. కానీ అప్పుడు నాదృష్టంతా పోటీలపైనే ఉండటంతో ఒప్పుకోలేదు. 'బొంబాయి' సినిమాలో నన్నే హీరోయిన్‌గా తీసుకోవాలనుకున్నారట. ఈవిషయాన్ని తర్వాత్తర్వాత 'కండుకొండేన్ కండుకొండేన్(తెలుగులో ప్రియురాలు పిలిచింది)' సినిమా షూటింగప్పుడు ఆ చిత్ర దర్శకుడు రాజీవ్‌మీనన్ నాకు చెప్పారు. అలాగే సంజయ్‌లీలా భన్సాలీ తన 'ఖామోషీ' చిత్రానికి నన్ను తీసుకోవాలనుకున్నారట. అదీ తర్వాత ఆయనే చెప్పారు. అమీర్‌ఖాన్, కరీనా కపూర్ నటించిన బ్లాక్‌బస్టర్ 'రాజా హిందుస్థానీ' సినిమాలో నటించేందుకు ఒప్పుకొన్నాను. ఆ చిత్ర దర్శకుడు ధర్మేష్ దర్శన్ నన్ను తీసుకోవాలని నిర్ణయించుకున్నారు. కానీ అమీర్ మాత్రం నాకు స్క్రీన్‌టెస్ట్ చెయ్యాల్సిందేనని పట్టుబట్టారు. ఇంతలో మిస్‌ఇండియా పోటీల్లో పాల్గొనాల్సి రావడంతో ఆ ప్రాజెక్టు నుంచి విరమించుకున్నా.

★ మిస్‌ఇండియా పోటీల్లో అందరూ నేనే నెగ్గుతానని ఒక నిర్ణయానికి వచ్చేశారు. దాంతో నాకెవరూ పెద్దగా సలహాలు ఇచ్చేవారు కాదు. నాకన్నీ తెలుసనుకునేవారు. కానీ అప్పటికి నేనొక సగటు టీనేజీ అమ్మాయినేనని ఎవరూ అర్థం చేసుకోలేకపోయారు. చాలామంది... 'మీరీ పోటీల్లో నెగ్గకపోతే?' అని ప్రశ్నించేవారు. 'పెద్దగా మార్పేమీ ఉండదు, నేను అందగత్తెనని ఎవరో ఇవాళ కొత్తగా నిర్ణయించక్కర్లేదు' అని చెప్పేదాన్ని. ఆ సంగతులన్నీ ఎలా ఉన్నా ఆ పోటీల్లో పాల్గొనడం ఒక మధురానుభూతి. ఆ సమయంలో ధరించిన కిరీటం, శాష్(మిస్‌ఇండియా అని రాసే వల్లెవాటు) ఇప్పటికీ దాచుకున్నాను. ఆ జ్ఞాపకాలన్నీ మధురాతిమధురం.

★ మిస్‌వరల్డ్ పోటీల్లో మొత్తం 87 మంది పోటీదారులం. అందులో చాలామంది చూస్తేనే మతిపోయేటంత అందగత్తెలు. అప్పుడు కూడా నాకేమీ భయం వేయలేదు. వాళ్లను చూసినప్పుడు ఎప్పుడూ గెలుపోటముల గురించి ఆలోచనే రాలేదు. నిజంగా నన్ను భయపెట్టిందేదైనా ఉంటే అది పత్రికల్లో వచ్చిన ప్రచారమే. మొదట్నుంచీ నన్నో బలమైన పోటీదారుగా చూపారు. అది నన్ను చాలా ఒత్తిడికి గురిచేసింది.

★ మిస్‌వరల్డ్ టైటిల్ గెలుచుకున్నాక చదువుకి తాత్కాలికంగా చుక్కపెట్టేసి ఏడాది పాటు లండన్‌లో ఉన్నాను. ఇక్కడికొచ్చాక మీడియా హడావుడి, ప్రజల స్పందన... ఇవన్నీ చూశాక ఇక నా చదువు సాగదని అర్థమైపోయింది. దానికి తోడు హిందీ, తమిళ సినిమా రంగాల నుంచీ అత్యుత్తమ నిర్మాణ సంస్థలూ దర్శకుల నుంచి ఆఫర్ల వెల్లువ రావడంతో నామీద నాకు నమ్మకం పెరిగింది. 'సరే, ఇక ఇదే నా కెరీర్' అని నిశ్చయించుకుని చిత్రపరిశ్రమలోకి ప్రవేశించాను.

★ వెండితెరపై అరంగేట్రం... అదీ మణిరత్నం లాంటి గొప్పదర్శకుడితో... ఆ సినిమా షూటింగ్ మొదటిరోజు చాలా ఎంజాయ్ చేశాను. తర్వాత ఎన్ని సినిమాల్లో అవకాశాలు వచ్చాయంటే... నాలుగైదేళ్ల దాకా నా డైరీలో ఖాళీలు లేనంతగా. ఆ అవకాశాల వెల్లువ ఇప్పటికీ కొనసాగుతోంది. కథానాయికలకు పెళ్లయ్యాక సినిమా అవకాశాలు తగ్గుతాయంటారు. నావిషయంలో అలా జరగలేదు. ఈ ఏడాది నేను నటించిన సినిమాల(రోబో, రావణ్, యాక్షన్ రీప్లే, గుజారిష్) విలువ రూ.400 కోట్లు. ఇప్పటికీ వచ్చేఏడాది చివరిదాకా నా డైరీలో ఖాళీలు లేవు.

★ మిస్ వరల్డ్ పోటీలకు వెళ్లేముందు ముంబైలో జరిగిన ఒక పార్టీకి వెళ్లాను. అక్కడే తొలిసారి పా(అమితాబ్‌బచ్చన్)జీని కలిశాను. ఆయనతో కలిసి ఫొటో తీయించుకోవాలనుకున్నాను. ఆ విషయం ఎవరో ఆయనకు చెప్తే నవ్వుతూ ఒప్పుకొన్నారు. కానీ నా దగ్గర కెమెరా లేదు. అప్పుడు ఆయనే పార్టీకొచ్చిన అందరినీ 'మీదగ్గర కెమెరా ఉందా' అంటూ అడిగి సందడి చేశారు. మా(జయాబచ్చన్) అదంతా నవ్వుతూ చూస్తున్నారు. మొత్తానికి ఎలాగోలా ఒక కెమెరా సంపాదించి ఫొటో తీసుకున్నాం.

★ కొత్తకోడలిగా బచ్చన్ల ఇంట్లో గృహప్రవేశం చేయడం ఒక గొప్ప అనుభూతి. 'నువ్వు మా ఇంటి కోడలివి కాదు, కూతురివి' అని మాజీ, పాజీ ఆరోజే చెప్పారు. అలాంటి అత్తమామలు దొరకడం నా అదృష్టం.

★ పెళ్లయి నాలుగేళ్లు కావొస్తున్నా ఇంకా పుట్టింటి నుంచి నా వస్తువులు ఏదో ఒకటి తెచ్చుకుంటూనే ఉంటాను. నేనలా తేవడం మాజీ, పాజీ, అభి అందరికీ పెద్ద జోకయిపోయింది. షూటింగ్స్ బిజీ కారణంగా ఇంట్లో అందరం కలిసి ఉండేది తక్కువే. ఎప్పుడైనా కుదిరితే మాత్రం సందడే సందడి. ★

## కాలం ఆగిపోయినట్లయింది!

అభి నేను 1996 జులైలో తొలిసారి కలుసుకున్నాం. హిందీలో నా మొదటి సినిమా 'ఔర్ ప్యార్ హోగయా' షూటింగ్ స్విట్జర్లాండ్‌లో జరుగుతున్నప్పుడు ఒకరోజు సాయంత్రం అభి అక్కడికి వచ్చాడు. తను నటిస్తున్న 'మేజర్‌సాబ్' షూటింగ్ కూడా స్విట్జర్లాండ్‌లోనే జరుగుతోందప్పుడు. మొదట్నుంచీ అభి కొంచెం సిగ్గరి. అక్కడికొచ్చినా మాకందరికీ దూరంగా వేరే చోట కూర్చున్నాడు. నేనే కొంచెం చొరవ చేసి మా దగ్గరికి వచ్చి కూర్చోమన్నాను.

ఆతర్వాత... 'ధాయీ అక్షర్ ప్రేమ్ కే' షూటింగ్ సమయంలో కలుసుకున్నాం. అది మా ఇద్దరి కలయికలో వచ్చిన తొలి చిత్రం. ఇక అభి... తన ప్రేమను తెలిపిన క్షణాలు జీవితంలో నేనెప్పటికీ మర్చిపోలేను. ఆరోజు జరిగిన ప్రతిచిన్న సంఘటనా నాకు గుర్తుంది. ప్రతీక్షణం మధురంగా నా మనసులో నిండిపోయింది. మేమిద్దరం 'గురు' స్క్రీనింగ్ కోసం న్యూయార్క్‌కెళ్లాం. తర్వాత హోటల్‌కి తిరిగొచ్చాం. నేను డ్రెస్ చేంజ్ చేసుకుని బూట్లు జిప్ వేసుకుంటుండగా అభి నన్ను బాల్కనీలోకి పిలిచాడు. నేను మామూలుగా వెళ్లాను. వెళ్లగానే... సినిమాల్లోలాగా మోకాలి మీద కూర్చొని నా చేతికి ఉంగరం తొడుగుతూ డ్రమెటిక్‌గా చెప్పలేదు. చాలా మామూలుగా తన ప్రేమను తెలిపాడు.

ఒక్క క్షణం కాలం ఆగిపోయినట్లు అనిపించింది. వెంటనే ఒప్పుకొన్నాను.

బహుశా అభి తనప్రేమను వెలిబుచ్చడంలో ఇంకొంత ఆలస్యం చేసి ఉంటే నేనే చెప్పేసేదాన్నేమో!

దాదాపు సంవత్సరం క్రితం అదే బాల్కనీలో కూర్చుని నన్ను ప్రేమిస్తున్న విషయం ఎలా చెప్పాలా అని ఆలోచించానని తర్వాత చెప్పాడు.

మా ఇద్దరి విషయం పెద్దవాళ్లకి చెప్పడం, ఇరుపక్షాలవాళ్లూ ఒప్పుకోవడం, పెళ్లి... అంతా ఏడాదిలోపే జరిగిపోయింది. అప్పుడే మా పెళ్లై నాలుగేళ్లు కావొస్తోందంటే... ఏంటో అంతా కలలా అనిపిస్తుంది.





**పశ్చిమ కనుమల్లోని కర్ణాటక, కేరళ సరిహద్దు ప్రాంతం. ప్రకృతి అందాలకు నిలువుటద్దమైన ఆ పర్వతాల్లో ఎన్నో పల్లెలు. వాటిలో ఒకటి అరంబూర్. ఈ గ్రామానికీ గిరీష్ భరద్వాజ్‌కూ ఉన్న బంధమే నేడు అనేక పల్లెల్ని ప్రపంచంతో కలపడానికి నాంది.**

# అభివృద్ధికి వారధి

కర్ణాటకలోని సూలియా పట్టణానికి చెందిన గిరీష్ భరద్వాజ్ ఓ ఇంజినీర్. 1970 ప్రాంతంలో సొంతంగా ఇంజినీరింగ్ వర్క్స్ చేసే కంపెనీ(ఆయాశ్ శిల్ప) ప్రారంభించారు. ఆధునిక వ్యవసాయానికీ, పరిశ్రమలకూ అవసరమయ్యే పరికరాలను వీరు తయారు చేస్తుంటారు. మెకానికల్ ఇంజినీర్ అయిన గిరీష్ తయారుచేసే పరికరాలకు స్వల్పవ్యవధిలోనే మంచి గుర్తింపు వచ్చింది. ఆయన గొప్పతనం అరంబూర్ వాసుల చెవినపడింది. అరంబూర్ గిరీష్ తండ్రి సొంతూరు. ఓసారి ఆ ఊరి పెద్దలు గిరీష్ దగ్గరకు వచ్చి వర్షాకాలంలో గ్రామాన్ని మిగతా ప్రపంచంతో వేరు చేస్తోన్న పయాశ్విని నదిపై వారధి కట్టాలని కోరారు. ఆయనకు వంతెన నిర్మాణాలపై అవగాహన లేదు. కానీ ఊరి పెద్దల మాటను కాదనలేక... 'మీ సమస్యను తీరుస్తా, కానీ కొంత సమయం పడుతుంది' అని బదులిచ్చారు. తర్వాత ఓ స్నేహితుడి ద్వారా హరిద్వార్‌లోని 'లక్ష్మణ్‌ఝూలా' గురించి తెలుసుకున్నారు. అది 'సస్పెన్షన్ ఫుట్ బ్రిడ్జి'. ఇలాంటి వేలాడే వంతెనలకు మూలం శాన్‌ఫ్రాన్సిస్కోలోని 'గోల్డెన్ గేట్ బ్రిడ్జి'. దాంతో ఆ బ్రిడ్జి నిర్మాణం గురించి అధ్యయనంచేసి తాను కట్టదలచిన వంతెనకు నమూనా గీసుకున్నారు. దాన్ని సూరత్కాల్‌లోని 'నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ'లోని ఓ ప్రొఫెసర్‌కు చూపించారు. ఆయన డ్రాఫ్టును క్షుణ్ణంగా పరిశీలించి కొన్ని మార్పులు సూచించారు.

★ ★ ★

గిరీష్ 1989 జూన్‌లో అరంబూర్‌లో పాదచారుల వంతెన నిర్మాణం ప్రారంభించారు. 87 మీటర్లు పొడవైన ఆ వారధి నిర్మాణం మూడు నెలల్లో పూర్తయింది. రూ. లక్ష ఖర్చు. ఈ సొమ్మును గ్రామస్థులు చందాలు వేసుకొని కూడబెట్టారు. ఊరంతా బ్రిడ్జి పనుల్లో శ్రమదానం చేశారు. గిరీష్‌కూడా బ్రిడ్జి నిర్మాణానికి డబ్బు తీసుకోలేదు. వంతెన పూర్తయ్యాక గిరీష్‌కు ఆ గ్రామం జేజేలు పలికింది. అరంబూరు వంతెన కేవలం రెండు తీరాలను మాత్రమే కలపలేదు, ప్రజల ఉపాధి అవకాశాలను పెంచింది. వైద్యసేవలు సకాలంలో అందేలా ఉపయోగపడుతోంది. పైచదువులకు దారి చూపింది. అన్నాళ్లూ ఆ ఊరితో వియ్యమంటే నదిని భూతంగా చూపించిన వారి ఆలోచనల్లోనూ మార్పు వచ్చింది. కొద్దిరోజులకు అరంబూరు పర్యాటక ప్రాంతంగానూ పేరుతెచ్చుకుంది. చుట్టుపక్కల గ్రామాలూ పట్టణాల నుంచి జనం వంతెనను చూడ్డానికి గుంపులుగా వచ్చేవారు. అరంబూరు నేపథ్యంలో 'స్వాతి' అనే కన్నడ సినిమాను కూడా తీశారు. అందులో వేలాడే వంతెన, నది అందాలను చూపించారు. అరంబూరు వంతెన పనులు పూర్తవగానే సమీపంలోని అంచూర్‌లో ఇలాంటి వారధి నిర్మించే కాంట్రాక్టు గిరీష్‌కు వచ్చింది. అది కూడా స్వల్పవ్యవధిలో తక్కువ ఖర్చుతో పూర్తిచేశారు. ఇలా గిరీష్ గత 20 ఏళ్లలో కర్ణాటక, కేరళ, ఆంధ్రప్రదేశ్‌లలో సుమారు 100 బ్రిడ్జిలు నిర్మించారు. వీటిలో గ్రామస్థులు సొంతంగా నిర్మించుకున్నవీ, ప్రభుత్వ నిధులతో చేపట్టినవీ కూడా ఉన్నాయి. ఘటప్రభ నదిపై 220 మీటర్ల బ్రిడ్జి ఈయన నిర్మించిన వాటిలో అతి పొడవైనది.

★ ★ ★

మనరాష్ట్రంలో వరంగల్ జిల్లా బుస్సాపురం మండలంలోని లక్నవరం సరస్సుమీదా వేలాడే వంతెనను నిర్మించారు గిరీష్. ఈ నిర్మాణం పర్యాటకశాఖ ఆధ్వర్యంలో జరిగింది. సరస్సులో ఉండే ఒక దీవిపైకి వెళ్లడానికి ఈ వంతెన నిర్మించారు. లక్నవరం సరస్సు రామప్పగుడికి సమీపంలో ఉన్న పర్యాటక కేంద్రం.

నదికి ఇరువైపులా స్తంభాలను నిలబెట్టి వాటిమధ్య ఇనుప తీగల సపోర్టుతో వంతెనలు నిర్మిస్తారు గిరీష్. నది మధ్యలో ఎలాంటి స్తంభాలూ వేయరు కాబట్టి ఖర్చు బాగా తక్కువ. వంతెనపై నడిచే భాగాన్ని కలపతో లేదా ఫెర్రో సిమెంట్‌తో చేస్తారు. కొన్నిచోట్ల స్తంభాలు అవసరం లేకుండా అక్కడ ఉండే పెద్ద చెట్లనే స్తంభాలుగా ఉపయోగించి నిర్మిస్తారు. గిరీష్ నిర్మించే వంతెనలు నడకకు మాత్రమే ఉపయోగపడతాయి. ఒకవేళ ప్రభుత్వం రోడ్డు వంతెన మంజూరుచేస్తే ఈ బ్రిడ్జిని తొలగించినా 70 శాతం పరికరాలు మళ్లీ ఉపయోగపడతాయి. చాలా గ్రామాల్లో వంతెన నిర్మాణం సగం పూర్తయ్యాక డబ్బు సమకూరడంలేదని చెప్పిన సందర్భాలున్నాయి. ఒకట్రెండు చోట్ల గిరీష్ సొంత డబ్బుపెట్టి పూర్తిచేశారు. తర్వాత ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వచ్చి వంతెనల నిర్మాణం నుంచి తప్పుకోవాలనుకున్నా పల్లెప్రజల బాధలు చూసి ఆ పని చేయలేకపోయారు. ప్రస్తుతం గిరీష్ ఇరవై వంతెనల నిర్మాణపనుల్లో బిజీగా ఉన్నారు. గిరీష్ ఖ్యాతి దేశ సరిహద్దుల్ని దాటి భూటాన్‌నూ చేరుకుంది. పేద దేశమైన భూటాన్ నుంచి ఓ బృందం వచ్చి గిరీష్ దగ్గర పాఠాలు నేర్చుకొని వెళ్లింది.

'ఇప్పటివరకూ నిర్మించిన వంతెనల్లో ఇనుప తీగలు తుప్పుపట్టకుండా ఏటా రంగులు వేయాలి. భవిష్యత్తులో ఈ సమస్య లేకుండా చేయడానికి ప్రయత్నిస్తున్నాను. నావల్ల లక్షల మందికి మేలు జరుగుతోంది. అంతకంటే ఏం కావాలి' అంటారు గిరీష్ తృప్తిగా. ★



# కలవారి కూతురు...

నికోల్ దేవిస్... బ్రిటన్‌కు చెందిన ఈ పాప వయసు నాలుగు నెలలు. ఈ నాలుగు నెలల్లో పాప బట్టలూ ఇతర వస్తువుల కోసం వాళ్లమ్మ లిసా పెట్టిన ఖర్చెంతో తెలుసా... అక్షరాలా రూ.22 లక్షలు. ఆశ్చర్యంగా ఉంది కదూ! లేక లేక పుట్టిన తన కూతురికి అన్నీ అత్యుత్తమమైనవే ఇవ్వాలనుకుంది లిసా. అందుకే, నికోల్ రోజూ తొడిగే బట్టల దగ్గర్నుంచి, తను పడుకునే మంచం, తిరిగే స్ట్రోలర్, ఆటవస్తువులూ అన్నీ ఖరీదైనవీ, ప్రత్యేకంగా డిజైన్ చేయించినవే వాడుతోంది. నికోల్ ఉండే గదిని దాదాపు రూ.4.5 లక్షల ఖర్చుతో అందంగా తీర్చిదిద్దింది. ఇక పాప రోజూ వేసుకునే బట్టలను ప్రముఖ డిజైనర్‌తో కుట్టిస్తోంది. ఒక్కో డ్రెస్ ధర రూ.12 వేలకు తక్కువ ఉండదు. ముందు ముందు కూడా లిసా ఇలాగే తన కూతురికి కావల్సినవన్నీ ఖర్చుకు వెనకాడకుండా అమర్చుతుందట.



# మూడో కన్ను



న్యూయార్క్ యూనివర్సిటీ ప్రొఫెసర్ అయిన వాఫాబిలాల్ మతాఫ్‌లోని 'అరబ్ మ్యూజియం ఆఫ్ మోడర్న్ ఆర్ట్'లో ప్రదర్శించడానికి కొన్ని ఫొటోలు పంపాలనుకున్నాడు. దానికోసం తల వెనుక భాగంలో ఆపరేషన్ ద్వారా టైటానియం ప్లేట్‌ను అమర్చుకుని అయస్కాంతం సహాయంతో అందులో కెమేరాను బిగించాడు. ఈ కెమేరా ప్రతి నిమిషానికీ ఓ ఫొటోను తీసి మ్యూజియం వెబ్‌సైట్‌కి పంపిస్తుంది. 'ఆ ఫొటోలేదో నేరుగానే తీయొచ్చుగా ఇలా గాయం చేయించుకుని బాధను భరిస్తూ తల్లో కెమేరా పెట్టుకోవడమెందుకు' అనిపిస్తోంది కదూ! అలా తీస్తే సహజత్వం ఉండదట. తనకు తెలియకుండా కెమేరానే రకరకాల ఫొటోలు తీస్తే 'అదో థ్రిల్' అంటాడు బిలాల్. అందుకే, 'ది థర్డ్ ఐ' పేరుతో తల్లో కెమేరాను అమర్చాడు. ఇది బిలాల్ ఎక్కడికెళ్లినా ఏం చేసినా అతని వెనుక నుంచి కనిపించిన వాటినన్నిటినీ క్లిక్‌మనిపిస్తుంది. బిలాల్ కెమేరా తీసే ఈ ఫొటోలను త్వరలోనే అరబ్ మ్యూజియంలో ప్రదర్శిస్తారట.



# ఇదో వింత మ్యూజియం

తైవాన్‌లోని కిన్‌మెన్ ద్వీపంలో ఈమధ్య 'ది స్పెషల్ టీ హౌస్' పేరుతో ఓ మ్యూజియంను ప్రారంభించారు. అలా అని ఇందులో ఏవో అపురూపమైన వస్తువులను ప్రదర్శనకు ఉంచారు అనుకుంటే మనం పొరబడినట్లే. చైనాకు సరిహద్దు ప్రాంతమైన ఈ ద్వీపంలో ఒకప్పుడు వేలమంది తైవాన్ సైనికులు కాపలా కాసేవారు. ఆ సమయంలో సైన్యం కోసం 11మంది మహిళలతో ఏర్పాటుచేసిన వ్యభిచార గృహమే ఈ టీ హౌస్. స్థానిక మహిళలు దీన్ని వ్యతిరేకిస్తూ నిరసన తెలపడంతో 1990 సంవత్సరంలో మూసేశారు. ఆ తర్వాత సైన్యం కూడా అక్కడి నుంచి వచ్చేసింది. ఇన్నాళ్లకు మళ్లీ ఆ వ్యభిచార గృహం టీ హౌస్ మ్యూజియం పేరుతో తెరుచుకుంది. పర్యాటకులకు మిలటరీ ప్యారడైజ్‌లు ఎలా ఉంటాయో తెలియజేయాలనే ఉద్దేశంతో దీన్ని ప్రారంభించారట. దీన్లో అప్పట్లో టీ హౌస్‌లో ఉన్న మహిళల ఫొటోలూ, వ్యభిచారగృహానికి వెళ్లడానికి సైనికులకు ఇచ్చే టిక్కెట్లనూ ప్రదర్శనకు ఉంచారు. ఇలాంటి మ్యూజియంలు కూడా ఉంటాయంటే ఆశ్చర్యం కలగక మానదు.





# ఎంత గొప్ప ప్రేమో!

హావెన్జిన్... చైనాలో ఉండే ఈమె పేరు తెలియని జంతుప్రేమికులు అరుదనే చెప్పాలి. వీధి కుక్కలూ పిల్లులమీద ఆమెకున్న ప్రేమ అంత గొప్పది. ప్రస్తుతం వెన్జిన్ షెల్టర్‌లో పదిహేను వందల కుక్కలూ, రెండువందల పిల్లులూ ఆశ్రయం పొందుతున్నాయి. వీటి పోషణకు ఆమెకు ఏడాదికి అయ్యే ఖర్చు రూ.22 లక్షల పైనే. మొదట ఖాళీ సమయంలో కాలక్షేపం కోసం కొన్ని కుక్కల్ని చేరదీసింది వెన్జిన్. ఆ తర్వాత వాటి సంఖ్య పదుల నుంచి వందలకు పెరగడంతో కుక్కల్ని చూసుకోవడానికి ఉద్యోగం మానేసింది. వాటి పోషణకు ఇల్లూ, కారు, నగలూ అన్నిటినీ అమ్మేసింది. ఆమె సేవను గుర్తించి ఎంతోమంది స్వచ్ఛందంగా సహాయం అందించడం మొదలుపెట్టారు. అలా వచ్చిన విరాళాలతోనే ప్రస్తుతం ఈ యానిమల్ షెల్టర్ నడుస్తోంది. ఈమధ్యే ఈ షెల్టర్‌ను మరోచోటికి తరలించాల్సి వస్తే సహాయం చేయడానికి ఎందరో వలంటీర్లు ముందుకొచ్చారట. ఎంతటి జంతుప్రేమో!





# కళ్లజోడుతో కళ్లెం

కోడి పుంజులంటేనే పౌరుషానికి మారుపేరుగా చూస్తారు. ఒకసారి కయ్యానికి కాలు దువ్వాయంటే ప్రాణాలు పోతున్నా పోరాడటం ఆపవు మరి. పందేలు వేసుకోవడానికి ఈ పౌరుషం బాగానే పనికొస్తుంది కానీ ఫారమ్‌లో పెంచే కోడిపుంజులు ఇలా కొట్టుకుని చనిపోతే కష్టమే కదా. అసలే చైనాలో ఫారంలోని పుంజుల్ని కూడా పగటిపూట ఫీల్డ్‌లోకి స్వేచ్ఛగా వదిలేస్తుంటారు. అవి చూస్తేనేమో రక్తం కారేలా ప్రాణం పోయేలా పొడుచుకుంటున్నాయట. అందుకే, ఈ సమస్యకు పరిష్కారంగా చెంగ్డు ప్రాంతంలోని కోళ్లఫారమ్‌ల యజమానులు పుంజులకు రంగు రంగుల కూలింగ్ కళ్లజోడులు పెట్టేశారు. ఈ రంగుల అద్దాల్లో నుంచి బయటి వాతావరణం అంతా కొత్తగా కనిపిస్తుంది, పైగా పుంజులు ఒకదాన్నొకటి స్పష్టంగా చూసుకోలేవు, కాబట్టి పొడుచుకోవనేది వారి ఆలోచన. కళ్లజోడులు పెట్టాక పుంజులు నిజంగానే కాస్త నిదానించాయట. ముందు ముందు కూడా అవి ఇలానే ఉంటే మిగిలిన ప్రాంతాలవారు తమ పుంజులకూ ఈ కళ్లజోడులను తగిలించేయాలని చూస్తున్నారు.



# పనిలేని ఉద్యోగాలు

**రకరకాల చాక్లెట్లూ, స్వీట్లను రుచి చూడాలి. ఖరీదైన మంచాల మీద నిద్రపోవాలి. అందమైన పర్యాటక ప్రదేశాలను చుట్టి రావాలి. విలాసవంతమైన హోటళ్లలో బస చేయాలి. ఇవన్నీ మధ్య తరగతి మనిషి కోరికలు కాదు, 50వేల నుంచి లక్షల రూపాయల జీతాన్ని అందించే ఉద్యోగాలు!**


హ్యారీ

అట్లాంటాకు చెందిన హార్డీ వాల్లెస్ రోజూ ఆఫీసుకు వెళ్లి 20 నుంచి 50 రకాల 'వైన్'లను రుచి చూస్తాడు. వేరే పనే ఉండదు. నెలయ్యేసరికి అతని అకౌంట్‌లోకి 45లక్షల రూపాయల జీతం వచ్చి చేరుతుంది. ఆఫీసుకు వెళ్లి మందు కొట్టినందుకు అంత జీతమా అని మనలాంటి వారికి ఆశ్చర్యంగానే అనిపిస్తుంది. కానీ ఇలా ఏ పనీ చేయకుండా తింటూ, తాగుతూ, ఆడుతూ, నిద్రపోతూ జీతం సంపాదించే ఉద్యోగాలూ ఉన్నాయి. అలాంటివే ఈ టేస్టర్, టెస్టర్ ఉద్యోగాలు. వీటిలో స్వీట్లూ, చాక్లెట్లూ, ఐస్‌క్రీములూ, వైన్, బీర్‌లాంటి ఆహార పదార్థాల రంగూ రుచీ వాసనలు చూసి వాటి నాణ్యతను నిర్ణయించే ఉద్యోగాలు చేసే వారిని టేస్టర్స్ అంటారు. ఇక, గృహోపకరణాల నాణ్యతను పరీక్షించడం, అందమైన పర్యాటక ప్రదేశాల్ని ఎంపిక చేయడం, హోటళ్లలో వసతి సదుపాయాల గురించి విశ్లేషించడంలాంటివి టెస్టర్ ఉద్యోగాల్లోకి వస్తాయి.

అలాంటివి కొన్ని...

### స్వీట్ టేస్టర్

డెర్బీషైర్‌కు చెందిన పన్నెండేళ్ల హ్యారీ విల్లర్ పోటీలో ఎంతోమందిని వెనక్కునెట్టి బ్రిటన్‌లోని 'స్విజ్జిల్స్ మాత్లో' స్వీట్ల కంపెనీలో స్వీట్ టేస్టర్‌గా ఎంపికయ్యాడు. తనకు నచ్చిన కొన్ని స్వీట్ల రుచి, వాసన గురించి వివరించి చెప్పినందుకు అతనికీ ఉద్యోగం వచ్చింది. అలా 12 నెలల పాటు ఆ కంపెనీ పంపించే రకరకాల స్వీట్ల నాణ్యతను విశ్లేషించినందుకు హ్యారీకి స్వీట్లతోపాటు 40 వేల జీతం అదనం.

### చాకొలేట్ టేస్టర్

'సాలీ మెకిన్నన్' టెస్కో కంపెనీ తరపున వివిధ సూపర్ మార్కెట్లకు పండుగల సమయంలో చాక్లెట్ టేస్టర్‌గా పనిచేస్తోంది. ఖర్చు లేకుండా వేరు వేరు దేశాలు తిరుగుతూ చాక్లెట్లు రుచి చూసి నాణ్యత గురించి చెప్పినందుకు ఆమె నెలకు 15లక్షల రూపాయలకు పైగా జీతం అందుకుంటోంది.

### లగ్జరీ బెడ్ టెస్టర్

బర్మింగ్‌హామ్ యూనివర్సిటీ విద్యార్థి 'రోసిన్ మడిగన్' బెడ్ టెస్టర్. సైమన్ హార్న్ కంపెనీ తయారుచేసే విలాసవంతమైన మంచాలమీద విశ్రాంతి తీసుకుని అవి ఎంత సౌకర్యంగా ఉన్నాయో వివరిస్తూ బ్లాగులో రాసినందుకు ఆమె అందుకునే జీతం నెలకు 72వేల రూపాయలు.

### వాటర్ స్లైడ్ టెస్టర్

లివర్‌పూల్‌కు చెందిన 'టామీ లించ్' బ్రిటిష్ వెకేషన్ కంపెనీ 'ఫస్ట్ ఛాయిస్'లో వాటర్ స్లైడ్ టెస్టర్. వివిధ దేశాల్లోని హోటల్స్, రిసార్ట్స్, పార్కుల్లో ఉండే 'వాటర్ స్లైడ్స్'లో ఆడుతూ వాటి ఎత్తు, నీటి పరిమాణం, అందులోని రక్షణ ఏర్పాట్ల గురించి వివరించి నెల నెలా ఆరంకెల జీతం అందుకుంటాడు టామీ.

### హనీమూన్ టెస్టర్

ఐరిష్ టూరిజం కంపెనీ 'రన్ అవే బ్రైడ్ అండ్ గ్రూమ్' పేరుతో కొత్తగా పెళ్లైన జంటలకు అప్పుడప్పుడూ పోటీలు నిర్వహిస్తుంటుంది. అందులో విజేతలైన వారిని హనీమూన్ టెస్టర్స్‌గా ఎంపిక చేస్తుంది. దీన్లో భాగంగా ఆ జంట కంపెనీ డబ్బులతో వివిధ పర్యాటక ప్రాంతాలను చుడుతూ అందమైన, రొమాంటిక్ పర్యాటక స్థలాల గురించి సోషల్ నెట్‌వర్కింగ్ సైట్లో రాయాలి. బ్రిటన్‌కు చెందిన మార్క్, డెనిస్ డఫ్ఫీల్డ్‌లు ఈమధ్యే హనీమూన్ టెస్టర్స్‌గా ఎంపికై ఆరునెలల పాటు ఉచితంగా వివిధ పర్యాటక ప్రాంతాలను చుడుతూ 12లక్షల రూపాయలను జీతంగా అందుకునే అవకాశాన్ని పొందారు.

### ఇంకా...

ఇవే కాదండోయ్, బీర్ టేస్టర్, కాఫీ, టీ, ఐస్‌క్రీమ్ లాంటి రకరకాల టేస్టర్ ఉద్యోగాలున్నాయి. వీటిలో కేవలం ఆహార పదార్థాల రుచులు చూసి వాటి లోపాలు వివరిస్తూ ఏ పదార్థాలు వేస్తే ఇంకా రుచిగా ఉంటాయో చెబితే చాలు, లక్షల్లో జీతాలు అందిస్తున్నాయి కంపెనీలు. ఇలాంటి ఉద్యోగాలకు కొన్ని కంపెనీలు 'ఫుడ్ సైన్స్' విభాగంలో డిగ్రీ చేసిన వారిని ఎంపిక చేసుకుంటుంటే మరికొన్ని ఏ విద్యార్హతతో పనిలేకుండా ఆ ఉద్యోగానికి కావల్సిన ప్రతిభ ఉన్నవారెవరొచ్చినా ఎంపిక చేస్తున్నాయి. ఈ ఫుడ్ టేస్టర్స్‌ను కొన్ని కంపెనీలు, ఫుడ్‌ల్యాబ్స్ దీర్ఘకాలికంగా నియమించుకుంటే మరికొన్ని తాత్కాలికంగా ఆరు నెలలు, పదినెలలకోసం నియమించుకుంటాయి. ఫుడ్ టేస్టర్ ఉద్యోగులకు అమెరికాలో ఏడాదికి ముప్ఫై నుంచి యాభైలక్షల రూపాయల వరకూ జీతంగా చెల్లిస్తున్నాయి కంపెనీలు. ఇక ఫిట్‌నెస్ 'గురు'ల్లా ఫ్లేవర్ గురూలు కూడా ప్రత్యేకంగా ఉంటారు. వీళ్లు కుకీస్, పిజ్జా, బర్గర్, చాక్లెట్ లాంటి అన్ని రకాల పదార్థాలనూ రుచి చూసి ఏ పదార్థం వెయ్యాలో ఏది తగ్గించాలో కచ్చితంగా చెబుతుంటారు. ఇలాంటి వారిని కంపెనీల యజమానులూ రెస్టారెంట్ల నిర్వాహకులూ ఎప్పటికప్పుడు పిలిచి గంటకు 20నుంచి 50వేల రూపాయల వరకూ ముట్టజెబుతుంటారు. ఫుడ్ టేస్టర్ ఉద్యోగాల్లానే ఫర్నిచర్ టెస్టర్, వీడియోగేమ్ టెస్టర్, టాయ్ టెస్టర్ లాంటి రకరకాల ఉద్యోగాలున్నాయి. ఫర్నిచర్ టెస్టర్ ఉద్యోగాల్లో మంచాలూ బెడ్‌ల మీద విశ్రాంతి తీసుకుని అవి ఎంత సౌకర్యంగా ఉన్నాయో వివరిస్తారు. అలాగే వీడియో గేమ్, టాయ్ టెస్టర్స్ వీడియోగేమ్స్‌తోనూ, రకరకాల బొమ్మలతోనూ ఆడి వాటిలో లోపాలు తెలుపుతూ ఇంకా బాగా రూపొందించడానికి సలహాలు ఇస్తారు.

అదండీ సంగతి, ఒళ్లొంచి కష్టపడకుండా హాయిగా తింటూ తిరుగుతూ ఆడుతూ కూడా బోలెడన్ని డబ్బులు సంపాదించవచ్చన్నమాట. ★


మార్క్, డెనిస్


టామీ లించ్

# చక్కెర లేని స్వీటు తిందామా!

రుచి అభిరుచి



## హనీ కేక్

### కావలసినవి

**తేనె:** పావులీటరు, **వెన్న:** అరకప్పు, **కోడిగుడ్లు:** మూడు, **ఆరెంజ్‌పీల్**(ఆరెంజ్ తొక్కల తురుము): టీస్పూను, **ఆరెంజ్‌జ్యూస్:** పావులీటరు, **మైదా:** పావుకిలో, **బేకింగ్‌పౌడర్:** 3 టీస్పూన్లు, **బేకింగ్‌సోడా:** అరటీస్పూను, **ఉప్పు:** అరటీస్పూను, **దాల్చినచెక్కపొడి:** టీస్పూను, **బాదంపొడి:** అరకప్పు, **తేనె:** మరో అరకప్పు

### తయారుచేసే విధానం

★ ఓవెన్‌ను ముందుగానే 180 డిగ్రీల సెంటీగ్రేడు దగ్గర వేడిచేసి ఉంచుకోవాలి.

★ సుమారు పది అంగుళాల ఎత్తు ఉన్న కేకుటిన్నుకి నెయ్యి రాసి మైదాపిండి చల్లి పక్కన ఉంచాలి. మైదాలో బేకింగ్ పౌడర్, బేకింగ్ సోడా, ఉప్పు, దాల్చినచెక్క పొడి వేసి కలపాలి.

★ మరో గిన్నెలో కోడిగుడ్ల సొన వేసి బాగా గిలకొట్టాలి. అందులోనే తేనె, వెన్న, ఆరెంజ్‌జ్యూస్ వేసి బాగా కలపాలి. తరవాత బాదంపొడి కూడా వేసి కలిపి ఈ మిశ్రమాన్ని మైదా మిశ్రమంలో వేసి బాగా కలపాలి.

★ ఇప్పుడు ఈ మొత్తం మిశ్రమాన్ని నెయ్యి రాసిన కేకు టిన్నులో వేసి ఓవెన్‌లో పెట్టి సుమారు ముప్పావుగంటసేపు బేక్ చేయాలి. చల్లారిన తరవాత ముక్కలుగా కోసి మరో అరకప్పు తేనెను కేకుమీద పోసి అందించండి.

## మోదు పుళి



### కావలసినవి

**మైదాపిండి:** పావుకిలో, **నూనె:** వేయించడానికి సరిపడా, **పాలు:** అర లీటరు, **కొబ్బరితురుము:** కప్పు, **తేనె:** 2 టేబుల్‌స్పూన్లు

### తయారుచేసే విధానం

★ ఓ గిన్నెలో మైదా వేయాలి. అందులో 4 టేబుల్‌స్పూన్లు నూనె వేసి బాగా కలపాలి. తరవాత చల్లని నీళ్లు తగినన్ని వేసి చపాతీపిండిలా కలుపుకోవాలి. ఇప్పుడు పిండి ముద్దని చిన్నచిన్న ఉండలుగా చేసి పక్కన ఉంచాలి. బాణలిలో పాలు, కొబ్బరితురుము వేసి పాలన్నీ ఆవిరయ్యేవరకూ ఉడికించి దించాలి. ఇప్పుడు తేనె వేసి కలపాలి.

★ మైదా ఉండల్ని చిన్న చిన్న పూరీల్లా వత్తి అందులో టేబుల్‌స్పూను చొప్పున కొబ్బరి మిశ్రమాన్ని పెట్టి కజ్జికాయల మాదిరిగా వత్తాలి.

★ ఇప్పుడు బాణలిలో నూనె పోసి కాగిన తరవాత నాలుగైదు చొప్పున వేసి తక్కువ మంటమీద వేయించి తీయాలి. షుగర్ ఫ్రీ కజ్జికాయలు రెడీ.

## వతలప్పం

### కావలసినవి

**కోడిగుడ్లు:** నాలుగు (తెల్లసొన మాత్రమే తీసుకోవాలి), **బెల్లంపాకం:** 2 టేబుల్‌స్పూన్లు(చిన్నగిన్నెలో బెల్లం తురుము వేసి చిక్కని పాకం రానివ్వాలి), **పాలు:** అరకప్పు, **యాలకులపొడి:** అరటీస్పూను, **కొబ్బరిపాలు:** అరకప్పు, **కెరామల్‌సిరప్:** 2 టీస్పూన్లు

### తయారుచేసే విధానం

★ కేకుటిన్నులో అడుగున కెరామల్ సిరప్(పంచదార ద్రావణం)వేయాలి.(ఇది నేరుగా మార్కెట్లో దొరుకుతుంది. లేదంటే ఇంట్లోనే చేసుకోవచ్చు. అదెలా అంటే, మందపాటి బాణలిలో కప్పు పంచదార వేసి కరగనివ్వాలి. అది కరిగి లేత గోధుమరంగులోకి మారుతుంది. కరిగేటప్పుడు పంచదార గిన్నెకు అంటుకుని మాడకుండా ఉండేలా మధ్యమధ్యలో గిన్నెను పైకి తీయాలి. మరీ ముదురురంగులోకి మారక ముందే కప్పు నీళ్లు పోసి ఐదునిమిషాలు మరి గించి తీస్తే అదే కెరామల్ సిరప్. దీన్ని ఓ బాటిల్‌లో పోసి నిల్వ చేసుకుని ఎప్పుడంటే అప్పుడు వాడుకోవచ్చు).



వతలప్పం

★ విడిగా మరో గిన్నెలో గుడ్డు తెల్లసొనలు వేసి బాగా గిలకొట్టాలి. అందులో కొబ్బరిపాలు, కాచి చల్లార్చిన పాలు, బెల్లంపాకం వేసి బాగా గిలకొట్టాలి. తరవాత యాలకులపొడి చల్లాలి. ఈ మిశ్రమాన్ని కెరామల్ సిరప్ వేసి ఉంచిన కేకుటిన్నులో పోసి 160 డిగ్రీల సెంటీగ్రేడు దగ్గర సుమారు అరగంట సేపు బేక్ చేయాలి. ఉడికిన తరవాత బయటకు తీసి చల్లారాక ఫ్రిజ్‌లో పెట్టి ఓ గంటసేపు ఉంచి తీసి వడ్డించాలి.

## గుమ్మడి స్వీట్

**కావలసినవి:** పండిన గుమ్మడికాయ తురుము: కప్పు, **కోవా:** కప్పు, **జీడిపప్పు, పిస్తా, బాదం పప్పులు:** అరకప్పు, **నెయ్యి:** రెండు టేబుల్‌స్పూన్లు, **సిల్వర్‌పేపర్:** ఒకటి

**తయారుచేసే విధానం:** జీడిపప్పు, పిస్తా, బాదంపప్పుల్ని సన్నగా తరగాలి. వీటిని బాణలిలో వేసి నేతిలో వేయించితీయాలి.

★ మందపాటి బాణలిలో గుమ్మడితురుము, కోవా వేసి తిప్పుతూ ఉడికించాలి. మిశ్రమంలోని నీరంతా పూర్తిగా ఇంకిపోయేవరకూ ఉడికించాలి. ఇప్పుడు వేయించిన పప్పులూ, టేబుల్‌స్పూను నెయ్యీ వేసి కలపాలి.

★ ప్లేటుకి నెయ్యి రాసి మిశ్రమాన్ని అందులో వేసి అట్లకాడతో సమంగా సర్ది, చల్లారిన తరవాత ఈ ప్లేటుని ఫ్రిజ్‌లో రెండు గంటలసేపు ఉంచాలి.

★ మిశ్రమం బాగా గట్టిపడిందనుకున్న తరవాత బయటకు తీసి వెండికాగితంతో అలంకరించి ముక్కలుగా కోసి అందించాలి.



గుమ్మడి స్వీట్

### వంటచేయడం ఇష్టమేనా?

కిచెన్‌లో కొత్త ప్రయోగాలు చేయడం అంటే మీకు ఇష్టమేనా. తరచూ భిన్న రుచులతో ఇంటిల్లిపాదినీ అలరిస్తుంటారా. అయితే ఇంకేం... మీ రుచుల్ని లక్షలాది పాఠకులతో పంచుకోండి. మీ ఆసక్తినీ అభిరుచినీ తెలిపే వంటల్ని ఫొటోలతో సహా 'ఈనాడు ఆదివారం' అనుబంధానికి పంపించండి. మీ పాస్‌పోర్టు సైజు కలర్ ఫొటోతోపాటు సెల్ఫ్ అడ్రస్ కవర్ జతచేయడం మర్చిపోకండి.

ఏవైనా సందేహాలుంటే **040-23318181**కు ఫోన్ చేయండి.

# బాల వినోదిని



## ప్రతిబింబం



ఇక్కడున్నవి నాలుగు గడియారాల ప్రతిబింబాలు. వీటిలో ఏ గడియారం రెండు గంటల నలభై నిమిషాలు చూపిస్తుందో చెప్పగలరా?

## ఏ రంగు?

ఈ చదరంలో గులాబీ, ఆకుపచ్చ రంగుల్లో ఏది ఎక్కువ భాగం ఆక్రమించింది.



## ఏ రెండూ



వీటిలో ఏ రెండు భాగాల్ని కలిపితే పైఆకారం వస్తుంది?





# జతచేయండి

**చి**త్రంలో పరస్పరం సంబంధం ఉన్న వస్తువులు కొన్ని ఉన్నాయి. ఉదాహరణకు కోడి-గుడ్డు. ఇంకా అలాంటి జతలేమిటో చెప్పండి.



# 'జిమ్ కార్బెట్'లో షికారు!







రామ్‌గంగానదీ సోయగం...

**'ఆదమరిచి ఉంటే ఏ మూలనుంచి పులిమీదకి దూకుతుందో... దగ్గరకు వెళ్లామన్న కోపంతో ఏ ఏనుగు తొండం విసురుతుందో... కోతి వచ్చి కెమెరా ఎత్తుకుపోదు కదా... ఇలా క్షణక్షణం ఉత్కంఠను రేకెత్తించేలా పర్యటించాలనుకుంటున్నారా... అయితే మీరూ వన్యప్రాణుల సంరక్షణకేంద్రాలకు బయలుదేరండి' అంటున్నారు జిమ్ కార్బెట్ నేషనల్ పార్కును సందర్శించిన భారతీ చంద్రశేఖర్.**

నాకూ మా బాబుకీ వన్యప్రాణులంటే ఎంతో ఇష్టం. మా ఇష్టాన్ని కాదనకుండా మావారు దేశంలోని అన్ని అడవులకూ తీసుకువెళ్తుంటారు. ఈసారి జిమ్‌కార్బెట్ నేషనల్ పార్క్‌కు వెళ్లాం. ఇది దేశంలోకెల్లా పురాతనమైన వన్యప్రాణి సంరక్షణకేంద్రం. హైదరాబాద్ నుంచి విమానంలో ఢిల్లీ చేరుకుని అక్కడ నుంచి రోడ్డుమార్గాన అడవికి చేరుకున్నాం. ఇది నైనిటాల్, పౌరీగఢ్వాల్, బిజ్నూర్ జిల్లాల మధ్యలో ఉంది. సుమారు 1318 కి.మీ. విస్తీర్ణంలో విస్తరించిన ఈ అడవిలో 798 కి.మీ.లలో నేషనల్ పార్కునూ మిగిలిన ప్రదేశంలో రిజర్వ్ ఫారెస్టనూ సోనా నది వైల్డ్‌లైఫ్ శాంక్చ్యురీనీ ఏర్పాటుచేశారు.

## క్రూరమృగాలకు సింహస్వప్నం

ప్రవేశద్వారం దగ్గరున్న బోర్డు చూడగానే కార్బెట్ నేపథ్యం కళ్లముందు మెదిలింది... నైనిటాల్‌కు చెందిన ఎడ్వర్డ్ జేమ్స్ జిమ్‌కార్బెట్ బ్రిటిష్ ఇండియన్ ఆర్మీలో కల్నల్‌గా పనిచేసేవాడు. వృత్తిరీత్యా సైనికుడు ప్రవృత్తిరీత్యా ప్రకృతి ఆరాధకుడు. మంచి వేటగాడు. అప్పట్లో ఆయన ఇంటికి దగ్గరలో పెద్ద అడవి ఉండేది. అందులో పులులూ చిరుతలూ చాలా ఎక్కువగా ఉండేవి. అవి సమీప గ్రామాల మీద దాడి చేసి ప్రజలనూ పశుపక్ష్యాదుల్నీ చంపేస్తుండేవి. దాంతో అక్కడి ప్రజలు భయభ్రాంతులకు గురయ్యేవారు. వీటి బారినపడి సుమారు 1200 మంది ప్రజలు మరణించారట. దాంతో వాటి నుంచి ప్రజలను రక్షించేందుకు ఒంటరిగానే వేటకు వెళ్లేవాడు జిమ్. అలా జిమ్ కార్బెట్ వేటాడి చంపిన మానవ హంతక క్రూరమృగాల సంఖ్య 33. మనుషులను చంపే ఈ క్రూరమృగాలను వేటాడి చంపడంవల్ల అక్కడి ప్రజలు జిమ్‌ను ఎంతగానో అభిమానించి ఆరాధించేవారు. అలా ఆయన గౌరవార్థం ఈ అడవికి 1957లో 'జిమ్ కార్బెట్ నేషనల్ పార్క్' అని పేరు పెట్టారు.

కారు దిగి చుట్టూ చూస్తే... సతతహరితారణ్యాలను తలపించే పచ్చని పచ్చికబయళ్లు, దూరంగా కనిపించే ఎత్తైన కొండలూ నదీ పాయలూ వాగులూ వంకలతో అడవి ఎంతో అందంగా కనిపించింది. ఈ అడవి మొత్తం హిమాలయాలకు వెలుపలి భాగంలో ఉంటుంది. గంగానదికి ఉపనది అయిన రామగంగా జిమ్‌కార్బెట్‌కు తూర్పు నుంచి పశ్చిమంగా ప్రవహిస్తూ అడవి అందాలను ప్రతిబింబిస్తుంటుంది. ఉత్తరాన హిమాలయ పర్వతాలూ దక్షిణాన శివాలిక్ కొండలూ మధ్యలో జిమ్‌కార్బెట్ పార్క్... ఇందులోనే రామగంగా, కోసీ, సోనానది, మండల్, పలయన్ నదీప్రవాహాలు... అందుకే సంవత్సరం పొడవునా ఆహ్లాదకరమైన వాతావరణంతో అలరారుతుంటుందీ ప్రాంతం. చలికాలంలో ఉష్ణోగ్రతలు 5 డిగ్రీల సెంటీగ్రేడుకి పడిపోతాయి. ఆ సమయంలో తొలి సంధ్యలో అడవంతా మంచుతో కప్పబడిపోయి పర్యాటకులకు మరోలోకంలో ఉన్న అనుభూతినిస్తుంది. వేసవిలో అయితే ఉష్ణోగ్రతలు 35 డిగ్రీలు దాటవు. ఇక్కడ సుమారు 488 రకాల వృక్షజాతులు ఉన్నాయట.

అడవిలో మేం జిమ్స్ జంగల్ రిట్రీట్ అనే రిసార్టులో బస చేశాం. ఆరోజు సాయంత్రం భోజనం చేసి ప్రయాణబడలిక తీర్చుకున్నాం. మరుసటిరోజు ఉదయం 6 గంటలకల్లా రెడీ అయి సఫారీకి బయలుదేరాం. ప్రతిరోజూ మూడుసార్లు సఫారీ ఉంటుంది. టాప్‌లెస్ జీపులో ముందు సీటులో కెమెరా పట్టుకుని రెడీగా కూర్చున్నాడు మా బాబు. మా అదృష్టం బాగున్నట్లుంది... బయలుదేరగానే ఏనుగుల స్వాగతం లభించింది. భారీ ఏనుగుల్ని ఎంతో దగ్గరగా చూశాం. ఆ ఠీవి, రాజసం, భారీ ఆకారం చూస్తుంటే అడవికి రారాజు అంటే ఏనుగేనేమో అనిపించింది. ఆరోజు సఫారీలో ఏనుగులతోపాటు చిరుతలు, ఎలుగుబంట్లు, నక్కలు, మొరిగే లేళ్లు, నెమళ్లు, మానిటర్



లిజార్డ్, చుక్కల లేళ్లు, రంగురంగుల పక్షులు... ఇలా చాలానే కనిపించాయి. సుమారు 600 రకాల జంతుజాతులూ 580 పక్షిజాతులూ 25 సరీసృపజాతులూ ఇక్కడ ఉన్నాయి. బెంగాల్ టైగర్లకు ఇది పెట్టింది పేరయినా చుట్టుపక్కల వాతావరణంలో కలిసిపోయి(కెమోఫ్లేజ్)అవి త్వరగా కనిపించవు. తిరిగి తిరిగి అలసిపోయి రిసార్ట్స్‌కు చేరుకున్నాం.

### *జీపు పక్కనే పులి!*

మేం వచ్చేసరికి మా రిసార్ట్స్ మేనేజర్ జెస్సీ పరిగెత్తుకుంటూ వచ్చాడు. విషయమేంటాని చూస్తే మా రిసార్ట్స్ వెనకాలే అడవిలో ఓ పులి జింకను చంపేసి దాచిందన్న సమాచారం వచ్చిందన్నాడు. అంతే... మేమంతా ఎంతో ఉత్సాహంగా ఆత్రంగా అడవిలోకి పరుగులు తీశాం. అప్పటికే ఓ జీపును మాకోసం పార్కుచేసి చెట్టుకొమ్మలతో కనబడకుండా దాచి ఉంచాడు. ముందుగా దాచిన లేడిని ఓసారి చూసి పులి ఇంకా రాలేదని నిర్ధరించుకుని జీపులో కూర్చొన్నాం. కూతవేటు దూరం నుంచి అదేపనిగా అలారం కాల్స్ వస్తున్నాయి. పులులు, చిరుతలు వస్తుంటే కోతులు, చింపాంజీలు, లేళ్లు అరిచే అరుపులు అన్నమాట. ఈ కాల్స్ వస్తున్నాయంటే పులులు ఆ సమీపంలో సంచరిస్తున్నాయని అర్థం. జెస్సీ ఆ పులి గురించి చెప్పిన విషయాలు ఆసక్తికరంగా అనిపించాయి. అది రెండేళ్ల పులిపిల్ల. నాన్నపులి చనిపోయింది. అమ్మపులి మిగిలిన మగపులుల నుంచి రక్షణ ఉండదన్న ఉద్దేశంతో దాన్ని ఒంటరిగా వదిలేసింది. ఆడపులితో జతకట్టాలంటే పిల్లపులులు అడ్డుగా ఉంటాయన్న ఉద్దేశంతో మగపులులు వాటిని చంపేస్తుంటాయి. అలా వదిలేసిన ఈ చిన్నపులులు కష్టపడి వేటాడటం నేర్చుకుంటాయి. అలా వేటాడి తెచ్చుకున్న నీల్‌గయ్ అనే జింకను ఈ పొదల్లో దాచుకుందన్నమాట. దాచుకున్నవాటిని సద్దుమణిగాక రాత్రిపూట తీరిగ్గా తింటాయి.

అదెప్పుడు వస్తుందాని మేమంతా జీపులో కాచుకుని కూర్చున్నాం. మాకేమో ఆకలి వేస్తుంది. అది ఎంతకీ రాకపోయేసరికి జీపును అక్కడే వదిలేసి కాలినడకన వెనక్కి బయలుదేరాం. అప్పుడు కూడా అలారం కాల్స్ వస్తూనే ఉన్నాయి. అయినా వెనక్కి తిరిగి చూడకుండా బయలుదేరాం. డిన్నర్‌కోసం అలా కూర్చున్నామో లేదో వెనకనుంచి చాలా తీవ్రంగా కాల్స్ మొదలయ్యాయి. సిబ్బంది కూడా వైర్‌లెస్‌లో పులి వస్తుందని నిర్ధరించారు. అంతే... మా బాబు హఠాత్తుగా 'లెట్స్ గో' అంటూ అడవిలోకి పరిగెత్తాడు. ఏమీ తోచక కర్రపట్టుకుని జెస్సీ, ఆ వెనకాలే మేమూ పరుగెత్తాం. అప్పటికి సమయం రాత్రి 9 గంటలు. వెన్నెలకాంతే వెయ్యి వోల్టుల బల్బులా ఉంది. ఎలాంటి భద్రత లేకుండా టార్చి కూడా లేకుండా పరిగెత్తుతూ జీపు దగ్గరకు చేరుకుని బిక్కుబిక్కుమంటూ కూర్చున్నాం. అప్పుడు కనిపించింది పులి... మా జీపు పక్కనే మమ్మల్నే చూస్తూ... క్షణకాలం మా అందరికీ గుండె ఆగినంత పనయింది. ఎక్కడ మామీద దాడిచేస్తుందోనని అందరిలోనూ ఒక్కటే ఉత్కంఠ. ఆ ఉద్వేగాన్ని ఆపుకోలేక మేం పెట్టిన కేకలకు అది పొదల్లోకి దూరింది. కెమెరాకు చిక్కలేదన్న ఆదుర్దాతో జెస్సీ జీపును స్టార్ట్ చేశాడు. వెనక టైర్‌కి పెద్దరాయి అడ్డుపడి జీపు ఆగిపోయింది. ఇక లాభం లేదని దిగి తొయ్యమన్నాడు. పులి వెనకాల పొదల్లోనే ఉందని మాకు తెలుసు. దాంతో కిందకి దిగలేక పోయాం. మరో మార్గం లేదు. అప్పుడు జెస్సీ మమ్మల్ని జీపులోనే కూర్చోబెట్టి టైరు చుట్టూ మట్టి తీసి జీపును ముందుకుపోనిచ్చాడు. ఆ సంఘటన గుర్తొస్తే ఇప్పటికీ భయంగానూ థ్రిల్లింగ్‌గానూ అనిపిస్తుంది.

కెమెరాకి ఆ పులి చిక్కలేదన్న బాధ తప్ప ఈ ట్రిప్‌లో సఫారీని ఎంతో ఎంజాయ్‌చేశాం. ఇక్కడి పులులు ఆహారానికి కొరత ఏర్పడితే దున్నపోతు, ఏనుగుల్ని కూడా చంపి తిన్న దాఖలాలు ఉన్నాయట. ఇక్కడి కొండచిలువలు చీతల్ జింకలను అమాంతం మింగేయగలవు. జంతువులతోపాటు పొడవైన సాల వృక్షాలూ రంగురంగుల పూలచెట్లూ పచ్చని పొదలతో కార్బెట్ అడవి మనోహరంగా ఉంది. ఆసక్తి ఉంటే ఇక్కడున్న నదుల్లో చేపలూ పట్టవచ్చు. టెంట్‌లు వేసుకుని ఉండాలనుకుంటే ఆ సౌలభ్యం కూడా ఉంది. సమయాభావంతో మేం వెళ్లలేదుగానీ అద్భుతమైన ప్రకృతిదృశ్యాలను చూడాలంటే సమీపంలోని పత్లీడూన్ లోయలో ఉన్న దికాలా, గర్జియా ఆలయం, రాణీకేత్‌లను తప్పక సందర్శించాల్సిందే.

జిమ్‌కార్బెట్ నేషనల్ పార్కుని కూడా ఇటీవల ఎకో టూరిజంలో భాగంగా అభివృద్ధి చేయడం ప్రారంభించారు. ఇందులో భాగంగా స్థానికులనీ పార్కు సంరక్షణలో భాగస్వాములుగా చేస్తున్నారు. స్థానికులం కాకపోయినా, ఆ బాధ్యత మనమీదా ఉంటుదన్న విషయాన్ని మరువకండేం..! ★



వ్యాసకర్త



## ఏమేమి తీసుకెళ్లాలి?

**ఏటా సుమారు 70 వేలమంది ఈ పార్కుని సందర్శిస్తుంటారు. దాంతో సహజవాతావరణం దెబ్బతింటోంది. అందుకే వచ్చేముందు విధిగా తెచ్చుకోవాల్సినవీ అక్కడ పాటించాల్సినవీ ముందే సూచిస్తున్నారు.**

- ✦ తీసుకెళ్లే లిస్టులో బైనాక్యులర్స్, ఎమర్జెన్సీ మెడిసిన్స్, మస్కిటో కాయిల్స్, కెమెరా, ఫ్లాష్‌లైట్, బ్యాటరీలు తప్పక ఉండేలా చూసుకోవాలి.
- ✦ వెళ్లేది అడవి కాబట్టి ప్రకాశవంతమైన రంగులు కాకుండా ఖాకీ, గోధుమ, ఆకుపచ్చ... ఇలా చుట్టుపక్కల వాతావరణంలో కలిసిపోయే రంగుల దుస్తులయితేనే మేలు. లేకపోతే ఆయా రంగులకి జంతువులు బెదిరే అవకాశం ఉంది.
- ✦ అడవిలో సౌకర్యంగా నడవగలిగేందుకు కాన్వాస్ షూస్ అయితే బెటర్.
- ✦ చలికాలంలో స్వెట్టర్లు, జాకెట్లు తప్పనిసరి. వేసవిలో కాటన్ మేలు.
- ✦ పెర్ఫ్యూమ్స్ వాడకూడదు. పర్యావరణం కలుషితమయ్యే ప్రమాదం ఉంది.
- ✦ ధూమపానం చేయకూడదు. ఎక్కువగా మాట్లాడకూడదు. హోరున సంగీతం పెట్టకూడదు. కారు హారన్లు మోగించకూడదు.
- ✦ ఎక్కడా ప్లాస్టిక్‌వస్తువులు, కవర్లను విసిరేయకూడదు. పర్యావరణానికే కాదు.. అక్కడి జంతువుల ప్రాణాలకి చాలా ప్రమాదకరం.

## ఎప్పుడు వెళ్లాలి?

**సందర్శనకు అనువైన సమయం నవంబరు15- జూన్ 15.**

**మనకయితే ఏప్రిల్-జూన్‌లూ విదేశీయులకైతే నవంబరు-జనవరి నెలలూ ఉత్తమం అన్నది నిపుణుల సూచన.**

**జులై-సెప్టెంబరు వర్షాకాలం. ఆ సమయంలో వెళ్లడం అంత మంచిది కాదు. ఎందుకంటే పార్కులోపల నీటిప్రవాహాల సంఖ్య చాలా ఎక్కువ. వర్షాకాలంలో ఇవన్నీ పొంగి పార్కులోని రోడ్లనీ తాత్కాలికంగా ఏర్పాటుచేసిన వంతెనలనూ ముంచెత్తుతుంటాయి.**



# రాశి ఫలం

గ్రహబలం (జనవరి 2 - 8)

తంగిరాల ప్రభాకర పూర్ణయ్య సిద్ధాంతి







**మేషం** అశ్వని, భరణి, కృత్తిక 1వ పాదం

అధిక ప్రయాణాలూ త్రిప్పట, అలసట. చేయని పనికి నింద భరించాల్సి వస్తుంది, నూతన వస్తు, వస్త్రాదుల కొనుగోలు కోసం డబ్బు ఖర్చు చేసే సూచనలున్నాయి. గురు, శుక్రవారాలలో మనశ్శాంతి ఉండదు. ఒక వ్యక్తి ద్వారా తెలిసిన సమాచారం మిమ్మల్ని అయోమయానికి గురిచేస్తుంది. వారాంతంలో నూతన కార్యాచరణకై చేసే ప్రయత్నాలు సఫలీకృతం అవుతాయి.



**వృషభం** కృత్తిక 2,3,4 పాదాలు; రోహిణి, మృగశిర 1,2 పాదాలు

చాలాకాలం నుండి అపరిష్కృతంగా ఉన్న లావాదేవీల్లో కదలిక వస్తుంది. కుటుంబ వ్యవహారాలు అనుకూలంగా లేకపోయినా మీమాటే చెల్లుబాటు అవుతుంది. కొన్ని ముఖ్య వ్యవహారాల్లో ఆటంకాలు ఎదురైనప్పటికీ ధైర్యంగా ఎదుర్కొంటారు. మంచిమిత్రులు దూరమయ్యే ప్రమాదం ఉంది. జీవిత భాగస్వామి ఆరోగ్యవిషయంలో జాగ్రత్త వహించండి.



**మిథునం** మృగశిర 3, 4 పాదాలు, ఆర్ద్ర, పునర్వసు 1, 2, 3 పాదాలు

వృత్తివ్యాపారాలు సజావుగా సాగుతాయి. అన్ని రంగాల వ్యాపారులకూ శుభసమయం. ఉద్యోగులకు వృత్తిరీత్యా చేయాల్సిన పనులు ప్రవృత్తిరీత్యా భిన్నంగా అనిపిస్తాయి. ప్రతిచిన్న విషయానికీ మొదట కంగారుపడి, ఆ తర్వాత శాంతంగా ఆలోచిస్తూ ఉంటారు. అవసరానికి మించిన ఖర్చులు అనివార్యంగా కనిపిస్తున్నాయి. ఆ విషయంలో జాగ్రత్త పడితే ఆర్థికంగా ముందడుగు.



**కర్కాటకం** పునర్వసు 4వ పాదం; పుష్యమి, ఆశ్లేష

శుభకార్యాలకు అనువైన సమయం. స్వయంవృత్తి వారికీ వ్యాపారులకూ విద్యార్థులకూ ప్రోత్సాహకరంగా ఉంటుంది. భూసంబంధ వ్యాపారులకు మరింత అనువైన కాలం. గురు, శుక్రవారాల్లో ధనలాభం. మొండిబాకీల వసూలు యత్నాలు సఫలీకృతం అవుతాయి. పిల్లల ఆరోగ్యం ఆందోళన కలిగిస్తుంది. అన్ని రంగాల వారికీ శ్రమకు తగిన ప్రతిఫలం లభిస్తుంది.



**సింహం** మఖ, పుబ్బ, ఉత్తర 1వ పాదం

మీరు ఆచరణలో చూపలేని ఆదర్శాలను ఇతరులకు బోధిస్తూ ఉంటారు. సంఘంలో గౌరవమర్యాదలు పుష్కలంగా లభిస్తాయి. ఆత్మస్తుతి, పరనింద కూడదని గ్రహించండి. వృత్తివ్యాపారాల రీత్యా ఆటంకాలు ఎదురైనా మనోధైర్యంతో తట్టుకుని నిలబడతారు. వైద్యరంగంలోని నిపుణులకు పరీక్షాకాలం. ఉద్యోగులకు పై అధికారుల వలన అసహనం, అశాంతి ఏర్పడతాయి. మెరుగైన ఫలితాల కోసం విద్యార్థులు మరింతగా శ్రమించాల్సి ఉంటుంది.



**కన్య** ఉత్తర 2, 3, 4 పాదాలు; హస్త, చిత్త 1, 2 పాదాలు

ఒకవైపు పనుల తొందర, ఒత్తిడి... మరోవైపు చేపట్టిన ప్రతిపనిలోనూ జాప్యం. వృత్తివ్యాపారాదులు నెమ్మదిగా సాగుతాయి. కానీ మీరు అడిగిన వెంటనే మిత్రులూ శ్రేయోభిలాషులూ తమ సహాయసహకారాలు అందిస్తారు. ఆరోగ్యం విషయంలో జాగ్రత్త వహించండి. వంటిపై పుండ్లూ కురుపులూ వచ్చే అవకాశం ఉంది. వారాంతంలో కుటుంబ సభ్యులతో గొడవపడే సూచనలున్నాయి.



**తుల** చిత్త 3, 4 పాదాలు, స్వాతి, విశాఖ 1, 2, 3 పాదాలు

అన్నిరంగాలవారికీ శుభసమయం. కీలక నిర్ణయాలు తీసకుంటారు. విద్యార్థులకూ సాంకేతిక రంగంలోని వారికీ ప్రోత్సాహకాలు లభిస్తాయి. కొన్ని సందర్భాల్లో మాత్రం చేయాల్సిన పనులు అకస్మాత్తుగా వాయిదా పడతాయి. మీ వ్యవహారశైలి కూడా ప్రవృత్తిరీత్యా భిన్నంగా ఉంటుంది. వ్యాపార భాగస్వాములతో సమన్వయం ఏర్పడుతుంది. ఆరోగ్యం విషయంలో జాగ్రత్తగా ఉండండి.



**వృశ్చికం** విశాఖ 4వ పాదం; అనూరాధ, జ్యేష్ఠ

గతవారం కంటే కొంత మెరుగ్గా ఉంటుంది. చాలాకాలంగా అపరిష్కృతంగా ఉన్న వ్యవహారాల్లో సానుకూలమైన కదలిక, స్పందన వస్తాయి. వాటికి సంబంధించి మీ సొంత నిర్ణయాల మీద ఎంత నమ్మకం ఉన్నా నిపుణుల సలహా తీసుకోవడం మంచిది. ప్రయాణాలు అధికంగా చేయాల్సి వస్తుంది. ఇంట్లో పెద్దల ఆరోగ్యం పట్ల జాగ్రత్త వహించండి. గతంలో చేపట్టి వాయిదావేసిన పనులను ముగించడానికి ఇది చాలా అనువైన సమయం.



**ధనుస్సు** మూల, పూర్వాషాఢ, ఉత్తరాషాఢ 1వ పాదం

పరోపకారబుద్ధి కలిగి ఉంటారు. దైవసంబంధ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటారు. ఇష్టం లేని ప్రదేశంలో ఉండాల్సి వస్తుంది. వ్యవహార జ్ఞానం అంతగా లేనివారి మాట విని కష్టాలపాలవుతారు తస్మాత్ జాగ్రత్త. వ్యవసాయ, విజ్ఞాన రంగాలవారికి మిశ్రమ ఫలితాలు. కొన్ని వ్యవహారాలు అర్థంతరంగా నిలిచిపోవడం లేదా పక్కదోవ పట్టడం జరుగుతుంది.



**మకరం** ఉత్తరాషాఢ 2, 3, 4 పాదాలు; శ్రవణం, ధనిష్ఠ 1, 2 పాదాలు

సహనంతో వ్యవహరిస్తే అన్ని విషయాల్లోనూ జయం మీదే. జీవితభాగస్వామి ఆరోగ్యవిషయంలో జాగ్రత్త వహించండి. వృత్తిరీత్యా గౌరవసన్మానాలు ఆశించేవారు మరికొంత సమయం వేచిఉండాల్సిందే. శుక్ర, శనివారాల్లో కొత్త వస్తువులూ గృహోపకరణాల కొనుగోళ్లకై డబ్బు ఖర్చు చేస్తారు. ఉద్యోగార్థులకు ఈవారం ఫలితం దక్కుతుంది.



**కుంభం** ధనిష్ఠ 3, 4 పాదాలు; శతభిషం, పూర్వాభాద్ర 1, 2, 3 పాదాలు

అన్నివిధాలుగా ముందంజలో ఉంటారు. కొన్ని కీలకవ్యవహారాల్లో నిర్ణయం తీసుకోవడంలో ఊగిసలాట ధోరణి ఉంటుంది. కానీ చివరకు సమర్థమైన నిర్ణయాలు తీసుకుంటారు. పాతబాకీలు వసూలవుతాయి. ఆశించిన లోన్లు మంజూరవుతాయి. ఆర్థికంగా పరిపుష్టంగా ఉంటారు. శుభకార్యాచరణ, కొత్తవస్తువుల కొనుగోలుయత్నాలు చేస్తారు.



**మీనం** పూర్వాభాద్ర 4వ పాదం, ఉత్తరాభాద్ర, రేవతి

వాహనాలు నడిపేటప్పుడూ ప్రయాణాల్లోనూ జాగరూకతతో ఉండండి. ఉద్యోగులకు పైఅధికారుల నుంచి ఒత్తిడి అధికంగా ఉండే సూచనలున్నాయి. ఆదాయానికి మించిన ఖర్చులతో ఆర్థిక ఇబ్బందులకు గురవుతారు. ఉద్యోగులకు స్థానమార్పిడి సూచితం. ప్రతిపనినీ వాయిదా వేసే లక్షణంతో నష్టపోతారు. బద్ధకాన్ని వదిలి చురుగ్గా ఉండండి. ముఖ్యంగా... విద్యార్థులకు పరీక్షాకాలం.

# నవ్వుల మువ్వలు



రావిశాస్త్రి ఓ సినిమాకి మాటలు రాయడానికి మద్రాసు వెళ్లారు. కొన్నాళ్ల తర్వాత తిరిగి విశాఖపట్నం వెళ్తున్న శాస్త్రిగార్ని ఓ శిష్యుడు పలకరించాడు. 'గురువుగారూ! ఎలా ఉంది సిన్మా ప్రపంచం' అనడిగారు. అందుకు శాస్త్రిగారు ఇలా జవాబిచ్చారు... 'ఏముంది-బానే ఉంది. సిన్మావాళ్లతో చాలా సుఖం. మన గదికి మనల్ని అద్దె చెల్లించనివ్వరు. వాళ్లే చెల్లిస్తారు. మన తిండి మనల్ని తిననివ్వరు. వాళ్లే ఏర్పాటు చేస్తారు. మన డైలాగులు మనల్ని రాయనివ్వరు. వాళ్లే రాసుకుంటారు'.

తెలుగు సాహిత్యంలోనే కాదు, సాహితీవేత్తల జీవితాల్లోనూ హాస్యానికి కొదవలేదు. ఏరుకున్నవారికి ఏరుకున్నంత. నవ్వుకున్నవారికి నవ్వుకున్నంత. మువ్వల సుబ్బరామయ్య తెలుగు సాహిత్యంలోని హాస్యరసస్ఫోరకమైన వాక్యాల్నీ పద్యాల్నీ సంభాషణల్నీ ప్రముఖుల జీవితాల్లోని అనుభవాల్నీ ఓ చోట చేర్చి నవ్వులహారం అల్లారు.

**తెలుగు సాహిత్యంలో హాస్యోక్తులు;** సంకలనం: మువ్వల సుబ్బరామయ్య
పేజీలు: 160; వెల: రూ.70/-; ప్రతులకు: మువ్వల పెరుమాళ్ళు అండ్ సన్స్
29-13-19/బి, మల్లికాంబవీధి, సూర్యారావుపేట, విజయవాడ.

– హాసిని

# సీమాంధ్ర తెలంగానం!



'కుండల్లా విడిపోదాం/ కావడిలా కలిసుందాం'... ఈ రెండు పంక్తులూ పుస్తక ఆశయానికి అద్దంపడుతున్నాయి. 'సీమాంధ్ర కవుల తెలంగానం' ఉపశీర్షిక ఉన్న 'కావడి కుండలు' కవితాసంపుటిలో రాయలసీమ, కోస్తా, ఉత్తరాంధ్ర ప్రాంతాలకు చెందిన 43 మంది కవులు తెలంగాణ రాష్ట్ర సాధనకు కవితాత్మకంగా తమ సంఘీభావాన్ని వ్యక్తం చేశారు. కోయి కోటేశ్వరరావు తన సంపాదకీయంలో 1969లో ఆరంభమైన ప్రత్యేక తెలంగాణ ఉద్యమానికి ఎన్.జి.రంగా, గౌతు లచ్చన్న వంటి నాయకుల చేయూత, ఆంధ్రలో ఉక్కు కర్మాగార స్థాపనకు తెలంగాణ కవుల సానుకూల స్పందన ప్రస్తావించడం కవితలకు సముచిత పూర్వరంగంగా ఉంది. కలి'విడి'గానే విరబూద్దాం, తెలంగాణ చెల్లికి బాధ్యతతో/అప్పగింతలు చేద్దాం, రెండు కన్నులలో ఇక నుండి వెలుగు ...ఇలా కవితల్లో సంఘీభావం నినదించింది.

**కావడికుండలు**
సంపాదకులు: కోయి కోటేశ్వరరావు
పేజీలు: 143; వెల: రూ.50/-
ప్రతులకు: ప్రధాన పుస్తక కేంద్రాలు. – జి.రా.

# వివరణలూ విమర్శలూ



చెప్పదల్చుకున్నదాన్ని స్పష్టంగా, తేలిగ్గా వివరించటంతోపాటు- చేసే విమర్శను తీవ్రంగా, పదునుగా వ్యక్తీకరించటం రంగనాయకమ్మ ప్రత్యేకత. ఈ పుస్తకంలో రెండూ కలగలిసి కనిపిస్తాయి. సమాజాన్ని సతమతం చేస్తున్న వేర్వేరు సమస్యలకు పునాది ఒకటేననీ, దాన్ని గ్రహించటానికి మార్క్సిజమనే దివిటీ కావాలనీ అంటారామె. సోషలిజం, కమ్యూనిజానికి సంబంధించి కొన్ని వివరణలూ; రామసేతు, తెలుగు భాషోద్యమం, ప్రత్యేక తెలంగాణాలపై పరిశీలనలూ ఈ సంకలనంలో చేర్చారు. సాహితీ ప్రముఖులపై ఇటీవలికాలంలో రచయిత్రి చేసిన నిశిత విమర్శలతోపాటు గాయని బాల సరస్వతితో 18 ఏళ్ళక్రితం జరిపిన రేడియో ఇష్టాగోష్ఠినీ, 36 ఏళ్ళనాటి 'ఊబిలో దున్న' నవలా పరిశీలననూ దీనిలో చదవొచ్చు.

**'మార్క్సిజమే తెలియకపోతే పుట్టినవాళ్ళం పుట్టినట్టే ఉంటాం!'**
రచన: రంగనాయకమ్మ
పేజీలు 300; వెల: రూ.100/-
ప్రతులకు: అరుణా పబ్లిషింగ్ హౌస్
ఏలూరు రోడ్డు, విజయవాడ-2.

– వేణు

# పదవినోదం-1020



## ఆధారాలు

### అడ్డం:

1. తనిఖీ (2)
3. భవదీయ (2)
5. ఇది లేనివాడు వింతపశువంటారు... (2)
6. వేరే విధంగా (3)
8. ఆర్భాటం తోడిది (2)
10. 'బొమ్మరిల్లు' సినిమాలో నాయిక పాత్రపేరు? (3)
13. బుజ్జగింపు (3)
14. చక్కిలాలు, జంతికలు, చేగోడీల్లాంటివి వండటాన్ని క్లుప్తంగా ఏమంటారు? (4)
18. పులియబెట్టిన పిండితో తయారుచేసే మిఠాయి (3)
20. సంపాదించనా? (4)
21. అర్జునుడు (3)
22. ఒడ్డు, దరి (2)
23. బంగ్లాదేశ్ రాజధాని? (2)
25. నామధేయం (2)
28. సన్యాసి (2)
30. దారితప్పిన చీకటి! (3)
32. మొదటి విజయం (2+3)
34. నిడుపాటి కోల (2)
36. కోరి ముందు అక్షరం చేరిస్తే క్రూరమైన బాణం! (3)
38. రుద్ధి (3)
41. రుణం మధ్య అక్షరంతో కాంతి! (3)
43. మంగను పిలవండి... (2)
44. చేరాల్సింది? (2)
45. తెలుగు టేస్ట్ (2)
47. జంతుశాస్త్రాన్ని ఏమంటారు? (4)
48. తిరగబడిన సువాసన! (2)
50. చాలు, ఇక అక్కర్లేదు (2)
51. సంపాదన (3)
52. మీనం (2)
53. ప్రభువు, యజమాని (2)
54. అడ్డం 34తో నాగార్జున కొత్త సినిమా? (1)
55. మత్తులో సరిగ్గా నడవలేక అటు ఇటు పడు (2)
56. ఎగుమతికి వ్యతిరేకం (4)

### నిలువు:

2. దప్పిక (2)
4. మెట్రోసిటీని తెలుగులో ఏమందాం? (5)
5. చెవుల పడక (5)
7. వానరం (2)
9. రోజా (3)
11. ధ్వని (2)
12. చిరంజీవి ప్రధాన పాత్రలో గ్రాఫిక్స్ సినిమా? (2)
15. శీర్షాసనమేసిన నాడి! (2)
16. పాయకాట సరిజేస్తే? (4)
17. పర్వదినం (3)
19. కొంచెం (2)
22. విధం, పద్ధతి (2)
24. ప్రతాపం, జోరు లాంటిది (2)
25. తంటాలమారి (4)
26. సంపద (3)
27. కవాటంగా (4)
29. మూడు; తిరగబడిన గతి! (2)
31. స్వప్నం (2)
33. వ్యాఘ్రం (2)
35. తప్పెట లాంటిది (2)
37. వాడుక (3)
39. తతిమ్మా, తక్కిన (3)
40. ఉదకం (2)
42. తలకిందుల దివాణం! (3)
43. అందెలు (4)
46. కడ (3)
48. వేరేగా ఉన్నది; పెళ్ళివారు మజిలీ చేసింది! (3)
49. ఒక నది (3)
52. ఒక రకం దుంప, వేపుడుకు ప్రశస్తం (2)

## సుడొకు-65

ప్రతి వరుసనూ (నిలువూ అడ్డమూ కూడా) 1-9 అంకెలతో పూరించాలి. ఒక వరుసలో ఒక అంకెను ఒకసారి మాత్రమే వాడాలి. తొమ్మిది నలుచదరపు బాక్సుల్లో ప్రతి బాక్సులోనూ 1-9 అంకెలు ఉండాలి.

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| | | 9 | | 6 | 5 | | | |
| 6 | | | 3 | | 4 | | 5 | |
| 5 | 7 | | | | | 1 | | 3 |
| | | 3 | | | 6 | | 1 | 7 |
| | | 6 | 9 | | 7 | 3 | | |
| 1 | 2 | | 5 | | | 9 | | |
| 9 | | 8 | | | | | 2 | 5 |
| | 4 | | 6 | | 3 | | | 8 |
| | | | 8 | 9 | | 4 | | |

## సమాధానాలు

### పదవినోదం-1019



### సుడొకు-64

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| 2 | 8 | 7 | 9 | 3 | 1 | 5 | 4 | 6 |
| 6 | 3 | 9 | 5 | 4 | 2 | 8 | 7 | 1 |
| 5 | 1 | 4 | 8 | 7 | 6 | 9 | 2 | 3 |
| 1 | 9 | 8 | 3 | 2 | 7 | 4 | 6 | 5 |
| 7 | 4 | 6 | 1 | 9 | 5 | 3 | 8 | 2 |
| 3 | 2 | 5 | 6 | 8 | 4 | 1 | 9 | 7 |
| 8 | 7 | 3 | 2 | 1 | 9 | 6 | 5 | 4 |
| 9 | 5 | 2 | 4 | 6 | 3 | 7 | 1 | 8 |
| 4 | 6 | 1 | 7 | 5 | 8 | 2 | 3 | 9 |







# నగరం విరబూసింది

పూలు రోడ్డెక్కాయ్
పాదచారుల్ని పక్కకునెట్టి
వాహనాలకి విశ్రాంతినిచ్చి!

ఇటలీలోని జెన్‌జానో పట్టణంలోని రహదారులివి. ప్రతీయేటా ఓ రెండ్రోజులపాటు నగరంలో రోడ్లూ వీధులూ ఇలా పూలవనాలైపోతాయి. వసంతాగమనాన్ని ఇన్‌ఫ్లోరటా పేరుతో పండగ చేసుకుంటారీ పట్టణ ప్రజలు. రంగురంగుల పూలతో ఇలా రంగవల్లికలు తీర్చిదిద్దుతారు. ఒకచోట ఏసుక్రీస్తు మరోచోట అందమైన అమ్మాయిలూ ఇంకోచోట వాద్య పరికరాలూ... ఇలా రకరకాల థీమ్‌లతో పూలముగ్గుల్ని వేస్తారు. రెండ్రోజులపాటు వీటిని చెక్కుచెదరనీకుండా ఉంచుతారు. మూడోరోజు పిల్లలందరూ వీటిపై సందడిగా పరుగులు తీస్తారు. దాంతో ఈ పండగ ముగుస్తుంది.











ప్రీమియర్ షో
త్వరలో...
ఐ లవ్ యూ
డాడీ
దర్శకత్వం
ఇంద్రనాగ్
నిర్మాత
సుమన్

# ఈనాడు ఆదివారం

9 జనవరి 2011



వ్యక్తిత్వ శిల్పశాల...

# కోరుకొండ పాఠశాల



# పర్సనల్ టచ్

| | |
|---|---|
| **పేరు** | **: నాని** |
| పుట్టింది | : కృష్ణాజిల్లా చల్లపల్లిలో |
| పెరిగింది | : హైదరాబాదులో |
| తెర పరిచయం | : రాధా గోపాళం సినిమాకు అసిస్టెంట్ డైరెక్టర్‌గా పనిచేశా |
| తెరంగేట్రం | : 'అష్టా చెమ్మా'తో హీరోగా పరిచయమయ్యా. ఆ తరువాత 'స్నేహితుడా', 'రైడ్', 'భీమిలి కబడ్డీ జట్టు'. త్వరలో 'ఈగ'లో. |
| హాబీస్ | : సినిమాలు చూడ్డం. వీలుంటే ఫ్రెండ్స్‌తో లాంగ్‌డ్రైవ్‌లకి వెళ్లడం |
| నచ్చే చిత్రాలు | : మణిరత్నం సినిమాలన్నీ ఇష్టం. ఎక్కువసార్లు చూసిన చిత్రం 'దళపతి' |
| అభిమాన తారలు | : కమల్ హాసన్, శ్రీదేవి |
| నచ్చేపాత్ర | : గ్లాడియేటర్‌లో రసెల్‌క్రో చేసిన పాత్ర |
| నచ్చే ప్రదేశాలు | : హైదరాబాద్, తిరుపతి, అమెరికా, బ్యాంకాక్ |
| ఇష్టమైన భోజనం | : పప్పూ నెయ్యీ సాంబారూ చేపల పులుసు |
| ప్లస్ మైనస్ | : ఎప్పుడూ పాజిటివ్‌గా ఉండటం ప్లస్. మొహమాటం ఎక్కువ... అదే నాలో నాకు నచ్చంది |
| ప్రేమంటే | : ఒక రకమైన అఫెక్షన్ |
| నచ్చే డైలాగ్ | : తెలిసింది గోరంత, తెలియాల్సింది కొండంత... ఇది రజనీకాంత్ డైలాగ్ |
| లక్ష్యం | : మంచి నటుడినవ్వాలి |

– పాతూరి పద్మ



## ఆనందమంటే అదే

ఆనందానికి నిర్వచనం ఏంటి... ఒకొక్కరికీ ఒక్కో పని చేయడంలో ఆనందం ఉంటుంది. ఇదే ప్రశ్నకు సైఫ్ అలీఖాన్ చెప్పిన సమాధానమేంటో తెలుసా... 'పుస్తక పఠనం'! 'ఇంట్లో కిటికీ పక్కన ఓ కుర్చీ వేసుకుని కాళ్లను ఓ స్టూల్‌పై పెట్టుకుని పుస్తకం చదువుకోవడం నాకెంతో ఇష్టమైన పని. నేను రిటైర్ అయ్యాక అలాగే గడపాలని కోరుకుంటున్నాను. యూరప్‌లోని గ్రామీణ ప్రాంతాలంటే చాలా ఇష్టం. అక్కడికి వెళ్లినప్పుడు కూడా ఓ మాంచి ప్రదేశం చూసుకుని, కుర్చీవేసుకు కూర్చుని, ఏదో ఒక పుస్తకం చదువుతూనే గడిపేస్తాను. నాకు ఎంతో ఆనందాన్నిచ్చే పని చదవడం' అంటాడు సైఫ్.

## మొదటి వంట!

తన జీవితంలో ఒకేసారి కిచెన్‌లోకి వెళ్లానంటోంది కరీనా కపూర్. ఎప్పుడంటే... "షారుఖ్‌తో 'అశోక'లో నటించా. ఆ షూటింగ్‌కోసం మధ్యప్రదేశ్‌లోని ఓ మారుమూల ప్రాంతానికి వెళ్లాం. ఆరోజు మా వంటవాడు రాలేదు. ఆపూటకి యూనిట్ మొత్తానికి నేనే వంట చేద్దామని నిర్ణయించుకున్నా! నాతోపాటు దర్శకుడు సంతోష్ శివన్ కూడా వంటకి సిద్ధమయ్యారు. మాకు తోచినట్టు వచ్చినట్టు ఏదో వండేశాం. ముందు ఎవరికి వడ్డించాలీ అని చాలాసేపు ఆలోచించాం. షారుఖ్ అయితే బెటర్ అనిపించింది. ముందు షారుఖ్‌కే ఎందుకంటే... వంటలు బాలేవనుకోండి... నాకు వంట చేతగాదు అన్న సంగతి అతనొక్కడికే తెలుస్తుంది. వేరే ఇంకెవరికైనా మొదట వడ్డించామనుకోండి... పరువు పోతుంది! అందుకే షారుఖ్‌కి వడ్డించాం. 'చాలా బాగా చేశారు' అని సర్టిఫై చేశాకే యూనిట్‌లో మిగతా వాళ్లకి పెట్టాం. నా జీవితంలో గరిట పట్టుకున్న మొదటి, చివరి రోజు అదే అని చెప్పింది కరీనా.





# మీమాట

ఈ సంచికపై మీ అభిప్రాయాలను sunday@eenadu.netకు మెయిల్ చేయవచ్చు.

## అంతా విజ్ఞానదాయకమే

'సహస్రాబ్ది తొలిదశాబ్ది' అనుబంధం విజ్ఞాన దాయకంగా అద్భుతంగా ఉంది. ఒక్కసారి వెనక్కి, ఆరోగ్యమస్తు, టెక్నాలజీకి పట్టం, కార్డు మా లక్ష్మి, మాలామాల్ షాపింగ్‌మాల్, ఆన్‌లైన్ అనుబంధాలు... అన్నీ ఎన్నో కొత్త విషయాలు చెప్పాయి. 'మనవడు' కథ హృదయాల్ని కదిలించేలా ఉంది. వృద్ధాప్యంలో తల్లిదండ్రులు పడే బాధ, ఆవేదనలను కళ్లకు కట్టింది.

*– జానా వసుంధర, దామోదర్, (ఈమెయిల్)*

## ఎంత ప్రగతో!

ఈ దశాబ్దపు గొప్ప ఆవిష్కరణల గురించి 'టెక్నాలజీకే పట్టం'లో చక్కగా వివరించారు. 'పదేళ్లలో ఎంత పెరిగాయో' ఆసక్తికరం. 'ఆన్‌లైన్ అనుబంధాలు' ఈతరం వాళ్లు తప్పక చదవాల్సిన అంశం. టెక్నాలజీలో మనం ఇంత ప్రగతి సాధించామంటే సంతోషంగా ఉంది. ఆదివారం అనుబంధంలో కథలు బాగుంటు న్నాయి. 'మనవడు' కూడా చాలా బాగుంది.

*– రమేష్, గౌస్ ఎస్.కె., స్రావ్య, శ్రీ.సీ హెచ్(ఈమెయిల్)*

## ఆకట్టుకుంది

'ప్రియమైన పర్యావరణానికి' చాలా బాగుంది. మనచుట్టూ ఉన్న పర్యావరణ ప్రియ వస్తువులనూ పద్ధతులనూ తెలియజేసినందుకు కృతజ్ఞతలు. ఇకమీదట మేం కూడా ప్రకృతిని కాపాడేందుకు మావంతు కృషిచేస్తాం. 'ఒక్కసారి వెనక్కి' ఆకట్టుకుంది. 'మనవడు' కథ చదువుతుంటే కళ్లల్లో నీళ్లు తిరిగాయి. కృత్రిమ గుండె గురించి చదివితే టెక్నాలజీ అభివృద్ధి చెందిన తీరు ఆశ్చర్యానికి గురిచేసింది. 1000 సీసీ యువతరం, నటవారసులు విశేషాలు ఆసక్తికరంగా ఉన్నాయి. 'హ్యాపీ న్యూ ఇయర్' కేకులు భలే ఉన్నాయి.

*– సాయి రూపక్ ఓలేటి, రాజ్ జి.(ఈమెయిల్)*
*– సతీష్ కస్తూరి, కడప*
*– వెలిశాల దుర్గాప్రసాద్, ఉంగుటూరు*

## పదేళ్లకు ఒకే పుస్తకం

26వ తేదీ అనుబంధం సూపర్. పదేళ్ల విశేషాల్నీ ఒకే పుస్తకంలో చక్కగా చెప్పారు. 'ఒక్కసారి వెనక్కి' బాగుంది. 'ఆరోగ్యమస్తు'లో వివిధ ఆహారపుటలవాట్లతో ఆరోగ్యాన్ని ఎలా కాపాడుకోవచ్చో, సాంప్రదాయ ఆహారంలో ఏయే పోషకాలుంటాయో చక్కగా చెప్పారు. దానికి అనుబంధమా అన్నట్టు 'న్యూగురుభ్యోనమః' మానసిక ఆరోగ్య ప్రాధాన్యతను తెలిపింది.

*– కావూరి నాగార్జున, అనుబత్తుల రాజేష్, పి.వి.భానుప్రకాష్(ఈమెయిల్)*

## ధన్యవాదాలు

ఈవారం మ్యాగజైన్ చాలా బాగుంది. శ్రీధర్ గారి కార్టూన్లు నవ్వించాయి. దశాబ్ద విశేషాలను క్లుప్తంగా చెప్పినందుకు ధన్యవాదాలు. 'మనవడు' కథలో మనవడికోసం ఒక తాత పడే ఆవేదన కన్నీరు పెట్టించింది. '1000 సీసీ యువతరం' యూత్‌ఫుల్‌గా ఉంది. 'పదేళ్లలో ఎంత పెరిగాయో' చదువుతుంటే వామ్మో అనిపించింది.

*– ఆర్.శ్రీనివాసరాజు, సాంబశివ, సూర్య జె.(ఈమెయిల్)*

## దాచుకోదగ్గది

'మనవడు' కథ బాగుంది. వాస్తవాన్ని తెలుసు కున్న పెద్దాయన పనిపిల్ల కొడుకుని మనవడిగా భావించి, చదువు చెబుతాననడం మంచి మార్పు. 'టెక్నాలజీకే పట్టం', 'ఫ్యాషన్ హరివిల్లు', 'బాలవినోదిని', 'అందానికి వందనం', 'ఒక్కసారి వెనక్కి', 'పదేళ్లలో ఎంతమార్పు', 'ఆన్‌లైన్ అనుబంధాలు', 'నటవారసులు', 'మాలామాల్ షాపింగ్‌మాల్', 'ఓ పెద్ద చిన్న సంగతి'... దేనికదే బాగున్నాయి. సంచిక భద్రంగా దాచుకోదగ్గది.

*– పత్తూరి సింధునివాస్, మంగళగిరి*
*– శ్రీకాళహస్తి వెంకటశేషగిరిరావు, నెల్లూరు*
*– నంగునూరు శ్వేత, వీపూరి జ్యోతిప్రసాద్, నల్గొండ*
*– రామగిరి లలితాశంకర్, శరత్, స్వీటీ, నూజివీడు*
*– డాక్టర్ దుట్టా శ్యామంతకమణి, విజయవాడ*

## అంకెల్లో...

**80 శాతం**
ఢిల్లీ, పంజాబ్ రాష్ట్రాల్లోని మొత్తం ఇళ్లలో టీవీలున్న ఇళ్లు.

**4**
హిమాచల్‌ప్రదేశ్‌లో ప్రతి 10 వేలమందికీ ఉన్న పోస్టాఫీసులు. దేశంలో పోస్టాఫీసుల సాంద్రత అధికంగా ఉన్న రాష్ట్రం అదే.

**85,000 కోట్లు**
మనదేశంలో ప్లాస్టిక్ ప్రాసెసింగ్ పరిశ్రమ టర్నోవర్.

**15 శాతం**
భారత కార్పొరేట్ రంగంలోని సీనియర్ మేనేజ్‌మెంట్ స్థానాల్లో ఉన్న మహిళలు.

**6**
మనదేశంలో ప్రతి పదివేల మందికి ఉన్న డాక్టర్లు.

**75 బిలియన్ డాలర్లు**
అమెరికా ఏటా కేవలం ఇంటెలిజెన్స్ విభాగంకోసం ఖర్చు చేసే మొత్తం.

**160 కిలోలు**
ఒక భౌతికదేహాన్ని దహనం చేస్తే సగటున వెలువడే కార్బన్‌డయాక్సైడ్.

**8.6 సంవత్సరాలు**
500 రూపాయల నోటు సగటు జీవితకాలం.

## లోపల...


చురుక్కు చమక్కు................. 4
పెద్దపండగొచ్చింది... .............. 5
పాట కచేరి ....................... 6

వ్యక్తిత్వ శిల్పశాల...
**కోరుకొండ పాఠశాల**



**7**
ఎంతోమందిని సైనికాధికారులుగా ఐఏఎస్, ఐపీఎస్ అధికారులుగా... అన్నిటికీ మించి బాధ్యతగల పౌరులుగా, పరిపూర్ణ వ్యక్తులుగా తీర్చిదిద్దిన కోరుకొండ సైనిక పాఠశాల జనవరి 18 నుంచి స్వర్ణోత్సవాలు జరుపుకొంటోంది.

విదేశీ వైదికులు.................. 11
కథ ............................... 12
సొరకాయలు... ఎన్ని రకాలో! ... 15

**ఒకరికి ఒకరు**



**16**
ప్రతిభాపాటిల్, మీరాకుమార్, గీతారెడ్డి, రేణుకా చౌదరి, సుష్మాస్వరాజ్, ప్రియాంకాగాంధీ... వీరంతా సుపరిచితులే. మరి, వీళ్ల జీవిత భాగస్వాములు?

కళ్లకి కొత్త రంగులు.............. 18
అవీ... ఇవీ........................ 19
'కీబోర్డ్ జైరాజ్' అనేవాళ్లు! ........ 20
ఈ అబ్బాయి హెచ్ఐవీ 'పాజిటివ్' 22
రుచి అభిరుచి .................... 23
బాలవినోదిని...................... 24
పువ్వుల్లో ఫ్యాషన్................. 26
ఐడియా అదుర్స్.................... 27
రాశి ఫలం.......................... 28
సమీక్ష............................. 29
పదవినోదం........................ 30


## మంచిమాట

**విజయం సంతోషానికి కారణం కాదు. సంతోషమే విజయానికి కారణం.**

# చురుక్కు


కృష్ణా నీరు
మహారాష్ట్ర
కర్ణాటక
ఆంధ్రప్రదేశ్
శ్రీధర్


వరుణ్
మేనక


బెంగాల్ ఎన్నికలు
మావోలు
సీపీఎం
మమత
కాంగ్రెస్

# చమక్కు


మాది రైతు ప్రభుత్వం, మేమెప్పుడూ రైతుకు సాయంగా ఉంటాం!

# పెద్దపండగొచ్చింది...





**కొత్తధాన్యం, కొత్తబెల్లం, కొత్త సినిమాలూ, కొత్తల్లుళ్లూ, కోడిపందాలూ... ఏమైనా సంక్రాంతి పండగ కళే వేరు! దక్షిణాయనంలోని చలికి వీడ్కోలు, భానుడి కొత్తవెలుగులకు స్వాగతం పలుకుతూ మూడురోజులపాటు చేసుకునే ఈ పెద్ద పండగ గురించి కొన్ని విశేషాలు...**

సూర్యుడు ఏడాదిలోని పన్నెండు నెలల్లోనూ ఒక్కో నెలలో ఒక్కో రాశిలో కొలువుంటాడు. ముప్ఫై రోజులు గడిచాక ఒక రాశిలోంచి మరొక రాశిలోకి మారడాన్ని సంక్రమణం అంటారు. అదే సంక్రాంతి. ఈ లెక్కన ఏడాదికి పన్నెండు సంక్రాంతులు. కానీ ఎముకలు కొరికే చలి క్రమంగా తగ్గుతూ సూర్యుడి దిశ మారి ఉష్ణం పెరిగి వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది కాబట్టి మకరసంక్రాంతిని విశిష్టమైనదిగా పరిగణించారు పెద్దలు. పంటలు పండి గాదులన్నీ ధాన్యంతో నిండే కాలం కూడా కావడంతో ఇంటింటా పండగ వాతావరణం నెలకొంటుంది. డూడూబసవన్నలూ హరిదాసులూ బుడబుక్కలవాళ్లూ జంగమదేవరలూ కోడి పందాలూ... ఇంటిముందు తీర్చిదిద్దిన రంగవల్లులూ కన్నెపిల్లల గొబ్బిపాటలూ కొత్తల్లుళ్ల అలకలూ బావామరదళ్ల సరసాలూ... ఆనందం అలరారే పండగ ఇది. అందుకే సంక్రాంతి మనకు పెద్దపండగయ్యింది.

### ధనుర్మాసం... భోగి

పట్టణాల్లో పండగంటే భోగి, సంక్రాంతి, కనుమ అని మూడు రోజులేకానీ... పల్లెల్లో నెలరోజులు ముందుగానే సంక్రాంతి కళ వచ్చేస్తుంది. దక్షిణాయనం చివరి ముప్ఫై రోజులూ ధనుర్మాసం పేరిట ఆధ్యాత్మికత వెల్లివిరుస్తుంది. రంగురంగుల రంగవల్లులతో ముంగిళ్లను అలంకరిస్తారు. వాటిమధ్యలో... గోపెమ్మలకు ప్రతీకగా గోమయంతో చేసిన గొబ్బెమ్మలను పెడతారు. అంతటా కోలాహలం. ఒక చైతన్యం. ఉదయాన్నే వైష్ణవాలయాలనుంచి వినిపించే తిరుప్పావై పాశురాలు ఆధ్యాత్మిక భావనలు కలగజేస్తాయి. ఆ వెనకే వేడివేడి పొంగలి ప్రసాదాలు గుర్తొచ్చి నోరూరిస్తాయి. ఈ ఆచారం వెనుకా ఒక శాస్త్రీయకోణం ఉంది. సాధారణంగా చలికాలంలో రాత్రులు దీర్ఘంగానూ పగళ్లు చిన్నవిగానూ ఉంటాయి. అందుకే ఉదయాన్నే బాగా ఆకలివేస్తుంది. ఈ వాతావరణానికి బియ్యం, పెసరపప్పు కలిపి వండే పులగం, పొంగలి వంటివాటిని విశిష్ట ఆహారం కింద పరిగణించారు పెద్దలు. పేదలకు వీటిని వండుకునే స్థోమత ఉండకపోవచ్చు. దానికి పరిష్కారమే ధనుర్మాసంలో వైష్ణవాలయాల్లో పెట్టే పొంగలి ప్రసాదాలు. అన్నార్తుల ఆకలిని ఆ దేవుడే తీరుస్తాడని చెప్పే ఆచారమిది.

ధనుర్మాసానికీ దక్షిణాయనానికీ ఆఖరు రోజు... భోగి. ఆరోజున భోగిమంటలు వేసి పాతచేటలూ తట్టాబుట్టా అందులో వేసి భోగిపీడ వదిలిపోయిందని భావిస్తారు. పాతకు వీడ్కోలూ కొత్తదనానికి స్వాగతం ఒకేసారి పలుకుతారు. సాయంత్రం పూట పిల్లలకు భోగిపళ్లు పోస్తారు. బొమ్మలకొలువులు పెట్టి సందడి చేస్తారు. శ్రీరంగనాథుని మనసావాచాకర్మణా భర్తగా నమ్మిన గోదాదేవి ఆ స్వామి అనుగ్రహాన్ని పొందినది ఈ రోజే. అందుకు గుర్తుగా భోగినాడు వైష్ణవాలయాల్లో గోదా కల్యాణం జరిపిస్తారు భక్తులు.

### పెద్దపండగ

మర్నాడు మకర సంక్రాంతి. సూర్యుడు ధనూరాశి లోంచి మకరరాశిలోకి ప్రవేశించే సమయం. ఈ సంక్రమణ పుణ్యకాలంలో స్నానం చేయనివాడు ఏడుజన్మలదాకా రోగి, దరిద్రుడు అవుతాడని పురాణప్రతీతి. అంతేకాదు, ఉత్తరాయణ పుణ్యకాల ఘడియల్లో నువ్వులూ బియ్యం కలిపి శివుడిని అభిషేకిస్తే మంచిదని చెబుతారు. ఉత్తరాయణ పుణ్యకాలంలో చేసే జపాలూ పారాయణలూ దానాలూ అనేకరెట్ల ఫలితాన్ని ఇస్తాయనీ ఐశ్వర్య ప్రదాయకాలనీ ధర్మశాస్త్రాలు చెబుతున్నాయి. ప్రత్యేకించి ఈ సమయంలో ధాన్యం, వస్త్రం, బంగారం, ఆవు, కాయగూరలూ నువ్వులూ చెరకు వంటివాటిని దానం చేయడం ఉత్తమఫలితాలనిస్తుందని భక్తుల విశ్వాసం. మకరరాశికి అధిపతి శని. కాబట్టి శనైశ్చరుడికి ఇష్టమైన నువ్వులు దానం చేస్తారు. సంక్రాంతినాడు శివాలయాల్లో నువ్వుల నూనెతో దీపం వెలిగించడం మంచిదని వ్రతచూడామణి గ్రంథం చెబుతోంది.

అప్పటికి ముప్ఫైరోజులుగా గొబ్బెమ్మలను పెడుతున్న కన్నెపిల్లలు సంక్రాంతినాడు సందెగొబ్బెమ్మల పేరంటం చేస్తారు. మధ్యలో పెద్ద గొబ్బెమ్మను గౌరీదేవిగా భావించి చుట్టూ తిరుగుతూ 'సుబ్బీగొబ్బెమ్మా...' అని పాడుతూ గొబ్బి తడతారు. ఆ పాటలో 'తామర పువ్వంటీ తమ్ముణ్నివ్వవే... చేమంతి పువ్వంటీ చెల్లెల్నియ్యవే... మొగలీపువ్వంటీ...' అంటూ ఆపేసి 'మొగుణ్నివ్వవే' అనలేక ఆ అమ్మాయిలు అందంగా సిగ్గుపడే దృశ్యాన్ని చూసి తీరాల్సిందే తప్ప మాటల్లో వర్ణించడం కష్టం.

### పాడి పండగ

మూడోరోజు కనుమ. గాదులన్నీ ధాన్యపు రాశులతో కళకళలాడేలా చేసిన పశుసంపదను లక్ష్మీదేవి ప్రతిరూపాలుగా భావించి పూజిస్తారు రైతులు. వాటిని శుభ్రంగా కడిగి కొమ్ములకూ మూపురానికీ పసుపురాసి కుంకుమబొట్లు పెట్టి పూలతో గంటలతో అలంకరిస్తారు. కనుమనాడు మినుములు తినాలనే సామెత ప్రకారం గారెలు తింటారు. అల్లుళ్లతో మినపసున్నుండలు తినిపిస్తారు. ఆరోజున మాంసాహారం తినడం కొన్ని ప్రాంతాల్లో ఆచారమైతే... మరికొన్ని ప్రాంతాల్లో కనుమనాడు కలగలుపు కూర, ముక్కనుమనాడు(మర్నాడు) ముక్కల కూర తినడం అలవాటు. కనుమనాడు కాకయినా కదల్దంటూ చాలామంది ఆరోజున ఎక్కడికీ ప్రయాణాలు పెట్టుకోరు. ఈరోజుతో పండగ సందడి ముగుస్తుంది. ★



# ఆ రెండూ చక్కగా కుదిరాయి!



**సాధారణంగా పాట అంటే ప్రేమో ద్వేషమో వైరాగ్యమో ఏదో ఒక అంశంపైనే ఉంటుంది. కానీ, 'అన్నమయ్య'లోని ఓ పాటలో భక్తితోపాటూ శృంగారరస ఛాయలూ కనిపిస్తాయి. అలాంటి గీతాన్ని రాశారు రచయిత జె.కె.భారవి. ఆ పాట గురించి ఆయన మాటల్లోనే...**

అన్నమయ్య ప్రేమలోపడ్డాడు. ఒకరు కాదు, ఇద్దరు భామల ప్రేమలో! అతని దృష్టిలో భక్తి అంటే ప్రియురాళ్లపై ఉన్న రక్తి. పూజ అంటే శృంగారపూజ. అర్చన అంటే అంగాంగ వర్ణన.

ఈ స్థితిలో ఉన్న అన్నమయ్య తన రసాధిదేవతలకు శృంగారార్చన చేస్తే ఎలా ఉంటుంది?

'అన్నమయ్య' సినిమాలోని ఈ సందర్భానికి ఓ పాట ఉంటే బాగుంటుందనుకున్నాం. దర్శకులు కె.రాఘవేంద్రరావు ఈపాటని వేటూరి గారితో రాయించాలనుకున్నారు. కానీ ఆయన బిజీగా ఉండటం వల్ల రాయలేకపోయారు. అప్పుడు నన్ను పిలిచి 'కవిగారూ... ఈపాట మీరే రాయాలి' అన్నారు రాఘవేంద్రరావు. ఆ చిత్రానికి కథరాసింది నేనే. ఆ పాట సందర్భం తెలుసు. ఎలా ఉండాలో కూడా తెలుసు. కాబట్టి రాయడానికి సిద్ధపడ్డాను.

### అతడే ఆదర్శం

కళ్లుమూసుకోగానే ఓ ఆలోచన మెరిసింది. తిరుమలలో స్వామివారికి పూజ జరుగుతూ ఉంటుంది. ఇక్కడ అన్నమయ్య ప్రియురాళ్లకు ప్రేమ పూజ చేస్తుంటాడు. అక్కడి మంత్రాలు... ఇక్కడి ప్రేమతంత్రాలు... రెండూ కలిపి రాస్తే బాగుంటుంది అనిపించింది. అన్నమయ్య దృష్టిలో దేవతార్చన అంటే తన దేవేరుల అర్చనే! 'ప్రేయసిపై ఉన్న ప్రేమను భక్తి అనకూడదా? వాళ్లకి పూజలు చెయ్యకూడదా? నా శృంగార రసాధిదేవతలు వాళ్లు' అనే స్థితిలో ఉంటాడు అన్నమయ్య. నిజానికి అన్నమయ్యకంటే కొన్నేళ్ల ముందు... అంటే రామానుజులవారి కాలంలో ఇలాంటివాడే ఒకడుండేవాడు. అతడి పేరు ధనుర్దాసు. అతడికి హేమాంగి అనే ప్రియురాలు ఉండేది. ఆమె ఎండలో నడిచి వెళ్తుంటే గొడుగు పట్టేవాడు. ఆమెకు చెమటలు పడితే వింజామరలతో విసిరేవాడు. అతడి చేష్టలు చూసి చాలామంది నవ్వుకునేవారట. వాళ్లందరికీ ధనుర్దాసు చెప్పిన సమాధానం ఏమిటంటే... 'హేమాంగి నా రసాధిదేవత. కాబట్టి నేను ఆమెని పూజిస్తాను. ఇది నా ఇష్టం.' అని. ఇతని వ్యవహారమంతా రామానుజులవారు తెలుసుకున్నారట. "ప్రియురాలు' అన్న విషయంలో ఇతడికి ఎంతో ఏకాగ్రత ఉంది. ఇలాంటివాడి దృష్టిని మరో పనివైపు మళ్లిస్తే అద్భుతాలు చెయ్యగలడు" అనుకున్నారు. ఆ తరువాత ధనుర్దాసుకి శ్రీరంగనాథుని నేత్రాలు చూపించి అతణ్ని మారుస్తాడు. ధనుర్దాసు తరువాతి కాలంవాడు అన్నమయ్య. మామూలుగా మనం మన పూర్వీకులు పాటించిన ఆచారాలూ సంప్రదాయాలను పాటిస్తాం. అలానే అన్నమయ్య కూడా తన ముందు తరంవాడైన ధనుర్దాసునే ఆదర్శంగా తీసుకున్నాడు! ప్రియురాలికి ధనుర్దాసు పూజలు చెయ్యగాలేనిది నేను చేస్తే తప్పేంటని అనుకున్నాడు. ఇదే స్ఫూర్తితో 'అన్నమయ్య' చిత్రంలో ప్రియురాళ్లకు గొడుగులు పట్టడాలూ వింజామరలు వీచడాలూ లాంటి సన్నివేశాలు వచ్చాయి.

### రెండు పూజలు

పాటలో మొదట 'శ్రీపద్మావతీ భూదేవీ సమేతస్య శ్రీమద్వేంకట నాయకస్య...' అంటూ మొదలౌతుంది. ఆ వెంటనే అన్నమయ్య ప్రియురాళ్లకి 'పదహారు కళలకు ప్రాణాలైన నా ప్రణవ ప్రణయ దేవతలకు ఆవాహనం' అంటూ మొదలుపెడతాడు. అక్కడ స్వామి వారికి 'ఆసనం' అనగానే... ఇక్కడ 'ఊహల లలనకు ఊరువుల ఆసనం' వేస్తాడు అన్నమయ్య. కొండపై స్వామికి 'స్నానం సమర్పయామి' అని పూజిస్తే...ప్రియురాళ్లకు 'పన్నీటి స్నానం' చేయిస్తాడు. తాంబూలమూ నైవేద్యమూ సాష్టాంగ వందనాలతో అక్కడ వేంకటేశ్వరునికి షోడశోపచార పూజ జరుగుతుంటే తన రసాధిదేవతలకు అన్నయ్య అర్చనలు చేస్తున్నట్టు సాగిపోతుంది పాట.

ఈ పాటను దాదాపు 20 నిమిషాల్లో రాసి రాఘవేంద్రరావుగారికి చూపించాను. ఆయనకి బాగా నచ్చింది. వెంటనే మద్రాసులో ఉన్న కీరవాణిగారికి ఫోన్ చేసి పాట వినిపించాను. ఆ వెంటనే మనో పాడేయడమూ జరిగిపోయింది. మర్నాడు రెండే రెండు గంటల్లో ఈ పాట షూటింగ్ కూడా అయిపోయింది. రాఘవేంద్రరావుగారు తన కెరీర్‌లో అత్యంత వేగంగా చిత్రీకరించిన పాట ఇదేనేమో! తెరపై ఈపాటను చూస్తుంటే భక్తీ రక్తీ సమపాళ్లలో కుదిరాయి అనిపించింది. అందుకేనేమో శ్రోతల గుండెల్లో ఇప్పటికీ ఆ పాట అలా నిలిచిపోయింది. ★

## పాట కచేరి

**గానం: మనో; సంగీతం: ఎం.ఎం.కీరవాణి**

**బృందం:** ఓం... శ్రీపద్మావతీ
భూదేవీ సమేతస్య
శ్రీమద్వేంకట నాయకస్య నిత్యషోడశోపచార
పూజాం చ కరిష్యే ఆవాహయామి
**అతను:** పదహారు కళలకు ప్రాణాలైన
నా ప్రణవ ప్రణయ దేవతలకు ఆవాహనం
**బృ:** ఓం ఆసనం సమర్పయామి
**అ:** పరువాల హొయలకు పయ్యెదలైన
నా ఊహల లలనలకు ఊరువుల ఆసనం
**బృ:** ఓం స్నానం సమర్పయామి
**అ:** చిత్తడి చిరు చెమటలా చిందులు చిలికే
పద్మినీ భామినులకు పన్నీటి స్నానం
**బృ:** ఓం గంధం సమర్పయామి
**అ:** ఘలం ఘలన నడల వలన అలసిన
నీ గగన జఘన సొబగులకు శీతల గంధం
**బృ:** ఓం నైవేద్యం సమర్పయామి
**అ:** రతివేద వేద్యులైన రమణులకూ
అనుభవైక వేద్యమైన నైవేద్యం
**బృ:** ఓం తాంబూలం సమర్పయామి
**అ:** మీ తహతహలకు తపనలకు తాకిళ్లకు
కొసరు కొసరు తాంబూలం
**బృ:** ఓం సాష్టాంగ వందనం సమర్పయామి
**అ:** అరంగ రంగ భంగిణులకు
సర్వాంగ చుంబనాల వందనం



ఆ మొహాల్లో సైనికుల్లోని నిర్భీతి.
ఆ కళ్లల్లో విద్యార్థుల్లోని జిజ్ఞాస.
వాళ్లు... నేటి విద్యార్థులు, రేపటి సైనికులు.
ఆటల్లో పాటల్లో పాఠాల్లో పోటీల్లో...
వ్యక్తిత్వ నిర్మాణాన్ని ఓ భాగం చేసిన
కోరుకొండ సైనిక పాఠశాలకు
ఇది స్వర్ణోత్సవ సంవత్సరం.



# వ్యక్తిత్వ శిల్పశాల... కోరుకొండ పాఠశాల

ఎక్కడ శిక్షణ ప్రస్తావన వచ్చినా సైనిక శిక్షణ గురించే చెబుతాం. ఆ కఠోర సాధన మనిషిని రాటుదేలేట్టు చేస్తుంది. వజ్రాన్ని సానబట్టినట్టు, బంగారాన్ని నిప్పు కణికల్లో కడిగితీసినట్టు... మామూలు మనిషిని క్షిపణిలా మార్చే ప్రక్రియ అది.

ఎక్కడ క్రమశిక్షణపై చర్చ జరిగినా సైనికుడే గుర్తుకొస్తాడు. అలుపెరుగడు, ఆలస్యమెరుగడు, భయమెరుగడు, భ్రమలెరుగడు. పరిమితుల్ని అధిగమించిన పరమవీర చక్రం అతను.

ఎక్కడ శిక్షణ, క్రమశిక్షణ గురించి మాట్లాడుకున్నా కోరుకొండ సైనిక పాఠశాల పేరు తలుచుకోవాల్సిందే. పాఠాలు ఏ బళ్లో అయినా చెబుతారు. బెత్తంపట్టుకుని బెదిరిస్తే, ఏ విద్యార్థి అయినా బట్టీపడతాడు. పట్టిందంతా పరీక్ష పేపరు మీద శుభ్రంగా కక్కేసి ఫస్టుక్లాసు కొట్టేస్తాడు. కానీ వ్యక్తిత్వాన్ని నిర్మించే బడులు, విలువల్ని బోధించే పాఠాలు, సాహసాన్ని చదువుల్లో రంగరించే విద్యావిధానం... ఏదీ ఎక్కడ? మన దేశానికి కావలసింది అలాంటి బడులే. అలాంటి చదువులే. అలాంటి వాతావరణమే.

కోరుకొండ సైనిక పాఠశాలకు ఇది స్వర్ణోత్సవ సంవత్సరం. జనవరి 18 నుంచీ ఆ వేడుకలు ప్రారంభమవుతాయి. ఎన్ని బాధ్యతలున్నా పూర్తిచేసుకుని, ఎన్ని పనులున్నా పక్కనపెట్టేసుకుని చదువులు నేర్పిన బడిలో, విలువలు నేర్పిన గుడిలో, క్రమశిక్షణ నేర్పిన ఆవరణలో ఓ పూటైనా గడపాలని ఉవ్విళ్లూరుతున్నారు పూర్వ విద్యార్థులంతా. టికెట్లు ఖరారైపోయాయి. సెలవులు మంజూరైపోయాయి. బయల్దేరడమే ఆలస్యం. ఎయిర్‌పోర్టులో విమానం టేకాఫ్ తీసుకోకముందే, స్టేషన్లో పచ్చజెండా ఊగక ముందే, బస్‌స్టేషన్‌లో కండక్టరు రైట్‌రైట్ అని కేకేయకముందే... వాళ్ల మనసులెప్పుడో సైనిక్ స్కూలు ఆవరణలో వాలిపోయాయి. అంతెత్తు భవనం ముందు నిటారుగా నిలబడి సైనికవందనం సమర్పిస్తున్నాయి. సువిశాల మైదానంలో గుర్రపుస్వారీ చేస్తున్నాయి. పచ్చికలో కూర్చుని జ్ఞాపకాలు నెమరేసుకుంటున్నాయి. ప్రస్తుతం ఆ ఆవరణలో చదువుకుంటున్న విద్యార్థులకైతే ఆ స్వర్ణోత్సవం... ఓ మహోత్సవం, బ్రహ్మోత్సవం! మాస్టార్లు చెప్పే విజయగాథల్లోని కథానాయకులంతా వస్తారు. పలకరిస్తారు. కరచాలనాలు చేస్తారు. అనుభవాలు పంచుకుంటారు. విజయమార్గాలు చెబుతారు. ఆ సందడి కోసమే నెలరోజుల నుంచీ ఎదురుచూస్తున్నారు.

ప్రవేశపరీక్షలో సీటు తెచ్చుకుని సైనిక్ స్కూలు ఆవరణలో అడుగు పెట్టడమే, విద్యార్థి జీవితంలో ఓ గొప్ప మలుపు. కొద్దిరోజులు దిగులుగా అనిపించినా... రెండుమూడునెలల్లో రాటుదేలిపోతారు. బద్ధకం, క్రమశిక్షణారాహిత్యం ఏమూలనో ఇంకా మిగిలున్నా శుభ్రంగా వదిలిపోతాయి. దసరా సెలవులకు ఇంటికెళ్లినప్పుడైతే... అమ్మానాన్నలకు ఒకటే ఆశ్చర్యం... 'కుర్రాడు ఎంత మారిపోయాడు!' అని ముక్కున వేలేసుకుంటారు. ఎంత హుందాతనం, ఎంత క్రమశిక్షణ, ఎన్నెన్ని మంచి అలవాట్లు! ఇక చదువుల్లో అయితే ఆణిముత్యమే! అందుకే మరి, కాన్సెప్ట్‌స్కూళ్లూ టెక్నోస్కూళ్లూ ఇంటర్నేషనల్ స్కూళ్లూ ఎన్నెన్ని వస్తున్నా కోరుకొండ సైనిక్‌స్కూల్ ఆదరణ మాత్రం తగ్గడం లేదు. ప్రవేశ ప్రకటన వెలువడటమే ఆలస్యం, గుట్టలకొద్దీ దరఖాస్తులు వచ్చిపడుతున్నాయి.

## పండిట్ నెహ్రూ ఆలోచన...

సైనిక పాఠశాల భవనం... ఓ కోణంలోంచి అచ్చంగా గుబురు మీసాల సైనికాధికారిలా కనిపిస్తుంది. మరో కోణంలో శ్రద్ధగా వీణ వాయించుకుంటున్న చదువులమ్మలా అనిపిస్తుంది. రెండూ నిజమే! ఆ బళ్లో చదువులకు ఎంత విలువ ఇస్తారో, క్రమశిక్షణకూ అంత ప్రాధాన్యం ఇస్తారు. వ్యక్తిత్వనిర్మాణమే చదువుల లక్ష్యం. ఆ పాఠశాల ప్రధాన భవనానికి వందేళ్ల చరిత్ర ఉంది. 1911లో పూసపాటి చిట్టిబాబు విజయరామ గజపతిరాజు దీన్ని నిర్మించారు. అలక్ అప్పలకొండయాంబ విజయరామ ప్యాలెస్‌గా నామకరణం చేశారు. ఇక్కడే ప్రస్తుతం స్కూలు పరిపాలన విభాగం నడుస్తోంది. సైనిక దళాల్లో ప్రవేశించాలనుకునే విద్యా



ర్థుల కోసం ప్రత్యేకంగా పాఠశాలలు ప్రారంభిస్తే ఎలా ఉంటుందన్న ఆలోచన కలిగింది తొలిప్రధాని నెహ్రూజీకి. దాన్ని ఆచరణలో పెట్టే బాధ్యత అప్పటి రక్షణమంత్రి కృష్ణమీనన్‌కు అప్పగించారు. వెంటనే ప్రణాళిక సిద్ధమైపోయింది. దేశవ్యాప్తంగా సైనిక పాఠశాలలు ప్రారంభమయ్యాయి. ఆంధ్రప్రదేశ్‌లోనూ సరైన ప్రాంగణం కోసం అన్వేషణ మొదలైంది. విద్యాధికుడు, విద్యాభిమాని, విద్యాదాత కూడా అయిన డాక్టర్ పి.వి.జి.రాజుగారికి ఆ సంగతి తెలిసింది. విజయనగరానికి పదకొండు కిలోమీటర్ల దూరంలో ఉన్న తమ కోరుకొండ ప్యాలెస్‌ను సైనిక పాఠశాలకు ఇవ్వడానికి స్వచ్ఛందంగా ముందుకొచ్చారు. 1961 సెప్టెంబరు 19న అందమైన భవంతితోపాటు 206 ఎకరాల భూమిని కూడా దానంగా ఇచ్చేశారు. 1961-62 విద్యాసంవత్సరంలో కోరుకొండ సైనిక పాఠశాల ప్రారంభమైంది. ఇక్కడ ఆరో తరగతి నుంచి పన్నెండో తరగతి వరకూ బోధిస్తారు. బాలురకు మాత్రమే ప్రవేశం. రక్షణశాఖ ఆధ్వర్యంలోని సైనిక పాఠశాలల సొసైటీ నిర్వహణ బాధ్యతలు చూస్తుంది. ప్రస్తుతం దేశవ్యాప్తంగా 24 సైనిక పాఠశాలలున్నాయి. కోరుకొండ సైనిక స్కూలులో ఆరోతరగతి నుంచి పన్నెండో తరగతి దాకా... మొత్తం 558 మంది విద్యార్థులున్నారు. అందులో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన వారే ఎక్కువ. యాభైమంది దాకా బీహారీలున్నారు. ఒరిస్సా, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాల నుంచి వచ్చినవారు పదిమంది దాకా ఉండవచ్చు. గ్రూప్ కెప్టెన్ ఆర్.మురళి ప్రిన్సిపల్‌గా, లెఫ్టినెంట్ కమాండర్ వి.ఎస్.యాదవ్ హెడ్‌మాస్టరుగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. ఇరవైతొమ్మిది మంది ఉపాధ్యాయులున్నారు. ఏటా ఆరు, తొమ్మిది తరగతులకు ప్రవేశ పరీక్ష ఉంటుంది. పరీక్ష నిర్వహించే సంవత్సరం జులై 20 నాటికి పదేళ్లు నిండినవారు ఆరో తరగతిలో, పదమూడేళ్లు నిండినవారు తొమ్మిదో తరగతిలో ప్రవేశానికి అర్హులు. ప్రవేశ పరీక్షలో వచ్చిన ర్యాంకు ఆధారంగా తొలి ఏడాది రూ.76,000 ఫీజుగా చెల్లించాలి. తరువాత ఏడాది నుంచి, ప్రతిభ ప్రాతిపదికన 50 శాతానికి పైగా ఉపకార వేతనం రూపంలో లభిస్తుంది. ఈ ఫీజుతోనే భోజనం, వసతి కల్పిస్తారు. దుస్తులు, బూట్లు సరఫరా చేస్తారు (మరిన్ని వివరాలకు sainikschoolkorukonda.org).

### బాల సైనికులు...

మీలో ఆ సత్తా ఉందా?

త్రివిధ దళాల అధికారులకు శిక్షణ ఇచ్చే నేషనల్ డిఫెన్స్ అకాడమీ ప్రవేశ ప్రకటనల్లో కనిపించే నినాదమిది. నిజమే, 'ఆ సత్తా...' ఏ కొద్దిమందిలోనో ఉంటుంది. అందుకే ఇప్పటికీ సైన్యంలో బోలెడన్ని ఖాళీలు. చదువుంటే ఆత్మవిశ్వాసం ఉండదు. ఆత్మవిశ్వాసం ఉంటే చదువుండదు. రెండూ ఉన్నా క్రమశిక్షణ లేనివారు ఎంతోమంది. క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం... బాల్యం నుంచే నూరిపోస్తే సత్తా ఉన్న కొత్తతరాన్ని నేరుగా సైన్యంలోకి స్వాగతించవచ్చు. రక్షణ దళాల్లో ఏ ఒక్క ప్రాంతానికో ఏ ఒక్క రాష్ట్రానికో అధిక ప్రాధాన్యం







# మా బడి

**గురువులకు నమోన్నమః. తరగతి గదికి సలామ్. ఆటమైదానానికి వందనం. పరిశోధనశాలలకు నమస్కారాలు. నేస్తాలకు వెచ్చని కరచాలనాలు. ఆ జ్ఞాపకాలు అనుభూతుల డైరీలో రంగుల నెమలీకలు.**

## నాకో లక్ష్యాన్నిచ్చింది!



*– మల్లి మస్తాన్‌బాబు, పర్వతారోహకుడు*

ఏడు ఖండాల్లోని ఏడు ఎత్తయిన పర్వతాల్ని అతితక్కువ సమయంలో అధిరోహించి గిన్నిస్ రికార్డుల్లో స్థానం సంపాదించుకున్నాను. ఈ అరుదైన విజయానికి కారణం... నేను చదివిన సైనిక్ స్కూలే! నెల్లూరు జిల్లాలోని ఓ పల్లెటూళ్లో పుట్టాన్నేను. బడంటే అంత పెద్దగా ఉంటుందని కల్లోకూడా ఊహించలేదు. ఓసారి మా స్కూల్లో కెప్టెన్ విజయభాస్కర్ విగ్రహావిష్కరణ జరిగింది. ఆయన సైనిక్ స్కూలు పూర్వవిద్యార్థి. ఎవరెస్టు శిఖరాన్ని అధిరోహిస్తూ ప్రమాదవశాత్తు ప్రాణాలు కోల్పోయారు. ఆ సాహసం నన్ను కదిలించింది. అప్పటి నుంచి ఆయనే నా హీరో! ఎవరెస్టు శిఖరం అంచున నిలబడాలన్న కల ఊరిస్తూ ఉండేది. ఎన్నో సవాళ్లను అధిగమించి దాన్ని నిజం చేసుకున్నాను. అంతటితో ఆగలేదు... ప్రపంచంలోని అత్యున్నత శిఖరాలన్నీ ఎక్కాను. నాకో లక్ష్యాన్నీ నా జీవితానికో అర్థాన్నీ ఇచ్చిన కోరుకొండ సైనిక పాఠశాలకు శతకోటి వందనాలు!

## ఆ తర్వాత నేనే ఫస్టు!



*– సి.కె.బాబు, చార్టర్డ్ అకౌంటెంట్*

బాగా గుర్తుంది. ఏడో తరగతి పరీక్షల్లో నాకు తక్కువ మార్కులొచ్చాయి. మళ్లీ ఆరోతరగతికి పంపేశారు. స్కాలర్‌షిప్ కూడా ఇవ్వలేదు. దీనివల్ల నాన్నగారు ఎక్కువ ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. ఇక లాభంలేదని, నన్ను పాఠశాల నుంచి వెనక్కి తీసుకెళ్లాలని ఆయన నిర్ణయించుకున్నారు. ఆ విషయం తెలియజేస్తూ ప్రిన్సిపల్ ఆల్మేడాగారికి ఉత్తరం కూడా రాశారు. సైనిక్‌స్కూలు విద్యార్థుల్ని నెలనెలా ఏదో ఒకచోటికి తీసుకెళ్తుంటారు. అలా మమ్మల్ని కూడా తీసుకెళ్లారు. అక్కడ ప్రిన్సిపల్‌గారు నన్ను దగ్గరికి పిలిచారు. బిక్కుబిక్కుమంటూ వెళ్లాను. అందులోనూ నాకు తక్కువ మార్కులు వచ్చాయి. ఎలాంటి శిక్ష వేస్తారో అన్న భయం. ఆయన మాత్రం ఆ విషయాలేవీ మాట్లాడకుండా, ప్రేమగా నన్ను ఒళ్లో కూర్చోబెట్టుకున్నారు. 'మీ నాన్నగారి ఉత్తరం అందింది. నిన్ను తీసుకెళ్తానని అంటున్నారు. నాకు మాత్రం నువ్వు బాగా చదువుతావనే నమ్మకం ఉంది. నా నమ్మకాన్ని వమ్ముచేయనని మాటివ్వు' ... ఆ అభిమానానికి నా కళ్లలో నీళ్లు తిరిగాయి. కొద్దిరోజుల తర్వాత జరిగిన నెలవారీ పరీక్షల్లో... క్లాస్‌ఫస్ట్ నేనే!





లభించడం, కొన్ని ప్రాంతాలకు అసలు ప్రాతినిధ్యమే లేకుండాపోవడం ఏమంత మంచిపరిణామం కాదు. సైనిక పాఠశాలల ఏర్పాటు వల్ల ఆ పరిస్థితి రాదు.

కోరుకొండ సైనిక పాఠశాలలో ప్రతి విద్యార్థీ సైనికుడే, రేపటి సైనికుడు. పాఠాలు, శారీరక శిక్షణ, మానసిక వికాసం... చదువులన్నీ ఈ మూడు అంశాల్నీ దృష్టిలో పెట్టుకునే సాగుతాయి. సిలబస్ విషయంలో సీబీఎస్‌సీ విధానాన్ని అనుసరిస్తారు. అత్యాధునిక బోధన పద్ధతులన్నీ అందుబాటులో ఉన్నాయి. అర్థం చేసుకోడానికి, నిత్యజీవితంలో అన్వయించుకోడానికి అధిక ప్రాధాన్యమిస్తారు. ప్రతి ఉపాధ్యాయుడూ ఒక్కో బృందాన్ని పర్యవేక్షిస్తుంటాడు. ఉపాధ్యాయుల ఎంపికలో యాజమాన్యం చాలా జాగ్రత్తలు తీసుకుంటుంది. ఎందుకంటే, నైతిక విలువలనేవి ఉపాధ్యాయుడి నుంచే విద్యార్థికి సంక్రమిస్తాయి. అందులోనూ బోర్డింగ్ స్కూళ్లలో అమ్మానాన్నల పాత్ర కూడా ఉపాధ్యాయుడిదే. అంత అంకితభావం ఉన్న సిబ్బంది దొరకడం సైనిక్‌స్కూలు అదృష్టం. తొలి ప్రిన్సిపల్ ఆల్మెడా మాస్టారు అంకితభావం గురించి అయితే, ఇప్పటికీ కథలుగా చెప్పుకుంటారు. ఆయనకో గుర్రం ఉండేదట. దానిమీదెక్కి స్కూలు ఆవరణంతా తిరిగేవారట. క్రమశిక్షణలో ఆయన చండశాసనుడు, ఆత్మీయతలో మాత్రం చల్లని దేవుడు. పిల్లలంతా పడుకున్నాక... నిశ్శబ్దంగా హాస్టలు గదుల్లో తిరిగేవారట. చలికి ముడుచుకుపోయినవారికి వెచ్చని దుప్పటి కప్పేవారట. కన్నవారి మీద బెంగపెట్టుకున్నవారిని గుండెలకు హత్తుకునేవారట. ఆయన శ్రీమతి జెన్నీ, విద్యార్థుల్ని సొంత బిడ్డల కంటే మిన్నగా చూసుకునేవారట. భోజనశాలకు ఆయన పేరుపెట్టి రుణం తీర్చుకునే ప్రయత్నం చేసింది పాఠశాల యాజమాన్యం.

సైనిక పాఠశాలలో చదువులకెంత విలువనిస్తారో, ఆటలకంత ప్రాధాన్యం ఇస్తారు. శారీరక శిక్షణకూ సాంస్కృతిక కార్యక్రమాలకూ అంతకంటే పెద్దపీట వేస్తారు. ఆటలంటే ఒట్టి ఆటలు కాదు. అవి వ్యక్తిత్వ వికాస మార్గాలు. కలసి ఉండటంలో, కలసి గెలవడంలో ఉన్న ఆనందం ఎంత గొప్పదో నేర్పించడానికి ఆటలే సాధనాలు. ప్రతి విద్యార్థీ కనీసం రెండు క్రీడల్లో ప్రావీణ్యం సాధించాలి. ఫుట్‌బాల్, క్రికెట్, బాస్కెట్‌బాల్, వాలీబాల్, బ్యాడ్మింటన్, లాన్ టెన్నిస్, స్క్వాష్, స్కేటింగ్, బాక్సింగ్, జిమ్నాస్టిక్స్, బిలియర్డ్స్, టేబుల్ టెన్నిస్... జాబితాలోంచి వేటినైనా ఎంచుకోవచ్చు. శాప్ నుంచీ ఈస్టర్న్ నేవల్ కమాండ్(విశాఖపట్నం) నుంచీ క్రీడాశిక్షకులు వస్తారు. చిత్రలేఖనం, బొమ్మల తయారీ, ఫొటోగ్రఫీ, సంగీతం, నృత్యం తదితర హాబీలకు తగిన స్థానం ఇస్తారు. విద్యార్థులు కళాసాధనకూ కొంత సమయం కేటాయించాల్సిందే. వక్తృత్వం, నాటికలు, నాటకాలు ... పిల్లల్లోని సృజనను వెలికితీస్తాయి. ఎన్‌సీసీలో చేరడం తప్పనిసరి. కొండలూ గుట్టలూ ఎక్కాల్సిందే. సైక్లింగ్, స్కూబా డైవింగ్ వంటి వాటిలో తర్ఫీదు పొందాల్సిందే. ఆరోగ్యవంతమైన శరీరంలోనే ఆరోగ్యవంతమైన మనసు ఉంటుంది. ఆరోగ్యవంతమైన మనసే సృజనాత్మకంగా ఆలోచిస్తుంది. అద్భుతాల్ని ఆవిష్కరిస్తుంది.

## సకలసౌకర్యాలూ...

దేశంలోని అత్యుత్తమ పాఠశాలల్లో ఉండే వసతులన్నీ కోరుకొండ సైనిక్ స్కూల్లో ఉన్నాయి. విశాలమైన తరగతి గదులున్నాయి. ఏడువందల మంది ఒకేసారి కూర్చోడానికి అనువైన ఆడిటోరియం ఉంది. చక్కని భోజనశాల ఉంది. సకల సౌకర్యాల విద్యార్థి గృహాలున్నాయి. జాతీయ ప్రమాణాల ఈత కొలను, స్కేటింగ్ రింక్, ఫైరింగ్ రేంజి... సైనిక్ స్కూల్లో ఆధునిక వసతులకు కొదవే లేదు. అమెరికాలోని సైకోరియన్లు (సైనిక్ స్కూలు పూర్వ విద్యార్థులు) 14,000 డాలర్లతో అత్యాధునికమైన కంప్యూటర్ ల్యాబ్ ఏర్పాటు చేశారు. వివిధ దినపత్రికలు, వారపత్రికలు, రిఫరెన్స్ పుస్తకాలతో కళకళలాడే గ్రంథాలయమూ ఉంది. 35ఎంఎం, 16ఎంఎం ప్రొజెక్టర్లతో సినిమా థియేటర్లు ఉన్నాయి.

## గురువుల పేర్లన్నీ గుర్తున్నాయి



*– చరణ్‌రెడ్డి, ఐపీఎస్, డి.ఐ.జి. సీఐడీ, బెంగళూరు*

**కోరుకొండ సైనిక పాఠశాలలో ఏడు సంవత్సరాల చదువు (1977-84) నా జీవితాన్నీ ఆలోచనల్నీ మార్చేసింది. క్రమశిక్షణ అంటే ఏమిటో, అదెంత విలువైందో అక్కడే తెలిసింది. నేను ఐపీఎస్ అధికారిని అయ్యానంటే ఆ చదువుల పుణ్యమే. ఎం.కె.అబ్రహాం బోస్, బి.వెంకటేశ్వర్లు, ఎన్‌సిఎస్ రావు, బసవయ్య, కె.వి.రమణ... మాకు పాఠాలు చెప్పిన మాస్టార్ల పేర్లన్నీ నాకింకా గుర్తున్నాయి. మరచిపోడానికి వాళ్లేమైనా మామూలు మనుషులా... నా వ్యక్తిత్వ నిర్మాతలు.**

## మళ్లీ చదవాలని ఉంది!



*– విజయభాస్కర్, సినీ దర్శకుడు*

**సైనిక్ స్కూల్ నా దృష్టిలో గుడే! అది విద్యనే కాదు వ్యక్తిత్వాన్నీ ఇచ్చింది. అక్కడ కులాలుండవు. మతాలుండవు. రాజకీయాలుండవు. ఒక్కొక్కరికీ ఒక్కో నంబరు ఉంటుంది. నా నంబరు... 999 (ఇప్పటికీ విజయభాస్కర్ ఫోన్ నంబర్లో చివరి అంకెలు మూడు తొమ్మిదులే). సైనిక్‌స్కూలు గొప్పదనం, బయటికి వచ్చిన తర్వాత కానీ అర్థంకాదు. అక్కడ చదవడం నా అదృష్టం. స్కూలు వాళ్లు కనుక ఒప్పుకుంటే... మరొక్కసారి చదువుకోవాలని ఉంది!**

## లైట్స్...కెమేరా...యాక్షన్!



సైనిక పాఠశాలలో పురాతన భవనంతోపాటు తీర్చిదిద్దినట్టు ఉండే రహదారులు, కనుచూపు మేరా పచ్చదనం ఆహ్లాదాన్ని పంచుతాయి. అందువల్లే ఇక్కడ సినిమా షూటింగులూ జరుగుతుంటాయి. ఇప్పటివరకు ఎనిమిది సినిమాలు రూపుదిద్దుకున్నాయి. సెంటిమెంటుగా కొందరు హీరోలు పట్టుబట్టి మరీ ఇక్కడ చిత్రీకరణకు వస్తుంటారు. నాగవల్లి, బొబ్బిలి సింహం, నరసింహనాయుడు, కృష్ణబాబు, అల్లరి రాముడు, ఆది, రాఘవయ్యగారి అబ్బాయి చిత్రాలకు ఇక్కడ షూటింగ్ జరిగింది. విక్రమ్ కథానాయకునిగా నటించిన ఓ తమిళ సినిమాలో చాలాభాగం స్కూలు ఆవరణలోనే తీశారు.

## స్ఫూర్తి కేంద్రం

*– గ్రూప్ కెప్టెన్ ఆర్.మురళి, ప్రిన్సిపల్*



ఇక్కడ చదువుకున్న ఎంతోమంది విద్యార్థులు సైన్యంలో గొప్ప హోదాల్లో ఉన్నారు. వృత్తి ఉద్యోగాల్లో ఉన్నత స్థాయికి ఎదిగారు. ప్రస్తుత విద్యార్థులకు ఆ విజేతలే కొండంత స్ఫూర్తి. ఆ విజయగాథలే ఉపాధ్యాయుల అంకిత భావానికి నిలువెత్తు నిదర్శనాలు. ఈ విద్యాసంస్థకు ప్రిన్సిపల్‌గా పనిచేస్తున్నందుకు గర్వంగా ఉంది. వీలైనంత ఎక్కువమంది కేడెట్లను నేషనల్ డిఫెన్స్ అకాడమీకి పంపాలన్నది మా ఆశయం. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడం ద్వారా, జాతి నిర్మాణంలో సైనిక్‌స్కూలు తనవంతు పాత్రను సమర్థంగా పోషిస్తోంది.

రక్షణ శాఖ క్యాంటీన్‌లో చాలా వస్తువులు చవగ్గా దొరుకుతాయి. 'ఆ సౌకర్యాలన్నీ ఉపయోగించుకుని విద్యార్థులు ప్రతిభావంతులుగా తయారుకావాలన్నదే మా ఆశయం' అంటారు ప్రిన్సిపల్ మురళి.

### రేపటి సైనికులు...

రక్షణదళాల్లో ప్రవేశానికి అవకాశం కల్పించే నేషనల్ డిఫెన్స్ అకాడమీ (ఎన్‌డీఏ), ఎస్ఎస్‌బీ పరీక్షలకు ఇక్కడ ప్రత్యేక శిక్షణ ఇస్తారు. 1965 నుంచీ ఏటా కోరుకొండ విద్యార్థులు ఎంపికవుతూనే ఉన్నారు. ఇప్పటి వరకు 600మందికి పైగా త్రివిధ దళాల్లో సేవలందిస్తున్నారు. ఏవైనా కారణాల వల్ల (దృష్టి లోపం, శారీరక దృఢత్వం లేకపోవడం...) రక్షణ విభాగంలో ఉద్యోగం రాకపోయినా... సైనిక్‌స్కూలు విద్యార్థులు తమకు ఆసక్తి ఉన్న వృత్తి ఉద్యోగాల్లో సులభంగా స్థిరపడిపోతారు. ఎక్కడికెళ్లినా తమ ప్రత్యేకతను చాటుకుంటారు. ఇప్పుడు సైకోరియన్లు ప్రపంచమంతా విస్తరించారు. సివిల్‌సర్వీసుల్లో కూడా కోరుకొండ హవా నడుస్తోంది. ఐఏఎస్, ఐపీఎస్, ఐఆర్ఎస్ వంటి అఖిల భారత సర్వీసుల్లో వందమందికి పైగా ఉన్నారు. రిజర్వు బ్యాంకు గవర్నరు దువ్వూరి సుబ్బారావు ఈ పాఠశాల నుంచి ఐఏఎస్‌కు ఎంపికైన తొలి విద్యార్థి. 1962 నుంచి 1968 వరకు సైనిక పాఠశాలలో చదువుకున్నారాయన. అంతా ఆటపాటలతో కాలక్షేపం చేస్తుంటే దువ్వూరి మాత్రం దూరంగా గ్రంథాలయంలో కూర్చుని పుస్తక పఠనంలో మునిగిపోయేవారట. అందుకే 'పుస్తకాల పురుగు' అన్న పేరొచ్చింది. కర్ణాటక కేడర్ ఐపీఎస్ అధికారి చరణ్‌రెడ్డి ఇక్కడే చదువుకున్నారు. ప్రవాస భారతీయ శాస్త్రవేత్త ఎస్. ఆర్. కె. రెడ్డి కూడా సైనిక్ స్కూలు విద్యార్థే. ఒకరా ఇద్దరా... ఆ జాబితా చాలా పెద్దది. అందులో ఎవర్ని కదిలించినా తమ పాఠశాల గురించి తన్మయంగా చెబుతారు.

### స్వయం సమృద్ధి

కోరుకొండ సైనిక పాఠశాలకు నిధుల కొరత లేదు. ఆశగా ప్రభుత్వం వైపు చూడాల్సిన అగత్యమూ లేదు. మహా అయితే, భవన నిర్మాణాలకు మాత్రం ఎంతోకొంత సాయం అవసరం అవుతుంది. రోజువారీ ఖర్చులకు సొంత వనరులే సరిపోతాయి. డాక్టర్ పి.వి.జి.రాజు దూరదృష్టితో ఇచ్చిన 206 ఎకరాల భూమిలో దాదాపు 40 ఎకరాల్లో పాఠశాల, హాస్టలు భవనాలున్నాయి. 48 ఎకరాలు క్రీడా ప్రాంగణానికి కేటాయించారు. మిగతా 118 ఎకరాల్లో ఆహారధాన్యాలు, కూరగాయలు పండిస్తారు. పాల కేంద్రాన్ని నిర్వహిస్తున్నారు. సొంత అవసరాలకు పోగా, మిగిలిన ఉత్పత్తులను మార్కెట్లో అమ్మేస్తారు. దీని ద్వారా గణనీయమైన ఆదాయమే సమకూరుతోంది.

### సైకోరియన్ల సేవ

ఇక జీవితంలో స్థిరపడిపోయాం అన్న భరోసా కలిగాక, సాధించాల్సిన ప్రధాన లక్ష్యాల్ని సాధించామన్న సంతృప్తితో పరుగును కాస్త తగ్గించాక... సైకోరియన్ల మనసు పాఠశాల మీదికి మళ్లింది. పాఠశాలను తలుచుకోగానే





తమకో జీవితాన్నిచ్చిన మహావ్యక్తి ఆల్మెడా మాస్టారు గుర్తుకొచ్చారు. అప్పటికి ఆయన పదవీ విరమణచేసి విశ్రాంతి తీసుకుంటున్నారు. శిష్యులంతా ప్రేమతో ఆయనను హైదరాబాద్‌కు ఆహ్వానించారు. అపురూపమైన ఆతిథ్యం ఇచ్చారు. కానీ, గురువుగారిలో ఏదో అసంతృప్తి. 'మీరంతా ఉన్నత స్థానాల్లో ఉన్నారు. చాలా సంతోషం. మీకింత సంపదనూ హోదానూ ఇచ్చిన సమాజానికి ఏం చేస్తున్నారు?'... ఎలాంటి ఉపోద్ఘాతాలూ లేకుండా సూటిగానే తన మనసులోని మాట చెప్పారు ఆల్మెడా. అప్పుడే అందర్లో 'ఏదో చేయాలి' అన్న ఆలోచన మొలకెత్తింది.

'వృద్ధాశ్రమం ప్రారంభిస్తే...' ఎవరో ప్రతిపాదించారు.

'చివరి అంకంలో ఉన్నవారి గురించి కాదు, లేలేత బాల్యం గురించి ఆలోచించండి. చెత్తకుండీల పక్కనా, రైల్వే ప్లాట్‌ఫారాల మీదా ఎంతోమంది అనాథల్ని చూశాను. వాళ్లకో మంచి జీవితాన్ని ఇవ్వండి' దిశానిర్దేశం చేశారు మాస్టారు. శిరసావహించారు శిష్యులు. గురుదక్షిణగా హైదరాబాద్ శివార్లలో 'కృషి హోమ్' ప్రాణంపోసుకుంది. ఆ సంస్థ అనాథలకూ వివిధ కారణాలతో వీధులపాలైన బాలలకూ అండగా నిలబడుతోంది. నిలదొక్కుకోడానికి అవసరమైన ఆసరా ఇస్తోంది. ప్రభుత్వ పాఠశాలల్లో కనీస సౌకర్యాలు కల్పించడానికీ తనవంతు సాయం అందిస్తోంది. పూర్వ విద్యార్థుల సంఘం హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్నం శాఖలు రక్తదాన ఉచిత వైద్యశిబిరాలు వంటి ఎన్నో కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయి. 'ఫర్ వాట్ వియ్ హావ్ రిసీవ్డ్, లెటజ్ బి థ్యాంక్‌ఫుల్...' అంటూ భోజన సమయంలో చెప్పుకున్న ప్రార్థనను ఏ సైనిక్ స్కూలు విద్యార్థి అయినా ఎలా మరచిపోగలడు.

*– జి.రమణమూర్తి, న్యూస్‌టుడే, విజయనగరం*

ఫొటోలు: జె.ఎ.నాయుడు



అక్కడ... బెల్జియం కుర్రాడికి ఉపనయనం అవుతుంటుంది. ఇంకో బుల్లిపాపాయికి అన్నప్రాసన. ఐదారేళ్ల అమెరికన్ పిల్లాడు బుద్ధిగా పసుపురాసిన పలకమీద 'ఓంనమః శివాయః సిద్ధం నమః' దిద్దుతుంటాడు. విదేశీ ముత్తయిదువలు పసుపుకుంకుమలు ధరించి పట్టుచీరల్లో ముస్తాబై మురిసిపోతుంటారు. ఏటా జనవరి 11, 12, 13 తేదీల్లో విశాఖలోని జగద్గురు పీఠంలో జరిగే గురుపూజా మహోత్సవాల్లో కనిపించే అపురూప దృశ్యాలివి.



# విదేశీ వైదికులు

భారతీయుల కట్టుబొట్టు మెచ్చే విదేశీయులు ఎందరో. అందులో కొందరికి మన సంస్కృతీ సంప్రదాయాలంటే మరీ మక్కువ. అలాంటి వారి కోసమే వెలసింది అంతర్జాతీయ ఆధ్యాత్మిక, సేవా సంస్థ... జగద్గురు పీఠం (వరల్డ్ టీచర్ ట్రస్టు). దీనికి వేదిక విశాఖ. ఏటా జనవరిలో ఇక్కడ జరిగే గురుపూజా మహోత్సవాల్లో విదేశీయులకు వైదిక సంస్కారాలు చేస్తారు. అందుకే ప్రపంచం నలుమూలల నుంచీ విదేశీయులు ఆ సమయంలో ఇక్కడికి రెక్కలు కట్టుకుని వాలిపోతారు. ఇక్కడే తమ పిల్లలకు ఉపనయనాలూ నామకరణాలూ అన్నప్రాసనలూ అక్షరాభ్యాసాలూ వివాహాలు భారతీయ సంప్రదాయం ప్రకారం చేయించుకుంటారు. సింహాచలం దేవస్థానం దిగువన ఉన్న పుష్కరిణి కల్యాణ మంటపంలో గతయాభయ్యేళ్లుగా ఈ ఉత్సవాలను నిర్వహిస్తున్నారు. కుల, మత, వర్గ, పేద, ధనిక భేదాలు లేకుండా సేవకులు, యోగసాధకులే అంతా తామై జరిపించే వేడుకలివి.

### ఐదు దశాబ్దాల క్రితం...

జగద్గురు పీఠం వ్యవస్థాపకులు కులపతి ఎక్కిరాల కృష్ణమాచార్య (మాస్టర్ ఇ.కె.) చేతుల మీదుగా మాస్టర్ సి.వి.వి. గురుపూజా మహోత్సవాలు 1962లో గుంటూరులో తొలిసారిగా మొదలయ్యాయి. ఆ తర్వాత విశాఖపట్నానికి మారాయి. 1978 నుంచి ఈ ఉత్సవాలను సింహాచలంలో కొనసాగిస్తున్నారు. 1984 వరకు మాస్టర్ ఇ.కె. వీటిని విశాఖలో స్వయంగా జరిపారు. యోగ, ధ్యానం, ప్రార్థన, పూజలూ అభిషేకాలూ హోమాలను ఈ మూడు రోజుల్లో నిర్విరామంగా నిర్వహిస్తారు. ఎలాంటి ప్రవేశ రుసుం తీసుకోకుండా భోజన వసతి సదుపాయాలు సమస్తం నిర్వాహకులే సమకూరుస్తారు. కాకపోతే ముందుగా పేర్లు నమోదు చేయించుకుంటే చాలు. క్రమబద్ధంగా, క్రతుబద్ధంగా జరిగే ఈ ఉత్సవాల్లో పాల్గొనడం కోసం ఈసారి దాదాపు 5 వేల మంది ప్రతినిధులు రానున్నారని అంచనా. స్విట్జర్లాండ్, జర్మనీ, వెనెజులా, స్పెయిన్, బెల్జియం, ఫ్రాన్స్, డెన్మార్క్, అర్జెంటీనా, ఇటలీ, ఇంగ్లండ్, అమెరికా, తదితర దేశాల నుంచే కాకుండా మన దేశంలోని భిన్న రాష్ట్రాల నుంచి సాధకులు, ప్రతినిధులు తరలిరానున్నారు.

### సర్వమానవ సౌభ్రాతృత్వం...

'అందరికీ అమరత్వం... అందరికీ బ్రహ్మత్వం' అని మాస్టర్ సి.వి.వి. చెప్పిన దానికి అనుగుణంగా ఈ ఉత్సవాలను నిర్వహిస్తున్నారు. కులమతాలకతీతంగా లౌకిక, వైదిక జీవన సమన్వయం ద్వారా ఉత్తమ జీవనాన్ని సాగించవచ్చని తెలియజేయడమే ఈ వేడుకల లక్ష్యం. ఇక్కడి గురుపూజా వేదికపై ఏర్పాటు చేసే చిత్రపటాల్లోనే ఆ సామరస్యత కొట్టొచ్చినట్లు కనిపిస్తుంది. రాముడు, క్రీస్తు వంటివారి పటాలతో పాటు లోక హితం కోసం తమ జీవితాలను అర్పించిన దేశవిదేశీ మహాత్ముల, పరమ గురువుల చిత్రపటాలనూ వేదికపై అలంకరింపజేస్తారు. రామాయణం, భాగవతం, భగవద్గీత, పతంజలి యోగసూత్రాలు వంటివే కాకుండా యూదు, క్రైస్తవ విజ్ఞానాన్నీ... గ్రీకు, ఈజిప్టు, మెక్సికో తదితర ప్రాచీన నాగరికతల విజ్ఞాన సమన్వయాన్నీ ఇక్కడ ప్రవచిస్తారు. విష్ణు, లలితా సహస్రనామాలను సామూహికంగా పఠిస్తారు. వేదసూక్తాలు గానం చేస్తారు. ఆంగ్ల మంత్రాలు, ఆ భాషలోని ప్రార్థనలూ వీనుల విందుగా వినిపిస్తాయి. ఇవన్నీ విశ్వమానవ కల్యాణాన్ని కాంక్షించి చేసేవే. వీటిలో పాల్గొనడం కోసం విదేశీ మహిళలు సయితం అచ్చమైన భారతీయ స్త్రీమూర్తుల్లా చీరకట్టులో హాజరవుతారు.

విశాఖలో గురుపూజా వేదికలపై ఇప్పటి వరకూ దాదాపు 2500 మందికి అన్నప్రాసనలూ అక్షరాభ్యాసాలూ వెయ్యికిపైగా ఉపనయనాలూ కన్నుల పండువగా జరిగాయి. జగద్గురు తత్వం ఒక్కటేననీ, అది విశ్వవ్యాపకమైన చైతన్యమని గురుపూజల్లో చెబుతుంటారు. ఉత్సవాల్లో ప్రతి ఏడాది పలు గ్రంథాల ఆవిష్కరణ జరుగుతుంటుంది.

### మానవ సేవ...

జగద్గురు పీఠం ఆధ్వర్యంలో కేవలం గురుపూజోత్సవాలే కాకుండా ఇతర సేవా కార్యక్రమాలూ పెద్దఎత్తున జరుగుతుంటాయి. ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్ణాటక, పశ్చిమ బెంగాల్, తదితర రాష్ట్రాల్లో 40 హోమియో కేంద్రాల ద్వారా లక్షలాది మందికి ఉచిత వైద్యసేవలు అందిస్తున్నారు. ఆధునిక విద్యతో పాటు మానవతా విలువల్నీ, సంస్కారాన్ని పెంపొందించడానికి బాలభాను విద్యాలయాల పేరుతో పాఠశాలలను కూడా నిర్వహిస్తున్నారు. జగద్గురు పీఠం వారుదాదాపు 21 దేశాల్లో తమ సేవలను విస్తరించారు.

విశాఖలోని సింహాచలంలో జరిగే గురుపూజోత్సవాలకు అదనంగా జగద్గురు పీఠానికి చెందిన వివిధ శాఖలు కొన్నేళ్లుగా వేర్వేరు చోట్ల వీటిని నిర్వహిస్తున్నాయి. 1988 నుంచి విదేశాల్లోనూ సహజీవన సదస్సుల పేరిట వీటిని నిర్వహిస్తూ వస్తున్నారు. సత్సాధకులు, జిజ్ఞాసుల సమ్మేళనంగా నిర్వహించే ఈ గురుపూజోత్సవాలు విశ్వమానవ కల్యాణానికి తోడ్పడడం అభినందనీయం కదూ!

– మునగవలస శ్రీనివాస పట్నాయక్, న్యూస్‌టుడే, విశాఖపట్నం



మాస్టర్ ఇ.కె. మాస్టర్ సి.వి.వి.



కథ



# సుసంపన్నం

**- దర్భాలక్ష్మీ అన్నపూర్ణ**

ఉదయం నుంచి సాయంకాలం వరకూ ఊపిరిసలపని పనితో అలసిపోయిన రవిచంద్రకి అప్పుడే వికసించిన పుష్పంలా తాజాగా లేత గులాబీరంగు కాటన్‌చీరలో చిరునవ్వులు చిందిస్తూ తలుపుతీసిన భార్యని చూడగానే ఆఫీసులోపడ్డ శ్రమంతా ఎవరో మంత్రంవేసి చటుక్కున తీసేసినట్టుగా అనిపించింది. తన జీవనసఖి వైపు అనురాగ పూరితంగా చూస్తూ కాళ్ళకి ఉన్న బూట్లు విప్పి సోఫాలో వెనక్కి చేరగిలబడ్డాడు. భర్త కనురెప్ప వెయ్యకుండా మురిపెంగా తనవైపు చూడటం గమనించిన సుచరిత తృప్తిగా తనలో తనే నవ్వుకుంటూ వంటింట్లోకి వెళ్ళి మంచినీళ్ళు తెచ్చి ఇచ్చింది.

ఆమె కాఫీ తెచ్చేలోపు రవిచంద్ర బట్టలు మార్చుకుని వచ్చాడు. కాఫీతోపాటు వేడివేడి పకోడీల ప్లేటు కూడా తెచ్చి అతనిముందు పెట్టింది. ఒక చేత్తో కాఫీకప్పు అందుకుంటూ మరోచేత్తో పకోడీని తీసి నోట్లో వేసుకుంటూ అన్నాడు "ఇంత త్వరగా పకోడీలు ఎలా తయారయిపోయాయ్? "

"అయిదు నిమిషాలక్రితం లేతగా వేయించి ఉంచాను. మీరు వచ్చే టైమవుతోందని నూనెని స్టవ్‌మీద సిమ్‌లోపెట్టి ఉంచాను. రాగానే కొద్దిగా వేయించి తెచ్చాను" తనకోసం కూడా కాఫీకప్పు తెచ్చుకుని భర్త పక్కన సోఫాలో కూర్చుంటూ చెప్పింది సుచరిత.

తనకి రాగానే వేడివేడిగా టిఫిను అందించటానికి భార్య తీసుకున్న ఆ చిన్నపాటి శ్రద్ధకి ముగ్ధుడయ్యాడు రవిచంద్ర.

"మీరూ నన్ను అంత అపురూపంగానే చూసుకుంటారుగా" అతని భుజంమీద తలవాలుస్తూ అంది సుచరిత.

"మనిషికీ మనిషికీ మధ్య ఉండే ఈ ప్రేమానురాగాలు, ఒకరి సుఖం గురించి ఇంకొకరు ఆలోచించటం - ఈ సృష్టిలోకెల్లా అద్భుతమైనది అనిపిస్తుంది కదూ. అసలు ఈ సృష్టిని సజావుగా, శోభాయమానంగా నడిపించేది ఈ ప్రేమ అన్న ఒక్క భావనేనేమో" ప్రేమ అనే భావాన్ని తన మనోనేత్రంతో సందర్శించుకోవటానికి ప్రయత్నిస్తూ అన్నాడు. సుచరిత అయితే వికసితవదనే అయింది.

రవిచంద్ర ఓ అర్ధగంటపాటు సేదతీరాక ముందుగా అనుకున్నట్టుగానే గుడికి వెళ్ళి వచ్చారు ఇద్దరూ. ఇంటికివచ్చి కాసేపు టీవీ చూసి భోజనాలు చేస్తూ ఉండగా వచ్చింది ఆ ప్రస్తావన. ఎందుకోగానీ ఈరోజు ఆఫీసు నుంచి వచ్చిన క్షణం నుంచీ ఏ పని చేస్తున్నా కూడా భార్యాభర్తల మధ్య ఉండే అపురూపమైన అనురాగబంధం గురించే ఆలోచిస్తున్న రవిచంద్ర భార్య చెప్పిన విషయాన్ని వెంటనే గ్రహించలేకపోయాడు.

అతను ఏదో ఆలోచనలో లీనమైపోయినట్టుగా ఉన్నాడన్న విషయం అప్పటికే గ్రహించిన సుచరిత అంది "ఏమిటండీ, వచ్చినప్పట్నుంచీ చూస్తున్నాను... ఏదో వేరేలోకంలో ఉన్నట్టుగా ఉన్నారు".

"అవును. నీ లోకంలోనే ఉన్నాను".

ఆ మాటకి ముసిముసిగా నవ్వుకుంటూ అతనికి సాంబారు వడ్డించింది.

"ఇందాక ఏదో చెబుతున్నట్లున్నావు, మళ్ళీ చెప్పు".

"భోజనాలయ్యాక చెబుతాను లెండి" అంది సుచరిత.

భోజనాలయ్యి మంచం మీద వాలి ఇద్దరూ చెరో పుస్తకం కాసేపు చూశాక సుచరిత తన మనసులోని మాట చెప్పాలనుకుంది. చెప్పటానికి కాస్తంత సంకోచంగానే అనిపించినా 'తనంటే ఇంత అనురాగం ఉన్న భర్త తన మాట కాదనడు' అనిపించింది మళ్ళీ. ఆ ధైర్యంతోనే ఆ ప్రసంగం ఎత్తింది. "ఏమండీ, మీ అత్తయ్యగారికి ఈ ఊళ్ళో ఆపరేషన్ చేయించాలని ఉందని అత్తయ్యగారు చూచాయగా చెప్పారు కదా, కానీ నేనిప్పుడే టీచర్ ట్రైనింగ్ కోర్సులోనూ కంప్యూటర్ కోర్సులోనూ చేరదాం అనుకుంటున్నాను కదా. ఇక్కడికి రావటం ఇప్పుడెలా కుదురుతుంది. అయినా ఆ ఊళ్ళో డాక్టర్లకేం కొదవని? "

"సో... అక్కడే చేయిస్తే బావుంటుందంటావ్ ఆపరేషన్" అన్నాడు రవిచంద్ర.

"అవునండీ"

రవిచంద్ర రెండుక్షణాలు ఏదో ఆలోచిస్తున్నట్టుగా ఉండిపోయాడు. తర్వాత అన్నాడు మంద్రస్వరాన "పాపం అత్తయ్యకి చిన్నప్పుడే భర్త పోవటంతో నాన్నగారి దగ్గరకి వచ్చేసింది. మా నాన్నగారిక్కూడా అత్తయ్యంటే ప్రాణం. ఆ ఆపేక్షతోటి ఆవిడకి మంచివైద్యం అందజేయాలని నాన్నగారి కోరిక. అమ్మక్కూడా ఆడపడుచంటే చాలా అభిమానం. అయినా నువ్వు చెప్పినట్టే చేద్దాం. అక్కడ మాత్రం వైద్యానికేం తక్కువని? "

భర్త అంత సులభంగా తన అభిప్రాయంతో ఏకీభవించెయ్యటం సుచరితకి చాలా ఆనందంగా అనిపించింది. "నేనంటే మీకెంత ఇష్టమండీ" అతని చేతిని తన చేతిలోకి తీసుకుంటూ అంది. కానీ ఆమె ఆ ఆనందం ఎంతసేపో నిలవలేదు.

మర్నాడు రవిచంద్ర ఆఫీసుకి వెళ్ళేముందు తల్లి దగ్గర్నుంచి ఫోన్ వచ్చింది- 'అత్తయ్య ఆపరేషన్ గురించి మీ ఊళ్ళో హాస్పిటల్లో ఎంక్వయిరీ చేశావా' అంటూ.

'ఇంకా లేదమ్మా, ఈరోజు నుంచీ ఆ పనిమీదనే ఉంటాను'.

రవిచంద్ర తల్లితో మాట్లాడటం విన్న సుచరిత ఒక్కక్షణం తెల్లబోయింది. మళ్ళీ ఒక్క క్షణం ఆలోచించి మనసుకి సర్దిచెప్పుకుంది. తల్లి మాటలకి మొహమాటపడి ఉంటాడు. తనమీద అతనికి బోలెడంత ప్రేమ! తన మాటని కాదనలేడు. తను కాస్త పట్టుదల పెంచితేసరి- రవిచంద్ర ఆ మొహమాటం లోంచి బయటపడతాడు అనుకుంది.

"నిన్నరాత్రి మనం ఏమనుకున్నాం- మర్చిపోయారా? మళ్ళీ అత్తయ్యగారికి మాట ఇచ్చేస్తున్నారు".

"ఏం చెయ్యను చరితా. 'కాదు' అని చెప్పటానికి మొహమాటంగా ఉంది".

అతని మాటతీరు చూస్తుంటే ఆపరేషన్ ఇక్కడ చేయించటానికే ఒప్పేసుకునేలా ఉన్నాడు. అదే జరిగితే తనకి బోలెడంత పనిభారం. ముగ్గురూ ఇక్కడికే వచ్చేస్తారు. ఎంతలేదన్నా రెండుమూడు నెలలైనా పడుతుంది. ఇక లాభంలేదు, తను బ్రహ్మాస్త్రం ఉపయోగించాలి అనుకుంది. "నేనంటే మీకు ప్రేమ ఉంటే నా మాట వినాలి, లేకపోతే ప్రేమ లేనట్టే" అంటూ భర్త కళ్ళలోకి ప్రేమ కోసం తపించిపోతున్నట్టుగా చూసింది.

"ఆ మాట అనకు సుచీ. నువ్వంటే నాకు ప్రాణం" రవిచంద్ర గొంతు నిజాయతీగా పలికింది.

"మరి నా మంచి గురించీ సంతోషం గురించీ ఆలోచిస్తారు కదూ!"

"అందులో నీకు సందేహమా? " రవిచంద్ర పెదవులపై చిరునవ్వు కదిలింది.

ఆ తర్వాత భర్త తనతో ఎప్పటిలాగానే ప్రేమగా అనురాగంగానే ఉండటంతో తన మాట, ఒక విధంగా డిమాండు- అతనికి కించిత్తయినా కోపం కలిగించలేదని అర్థం అయింది. అయినా అతనికి కోపం రావటానికి తను కోరరాని కోరిక, అసాధ్యమైన విషయం ఏమీ అడగలేదుగా! తల్లికి ఆనందంగా ఫోన్ చేసి చెప్పింది- "అమ్మా, నేను అనుకున్నట్టుగానే టీచర్ ట్రైనింగ్ కోర్సులోనూ కంప్యూటర్ కోర్సులోనూ ఒకేసారి చేరిపోయి బిజీ అయిపోతాను. ఇక ఆయన ఆఫీసుకి వెళ్ళాక తోచటంలేదు అన్న బాధ అస్సలు ఉండదు. వాళ్ళ అత్తయ్యా ఆపరేషనంటూ వాళ్ళందరూ ఇక్కడికి వచ్చేస్తారేమోనని భయపడ్డాను. ఆయనకి నేనంటే వల్లమాలిన ప్రేమమ్మా. ఏవఁడిగినా కాదనరు".

కూతురి మాటలు వింటున్న ఆ తల్లి తెగ మురిసిపోయింది.

★ ★ ★

ఆరోజు ఉదయం ఎప్పటికన్నా పెందరాళే లేచాడు రవిచంద్ర. "ఎందుకండీ, అప్పుడే లేచారు. ఆఫీసుకి తొందరగా వెళ్ళాలా? " అడిగింది సుచరిత.

"అదేంకాదు. అమ్మా నాన్నా అత్తయ్యా ఇవ్వాళ ట్రెయినుకి వస్తున్నారు. స్టేషనుకి వెళ్ళి తీసుకురావాలి. అత్తయ్య ఆపరేషను ఇక్కడే జరుగుతుంది" రవిచంద్ర స్నానం చేయటానికి బాత్‌రూమ్‌లోకి వెళ్ళిపోయాడు.

భర్తమాట విన్న సుచరిత దిగ్భ్రాంతురాలైంది. ఒక్కక్షణం ఎలా ప్రతిస్పందించాలో కూడా ఆమెకి అర్థంకాలేదు. 'తన భర్తకి తనంటే వల్లమాలిన ప్రేమ, తను ఏం కోరినా కాదనడు' అని అప్పటిదాకా నిర్మించుకున్న కలల మేడలన్నీ ఒక్కొక్కటీ కుప్పకూలిపోసాగాయ్.

తనని ఇంత దిగ్భ్రాంతికి గురిచేసే మాట చెప్పి ఏదో చిన్నమాట, మామూలుమాట చెప్పినట్టుగా భర్త అలా స్నానం చేయటానికి వెళ్ళిపోవటం- తన ఫీలింగ్సేమిటో అస్సలు పట్టించుకోకపోవటం- సుచరిత మనస్సుని అతలాకుతలం చెయ్యనారంభించాయి.

తనతో చెప్పకుండా, సంప్రదించకుండా తన భర్త ఇటువంటి నిర్ణయం తీసుకున్నాడు అంటే అతని ఆలోచనలో మనసులో తనకున్న విలువ ఏపాటిది? సుచరితకి తన కళ్ళ ఎదుట భూమి బద్దలైపోతున్నట్టుగా అనిపించసాగింది.

నిశ్శబ్దంగా ఇంత ఘాటుగా సమాధానం ఇచ్చిన భర్తని ఏ ప్రశ్నతో నిలదీయాలో కూడా ఆమెకాక్షణంలో అర్థంకాకుండా ఉంది. స్నానంచేసి వచ్చిన రవిచంద్ర- భార్య మానసికస్థితిని క్రీగంట గమనిస్తూనే తన పనులు ముగించుకోసాగాడు.



"మీరు ఇటువంటి నిర్ణయం తీసుకోబోతున్నట్టు నాకు ముందుగానే ఎందుకు చెప్పలేదు? నా మాటంటే పెద్ద విలువున్నట్టూ నామీద ఎంతో ప్రేమ ఉన్నట్టూ అలా నాటకాలాడటం ఎందుకు? " సుచరిత కళ్ళనిండా నీళ్ళు నిండిపోగా అడిగింది.

"నీమీద నాకు ఉన్న ప్రేమా నీ మాటంటే ఉన్న విలువా ఎప్పటికీ నాటకం కాదు. అది నిత్యసత్యం. వెళ్ళి బ్రష్ చేసుకునిరా- మనిద్దరికీ కాఫీ కలుపుతాను" సుచరిత భుజం మీద చెయ్యివేసి అనునయంగా అన్నాడు. తన తీవ్రమైన తిరస్కారాన్ని చూపించటానికి ఇదే సరైన క్షణం అని గ్రహించిన సుచరిత తన భుజంమీది అతని చేతిని విసురుగా తోసిపారేసింది. ఆమె ఆ చర్యకి అతను చిరునవ్వులు చిందిస్తూ "నీమీద నాకున్న ప్రేమ గురించి ఎటువంటి సంశయాలూ పెట్టుకోకు. నా ఈ హృదయంనిండా నిండివున్నది నువ్వే" అన్నాడు. తనముందు నిలబడి కొద్దిగా ముందుకి వంగి రెండుచేతులూ గుండెల మీద ఆనించుకుని రవిచంద్ర అన్న ఆ మాటా ఆ తీరూ అంత కోపంలోనూ సుచరితకి అద్భుతంగా అనిపించింది. అగ్నిగోళంలా మండుతున్న హృదయం మీద పన్నీటివాన కురిసినట్టుగా అనిపించింది.

"కోపం, తాపం అన్నీ పక్కనపెట్టి కాసేపట్లో అమ్మ నీమీద కురిపించబోయే వాత్సల్యాన్ని మనసారా ఆస్వాదించటానికి సిద్ధంగా ఉండు. టైమయింది, నేనింక బయలుదేరుతాను" అంటూ రవిచంద్ర తలుపు దగ్గరగా వేసి వెళ్ళిపోయాడు.

కొన్ని క్షణాలు నిశ్చేష్టగా ఉండిపోయిన సుచరిత ఇక తప్పనిసరై లేచింది. రవిచంద్ర మాటలూ ప్రేమాభివాదమూ పదేపదే కళ్ళముందు కదలాడుతుంటే మొహం కడుక్కోవటం ముగించి ఇల్లు సర్దుదాం అని దృష్టి సారించేసరికి అన్నీ ఎక్కడివక్కడ పెట్టినట్టు నీట్‌గా సర్ది ఉంది. సోఫాకవర్లు మార్చి ఉన్నాయి. రెండురోజులక్రితం కొన్న కొత్త కర్టెన్లు కిటికీలకీ గుమ్మాలకీ వేలాడుతూ కనిపించాయి.

కాఫీ కలుపుకుందామని వంటింట్లోకి వెళ్ళేసరికి ఉప్మా చేయటానికి సిద్ధంగా ఓ కప్పులో తరిగిపెట్టిన ఉల్లిపాయలు, పచ్చిమిరపకాయల ముక్కలు, కరివేపాకు, ఇంకో కప్పులో ఉప్మా రవ్వ ఉన్నాయి. సుచరిత మనసు మరికాస్త మెత్తబడింది. తన పని తగ్గించటానికీ సులభం చేయటానికేగా రవిచంద్ర ఇవన్నీ చేసింది అన్న భావన కలిగింది ఆమెకు.

మనిషి స్వభావంలో ఒక మేలైన కోణం ఉంది. అది... వీలైనంతవరకు ఎదుటిమనిషి తనతో మంచిగానే న్యాయబద్ధంగానే ఉన్నాడు, వ్యవహరించాడు అని అనుకోవటానికి ప్రయత్నించటం! ఎందుకంటే మనిషి ఎప్పుడూ తన మనసు ప్రశాంతంగా ఉండటాన్నే కోరుకుంటాడు కనుక.

సుచరిత కాఫీ కలుపుకుని తాగి, స్నానంచేసి సిద్ధంగా ఉంది అత్తగారూ మామగారూ పిన్నిగారూ వచ్చేసరికి.

"సుచీ... అమ్మా, నాన్న, అత్తయ్యలకి వేడి వేడి కాఫీ ఇచ్చెయ్. ట్రెయిన్‌లోనే మొహాలు కడిగేసుకున్నారట" రవిచంద్ర అన్నాడు.

సుచరిత వంటింట్లో కాఫీ కలుపుతుంటే రవిచంద్ర తల్లి జయలక్ష్మి వచ్చింది. "ఇక్కడికి రావాలా, వద్దా అన్న విషయంలో ఒక నిర్ధారణకి రాలేక తెగ సతమతమైపోయామనుకో. సరిగ్గా అప్పుడే రవి ఫోన్‌చేసి చెప్పాడు "సుచరిత అత్తయ్యకి ఆపరేషన్ ఇక్కడే జరగాలని అంటోంది. మంచి సదుపాయం అందుబాటులో ఉండగా సంశయించటం ఏమిటి అంటోంది అన్నాడు. అదిగో అప్పుడు ఒక నిర్ణయం తీసేసుకున్నాం. ఇప్పుడు నా మనసుకి తృప్తిగా ధైర్యంగా ఉంది. ఇక ఆ భగవంతుడి దయ" అంది కోడలి తలమీద చెయ్యివేసి రాస్తూ. రవిచంద్ర కూడా వచ్చి తల్లిపక్కనే నిలబడ్డాడు.

అత్తగారి మాటలకి సుచరిత ఒక్కసారిగా మనసులో ఉలిక్కిపడింది. అటువంటి పరిస్థి


## కలం కదిలించండి

సృజనాత్మకత కలిగిన రచయితలకూ రచయిత్రులకూ ఇదే ఆహ్వానం. మానవ జీవితంలోని విభిన్న పార్శ్వాలను స్పృశిస్తూ మధురమైన అనుభూతులను పాఠకులకు పంచే కథలకు 'ఈనాడు' స్వాగతం పలుకుతోంది. భావం ఏదైనా... కథనంలో వైవిధ్యం, పాఠకులను ఏకబిగిన చదివించగలిగే బిగువూ ఉండాలి. ఆశావహ దృక్పథంతో సాగే కథలకు ప్రాధాన్యం. కథ సాధారణ చేతి రాతలో ఏడు అరఠావులకు మించకూడదు.

*కథలు పంపాల్సిన చిరునామా:*

**ఆదివారం అనుబంధం**
**ఈనాడు కాంప్లెక్స్, సోమాజిగూడ,**
**హైదరాబాద్-82.**

తిలో కూడా అత్తగారి మాటల్లోని చందనపు చల్లదనం ఆమె హృదయాన్ని తాకింది. ఆ సౌరభం ఆమెలోని అణువణువునీ గుబాళింపచేసింది. అప్రయత్నంగా భర్తవైపు చూసింది. అతని కళ్ళల్లో ఆనందపు మెరుపు!

సుచరిత కాఫీ కలిపి కప్పుల్లోపోసింది. "ఇలా ఇవ్వమ్మా ఆ కాఫీలు- మీ మామగారికీ ఆడబడుచుకీ నేనిస్తాను" అంటూ అందుకుని జయలక్ష్మి హాల్లోకి వెళ్ళింది.

"అమ్మ నిన్ను అలా ప్రశంసిస్తుంటే వినటానికి నాకెంత ఆనందంగా ఉందో తెలుసా! ఎందుకంటే నువ్వు నా సుచరితవు కనుక" ఆమె కళ్ళలోకి చూస్తూ అన్నాడు రవిచంద్ర. ఆ చూపు సూటిగా ఆమె హృదయాన్ని తాకి అక్కడ ఏదో కదలిక. తనలో ఉన్న వ్యతిరేక భావనలేవో ఒళ్ళు విరుచుకుని లేచి తనలోంచి కదలి వెళ్ళిపోతున్న భావన! సుచరిత కళ్ళలోకి నీళ్ళు వచ్చేశాయి.

తండ్రి పిలుస్తూ ఉండటంతో రవిచంద్ర అక్కడ్నుంచి వెళ్ళిపోయాడు. చేతిలో కాఫీ కప్పుతో రవిచంద్ర అత్తయ్య సుభద్ర అక్కడికి వచ్చింది. "నా అన్నా వదినలకే నామీద అపారమైన అభిమానం అనుకున్నాను. వాళ్ళ కోడలికి కూడా నామీద ఇంత అభిమానం ఉందంటే నా అదృష్టానికి నేను పొంగిపోతున్నాను తల్లీ".

ఎదుటివారికి మనవల్ల కలిగిన ఆనందం, సౌకర్యం మనకి ఎంతటి ఆనందాన్నీ తృప్తినీ కలిగిస్తాయో సుచరితకి అనుభవంలోకి రాసాగింది.

వేడివేడి ఉప్మాని పేటుల్లో పెట్టి అందరికీ అందిస్తుంటే రవిచంద్ర తండ్రి అన్నాడు "అమ్మాయ్, నువ్వేదో టీచర్ ట్రైనింగ్ కోర్సులోనూ కంప్యూటర్ కోర్సులోనూ చేరాలని అనుకున్నావట కదా. ఇంట్లో పనంతా మీ అత్తగారూ నేనూ చూసుకుంటాం. నువ్వు నిశ్చింతగా వెళ్ళి చదువుకో. ఇదే మంచి సమయం".

సుచరితకి గుండె గొంతుకలోకి వచ్చినట్టుగా అయింది.

ఆ రాత్రి గదిలోకి చేరాక రవిచంద్ర అన్నాడు "రేపు మనకి పిల్లలు పుట్టాక, కాస్త పెద్దయ్యాక వాళ్ళలో ఒకడు 'నాకు సిగరెట్ కాల్చటం అంటే చాలా ఇష్టం. నేనంటే ప్రేమ ఉంటే నన్ను సిగరెట్ కాల్చనీ' అంటే- వాడంటే ప్రేమ ఉంది కదాని సరే అంటావా? " సుచరిత నిజంగానే చిన్నపిల్లలా కళ్ళు విప్పార్చుకుని అతనివైపు చూస్తూ ఉండిపోయింది.



'ఇంతకీ ఈ సుచరిత ఈ రవిచంద్రదేనా? '

"మీ మనసులోని మాట నాకు ముందుగానే ఎందుకు చెప్పలేదు? నాకు అబద్ధం ఎందుకు చెప్పారు? " ఉక్రోషంగా అడిగింది ఆమె.

"అమ్మా నాన్నల్ని పట్టించుకోకుండా అనాథలుగా వదిలేస్తేనే నువ్వంటే ప్రేమ ఉన్నట్టూ నీ మాటకు విలువ ఇచ్చినట్లూనా? నా సుచరిత కళ్ళల్లో అలాంటి అందవికారమైన భావనలు చూడటం నాకు ఇష్టంలేదు. నాకు ఒక కోరిక ఉంది. ఈ సంఘంలో భార్యాభర్తల బంధం అనేది ఇంకా సుసంపన్నం కావాలి. ఈ బంధం సృష్టికి ఆలంబన. భార్యాభర్తలనే వాళ్ళకి భగవంతుడు ఎంతో ప్రాధాన్యత కలిగిన బాధ్యతని అప్పగించాడు. అందుకే అందులో అద్భుతమైన తీయదనానికి కూడా చోటిచ్చాడు. అటువంటి అపురూపమైన బంధాన్ని మన స్వార్థపుటాలోచనలతో, సంకుచిత స్వభావంతో అందవికారంగా మార్చేస్తున్నాం. ఆ బంధానికి ఉన్న మహోన్నత తత్త్వాన్ని దిగజార్చేస్తున్నాం. కొడుకు వివాహం తల్లిదండ్రుల్ని నరకయాతనకి గురిచేసేదిగా ఉండకూడదు. ఆ వివాహబంధం ఆ తల్లిదండ్రులకి ఆనందాన్ని కలిగించి మరిన్ని సొబగుల్ని అద్దుకోవాలి. ఎంత చిత్రం చూడు... అపరిచిత వ్యక్తులు ఇద్దరు ఈ బంధంతో కలిసి ఆత్మబంధువుల్లా అయిపోతారు. అంతటి అద్భుతబంధం పూలమాలలా మారి సౌరభాలను విరజిమ్మాలే గానీ- అగ్నిశిఖలా మారి నిప్పురవ్వలను వెదజల్లకూడదు. వివాహం అంటే భార్యాభర్తలు ఒకరినొకరు మాత్రమే ప్రేమించుకోవటం కాదు. ఒకరి కుటుంబాన్ని ఒకరు ప్రేమించడం, సొంతం చేసుకోవడం".

"అందుకు పెద్దవాళ్ళ సహకారం కూడా ఉండాలిగా? " అంది సుచరిత.

"మొదట న్యాయంగా ఆలోచించటం మన బాధ్యత. ఈ సృష్టిలో మనిషి స్థితిగతుల్ని నిర్ణయించే కొలమానం ఏమిటో తెలుసా... అతను చేసిన మంచే! మనిషికే కాదు భగవంతుడి లోకంలో కూడా అదే కొలమానం. కాబట్టి అదే మన ధర్మం. 'తల్లి అల్లం, పెళ్ళాం బెల్లం' అంటూ వివాహబంధాన్ని అవమానపరిచే నానుడి మన ఇంట్లో వినిపించకూడదు. కల్యాణం అనేమాట జీవన సహచరులిద్దరి కుటుంబసభ్యుల హృదయాల్లో కూడా మధురస్వరాలని పలికించాలి. మన ప్రేమించే హృదయపు వైశాల్యాన్ని పెంచాలి" రవిచంద్ర ఓ దివ్య స్వప్నాన్ని వీక్షిస్తున్నట్టుగా అన్నాడు.

అతని మాటల్లోని వాస్తవాన్ని అంగీకరిస్తున్నట్లుగా తన తప్పును గ్రహించినట్లుగా- మౌనంగా అతని హృదయం మీద తలవాల్చింది సుచరిత. ★

# సొరకాయలు... ఎన్ని రకాలో!

**అబ్బా, సొరకాయా... అదెవరు తింటారు అన్నట్లు మొహం పెట్టకండి. సొరకాయలోనూ బోలెడు ఔషధగుణాలు ఉన్నాయంటున్నారు ఆయుర్వేద వైద్యులు. అంతేకాదు, సొరకాయలో మనకు తెలీని రకాలెన్నో... అవేంటో చూద్దామా!**









మనకు తెలిసి సొరకాయ ఆకుపచ్చని రంగులో పొడవుగానో గుండ్రంగానో మాత్రమే ఉంటుంది. కానీ సొరకాయ ఆకారాలెన్నో. విభిన్న రూపాల్లో చూపరులను ఇట్టే ఆకట్టుకునే సొరకాయలు ప్రపంచవ్యాప్తంగా పండుతాయి. పొడవుచేయి ఉన్న గిన్నె, పొట్టిచేయి ఉన్న గిన్నె, వాటర్ జగ్, వైన్ కెటిల్, బాస్కెట్, మెక్సికన్ బాటిల్, ఆపిల్, బనానా, మినీ పియర్, గూస్‌నెక్, స్నేక్... ఇలా భిన్న ఆకారాల్లో ఇవి కాస్తుంటాయి. ఎండిన సొరకాయబుర్రల్ని పాత్రలు, టోపీలు, కమండలాలు, సంగీతపరికరాలుగా వాడటం అనేక సంస్కృతుల్లో ఇప్పటికీ కనిపిస్తూనే ఉంది.

పూర్వ కాలంలో బాటిల్‌గార్డే వాటర్ బాటిల్. కొన్ని ప్రాంతాల్లో హుక్కా పైప్‌గానూ వాడేవారు. చాలా ప్రాంతాలో రంగులేసిన సొరకాయల్ని బ్యాగుల రూపంలో భుజానికి తగిలించుకుంటారు. నైజీరియాలో మోటారుసైకిళ్ల హెల్మెట్లగానూ సొరకాయ బుర్రల్ని వాడుతున్నారు.

మనం ఎంతో తేలిగ్గా తీసి పారేసే సొరకాయను బరువు తగ్గడానికి ఇటీవల బాగా ఉపయోగిస్తున్నారు. ముఖ్యంగా దీని రసాన్ని తాగడం ద్వారా బరువు తగ్గవచ్చుట. అదెలా అంటే ఇందులో పీచు, నీరు పుష్కలంగా ఉంటాయి. దాంతో దీన్ని తీసుకోవడంవల్ల ఆకలి మందగిస్తుంది.

❖ సొరకాయరసంలో కాస్త నిమ్మరసం కలిపి రోజూ ఇస్తే ఎసిడిటీ కారణంగా మూత్రవిసర్జన సమయంలో వచ్చే మంట తగ్గుతుంది. అతి దాహం తగ్గుతుంది.

❖ వేసవిలో సొరకాయరసంలో కొంచెం ఉప్పు కలుపుకుని తాగితే చెమటరూపంలో లవణాలు పోకుండా ఉంటాయి. వడదెబ్బ తగలదు.

❖ డయాబెటిస్ బాధితులకు సొరకాయ మంచి ఆహారం. క్యాలరీలు తక్కువ, ఆకలీ తీరుతుంది. అజీర్తితో బాధపడేవాళ్లకి కూడా సొరకాయ కూర ఎంతో మంచిది.

❖ నిద్రలేమితో బాధపడేవాళ్లు సొరకాయ రసంలో కొద్దిగా నువ్వుల నూనె కలిపి తలకి మర్దన చేస్తే నిద్ర బాగా పడుతుందట.

❖ మలబద్ధకంతో బాధపడేవాళ్లకీ పైల్స్‌తో బాధపడేవాళ్లకీ ఇందులోని పీచు మంచి ఔషధం.

❖ ఉదయాన్నే గ్లాసు సొరకాయ జ్యూస్ తాగితే బాలనెరుపు తగ్గుతుంది. చర్మానికి ఇన్ఫెక్షన్లు రావు. మొటిమలూ పగుళ్లూ కూడా తగ్గుతాయి. అయితే మోతాదుకి మించి తీసుకుంటే ఇందులోని సైటోటాక్సిన్లు హానికరంగా పరిణమిస్తాయి.

సొరకాయకూర అనగానే ఈతరం నొసలు చిట్లించవచ్చుగాక. కానీ పాతతరానికి దీని ప్రాధాన్యం గురించి బాగానే తెలుసు. కాబట్టి సొరకాయ కోతలంటూ తీసిపారేయకండి. ఎంతో సులభంగా ఇంటింటా పెంచుకోగలిగే సొరకాయ మంచి కూరగాయే కాదు... ఆరోగ్యకరమైన ఔషధం కూడా! ★













# ఒకరికి ఒకరు

మీకు ప్రతిభాపాటిల్ తెలుసా?
'మనదేశ అధ్యక్షురాలు, ప్రథమ మహిళ.'
మరి, ఆమె జీవితభాగస్వామి?
సరే, మీరాకుమార్ తెలుసా?
'లోక్‌సభ స్పీకర్.'
మరి, 'మేడమ్ స్పీకర్' భర్త?
ప్రతిభాపాటిల్, మీరాకుమార్‌లాంటి ప్రముఖ మహిళలు అందరికీ తెలుసు. కానీ, వాళ్ల భర్తలు? సగంసగం తెలియడమంటే ఇదేనేమో! మరి మిగతా సగాన్ని కూడా తెలుసుకోవాలనిపిస్తోంది కదూ!

## ఇష్టంలేని పెళ్ళి!

'నాకీ పెళ్లి ఇష్టం లేదు' అన్నాడా యువకుడు. ముఖ్యంగా రాజకీయాల్లో ఉన్న మహిళల గురించి తప్పుగా ఊహించుకున్న ఆ యువకుడికి ఏమాత్రం ఇష్టంలేని పెళ్లి అది. కాలేజీలో లెక్చరర్‌గా పనిచేస్తూ ఓ ఎమ్మెల్యేను పెళ్లిచేసుకోవడం అతడికి ఏమాత్రం నచ్చలేదు. కానీ, పెద్దల ఒత్తిడితో చేసుకోకతప్పలేదు. ఆయనే దేవీసింగ్ షెకావత్. రాష్ట్రపతి ప్రతిభాపాటిల్ భర్త. రాజకీయ నేపథ్యం ఉన్న కుటుంబంలో పుట్టిన ప్రతిభ 28 ఏళ్లకే (1962లో) ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. అప్పటికి దేవీసింగ్ ఓ కాలేజీలో రసాయనశాస్త్ర లెక్చరర్. అప్పుడే పెద్దలు వాళ్లిద్దరికీ పెళ్లిచేయాలని నిశ్చయించారు.

'రాజకీయాలంటేనే నాకు చిరాకు. రాజకీయాల్లో ఉండే మహిళలంటే చిన్నచూపు ఉండేది. మా పెళ్లయిన కొన్నాళ్ల వరకూ నేను మారలేదు. ఆమె నడవడికా, కుటుంబాన్నీ నన్నూ ప్రేమించిన తీరూ, ఆమె ఉన్నత వ్యక్తిత్వం నా ఆలోచనల్లో మార్పుతెచ్చాయి. ఆ తరవాత నేనే ఆమెను ప్రోత్సహించాను' అని అప్పటిరోజుల్ని గుర్తుచేసుకుంటారాయన.

బొంబే యూనివర్సిటీలో పీహెచ్‌డీ చేసిన దేవీసింగ్ అమరావతిలో ఓ విద్యాసంస్థను ప్రారంభించారు. తరవాత ఆయనా రాజకీయాల్లోకి అడుగుపెట్టారు. మహారాష్ట్రలోని అమరావతి మున్సిపల్ కార్పొరేషన్‌కి మొట్టమొదటి మేయర్ ఆయనే. 1985-90 మధ్యకాలంలో ఎమ్మెల్యేగానూ పనిచేశారు. ప్రస్తుతం అమరావతిలోని విద్యాసంస్థ వ్యవహారాలు చూసుకుంటున్నారు.



## సీనియర్‌ని పెళ్లాడాను

భారతీయ జనతా పార్టీలో మహిళా నాయకురాలు అంటే మొదట గుర్తుకొచ్చే పేరు సుష్మాస్వరాజ్. తన వాగ్ధాటితో విపక్షాలను ఆత్మరక్షణలో పడేసే సుష్మా పేరుకు స్వరాజ్ చేరిందంటే... అందుకు స్వరాజ్ కౌశల్ కారణం! పంజాబ్ యూనివర్సిటీలో లా చదువుతున్న వాళ్లిద్దరూ ఒకర్నొకరు చూసుకోవడమే కానీ, పెళ్లి చేసుకుని ఒక్కటవుతామని కలలో కూడా అనుకోలేదు. విచిత్రమేంటంటే... వాళ్లిద్దరూ పెళ్లికాకముందే ఓ కేసు కూడా వాదించారు. అది ఎమర్జెన్సీ సమయంలో అరెస్టయిన జార్జిఫెర్నాండెజ్ కేసు. 'వయసులో నేను పెద్దవాణ్ణే కానీ, కాలేజీలో మాత్రం సుష్మ నాకు సీనియర్. అలా నా సీనియర్‌తో 1975లో నాకు పెళ్లి జరిగింది' అంటారు స్వరాజ్ కౌశల్. వాళ్లకో కుమార్తె. కౌశల్ కొన్నాళ్లు సోషలిస్ట్ పార్టీలో పనిచేశారు. ఆ తరవాత సుప్రీంకోర్టు లాయర్‌గా చేరారు. తరవాత మిజోరం గవర్నర్‌గా నియమితులయ్యారు. 1998లో రాజ్యసభకు కూడా ఎంపికయ్యారు.

"బీజేపీలో చేరేవాళ్లకు తప్పనిసరిగా ఆరెస్సెస్‌తో సంబంధం ఉంటుంది. కానీ, సుష్మా స్త్రీ కావడం వల్ల ఆమెకు ఆరెస్సెస్‌లో ప్రవేశం లేదు. కానీ, ఆమెకు ఆరెస్సెస్ అంటే చాలా ఇష్టం, గౌరవం. విద్యార్థిగా ఉన్నప్పుడు ఆమె ఏబీవీపీ సభ్యురాలు. అందుకే ఆమె ఎప్పుడూ 'నేను ఆరెస్సెస్ బిడ్డని. సోషలిస్టు కుటుంబానికి కోడల్ని' అంటుంది" అని నవ్వుతారు కౌశల్.



## ప్రేమ వివాహం

ఒక అమ్మాయి, ఒక అబ్బాయి. కాలేజీలో కలుసుకున్నారు. కబుర్లు చెప్పుకొన్నారు. కలిసి తిరిగారు. ఆ స్నేహం ప్రేమగా మారింది. పెళ్లి చేసుకుంటామని పెద్దలతో చెప్పారు. ఆశ్చర్యం... వాళ్లూ ఓకే చెప్పారు. రాజకుమారిని ప్రేమించిన తమ ప్రేమకథలో అనూహ్యమైన మలుపులుంటాయనుకున్న ఆ యువకుడు ఊపిరి పీల్చుకున్నాడు. రాజకుమారి అతడి సొంతమైంది. ఆమే ప్రియాంకాగాంధీ. సోనియా-రాజీవ్‌గాంధీల గారాల బిడ్డ ప్రియాంక. మరి, ఆమెను ప్రేమించి పెళ్లి చేసుకోవడమంటే మాటలా!

'మేమిద్దరం ఢిల్లీలోని బ్రిటిష్ స్కూల్లో చదివేవాళ్లం. నేను మొదటిసారి ఆమెను చూసింది అక్కడే. నాకంటే తను మూడేళ్లు చిన్నది. మా పరిచయం కొద్దిరోజులకే స్నేహంగా మారి ప్రేమగా ముగిసింది. ఈ విషయాన్ని మా పెద్దవాళ్లకు చెప్పాం. వాళ్లూ మా పెళ్లికి ఒప్పుకొన్నారు. అలా మేం ఒకటయ్యాం' అంటారు రాబర్ట్ వాద్రా. ప్రియాంకలో తనకు నచ్చేది ఆమె నిరాడంబరతే అంటారాయన.

రాబర్ట్ వాళ్ల నాన్న ఓ వ్యాపారవేత్త. 1997లో ప్రియాంకతో పెళ్లయ్యే నాటికి రాబర్ట్ ఢిల్లీ శివార్లలో చిన్నతరహా కాస్ట్యూమ్ జ్యువెలరీ షాపు నడుపుతుండేవాడు. ప్రస్తుతం రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్నాడు. అతడికి డాన్సింగ్, సైక్లింగ్, గోల్ఫ్ చాలా ఇష్టం. రాబర్ట్ కుటుంబంలో విభిన్న మతాల వారు ఉండటం విశేషం. ఆయన తల్లి మౌరీన్ రోమన్ క్యాథలిక్. రాబర్ట్ పెద్దన్నయ్య సైరా అనే ముస్లిమ్ అమ్మాయిని వివాహమాడారు.

'ప్రియాంకకు బ్రాండ్లంటే పెద్దగా ఆసక్తి ఉండదు. అందుకే తనకు ఎప్పుడైనా బహుమతులు ఇవ్వాలనిపిస్తే పుస్తకాలూ మ్యూజిక్ సీడీలే ఇస్తాను. ఇద్దరు పిల్లల బాధ్యతనూ తనే చూసుకుంటుంది' అంటారు రాబర్ట్.



## పెద్దలు ఒప్పుకోలేదు



ఆ అబ్బాయి ఓ హౌస్ సర్జన్. అమ్మాయి కూడా హౌస్ సర్జన్. కలిసి ఓ ఆసుపత్రిలో పనిచేస్తున్నారు. ఒకరి ఆలోచనలూ అభిప్రాయాలూ మరొకరికి నచ్చాయి. ప్రేమించుకున్నారు. పెళ్లి చేసుకోవాలనుకున్నారు. పెద్దలకు చెప్పారు. కానీ, వాళ్లు ఒప్పుకోలేదు. నచ్చజెప్పినా వినలేదు. ససేమిరా అన్నారు. ఆ ప్రేమికులు మాత్రం తమ ప్రేమను గెలిపించుకోవాలనుకున్నారు. గెలిపించుకున్నారు. ఆ జంటలోని అమ్మాయి పేరు... మనందరికీ సుపరిచితమైన గీతారెడ్డి. ఆ అబ్బాయి డాక్టర్ రామచంద్రారెడ్డి.

రామచంద్రారెడ్డి కర్నూలు జిల్లా ఆస్పరి మండలం, జొహరాపురం గ్రామంలోని ఓ వ్యవసాయ కుటుంబంలో పుట్టారు. గీతను ఆయన మొదటిసారి కలిసింది 1970లో గాంధీ ఆసుపత్రిలో. 'పెళ్లయ్యాక మేం ఆస్ట్రేలియా వెళ్లిపోయాం. ఆరేళ్లు అక్కడే ఉండి ఆస్ట్రేలియన్ రాయల్ కాలేజీలో నేను అనస్థీషియా విభాగంలో, ఆమె గైనకాలజీ విభాగంలో పెద్ద చదువులు చదివాం. ట్రైనింగ్‌కోసం అక్కణ్నుంచి లండన్ వెళ్లాం. 1982లో ఇండియా వచ్చాం. సికింద్రాబాద్‌లో ఆమె పేరిటే 'గీతా ఆసుపత్రి' ప్రారంభించాం. ఆ తరవాత ఆమె రాజకీయాల్లోకి వచ్చింది' అని ఆ రోజుల్ని గుర్తుతెచ్చుకుంటారు రామచంద్రారెడ్డి.

గురజాడ అప్పారావు, వీరేశలింగం పంతులులా గీతారెడ్డి ఓ సంఘసంస్కర్త కావాలనేది రామచంద్రారెడ్డి అభిలాష. ఆయన మంచి క్రీడాకారుడు. హాకీ, టెన్నిస్ చాలా ఇష్టం. 'గీతకు పుస్తకాలంటే చాలా ఇష్టం. ఆధ్యాత్మిక పుస్తకాలు దొరికాయంటే టైం చూసుకోదు' అని ఆమె ఇష్టాలనూ చెబుతారాయన. ఈ జంటకు ఓ అమ్మాయి మేఘన.

## జ్ఞాపకశక్తికి జోహార్లు



స్త్రీలను గౌరవించి, వాళ్లకూ పురుషులతో సమాన హక్కులున్నాయని నమ్మే కుటుంబంలోకి ఏ మహిళ మాత్రం కోడలిగా వెళ్లాలనుకోదు! అలాంటి ఇంటికి వెళ్తున్న ఆమె ఎంతో సంతోషించారు. కానీ, అంతకంటే ఆమె అత్తవారే ఎక్కువ సంతోషించారు. ఎందుకంటే... ఆమె మామూలు మహిళకాదు, బాబూ జగ్జీవన్‌రామ్‌లాంటి మహోన్నత వ్యక్తిత్వమున్న నాయకుడి కుమార్తె. ఆమే ప్రస్తుత లోక్‌సభ స్పీకర్ మీరాకుమార్.

'స్త్రీలను గౌరవించే మా కుటుంబంలోని స్త్రీ లోక్‌సభ స్పీకర్ కావడం మా అందరికీ గర్వకారణం' అంటారు ఆమె భర్త మంజుల్ కుమార్. ప్రస్తుతం ఆయన సుప్రీంకోర్టు న్యాయవాది. వీరిద్దరి వివాహం 1968లో జరిగింది. వీరికి ఇద్దరు కూతుళ్లు, ఒక కొడుకు.

'ఆమె తులసీదాసు రామచరిత మానస్ నుంచీ శరత్ సాహిత్యం వరకూ ఎన్నో పుస్తకాలు చదువుతుంది. వాటిలో ప్రతి వాక్యాన్నీ గుర్తుంచుకుంటుంది. ఆమె జ్ఞాపకశక్తికి జోహార్లు' అని మెచ్చుకుంటారాయన. మంజుల్ కుమార్ ఇంట్లో మొదటి నుంచీ స్త్రీలకు ప్రత్యేక గౌరవం ఉండేది. వాళ్ల తాతగారు మంజుల్‌వాళ్ల అమ్మ సుమిత్రాదేవిని 1930ల్లోనే బోర్డింగ్ స్కూలుకు పంపించారు. అప్పట్లో అదో సంచలనం. ఆడపిల్లలు కూడా చదువుకోవాలని ఆయన చెప్పేవారు. అంతే కాదు, ఆమె రాజకీయాల్లోకి వెళ్లడానికి కూడా ఆయన ప్రోత్సాహమే కారణం. 'అప్పుడు అమ్మ... ఇప్పుడు మీరా' అంటారు మంజుల్.



## నాకే ఎక్కువ నమ్మకం

రేణుకా చౌదరి... ఈ పేరు వింటే 'ఫైర్ బ్రాండ్' అంటారంతా. అలాంటి వ్యక్తిని జీవిత భాగస్వామిగా చేసుకున్న ఆయన మాత్రం ఆమెను పొగడ్తలతో ఆకాశానికెత్తేస్తారు. ఆయనే శ్రీధర్ చౌదరి.

'మా తాతగారు వాళ్లు మైసూర్ మహారాజా దగ్గర పనిచేసేవారు. నేను బంధువుల పెళ్లిలో మొదటిసారి రేణుకని చూశాను. నచ్చడంతో పెద్దవాళ్లకి చెప్పాను. వాళ్లూ ఒప్పుకొన్నారు. అలా మా పెళ్లి జరిగింది, ఆ తరవాత తను రాజకీయాల్లోకి వచ్చింది. ఎంపీగా ఎంత బిజీగా ఉన్నా ఇంట్లో పనులన్నీ తనే చూసుకునేది. ఆమెపై ఆమెకున్న నమ్మకంకంటే ఆమెపై నాకే ఎక్కువ నమ్మకం' అంటారు శ్రీధర్.

'వ్యాపారం, ఫ్యాక్టరీ వ్యవహారాల్లో ఎంత బిజీగా ఉన్నా ఇంటి విషయాల్లోనూ సహకరిస్తారు. మా ఇద్దరి అమ్మాయిల బాధ్యతను చూసుకోవడంలోనూ, నా రాజకీయ ఎదుగుదలలోనూ ఆయన ప్రోత్సాహం ఎంతో ఉంది' అని శ్రీధర్ గురించి చెబుతారు రేణుకాచౌదరి.



# కళ్లకి కొత్త రంగులు

**రంగురంగుల ప్రకృతి... రంగురంగుల దుస్తులు... రంగురంగుల ఫ్యాషన్లు... కంటికి కనిపించే ఇన్ని రంగుల్లో మన కళ్లను మాత్రం ఎందుకు చూడకూడదు!**







నాన్న కొనిచ్చిన బైక్ కలర్ కళ్లుచెదిరేలా ఉంది. దానిపై స్టైల్‌గా షికార్లు కొట్టాలంటే మాంచి కాంబినేషన్లో డ్రెస్సు వేసుకోవద్దూ. అక్కడితో అయిపోతుందా... ఈ రెంటికీ సూటయ్యే కలర్ సెల్‌ఫోన్ తీసుకోవాలిగా.

కుర్రకారు అంటే... ఇలాంటి 'ఫార్మాలిటీస్' చాలా ఉంటాయి. ఈ జాబితాలో చేరుతున్న మరో స్టైలిష్ వస్తువు... రంగురంగుల కాంటాక్ట్ లెన్సులు (కాస్మెటిక్ సాఫ్ట్ కాంటాక్ట్ లెన్సులు)!

అంటే... కళ్లనూ మీకిష్టమైన రంగుల్లో చూసుకోవచ్చన్నమాట. నమ్మలేకపోతున్నారు కదూ! దృష్టిలోపం ఉండేవాళ్లు కళ్లద్దాలకు బదులుగా వాడేందుకు మొదట్లో ఈ కాంటాక్ట్ లెన్సులను తయారుచేశారు. ఇటీవలికాలంలో ఆ లెన్సులతోపాటూ మామూలు వాళ్లు కూడా పెట్టుకునేలా రంగురంగుల కాంటాక్ట్ లెన్సులు వస్తున్నాయి. ఇవి పెట్టుకుంటే అంతా రంగుల్లో కనిపిస్తుందనుకునేరు. అదేంకాదు... మామూలుగానే ఉంటుంది!

అమెరికా, బ్రిటన్‌లాంటి దేశాల్లో సుపరిచితమైన ఈ కాంటాక్ట్ లెన్సుల ఫ్యాషన్ ఇప్పుడిప్పుడే మనదేశంలోనూ ఊపందుకుంటోంది.

బాలీవుడ్, టాలీవుడ్‌లలో హీరోహీరోయిన్లే కాదు... హైదరాబాద్, చెన్నై, బెంగళూరు, ముంబయిలాంటి పట్టణాల్లోనూ ఎంతోమంది యువత, మోడళ్లు ఇప్పుడు వీటిని పెట్టుకుంటున్నారు. మిగతా ఫ్యాషన్ల సంగతి పక్కనపెడితే దీనికి మాత్రం కొన్ని 'షరతులు వర్తిస్తాయి'. ఎందుకంటే... కళ్లు ఎంత ముఖ్యమైనవో తెలుసుకదా!

### పరీక్షించి... సరిపోయాకే

ఈ లెన్సులు పెట్టుకోవాలనుకునేవారు ముందుగా నేత్రవైద్య నిపుణుడిని లేదా ఆప్టొమెట్రిస్ట్‌ను సంప్రదించాలి. సాధారణంగా అన్ని పెద్దపెద్ద కళ్లద్దాల షాపుల్లోనూ ఆప్టొమెట్రిస్ట్ ఉంటారు. మీరు షాపులోకి వెళ్లాక మీ కళ్లను వాళ్లు పరీక్షిస్తారు. మీకు కాంటాక్టు లెన్సులు పనికొస్తాయో లేదో చెబుతారు. దాదాపుగా అన్ని షాపుల్లోనూ ఈ పరీక్షలు ఉచితమే. ఒకవేళ మీరు లెన్సులు పెట్టుకోవచ్చు అనుకుంటే అప్పుడు మీతో ట్రయల్ వేస్తారు. మీకు ఎలాంటి ఇబ్బందీ లేదనిపిస్తే అప్పుడు ఇస్తారు. వాటిని ఎలా పెట్టుకోవాలి, ఎలా తీయాలి, ఉపయోగించేటప్పుడు ఎలాంటి జాగ్రత్తలు పాటించాలి, ఏ సమయాల్లో పెట్టుకోవాలి, ఎప్పుడు పెట్టుకోకూడదు... ఇలాంటి అంశాలన్నీ చెబుతారు.

ఈ లెన్సులన్నీ డిస్పోజబుల్ లెన్సులే. అంటే కొన్నాళ్లు వాడాక పారేయాలన్నమాట. ఇందులో ప్రస్తుతం మూడు రకాలున్నాయి. మొదటివి... ఏ రోజుకారోజు పెట్టుకునేవి. అంటే ఉదయం పెట్టుకుని రాత్రి పడుకునే ముందు పారేయాలన్నమాట. రెండోది... రెండువారాలు ఉపయోగించేవి. మూడో రకం... నెలరోజులు పెట్టుకుని పారేసేవి.

"గతంలో ఏడాది పెట్టుకునేవీ వచ్చాయిగానీ ప్రస్తుతం రావడం లేదు. కొంతమంది నెల రోజుల లెన్సులను... రెండునెలలూ మూడు నెలలూ ఉపయోగించవచ్చు అంటుంటారు. కానీ, అది నిజంకాదు. వీటన్నింటిలోకీ... ఏరోజుకారోజు వాడి పారేసేవి మంచివి. 'రోజుకొకటి వాడాలా... ఎంత ఖరీదో' అని భయపడాల్సిన అవసరం లేదు. ఇప్పుడివి చాలా తక్కువ ధరల్లోనే దొరుకుతున్నాయి.' అంటారు హైదరాబాద్‌లోని 'లారెన్స్ అండ్ మయో' కళ్లద్దాల షాపు ప్రొఫెషనల్ సర్వీసెస్ ఎగ్జిక్యూటివ్ అభిషేక్. అవును, నెలరోజులు వాడే లెన్సుల ధర రూ.600 నుంచి మొదలవుతుంది. రోజుకొకటి వాడాలనుకుంటే ఒక బాక్సు(అయిదు జతలుంటాయి. అయిదు రోజులు వాడొచ్చు) ధర కూడా సుమారుగా ఇంతే. జాన్సన్ అండ్ జాన్సన్, సీబా విజన్, బాష్ అండ్ లాంబ్... ముఖ్యంగా ఈ మూడు అంతర్జాతీయ బ్రాండ్ల లెన్సులే ఇప్పుడు మార్కెట్లో దొరుకుతున్నాయి.





### చాలా జాగ్రత్తగా...

ఈ లెన్సులు పెట్టుకునేముందు చేతులు శుభ్రంగా సబ్బుతో కడుక్కుని మంచి తువ్వాలుతో తుడుచుకోవాలి. శుభ్రం చేయడానికి ఇచ్చిన ద్రవపదార్థంతో లెన్సుని కడగాలి. ఆ తరవాత లెన్సును నెమ్మదిగా పెట్టుకోవాలి. అలాగే తీసేటప్పుడు కూడా చేతులు శుభ్రంగా కడుక్కుని లెన్సులు తీయాలి. తీసిన లెన్సును ద్రవపదార్థంతో కడిగి బాక్సులో పెట్టుకోవాలి. మేకప్ వేసుకునేవాళ్లు ముందు లెన్సులు పెట్టుకుని తరవాత మేకప్ వేసుకోవాలి. అలాగే లెన్సు తీశాకే మేకప్ తీయాలి.

నిద్రించేటప్పుడూ, స్విమ్మింగ్ లేదా ఇతర ఆటలు ఆడేటప్పుడూ లెన్సులు పెట్టుకోకపోవడమే మంచిది. లెన్సులు పెట్టుకుని డ్రైవింగ్ చేసేటప్పుడు సన్‌గ్లాసెస్ ఉంటే మంచిది. ఎప్పుడైనా లెన్సుల కారణంగా కళ్లు ఎర్రబడినట్టు అనిపించినా, పెట్టుకున్నప్పుడు చాలా ఇబ్బందిగా అనిపించినా, కళ్లు సరిగ్గా కనిపించకపోయినా వెంటనే వైద్యుణ్ణి సంప్రదించాలి.

### పండగలూ పార్టీలూ...

పెళ్లిళ్లూ పండగలూ పార్టీలూ లాంటి వేడుకల్లో మీరు ప్రత్యేకంగా కనిపించాలంటే... ఈ లెన్సులు పెట్టుకోవాల్సిందే! ఇందులో నీలం, ఆకుపచ్చ, తేనెరంగు, నారింజలాంటి అనేక రంగులొస్తున్నాయి. రంగులే కాదు... ఇంకాస్త వైవిధ్యంగా కనిపించాలనుకునేవాళ్లకి ఫుట్‌బాల్‌లాంటి చిన్నచిన్న బొమ్మలుండే చిత్రవిచిత్రమైన లెన్సులూ వస్తున్నాయి. మీ మేని ఛాయ, జుట్టు, డ్రెస్సుల రంగు... వీటిని బట్టి మీకు సరిపోయే రంగేదో ఆప్టొమెట్రిస్టులు చెబుతారు. అలా ఫాలో అయిపోతే మీరే ట్రెండ్ సెట్టర్లు! ★



# మంచివే కానీ...

**జీ**డిపప్పు, బాదం, పిస్తా, వాల్‌నట్స్... సాధారణంగా అందరూ ఇష్టంగా తినే ఎండుఫలాలివి. రోజుకు గుప్పెడు పప్పులు తింటే గుండె ఆరోగ్యానికి మేలుచేస్తాయనీ శృంగార పరంగా మంచివనీ గతంలో అనేక పరిశోధనల్లో తేలింది. కానీ అధికబరువు సమస్యతో బాధపడేవారు వీటిని అతిగా తినకపోవడమే మంచిదంటున్నారు వైద్యులు. కావాలంటే వీటి ద్వారా లభించే క్యాలరీలు ఎన్నో చూడండి...

| డ్రైఫ్రూట్‌లలో క్యాలరీలు (ప్రతి 100 గ్రా.) | |
|---|---|
| జీడిపప్పు .........596 | పిస్తా ...............626 |
| బాదం .............655 | వాల్‌నట్స్ ........687 |

...కాబట్టి ఊబకాయులు వీటిని రోజుకు మూడు పప్పులు మించి తినకూడదని చెబుతున్నారు వారు.





# ఐదు నిమిషాలు చాలు!

**కొం**దరు నలభైల్లోనూ ఇరవైల్లా అందంగా కనపడతారు. మరికొందరేమో ముప్ఫయ్యేళ్లకే వయసు మీదపడిపోయినట్టుంటారు. వారికీ వీరికీ తేడా సౌందర్య సంరక్షణ మీద ఉన్న శ్రద్ధే. రోజులో ఐదంటే ఐదునిమిషాలు సౌందర్యపోషణకు కేటాయిస్తే చాలు... నలభైల్లోనూ అందంగా ఆరోగ్యంగా కనపించవచ్చంటున్నారు నిపుణులు.

★ రోజంతా ఏదో ఒక పని మీద తిరుగుతాం. చర్మం మీద మురికి పేరుకుంటుంది. రాత్రికి అలాగే పడుకోకుండా ముఖాన్ని చల్లటి నీళ్లతో శుభ్రంగా కడుక్కొని పడుకోండి. మీది పొడిచర్మమైతే మాయిశ్చరైజర్ రాసుకోండి. అలాకాకుండా అపరిశుభ్రంగా పడుకుంటే చర్మరంధ్రాలు వ్యాకోచిస్తాయి. మురికి, జిడ్డు కారణంగా మొటిమలు వస్తాయి.

★ సూర్యుని అతినీలలోహిత కిరణాల బారినుంచి కాపాడే సన్‌స్క్రీన్ లోషన్లు కేవలం వేసవిలోనే వాడాలను కుంటే పొరబాటు. వయసు మీరే ప్రక్రియలో ప్రధానపాత్ర పోషించేవి అతినీలలోహిత కిరణాలే. అందుకని చలికాలం లోనూ ఎస్‌పీఎఫ్-30 ఉండే క్రీములు రాసుకోవడం మంచిది.

...ఈ రెండు పనులూ చేయడానికి రోజుకి ఐదునిమిషాలు మించి పట్టదు. కానీ ఫలితాలు మాత్రం అద్భుతం అంటున్నారు. ఇలాంటివి ఎన్ని చేసినా లాభం లేకపోయిందని నిరాశపడతారు చాలామంది. కానీ ఈ చిట్కాలు పనిచేయడానికి కనీసం ఎనిమిది వారాలు పడుతుంది. అంతదాకా ఓపికపట్టాలట.

అవీ ఇవీ

# ఆ తృప్తే ఆరోగ్యం

**జీ**వితభాగస్వామితో సఖ్యతగా ఉంటూ తరచుగా శృంగారంలో పాల్గొనే మగవారిలో గుండెజబ్బులు వచ్చే ముప్పు తగ్గిపోతుందంటున్నారు ఇటాలియన్ పరిశోధకులు. నిత్యం రసాస్వాదన చేసేవారిలో పురుష శృంగార హార్మోన్ అయిన టెస్టోస్టిరాన్ ఉత్పత్తి అధికమవుతుందనీ అది ఒత్తిడి స్థాయిలను పూర్తిగా తగ్గించేస్తుందనీ చెబుతున్నారు వారు. తద్వారా జీవక్రియ వేగం రేటు తగినంతగా ఉండి గుండె ఆరోగ్యం మెరుగై ఎక్కువకాలం జీవిస్తారట. అక్రమ సంబంధాలు సాగించేవారికి మాత్రం ఈ ఫలితాలు లభించవని హెచ్చరిస్తు న్నారు వారు. ఈ తరహా పురుషులు కూడా తరచుగా శృంగారంలో పాల్గొన్న ప్పటికీ వారిలో ఒత్తిడి హార్మోన్ల స్థాయిలు అధికంగా ఉంటాయట. జీవితభాగ స్వామిని మోసం చేస్తున్నామనే భావన పైకి లేనప్పటికీ వారి సబ్‌కాన్షస్ మైండ్‌లో ఉండటమే ఇందుకు కారణమని చెప్తున్నారు పరిశోధకులు. అంతేకాదు, మధుమేహ రోగులు ఎంత తరచుగా శృంగారంలో పాల్గొంటే వారి ఆరోగ్యానికి అంత మంచిదని కూడా చెబుతున్నారు వారు.



# టూకీగా

**ఒ**త్తిడి నివారణ మందులు(యాంటీ డిప్రెసెంట్స్), గర్భనిరోధక మాత్రలు సుదీర్ఘకాలంపాటు వాడే మహిళల్లో శృంగారవాంఛలు తగ్గిపోతాయని ఒక పరిశోధనలో తేలింది, తస్మాత్ జాగ్రత్త.

◆ వ్యాయామం చేసే ముందు కాఫీ తాగితే రక్తసరఫరా వేగం ఒకింత తగ్గుతుందట. దానివల్ల... ఎక్సర్‌సైజ్ చేసేటప్పుడు గుండెకు అవసరమైనంత ఆక్సిజన్ అందదు. ఒకవేళ కాఫీ తాగితే మాత్రం కనీసం గంట వ్యవధి తర్వాతే కసరత్తులు మొదలుపెట్టా లంటున్నారు పరిశోధకులు.

◆ 'నేనిది చేస్తాను/చేయగలను' అని మనసులో అనుకునేవారికన్నా అదే మాట రాతపూర్వకంగా పేపర్ మీద రాసేవారు ఆ పనిలో విజయం సాధించే అవకాశం 33 శాతం అధికమని అధ్యయనాల్లో తేలింది.

◆ కొత్తగా వస్తున్న గ్యాస్ ట్యూబ్‌ల మీద ఎక్స్‌పైరీ డేట్ ఉంటోంది. డేట్ దాటిన తర్వాత కూడా ఆ పైపు బాగానే ఉన్నప్పటికీ మార్చేయడమే మంచిది. ఎందుకంటే గడువు తేదీ దాటిన ట్యూబు నుంచి కనిపించని లీకేజీ ఉంటుంది. ఎప్పటికప్పుడు తేదీ చూసుకుంటూ ఆ పైపు మార్చేయడం వల్ల గ్యాస్ ఆదా అవుతుంది.

# 'కీబోర్డ్ జైరాజ్' అనేవాళ్లు!



**మనోహరా నా హృదయమునే(చెలి)... హృదయం ఎక్కడున్నదీ(గజినీ)... చెలియ చెలియా(ఘర్షణ)... మనసా నువ్వుండే చోటే చెప్పమ్మా(మున్నా)... ఓరుగల్లుకే పిల్లాపిల్లా(సైనికుడు)... మొన్న కనిపించావు, మైమరచిపోయాను(సూర్య సన్ఆఫ్ కృష్ణన్)... సిడ్నీ నగరం, రూబారూబా(ఆరెంజ్)... సంగీత దర్శకుడిగా హ్యారిస్‌జైరాజ్ ప్రతిభకు మచ్చుతునకలు ఈ పాటలు. హ్యారిస్‌జైరాజ్ ఇండస్ట్రీలోకి అడుగుపెట్టి పదేళ్లవుతున్న నేపథ్యంలో ఆయన జీవితంలో కొన్ని పదనిసలు...**



సంగీతం... అది నా రక్తంలోనే ఉంది. మా నాన్న ఎస్.ఎం.జయకుమార్ పేరొందిన గిటారిస్ట్. మలయాళ సంగీత దర్శకుడు శ్యామ్ దగ్గర సహాయకుడిగా పని చేసేవారు. ఆయనకు నన్నో పెద్ద గాయకుణ్ని చేయాలనే కోరిక ఉండేది. కానీ నాకు పాడ్డం అంతగా రాదే! చిన్నప్పటి నుంచీ నా మన సంతా స్వరకల్పన(కంపోజింగ్) మీదే ఉండేది. అప్పటికీ మా నాన్న నాకు కర్ణాటక సంగీతంలో శిక్షణ ఇప్పించడం మొదలెట్టారు. నాకు పాడటం మీద అంతగా ఆసక్తి లేదన్న విషయం మా గురువుగారికి ఆర్నెల్లలోనే అర్థమైపోయింది. ఆ తర్వాత ఆయన నాకు సంగీతం నేర్పించనని ఖండితంగా చెప్పి వెళ్లిపోయారు.

★ ఏవీఎం, విజయ, వాహినీ స్టూడియోలకు దగ్గర్లోనే ఉండేది మా స్కూలు(కృష్ణస్వామి మెట్రిక్ స్కూల్, చెన్నై). సెలవు రోజుల్లో నాన్నతో కలిసి ఆ స్టూడియోలకు వెళ్తుండే వాణ్ని. పాత తమిళ సంగీత దర్శకులు రికార్డింగ్ ఎలా చేసేవారో ఇప్పటికీ గుర్తుంది.

★ నాకు ఐదేళ్ల వయసున్నప్పుడు మానాన్న నాకొక గిటార్ బహుమతిగా ఇచ్చారు. గిటార్‌ని సరిగ్గా పట్టుకోలేని వయసు. దాన్ని ఇష్టమొచ్చినట్టు వాయించే ప్రయత్నం చేశాను. సరిగ్గా ఐదేఐదు నిమిషాల్లో కింద పడేసి విరగ్గొట్టేశాను. ఒక సంగీత పరికరంతో అదే నా తొలిపరిచయం.

★ నాకు గిటార్ నేర్పించిన గురువు అబ్దుల్ సత్తార్. 1987లో నేను సంగీత కళాకారుడిగా పరిశ్రమలో ప్రవేశించాను. ఆ ఏడాది ఒక కన్నడ సినిమాకి గిటారిస్ట్‌గా పనిచేశాను. అప్పటికి నా వయసు పన్నెండేళ్లు. 1989 నుంచి కీబోర్డ్ నేర్చుకోవడం మొదలుపెట్టాను. తర్వాత లండన్ ట్రినిటీ కాలేజ్‌లో సంగీతంలో డిగ్రీ పూర్తిచేశాను. మా బ్యాచ్‌లో ఆసియా నుంచి అక్కడ చేరినవాళ్లలో నేనే టాపర్‌ని.

★ సంగీత దర్శకుడిగా పరిచయం కాకముందు దాదాపు పన్నెండు పదమూడేళ్ల పాటు రాజ్-కోటి, కీరవాణి, ఎ.ఆర్.రెహమాన్, మణిశర్మ, విద్యాసాగర్, కార్తీక్ రాజా, యువన్ శంకర్‌రాజా... ఇలా సుమారు ఇరవై మంది ప్రముఖ సంగీత దర్శకుల దగ్గర కీబోర్డ్ ప్లేయర్‌గా పనిచేశాను. అప్పట్లో నన్నందరూ 'కీబోర్డ్ జైరాజ్' అనేవాళ్లు. రెహమాన్‌కి పగలు విశ్రాంతి తీసుకుని రాత్రిపూట పనిచేయడం అలవాటు. ఒక్కోసారలా పగలు రాజ్‌కోటి దగ్గర పనిచేసి రాత్రిళ్లు రెహమాన్ కోసం కీబోర్డ్ ప్లే చేసిన సందర్భాలు కూడా ఉన్నాయి. అలా చేస్తూనే మధ్యమధ్యలో కొన్ని జింగిల్స్ (వాణిజ్యప్రకటనలకు సంగీతం) కూడా చేశాను. ఇంతమంది దగ్గర చేసినా... ఇళయరాజా ట్రూపులో చేయకపోవడం పెద్ద లోటే.

★ రాజ్‌కోటి దగ్గర దాదాపు తొమ్మిదేళ్లు పనిచేశాను. అవసరమైనప్పుడు వేగంగా ఎలా కంపోజ్ చెయ్యాలో వాళ్లను చూసే నేర్చుకు న్నాను. మామూలుగా కూడా వాళ్ల కంపోజింగ్ చాలా వేగంగా ఉండేది. ఒక సినిమాకి సంగీతం మూడే రోజుల్లో, అదీ కమర్షియల్ ఎలిమెంట్లు మిస్సవకుండా ఇవ్వగలిగే సత్తా వారికుండేది. మలయాళంలో శ్యామ్, సురేష్ దగ్గర పనిచేయడం మర్చిపోలేని అనుభూతి.

★ మిగతా అందరు సంగీత దర్శకుల దగ్గర పనిచేసేటప్పుడు వాళ్లు చెప్పిన నోట్స్ ప్లే చేస్తే సరిపోతుంది. సాయంత్రానికి మన డబ్బులు తీసుకుని మనం వెళ్లిపోవచ్చు. కానీ రెహమాన్ కంపోజింగ్ తీరు వేరుగా ఉండేది. ఆయన చెప్పిన సంగతులను వీలైతే ఇంప్రొవైజ్ చేయమని చెప్పేవారు. దానివల్ల మాకు చాలా స్వేచ్ఛగా ఉండేది. మేం చేసింది బాగుంటే దాన్నే ఆమోదించేవారు. అలా నాలోనూ ఒక కంపోజర్ ఉన్నాడనే విషయం మొదటిసారి తెలుసుకుంది రెహమాన్ శిష్యరికంలోనే. అదే నేను సంగీత దర్శకుడిని అవడానికి నాంది.

★ నేను కీబోర్డ్ ప్లేయర్‌గా పనిచేస్తున్న రోజుల్లోనే కెమెరామెన్ రాజశేఖర్... గౌతమ్‌మీనన్‌ని నాదగ్గరికి తీసుకొచ్చారు. ఏదో వాణిజ్య ప్రకటనకు జింగిల్ చేయమని అడిగారు. గౌతమ్ మీనన్‌తో అదే తొలిపరిచయం. తర్వాత కొద్దిరోజులకు గౌతమ్ నా దగ్గరకు 'మిన్నలే(తెలుగులో చెలి) ప్రాజెక్టుతో వచ్చారు. ఆ సినిమా సంగీతం పెద్ద హిట్టు. అలా ఎనిమిదేళ్లలో మేమిద్దరం కలిసి ఏడు సినిమాలు చేశాం.

★ 'నీ మనసులో ఉన్నవాటిలో మంచి మంచి ట్యూన్లను గౌతమ్ మీనన్ కోసమే అట్టిపెడతావా' అని చాలా మంది అడుగుతుంటారు. అలా ఏం ఉండదు, ఒక సంగీత దర్శకుడి నుంచి ఎంత నాణ్యమైన సంగీతం రాబట్టుకోగలడనేది దర్శకుడి మీదే ఆధారపడి ఉంటుంది. అదీకాక... నా మొదటిసినిమా 'చెలి' సినిమాకి సంగీత దర్శకత్వం వహించే సమయానికి నా వయసు 26ఏళ్లు. గౌతమ్ మీనన్‌ది కూడా ఇంచుమించు అంతే వయసు. మా ఇద్దరి ఆలోచనాధోరణుల్లోనూ చాలా

పోలికలున్నాయి. ఇద్దరి అభిరుచులూ బాగా కలిశాయి. వీటన్నిటికీ మించి గౌతమ్ మీనన్ ఒక దర్శకుడు మాత్రమే కాదు, మంచి సంగీతాభిమాని కూడా. 'చెలి' పాటలు అంతగా హిట్టవ్వడానికి అది కూడా ఒక కారణం. ఆ సినిమా హిందీ వెర్షన్(రెహనా హై తేరే దిల్ మే)కి కూడా మేమిద్దరం కలిసి పనిచేశాం. అప్పటికి బాగా ఆప్తమిత్రులమై పోయాం. అలా ఇద్దరం కలిసి వరసగా ఏడు సినిమాలు చేశాం. ఇన్ని సినిమాలు చేసినా నేను ఒక ట్యూన్ చెప్తే తను దాన్ని మార్చమని అడిగిన సందర్భాలే లేవు. అంటే మా ఇద్దరి అభిరుచులూ ఎంతగా కలిశాయో అర్థం చేసుకోండి. తనకేం కావాలో అది అడక్కుండానే నేనిస్తాను... నా సంగీతానికి సరిపడే అద్భుతమైన దృశ్యాలను తీసి నా పాటలకు ప్రాణం పోశాడు గౌతమ్. అలాంటిది మేమిద్దరం ఇప్పుడు కలిసి పని చేయకపోవడం బాధాకరమైన విషయమే. ఎనిమిదేళ్లపాటు సాగిన మా బంధం కొన్ని కారణాల వల్ల తెగిపోయింది. అయినప్పటికీ గౌతమ్ మీనన్ అంటే ఈరోజుకీ నాకెంతో గౌరవం. ఆయనతో ఇక కలిసి పనిచేయకూడదన్న నిర్ణయం చాలా బరువైన హృదయంతో తీసుకున్నాను.

★ చెలి సినిమాలో 'వసీగరా(మనోహరా)...' పాట చేసేటప్పుడు నా బలం మెలోడీనే అని అర్థమైంది. అలాగని ఫాస్ట్‌బీట్ పాటలకు దూరం కాదు. అపరిచితుడు(లవ్ ఎలిఫెంట్లా వస్తాడు రెమో, రండక రండక), సామి(తెలుగు రీమేక్ లక్ష్మీనరసింహ) సినిమాల్లో ఊపుతో ఉండే పాటలు కూడా చేశాను. సో, నేనేం మెలోడీ అంటూ గిరిగీసుకుని కూర్చోలేదు. దర్శకుడి కోరిక మేరకు ఎలాంటి పాటలైనా చేయడానికి సిద్ధం. కొన్నిచోట్ల ఫాస్ట్‌బీట్ పాటల కన్నా మెలోడీలే బాగుంటాయి. ఉదాహరణకు 'గజిని' సినిమాలో 'హృదయం ఎక్కడున్నదీ...' పాట స్థానంలో ఒక ఫాస్ట్‌బీట్ పాట పెడదామనుకున్నారు మురుగదాస్. కానీ ఇద్దరం చర్చించుకున్న మీదట అక్కడొక మెలోడీ పాట వస్తే బాగుంటుందన్న నిర్ణయానికి వచ్చాం. ఆ పాట ఎంత పెద్ద హిట్టయిందో అందరికీ తెలిసిన విషయమే.

★ హిందీ 'గజిని'కి కూడా ముందు నన్నే మ్యూజిక్ చేయమని అడిగారు మురుగదాస్. సరేనన్నాను. కొన్నాళ్ల తర్వాత కబురు చేసి 'అమీర్‌ఖాన్ ఈ ప్రాజెక్టును తన సొంత టీమ్‌తోనే చేస్తానన్నారు, ఏమీ అనుకోవద్దు' అని చెప్పారు. వెంటనే 'ఆల్ ద బెస్ట్' అని చెప్పాను మురుగదాస్‌కి.

★ నా ఫేవరెట్ సంగీత దర్శకులు... హాలీవుడ్‌లో హాన్స్ జిమ్మర్, జేమ్స్ న్యూమన్. గ్లాడియేటర్ చిత్రానికి హాన్స్ జిమ్మర్ అందించిన నేపథ్య సంగీతం అద్భుతం. హిందీలో సలీల్ చౌదరి సంగీతం ఇష్టం. తమిళంలో ఎం.ఎస్.విశ్వనాథన్ స్వరకల్పన నచ్చుతుంది. విశ్వనాథన్ ఈ పరిశ్రమలో ఒక ప్రొడక్షన్‌బాయ్‌గా అడుగుపెట్టారు. క్రమేపీ తన స్వరజ్ఞానంతో అంత ఎత్తుకు ఎదిగారు. అలాగే ఇళయరాజా అన్నా అభిమానమే. పాశ్చాత్య సంగీతాన్ని మన సినిమాలకు అనువుగా ఎలా వాడుకోవచ్చో చూపించిన ప్రతిభావంతులు. ఇక కీబోర్డు ప్లేయర్‌గా తన కెరీర్‌ని ప్రారంభించి ఆస్కార్ స్థాయికి ఎదిగిన ఎ.ఆర్.రెహమాన్ కూడా నాకు ఆదర్శప్రాయులే.

★ నా అభిమానగాయకులు ఎస్పీ బాల సుబ్రహ్మణ్యం, పి.సుశీల. వాళ్లిద్దరికీ నేను పెద్ద అభిమానిని. కానీ, నేను చేసే సినిమా లన్నీ యువ హీరోల సినిమాలు కావడంతో ఆయన గొంతును వాడుకోలేకపోతున్నాను. అప్పటికీ 'వాసు' సినిమాలో బాలుగారితో



రెండు పాటలు పాడించాను. సీనియర్ హీరోల సినిమాలు చేసే అవకాశం దొరికితే మాత్రం తప్పకుండా బాలుగారితో ఇంకా ఇంకా పాడించుకుంటాను.

★ నా సంగీతానికి విమర్శకుల కోసం నేను బయటెక్కడో వెతుక్కోవక్కర్లేదు. మా ఆవిడే నాకు పెద్ద విమర్శకురాలు. తనపేరు జోయిస్. నా కంపోజింగ్ బాగుంటే సరేగానీ... ఏమాత్రం బాగుండకపోయినా మొహమ్మీదే చెప్పేస్తుంది. ఒక్క సంగీతం గురించే కాదు, సినిమా బాగుందాలేదా అనే విషయంలో కూడా కచ్చితంగా తన అభిప్రాయం చెబుతుంది. అది చాలా వరకూ నిజమవుతుంది కూడా. అందుకే నేను పనిచేసే చిత్రాల దర్శకులు కూడా తమ సినిమాలు ప్రివ్యూ చూపించి జోయిస్ అభిప్రాయం తెలుసుకోవడానికి ఆసక్తి చూపుతారు. ఇక మా పిల్లల విషయానికొస్తే ఒకబ్బాయి, ఒకమ్మాయి. వాళ్ల పేర్లు... శామ్యూల్ నికొలాస్, కరేన్ నికిత.

★ 'చెలి' సినిమాలో 'మనోహరా...' పాట తొలిసారి విన్నప్పుడు మా అమ్మ... 'నువ్వింత బాగా (కంపోజ్) చేస్తావని ఊహించలేదు, చాలా బాగుంది నాయనా' అన్న మాటలే ఇంతవరకూ నాకు దక్కిన అతిపెద్ద అవార్డుగా భావిస్తాను. ప్రపంచంలో అందరికన్నా నన్ను ఎక్కువగా ఇష్టపడే అభిమాని మా అమ్మే.

★ సంగీతమే నా ప్రపంచం. నా స్టూడియో ఆసియాలోనే అత్యున్నత స్థాయి స్టూడియోల్లో ఒకటి. రోజులో ఎక్కువభాగం అందులోనే గడిపేస్తుంటాను. సముద్రంలాంటి ఈ సంగీతంలో వచ్చే సరికొత్త సాంకేతిక పరిజ్ఞానం గురించి తెలుసుకోవడానికి ఇంటర్‌నెట్ బాగా వినియోగిస్తాను. ఖాళీసమయం మరీ ఎక్కువగా దొరికితే మాత్రం కామెడీ సినిమాలు చూస్తాను.

★ నాకు తెలుగు అంతగా మాట్లాడ్డం రాదు కానీ మా అమ్మగారు తెలుగువారే కాబట్టి బాగానే అర్థమవుతుంది. కాకపోతే మేం ఇంట్లో వినే తెలుగుకీ ఇక్కడిభాషకీ చాలా తేడా ఉంటుంది. అప్పుడప్పుడూ కొద్దిగా ఇబ్బంది అనిపించినప్పటికీ... ఫర్వాలేదు, అయినా సంగీతస్వరాలకు భాషతో పనేముంది. సంగీతం అనేది ప్రపంచ భాష. ఏ భాషలోనైనా స్వరకల్పనకు కావాల్సింది 'స, రి, గ, మ, ప, ద, ని' అనే ఏడక్షరాలే.

★ తెలుగు సంగీత దర్శకుల్లో కీరవాణి, దేవీశ్రీప్రసాద్ బాణీలు నాకు బాగా నచ్చాయి. దేవీ కంపోజ్ చేసిన 'రింగ రింగా...(ఆర్య2)' ఇటీవలి కాలంలో నాకు బాగా నచ్చినపాట. ఈ మధ్య ఈపాట విన్నప్పటి నుంచి తరచుగా నా నోట్లో నానుతోంది. ఇంకా... ఇక్కడ మిక్కి జె మేయర్, థమన్ ఇలా చాలామందే ఉన్నారు.

★ 'ఆరెంజ్'కు సంగీతం సమకూర్చాలనగానే నాకు ముందు చిరంజీవే గుర్తొచ్చారు. రాజ్‌కోటి ఆయన సినిమాలకు సంగీతం అందించేటప్పుడు నేను వారి దగ్గర కీబోర్డ్ ప్లేయర్‌గా చేశాను. ఆ తర్వాత రామ్‌చరణ్ నటించిన 'చిరుత', 'మగధీర' చిత్రాలు చూశాను. భాస్కర్ చెప్పిన కథను బట్టి ఆ సినిమాకి ఎలాంటి సంగీతం అందించాలో ఒక అవగాహన వచ్చింది. దానికితోడు భాస్కర్ నా పనిలో ఎప్పుడూ జోక్యం చేసుకోకుండా స్వేచ్ఛ ఇవ్వడంవల్లే ఆరెంజ్ ఆడియో అంత పెద్ద విజయం సాధించిందని నా ఫీలింగ్.

★ నేను సినిమా రంగంలోకి అడుగుపెట్టి దాదాపు పదేళ్లు పూర్తవుతున్నాయి. ఈ దశాబ్దంలో ఎన్నో సినిమాలకు సంగీతం అందించాను. అందులో నా ప్రతిభ యాభై శాతమే. మిగతా క్రెడిట్ దేవుడిదే అని చెప్తాను. ★

# ఈ అబ్బాయి హెచ్ఐవీ 'పాజిటివ్'

**ఆ అబ్బాయి తప్పు చేయలేదు. కానీ శిక్ష తప్పలేదు.
మామూలు శిక్ష కాదది. యావజ్జీవ శిక్ష.
అయినా దాన్ని ఆనందంగా అనుభవిస్తున్నాడు.
ఆ శిక్ష కూడా జాలిపడేలా తనలాంటివాళ్లకు చేయూతనిస్తున్నాడు.**



ఆ ఊరి చివర, విసిరేసినట్టుగా ఉందా టెంటు. దగ్గరకు వెళ్లిచూస్తేగానీ అందులో ఓ పదిహేనేళ్ల అబ్బాయి ఉన్న సంగతి తెలియదు.

ఒంటరిగా కూర్చున్న ఆ అబ్బాయి నిరాహార దీక్షకు నడుంబిగించిన యువకిశోరంలా కనిపిస్తాడు. టెంటు ఒంటరితనాన్ని తీర్చడానికే కూర్చుని, తాను మాత్రం ఏకాకిలా ఉన్న ఆ కుర్రాణ్ని చూస్తే... అంటరాని వాడేమో అనిపిస్తుంది.

అవును, బీహార్ రాష్ట్రం దర్భంగా జిల్లాలోని ఆ ఊరికి అతడు 'అంటరానివాడే'! కాసేపటి తరవాత అక్కడికి ఓ స్త్రీ వచ్చింది. ఆమెను చూడగానే 'అమ్మా...' అని గట్టిగా హత్తుకోవాలనిపించింది అతడికి. ఒంటరితనాన్ని 'నా దగ్గరకు రావొద్దు' అని గద్దించాలనిపించింది. నిన్నరాత్రి పీడకలను మరిచిపోయి అమ్మ ఒడిలో నిద్రపోవాలనిపించింది.

'భోంచేసి, నీళ్లు తాగి పడుకో'

ముక్తసరిగా మాట్లాడి వెళ్లిపోయిందామె... అమ్మ! ఊరి బయట టెంటుకింద కూర్చున్న కొడుకుతో ఓ తల్లి అలా మాట్లాడుతుందని ఎవరు మాత్రం ఊహిస్తారు! కానీ, ఆ కుర్రాడికి తెలుసు. ఎందుకంటే... గత కొద్ది రోజులుగా అమ్మ అలాగే చేస్తోంది.

ఇంతలో చీకటిపడింది. కొవ్వొత్తి వెలిగించాడు. భయం భయంగానే కాళ్లు దగ్గరగా తీసుకుని పడుకున్నాడు. 'అల్లా మాలిక్...' అనుకుంటూ గట్టిగా కళ్లు మూసుకున్నాడు. నిద్రలో ఓ కల. కల లాంటి నిజం.

★ ★ ★

## 1995

'నేనూ అక్కావాళ్లింటికి వెళ్తాను' - మారాం చేస్తున్నాడు 11 ఏళ్ల సాహిల్ హుస్సేన్. పిల్లాణ్ణి అల్లుడి దగ్గరకు పంపిస్తే ఏం బాగుంటుందని ఆలోచిస్తున్నారు తల్లిదండ్రులు. ఆఖరికి వాడి అల్లరి భరించలేక తీసుకెళ్లడానికి సిద్ధమయ్యారు అక్కా బావా. అలా బీహార్ నుంచి ముంబయి వెళ్లాడు సాహిల్. మూడేళ్లు అక్కడే ఉన్నాడు. ఇంటిపనుల్లో అక్కా బావలకు సాయపడేవాడు. ఓరోజు ఏదో పనిమీద రోడ్డుమీదకి వెళ్లాడు సాహిల్. రోడ్డు దాటుతుంటే వేగంగా వెళ్తున్న కారు ఢీకొంది. తీవ్రంగా గాయాలయ్యాయి. ఆసుపత్రిలో చేర్చారు. చాలా రక్తం పోవడంతో రక్తం ఎక్కించాల్సి వచ్చింది. కాస్త కోలుకున్నాక... సాహిల్‌ను ఊరికి పంపించేశారు అక్కాబావా. మొదట్లో బాగానే ఉండేవాడు సాహిల్. తరవాత్తరవాత జలుబూ జర్వమూ విరేచనాలూ... ఇలా రోజూ ఏదో అనారోగ్యంతో నీరసించిపోసాగాడు. ఓ రోజు ఇంట్లోనే స్పృహతప్పి పడిపోతే ఆసుపత్రిలో చేర్చారు. సెలైన్ పెట్టి, పరీక్షకోసం రక్తాన్ని పంపించారు. రిపోర్టు వచ్చేసరికి సాహిల్‌కు కాస్త తెలివివచ్చింది.

'ఈ అబ్బాయికి ఎయిడ్స్(హెచ్ఐవీ పాజిటివ్). అదో అంటువ్యాధి. ఎంతోకాలం బతకడు. ఇంటికి పంపించేయండి' అని డాక్టర్ చెప్పడం సాహిల్ చెవిన పడింది.

ఆ రోజునుంచీ సాహిల్ అంటే ఊళ్లోవాళ్లకు భయం. ఊళ్లోవాళ్లకే కాదు... ఇంట్లోవాళ్లకీ, ఆఖరికి అమ్మకీ భయమే!

'వాడు ఊళ్లో ఉంటే ఎవరికీ మంచిదికాదు' పెద్దలు చెప్పారు.

'వాణ్ణి ఊరిచివరే ఉంచండి. చచ్చిపోతే అక్కడే పూడ్చేయొచ్చు' ఇంకెవరో సలహా ఇచ్చారు. అలా ఊరిచివర టెంటుకిందకి చేరాడు సాహిల్.

> **'ముంబయిలో నాకు చెడు రక్తం ఎక్కించిన దేవుడే ఢిల్లీలో విజయలక్ష్మిలా కనిపించాడేమో! నాలాంటి వాళ్లకు నేను సాయపడేందుకే ఆ రక్తం నాకు ఎక్కించి ఉంటాడు. లేకపోతే ఎక్కడో మారుమూల గ్రామంలో ఉండాల్సిన నేను ఢిల్లీలో ఈ కేంద్రంలో ఉండటమేంటి? అందుకు గర్వంగా ఉంది' అంటాడు సాహిల్. ఆ మాటలు అంటున్నప్పుడు అతడి కళ్లల్లో ఎంతో ఆనందం.**

★ ★ ★

తెల్లవారింది. సాహిల్ కళ్లు తెరిచాడు. అప్పటికి నెలరోజులయింది ఊరు అతణ్ణి వెలివేసి. 'ఇలా ఇక్కడ ఎన్ని రోజులున్నా ప్రయోజనం లేదు' అనుకున్నాడు సాహిల్. ఆ రోజు రాత్రి ఎవరికీ తెలియకుండా ఇంట్లోకి అడుగుపెట్టాడు. రెండువేల రూపాయలు తీసుకుని ఢిల్లీ పారిపోయాడు.

రైల్వేస్టేషన్ ప్లాట్‌ఫాం మీద నాలుగు రోజులు గడిపాడు.

'హెచ్ఐవీ/ఎయిడ్స్ బాధితులా... అయితే మాకు ఫోన్ చేయండి' - స్టేషన్ బయట ఓ హోర్డింగ్ కనిపించింది. ఎడారిలో ఎండమావిలా అనిపించింది. 'ఒక్కసారి ఫోన్‌చేస్తే'... అనుకున్నాడు.

## దేవతలాంటి విజయలక్ష్మి!

'చెప్పండి' అవతల ఓ అమ్మాయి.

'నాకు ఎయిడ్స్ ఉందట. నేను బతకనట. ఏం చేయాలో తోచడం లేదు' చెప్పాడు సాహిల్. ఆ మాటల్లో భయం లేదు. అతడిలోని ఏకాకిని పరిచయం చేసినట్టున్నాయా మాటలు. అలాంటి ఎంతోమందితో మాట్లాడిన అనుభవం ఉన్న ఆ అమ్మాయికి సాహిల్ పరిస్థితి అర్థమయింది.

'మీరు దగ్గరలోని ప్రభుత్వాసుపత్రికి రండి. అన్నీ నేను చూసుకుంటాను' అంది. అలాగే వెళ్లాడు సాహిల్. అక్కడ కలిసిందా అమ్మాయి. 'నా పేరు విజయలక్ష్మి. ముందు పరీక్షలు చేయించుకో' అని అన్ని పరీక్షలూ చేయించింది.

'నీకేం భయంలేదు. నువ్వు బతుకుతావ్. ఆరోగ్యం చాలా జాగ్రత్తగా చూసుకోవాలి' అని చెప్పిందామె.

అప్పట్నుంచీ విజయలక్ష్మి ఎలా చెబితే అలా నడుచుకునేవాడు సాహిల్. ఢిల్లీ ప్రభుత్వం అందించిన ఉచితవైద్యం సాహిల్‌లాంటి ఎంతోమందికి కొత్త జీవితాన్నిచ్చింది.

★ ★ ★

## 2010

ఢిల్లీలోని ఓంప్రకాష్ నెట్‌వర్క్ ఫర్ హెచ్ఐవీ/ఎయిడ్స్ కౌన్సెలింగ్ కేంద్రం.

'నావాళ్లంతా అసహ్యించుకుంటున్నారు. నేను బతకను' అంటూ ఏడుస్తోంది ఓ యువతి. అప్పుడే లోపలికొచ్చాడు సాహిల్. అతడికి విజయలక్ష్మి గుర్తుకొచ్చింది.

'నీకేం కాదు... మేమంతా ఉన్నాం' అని ధైర్యం చెప్పాడు.

ఆ కేంద్రం సాహిల్ ఏర్పాటుచేసిందే. ప్రస్తుతం అందులో 930 మంది హెచ్ఐవీ/ఎయిడ్స్ బాధితులు సభ్యులు. వారిలో 370 మంది పిల్లలే! మరో తొమ్మిదిమంది హెచ్ఐవీ బాధితులతో కలిసి దాన్ని ఏర్పాటు చేశాడు. 'యాక్షన్ ఎయిడ్' అనే స్వచ్ఛంద సంస్థ సహాయంతో నడుపుతున్నాడు. ★

# సంక్రాంతి స్పెషల్!




**కావలసినవి**

బియ్యప్పిండి: 2 కప్పులు(అరిసెలమాదిరి గానే నానబెట్టి మిల్లుపట్టిన పిండి అయితే మేలు), నీళ్లు: సరిపడా, పచ్చిమిర్చిముద్ద: టీస్పూను, జీలకర్ర: టీస్పూను, ఉప్పు: తగినంత, సెనగపప్పు: టేబుల్‌స్పూను, సగ్గుబియ్యం: టేబుల్‌స్పూను, వెన్న: టేబుల్ స్పూను, కరివేపాకు: నాలుగురెమ్మలు, నూనె: వేయించడానికి సరిపడా



ఆంధ్రా చెక్కలు

**తయారుచేసే విధానం**

★ సెనగపప్పు, సగ్గుబియ్యం కడిగి రెండు గంటలముందే నానబెట్టాలి.

★ బియ్యప్పిండిలో తగినంత ఉప్పు వేసి కలపాలి. అందులో పచ్చిమిర్చి ముద్ద, నాన బెట్టిన సగ్గుబియ్యం, సెనగపప్పు, వెన్న, జీలకర్ర, సన్నగా తరిగిన కరివేపాకు వేసి కలపాలి. తరవాత తగినన్ని నీళ్లు పోసి కలపాలి.

★ పిండిని చిన్న చిన్న ఉండలుగా చేసుకుని పాలిథీన్ పేపర్‌మీద నెయ్యి రాసి చెక్కల్లా వత్తి కాగిన నూనెలో మరీ ముదురు రంగు రాకుండా వేయించి తీయాలి. ఆరిన తరవాత పొడి డబ్బాలో పెడితే నెలరోజులైనా కమ్మగా ఉంటాయి.

**కావలసినవి**

సెనగపప్పు: పావుకిలో, పంచదార: పావు కిలో, నెయ్యి: అరకప్పు, కొబ్బరిచిప్ప: ఒకటి

**తయారుచేసే విధానం**

★ సెనగపప్పుని కడిగి గంటసేపు నాననివ్వాలి. తరవాత తగినన్ని నీళ్లు పోసి కుక్కర్‌లో పెట్టి మెత్తగా ఉడికించాలి. ఎక్కువగా ఉన్న నీళ్లను పూర్తిగా వంపేయాలి.

★ కొబ్బరిని తురమాలి. దీన్ని సెనగపప్పులో వేసి కలిపి అవసరమైతే ఓసారి పప్పుతో సహా మిక్సీలో వేసి మెత్తగా రుబ్బాలి.

★ మందపాటి గిన్నెలో పంచదార, తగినన్ని నీళ్లు పోసి తీగపాకం రానివ్వాలి.

★ ఇప్పుడు సెనగపప్పు ముద్దను పాకంలో వేసి బాగా కలిపి చిక్కబడేవరకూ ఉడికించాలి. గిన్నెకు అంటుకోకుండా కలుపుతూ ఉండాలి.

★ మిశ్రమాన్ని గుండ్రని ముద్దలుగా చేసుకుని ఎంత పలుచగా చేయగలిగితే అంత పలుచగా పాలరాయి లేదా అరిటాకు మీద ఒత్తుకుని నాన్‌స్టిక్‌పాన్‌లో నెయ్యి వేస్తూ రెండువైపులా కాల్చి తీయాలి.



మైసూర్ పోళీ

**కావలసినవి**

బియ్యం: కప్పు, చిక్కని కొబ్బరిపాలు: 4 కప్పులు, బెల్లం: కప్పు, నెయ్యి: టేబుల్‌స్పూను, యాలకులపొడి: టీస్పూను

**తయారుచేసే విధానం**

★ ఓ గంటసేపు బియ్యం నానబెట్టి మెత్తని ముద్దలా రుబ్బుకోవాలి.



మలబార్ పాయసం

★ మందపాటి గిన్నెలో రెండు కప్పుల కొబ్బరి పాలు, అందులో రెండు కప్పుల నీళ్ల కలిపి మరిగించాలి. తరవాత బెల్లం తురుము వేసి తిప్పాలి.

★ బియ్యం ముద్దని కారప్పూస గొట్టంలో పెట్టుకుని లావు కారప్పూస, గుండ్రని బూందీ వచ్చే ప్లేట్లను అమర్చి నేరుగా స్టవ్ మీదున్న పాల మిశ్రమంలోకి వత్తాలి.

★ అవి ఉడికి మిశ్రమం చిక్కబడిన తరవాత మిగిలిన కొబ్బరిపాలు పోసి యాలకుల పొడి వేసి దించాలి. చివరగా నెయ్యి వేసి కలిపి వడ్డించాలి.

## రాయలసీమ బర్ఫీ

**కావలసినవి**

నువ్వులు: 3 కప్పులు, పంచదార: రెండున్నర కప్పులు, వేరుసెనగగుళ్లు: కప్పు, కొబ్బరి తురుము: అరకప్పు, బాదం లేదా జీడిపప్పు: అలంకరణకు సరిపడా

**తయారుచేసే విధానం**

★ మందపాటి బాణలిలో నువ్వులు వేసి మంచి వాసన వచ్చేవరకూ వేయించి పక్కన ఉంచాలి.



★ తరవాత వేరుసెనగగుళ్ల కూడా వేయించి తీయాలి. చల్లారిన తరవాత వేయించిన నువ్వులు, పొట్టుతీసిన వేరుసెనగగుళ్ల కూడా విడివిడిగా మిక్సీలో వేసి మెత్తగా రుబ్బాలి.

★ మందపాటి గిన్నెలో పంచదార, తగినన్ని నీళ్లు పోసి పాకం పట్టాలి. పాకం ఉడికి కాస్త చిక్కబడ్డ తరవాత నువ్వులపొడి, పల్లీలపొడి వేసి ఉండలు కట్టకుండా తిప్పాలి. చివరగా కొబ్బరితురుము కూడా వేయాలి. మిశ్రమం చిక్కబడి అంచులకు అంటుకోనంతవరకూ ఉడికించాలి.

★ నెయ్యిరాసిన ప్లేటులో ఈ మిశ్రమాన్ని వేసి అట్లకాడతో సర్ది డైమండ్స్ ఆకారంలో కోసి పైన ఓ జీడిపప్పు లేదా బాదంపప్పు అంటిస్తే సరి. ఆరిన తరవాత వేటికవి విడదీసి అందించండి.

## తెలంగాణా సకినాలు

**కావలసినవి**

బియ్యం: 4 కప్పులు, వాము: పావుకప్పు, నువ్వులు: అరకప్పు, ఉప్పు: సరిపడా, నూనె: వేయించడానికి సరిపడా

**తయారుచేసే విధానం**

★ బియ్యం కడిగి మూడు నాలుగు గంటలు నానబెట్టుకోవాలి.

★ తరవాత నీళ్ల వంపేసి పలుచని బట్టమీద మూడుగంటలపాటు ఆరనిచ్చి పిండి పట్టించాలి.



★ నువ్వులు తక్కువ మంట మీద కొద్దిగా వేయించాలి. బియ్యప్పిండిలో వేయించిన నువ్వులు, వాము, ఉప్పు వేసి కలపాలి. తరవాత తగినన్ని నీళ్లు పోసి కలపాలి. ఇప్పుడు పాలిథీన్ కవరు లేదా బట్ట మీద చేత్తో కొంచెంకొంచెంగా పిండిని తీసుకుని జంతికల మాదిరిగా చేత్తోనే రెండుమూడువరసలు వచ్చేలా చుట్టాలి. ఇలాగే పిండి మొత్తం చేసుకోవాలి. ఆరిపోయాయని భయపడక్కర్లేదు. పిండి ఎంత ఆరితే సకినాలు అంత గట్టిగా వస్తాయి.

★ ఇప్పుడు స్టవ్‌మీద బాణలి పెట్టి నూనె పోసి సకినాలను వేసి వేయించి తీయాలి. నమలడానికి కాస్త గట్టిగా ఉండే సకినాలు తినేకొద్దీ రుచిగా ఉంటాయి. నెలరోజులపాటు నిల్వ ఉంటాయి.



# బాల వినోదిని

## జతచేయండి

**ఇ**క్కడున్న వ్యక్తుల్ని వారికి సరిపోయే వస్తువులతో జతచేయండి.




## అంకెలాట

| | | |
|---|---|---|
| | | |
| | | |
| | | |

**ఖా**ళీల్లో అంకెలు నింపాలి. అలా నింపినపుడు అడ్డం, నిలువు, మూలలలోని ప్రతి మూడు అంకెల మొత్తం 18 కావాలి. 1–10 అంకెల్ని మాత్రమే తీసుకోవాలి.

## చెప్పండి చూద్దాం

1. ఏ రోమన్ చక్రవర్తి పేరున జులై నెలకు ఆ పేరు వచ్చింది?
2. బలరాముడి తల్లిదండ్రులు ఎవరు?
3. మంజీరా, ఇంద్రావతి ఏ నదికి ఉపనదులు?
4. రావణాసురుడు సీతను లంకకు ఎత్తుకొని వెళ్తున్నపుడు అతడితో పోరాడిన పక్షి పేరేమిటి?
5. గాంధీ, నెహ్రూ ఇంగ్లండ్ వెళ్లి ఏ కోర్సు చదివారు?
6. చౌమహల్లా ప్యాలెస్ ఏ నగరంలో ఉంది?
7. సూపర్ హీరో స్పైడర్‌మ్యాన్ ఏ నగరానికి సంరక్షకుడిగా ఉంటాడు?

## జింక తెలివి

**అ**డవిలో జింకపిల్ల ఒకటి ఆహారం కోసం బయలు దేరింది. ఆ జింక అడవిలోకి వెళ్లడం అదే మొదటిసారి. జింకపిల్లకి తల్లి ఎన్నో జాగ్రత్తలు చెప్పి పంపించింది. మొదటిరోజు క్షేమంగా తిరిగి వచ్చిన జింక పిల్లకు రెండోరోజు మాత్రం పెద్దగండమే ఎదురైంది. రుచికరమైన ఆహారం దొరికిందని చెరువు ఒడ్డున గుబురుగా ఉన్న పొదల్లోకి వెళ్లింది.

చాలాసేపటి నుంచి ఆ పొదల చాటున దాగున్న నక్క ఒకటి జింకపిల్ల రాకను గమనించి అది పరుగుతీయక ముందే ఒడిసి పట్టుకుంది. జింకపిల్ల ఒక్కసారి భయంతో ప్రాణాలపై ఆశలు వదులుకున్నా మరుక్షణమే దానికి తల్లి చెప్పిన సలహా ఒకటి గుర్తొచ్చింది.

'నక్క బావా, నువ్వు నన్ను చంపడంవల్ల నాకు ఏ నష్టమూలేదు. నావల్ల నీ ప్రాణాలకీ ముప్పు ఉంది. అదే నాకు బాధనిపిస్తోంది' అంది జింకపిల్ల.



'ఏంటీ నువ్వు చెబుతున్నది'... ఆతృతగా అడిగింది నక్క.

'నా కాలికి ఓ విషపూరిత ముల్లు గుచ్చుకుంది. ఆ ముల్లు తీయకుండా నువ్వు నన్ను తింటే నీప్రాణాలకూ ముప్పే కదా!' అని చెప్పింది జింకపిల్ల.

'నువ్వు చెప్పేది నిజమేనా, ఏదీ నీ కాలు చూపించు'... అంటూ అనుమానంగా అడిగింది నక్క.

'నిజం నక్క బావా, నా కాలే బావుంటే నీకు దొరికేదాన్నా చెప్పు. ఈ పొదల నీడలో నీకు ముల్లు కనిపించదు కానీ అలా వెలుగులోకి నడు నా కాలికి దిగిన ముల్లు చూపిస్తాను' అని చెప్పింది జింక.

రెండూ కలిసి పొదల్లోంచి చెరువు ఒడ్డుకు వచ్చాయి. జింకపిల్ల నక్కకి చూపించడానికి కాలు ఎత్తినట్టు ఎత్తి ఒక్కసారి దాని ముఖంపై తన్నింది. ఆ దెబ్బకు నక్క చెరువులో పడింది. అది ఒడ్డును చేరుకునే లోపల జింకపిల్ల అక్కణ్నుంచి రివ్వున పరుగుతీసింది.

## తేడాలేంటి?

**ఈ** రెండు బొమ్మల మధ్య ఆరు తేడాల్ని చెప్పండి.





# గప్‌చుప్

1. రాజు సోమవారం కొన్ని ఫొటోలు తీశాడు. మంగళవారంనాడు అవే స్టిల్ ఫొటోల్ని మళ్లీ తీశాడు. వీటిలో ఏ రోజు ఏ ఫొటోలు తీశాడో మీరు చెప్పగలరా?
2. 1, 6 ఫొటోల మధ్య కొన్ని తేడాలు న్నాయి. అవేంటో చెప్పండి?
3. ఈ బొమ్మల్లో ఒక చోట పక్షి ఉంది. కనిపించిందా?
4. 3, 8 ఫొటోలలో టీచర్లు ఏయే సబ్జెక్ట్ పాఠాలు చెబుతున్నారు?
5. 1 నుంచి పదో ఫ్రేమ్‌కు వెళ్లే దారి చూపండి.






## ఏం వస్తుంది?

ఈ అమరికలో ఖాళీగా ఉన్న చోట వచ్చే భాగం ఎలా ఉంటుంది?



# రంగులేద్దాం

ఈ బొమ్మకు రంగులు వేయండి.



# చిత్రంలో చిత్రం

ఇక్కడ ఆవుతోపాటు ఇంకా ఏం కనిపిస్తోంది?



## జవాబులు

**జతచేయండి:** A-4, B-8, C-3, D-2, E-6, F-7, G-9, H-1, I-5.

**గప్‌చుప్:** (1) సోమవారం-1,3,5,7,9 మంగళవారం-2,4, 6,8,10. (2) జెర్సీపై అంకెలు మారాయి, లైట్లు, చేతిలో పండు, అమ్మాయి జడ. (3) ఏడో ఫ్రేమ్ చెట్టు కొమ్మల్లో. తిప్పి చూడండి. (4) 3లో భౌతికశాస్త్రం, 8లో చరిత్ర.

**చెప్పండి చూద్దాం:** 1. జూలియస్ సీజర్, 2. వసుదేవుడు, రోహిణి, 3. గోదావరి, 4. జటాయువు, 5. బారిస్టర్, 6. హైదరాబాద్, 7. మిడ్‌టౌన్.

**తేడాలేంటి?:** 1. పాప చేతిలో కార్డు మీద పక్షి బొమ్మ, 2. కప్పు హ్యాండిల్ 3. ద్రాక్షపళ్ళ రంగు 4. గోడపక్కన అబ్బాయి ప్యాంటు మడత 5. అబ్బాయి చంకలో బ్యాటు 6. సీసాలో ద్రవం.

**చిత్రంలో చిత్రం:** ప్రపంచపటం.

**అంకెలాట**

| | | |
|---|---|---|
| 9 | 2 | 7 |
| 4 | 6 | 8 |
| 5 | 10 | 3 |

**ఏం వస్తుంది?**



# పువ్వుల్లో ఫ్యాషన్

**నేలకు దిగిన హరివిల్లులా రంగురంగుల్లో విరబూసిన పూలను మించిన సౌందర్యం ప్రకృతిలో మరొకటి లేదు. అలాంటి పువ్వులు అమ్మాయిల దుస్తుల మీద డిజైన్లైతే ఆ డ్రెస్‌కే కాదు, వేసుకున్న అమ్మాయికీ అందాన్ని తెస్తాయనడంలో ఆశ్చర్యమేముందీ. అందుకే, కొత్త డిజైన్లు ఎన్ని వస్తున్నా మధ్యమధ్యలో ఫ్లోరల్ ప్రింట్స్ రకరకాల రూపాల్లో పలకరిస్తూనే ఉంటాయి. వాటిలో పెద్ద పెద్ద పువ్వులున్న డిజైన్లు తాజా ఫ్యాషన్..!**






ముదురు రంగు బట్టమీద దానికి భిన్నమైన రంగుల్లో పెద్ద పెద్ద పూల ప్రింట్లు... ఎనిమిదో దశకం చివరిలో మహిళా లోకాన్ని ఓ ఊపు ఊపాయి. ఆ తర్వాత కనీకనిపించని పువ్వుల ప్రింట్ల దగ్గర్నుంచి ఎన్నో రకాల డిజైన్లు వచ్చాయి. ఇన్నాళ్లకు డిజైనర్ల కళ్లు మళ్లీ పెద్ద పువ్వుల మీదకు మళ్లినట్టున్నాయి. ఆధునిక దుస్తులకు ఆ పాత వైభవాన్ని తొడిగి కొత్త కళ తీసుకొచ్చారు. రకరకాల డిజైన్లలో వచ్చిన ఫ్లోరల్ ప్రింట్స్ దుస్తులు ఫ్యాషన్ షోలలో క్యాట్‌వాక్ చేయడం మొదలు పెట్టాయి. ఇంకేముందీ, ఈ పూల సొగసులకు ఫ్లాటైపోయిన ఈతరం అమ్మాయిలు కొత్త ఫ్యాషన్‌కు తెరతీశారు. వారి ఆసక్తిని చూశాక డిజైనర్లు ఆగుతారా... పొడవు, పొట్టి కుర్తీలు, గౌన్లు, లెగ్గింగ్స్‌లాంటి ఆధునిక దుస్తులతో పాటు సంప్రదాయ సల్వార్‌కమీజ్, చీరల్ని కూడా గుమ్మడికాయంత పువ్వుల ప్రింట్లతో అందంగా ముస్తాబు చేశారు. అన్నట్లూ ఈ బడా కుసుమాలకు హాలీవుడ్‌తో పాటు బాలీవుడ్ టాలీవుడ్ తారలు కూడా అభిమానులే. అనుష్క, సమంతలాంటి తారలు లెగ్గింగ్స్, జీన్స్ మీద పువ్వుల టాప్స్‌తో అలరిస్తుంటే, బిపాషా, ఐశ్వర్యారాయ్‌లు పూల గౌన్లు వేసి ట్రెండీగా కనిపిస్తున్నారు. ఇక బాలీవుడ్ సుందరాంగి హేమమాలినీ, సెలీనాజైట్లీలాంటి వారు భారీ పుష్పాలున్న చీరలను కట్టి 'ఇది మా స్టైల్' అంటున్నారు.

ఇలా పెద్ద పువ్వుల ప్రింట్స్‌తో వచ్చేవి ఎప్పుడూ నలుపు, నీలం, ఆకుపచ్చ, పింక్‌లాంటి ముదురు రంగుల్లోనే ఉంటాయి. వాటిలో నలుపు బట్టమీద పసుపు, నారింజ, నీలం రంగుల పువ్వుల ప్రింట్లున్న డిజైన్లు పాపులర్. అందులోనూ విరబూసిన కుసుమాల అందం చూడగానే ఆకట్టుకునేలా ఉండడానికి పూవుల్ని సహజంగా చూపించే రంగుల్నే వాడతారు. అంతేకాదు, ఫ్లోరల్ డిజైన్ దుస్తుల్లో వేరు వేరు రంగులు ఎక్కువ ఉంటాయి కాబట్టి దాదాపు అందరికీ సూటవుతాయి. యాక్సెసరీస్‌ను కూడా వాటిలో ఏదో రంగుకు మ్యాచ్ అయ్యేలా చూసుకుంటే సరిపోతుంది. వాటిలో కూడా పూల డిజైన్లుంటే మరీ మంచిది. ఈ పూల సొగసులు మీకూ నచ్చాయా..? అయితే, వార్డ్‌రోబ్‌లో స్థానం కల్పించేయండి మరి. ★










# నన్ను కొట్టండి

'మీకు బాగా కోపమొచ్చినపుడు ఎవర్నైనా చితక బాదాలనిపిస్తుందా... అయితే మీ కసిని నామీద తీర్చుకోండి, కోపం పోయేవరకూ నన్ను కొట్టండి' అంటున్నాడు న్యూయార్క్‌కు చెందిన నేట్ హిల్. ఇదెక్కడి విడ్డూరం అనిపిస్తోంది కదా! హిల్ మాత్రం ఇదొక రకం ప్రజా సేవ అంటాడు. విసుగూ, కోపం, ఒత్తిడి లాంటి సమస్యలతో బాధపడుతున్నపుడు తనక్కూడా దేన్నైనా విరగ్గొట్టాలనిపిస్తుందట. అలా కొడితే మనసు తేలిక పడుతుందట. అందుకే, తనలా ఫీలయ్యే వారికోసం 'పంచ్ మీ పాండా' అంటూ పాండా దుస్తులు వేసుకుని జనం బాగా ఉన్నచోట నిలబడుతున్నాడు. మొదట్లో అతని థీమ్ ఎవరికీ అర్థం కాకపోయినా రెండు మూడు రోజుల్లోనే హిల్‌ను పిడిగుద్దులు గుద్ది తమ కోపాన్ని తగ్గించుకునే పనిలో పడ్డారు జనం. అన్నట్లూ హిల్ తనున్న చోటికి రాలేని వారికి ఫోన్ చేస్తే వాళ్లింటికే వెళ్లి గుద్దించుకునే అవకాశాన్నీ కల్పిస్తున్నాడు. వెర్రి వేయి విధాలంటే ఇలానే ఉంటుందేమో!



# ఐడియా అదుర్స్



తీరిక ఉండాలే గానీ కుట్లూ అల్లికల్లాంటి పనులు చేయడానికి దాదాపు అందరమ్మాయిలూ ఆసక్తి చూపిస్తారు. కాకపోతే చాలా మందికి ప్రత్యేకంగా శిక్షణ పొందే అవకాశమే దొరకదు. అల్లడం వచ్చినా తీరిక దొరికినపుడు అన్ని వస్తువులూ అందుబాటులో ఉండకపోవచ్చు. ఈ సమస్యనే వ్యాపారంగా మార్చుకున్నారు బ్యాంకాక్‌లోని 'బిగ్ నిట్ కేఫ్' నిర్వాహకులు. ఈ కేఫ్‌లో కాఫీ, టీ, స్నాక్స్‌తో పాటు ఊలుదారాలూ అల్లికలకు కావాల్సిన సామగ్రీ ఉంటాయి. సో, అమ్మాయిలు ఎప్పుడైనా ఖాళీ దొరికినపుడు వెళ్లి స్నాక్స్ తింటూ స్వెటర్లూ, స్కార్ఫ్‌ల్లాంటివి అల్లుకోవచ్చు. అల్లడం రానివాళ్లకు కేఫ్‌లోని సిబ్బంది శిక్షణ ఇస్తారు. సో, కాఫీ తాగుతున్న కాసేపట్లో ఓ కొత్త పని నేర్చుకోవచ్చు. మళ్లీ సమయం చిక్కినపుడు ఇంకాస్త నైపుణ్యం సంపాదించొచ్చన్నమాట. అందుకే, ఈ కేఫ్‌కు టీనేజీ అమ్మాయిల దగ్గర్నుంచి బామ్మల వరకూ ఎంతో ఉత్సాహంగా వస్తున్నారట. అప్పుడప్పుడూ సెలెబ్రిటీలు కూడా ఓ లుక్కేస్తుంటారట.

# పెద్ద పెట్

పిల్లుల్నీ, కుక్కల్నీ పెంచుకోవడం, ఎక్కడికెళ్తే అక్కడికి వాటినీ వెంట తీసుకెళ్లడం సాధారణమే. కాస్త వినూత్నంగా, చూసే వారికి వింతగా అనిపించాలంటే... ఆల్బర్టాకు చెందిన లిండా సాట్నర్‌లా గేదెను పెంపుడు జంతువులా పెంచుకోవాలి. అంతేకాదండోయ్, కార్లో కొత్త ప్రదేశాలకు తిప్పాలి, పబ్బులకు తీసుకెళ్లాలి. అక్కడ గేదెకు కిక్కెక్కేలా బీర్ తాగించాలి. తప్ప తాగి అది చిందులేస్తుంటే చూడాలి. ఇవన్నీ ఊరికే చెప్పే కబుర్లు కాదు. లిండా పెంచుకునే గేదె బెయిలీ ఈ పనులన్నీ చేస్తుంది. రెండేళ్ల బెయిలీకి తన యజమానితో కార్లో షికారుకెళ్లడం, పబ్బులో బీరు తాగి చిందులేయడం అంటే చాలా సరదా అట. విచిత్రంగా ఉంది కదూ! అందుకే, 'యానిమల్ ప్లానెట్' ఛానెల్ వాళ్లు లిండా, బెయిలీల మీద డాక్యుమెంటరీ కూడా తీశారు.



# అమ్మ మనసు

చైనాలో ఉండే 'జు యాహువా'కు పన్నెండేళ్ల వయసులోనే రైలు ప్రమాదంలో రెండు కాళ్లూ పోయాయి. తర్వాత తల్లి దండ్రులనూ కోల్పోవడంతో 'జు' ఓ అనాథాశ్రమంలో చేరింది. కాళ్లు లేవు, నా అనే వాళ్లూ లేరు. అయినా 'జు' ధైర్యాన్ని కోల్పోలేదు. రెండు ఎత్తు పీటలను దగ్గరకు చేర్చుకుని వాటితోనే నడవడం నేర్చుకుని, ఎవరి మీదా ఆధారపడకుండా తన పనులు తను చేసుకోవడం అలవాటు చేసుకుంది. తర్వాత ఆ అనాథాశ్రమంలో చేరే చంటిపిల్లల్నీ సాకడం మొదలు పెట్టింది. వారి ఆలనా పాలనా చూస్తూ 130మంది అనాథ పిల్లలకు అమ్మగా మారింది. అక్కడే ఉండే రైతు 'లై జియాన్' ఆమె మంచితనాన్ని చూసి మనసుపడి పెళ్లి చేసుకున్నాడు. పెళ్లయ్యాక, తనకో బాబు పుట్టినా 'జు' అనాథాశ్రమాన్ని వదల్లేదు. ఇప్పుడు 'జు'కి 55 ఏళ్లు. అయినా 130 మంది పిల్లల ఆలనా పాలనా చూడ్డం ఆమె కష్టంగా భావించదు. అన్ని అవయవాలూ సక్రమంగా ఉండి కూడా అన్నిటికీ ఆపసోపాలు పడేవాళ్లు 'జు'ని చూసి నేర్చుకోవాల్సిందెంతో ఉంది కదా.



# టెక్ బామ్మ

సౌత్‌వేల్స్‌కు చెందిన ఈ బామ్మగారి పేరు లిలియన్ లోవ్. వయసు 104ఏళ్లు. మరి ఆమె హాబీలేంటో తెలుసా... అంత వయసొచ్చాక ఇంకేం చేస్తుందిలే పాపం దైవధ్యానం చేస్తూ కాలం వెళ్లదీస్తుందేమో అనుకుంటే మనం పొరబడినట్లే. లిలియన్‌కు సోషల్ నెట్‌వర్కింగ్ సైట్ అయిన ఫేస్ బుక్‌లో అకౌంట్ ఉంది. తన మనవడి ఐపాడ్‌తో రోజూ బ్రౌజింగ్ చేస్తుంటుంది. అంతేకాదు, త్వరలోనే కొత్త వెర్షన్ ఐపాడ్‌ను సొంతంగా కొనుక్కుంటుందట. ఫేస్‌బుక్‌ను ఉపయోగించే 50కోట్ల మందిలో ఎక్కువ వయసున్న మహిళ లిలియనే. చిన్న వయసులోనే అది ఆసక్తి లేదు, ఇది ఇంట్రెస్ట్ లేదూ అనే వారికి ఈ వయసులోనూ కొత్త టెక్నాలజీని ఫాలో అయ్యే లిలియన్ బామ్మగారు నిజంగా ఆదర్శనీయమే.



# రాశి ఫలం

గ్రహబలం (జనవరి 9 - 15)



తంగిరాల ప్రభాకర పూర్ణయ్య సిద్ధాంతి



## మేషం అశ్విని, భరణి, కృత్తిక 1వ పాదం

నిరుద్యోగులకూ ప్రస్తుత ఉద్యోగంలో ఉన్నతి కోరుకునేవారికీ శుభసూచనలు కనిపిస్తున్నాయి. ముఖ్యమైన వ్యవహారాల్లో పట్టుదలగా ఉండి జయం పొందుతారు. పాతమిత్రులూ బంధువులతో కలిసి సరదాగా కాలక్షేపం చేస్తారు. ఆదాయాన్నిబట్టి మీ ఖర్చులు అదుపులో ఉండేటట్లుగా చూసుకోవడం మంచిది. అన్ని రంగాల వారికీ జయం.



## వృషభం కృత్తిక 2,3,4 పాదాలు; రోహిణి, మృగశిర 1,2 పాదాలు

అనారోగ్య సూచనలున్నాయి. ఆరోగ్యం పట్ల శ్రద్ధ చూపండి. వృత్తివ్యాపారాదులు నిలకడగా సాగుతాయి. సొంతవిషయాలను నిర్లక్ష్యం చేసి ఇతరుల వ్యవహారాల్లో తలదూరుస్తారు. ఉద్యోగులకు పైఅధికారుల నుంచి ప్రశంసలూ శ్రమకు తగిన గుర్తింపూ లభిస్తాయి. ఇంట్లో పెద్దల ఆరోగ్యం ఆందోళనకు గురి చేస్తుంది. అధిక ధనవ్యయం సూచితమవుతోంది, తస్మాత్ జాగ్రత్త.



## మిథునం మృగశిర 3, 4 పాదాలు, ఆర్ద్ర, పునర్వసు 1, 2, 3 పాదాలు

అధికప్రయాణాలు చేయాల్సి వస్తుంది. అలసట, నరాల నిస్సత్తువ వంటివి ఇబ్బంది పెడతాయి. పనులన్నీ నత్తనడకన సాగుతాయి. ఉద్యోగులు... ముఖ్యంగా బ్యాంకు తదితర ఆర్థిక సంబంధిత విధుల నిర్వహణలో ఉన్నవారు మెలకువ పాటించాల్సిన సమయం. అపనిందల పాలయ్యే సూచనలున్నాయి. తద్వారా మనస్తాపం. స్వయంవృత్తుల వారికి ఈవారం అంతగా కలిసిరాదు.



## కర్కాటకం పునర్వసు 4వ పాదం; పుష్యమి, ఆశ్లేష

ఏ పని చేపట్టినా అనేక ఆటంకాలూ అవరోధాలూ ఎదురై సహనానికి పరీక్ష పెడుతుంటాయి. అధిక ఒత్తిడిని ఎదుర్కోవలసి వస్తుంది. అయినా మొక్కవోని కార్యదీక్షతో ముందుకు సాగుతారు. మనసులోని కోపాన్నీ భయాలనూ విడనాడితే జయం మీదే. వాటిని ప్రదర్శించడం వల్ల మీకే నష్టమని గ్రహించండి. వారాంతానికి వచ్చేసరికి ఈ ఇబ్బందులన్నీ తగ్గి పరిస్థితుల్లో మంచిమార్పు కనపడుతుంది.



## సింహం మఖ, పుబ్బ, ఉత్తర 1వ పాదం

పడిన శ్రమకు గుర్తింపు ఘనంగా ఉంటుంది. ప్రశంసలూ పొగడ్తలూ పెద్దవారి ఆశీర్వచనాలూ లభిస్తాయి. కానీ మీ ఎదుగుదలను జీర్ణించుకోలేనివారి నుండి పెడవివిరుపులూ న్యూనపరిచే మాటలూ ఎదుర్కోవాల్సి వస్తుంది. అలాంటివాటిని పట్టించుకోకుండా హుందాగా ముందుకు సాగండి. భూసంబంధ వ్యాపారులూ పనివారలకు మంచి సమయం. చిరువ్యాపారులకు గతంకంటే మేలైనకాలం.



## కన్య ఉత్తర 2, 3, 4 పాదాలు; హస్త, చిత్త 1, 2 పాదాలు

అధిక వ్యయప్రయాసలతో కూడిన పనుల్లో అంత సానుకూలత ఉండదు. ఆశించి భంగపడతారు. వృథాశ్రమ, ప్రయాణాలతో చికాగ్గా ఉంటుంది. శ్రమ ఎక్కువ, ఫలితం తక్కువ అన్నట్టుంటుంది పరిస్థితి. ఉద్యోగ వ్యాపారాల రీత్యా ఒత్తిడులుంటాయి. బంధుమిత్రులతోనూ సోదరవర్గంతోనూ వ్యవహరించేటప్పుడు మీ సహనమే మీకు రక్ష. అకాల భోజనం, అకాల నిద్ర సూచితం.



## తుల చిత్త 3, 4 పాదాలు, స్వాతి, విశాఖ 1, 2, 3 పాదాలు

కుటుంబసమస్యలు, అధైర్యంతో బాధపడతారు. ఇంట్లో పరిస్థితి ఎలా ఉన్నా బయటపడకుండా గుంభనగా హుందాగా వ్యవహరిస్తారు. సమాజంలో మీ కీర్తిప్రతిష్ఠలూ పలుకుబడీ పెరుగుతాయి. కొన్ని బృహత్తర కార్యాలను మీరే ముందుండి నడుపుతారు. పిల్లల ఎదుగుదల, వారి అభివృద్ధి ఆనందం కలిగిస్తాయి. సభలూ సమ్మేళనాల్లో పాల్గొంటారు.



## వృశ్చికం విశాఖ 4వ పాదం; అనూరాధ, జ్యేష్ఠ

ఈవారం అన్ని రకాలుగా ముందంజ. చేపట్టిన వృత్తివ్యవహారాలను విజయవంతంగా పూర్తిచేస్తారు. బంధుమిత్రుల సహాయసహకారాలు ఆశించకుండా స్వశక్తితో ముందుకు నడుస్తారు. కొన్ని విషయాల్లో అనూహ్యఫలితాలు పొందుతారు. సర్వత్రా జయం. విద్యార్థులకు శుభవార్తలు. ఉద్యోగులకు పైఅధికారుల వల్ల ఒత్తిడి ఉన్నప్పటికీ అంత లెక్కలోనిది కాదు.



## ధనుస్సు మూల, పూర్వాషాఢ, ఉత్తరాషాఢ 1వ పాదం

ఉద్యోగులకు అనూహ్య బదిలీలు. వృత్తిరీత్యా పలు ఆటంకాలు. అయినా అంతిమంగా సత్ఫలితాలు. పై అధికారుల ప్రోత్సాహం లభిస్తుంది. 'ఈ పని మీరే చేయగలరు' అనే గుర్తింపు ఉంటుంది. విద్యార్థుల శ్రమ వృథా కాదు. ఖర్చులను కొద్దిగా అదుపులో ఉంచుకుంటే మంచిది. శుక్ర, శనివారాల్లో వాహనం నడిపేటప్పుడు జాగ్రత్తగా ఉండండి.



## మకరం ఉత్తరాషాఢ 2, 3, 4 పాదాలు; శ్రవణం, ధనిష్ఠ 1, 2 పాదాలు

వారమంతా ప్రతీ క్షణం ఏదో ఒక పనిలో తీరికలేకుండా ఉంటారు. అధికప్రయాణాలు సూచితం. ఆరోగ్యాన్ని చాలా జాగ్రత్తగా కాపాడుకోవాల్సిన సమయం. వైద్యుల సలహాలు తీసుకోవాల్సి వస్తుంది. చిట్కావైద్యాల వల్ల అనర్థ సూచనలు. వృత్తివ్యాపారాల విషయంలో మాత్రం సానుకూల వాతావరణం ఉంటుంది.



## కుంభం ధనిష్ఠ 3, 4 పాదాలు; శతభిషం, పూర్వాభాద్ర 1, 2, 3 పాదాలు

కొన్ని విషయాల్లో సరైన సమయంలో సరైన విధంగా స్పందించకపోవడం వల్ల నష్టసూచన. ఈ సమయంలో సొంత నిర్ణయాలు పనికిరావు. నిపుణులతో చర్చించి నిర్ణయం తీసుకోవడం ఉత్తమం. అనూహ్యమైన వ్యక్తులూ కారణాల వలన చిక్కులూ సమస్యలూ కలుగుతాయి. పనులన్నీ నత్తనడకన సాగుతాయి.



## మీనం పూర్వాభాద్ర 4వ పాదం, ఉత్తరాభాద్ర, రేవతి

ఎన్నికష్టాలెదురైనా విక్రమార్కుడిలా పట్టినపట్టు విడవక విజయం సాధిస్తారు. అనన్యసామాన్యమైన బుద్ధిచతురతతో ప్రత్యర్థులను ఒక ఆటాడిస్తారు. సమయస్ఫూర్తితో విరాజిల్లుతారు. కానీ చెప్పుడుమాటలు విని పక్కదోవ పట్టే ప్రమాదం ఉంది, తస్మాత్ జాగ్రత్త. అధిక ఖర్చులు సూచితం. అయితే అందుకు తగ్గ ఆదాయం కూడా ఉంటుంది.

# అనుభవాల సారం



**మా**నవ సంబంధాలలో వేగంగా వస్తున్న మార్పులను, సామాజిక అన్యాయాలను, అభివృద్ధి నెపంతో జరుగుతున్న ప్రజల విస్థాపనను విశ్లేషించిన వాస్తవిక కథలివి. ఈ సంకలనంలోని చాలా కథల్లో లోతైన సామాజిక, తాత్త్విక అనుభవాలు ఉన్నాయి. డా॥వినోదిని రాసిన 'బాలేదు జెరమొచ్చింది' కథలో పేదరికాన్నీ ఆకలినీ ఒక చిన్నారి పాప ఎలా అనుభవించిందో దళిత క్రైస్తవ జీవిత నేపథ్యంగా వ్యక్తమైంది. శిల్ప నైపుణ్యానికి ఉదాహరణగా ఈ కథ నిలుస్తుంది. మాతృత్వ మమకారాన్నీ అనుబంధాల్నీ ఆవిష్కరించిన బారహమతుల్లా కథ 'మా' ముస్లిం జీవిత దృశ్యాల్నీ వేదనాభరిత పరిస్థితుల్నీ స్పష్టంగా చెప్పగలిగింది. జీవనప్రయాణంలో అన్నింటినీ భరిస్తూ 'తను' ఎప్పుడో ఎక్కడో పూర్తికాకుండానే ఆగిపోతున్నవారిని గుర్తుచేసిన ఆలోచనాత్మక కథ 'సగం మనుషులు'. ప్రచురించిన ఆరు కథల్నే కాకుండా చదవదగిన మరో 51 కథల సమాచారాన్ని కూడా అందించిన 2009 కథావార్షిక ఒక మంచి ప్రయత్నం.

**కథావార్షిక 2009;** సంపాదకులు: డాక్టర్ వి.ఆర్.రాసాని, మధురాంతకం నరేంద్ర
పేజీలు: 109; వెల: రూ.60/-; ప్రతులకు: విశాలాంధ్ర పుస్తక కేంద్రాలు. *- తిరునగరి శ్రీనివాస్*

సమీక్ష

## 'అనంతరం'...అనంతమే!



**క**వి అనుభవసారం 'అనంతరం'లో పలుచోట్ల కవిత్వమైన తీరు గుండెలోతుల్ని తడిమింది. 'కొన్ని పశ్చాత్తాపాలు' స్మృతి పథమైతే, 'దుఃఖసమయాల' నిండా విమోహమే! 'డాలర్లను ప్రేమించిన మిత్రులకు' కవి రాసిన బహిరంగలేఖలాంటి కవిత... కల్పిత విషాదగానాలను ఆపేయమంది. జడలువిప్పిన కాలుష్యంలో మునిగి తేలే నగరజీవనం 'జలపాశం'లో దర్శనమిచ్చింది. అజంతా చెట్లుకూలిన దృశ్యాన్ని కళ్ళెదుట నిలిపిన 'శిరచ్ఛేదిత స్వప్నాల్లో' సరళ సుందర జీవితేచ్ఛ అణువణువున ఆశే నింపింది. 'జున్నుపాల వాసన'లోని వేసవి జ్ఞాపకాల్లో కనిపించినదంతా కనుమరుగే! 'గ్లోబల్ సూత్రాలు కొన్ని'లో కవి చూపిన విరుద్ధత సమకాలీన బేరసారాల సారమే!

**అనంతరం;** రచన: కోడూరి విజయకుమార్
పేజీలు: 87; వెల: రూ.30/-
ప్రతులకు: పాలపిట్ట బుక్స్ *- మూర్తి*

## జీవన దృశ్యాలు



**వా**స్తవిక జీవితాన్ని ఎలాంటి అడ్డుపొరలు లేకుండా సుస్పష్టంగా ఆవిష్కరించిన కథల సమాహారం 'ప్రాప్తం'. సామాజిక దురవస్థలకీ అంతరంగ విశ్లేషణలకూ ఈ సంపుటిలోని కథలు చిత్రిక పడతాయి. ఆత్మావలోకనం, ఆత్మసంస్కారం జంటగా ప్రతికథలో కన్పించే అంశాలు. జీవితంపట్ల ఆశావహ దృక్పథాన్ని పలుపాత్రల ద్వారా ప్రకటిస్తారు రచయిత. 'బతుకంత చావు' కథ కవితాత్మకంగానే కాదు, సందేశాత్మకంగానూ ఉంది. స్త్రీ చైతన్య స్ఫూర్తికి 'చెరలాట' మచ్చుతునక. 'పోల్చుకోగల రాతే' కథ ద్వారా నిత్య జీవితంలో తారసపడే ఎందరో వ్యక్తుల్ని మనం పోల్చుకోవచ్చు.

**ప్రాప్తం** (కథానికలు); రచన: విహారి
పేజీలు: 173; వెల: రూ.125/-
ప్రతులకు: ప్రధాన పుస్తక కేంద్రాలు.
*- డాక్టర్ కావూరి రాజేశ్‌పటేల్*

## బాలు పాటల పుస్తకం



**ఎ**స్.పి.బాలసుబ్రహ్మణ్యం తన సుదీర్ఘ సంగీత ప్రస్థానంలో గానం చేసిన వేలాది సినిమా పాటల నుంచి ఏర్చికూర్చిన 555 చిత్రగీతాల సంకలనం ఇది. వేటూరి, కీరవాణి స్వదస్తూరీతో రాసిన లేఖలు, నలభైరెండు పాటల గురించి చక్కని విశ్లేషణలు అదనపు ఆకర్షణ. బాలు పాటల్ని ప్రేమించే ఎవరైనా ఒక కాపీ కొని భద్రంగా దాచుకోవాలనే అనుకుంటారు. అందుకే ఇలాంటి సంకలనాల్లో పొరపాట్లు దొర్లకుండా జాగ్రత్తపడాలి. కొన్ని గీతాల సాంకేతిక వివరాల్ని పూర్తిగా వదిలేశారు. కొన్నింటిలో తప్పులు దొర్లాయి. 'తాళికట్టు శుభవేళ' పాటలో బాలు మిమిక్రీ చేసినట్టు రాశారు. ఆయనతోపాటు సదన్, అయ్యర్, సాయిబాబా, మురుగేష్ అనే మిమిక్రీ కళాకారులు కూడా ఈ పాటకు ధ్వన్యనుకరణ చేశారు. 'రామకథా శ్రీరామకథా...' గీత రచయిత సముద్రాల సీనియర్, పుస్తకంలో రాసినట్టు వీటూరివారు కాదు. 'సిరివెన్నెల' చిత్రానికి బాలు సంగీతం సమకూర్చలేదు. కె.వి.మహదేవన్ అందించారు. మలి ముద్రణలో అయినా దోషాల్ని పరిహరిస్తే బాగుంటుంది.

**బాలు 'పాట'శాల;** సంకలనకర్త: సి.హెచ్.రామారావు; పేజీలు: 1114, వెల: రూ.249/-
ప్రతులకు: ఎమ్. హెచ్. బెనర్జీ, 9-7-129, మారుతీనగర్, సైదాబాద్, హైదరాబాద్. *- రవికిశోర్*

# పదవినోదం-1021

| | | | | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|---|---|
| 1 | 2 | | 3 | | 4 | | 5 | | | 6 | |
| | 7 | 8 | | | 9 | | | | 10 | | |
| 11 | | | | 12 | | | 13 | 14 | | | 15 |
| | 16 | | 17 | | | 18 | | | | 19 | |
| 20 | | 21 | | | 22 | | 23 | | 24 | | |
| | | | | 25 | | | 26 | | | | |
| 27 | | | 28 | | | 29 | | | 30 | | 31 |
| | | 32 | | 33 | 34 | | | 35 | | 36 | |
| 37 | 38 | | 39 | | | | 40 | | 41 | | |
| | | | 42 | 43 | | 44 | | 45 | | 46 | 47 |
| 48 | | 49 | | 50 | 51 | | | 52 | | | |
| | 53 | | | | | | 54 | | | 55 | |

## ఆధారాలు

### అడ్డం:

1. మొదటి (2)
3. కిరాయి, అద్దె (3)
5. ఆదివారాన్ని ఆంగ్లంలో ఏమంటారు? (2)
6. వీళ్లుకాదు... (2)
7. పాదం (3)
9. కుమార్తె (3)
10. గదిలోంచి నీరు బయటకు పోయే ఏర్పాటు (2)
11. అడ్డం 19తో ఆర్జన, సంపాదన (1)
12. ప్రయోజనం, ఉపకారం (2)
13. అగడ్త ఎటునుంచి చూసినా ఒకటే! (3)
17. తప్పు, పొరపాటు (2)
19. చిన్న తరగతుల విద్యార్థులకు పాఠాలు నేర్పే చోటు (2)
20. పెద్దదొర కాదు... (4)
22. సమీపం (3)
24. దయ, కనికరం లాంటిది (2)
25. పలు, అనేక (2)
26. నేల, భూమి (2)
27. చీల్చు (2)
28. పంట (2)
29. తండ్రి (2)
33. తెలుగు క్లర్క్ (3)
35. కాయ కాని కాయ- ఏం తీపి వంటకం? (4)
37. టి భాషలో మనీ! (4)
41. ఇంట్లో భాగం, చుట్టూ గోడలు కలిగింది (2)
42. ఎల్లుండికి ముందురోజు (2)
44. డెబ్బై-సప్తతి, ఎనభై-అశీతి, తొంభై- ? (3)
46. స్వప్నం (2)
48. నలగ్గొట్టిన, చితగ్గొట్టిన (3)
50. టేస్టీగా తెలుగులో (3)
52. నెపం, వంక, సాకు (2)
53. మూడు 'క'లతో ఖడ్గమృగం! (5)
54. పాలు (2)
55. రాత్రి (2)

### నిలువు:

2. తలకిందుల చలి (2)
3. శరం (2)
4. అడ్డం 41 బహువచనం? (3)
5. చేవ్రాలు (3)
6. సెనగపిండి, వరిపిండి మిశ్రమంలో ఇది కలిపితే జంతికలు మహారుచి! (2)
8. తేరు అంటే? (2)
10. బరువు (2)
12. ఒక రాశి (2)
14. వణుకు (2)
15. ఆలయం (2)
16. ఆలకించిన (2)
17. పచ్చికాయా కాదు, బాగా మాగినదీ కాదు... (2)
18. ముకుళం అంటే? (2)
19. దేహశక్తి, సత్తువ (3)
20. గాఢాంధకారం (5)
21. గొప్ప (2)
22. లభించు (2)
23. 'శివమణి' సినిమాలో ఒక నాయిక అసిన్. రెండో నాయిక? (3)
25. వర్ధిల్లు; దధి అంటే? (3)
29. జీడిపప్పు, బాదం, .... (2)
30. చల్ల అంటే? (3)
31. నీడ (2)
32. ప్రస్తుత, ఇవాల్టి (2)
34. పరివర్తన (2)
36. ఇక కాదు- మరోవిధంగా (3)
38. ఎండమావి (4)
39. జలమే (2)
40. పరిచర్య (2)
43. తిరగబడిన మెరుపు (3)
44. ... నట్రా! (2)
45. చీకటి (3)
47. జగడం (3)
49. వెనకటి- ఇందులో సినీవేషాలు వేసే ఆమె కనిపించిందా? (2)
51. అటునుంచి కంచి! (2)

## సుడొకు-66

ప్రతి వరుసనూ (నిలువూ అడ్డమూ కూడా) 1-9 అంకెలతో పూరించాలి. ఒక వరుసలో ఒక అంకెను ఒకసారి మాత్రమే వాడాలి. తొమ్మిది నలుచదరపు బాక్సుల్లో ప్రతి బాక్సులోనూ 1-9 అంకెలు ఉండాలి.

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| 5 | 2 | | | | 4 | | | 7 |
| | 3 | 9 | | 8 | | | | |
| 4 | 8 | 7 | 6 | | | | | |
| 7 | | | 2 | | 6 | | 4 | 1 |
| 9 | | 1 | | | | 3 | | 2 |
| 8 | 4 | | 3 | | 1 | | | |
| | | | | | 2 | 7 | 1 | 8 |
| | | | | 1 | | 4 | 9 | |
| 6 | | | 9 | | | | 3 | 5 |

## సమాధానాలు

### పదవినోదం-1020

| | | | | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|---|---|
| 1 సో | 2 దా | | 3 త | 4 మ | | 5 వి | ద్య | | 6 ఇం | 7 కో | లా |
| | 8 హం | 9 గు | | 10 హా | సి | ని | | 11 ర | | తి | |
| 12 అం | | 13 లా | ల | న | | 14 పిం | 15 డి | వం | 16 ట | | 17 పం |
| 18 జి | 19 లే | బి | | 20 గ | డిం | చ | నా | | 21 పా | ర్థ | డు |
| | శం | | 22 తీ | రం | | క | | 23 ఢా | కా | | గ |
| 24 ధా | | 25 పే | రు | | 26 క | | 27 త | | 28 య | 29 తి | |
| 30 టి | 31 క | చీ | | 32 తా | లి | గె | లు | 33 పు | | 34 గ | 35 డ |
| | 36 ల | కో | 37 రి | | మి | | 38 పు | లి | 39 మి | | ప్పు |
| 40 నీ | | 41 రు | వా | 42 ణం | | 43 మం | గా | | 44 గ | మ్యం | |
| 45 రు | 46 చి | | 47 జు | వా | ల | జీ | | 48 వి | తా | | 49 త |
| | 50 వ | ద్దు | | ది | | 51 రా | బ | డి | | 52 చే | ప |
| 53 దొ | ర | | 54 ర | | 55 తూ | లు | | 56 ది | గు | మ | తి |

### సుడొకు-65

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| 3 | 8 | 9 | 1 | 6 | 5 | 2 | 7 | 4 |
| 6 | 1 | 2 | 3 | 7 | 4 | 8 | 5 | 9 |
| 5 | 7 | 4 | 2 | 8 | 9 | 1 | 6 | 3 |
| 8 | 9 | 3 | 4 | 2 | 6 | 5 | 1 | 7 |
| 4 | 5 | 6 | 9 | 1 | 7 | 3 | 8 | 2 |
| 1 | 2 | 7 | 5 | 3 | 8 | 9 | 4 | 6 |
| 9 | 3 | 8 | 7 | 4 | 1 | 6 | 2 | 5 |
| 2 | 4 | 1 | 6 | 5 | 3 | 7 | 9 | 8 |
| 7 | 6 | 5 | 8 | 9 | 2 | 4 | 3 | 1 |

# తారలు దిగివచ్చిన వేళ...







నింగిలోని తారలన్నీ రంగులు పులుముకుని నేల మీదికొస్తే... అన్నీ ఓ చోట చేరి అందంగా అమరితే... చూడాలని ఎవరికుండదు..? అందుకే, 'కోబ్ ల్యూమినరీ ఫెస్టివల్' పేరుతో జపాన్‌లో ప్రతి ఏటా ఏర్పాటు చేసే దీపాల అలంకరణను చూడ్డానికి లక్షలమంది పర్యాటకులు వస్తుంటారు. 1995 జనవరిలో వచ్చిన భూకంపం ఆరువేల మంది కోబ్ వాసులను బలి తీసుకుంది. వారి జ్ఞాపకార్థంగానూ, జరిగిన నష్టాన్ని మర్చిపోవడానికీ ఆ ఏడాది డిసెంబర్‌లో దీపాల పండుగను ప్రారంభించింది ప్రభుత్వం. మిరుమిట్లు గొలిపే లెడ్ లైట్ల కాంతులు ప్రారంభంలోనే లక్షలమంది పర్యాటకులను ఆకర్షించాయి. అప్పటినుంచి ప్రతి ఏటా ఓ కొత్త థీమ్‌తో కోబ్ ల్యూమినరీ ఫెస్టివల్‌ను జరుపుతున్నారు.








RAMOJI
GROUP
www.kalanjali.com
కళాంజలి
సంక్రాంతి సౌందర్య సంచలనం
అద్భుతమైన తగ్గింపు
ఆఫర్*
అపురూపంగా ఆకృతి దాల్చిన 'కళాంజలి' చీరలు...అభిరుచి కలిగిన మీ కోసం ప్రత్యేకంగా! కళ్ళు చెదిరే 'కళాంజలి' కలెక్షన్స్‌లో ఎన్నెన్నో సరికొత్త డిజైన్లు.. మదిని దోచే వర్ణాలు..! మనసైన వాటిని ఎంచుకోండి.. పండుగ సంబరాల్ని ప్రారంభించండి.
ఈ సంక్రాంతి మీకు అందించాలి ... అందాన్ని - ఆనందాన్ని !
| కంచి ఆరణి పట్టు చీరెలు | వారణాసి | ఎంబ్రాయిడరి | గద్వాల్ | పోచంపల్లి | ఉప్పాడ
| పాట్లి సిల్క్ & షిఫాన్ | టస్సర్ | పట్టుచీరెలు | ఫ్యాన్సీ చీరెలు | మెన్స్ వేర్ | కిడ్స్ వేర్
ఫ్లాట్ 20 10 % హస్తకళలపై
ఫ్లాట్ 25 20 15 % మహిళల వస్త్రాలపై
ఫ్లాట్ 20 10 % పురుషుల వస్త్రాలపై
ఫ్లాట్ 20 10 % పిల్లల దుస్తులపై
20 డిసెంబర్ 2010 నుండి 15 జనవరి 2011 వరకు
* షరతులు వర్తిస్తాయి
R K SWAMY BBDO 0598
KALANJALI®
Our weaves are our worship
హైదరాబాదు: 6వ ఫేజ్, జె ఎన్ టి యు - మలేషియన్ టౌన్‌షిప్ రోడ్, కూకట్‌పల్లి, ఫోన్: 040 23056813/14 • విజయవాడ: ఎం.జి. రోడ్, లబ్బీపేట, ఫోన్: 0866 2496464.
• వైజాగ్: సంపత్ వినాయక దేవాలయం ప్రక్కన, అసిల్‌మెట్ట జంక్షన్, ఫోన్: 0891 2577905.

ఈనాడు
ఆదివారం
23 జనవరి 2011










# ధర్నాచౌక్...జిందాబాద్!

# సోలో లైఫే సో బెటరు!

'ఎఫైర్లూ పుకార్లూ షికార్లు...'
చాలామంది సినిమా తారల చుట్టూ ఇవి తిరుగుతుంటాయి.
అయితే కొంతమంది మాత్రం ఈ గొడవంతా ఎందుకు,
హ్యాపీగా ఎలాంటి ఎఫైర్లూ లేకుండా ఉంటేనే బోలెడు స్వేచ్ఛ
అనుకుంటున్నారు. 'సోలో లైఫ్' గురించి
ఎవరేమంటున్నారో తెలుసుకుందాం.

## టెన్షన్ ఉండదు



'ఏ పనిచేసినా ఇంకొకరికి చెప్పి చెయాల్సిన పనిఉండదు. మనకు నచ్చిన సినిమాకెళ్లొచ్చు. నచ్చినచోట భోజనం చెయ్యొచ్చు. మూడ్ ఉన్నా లేకపోయినా సెల్‌ఫోన్‌లో గంటలకొద్దీ కబుర్లు చెప్పాల్సిన బాధ ఉండదు. గిఫ్టులూ గ్రీటింగులూ లాంటి గోలే ఉండదు. షాపింగుకు వెళ్లినప్పుడు మన ఇష్టాల్ని వదులుకోవాల్సిన అవసరం ఉండదు. ఇన్ని ఉపయోగాలు ఉన్నాయి కాబట్టే వీలైనంత కాలం ఎఫైర్లకి దూరంగా ఉంటా' అంటోంది **సోనమ్‌కపూర్.**

## మరచిపోతాం



'ప్రేమలోపడ్డామంటే ఎవరెన్ని చెప్పినా స్నేహితుల్ని పక్కనబెట్టేస్తాం. కబుర్లూ కాలక్షేపాలూ బంద్. దాంతోపాటూ మన ఇష్టాయిష్టాలూ మార్చుకోవాల్సి వస్తుంది. అలా మారడం నాకు ఇష్టం ఉండదు. అందుకే ఇప్పుడు సింగిల్‌గానే ఉంటున్నా. ఖాళీ ఉంటే ఫ్రెండ్స్‌కి ఫోన్లు చేస్తూ వాళ్లింటికి వెళ్తూ ఉంటా. ఇంకా బోర్ అనిపిస్తే అప్పుడప్పుడూ స్కైడైవింగ్, బంగీజంప్‌లాంటి సాహసాలు చేస్తుంటా.' అని చెబుతోంది **ప్రీతీజింటా.**

## అంతా నాఇష్టం



'అమ్మాయిలే గ్రేట్ అని ఒప్పుకునే మగాళ్లు ఎంతమంది? పెళ్లి చేసుకున్నాక కూడా అలా ఒప్పుకునే భర్తలు ఉంటారా? ఈ ఆలోచనలన్నీ ఎందుకని ఎఫైర్లకి చాలా దూరంగా ఉంటా. నాకిష్టమైన సినిమాలు చూస్తూ జపనీస్ వంటకాలూ తింటూ కూల్‌గా రోజులు గడిపేస్తున్నా' - ఇలా ఫిక్స్ అయిపోయింది **మల్లికాశెరావత్.**



## రెండూ ఉండాలి

'కొన్నాళ్లు ఒంటరిగా ఉండటమే బెటర్ అనిపిస్తుంది. ఎందుకంటే బోలెడంత సమయం చేతిలో ఉంటుంది. మనకి నచ్చినట్టు బతకొచ్చు. అయితే, కొంత వయసు దాటాక ఒంటరితనం కూడా బోరుగా మారిపోతుంది. అప్పుడు తోడు అవసరం. కాబట్టి నా దృష్టిలో సింగిల్‌లైఫ్ కొంచెం ఇష్టం కొంచెం కష్టం'- అంటున్నాడు **సిద్దార్థ.**

## కెరీర్ ముందు



'నటిగా గుర్తింపు తెచ్చుకోవాలని ఇక్కడికి వచ్చా. అదే నా తొలి ప్రాధమ్యం. మనముందు ఏదైనా ఒక లక్ష్యం ఉన్నప్పుడు ప్రేమాగీమా లాంటి ఎఫైర్లకి దూరంగా ఉండటమే మంచిది. ముందు సెటిల్ అవ్వాలి. ఆ తరువాతే ఇతర విషయాల గురించి ఆలోచించాలి' - ఇది **శృతిహాసన్** అభిప్రాయం.

## సమయమెక్కడిది?



'నావరకూ ఎలాంటి ఎఫైర్లూలేని జీవితం గడపడమే ఇష్టం. అలాగని నేను ఒంటరిగా లేను. నాకు ఇప్పుడు ఇద్దరు పిల్లలు. వాళ్లతో ఎంతో ఆనందంగా గడిపేస్తుంటా. సినిమాలైనా షికార్లైనా విహారయాత్రలైనా వాళ్లతోనే. ఒక వయసు తరువాత తోడు కావాలంటారు. నాకు ఇప్పుడు పిల్లలు తోడున్నారు. కాబట్టి వేరే ఏ రిలేషన్‌షిప్ గురించీ ఆలోచించడం లేదు. నిజానికి అంత సమయం కూడా నాకు ఉండటం లేదు'- అని చెబుతోంది **సుస్మితాసేన్.**



# మీమాట

ఈ సంచికపై మీ అభిప్రాయాలను sunday@eenadu.netకు మెయిల్ చేయవచ్చు.

## మార్గదర్శి

జనవరి రెండోతేదీ సంచికలోని 'ఒక ప్రణాళిక' ఉపయోగకరం. కొత్త సంవత్సరంలో లక్ష్యాలనూ గమ్యాలనూ ఎలా నిర్ణయించుకోవాలీ, వాటిని ఎలా అమలు చేయాలీ అనే సందేహాలున్న ప్రతి ఒక్కరికీ ఇది మార్గదర్శి. అన్ని వర్గాలనూ దృష్టిలో పెట్టుకుని, అన్ని కోణాల్లోంచీ విశ్లేషించి ఇచ్చారు. 'రుచి అభిరుచి' వంటకాలు డయాబెటిక్ రోగులకు ఓ కానుక అని చెప్పాలి. ఐశ్వర్యరాయ్ కబుర్లు, మమకారం కథ బాగున్నాయి.

*– రాజశేఖర్, వి.యస్.పాణి, సలీం(ఈమెయిల్)*

*– పక్కి రాధాగోపాలకృష్ణ, పర్లాకిమిడి*

## వాటి సారమే...

'ఒక ప్రణాళిక...' చాలా బాగుంది. విజేత వెనుక ఉండేది అదృష్టమో మంత్రదండమో కాదు...చక్కని ప్రణాళికా, కఠిన శ్రమా, అంకిత భావాలేనని బాగా వివరించారు. ఆత్మన్యూనతా భావమూ ప్రతికూల ఆలోచనలుండేవాళ్లూ విద్యార్థులూ దీన్ని తప్పక చదవాలి.

*– ఎ.కవితారెడ్డి, బండి శ్యామ్ కుమార్, సిరి, సాత్విక్, శేఖర్(ఈమెయిల్)*

## స్ఫూర్తిదాయకం

ఇంటిల్లిపాదికీ నచ్చే పుస్తకం 'ఆదివారం అనుబంధం'. ఇందులో 'ఒక ప్రణాళిక' స్ఫూర్తిదాయకం. మ్యాగజైన్ ప్రతి వారం ఇలానే యువతకు ఉపయోగపడేలా ఉండాలని కోరుకుంటున్నాం. ఈ వారం 'భలేపద్యం' కూడా చాలా బాగుంది.

*– వికాస్, సీహెచ్ సుభాష్, రవి(ఈమెయిల్)*

## సందేశాత్మకం

'మమకారం' కథ సందేశాత్మకంగా ఉంది. అత్తాకోడళ్ల మధ్య ఉండాల్సిన ఆత్మీయానుబంధం గురించి రచయిత ఇందులో విపులంగా చర్చించారు. లక్ష్యమేలేని గాలివాటపు బతుకులకు మేలి విజయాక్షరాల ముత్యాలతో కూర్చిన కథనం 'ఒక ప్రణాళిక'.

*– మంకుశ్రీను, కొప్పర్రు; హనీఫ్, ఖమ్మం*

## మరిన్ని రావాలి

'ఒక ప్రణాళిక' అద్భుతంగా ఉంది. నేను చిన్నప్పట్నుంచీ 'ఈనాడు' చదువుతున్నాను. ఇలాంటి వ్యాసాలు మరిన్ని రావాలని ఆశిస్తున్నాను. 'ఆరెంజ్' ఫ్యాషన్ వ్యాసం కూడా చాలా ఆసక్తికరంగా ఉంది. 'ఒకే ఒక్కసారి ఏడ్చాను' అంటూ ఐశ్వర్యరాయ్ చెప్పిన విశేషాలు బాగున్నాయి.

*– కరుటూరి నరేష్, ముప్పాళ్ల మాల్యాద్రి, సువర్ణారాణి(ఈమెయిల్)*

## ఆలోచింపజేస్తుంది

'ఈనాడు ఆదివారం'లో సృజనాత్మక అంశాలను ఇస్తున్నారు. 'ఒక ప్రణాళిక' ప్రతి ఒక్కరినీ ఆలోచింపజేసేదిగా ఉంది. కొత్త సంవత్సరం ప్రారంభంలో జీవితాన్ని మేలిమలుపు తిప్పుకోగలిగే అవకాశాల్ని చూపించిందీ వ్యాసం. మాకు సుడొకు, పదవినోదం చాలా ఇష్టం. ఈవారం కథ 'మమకారం' నేటి సామాజిక పరిస్థితులకు అద్దం పట్టింది. బాలవినోదిని పజిల్స్ కూడా బాగుంటున్నాయి.

*– పి.శామ్యూల్, ఎన్.దివ్య(ఈమెయిల్)*

## ఆరెంజ్... ఆకట్టుకుంది

'ఆరెంజ్' ఆకట్టుకుంది. ఆ రంగుకిన్ని ప్రత్యేకతలున్నాయంటే ఆశ్చర్యమేసింది. ప్రణాళికాబద్ధమైన జీవితానికీ ప్రణాళికలేని జీవితానికీ ఉండే తేడాను 'ఒక ప్రణాళిక' తేటతెల్లం చేసింది. కొందరికి ప్లానింగ్ లేకపోయినా విజేతలు కావడం యాదృచ్ఛికమే తప్ప మరోటికాదు.

*– కందాళ శ్రీనివాసరావ్, అమలాపురం; ఎన్.వి.సత్యనారాయణ, శ్రీకాకుళం*

చురుక్కు



నీ మూలంగానే ధరలు పెరుగుతున్నాయి. పట్టు!
రాహుల్
యూపీఏ సంకీర్ణం
శ్రీధర్




మహిళా బిల్లు
ఆహార భద్రత
ఎన్నికల హామీలు




మన కామ్రేడ్ మావోయిస్టుల కోసం వెదుకుతున్నాడు!
బుద్ధదేవ్
మమత


చమక్కు



పెట్టుబడులు
ఇతర రాష్ట్రాలు
మోడీ

# పెద్దబాలశిక్షకు పెద్దదిక్కు




'చైత్రవైశాఖములు వసంత రుతువు... జ్యేష్ఠ ఆషాఢములు గ్రీష్మరుతువు'
'ప్రభవ, విభవ, శుక్ల, ప్రమోదూత... ఈ అరవయ్యీ తెలుగు సంవత్సరాల పేర్లు'
...ఇప్పుడు మూడు పదుల వయసులో ఉన్నవారందరూ
చిన్నప్పుడు అమ్మదగ్గరో నాయనమ్మ దగ్గరో ఇవన్నీ చెప్పించుకున్నవారే.
ఒకటోతరగతికి వచ్చాక పెద్దబాలశిక్షలో చదువుకున్నవారే.
క్రమంగా ఇంగ్లిషు చదువులొచ్చి ఆ పుస్తకం కనుమరుగైపోయింది.
దాదాపు రెండు దశాబ్దాల తర్వాత ఆ పుస్తకానికి మళ్లీ
మహర్దశ పట్టింది. కనుమరుగైన పెద్దబాలశిక్షకు మెరుగులు దిద్ది
మళ్లీ మనముందు నిలిపిన వ్యక్తి... గాజుల సత్యనారాయణ.

**1990** నాటి మాట. విజయవాడలో జరుగుతున్న పుస్తక మహోత్సవానికి గానగంధర్వుడు ఎస్పీబాల సుబ్రహ్మణ్యం వచ్చారు. పుస్తకదుకాణాలన్నీ తిరిగి పెద్దబాలశిక్షను గుర్తుచేసుకున్నారు. 'మా అమ్మానాన్నలు చదివారు. మేం కూడా ఆ పుస్తకాన్ని చదివాం. కానీ ఇప్పుడది ఎక్కడా కనిపించట్లేదు. ఆ పుస్తకంలాగానే తెలుగు భాషకు కూడా ఆదరణ తగ్గిపోతోంది' అని బాధపడ్డారు. సభికులంతా ఆ గానగంధర్వుడి మాటలు విని ఆవేదన చెందారు. కానీ... కాస్తంత దూరంలో ఒక పుస్తకాల స్టాలులో గుమస్తాగా పనిచేస్తున్న గాజుల సత్యనారాయణ మాత్రం ఆ మాటలు విని ఆలోచనలో పడ్డారు.

స్వతహాగా కథలు రాసే అలవాటుంది. కాబట్టి చాలామంది మరచిపోయిన పెద్దబాలశిక్షను మనమే రూపొందిస్తే ఎలా ఉంటుంది' అదీ ఆయన ఆలోచన. పరిశోధన ప్రారంభించారు. పాత బాలశిక్ష ఎలా ఉండేదో తెలుసుకున్నారు. పాత పుస్తకానికి కొత్త అంశాలు చేర్చి ఈతరానికి సరిపోయేలా రూపొందించాలని భావించారు.

ఆయన చదివింది ఏడోతరగతే!

ఈ ఆలోచన వచ్చేనాటికి చేస్తోంది చిన్న పుస్తకాల దుకాణంలో గుమస్తా ఉద్యోగం.

ఆయన లక్ష్యం ముందు ఇవేవీ అడ్డంకులుగా కనిపించలేదు. ప్రతి ఆదివారం విజయవాడలో పాతపుస్తకాలమ్మే లెనిన్‌సెంటర్‌లో తిరిగారు. తన విషయసేకరణకు కావాల్సిన పుస్తకాలను కొన్నారు. ఆ పుస్తకాల ఖర్చుకూ తనకొచ్చే కొద్దిపాటి జీతం రాళ్లే ఆధారం. దాదాపు పన్నెండేళ్లపాటు ప్రతిఆదివారం ఇదే పని ఆయనకు.

పుష్కరకాల కృషి ఫలించింది. దాదాపు వెయ్యి పేజీలతో పెద్దబాలశిక్ష సిద్ధమైంది.

### ప్రచురణ కష్టాలు...

పుస్తకం సిద్ధమేకానీ... దాన్ని ప్రచురించే పబ్లిషర్లు దొరకలేదు. 'ఈరోజుల్లో పెద్దబాలశిక్ష ఎవరు చదువుతారయ్యా' అన్నారు చాలామంది. ఒకవేళ ప్రచురించినా రూ.300-400 ధర పెడితే తప్ప గిట్టుబాటు కాదనేవారు మరికొందరు. అంత ధర పెట్టడానికి సత్యనారాయణ ఒప్పుకోలేదు. చివరికి అన్నపూర్ణ ప్రచురణ సంస్థ ఆయన చెప్పిన ధరకే అంగీకరించి ఈ పుస్తకాన్ని ముద్రించడానికి ముందుకొచ్చి రెండు వేల ప్రతులు ప్రచురించింది.

### 72 ముద్రణలు...

అలా 2004 జనవరిలో విజయవాడ పుస్తక ప్రదర్శనలో తొలిసారి అమ్మకానికి సిద్ధమైంది పుస్తకం. అక్కడికి పుస్తకాలు కొనడానికి వచ్చిన ప్రతి పాఠకుడికీ పెద్దబాలశిక్ష పేరు చూడగానే బాల్యం గుర్తొచ్చింది. చిన్నప్పటి మధురానుభూతులు ఎదను తడిమాయి. దాదాపు వెయ్యి పేజీల పుస్తకం... నూటపదహారు రూపాయలకే!

ఇంకేముందీ, ఎగబడి కొన్నారు పాఠకులు.

రెండువేల ప్రతులూ మూడురోజుల్లోపే అమ్ముడైపోయాయి. వెంటనే మలిముద్రణ, మూడోసారి, నాలుగోసారి... ఇలా పుస్తకాలు ప్రచురిస్తున్నారు. అమ్ముడవుతూనే ఉన్నాయి. పదినెలల క్రితం గాజుల సత్యనారాయణ ఈ పుస్తకాలను సొంతంగా ముద్రించడం ప్రారంభించారు. అలా ఇప్పటికి ఆ పుస్తకం 72 ముద్రణలకు నోచుకుంది.

ఇటీవలే ఆయన పెద్దబాలశిక్ష రెండో భాగాన్ని కూడా తీసుకొచ్చారు. ఈ మధ్య కాలంలో ఆయన... హిందూ సంప్రదాయాలు, మన పండుగలు, దైవదర్శనం, శివతత్వం, శ్రీరామసుధ, భక్తిరంజని లాంటి పురాణాలూ సంస్కృతీ సంప్రదాయాలకు సంబంధించి పదిహేను పుస్తకాల దాకా రాశారు.

### నూటపదహార్లు...

2004 జనవరి నుంచి ఇప్పటిదాకా పెద్దబాలశిక్ష ప్రతులు ఐదులక్షలకు పైగానే అమ్ముడయ్యాయి. తెలుగులో అత్యధికంగా అమ్ముడైన నాలుగైదు పుస్తకాల్లో ఇదొకటని చెప్పవచ్చు. మన రాష్ట్రంలోనే కాదు, తెలుగు వారు ఎక్కువగా ఉండే అమెరికా, ఇంగ్లండ్, సింగపూర్, మలేషియా వంటి దేశాలకూ ఈ పుస్తకాలను పంపిస్తున్నారు. మరి ధర ఎందుకంత ప్రత్యేకంగా పెట్టారని అడిగితే... 'తెలుగు వారికి నూటపదహార్లు సెంటిమెంటు కాబట్టి' అని చెబుతారు సత్యనారాయణ. 2004లో ఆయన నిర్ణయించిన ఈ ధరలో ఇప్పటికీ మార్పులేదు. భవిష్యత్‌లోనూ మారదని కచ్చితంగా చెబుతారాయన.

– ఎం.వెంకటేశ్వర్లు, న్యూస్‌టుడే, విజయవాడ

## అసలు పుస్తకం...



పెద్దబాలశిక్షగా చెప్పే గ్రంథానికి అంకురార్పణ జరిగింది 1832లో. 'మేస్టర్ క్లూ లో' అనే ఆంగ్లేయుడు పిల్లల కోసం మంచి పుస్తకాన్ని ముద్రించాలనే సంకల్పంతో తన స్నేహితుడైన పుదూరు చదలవాడ సీతారామశాస్త్రికి చెప్పారు. పిల్లలకు అవసరమైన, క్లాసుల్లో చదవదగిన అంశాలతో 76 పేజీలతో ఆయన పుస్తకాన్ని తయారు చేయగా 1856లో గ్రంథంగా ప్రచురించారు. భౌగోళిక, సాహిత్య విషయాలు, శ్లోకాలు కలిపి 90 పేజీలకు పెంచి 'వివేక కల్పతరువు' పేరుతో 1865లో పునర్ముద్రించారు. ఇదే పెద్దబాలశిక్షగా మారింది. 1916లో వావిళ్ల రామస్వామిశాస్త్రులు అండ్ సన్స్ సంస్థ ఒక పెద్దబాలశిక్ష పుస్తకాన్ని తీసుకొచ్చింది. అనంతరం మరికొంతమంది ఈ పుస్తకాన్ని ముద్రించినా క్రమంగా కనుమరుగైంది.



# సిల్లీపాయింట్

జిరాఫీలు ఒకేసారి 12 గ్యాలన్ల నీటిని తాగగలవు. నిజానికి ఒంటెల కంటే జిరాఫీలే... నీళ్లు లేకుండా ఎక్కువ దూరం ప్రయాణించగలవు.

★ ధ్రువపు ఎలుగుబంట్లు ఎంత చలిగా ఉన్నా బొరియల్లో ఉండవు. ఆడ ధ్రువపు ఎలుగుబంట్లు గర్భిణులయినప్పుడే బొరియల్లోకి వెళ్తాయి. అది కూడా అవే తవ్వుకుంటాయి.

★ అరటి పళ్లు సంగీతం సాయంతో మరింత వేగంగా, రుచికరంగా పండుతాయని భావిస్తారు జపనీయులు. అందుకే వాటిని ఉంచిన చాంబర్లలో రోజూ రెండు మూడు గంటలు పాటలు వినిపిస్తారు.

★ పెన్సిల్ మీద #2 అని ఉందంటే... అది మెత్తగా రాసే పెన్సిళ్లలో రెండో రకమన్నమాట.

★ ఆడ కంగారూలు ఒకేసారి రెండు పిల్లలకు రెండు స్తనాల నుంచీ రెండు రకాల పాలివ్వగలవు. పుట్టి, నెలల వయసున్న కంగారూకు పిండిపదార్థాలు ఎక్కువగా ఉండే పాలిస్తుంది. అదే సమయంలో మరో కంగారూ పుడితే దానికి కొవ్వు పదార్థాలు ఎక్కువగా ఉండే పాలిస్తుంది. అంటే... ఒకేసారి రెండు పిల్లలకు రెండు రకాల పాలన్నమాట.

★ గొరిల్లా రాత్రి నిద్రపోయిందంటే 13 గంటల వరకూ లేవదు. అంతేకాదు, పగలు కూడా చాలాసేపు నిద్రపోతుంది. అయితే అది రోజూ ఒకేచోట పడుకోదు.



మొసళ్లకు జీవితకాలంలో సుమారు 3000 దంతాలు వస్తాయి. ఇంకా చెప్పాలంటే పలువరుసలో నెలకో కొత్త పన్ను వస్తుంటుంది.



జపాన్‌కు చెందిన 'నిబాన్ టూ కార్పొరేషన్' అనే కంపెనీ 'గొట్టా గో బ్రీఫ్‌కేస్' అనే మొబైల్ టాయిలెట్‌ను రూపొందించింది. ఇందులో టాయిలెట్ పేపర్, అద్దం మొదలైనవి ఉంటాయి.



'వాషింగ్టన్ పొటాటో కమిషన్' డైరెక్టర్ క్రిస్ వొయిట్ ఏకంగా 60 రోజులపాటు కేవలం బంగాళాదుంపలు మాత్రమే తిన్నాడు. అవి ఆరోగ్యానికి మంచివని చెప్పడానికి వాటిని చిప్స్, కూర... ఇలా రకరకాలుగా వండుకుని తిన్నాడు.

★ ఇంగ్లిష్ వికీపీడియాలోని అన్ని అంశాలూ చదవడానికి పదిహేనేళ్లకు పైనే పడుతుంది.

★ అమెరికాలో డేటింగ్ సైట్లను వినియోగించే వారి సంఖ్య రెండు కోట్లకు పైనే.

★ మనలాగే 'ట్యూషన్లు' లేదా 'ప్రైవేట్లు' ఈజిప్టులోనూ ఎక్కువే. అక్కడ సగటున ఒక్కో కుటుంబమూ తమ ఆదాయంలో సుమారు 50 శాతం పిల్లల ట్యూషన్లకే కేటాయిస్తుంది.

★ ఒంటెపాలు తాగేవాళ్లు ఒక్క అరబ్ దేశాల్లోనే సుమారు 20 కోట్లకు పైగా ఉన్నారు.

★ బట్టలను ఒక గంటసేపు ఇస్త్రీ చేస్తే మన ఒంట్లో సుమారు 161 క్యాలరీలు కరుగుతాయి.

★ స్కైప్, ఫేస్‌బుక్, గూగుల్, ట్విట్టర్, యూట్యూబ్... వీటన్నింటినీ చైనాలో నిషేధించారు.

★ మగ ప్రేయింగ్‌మాంటిస్ కీటకాల శరీర నిర్మాణం కారణంగా అవి తల ఉండగా శృంగారంలో పాల్గొనలేవు. ఆడ కీటకాలు మగవాటి తలలు తొలగించి వాటితో శృంగారంలో పాల్గొంటాయి.

1969లో సుమారు ఆరునెలలపాటు నయాగరా జలపాతం ఆగిపోయింది. జలపాతం అడుగున పేరుకు పోయిన చెత్తను తొలగించేందుకు ఇంజినీర్లు నీటి ప్రవాహాన్ని ఆపేయాలనుకున్నారు. ఇందుకోసం 27,800 టన్నుల రాళ్లతో ఒక డ్యామ్ కట్టారు. అప్పటివరకూ సుమారు 12వేల సంవత్సరాలు నిరాటంకంగా ప్రవహించిన నయాగరా తాత్కాలికంగా అలా ఆగిపోయింది.



★ ఐక్యరాజ్యసమితి ప్రచురించిన 'ప్రపంచ మహిళా నివేదిక' ప్రకారం స్త్రీలకు అతి తక్కువ ప్రసూతి సెలవులు(45) ఇచ్చే దేశం యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్.

★ ఆహారాన్ని మొదటిసారి సినిమాల్లో ప్రస్తావించి, చూపించింది 'బేబీస్ లంచ్'(1895) అనే సినిమాలో.

★ ఇరాక్, అఫ్ఘానిస్తాన్‌లలో ఇప్పటివరకూ అమెరికన్ సైనికులు 2,50,000 బుల్లెట్లు ఉపయోగించారట.



# ధర్నాచౌక్... జిందాబాద్!




**కథ కంచికి చేరుతుందో లేదో తెలియదు కానీ, కష్టాలు మాత్రం ధర్నాచౌక్‌కు చేరితీరతాయి. డేరాలు వేసుకుని దీక్షకు కూర్చుంటాయి. నినాదాలతో ప్రభుత్వాన్ని కదిలిస్తాయి. ధర్నాచౌక్ అంటే...ఆశనిరాశల చౌరస్తా. ఆకలిమంటల కేరాఫ్ అడ్రస్. భాగ్యనగరంలో అభాగ్యుల మజిలీ.**

'హోంగార్డుల ఐక్యత...
వర్ధిల్లాలి'
'కాంట్రాక్టు ఉద్యోగులను...
క్రమబద్ధీకరించాలి'
'ప్రభుత్వ నిర్లిప్తత...
నశించాలి!'
'వియ్ వాంట్...
పోస్టింగ్స్!'
'వియ్ వాంట్...
జస్టిస్!'

నినాదాలూ నిరసనలూ హోరెత్తుతుంటాయి. మైకులు పేదోడి పేగుల్లా రంకెలేస్తుంటాయి. శిబిరాలు చీమలదండులా వరుసకట్టినట్టుంటాయి. ప్లకార్డులు ఒడ్డునపడిన చేపల్లా ఎగిరెగిరిపడుతుంటాయి. రంగువెలిసిన బ్యానర్లు మసకబారిన జీవితాలకు ప్రతినిధుల్లా కనబడుతుంటాయి. అదే..ధర్నాచౌక్!

గుండెల నిండా బాధలతో కళ్లనిండా ఆశలతో శిబిరాల్లో కూర్చున్నారే...వాళ్లంతా ఉద్యమకారులు.

ఆ బ్యానర్లు చదవండి, వాళ్ల కష్టాలు షార్ట్‌ఫిల్మ్‌లా చకచకా కళ్లముందు తిరుగుతాయి. ఆ నినాదాలు వినండి, ఆ మనసుల్లోని ఆవేదన ఎంతోకొంత అర్థమవుతుంది.

ఆ ప్రాంతానికి చార్మినారంత చరిత్ర లేదు. ఏ సుల్తానులూ కట్టించలేదు. బిర్లామందిరమంత సౌందర్యం లేదు. ఏ పారిశ్రామికవేత్తా కోట్లు వెచ్చించలేదు. హైటెక్‌సిటీలోని దర్పం లేదు. ఏ పాలకుడూ ప్రత్యేకంగా దృష్టి పెట్టలేదు. సాలార్‌జంగ్ మ్యూజియంలా కళాఖండాల్లేవు. అన్నీ కళతప్పిన బతుకులే. హైదరాబాద్‌లోని లక్షాతొంభై గల్లీల్లో అదొకటి. మాలూ మహలూ కాదుకాబట్టి, ప్రవేశం ఉచితం. రాష్ట్రంలోని ఇరవైమూడు జిల్లాలవాళ్లూ అక్కడుంటారు. వాళ్లెవరూ ఇక్కడికొస్తామని కల్లో కూడా ఊహించలేదు. కలలన్నీ కరిగిపోయాకే ధర్నాచౌక్ దారిపట్టారు. హాయిగా ఉద్యోగాలు చేసుకోవాల్సిన వారిని, శుభ్రంగా భార్యాపిల్లలతో కాపురాలు చేసుకోవాల్సినవారిని...జీవితాల్లోని దురదృష్టం, వ్యవస్థలోని డొల్లతనం... ధర్నాచౌక్ దాకా లాక్కొచ్చాయి.

ఏ నాయకుడిని కలిసినా, ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా, ఎన్ని కన్నీటి కుండలు నిండినా, ఎన్ని నిరుపేద గుండెలు పగిలినా, ఎన్ని తిప్పలు పడినా, ఎన్ని చెప్పులు అరిగినా...'తప్పులు సరిదిద్దుకుంటాం, తప్పక న్యాయం చేస్తాం' అన్న భరోసా ఒక్కరంటే ఒక్కరు కూడా ఇవ్వనప్పుడు... ధర్నాచౌక్ సామాన్యుల గుండెచప్పుడు అవుతుంది. ఉద్యమాలకు రణన్నినాదం అవుతుంది. అసెంబ్లీ హాలుదాకా వినిపించే పొలికేక అవుతుంది.

ఇదే చివరి ఆశ. ఇదే చివరి మజిలీ. ఇదే చివరి యుద్ధం. రణమో మరణమో అన్నంత తెగింపు. వెళ్తేగిళ్తే సాధించుకునే వెళ్లాలన్న మొండి ధైర్యం. ధర్నా, రాస్తారోకో, రిలే నిరాహారదీక్ష, ఆమరణ దీక్ష, అర్ధనగ్న ప్రదర్శన, అసెంబ్లీ ముట్టడి...దారి ఏదైనా కావచ్చు. ప్రభుత్వాన్ని దారికి తెచ్చుకోవాలన్నదే లక్ష్యం. నినాదాలతో స్వరపేటిక పగిలిపోవచ్చు. నిరాహారదీక్షలతో కడుపులెండిపోవచ్చు. డేరాలు కూలిపోవచ్చు. లాఠీలు విరిగిపోవచ్చు. దీక్షలు భగ్నంకావచ్చు. అయినా సరే, పోరాడాల్సిందే. పోరాడి తీరాల్సిందే.

## ఉద్వేగాల చౌరస్తా...

నుదుట తిలకం.
మెడలో దండ.
చేతిలో మైకు.
మాట పిడిబాకు.

అతను ఎవరైనా కావచ్చు. ఆమె పేరు ఏదైనా కావచ్చు. గిరిజన ఆశ్రమ పాఠశాలలో రోజుకూలీ కావచ్చు. జీవో 336 ప్రకారం సమానమైన పనికి-సమానమైన వేతనం ఇవ్వాల్సిందేనంటూ పట్టుబట్టిన పట్టణ ఇందిరా క్రాంతిపథం ఉద్యోగి కావచ్చు. కడుపునిండని హోంగార్డు కావచ్చు. పొట్టకొట్టారన్న బాధతో దీక్షకు దిగిన బీఎడ్ ఉపాధ్యాయుడు కావచ్చు. ఈరోజే డేరా వేసుకుని ఉండవచ్చు. నెల రోజులుగా దీక్షచేస్తూ ఉండవచ్చు. ఒక్కొక్కరిదీ ఒక్కో కథ. ఒక్కొక్కరి జీవితంలో ఒక్కో రకమైన దోపిడీ.

ప్రమోద్ సిద్దిపేట నుంచి వచ్చాడు. బీఎడ్ అయిపోగానే ఏదో ప్రయివేటు కంపెనీలో పని దొరికింది. పెళ్లి కూడా చేసుకున్నాడు. ఇద్దరు పిల్లలు. వచ్చిన జీతంతో గుట్టుగా సంసారం నెట్టుకొస్తుంటే, టీచరు ఉద్యోగానికి రమ్మంటూ వర్తమానం అందింది. గవర్నమెంటు సర్వీసంటే ఎవరికైనా ఆశే! వెంటనే రాజీనామా ఇచ్చేశాడు. యాజమాన్యంతో రెండేళ్ల ఒప్పందం ఉండటంతో, యాభైవేలు కడితేకానీ పంపించమని మెలిక పెట్టారు. భార్య ఒంటి మీదున్న నగలన్నీ అమ్మి డబ్బు ఇచ్చాడు. డిప్లొమా అభ్యర్థులకూ వాటా ఇవ్వాలన్న సర్కారు నిర్ణయం ప్రమోద్ ఆశల మీద నీళ్లు చల్లింది. ఉన్న ఉద్యోగం ఊడింది. కొత్త



ఉద్యోగం రాలేదు. ఇక, మరో దారిలేదు. భార్యాపిల్లల్ని పుట్టింటికి పంపి, తను ధర్నాచౌక్‌కు వచ్చేశాడు. మూడు నెలలుగా ఇక్కడే దీక్ష చేస్తున్నాడు. పదిరోజులు ఆమరణ నిరాహారదీక్ష చేశాడు. పోలీసులు బలవంతగా వ్యానెక్కించి ఆసుపత్రిలో చేర్పించారు. అక్కడ మరో పదహారు రోజుల దీక్ష. అయినా, లక్ష్యం నెరవేరలేదు. మళ్లీ ధర్నాచౌకే దిక్కయింది. ఆ కఠోర ఉపవాసం ప్రమోద్ ఆరోగ్యాన్ని తినేసింది. చాలా బలహీనపడిపోయాడు. ఉన్న ఒక్క ప్యాంటూ ఒంటి మీది నుంచి జారిపోతోంది. రక్తంలో ఇన్ఫెక్షన్ ఉందని వైద్యులు తేల్చారు. కిడ్నీలోనూ ఏదో సమస్య బయటపడింది. పూటగడవని పరిస్థితిలో ఖరీదైన మందులేం కొంటాడు. వేలకువేలుపోసి వైద్యమెలా చేయించుకుంటాడు. ఏదో ఒకరోజు సర్కారు కరుణించక పోతుందా, ఉద్యోగం రాకపోతుందా అన్న ఆశ...వేయి ఔషధాలై అతన్ని బతికిస్తోంది.

లక్ష్మి హైదరాబాద్‌లో హోంగార్డు ఉద్యోగం చేస్తోంది. భర్త కూడా హోంగార్డే. రోజుకు నూట ముప్ఫైరూపాయల వేతనం. అందులోనే నెలనెలా ఇంటి అద్దె, పిల్లల స్కూలు ఫీజులు, నిత్యావసరాలు, జ్వరాలొస్తే మందులు...ఆరేడువేలంటే అక్షయపాత్రేం కాదు. అన్ని ఖర్చులకూ సరిపోడానికి. ఎప్పుడూ లోటు బడ్జెటే. వేతనం పెంచాలని సహోద్యోగులతో కలిసి దీక్ష చేస్తోంది. ముఖ్యమంత్రి కరుణిస్తే... అప్పుల్లేని బతుకు బతకాలని కోరిక.

కథలన్నీ కంచికి చేరినట్టు కష్టాలన్నీ ధర్నాచౌక్‌కే వస్తాయి. పసిపాపల్ని ఇంట్లో వదిలిపెట్టి వచ్చిన అమ్మలు, మంచానపడిన ముసలి తల్లుల్ని కాదనుకుని హైదరాబాద్ బయల్దేరిన బిడ్డలు, శ్రావణంలో మనువాడిన కొత్త పెళ్లికొడుకులు, ఉన్న ఉద్యోగం పోయి పెళ్లిపెటాకులైన భగ్నహృదయులు... ఎన్ని కథలు, ఎన్ని కష్టాలు! బిక్కుబిక్కుమంటూ బస్సెక్కినవాళ్లందరికీ, ధర్నాచౌక్‌కు చేరుకోగానే ఎక్కడలేని ధైర్యం. ఎవరో వెన్నుతట్టినంత ఆత్మవిశ్వాసం. ఎటుచూసినా తమలాంటివాళ్లే.




## సాపాటు ఎటూలేదు...

మహానగర జీవితమంటే మాటలు కాదు. వేలకువేలు సంపాదించుకుంటున్నవారే... నెలాఖరు నాటికి అప్పులు చేయాల్సిన పరిస్థితి. పాపం ఆ చిరుద్యోగులు, నిరుద్యోగులు ఎలా బతుకుతారు? ఏం తింటారు? ఇంట్లోంచి తెచ్చుకున్న డబ్బు నాల్రోజులకే కరిగిపోతుంది. లాడ్జీల్లో దిగేంత స్థోమతెక్కడిది? దగ్గర్లోని బండమైసమ్మనగర్ కమ్యూనిటీ హాలు కొంతమందిని ఆదుకుంటుంది. అపుడపుడూ ప్రజా సంఘాల కార్యాలయాలు పడకగదులవుతాయి. బంధువుల ఇళ్లలో స్నేహితుల గదుల్లో స్నేహితులస్నేహితుల గదుల్లో తెల్లారేదాకా తలదాచుకునేవారి సంఖ్యా తక్కువేం కాదు. ఎక్కడ పడుకున్నా కంటినిండా నిద్రపడితేగా! పట్టినా...అన్నీ పీడకలలే. ఒక్కోసారి కమ్మని కలలూ వస్తుంటాయి. ప్రభుత్వం ఉద్యోగాలు ఇవ్వడానికో, క్రమబద్ధీకరించడానికో అంగీకరించినట్టూ చకచకా జీవో జారీ చేసినట్టూ! కల నిజమనుకుని కళ్లు తెరిస్తే...చుట్టూ చీకటి, దెయ్యంలా భయపెడుతూ! అంతలోనే తెల్లారిపోతుంది. ఐదురూపాయలిచ్చి ఇందిరా పార్కు దగ్గరున్న సులభ్ కాంప్లెక్సులో కాలకృత్యాలు తీర్చేసుకుని...చౌరస్తాలో నాలుగు ఇడ్లీలు తినేసి ధర్నాచౌక్‌కు చేరుకుంటారు. ఆ సత్తువ ఉన్నంతసేపూ నినాదాలు మిన్నంటుతాయి. ఆ ఇడ్లీలేమైనా కాంక్రీట్ దిమ్మెలా, కరగకుండా కడుపులోనే పడుండటానికి. రెండుగంటల్లో ఖాళీ. ఇక ఆత్మారాముడు ధర్నాకు దిగుతాడు. పేగుల నినాదాలు మొదలవుతాయి. అందుకే, నిరుపేద రోగి హృదయ స్పందనలా... ధర్నాచౌక్ నినాదాల్లో హెచ్చుతగ్గులు ఎక్కువ. పొద్దున్నే ఓపిక ఉంటుంది. కడుపులో సత్తువ ఉంటుంది. నినాదాలు హోరెత్తుతాయి. మధ్యాహ్నానికి శక్తి సన్నగిల్లిపోతుంది. స్వరంలో నీరసం కనిపిస్తుంది. జేబులో డబ్బున్న రోజు దగ్గర్లోని మెస్సులకెళ్లి భోంచేస్తారు. చిల్లరపైసలు మాత్రమే మిగిలుంటే, ఇడ్లీలతో సరిపెట్టుకుంటారు. మూడింటికి గుక్కెడు ఛాయ్ పడ్డాక... ఎంతోకొంత ఓపికొస్తుంది. నినాదాలతో ఉపన్యాసాలతో గొంతెండినప్పుడు నాలుక తడుపుకుందామంటే...ధర్నాచౌక్ చుట్టుపక్కల గుక్కెడు మంచినీళ్లు కూడా దొరకవు. చచ్చినట్టు ప్యాకెట్ నీళ్లు కొనుక్కుని తాగాల్సిందే.

రోజులు గడిచిపోతాయి. జేబులు ఖాళీ అయిపోతాయి. నాల్రోజుల్లో దిగొస్తుందనుకున్న సర్కారు నెలలు గడుస్తున్నా స్పందించదు. పోరాటం ఆగకూడదంటే శిబిరం కొనసాగించాలి. డేరా కనిపించాలి. ధర్నాచౌక్‌ను ఖాళీచేసి వెళ్తే...చెట్టుకొకరు పుట్టకొకరైపోతారు. ప్రభుత్వం చచ్చినా దిగిరాదు. మీడియా అస్సలు పట్టించుకోదు. జిల్లాల్లో చేస్తే ప్రాధాన్యం ఉండదు. శంఖంలో పోస్తేనే తీర్థం. ధర్నాచౌక్‌లో జరిగితేనే ధర్నా. అప్పుడే ఆ సెగ సచివాలయం దాకా వెళ్తుంది. అసెంబ్లీని తాకుతుంది. అందుకే ఎవరూ అక్కడి నుంచి కదిలే ప్రయత్నం చేయరు. మరి ధర్నా ఖర్చుల సంగతి! షామియానా అద్దెకు తెచ్చుకోవాలి. కూర్చోడానికి చిరుగులదో అతుకులదో ఓ బొంతంటూ ఉండాలి. నినాదాలు మిన్నంటాలంటే ఓ మైకు లేకపోతే ఎలా? రిలే నిరాహారదీక్షలకు కూర్చున్నవారికి చిన్నవో పెద్దవో దండలంటూ వేయాలిగా? షామియానా, కార్పెట్ అద్దె ఐదువందలు. మైకుకో ఐదువందలు. దండలకు రెండొందలు. చిన్నాచితకా ఖర్చులు కలుపుకుంటే పదిహేనువందల దాకా లెక్క తేలుతుంది. ఒక రోజో రెండ్రోజులో అయితే ఎవరైనా భరించగలరు. నెలల తరబడి అంత ఖర్చు ఎలా తట్టుకోవాలి?

దీంతో ధర్నాచౌక్ మిత్రులు పొదుపు ప్రయత్నాలు మొదలుపెట్టారు. ఎందుకైనా









మంచిదని, నాలుగు రాళ్లు ఉన్నప్పుడే సొంతంగా షామియా నాలూ మైకులూ కొనేస్తున్నారు. దీక్షకు కూర్చున్నవారికి పూలహారాలు వేయడం మానేసి, ప్లాస్టిక్ దండలతో సరిపెడుతున్నారు. వాటినే మళ్లీ వాడుకోవచ్చు. రోజూ దండల ఖర్చు ఉండదు. ఎవరి బ్యానర్లు వాళ్లే రాసుకుంటున్నారు. అదృష్టం బావుండి, సమస్య తొందరగా పరిష్కారమైతే వాటిని తోటి మిత్రులకు అమ్మేసుకుని వెళ్లిపోవచ్చు. దీనివల్ల ఏరోజుకారోజు టెంట్‌హౌస్‌వాళ్లకు అద్దె కట్టాల్సిన అవసరం ఉండదు. పెళ్లిళ్ల సీజన్లో షామియానాలు దొరకవేమో అన్న భయమూ ఉండదు.

## మీడియా మంత్రం!

అదే డేరా. అదే దీక్ష. అవే నినాదాలు. అవే ఉపన్యాసాలు. రోజూ చచ్చే చావుకు మేళమెవరు మాట్లాడతారు? మీడియా మహాశయులు ఎన్నాళ్లని కవర్ చేస్తారు. రిపోర్టరు బొత్తిగా నల్లపూసైపోతాడు. వార్త సింగిల్‌కాలానికి చిక్కిపోతుంది. కొన్నిసార్లు అదీ ఉండదు. ఛానళ్లు చేయి ఇచ్చేస్తాయి. వార్తల్లో లేకపోతే, ఉద్యమం ఉన్నా లేనట్టే. అప్పుడే ఆ ఉద్యమకారుల్లోని మీడియా మేనేజరు బయటికొస్తాడు. సరికొత్త ఐడియాలు ప్రాణంపోసుకుంటాయి. పాలకులు గడ్డికరుస్తున్నారని చాటుతూ...గడ్డి తింటూ దీక్ష చేస్తారు. తమ జీవితాలు బజారు పాలయ్యాయని ఘోషిస్తూ వీధుల్లోనే వంటలు మొదలుపెడతారు. ఏలినవారి పాలన గుడ్డిదర్బారులా తయారైందని నిరసిస్తూ కళ్లకు గంతలు కట్టుకుంటారు. తమ బతుకులతో ఆడుకుంటున్నారని చెప్పడానికి రోడ్డుమీదే కబడ్డీ ఆడేస్తారు. ఆ జీతాలకు ఉద్యోగం చేయడం కంటే అడుక్కోవడమే నయమని నిరూపించడానికి యాచనకు దిగుతారు. సిగ్గూలజ్జాలేని నాయకులంటూ తిట్టిపోయడానికి కావచ్చు... సిగ్గు విడిచి అర్ధనగ్న ప్రదర్శనలు చేస్తారు. అంతా తలకిందులైపోయిందంటూ శీర్షాసనం వేస్తారు. 'ఎన్నిసార్లు వాగ్దానాలు చేస్తారయ్యా, మేం నమ్మం' అని వ్యంగ్యంగా చెప్పడానికి చెవుల్లో పూలు పెట్టుకుంటారు.

ఆఫ్‌బీట్ కథనాల కోసం మొహం వాచినట్టు ఎదురుచూస్తున్న మీడియావాళ్లకు కొబ్బరి కాయ దొరికినట్టే! నిమిషాల్లో ఓబీ వ్యాన్లు వచ్చేస్తాయి. ప్రత్యక్షప్రసారాలు ప్రారంభమవుతాయి. పేపర్లో ఫొటో ఖాయం. ఆ ఉద్యమకారులేం పబ్లిసిటీ నిపుణులు కాదు. మీడియా నాడినీ అధ్యయనం చేయలేదు. అనుకున్నది సాధించాలనే తపన, పాలకుల దృష్టిలోపడితే సమస్య పరిష్కారం అవుతుందేమో అన్న తహతహ సరికొత్త ప్రయోగాలకు ఊపిరిపోస్తుంది. ఆ భ్రమ బుడగలా బద్ధలుకావడానికీ ఎంతో సమయం పట్టదు. తోలుమందం పాలకులు స్పందించనైనా స్పందించరు. విక్రమార్కుడు మళ్లీ శవాన్ని భుజానికెత్తుకుని బయల్దేరినట్టు, ఉద్యమకారుల ప్రయత్నాలు మరొక్కసారి మొదటికొచ్చేస్తాయి.

## మంచిచెడులు...

ఉద్యమం ఉద్ధృతం అయ్యేకొద్దీ, పోరాటం పతాకస్థాయికి చేరుతున్నకొద్దీ...ఆ కలల్ని చిదిమేసే కుట్రలూ ఆ ఆశల్ని సమాధిచేసే కుతంత్రాలూ ఊపందుకుంటాయి. ఆమధ్య తమ ఉద్యోగాల్ని క్రమబద్ధీకరించాలంటూ దీక్షకు కూర్చున్న బృందానికి ఉన్నతాధికారుల నుంచి పిలుపు వచ్చింది. ఆ చిరుద్యోగుల ఆనందానికి అవధుల్లేవు. నలుగురు ప్రతినిధుల బృందం బయల్దేరి వెళ్లింది. తీరా అక్కడికెళ్లాక, జరిగింది చర్చలు కాదు... బెదిరింపులు. 'డేరా ఖాళీచేసి వెళ్లకపోతే... మీ నలుగురి పేర్లూ బ్లాక్‌లిస్ట్‌లో పెడతాం. ఉన్న ఉద్యోగాలు కూడా ఊడిపోతాయి. మీరే నిర్ణయించుకోండి' అని హెచ్చరించి పంపారు. ఎటూతేల్చుకోలేక ఆ ప్రతినిధులు నరకయాతన అనుభవించారు. ఉద్యోగం రాదనే బెంగతో ఖమ్మం జిల్లా మదిర గిరిజన పాఠశాలలో పనిచేస్తున్న కృష్ణ ప్రాణాలు తీసుకున్నాడు. ఉన్నతాధికారుల హెచ్చరికలు భరించలేక హోంగార్డు నాయకుడు బాలరాజు ఆత్మహత్యా ప్రయత్నం చేశాడు. రెండునెలల నుంచి నిరాహారదీక్షలు చేస్తున్న బీఎడ్ టీచర్లను ఓ రోజు పోలీసులు బలవంతంగా వ్యాన్లో ఎక్కించుకుని వెళ్లారు. కారణం అడిగితే, 'మీరు చాలా బలహీనంగా ఉన్నారు...వైద్య పరీక్షలు చేయించాలి' అని చెప్పారు. తీరా తీసుకెళ్లింది ఆసుపత్రికి కాదు, మేజిస్ట్రేటు ముందు నిలబెట్టడానికి. అరెస్టు చేసి జైలుకు పంపారు. బెయిలు తెచ్చుకోడానికి ఒక్కొక్కరికీ పదివేల దాకా ఖర్చయింది. ఉద్యమకారుల్లో చీలికలు తెచ్చే ప్రయత్నాలూ జరుగుతుంటాయి. మాట ఇచ్చి తప్పే మంత్రులూ నిమ్మరసం తాగించి చల్లగా జారుకునే అధికారులూ ఉండనే ఉన్నారు. మరోవైపు 'నీ మీద అమ్మ బెంగపెట్టుకుంది. పిల్లలు కలవరిస్తున్నారు. ఉద్యమాలొద్దు. ఉపవాసాలొద్దు. వెంటనే వచ్చెయ్. కలోగంజో తాగి బతుకుదాం. అవసరమైతే పొలం అమ్మి అప్పులు తీర్చుకుందాం' అంటూ కుటుంబ సభ్యుల నుంచి వచ్చే ఒత్తిళ్లొకటి. వీటన్నిటికి తోడు కడుపునిండా తిండిలేక, కంటినిండా నిద్రలేక క్షీణించిపోతున్న ఆరోగ్యం! మరొకచోటైతే ఆత్మవిశ్వాసం సన్నగిల్లేదే. వెనుదిరిగి వెళ్లిపోయేవారే. కానీ, అది ధర్నాచౌక్! వారం రోజులుగా ధర్నా చేస్తున్నవారికి, నెలరోజులనుంచీ చేస్తున్నవారు స్ఫూర్తి. నెలరోజులుగా చేస్తున్నవారికి ఆరునెలలుగా చేస్తున్నవారు స్ఫూర్తి. ఎదుటివారి కష్టాల ముందు మన కష్టాలు చిన్నవిగా అనిపిస్తాయి. అనుకున్నది సాధించాలన్న పట్టుదల వేయిరెట్లు పెరుగుతుంది.

## జిందాబాద్... ధర్నాచౌక్!

ధర్నాచౌక్ రూపాయి బిళ్లలాంటిది.
బొమ్మతోపాటు బొరుసు.
చెడుతోపాటు మంచి.





అక్కడింకా మానవత్వం మట్టికొట్టుకు పోలేదు. ఆ దీక్ష కొన్ని హృదయాల్ని అయినా కదిలిస్తుంది. ఆ ధర్నా కొందరి మనసుల్ని అయినా కరిగిస్తుంది. కొద్దిరోజుల క్రితం డిమాండ్ల సాధన కోసం వందలమంది బధిరులు ఇక్కడికొచ్చారు. సైగల భాషలో ఉపన్యాసం, సైగల భాషలోనే స్పందన. అదో నిశ్శబ్ద నిరసన! తమ గోడు వినిపిస్తామంటే... ఒక్క ఉన్నతాధికారీ అనుమతించలేదు. ఒక్క మంత్రీ అపాయింట్‌మెంట్ ఇవ్వలేదు. ఎన్నిరోజులని ధర్నాలు చేస్తారు. బందోబస్తు డ్యూటీకొచ్చిన ఐపీఎస్ అధికారి అకున్ సబర్వాల్ వాళ్ల కష్టాలు కళ్లారా చూశారు. సచివాలయం పెద్దలతో మాట్లాడి చర్చలకు అవకాశం కల్పించారు. జేబులో నయాపైసా లేని ఉపాధ్యాయుల దుస్థితి కృష్ణపూజారి అనే సామాజిక కార్యకర్తను కదిలించింది. పదిహేను రోజులపాటు కడుపు నిండా అన్నం పెట్టించి అండగా నిలబడ్డాడు. ధర్నాచౌక్ పరిధిలో బాధ్యతలు నిర్వర్తించే ఇంటలిజెన్స్ సీఐ హక్కుల పోరాటానికి వచ్చిన గిరిజనులకు ధర్నా జరిగినంతకాలం చాయ్ ఇప్పించాడు.

### ఆంధ్రా జంతర్‌మంతర్!

ధర్నాచౌక్ అంటే... మినీ ప్రపంచం, మినీ భారత్, మినీ ఆంధ్రప్రదేశ్, మినీ అసెంబ్లీ. మినీ పార్లమెంట్. ప్రపంచం ఎలా ఉందో తెలుసుకోవాలంటే, ధర్నాచౌక్‌కు వెళ్తే సరిపోతుంది. అమెరికా సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా ఓ ధర్నా జరుగుతూ ఉంటుంది. మయన్మార్‌లో మానవహక్కుల ఉల్లంఘనను ఓ వక్త ప్రశ్నిస్తూ ఉంటాడు. టిబెటియన్ల సమస్యల మీద ఓ డేరాలో దీక్ష కొనసాగుతూ ఉంటుంది.

భారతదర్శనం చేసుకోవాలన్నా ఓ సారి ధర్నాచౌక్‌కు వెళ్లాలి. ఇస్లామిక్ ఉగ్రవాదం మీద ఎవరో నిప్పులు కురిపిస్తూ ఉంటారు. రాజకీయ అవినీతిని ఇంకెవరో ప్రశ్నిస్తూ ఉంటారు. రాహుల్ వ్యాఖ్యల్ని ఓ బృందం తప్పుపడుతూ ఉంటుంది.

రాష్ట్రంలో పాలన ఎలా ఉందో తెలుసుకోవాలనున్నా, ధర్నాచౌక్‌ను సందర్శించాల్సిందే. డేరాల సంఖ్య పెరిగిందంటే, సర్కారు మీద ప్రజల్లో అసంతృప్తి పెరిగిందని అర్థం. ధర్నాలు ఎక్కువయ్యాయంటే మంత్రుల పేషీల్లో ఏదో పేచీ ఉందని లెక్క. ధర్నాచౌక్ దద్దరిల్లుతోందంటే, అసెంబ్లీ స్తంభించే అవకాశం ఉందని అర్థం. రాష్ట్రపాలన అంత సజావుగా ఏం లేదని భావం. ఇక్కడ వినిపించే ఉపన్యాసాలే, కాస్త తేడాతో అసెంబ్లీలో మారుమోగుతాయి. అధికారపార్టీని ఇరుకున పెట్టాలనుకునే ప్రతిపక్షానికి ధర్నాచౌక్ ఓ అస్త్రం. ఆ అశాంతి కొన్నిసార్లు శాంతిభద్రతల వ్యవస్థకూ పెనుసవాలుగా మారవచ్చు. కాబట్టే, ఇంటలిజెన్స్, లా అండ్ ఆర్డర్, స్పెషల్ బ్రాంచ్ సిబ్బంది ఆ చుట్టుపక్కలే చక్కర్లు కొడుతూ ఉంటారు. ఉద్యమకారుల ఆగ్రహం అదుపు తప్పితే...ఏమైనా జరగవచ్చు. పరిస్థితుల్ని నియంత్రించడానికి ధర్నాచౌక్ ఇరుపక్కలా... ముళ్లకంచెలు సిద్ధంగా ఉంటాయి.

ధర్నాచౌక్ ఎంపికలో పక్కా పోలీసు వ్యూహం ఉంది. ఒకవైపు ఇందిరా పార్కు, మరోకవైపు ఎన్టీఆర్ స్టేడియం...దుర్భేద్యమైన సరిహద్దులు. అటు దోమలగూడ, ఇటు బండమైసమ్మనగర్... రెండువైపులా దార్లు మూసేస్తే...దిగ్బంధనం చేసినట్టే. అడుగు ముందుకేయడం అసాధ్యం. ఆమధ్యలో జనావాసాలు లేవు కాబట్టి, సామాన్య ప్రజలకు ఇబ్బంది ఉండదు. ప్రత్యామ్నాయ మార్గాలకు కొదవలేదు. అందుకే ఏరికోరి ఆ ప్రాంతానికి 'ధర్నాచౌక్' అని నామకరణం చేశారు. అప్పట్లో ధర్నాలూ దీక్షలూ సచివాలయం దగ్గర్లో జరిగేవి. ఓసారి ఉద్యమకారులు నేరుగా సచివాలయంలోకి జొరబడటంతో...ఆచుట్టుపక్కల ధర్నాలను నిషేధించారు. ఇందిరాపార్కు పరిసరాల్లో మాత్రమే ధర్నాలకు అనుమతించడం మొదలుపెట్టారు. అలా పదేళ్ల క్రితం ధర్నాచౌక్ ప్రాణంపోసుకుంది.

★ ★ ★

ధర్నాచౌక్‌ను సందర్శించడమంటే నాయకుల జ్ఞాపకశక్తికి పెద్ద పరీక్ష. పాతిక డేరాలు. పాతిక సమస్యలు. పాతిక నినాదాలు. ఒకరిద్దర్ని పలకరించి వెళ్లిపోదామనుకుంటే కుదర్దు. చేయిపట్టుకుని తమ శిబిరానికి లాక్కెళ్తారు. ఫలానా నాయకుడు మద్దతు తెలిపాడంటే, సర్కారులో ఎంతోకొంత చలనం వస్తుందన్న ఆశ. అంతవరకు బాగానే ఉంది. వెళ్లిన చోటల్లా ఓ ఐదు నిమిషాలైనా మాట్లాడాలా! ఎన్ని ఉపన్యాసాలని ఇస్తారు! ఎన్ని సమస్యలని గుర్తుపెట్టుకుంటారు. అలాంటప్పుడు.... 'మీ సమస్య పరిష్కారం అయ్యేదాకా నేను నిద్రపోను', 'అవసరమైతే అసెంబ్లీలో లేవనెత్తుతాను', 'ప్రభుత్వం మెడలు వంచైనా సరే...' వగైరా వగైరా అరిగిపోయిన డైలాగులు భలేగా ఆదుకుంటాయి. నాయకుల కష్టాలు ఇలా ఉంటే, నాయకులు అనిపించుకోవాలనుకునే వారి కష్టాలు ఇంకోలా ఉంటాయి. ఆర్భాటంగా ధర్నా ప్రారంభించి, అద్దె అనుచరులతో దండలేయించుకుని, మీడియా కెమేరాలకు వీరావేశంగా పోజులిచ్చి పేపర్లో ఫొటో చూసుకోడానికీ ప్రైమ్‌టైమ్ న్యూస్‌లో మొహం చూసుకోడానికీ మొహంవాచినట్టు ఎదురుచూసే పబ్లిసిటీ పిచ్చివాళ్లూ అక్కడ తారసపడుతుంటారు. అరెస్టు అయితేనైనా మీడియా కరుణిస్తుందేమోనని 'బాబ్బాబూ మీకు పుణ్యముంటుంది, మమ్మల్ని కాస్త అరెస్టు చేయండి' అని పోలీసుల్ని బతిమాలే రకాలూ లేకపోలేదు. నేతల హంగులూ నకిలీల ఆర్భాటాల మధ్య అసలు ఉద్యమకారులు మరుగునపడిపోయిన సందర్భాలూ ఉన్నాయి. పాలనూ నీళ్లనూ వేరుచేసే పార్ములా ధర్నాచౌక్‌కు తెలియంది కాదు. కాకపోతే ఆ బాధ్యతను కాలానికి అప్పగించి చేతులు దులిపేసుకుంటుంది. ధర్నాచౌక్‌కు నాయకుల లక్షణాలు ఒంటబట్టేశాయి. సహవాస దోషం!

★ ★ ★

'అన్నా వెళ్తున్నాం! ముప్పై ఏడురోజుల ధర్నా సక్సెస్! రెండు నెలల్లో పోస్టింగ్స్ ఇస్తామని సీఎం హామీ ఇచ్చారు....' ఏ గిరిజన శాఖ కాంట్రాక్టు ఉద్యోగులో సంతోషంగా డేరా ఎత్తేస్తుంటారు. అంతలోనే మరో బృందం ఆటో దిగుతుంది. 'ఏం చేయాలి సార్! సంవత్సరాలుగా పోరాడుతున్నా ప్రభుత్వం మా సమస్యల్ని పట్టించుకోవడం లేదు. ఈ రోజు నుంచి ఆమరణ నిరాహారదీక్షకు కూర్చుంటున్నాం'...అంటూ సరిగ్గా అక్కడే టెంటు నాటేస్తుంది. వచ్చేవాళ్లు వస్తుంటారు. వెళ్లేవాళ్లు వెళ్తుంటారు. సమస్యలున్నంతకాలం, పాలకుల్లో నిర్లిప్తత ఉన్నంతకాలం, వ్యవస్థలో అవినీతి రాజ్యమేలినంతకాలం... ధర్నాచౌక్ కళకళలాడుతూనే ఉంటుంది.

జీతేరహో...ధర్నాచౌక్!

– ఎర్రం నర్సింగ్‌రావు, న్యూస్‌టుడే, కవాడిగూడ






# కలిసొచ్చే కార్ నంబర్

**అమితాబ్‌బచ్చన్...11 జూనియర్ ఎన్టీఆర్...9**
**అసిన్...4 జగపతి బాబు...3**
**సినీ తారలకూ ఈ అంకెలకూ సంబంధం ఏంటీ అని ఆలోచిస్తున్నారా... ఇవి వారి సెంటిమెంట్ సంఖ్యలు. ఈ నంబర్లు లేకుండా వారి కార్ల లైసెన్సు ప్లేట్లు కనిపించవు.**






మిగిలిన వాళ్లతో పోలిస్తే సినిమా వాళ్లకు సెంటిమెంట్లు ఎక్కువే. గత కొంత కాలంగా ఈ సెంటిమెంటు అంకెల మీదకు మళ్లింది. అందుకు బాలీవుడ్, టాలీవుడ్ తారల కార్ల నంబర్లే నిదర్శనం. ఈ నంబర్లను ఎంచుకోవడంలోనూ ఒక్కొక్కరికీ ఒక్కో సెంటిమెంటు. కొందరికి అమ్మ సెంటిమెంటు, మరికొందరికి కలిసొచ్చిన సెంటిమెంటు, ఇంకొందరికి సంఖ్యాశాస్త్రం. కారణం ఏదైతేనేం ఆ 'నంబర్' ప్లేటు లేకుండా వారి కార్లు నడవవు. అంతేకాదు, తమకు నచ్చిన నంబర్ ఉన్న లైసెన్సు ప్లేటును సొంతం చేసుకోవడానికి లక్షలు ఖర్చుపెట్టడానిక్కూడా వెనుకాడడం లేదు. అందులోనూ లక్కీనంబర్ ఫ్యాన్సీ నంబర్ అయితే అదో ప్రెస్టేజ్. మరి ఈ నంబర్ సెంటిమెంట్ గురించి తెలుసుకుందామా.

బాలీవుడ్ సూపర్‌స్టార్ అమితాబ్‌బచ్చన్ ఎప్పుడు కారు కొన్నా దాని లైసెన్సు ప్లేటు నంబర్ మాత్రం కచ్చితంగా పదకొండు కానీ రెండుగానీ అయి ఉంటుంది. అవి తన అదృష్ట సంఖ్యలు అంటారాయన. అందుక్కారణం అమితాబ్ పుట్టిన తేదీ అక్టోబర్ 11 (1+1=2) కావడమేనట. ఎప్పుడైనా ఆ నంబర్లు దొరక్కపోతే ఉన్న సంఖ్యలను కూడితే పదకొండు వచ్చేలా చూసుకుంటారు అమితాబ్.

ఇక, షారుక్ ఖాన్ విషయానికొస్తే... మూడు అయిదులు షారుక్‌కు చాలా ఇష్టమైన నంబర్. ఎంత ఖర్చు అయినా, కష్టమైనా అతను కొన్న ప్రతి కారు మీదా 555 ఉండాల్సిందే.

అక్షయ్‌కుమార్‌కీ నంబర్ సెంటిమెంట్ ఉంది. అతని కారు నంబర్‌లో తొమ్మిది ఉండేలా చూసుకుంటాడు.

అన్నట్లు ఈ తొమ్మిది సెంటిమెంట్ మన జూనియర్ ఎన్టీఆర్‌కూ బాగానే ఉంది. తాత ఎన్టీఆర్ అదృష్ట సంఖ్యగా భావించే తొమ్మిది అంటే జూనియర్ ఎన్టీఆర్‌కు సెంటిమెంట్. తన కారు నంబర్‌లో తొమ్మిది ఉండాల్సిందేనట. అందుకే, ఈమధ్య 9999 ఉన్న రిజిస్ట్రేషన్ నంబర్ కోసం దాదాపు ఆరు లక్షల రూపాయలు కట్టి మరీ సొంతం చేసుకున్నాడు.

ఇక అగ్రహీరోలు బాలకృష్ణ, చిరంజీవిల విషయానికొస్తే, బాలకృష్ణ కారు నంబర్ చాలావరకూ నంబర్ వన్‌తోనే రిజిస్టర్ అయి ఉంటుంది. అలాగే చిరంజీవి కార్ నంబర్‌లో నాలుగు ఒకట్లు ఉంటాయి.

టాలీవుడ్‌లో ఈ అంకెల సెంటిమెంట్ ఉన్న మరో హీరో జగపతిబాబు. జగపతికి మూడు బాగా కలిసొస్తుందట. ప్రస్తుతం ఆయన వాడుతున్న ఓ కారు నంబర్ 345 (3+4+5=12, 1+2=3). అంతేకాదు, జగపతిబాబు ఏ పని చేసినా మూడుతో మొదలయ్యేలా చూసుకుంటారట. గాయం-2 సినిమా కూడా సెప్టెంబర్ 3న విడుదలైంది.

బాలీవుడ్ బెబో కరీనాకపూర్‌దీ మూడు సెంటిమెంటే. కరీనా పుట్టిన తేదీ సెప్టెంబర్ 21. ఆ రెండు అంకెల్నీ కలిపితే మూడొస్తుంది. అందుకే, తనకు మూడంటే ఇష్టమనీ అదే తన అదృష్ట సంఖ్య అనీ అంటుంది కరీనా. తన కారు నంబర్ 7887ను కూడితే 30 వస్తుంది. ఆ రెండిటినీ (3+0) కలిపితే మూడు.

సైఫ్ అలీ ఖాన్ అదృష్ట సంఖ్య 7. సైఫ్ కూడా కరీనాను ఫాలో అవుతూ తన పుట్టిన తేదీ (ఆగస్టు 16) ఒకటీ ఆరును కలుపుకుని కారు నంబర్‌లోని అంకెల్ని కూడితే ఏడు వచ్చేలా ఎంచుకుంటాడు.




ఇక అరుంధతి సినిమాలో పశుపతిగా అదరగొట్టిన సోనూసూద్ కార్ నంబర్‌లో ఆరు సున్నాలైనా Q7 ఉండాల్సిందేనట. ప్రస్తుతం వాడుతున్న ఆడీ కారుకోసం 3.5 లక్షల రూపాయలు ఖర్చుపెట్టి క్యూ-7 నంబర్‌ను తీసుకున్నాడట. అతనికి నంబర్ మీదున్న ప్రేమ ఎంతతీదంటే ఓసారి హర్యానాలో క్యూ-7 నంబర్ ఉన్న మారుతీ కారు అమ్మకానికొస్తే నంబర్ కోసం ఆ కారును కొన్నాడట.

రణ్‌బీర్ కపూర్ కారు నంబర్ అయితే ఎనిమిది, లేదంటే మొత్తం అంకెల్ని కూడితే ఎనిమిది వచ్చేలా ఉంటుంది. రణ్‌బీర్ తల్లి నీతూకపూర్ పుట్టిన తేదీ జులై ఎనిమిది. అందుకే, రణ్‌బీర్‌కు ఆ నంబర్ అంటే సెంటిమెంట్ అట. అతను ప్రస్తుతం వాడుతున్న ఆడి కార్, ఇంతకుముందున్న రేంజ్‌రోవర్ల నంబర్ అదే. వాళ్ల నాన్న రిషికపూర్ కార్ నంబర్ 1313. మొత్తం కూడితే ఎనిమిది.

రోల్స్‌రాయిస్ ఫాంటమ్, ఫెరారి, బుగట్టీ వేరాన్ లాంటి ఖరీదైన కార్లు కొంటూ వార్తల్లో ఉండే సంజయ్‌దత్‌కు 4545 నంబర్ బాగా కలిసొస్తుందట. అతని కార్లన్నీ ఈ నంబర్‌తోనే రిజిస్టర్ అయి ఉంటాయి.

అసిన్ తల్లిదండ్రులు తన పుట్టిన రోజుకు ఇప్పటివరకూ ఆరు కార్లను కానుకగా ఇచ్చారట. ఆ కార్ల లైసెన్సు ప్లేట్లమీద ఉండే సంఖ్యలేంటో తెలుసా... 0004, 4000, 400, 40 లాంటివే. ఎందుకంటే అసిన్‌కు సంఖ్యాశాస్త్రం ప్రకారం నాలుగు అంటే సెంటిమెంట్. అదండీ సంగతి... ప్రస్తుతం సినీతారల కార్లను సెంటిమెంట్ సంఖ్యలు నడిపిస్తున్నాయి. ★

కథ

"ఏమండోయ్, పక్కింటి బాబాయ్‌గారొచ్చారు". ఆదివారం కదా మరికాసేపు పడుకుందా మనుకుంటే అప్పుడే తగులుకున్నాడు ముసలాడు అనుకుంటూ విసుగ్గా లేచి ముందుగదిలోకి వచ్చాను.

"హలో యంగ్‌మాన్, ఏడున్నరవుతోంది... ఇంత లేటుగానా లేవడం. తొందరగా స్నానం చేసిరా, నేను పేపరు చదువుతుంటాను" అన్నాడు రాజారావు టీపాయ్ మీద పేపరు అందుకుని.

"సార్, నాకు కాస్త నీరసంగా ఉంది. మీరు వెళ్ళి రాకూడదూ" ముఖంలోకి కావలసినంత నీరసం ఫీలింగ్ తెచ్చుకుని అన్నాను.

"నథింగ్ డూయింగ్. వెళ్ళి తొందరగా తెములుచ్చుకునిరా" అన్నాడు రాజారావు.

నాకిక తప్పదు. ఈ ముసలాడు అంత తొందరగా వదలడు. నిస్సహాయంగా బాత్‌రూమ్ వైపు కదిలాను.

నేను స్నానంచేసి డ్రెస్ వేసుకుని వచ్చేసరికి టిఫిన్ ముగించి కాఫీ తాగుతూ పేపరు చదువుతున్న రాజారావుని చూసి గుర్రుగా నా భార్య

'ఏం చేస్తాం, ఇరుగూపొరుగన్నాక ఆ మాత్రం తప్పదు' అనుకుంటూ పల్సర్‌ని ముందుకు దూకించాను. ట్రాఫిక్ తక్కువగా ఉండే వీధులలో వేగంగా దూసుకెళ్ళాను.

మార్కెట్‌కు చేరేసరికి పది నిమిషాలు పట్టింది. ఆ పది నిమిషాల్లోనే నా బుర్రని చాలావరకు తినేశాడు. నరమాంసభక్షకులంటే ఈయనలాంటి వాళ్ళే! బుర్రలో ఉన్న గుజ్జుని తొలిచి తినేసి ఖాళీ చేసేస్తారు.

సహజంగా వాగుతూవుండే స్వభావం. పైగా డెబ్భైఏళ్ళ వయసు దాటబోతోంది. నోరు విప్పాడో అన్నీ సెక్స్ కబుర్లే. ఆయన రొమాంటిక్ డైలాగులు వినలేక ఛస్తున్నాను. వద్దన్నా వినడు. టాపిక్ మార్చడు.

రాజారావు మా ఎదురింట్లో ఉంటాడు. ఆయన వ్యక్తిగత జీవితం గురించి ఏమీ తెలియదు. అడిగినా మాటలు దాటేస్తాడు. ముగ్గురు అబ్బాయిలు, ఒక అమ్మాయి అనీ అందరూ విదేశాల్లో బాగా సెటిలయ్యారనీ మాత్రం తెలుసు. ఏది ఏమైనా మా అమ్మాయినీ

ఏమిటిది అన్నట్లు చూశాను.

"ప్రేమలేఖ. ఐ మీన్ లవ్‌లెటర్".

"ఈ వయసులో ప్రేమా? " నేనింకా ఆశ్చర్యంలోనుండి తేరుకోలేదు.

"ఏం, ప్రేమించడానికి వయసుతో పనేముందిట" చాలా తేలిగ్గా అన్నాడు.

అవునన్నట్లు తలూపి "క్రీపాయింట్‌లా ఈ లవ్‌పాయింటేమిటి? "

"ఏం బాలేదా? "

"ఫరవాలేదు. ఈ సుభద్రమ్మగారు..." అర్థోక్తిగా అడిగాను.

"నా లవరయ్యా" అన్నాడాయన.

వెయిటర్ తెచ్చిన చల్లని నన్నారీని గొంతులో పోసేసరికి ప్రాణం లేచివచ్చింది. విసుగ్గా ముఖంపెట్టి అన్నాను "లవరని తెలుసు సార్,

# ప్రేమించే వయసు!

– నారాయణ డి.వి.వి.ఎస్.



సంగీత వైపు చూశాను.

"అతిథి మర్యాదలు చెయ్యడంలో ర్యాంక్ బాగానే కొట్టేస్తావ్. నా మొహాన కూడా ఆ టిఫిన్ కాస్త కొట్టు" అన్నాను చిరాకుగా.

"అలాటి పనులు నేను చెయ్యలేను, చెయ్యను" కచ్చితంగా చెప్పిందామె.

నాకు అర్థంకాలేదు. "ఎలాంటి పన్లు? " అని అడిగాను.

"అదే, టిఫిన్ మొహాన కొట్టడం... కాఫీ నెత్తిన పొయ్యటంలాంటి పనులే" అందామె ఎలాటి భావాలూ ముఖంలో కన్పించకుండా.

"సంతోషించాంలే. పిల్లలిద్దర్నీ కాసేపు పడుకోనీ... వాళ్ళని ఊదరగొట్టకు" వార్నింగ్ ఇచ్చి టిఫిన్ మీద దాడిచేశాను. కాఫీ కూడా ముగించుకుని వచ్చేసరికి రాజారావు "అమ్మాయి గీతా, మాకు రావడం కాస్త లేటవుతుంది. నువ్వు ఈ పంతులు గురించి ఆగకుండా భోజనం చేసెయ్. అలాగే మధ్యాహ్న భోజనంలో నాకు వెలగపండు పచ్చడి చేసి ఉంచమ్మా. తిని చాలా కాలం అయింది" అంటూ లేచాడు.

"అలాగేనండి" అంటూ నా భార్య తలూపుతూంటే నాకు ఒళ్ళు మండిపోయింది.

'ఎప్పుడే కూరలు కొంటానో ఎదురుగా కిటికీలోనుంచి గుడ్లగూబలా చూస్తూ కూర్చుంటాడు' అని విసుక్కుంటూ బండి బయటికి తీసి స్టార్ట్ చేశాను.

"ఎక్కడికో సెలవియ్యండి" అన్నాను.

"పోనీ. మార్కెట్‌లో పని" అని వెనక కూర్చున్నాడు.

'నీకు మార్కెట్లో పనుంటే బంగారంలాంటి నిద్ర పాడుచేసుకుని నేను తీసుకెళ్ళాలా? ' మండుతున్న పెట్రోలు ధరలాగే నా మనసు కూడా భగ్గుమంది.

అబ్బాయినీ బాగా చేరదీస్తాడు. వాళ్ళచేత హోంవర్కు చేయిస్తాడు. స్కూలుకి దింపుతాడు. ఒక్కొక్కప్పుడు తీసుకొస్తాడు కూడా. బాగా బతికిన మనిషట. ఒకప్పుడు బిజినెస్‌లో కింగ్‌లా ఉండేవాడని అందరూ అంటారు. విజయవాడలో బాగా పలుకుబడి ఉన్న మనిషే!

"ఇక్కడ ఆపు" నేను ఉలిక్కిపడి ఆపి చూశాను. ఐస్‌పార్లర్. ఎందుకన్నట్టు చూశాను. ఆయన నన్ను పట్టించుకోకుండా లోపలికి నడిచాడు. బండికి తాళంవేసి ఆయనని అనుసరించాను. ఇద్దరం కూర్చున్నాం.

"ఇక్కడ నన్నారీ చాలా బాగుంటుంది" అన్నాడు. 'ఆహా' అని తలూపాను.

నన్నారీని ఆర్డరుచేసి నా చేతికి ఒక పేపరిచ్చాడు. విప్పి చదివాను.

**సుభద్రా!**

*నిన్న పసుపురంగు చీరలో బంగారంలా మెరిసిపోతున్నావు. హృదయం లయ తప్పింది. దానివల్ల నిద్రకు దూరమయ్యాను. నువ్వంటే నాకు ఈఫిల్ టవరంత ప్రేమ. దానిని నీ కోపపు చూపులతో కూల్చెయ్యకు. నా ప్రేమని అర్థంచేసుకో. నా లవ్ జనరేటర్‌వి నువ్వు. నా లవ్వుని కాదని నా గుండెగదులలోని పవర్ తీసెయ్యకు. ప్లీజ్ లవ్ మీ.*

**– నీ లవ్ పాయింట్**

ఉత్తరం చదివి ఆశ్చర్యంగా కళ్ళు ఎగరేశాను.

కానీ సుభద్రమ్మగారికి మీరే ఇస్తారా? "

"సుభద్రమ్మ ఏంటి చీప్‌గా... సుభద్ర అను. షి ఈజ్ యంగ్ యూనో... జస్ట్ థర్టీ. నేరుగా... నేనే... ఈ లెటర్‌ని ఆమెకే ఇస్తాను. ఇంతకీ నా ప్రేమలేఖ బాగుందా? " ఆత్రుతగా అడిగాడు రాజారావు.

"వెల్... ఇట్స్ ఓకే. ముసలివాసన కొడుతోంది" అని నవ్వాను.

"భలేవాడివోయ్" అని నా నడుంమీద చరిచాడు. నా నడుము బాధగా మూల్గింది. చేత్తో దాన్ని సముదాయించాను.

ఇద్దరం లేచి బయటకు వచ్చాం. బిల్ ఆయనే ఇచ్చాడు. ఇదో ఖర్చా అని మౌనంగా ఊరుకున్నాను. ఎదురుగా శివకాశి ఫైర్‌వర్క్స్‌వారి షాపుంది. దానివైపు నడిచాడాయన. దీపావళి

దగ్గరకొచ్చింది. 'ముసలోడికి దసరా... కాదు కాదు దీపావళి పండగ' అనుకుంటూ ఆయన వెనక నడిచాను. టైము పదవుతోంది.

"బాగున్నారా రాజాగారూ" అంటూ షాపతను పలకరించాడాయనను.

"ప్రస్తుతం ఓకే. ఎప్పుడైనా పిలుపు రావచ్చు" అని నవ్వాడు పైకి చూసి.

"అవేం మాటలు సార్" అని నొచ్చుకున్నాడు షాపతను.

పది నిమిషాలక్రితం లవ్వూ గివ్వూ అన్నాడు. ఇప్పుడు మరో వేషం!

అగ్గిపెట్టె మొదలు ఆటంబాంబు వరకు అన్నీ తీసుకున్నాడు. బిల్లు నాలుగువేలు వేశాడు అమ్మిన కుర్రవాడు. కౌంటర్‌లో బిల్లు చూపించి పాతికవందలు ఇచ్చాడు. షాపతను మాట్లాడకుండా బిల్ అమౌంట్ సరిచూసుకుని డిస్కౌంట్ పదిహేనువందలుగా రాసి ఇచ్చాడు.

దారిలో రాజారావుని అడిగాను "ఇంత ఖర్చు అనవసరం అనిపించలేదా" అని. ఆయన నవ్వి ఊరుకున్నాడు. ఇద్దరం మా ఇంట్లోకి వచ్చాక మా ఆవిణ్ణి పిలిచాడు రాజారావు. ఆమె వచ్చాక సంచి ఆమెకిచ్చాడు. "బాల్యం మళ్ళీ రాదు. వాళ్ళ సరదా చంపవద్దు. పిల్లలచేత ఈ వారం రోజులూ కాల్పించు" అన్నాడు. నేనూ సంగీతా వారించినా వినలేదు. పిల్లలైతే ఆనందంలో మునిగిపోయారు. 'ఇలాటి సరదాలు మళ్ళీ రావయ్యా' అన్న ఆయన మాట నిజమేనేమో! కానీ మాకోసం ఇంత డబ్బు ఖర్చుపెట్టడం నాకు బాధనిపించింది. రోజూ పండ్లూ కూరగాయలూ స్వీట్లూ చాక్లెట్లూ బిస్కెట్ల రూపంలో బాగానే ఖర్చుపెడుతున్నాడు. వద్దన్నా వినడు. అందుకే సంగీత, పిల్లలు ఆయనకు చేరువయ్యారు.

మూడురోజులు మామధ్య కరిగిపోయాయి. మూడు సెక్స్‌జోక్స్ - ఆరు లవ్‌ట్రాక్స్ మాదిరి లైఫ్‌ట్రాక్ సాగిపోతోంది.

దీపావళిరోజునైతే తెల్లవారుజామునే వచ్చి కాలింగ్‌బెల్ మోతతో అందర్నీ లేపేశాడు.

నాకైతే కన్నుగీటి "ఉదయపుకన్య మంచుపమిట వెనుక తన అందాల్ని దాచుకుంటే చూసి ఆనందించకుండా నిద్రేమిటి" అన్నాడు మెల్లగా చెవిలో.

తలపట్టుకున్నాను నేను. టిఫిన్లు తిన్నాక "సుభద్ర నుండి రిప్లై వచ్చింది పాజిటివ్‌గా" అని చెప్పాడు.

"కంగ్రాచ్యులేషన్స్" అన్నాను వెర్రినవ్వు నవ్వి. ఆయన తన గురించీ ఆవిడ గురించీ డబ్బా వాయించాడు. తర్వాత మరో పేపరు నా చేతిలో పెట్టాడు. అప్పుడే రిప్లై రెడీ చేశాడన్నమాట. 'మీరు ఏం రాశారో చెప్పండి. అలా లవ్‌లెటర్స్ చదవడం బాగుండ'దన్నాను. ఏమనుకున్నాడో చదివాడు చూసి.

"నీ కళ్ళు ఇష్టం. ఆ కళ్ళలోని చిలిపితనం ఇష్టం. పెదవులు ఇష్టం. పెదవులపైని చిరునవ్వు ఇష్టం. నున్నటిబుగ్గలు ఇష్టం. బుగ్గలపైని సిగ్గులు ఇష్టం. నీ కంఠం ఇష్టం..." ఇలా సాగింది రాజారావు కలం. చివరికి "తమలపాకు పాదాలు ఇష్టం. ఆ పాదాల గజ్జెలసవ్వడి ఇష్టం" అని ముగించాడు.

బాగుందన్నాను.

"ఏమిటి? " అని అడిగాడు.

"మీ ఇష్టాల లిస్ట్"

"థాంక్స్. చాలా కష్టపడి రాశాను. ఈమాటు ఇంకా రొమాంటిక్‌గా రాస్తాను" అన్నాడు. పేపరుని జేబులో పెట్టుకున్నాడు. ఆ ముఖంలో ఆనందం చూసి నవ్వొచ్చింది నాకు. ముదిరే వయసులో అదిరే మనస్సు!

ఏ వయస్సువారికైనా ప్రేమ కబుర్లు తియ్యగానే ఉంటాయి. కానీ వయసుడిగిన వాడితో నాకెందుకోగానీ చప్పగానే అనిపిస్తున్నాయి.

సంగీతతోనూ నాకిదే సమస్య.

'ఈ చీరలో అందంగా ఉన్నానా? సరదాగా బ్యారేజ్ దగ్గరకిపోయి ఇసుకతిన్నెలపైన కూర్చుందాం రండి! మేడమీద కూర్చుని సరదాగా కబుర్లు చెప్పుకుందామా'... అంటూ అడుగుతుంది. నాకిలాంటివి అస్సలు నచ్చవ్.

'ఈరోజు మీరు చాలా అందంగా ఉన్నారు. మీరు మాట్లాడుతుంటే ఇంకా ఇంకా వినాలనిపిస్తోంది, కాసేపు మాట్లాడండి. మీకీవేళ తలరుద్ది స్నానం చేయించనా? '... అంటుంటుంది ఎప్పుడూ. నాకిలాంటివి అర్థంకావు.

'ఎందుకు నాపైన రుసరుసలాడతారు. నాతో



ఎందుకు ప్రేమగా మాట్లాడరు. వారానికి ఒక్కసారి కూడా నన్నూ పిల్లల్నీ బయటకు తీసుకెళ్ళాలనిపించదా? '... అంటూ నిలదీస్తుంది. నాకెలాటి స్పందనా కలగదు.

దీపావళి రోజంతా మాతోనే గడిపాడు రాజారావు. పిల్లలతో ఆనందంగా 'తాతా' అని పిలిపించుకుంటాడు. సంగీతకి పండుగరోజు చీర ఇచ్చి 'మీ నాన్న ఇచ్చాడనుకో' అన్నాడు.

'మమ్మల్ని రుణగ్రస్తులను చేస్తున్నాడు' అనే ఫీలింగ్ తప్ప ఆయనమీద నాకు ఎలాటి సానుభూతీ కలగడం లేదు.

వారంరోజులు గడిచాయి. రోజుకో కబురు తెస్తున్నాడు. రోజుకో విషయంపై ఉపన్యాసాలు దంచుతున్నాడు.

ప్రేమకి ఓరచూపు ఓపెనింగ్. శృంగారానికి ముద్దు శ్రీకారం. తేనెలోనైనా వగరుంటుంది కానీ ముద్దులో ఉండదు. నిన్న నా సుభద్రని ముద్దాడాను... ఇలాటి మాటలు ఆయన వయసుకు తగినవా? మనిషి రోగిష్టివాడిలా ఉంటాడు. నోరు విప్పాడో... ప్చ్... హింసే! పరిచయం అయిన ఆరునెలల నుంచి నమిలేస్తున్నాడు. నా బాధ సంగీతకి ఏం తెలుసు? ఆయనని తెగ పొగుడుతుంది. అసలు ఆయనతో పరిచయమే విచిత్రం. ఆరోజు ఎందుకో సంగీతని తిట్టాను. ఆ సమయంలో వచ్చి తనని పరిచయం చేసుకుని తన రూమ్‌కి తీసుకెళ్ళాడు. ఆ మాటా ఈ మాటా చెప్పాడు. మెల్లగా టాపిక్ మార్చాడు.

పెళ్ళి, ప్రేమ, అందం, ఆనందం, ముద్దు, మురిపెం గురించి చావగొట్టేశాడు. భార్యాభర్తల సంబంధం, కుటుంబ విలువల గురించి ఎల్‌కేజీ స్టూడెంట్ మాదిరి నన్ను కూర్చోబెట్టి తినేశాడు.

ఆరోజు నుంచీ ఇంట్లో గట్టిగా మాట్లాడాలంటే భయంపట్టుకుంది నాకు.

ఈమధ్య ఆయన మరీ పేట్రేగిపోతున్నాడు. పూలరంగడిలా మారిపోయాడు. సుభద్రతో కలిసి సినిమాలకీ పార్కులకీ తిరుగుతున్నాడట. హోటల్స్‌లో డిన్నర్ పార్టీలూ హ్యాపీట్రిప్స్ కూడాను.

ఏమైనా, సుభద్రని నా కళ్ళలో మాత్రం పడనివ్వలేదు.

ఉదయం పదిగంటలకుపోయి సాయంత్రం ఆరున్నరకి ఇంటికి చేరే నాకు ఈయన గోల ఓ సమస్య అయిపోయింది.

వీలుచూసి ఇల్లు మార్చేస్తేపోలా అనుకున్నాను.

పంచాంగంలో రెండు పౌర్ణములు గడిచాయి. "డిసెంబరు చలి శరీరాన్ని వణికించేస్తోందోయ్. నా సుభద్రతో హాయిగా గడపాలి. కాబట్టి పెళ్ళి చేసుకోవాలనుకుంటున్నాను" అన్నాడు రాజారావు.

"ఈ వయసులోనా..." అని నాలిక్కరుచుకుని మళ్ళీ అన్నాను. "సారీ, ఆమె ఒప్పుకున్నారా? "

"ఆహా, ఎందుకు ఒప్పుకోదోయ్. ఆమెకి మాత్రం నా అవసరం లేదా? " అని మునివేళ్ళతో నా కడుపులో పొడిచాడు. నేను మెలికలు తిరిగాను.

"ప్రేమ ఒక ఆక్సిడెంట్. పెళ్ళి ఒక ఇన్సిడెంట్" అన్నాడాయన.

నాకు అర్థంకాలేదు. కెలకటం ఇష్టంలేక మౌనం వహించాను.

"మరి సెక్స్ అంటే ఏమిటో చెప్పు".

"సెలవీయండి మహాశయా" దండంపెట్టాను.

"గుడ్. అడిగి తెలుసుకోవాలి. సెక్స్ ఈజ్ ఏ మార్వలెస్ ఫైట్ ఫర్ ఏ స్వీట్ డిఫీట్".

మళ్ళీ నాకర్థంకాలేదు. "విక్టరీ కదా" అన్నాను ఉండబట్టలేక.

"సెక్స్‌లో డిఫీట్ విక్టరీ కంటే గొప్పది తెలుసా? మన మగాళ్ళకంటే ఈ విషయంలో ఆడవాళ్ళే గొప్ప. మగాడి పొందులో ఓడిపోతున్నట్టుగా కనిపిస్తూ విజయం సాధిస్తారు".

నాకు నిజమే అనిపించింది. మగవాళ్ళు ఇగో ప్రదర్శిస్తారు. ఆడవాళ్ళు దాన్ని జయిస్తారు. అందుకే నిజమైన విజేత ఆడదే... అన్ని విషయాల్లోనూ.

ఎందుకో సంగీత గుర్తొచ్చింది.

నిజం చెప్పాల్సివస్తే... సంగీత చాలా అందమైంది. ఎంతో బాగా పాడుతుంది. వీణ నేర్చుకుంది. పిల్లలకు నేర్పిస్తుంది. వాళ్ళని చదివిస్తుంది. చక్కగా మాట్లాడుతుంది. వినయంగా ఉంటుంది. సహనంతో నన్నూ పిల్లల్నీ భరిస్తుంది. ఇల్లు కళకళలాడటానికి ఆమే కారణం. ఆమె సేవల్ని నేను గుర్తిస్తున్నానా? ఏమో... ఎప్పుడూ విసుక్కుంటాను. మాటలతోనైనా చేతలతోనైనా నా ఆధిపత్యం ప్రదర్శిస్తా

నెప్పుడూ. ఆమెతో ప్రేమగా మాట్లాడింది ఎప్పుడు? ఆమె అందాన్ని హక్కుతో ఆస్వాదించానేకానీ మనసుల్నీ తనువుల్నీ పెనవేసిందెప్పుడు? ముసలివాడైనా రాజారావు బెటర్.

అనుభవించాల్సిన చిన్న వయసులో నేను అపసవ్యంగా ప్రవర్తిస్తున్నానా?

నాలో అంతర్మథనం మొదలైంది. మొట్టమొదటి సారిగా నాకు ఇగో ఎక్కువేమోననిపించింది.

అమ్మ ముసలాడా! మెల్లగా నన్ను నీ మార్గంలోకి లాగుతావా?

'లొంగనుగాక లొంగను' అనుకున్నాను గట్టిగా.

★ ★ ★

ఈరోజు నాకూ సంగీతకూ యుద్ధం ప్రారంభమైంది.

పిల్లలకి ఎల్లుండి నుంచి క్రిస్మస్ సెలవులు. ఇరవైరోజులపాటు ఇచ్చారు. మా మామగారింటికెళ్ళి రెండేళ్ళయింది. కనుక ఈ సెలవులను అక్కడే గడపాలని సంగీత మంకుపట్టు పట్టింది. నాకు సెలవలు లేవు, పిల్లలూ నువ్వూ వెళ్ళమని ఎంతచెప్పినా వినటం లేదు. వెళ్తే అందరం వెళ్ళాల్సిందేనని గోల.

నా బాధ నాది. పిల్లలతో ప్రయాణం. ఖర్చు సంగతి వేరే చెప్పాలా?

మా గోల విని ఆ ముసలాడు ఎక్కడ వస్తాడో అని భయపడుతూంటే అనుకున్నంతా జరిగింది.

ఆయన అడిగిందే తడవుగా తన గోడుని వెళ్ళగక్కింది. అంతా విన్న రాజారావు నావైపు తిరిగి "నీ సమస్య ఏమిటి? డబ్బు... అంతేనా? " అని అడిగాడు. నేనేదో చెప్పబోతే ఇద్దరూ కలిసి నా నోరు విప్పనివ్వలేదు.

నాకు క్లాసు మొదలైపోయింది.

"జీవితంలో అన్నిటికన్నా ముఖ్యమైనవి మానవ సంబంధాలు. వీటిలోనే వినోదం, విజ్ఞానం, వికాసం, విలువలు అనేవెన్నో పుష్కలంగా మనకు లభిస్తాయి. అంత ముఖ్యమైన ఈ సంబంధాల్ని నిర్లక్ష్యం చెయ్యడం తప్పు. స్నేహితులతో, బంధువులతో రాకపోకలు జరగకపోతే సంబంధాలు నిలబడతాయా? పిల్లలను ఇలాగే పెంచావనుకో, వాళ్ళు పెరిగి పెద్దయి నీ ముఖం కూడా చూడరు" అని ఆగి ఊపిరితీసుకుంటున్నాడు రాజారావు.

"అర్థమైంది మహాప్రభో, కానీ మన పరిస్థితులు చూసుకోవాలిగా".

"నథింగ్ డూయింగ్. రేపే వెళ్ళి రిజర్వేషన్ చేయించుకొస్తాను. ప్రయాణం ఏర్పాట్లు చేసుకోండి. అమ్మాయీ, నాకు మంచి ఛాయ్ కలుపుకురా" అన్నాడు విషయాన్ని ముగించి. నేను నిస్సహాయుణ్ణయ్యాను.

★ ★ ★

మర్నాడు రాజారావు నాలుగు టిక్కెట్లు, ఐదువేలు నగదూ చేతిలోపెట్టాడు. అప్పుగా తీసుకుంటానని పట్టుబట్టాను. సరేలే అన్నాడు. ఆఫీసుకి సెలవు పెట్టాను. స్టేషనుకొచ్చి ట్రెయిన్ ఎక్కించాడు రాజారావు. టాటా చెప్తూ ఆయన కనుమరుగవుతూంటే నా మనసెందుకో విలవిలలాడింది. ఏ జన్మ రుణానుబంధమో కదా అనిపించింది. ఆయనని నేను సరిగా అర్థం చేసుకోలేదనిపించింది.

నేను ఊరు చేరిన రెండోరోజు నుంచి రాజారావు నుంచి ఫోన్లు మొదలయ్యాయి. నేరకపోయి నంబరిచ్చానురా బాబూ అనుకున్నాను.

"సుభద్రకీ నాకూ పెళ్ళయింది" అన్నాడు మూడోరోజు రాత్రి ఫోన్లో.

"వ్వాట్? " అన్నాను ఆశ్చర్యపోతూ.

"మళ్ళీ నోరు తెరిచావా! నిన్ననే గుళ్ళో పెళ్ళయింది. రేపే బయలుదేరుతున్నాను".

"ఎక్కడికి? "

"స్వర్గానికి"

"స్వర్గమా? "

"అదేనయ్యా, హనీమూన్‌కి. కొత్త జంటకి అది స్వర్గమే కదా. ఇంక నన్నూ నా సుభద్రనీ ఎవ్వరూ విడదీయలేరు. అదిసరే, ఊరినుంచి వచ్చాక నా సుభద్రని చూద్దువుగాని" అన్నాడు రాజారావు. ఆయన గొంతులో ఏదో తేడా ఉంది.

ఆనందంలో ముసలాడికి స్వరం కూడా మారిపోయింది.

ఆ మర్నాటి నుంచి ఆయన నుంచి ఫోన్లు లేవు. ఆయన నంబరు తెలిసినా నేను



చెయ్యలేదు. స్వర్గంలో కూడా సవతిపోరేనా?

సెలవులన్నీ బాగా ఎంజాయ్ చేశాం. అన్నీ తిరిగాం. ఆనందంగా తిరుగుప్రయాణమయ్యాం.

★ ★ ★

తాళంతీసి ఇంట్లోకి రాగానే రాజారావు ఇంటివైపు చూశాను. తాళం వేసి ఉంది. వృద్ధదంపతుల హనీమూన్ సంగతి గుర్తొచ్చి నవ్వుకున్నాను.

మా ఓనరు నన్ను చూసి వచ్చాడు.

"ఇది రాజారావుగారు నీకు ఇమ్మన్నారు" అని ఓ కవరిచ్చాడు.

"ఆయన హనీమూన్ నుండి ఎప్పుడొస్తారో చెప్పారా? " అని అడిగాను.

"హనీమూన్ ఏమిటి? " ఆయన అయోమయంగా అడిగాడు.

"పెళ్ళి విషయం మీతో చెప్పలేదా? "

"ఎవరి పెళ్ళి? "

"రాజారావుగారి పెళ్ళి"

ఆయన నన్నో పిచ్చివాణ్ణి చూసినట్టు చూశాడు.

"ఆయన చనిపోయి పన్నెండు రోజులైంది. మీ ఇద్దరూ క్లోజ్ కదా, నీకు తెలీదూ" అని అడిగాడు. పిడుగుపడినట్టు తల భారమైంది.

మేము ఊరు వెళ్ళిన మర్నాడే ఆసుపత్రిలో చేరాడట. బాడీని ఇంటికి తీసుకురాకుండా, ఆయన పిల్లలు వచ్చాక అటునుండి అటే తీసుకెళ్ళి కార్యక్రమాలు జరిపేశారట. నిన్ననే రూము కూడా ఖాళీ చేసి అప్పగించారట.

సంగీత కుర్చీలో కూలబడి ఏడుస్తోంది. నేను బరువెక్కిన మనసుతో కవరు తెరిచాను. అందులోని లేఖని తీసుకుని చదవసాగాను.

**బాబూ సిద్ధార్థా,**

నేను పేద కుటుంబంలో పుట్టాను. కష్టపడి చదువుకున్నాను. కష్టాలు నన్ను డబ్బుమనిషిగా మార్చాయి. డబ్బు నన్ను మానవ విలువలకు దూరంచేసింది. వ్యాపారంలో బాగా సంపాదించాను. సుభద్ర నా భార్య. ముత్యాల్లాంటి పిల్లలు. కానీ డబ్బు మదంతో అందర్నీ భయపెట్టాను, బాధపెట్టాను. సుఖశాంతులకి దూరమయ్యాను. నా సాంగత్యం కోసం, ప్రేమకోసం పరితపించిన సుభద్ర చనిపోయాక కానీ ఆమె విలువ నాకు తెలిసిరాలేదు. నా కొడుకులూ కోడళ్ళూ అల్లుడూ కూతురూ అన్యోన్యంగా జీవించటం చూశాక నా కళ్ళు తెరుచుకున్నాయి. పిల్లలు దూరాలకి వెళ్ళిపోయారు. ఏకాకినయ్యాను. సుభద్ర జ్ఞాపకాలు నన్ను వెంటాడాయి. తెలియని గుండెజబ్బు పట్టుకుంది. ఎప్పుడు పోతానో తెలియదు. ఇదే సమయంలో మీ కుటుంబం నా ఎదురు వాటాలోకి రావడం, నీ భార్యని నువ్వు బాధపెట్టడం గమనించాను. రేపు నాలాగా మరొకరు కాకూడదనుకున్నాను. భార్యని ప్రేమగా చూసుకోవడం ఒక అదృష్టం. ఆమెచేత ప్రేమించబడటం ఒక వరం. అది నీకు ఎంతగా నచ్చజెప్పినా నువ్వు అర్థంచేసుకోలేదు. సంగీత ఉత్తమురాలు. అలాటి భార్య దొరకడం నీ అదృష్టం. నా పిల్లలు నన్ను ఎలా వెలివేశారో చూశాక నిన్ను మార్చాలని అనిపించింది. జీవితంలో ప్రేమ ఒక టానిక్. దానికీ వయసుకూ సంబంధం లేదు. దానికి మోతాదు లేదు. ఎవరికి కావలసినంత వాళ్ళు తాగవచ్చు. అలా తాగలేకపోవడం ఒక రోగం. నన్ను పీడించింది ఆ రోగమే. నువ్వు నాలా రోగివి కాకు. నీకే సమస్యలూ లేవు. భార్యని ప్రేమించకపోవడమే సమస్య. ఆమెని నీ సొంతం చేసుకో. ఆమె హృదయాన్ని దోచుకో. అప్పుడు నీ సంసారం స్వర్గం అవుతుంది. సుభద్రని చూపిస్తానన్నాగా... ఫొటో జతపరిచాను. చూడు. నిన్ను మళ్ళీ చూస్తాననే నమ్మకం లేదు. అతిగా చనువు తీసుకున్నాను. క్షమించు.

**– నీ ముసలి రాజారావు**

నా కళ్ళు తడిసిముద్దయ్యాయి. మా ఇద్దర్నీ చూస్తూ బిక్కమొహాలు వేసిన పిల్లల్ని చూసి కంట్రోలు చేసుకుని సంగీతని ఓదార్చ ప్రయత్నించాను.

రాజారావు ఇప్పుడు నా దృష్టిలో అందనంత ఎత్తులకు ఎదిగిపోయాడు.

నిజమే! ఎదిగి ఎదిగి దేవుడయ్యాడు.

ఆ క్షణం తర్వాత... సంగీతని నేనేనాడూ పొరపాటున కూడా విసుక్కోలేదు.

రాజారావుగారు ఆశించిన స్వర్గాన్ని నా ఇంట్లో సృష్టించుకోగలిగాను. ★

# చదివే నా అలవాటు

వ్యక్తిగతంగా నాకు ఏదైనా చదవడమంటే ఎంతో ఇష్టం. కాని రోజూ పేపర్లన్నిటనీ ఉండగా చుట్టి ఎక్కడబడితే అక్కడ పడేయడం, ఇంకా వాటిని అడ్డదిడ్డంగా మడతలు పెట్టి ఉంచడం ఇలా ప్రతి రోజూ పొద్దునపూట చూస్తే నాకు బలే చికాకుగా ఉంటుంది, మూడంతా పాడయిపోతుంది. నాకు బాగా ఇష్టమయిన పేపరు లోకసత్తా, సుధీర్ కేమో టైమ్స్ ఆఫ్ ఇండియా. మా పిల్లలకి లోకసత్తాలో చింటూని రోజూ చూడడం అంటే చెప్పలేనంత ఇష్టం. మిగతావాళ్ళతో పేపరును పంచుకోవడం అంటే నాకు చికాకు, నేను చదువుతున్నప్పుడూ మధ్యలో దానిలో సగం కూడా వేరే వాళ్ళకి ఇవ్వను. నిజం మాట్లాడాలంటే, వార్తా పత్రికల అర్థం వార్తలను మనకి తెలియపర్చడం కదా, వాటిని మిగతా వాళ్ళతో పంచుకోకపోవడం ఏమిటి! కాని ప్రతి ఒక్కరు దానిని మన సొంతసొత్తులాగా చూస్తారు, దానిని పూర్తిగా క్రిందమీద తిరగేసి పూర్తిగా స్కేను చేసినంత పనిచేసిన తరువాతే వేరే వాళ్ళకివ్వాలని అనుకుంటారు. నేను గట్టిగాపట్టుపట్టేదంటే, పేపరును చదివాక దానిని చక్కగా నీటుగా మడత పెట్టి, అది పొద్దున వచ్చినప్పుడెలా ఉందో అలాగే ఉంచి, అప్పుడే వేరే వాళ్ళకి ఇవ్వాలని. కాని ఈ మధ్య మనం పూర్తిగా కొత్త సమస్యతో సతమవుతూ ఉన్నాము. ఇప్పుడూ ఎవరూ కూడా పేపరును పూర్తిగా చదవడం లేదు. ప్రతి రోజు దాదాపుగా 12/15 పేపర్లు, మాఇద్దరి చేతులు కలిపి ఎత్తవలసినన్ని పేపర్లు ఇంట్లో వచ్చిపడుతున్నాయి. వాటిలో కొన్నిటికి డబ్బులు కట్టినవి, మిగతావి వాలంటరీగా అందజేస్తున్నవి. ప్రతి ఒక్కటి ఏదో ఒక విషయంలో ఆకర్షణీయమైన విషయాలను ప్రచురిస్తాయి, దాంతో అన్నిటిలోకి ఒకసారి దృష్టిసారించాలనిపిస్తుంది. లోకసత్తా, హిందుస్తాన్ టైమ్స్, ఎకనామిక్ టైమ్స్, టైమ్స్ ఆఫ్ ఇండియా, ముంబాయి మిర్రర్, మిడ్‌డే (ఈ మధ్య ఇది ప్రొద్దునే వస్తోంది), డిఎన్ఎ, ఇండియన్ ఎక్స్‌ప్రెస్, వాటి అనుబంధ సంచికలతో మమ్మల్ని అలరిస్తున్నాయి, ఇవన్నీ కాకుండా అదనంగా మేము డబ్బులు కట్టిన ఇతర మేగజైన్లు మా గుమ్మం ముందు ప్రతి రోజూ ఉదయం చేరుకుంటాయి. వచ్చిన సమస్య ఏమిటంటే, ఉరుకుల పరుగులతో నిండిన ప్రొద్దున పూట ఒక పేపరుని కూడా పూర్తిగా చదవలేము, ఒకదానిని తిరగేస్తుంటే ఈలోపల ఇంకోటి తనవైపు చూడమన్నట్లుగా మమ్మల్ని డిమేండు చేస్తూ ఉంటాయి.

ఇలా మనస్సుని మొద్దుబరిచే గంగదరగోళంతో కొన్ని సార్లు ఈ వార్తాపత్రికల పట్ల జుగుప్స కలుగుతుందేమే అని పిస్తుంది, దానిని గోలగోలగా మన చెవులు తుప్పు వదలకొట్టేలా మనకి ప్రొద్దుననకుండా రాత్రి అనకుండా మనల్ని విసిగిస్తున్న న్యూస్‌ఛానల్స్ మాటయితే ఇక చెప్పనక్కరలేదు. ఒక్కసారి వీటన్నిటికి ఫుల్‌స్టాప్ పెడదామని పిస్తుంది, కాని మనకి తెలికుండానే ఛానల్ తరువాత మరొక ఛానల్‌ని మనం నొక్కుతూ ఉంటాము, చివరికి దేనిని చూడకుండా టివిని ఆపేస్తుంటాము. ఇంతకుముందు హాయిగా ఉండేది, ఒకే ఛానల్ వచ్చేది దానినే పట్టుకుని వేళ్ళాడుతూ ఉండేవాళ్ళం, వాళ్ళు చూపినఅవాకులు, చవాకులు, తప్పుల తడకలను భరిస్తూఉండే వాళ్ళం. అప్పుడైతే ఒకదానితో సరిపోయేది. న్యూస్ ఛానల్స్ నిజంగా గందరగోళాన్ని సృష్టిస్తున్నాయి. ఒక న్యూస్‌రీడర్ వార్తలు చదువుతూ ఉంటే, మరొకరు మధ్యలో దూరుతూ మన దృష్టిని మరలుస్తూ ఉంటారు, ఇక బ్రేకింగ్ న్యూస్ అంటూ క్రింద స్క్రోలింగ్ సంగతి చెప్పనక్కరలేదు. ఇక్కడేమే వార్తలు, అక్కడేమో స్టాక్ ఎక్స్ఛేంజ్ వార్తలు. పిచ్చెక్కుతూ ఉంటుంది. ఇక వాణిజ్య ప్రకటనల సంగతి చెప్పనక్కరలేదు. పట్టిపీడిస్తూ ఉంటాయి, మనుషుల మనసులు పరిభ్రమించడానికి కారణం సాక్షికంగా ఈ ఛానళ్ళేనని నా ప్రగాఢ నమ్మకం. వార్తాపత్రికలకు కొద్దో గొప్పో లాజిక్ వర్తిస్తుంది, అందుకని నేను ఒక వార్తాపత్రికకే కట్టుబడి ఉండాలని, మిగతా వాటిని వదిలేద్దామని నిర్ణయించుకున్నాను.

అయితే, చాలా వార్తాపత్రికలు నిజంగా మంచి విషయాలను కలిగి ఉంటాయనేది కూడా యదార్థం అని నాకు నేను సమాధానం చెప్పుకుంటాను. మంచి వార్తలను గుర్తించడం మరియు వాటిని బడలిక కలిగించే విమానయానం లేదా బస్సు ప్రయాణ సమయంలో పఠించడం నిజంగా అద్భుతమైన కాలక్షేపం. పఠించడం అన్న మంచి లక్షణం మన ప్రజలలో పెరుగుతున్నదన్నది సత్యం. ఇది స్వాగతించవలసిన విషయం కూడా. పెద్దపెద్ద పుస్తకాల షాపులను ఏర్పాటుచేయడం, కొత్తకొత్త వార్తాపత్రికలు ప్రారంభించడం దీనికి తార్కాణం. హేరీ పాటర్ లేదా ఇతర పుస్తకాలు విపరీతంగా అమ్ముడవడం యువతరంలో కూడా పుస్తకాలను చదవాలనే జిజ్ఞాసను ప్రతిబింబిస్తుంది. వారిలో ఈ విజ్ఞాన సముపార్జన పిపాస ఇలాగే కొనసాగించమని భగవంతుడిని నేను ప్రార్థిస్తున్నాను.

**వీణ పాటిల్**
మేనేజింగ్ డైరెక్టర్, కేసరి


హాలిడే...
అతి చవకైనది,
అత్యుత్తమమైనది!
ఇక మీరు ప్రయాణం పెట్టుకోవలసినదే, తప్పదు.



ఒకటి మరియు రెండు దేశాలు

| | | | |
|---|---|---|---|
| 27990 ~~32990~~ QT- థాయిల్యాండ్-5 రోజులు 3 మార్చి | 41490 ~~45990~~ D2-దుబాయి షాపింగ్ ఫెస్టివల్ 4 రోజులు 5,12,15 ఫిబ్రవరి | 58990 ~~68990~~ M3-మారిషస్ 5 రోజులు – 16 మార్చి | 58990 ~~68990~~ ML-శ్రీ లంక మాల్‌దీవులు 7 రోజులు– 7 ఫిబ్రవరి, 7 మార్చి |

మూడు దేశాలు మరియు భారత్ టూర్లు

| | | | |
|---|---|---|---|
| 54990 ~~69990~~ Q3-సింగపూర్ థాయిల్యాండ్ మలేషియా 8 రోజులు-18 ఫిబ్రవరి, 4 మార్చి | 57990 ~~74990~~ Q4-సింగపూర్ థాయిల్యాండ్ మలేషియా 10 రోజులు -5 మార్చి | 13475 ~~15975~~ H6-సిమ్లా కులు మనాలి 8 రోజులు-25 జనవరి,10,18 ఫిబ్రవరి,2,12 మార్చి | 16975 ~~19975~~ N6-నైనిటాల్ ముస్సోరి కార్బెట్ పార్క్ 8 రోజులు - 27 ఫిబ్రవరి,7,15 మార్చి |

KESARI
World Class Travel Company

K&S
KESARI COST SAVER TOURS

All International Tours are Ex-Hyderabad departures
*USD=₹ 47. Prevailing Rate will apply. Terms & Conditions Apply.
Hyderabad: 2335 5151
www.knstours.in
Advt.*Conditions Apply

# వజ్ర సోయగం!



వజ్రం ఎప్పటికీ నిలిచే ఉంటుంది. వివాహబంధం కూడా అంతే దృఢంగా ఉండాలన్న భావనతోనే కావచ్చు... పాశ్చాత్యదేశాల్లో మాదిరిగానే ఇటీవల మనదగ్గర కూడా నిశ్చితార్థపు ఉంగరాల్లో వజ్రానిదే పైచేయిగా మారింది. ఒకప్పుడు సంపన్నవర్గాల్లో సైతం రవ్వల ముక్కుపుడక, రవ్వలపోగులు పెట్టుకుంటే ఎంతో గొప్పగా చెప్పుకునేవారు. అలాంటిది ఇప్పుడు ఎగువ మధ్యతరగతి సైతం రవ్వల హారాలు, నెక్లెస్‌లు, వడ్డాణాలు, గాజులు, బ్రేస్‌లెట్లు... ఇలా రకరకాల వజ్రాభరణాలు ధరిస్తున్నారు.

అంటే వజ్రాల తవ్వకం పెరిగిందా... రేటు తగ్గిపోయిందా? అన్న సందేహం సహజం. కానీ వీటన్నింటికన్నా మనలో కొనుగోలుశక్తి పెరగడంతో బాటు వజ్రాలు అత్యంత చిన్నపరిమాణంలోనూ అంటే తక్కువ క్యారెట్లలోనూ ఇంకా అన్‌కట్ రూపంలోనూ మార్కెట్‌లోకి రావడమే మనదేశంలో వీటి వాడకం పెరగడానికి ప్రధాన కారణం. కెంపులు, పచ్చలు, ముత్యాలకు జతగా ఈ రవ్వపలసల(అన్‌కట్ డైమండ్స్)ను జోడించిన జ్యువెలరీ వాడకం ఇటీవల బాగా పెరిగింది. సినిమాలూ సెలెబ్రిటీల పుణ్యమా అని కుందన్, మీనాకారి డిజైన్లు మళ్లీ ప్రాభవం సంతరించుకోవడంవల్ల కూడా అన్‌కట్స్ వినియోగం జోరందుకుంది. అందుకే వజ్రం ధర తగ్గకున్నా బంగారం ధర చుక్కలనంటుతున్నా వజ్రాల నెక్లెస్ సెట్‌లు లక్షన్నర రూపాయలనుంచీ దొరుకుతున్నాయి. దాంతో మధ్యతరగతి మహిళలూ వజ్రాలంటే ముచ్చటపడుతున్నారు.

## అన్‌కట్ అంటే...

గనుల్లోనుంచి ముడి వజ్రాలను వెలికి తీశాక, ఒక్కో వజ్రానికీ కనీసం 58 ముఖాలు ఉండేలా కత్తిరించినప్పుడే అది ప్రకాశిస్తుంది. ముఖాలు ఎంత ఎక్కువుంటే అంతగా ఆ వజ్రం మెరుస్తుంది. ఇలా చిత్రిక పట్టేప్పుడు వచ్చే చిన్నపాటిముక్కలే ప్రస్తుతం మనం వాడుతోన్న అన్‌కట్ డైమండ్స్. గుండ్రం, త్రికోణం, చదరం, హృదయాకారాలు వచ్చేలా వీటిని అయిదారు రకాలుగా మాత్రమే కత్తిరిస్తారు. ఉదాహరణకు 10 క్యారెట్ల ముడివజ్రాన్ని సానపెట్టేటప్పుడు పెచ్చులు వస్తాయి. వీటిల్లో బాగా చిన్నవాటిని చక్రి(గుండ్రని పూసలా), కాస్త పెద్ద సైజులో ఉండేవాటిని పోల్కి(చదరం, త్రికోణాకారంలో చెక్కే పెద్ద పూసలన్నమాట)రూపంలోకి వచ్చేలా పాలిష్ చేస్తారు. ఇవన్నీ తక్కువ మందంలో ఉంటాయి. అందుకే ధర తక్కువ. ఉదాహరణకు సుపీరియర్ బెల్జియం కట్ వజ్రం ధర క్యారెట్ రూ. 46,000 ఉంటే అన్‌కట్ డైమండ్స్‌లో క్యారెట్ విలువ దాదాపు రూ. 10,000 మాత్రమే.

## వజ్రాలనెక్లెస్!

అన్‌కట్‌ని పక్కనబెడితే కత్తిరించిన వజ్రాల నెక్లెస్‌ల వాడకమూ పెరిగింది. తక్కువ క్యారెట్లలోనే విభిన్న డిజైన్లలో వీటిని రూపొందించడమే ఇందుకు కారణం. బంగారు చెయిన్‌కి చిన్న పెండెంట్, పోగులు జోడించిన సెట్స్ నేటి తరాన్ని ఎక్కువగా ఆకర్షిస్తున్నాయి. అలాగే బ్రేస్‌లెట్లు, గాజులు కూడా మెరిసే వజ్రాలవే కావాలనుకుంటున్నారు. వజ్రాలలాకెట్ ఉన్న నల్లపూసల వాడకం కూడా పెరిగింది. ప్రేమకానుకలతో బాటు ఇటీవల వివాహవేదికల మీదా వజ్రపుటుంగరమే మెరుస్తోంది. అంటే వజ్రం సంప్రదాయ ఆభరణ హోదాని అందిపుచ్చుకుందన్నమాట.

## ఎలా కొనాలి?

వజ్రాలను కొనేటప్పుడు నాలుగు 'సి'లను తప్పక దృష్టిలో పెట్టుకోవాలి. వాటిని కత్తిరించే తీరు(కట్), రంగు(కలర్), స్వచ్ఛత(క్లారిటీ), పరిమాణం(క్యారెట్)బట్టి వజ్రం లేదా అన్‌కట్ డైమండ్ ధర ఆధారపడి ఉంటుంది.

మొదటిది కట్... అంటే వజ్రంమీద ఎన్ని ముఖాలున్నాయో తెలుసుకోవాలి. రెండోది రంగుని పరిశీలించాలి. ఏ రంగూలేని వజ్రాలకే ప్రకాశం ఎక్కువ. అందుకే వాటి ధరా ఎక్కువే. వజ్రాలన్నీ మిలమిల మెరిసే తెలుపురంగులోనే ఉంటాయనుకుంటారు. కానీ ఇవి లేతపసుపు నుంచి తెలుపు, గోధుమరంగువరకూ ఉంటాయి. కార్బన్ అణువుల్లో కొద్దిపాళ్లలో నైట్రోజన్ కలవడమే ఈ రంగులకు కారణం. తెలుపు నుంచి గోధుమ లేదా పసుపు వర్ణానికి మారేకొద్దీ వజ్రం విలువ తగ్గుతుంది. ఈ రంగును సూచించేందుకు 'డి నుంచి ఎం' వరకూ ఉన్న ఆంగ్ల అక్షరక్రమాన్ని వినియోగిస్తారు. డి, ఇ, ఎఫ్, జి వరకు నాణ్యమైనవి.

అయితే ఆకుపచ్చ, ఎరుపు, నీలం ఊదారంగుల్లోనూ వజ్రాలు దొరుకుతాయి. వీటినే ఫ్యాన్సీ డైమండ్స్ అని పిలుస్తారు. కానీ ఇవి చాలా అరుదు. అందుకే ధర ఎక్కువ. ఆస్ట్రేలియాలోని అర్గైల్ గనుల్లో ఇవి ఎక్కువగా దొరుకుతున్నాయి. ఏ రంగూలేని వజ్రాలకు భిన్నంగా రంగు వజ్రాల్లో లేత రంగు నుంచి ముదురురంగుకి వెళ్లేకొద్దీ ధర పెరుగుతుంది. మూడో 'సి' బరువుకు సంబంధించినది. వజ్రాల బరువును క్యారెట్లలో చెబుతారు. ఒక క్యారెట్ అంటే 0.2గ్రా. క్యారెట్‌ను తిరిగి వంద సెంట్లుగా విభజించారు. మన ఆభరణాల్లో వాడే వజ్రాలన్నీ చాలా చిన్నవి. అంటే క్యారెట్‌కన్నా చాలా తక్కువ. అందుకే వీటిని 1/100 పాయింట్లలో చెబుతుంటారు. సైజు పెరిగేకొద్దీ క్యారెట్ విలువ కూడా పెరుగుతుంది.

నాలుగోది స్వచ్ఛత. ఎంత పారదర్శకంగా ఉంటే అంత ధర ఎక్కువ. మలినాలవల్లే వజ్రాల్లో నల్లమచ్చలు కనిపిస్తుంటాయి. ఇవి కాంతికిరణాల ప్రయాణానికి అడ్డుతగులుతాయి. ఫలితంగా పారదర్శకత తగ్గి మెరుపూ తగ్గుతుంది. అదేస్థాయిలో ధరా తగ్గుతుంది. వీటిని ఐఎఫ్ (మలినాలు లేనివి), వీవీఎస్1 (చాలా తక్కువ మలినాలు), వీవీఎస్2, (తక్కువ మలినాలు)... వివిఎస్1, వివిఎస్2, ఎస్ఐ1, ఎస్ఐ2... తరహాలో లెక్కిస్తారు. తక్కువ క్యారెట్లు ఉన్నప్పటికీ కొన్ని వజ్రాలు ఎక్కువ ధర పలకడానికి కారణం ఇదే. నాణ్యతను బట్టి ఒక్కో సెంట్ విలువ రూ. 350-380 వరకు ఉంటుంది.

## వజ్రంపై చిరునామా!

కొన్ని సందర్భాల్లో విలువైన వజ్రాలను ఎవరయినా దొంగిలించవచ్చు, జారవిడుచుకోవచ్చు. అప్పుడు కూడా అది మనదే అని తెలియాలంటే ఎలా? అందుకే ఇప్పుడు వజ్రంమీద ఉండే క్రౌన్ చుట్టూ లేజర్ కిరణాలతో ప్రత్యేకంగా మార్కింగ్ చేస్తున్నారు. నాణ్యత వివరాలతో పాటు యజమాని పేరునీ చెక్కుతున్నారు. ఇది బీమా చేసుకునేవాళ్లకీ ఉపయోగపడుతుంది. వజ్రాలపై లేజర్ మార్కింగ్‌ను ప్రస్తుతం ముంబయిలో వేస్తున్నారు. ప్రత్యేక లెన్స్ సాయంతో మాత్రమే దాన్ని చదవొచ్చు. అధిక విలువ కలిగిన వాటికి తప్పనిసరిగా ఈ మార్కింగ్ చేయించుకుంటేనే మంచిది. అప్పుడే మీ వజ్రం ఎప్పటికీ మీదిగానే ఉంటుంది.

– **కె.అమర్‌కుమార్,** న్యూస్‌టుడే, హైదరాబాద్

**నింగిలో విరిసే తారకలా...**
**మింటిలో మెరిసే మెరుపులా...**
**నీటిమీద కదిలే జాబిల్లిలా...**
**అందీఅందని ఆ రవ్వల**
**అందాలు ఇప్పుడు**
**అందరినీ అలరిస్తున్నాయి.**
**అవునండీ... వజ్రం**
**ఇప్పుడు మధ్యతరగతి**
**మహిళల్నీ మురిపించి**
**మెరిపిస్తోంది.**
**తీయని వలపుగీతాలు**
**పలికిస్తోంది.**







# జాతీయజెండా... కేరాఫ్ హుబ్లీ





**చిన్నప్పుడు బళ్లో ఎగరేసే జాతీయ పతాకం... అసెంబ్లీపై మెరిసే ముువ్వన్నెల పతాకం... ఢిల్లీ సభపై సగర్వంగా ఎగిరే మూడురంగుల జెండా... ఏడాదికి రెండుసార్లు ఎర్రకోటలో ప్రధాని ఎగరేసే జెండా... ఇలా దేశంలో ఏమూల ఎగిరే పతాకమైనా సరే అది హుబ్లీ (కర్ణాటక)లోని 'ఖాదీ గ్రామోద్యోగ సంయుక్త సంఘ'లో తయారైందే. జనవరి 26 గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఆ విశేషమేంటో తెలుసుకుందామా...**

'కర్ణాటక ఖాదీ గ్రామోద్యోగ సంయుక్త సంఘ(కేకేజీఎస్ఎస్)'... అక్కడి జాతీయజెండా విభాగంలో ఎవరిని చూసినా ముువ్వన్నెల పతాకాల తయారీలో లీనమై కనిపిస్తారు. చాలా శ్రద్ధగా, మరెంతో భక్తిగా జాతీయజెండాను రూపొందించడంలో నిమగ్నమై ఉంటారు.

సైనికులూ నేతలతో సహా దేశ ప్రజలందరూ తాము తయారుచేసిన జెండాలనే ఎగురవేస్తారన్న ఆనందం వారి కళ్లల్లో తొంగి చూస్తుంటుంది. వారు ఆ పనిని ఎంత నిబద్ధతగా చేస్తారంటే... అక్కడి యువతీ యువకులు తమతో పాటు జెండాతయారీ విభాగంలో పనిచేస్తున్న యువతీయువకులనే వివాహం చేసుకునేందుకు ఆసక్తి చూపుతారు. వేరే ఊరివారిని చేసుకుంటే జాతీయజెండాను రూపొందించే అవకాశాన్ని ఎక్కడ కోల్పోతామో అన్న భయం వారిది.

## అక్కడే ఎందుకంటే...

బి.ఎస్.పాటిల్... కర్ణాటక ఖాదీ గ్రామోద్యోగ సంయుక్త సంఘానికి అధ్యక్షుడు ఈయన. గాంధేయవాదానికి కట్టుబడిన పాటిల్- జెండాల తయారీ తమకే దక్కాలన్న లక్ష్యంతో నాలుగేళ్లపాటు కృషిచేసి ఖాదీ, గ్రామీణపరిశ్రమల శాఖ నుంచి అనుమతులు సంపాదించుకున్నారు. అంతకుముందు చాలా ప్రయివేటు సంస్థలు జెండాలను రూపొందించేది. కానీ వాటిలో లోపాలుండేవి. దాంతో సర్కారు ఒక మంచి సంస్థకు ఈ బాధ్యతలు అప్పగించాలని నిర్ణయించింది. పాటిల్ పట్టుదలకూ సమర్ధతకూ ముగ్ధులైన ఖాదీ, గ్రామీణ పరిశ్రమల కమిషన్‌వారు కేకేజీఎస్ఎస్‌కు ఈ హోదా కల్పించారు. 1999 నుంచి జాతీయజెండా తయారీ అనుమతుల కోసం కృషిచేసి ఎట్టకేలకు నాలుగేళ్ల అనంతరం ఆ భాగ్యాన్ని దక్కించుకోగలిగారు.

బాగల్‌కోట జిల్లాలో జలగి, బాదామి, బాగల్‌కోట ఈ మూడూ తాలూకాల్లో 24 పల్లెల్లో గ్రామోద్యోగసంఘానికి సిబ్బంది ఉన్నారు. ఈ సంఘం తరఫున దాదాపు 80 మంది నేతపనివారు జెండాకు అవసరమైన వస్త్రాన్ని నేస్తారు. నూలు సరఫరాదారుల సంఖ్య 900. నేతపనివారి నుంచి తయారైన వస్త్రం జెండా తయారీ విభాగానికి వస్తుంది. వచ్చిన వస్త్రాన్ని అవసరమైన కొలతల్లో కత్తిరిస్తారు. ముందుగా తెల్లటి వస్త్రంపై అశోక చక్రం ముద్రించడంతో జెండా తయారీ మొదలవుతుంది. తర్వాత కాషాయ, ఆకుపచ్చ భాగాలను తెల్లటి భాగానికి కలిపి కుడతారు. ఆపై ఇస్త్రీ చేసి ప్యాకింగ్ చేస్తారు. తయారైన జెండా ఎగుమతికి సిద్ధం.

## బోలెడన్ని నిబంధనలు

చెప్పుకోవడానికి ఇదంతా చాలా తేలిగ్గా కనిపిస్తుందిగానీ... చాలా కష్టంతో కూడుకున్న వ్యవహారం. ఎందుకంటే జాతీయపతాకం తయారీలో కఠినమైన నిబంధనలు పాటించాల్సి ఉంటుంది. ఆ నిబంధనల్లో మొదటిది... జెండా పరిమాణం. భారతీయ నాణ్యతా ప్రమాణాల విభాగం(బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్-బిఐఎస్) వారు నిర్ణయించిన ప్రమాణాల మేరకు నిర్దేశిత పరిమాణాల్లో మాత్రమే జెండాలను తయారుచేయాల్సి ఉంటుంది. వివిధ సందర్భాల్లో ఎగరేసేందుకు వీలుగా తొమ్మిది రకాల పరిమాణాల్లో జెండాలు రూపొందించాలి. నిర్దేశిత ప్రమాణాలకు ఒక అంగుళం ఎక్కువైనా తక్కువైనా ఆ జెండా పనికి రాదు. జెండాపై కనిపించే కాషాయ, ఆకుపచ్చ, నీలి రంగులు స్ఫుటంగా కనిపించాలి. అశోకచక్రంలో ఆకుల మధ్య సమాన దూరం ఉండాలి. ఇలా దాదాపు 100 నిబంధనలున్నాయి. ఆ నిబంధనల ప్రకారం తయారీలో ఏమాత్రం తేడావచ్చినా తీవ్రశిక్షార్హమైన నేరంగా పరిగణించి అపరాధ రుసుము లేదా జైలుశిక్ష లేదా రెండూ విధిస్తారు. తయారైన ప్రతి జెండానూ బి.ఐ.ఎస్. వారు క్షుణ్ణంగా పరీక్షిస్తారు. ఒక్క జెండాలో తేడా కనిపించినా ఆ లాటు మొత్తాన్నీ పక్కకు పెట్టేస్తారు.

బి.ఎస్.పాటిల్ చెప్పేదాని ప్రకారం... ఇండియన్ నేవీ విభాగం వారు ఎక్కువగా ఉన్నితో తయారుచేసిన జెండాలు వాడతారట. సైనిక విభాగం సిల్కు లేదా కాటన్ పతాకాలు ఎగురవేస్తే... వాయుదళం వారు మాత్రం ఎక్కువగా సిల్క్‌తో రూపొందించిన జెండాల వైపే మొగ్గు చూపుతారట.

– ***జి.జగదీశ్వరి***, న్యూస్‌టుడే, బెంగళూరు



# అడుగు అడుగునా ఆరోగ్యం



రోజుకు 5000 నుంచి 10000 అడుగులు వేయగలిగితే 'మెటబాలిక్ సిండ్రోమ్' వచ్చే ముప్పు 40 శాతం మేర తగ్గిపోతుందంటున్నారు వైద్య నిపుణులు. మెటబాలిక్ సిండ్రోమ్ అంటే... రక్తంలో చక్కెర స్థాయులు, రక్తపోటు, ట్రైగ్లిజరైడ్‌లూ సాధారణ స్థాయికన్నా ఎక్కువగా ఉండటం. ఆ స్థాయులు మరీ అధికమైతే మధుమేహానికీ హైబీపీకీ హృదయసంబంధిత వ్యాధులకూ దారితీస్తాయి. ఇప్పటికే పొట్ట పెరుగుతున్న ఆనవాళ్లు కనిపిస్తే ఈ విషయంలో మరింత జాగ్రత్త పడాలని హెచ్చరిస్తున్నారు వారు. రోజూ జిమ్‌కెళ్లి వ్యాయామం చేసే అవకాశం అందరికీ ఉండకపోవచ్చు. అలాంటివారికి ఈ నడక ఎంతగానో మేలు చేస్తుందట. ఒకసారికి 3000 నుంచి 4000 అడుగులు వేస్తే(దాదాపు ఒక కి.మీ) ఇంకా ఎక్కువ ప్రయోజనం ఉంటుందట. అలా రోజురోజుకీ పెంచుకుంటూ పదివేల కన్నా ఎక్కువ అడుగులు వేయగలిగేవారికి గుండె జబ్బులు వచ్చే ముప్పు 72 శాతం మేర తగ్గుతుందట. సందుచివర కిరాణా కొట్టుకు వెళ్లడానికి కూడా బండి తీయడం మానేసి అలా నాలుగడుగులు వేయడం మన ఆరోగ్యానికే మంచిదట!

# ముతకే మేలు



ఆహారంలో ముతకధాన్యాలను అధికంగా వినియోగించేవారిలో టైప్-2 మధుమేహం, గుండెజబ్బులూ వచ్చే ముప్పు చాలావరకూ తగ్గిపోతుందట. అమెరికాకు చెందిన జీన్ మేయర్ యూఎస్‌డీఏ హ్యూమన్ న్యూట్రిషన్ రీసెర్చ్ సెంటర్ ఆన్ ఏజింగ్ వారు చేసిన అధ్యయనంలో తేలిందీ విషయం. పాలిష్ పట్టిన ధాన్యాలతో పోలిస్తే... గుండెపోటుకూ మధుమేహానికీ దారితీసే కొన్ని రకాల కొవ్వుల ఉత్పత్తిని ముడి ధాన్యాలు సమర్థంగా నియంత్రిస్తాయని చెబుతున్నారు వారు. ఇప్పటికే ఆ జబ్బులు ఉన్నవారికి కూడా ముతక ధాన్యాలు ఎంతగానో మేలు చేస్తాయని చెబుతున్నారు.

అవీ ఇవీ

# ఇ-కామసూత్ర

కామసూత్ర... మన వాత్స్యాయనుడు రాసిన ఈ పుస్తకాన్ని ప్రపంచంలో చాలా దేశాలవారు తమ భాషల్లోకి అనువదించుకున్నారు. ఇప్పుడా అద్భుత గ్రంథం 'ఇ-బుక్'గా... అదీ ఆడియో ఇ-పుస్తకంగా విడుదలైంది. లండన్‌కు చెందిన 'బ్యూటిఫుల్ బుక్స్' అనే ప్రచురణ సంస్థ వారు తాన్యా ఫ్రాంక్స్ అనే అందమైన నటితో కామసూత్రాలను చదివించి ఈ ఆడియో పుస్తకాన్ని తయారుచేశారు. కాకపోతే సదరు పుస్తకాన్ని డౌన్‌లోడ్ చేసుకోవడానికి మన కరెన్సీలో అయితే దాదాపు రూ.450 సమర్పించుకోవాల్సిందే. అందమైన అమ్మాయి చదివి వినిపించే ఆ శృంగార సూత్రాలను ఏ ఎంపీత్రీ ప్లేయర్‌లోనో కంప్యూటర్‌లోనో టీవీలోనో ప్లే చేసి... వాటిని వింటూ కొత్తకొత్త భంగిమలను ప్రయత్నించవచ్చని మురిసిపోతున్నారు కొందరు.






తాన్యా ఫ్రాంక్స్

# మొటిమలకు 'షాక్!'

ప్రేయసి చెక్కిలపై మొటిమ కూడా అబ్బాయిలకు అందంగా కనపడుతుందేమోగానీ ఆ అమ్మాయికి మాత్రం అది అందం పాలిట శత్రువే. అందుకే రకరకాల ఫేస్‌ప్యాకులు వేసి మొటిమలు రాకుండా జాగ్రత్త పడతారు. ఎన్నిచేసినా వయసు ప్రభావంతో వచ్చేవి వస్తూనే ఉంటాయి. అమ్మాయిలకు ఈ బాధ తప్పించే మార్గాన్ని కనిపెట్టారు ఇజ్రాయిల్ పరిశోధకులు. మొటిమలకు కారణమైన సూక్ష్మజీవులను సంహరించే హైటెక్ స్కిన్ ప్యాచ్‌నొకదాన్ని రూపొందించారు వారు. మొటిమ కనిపించిన చోట ఈ ప్యాచ్‌ను అతికించుకుంటే చాలు. అందులోంచి విడుదలయ్యే విద్యుత్ మొటిమలకు కారణమయ్యే సూక్ష్మజీవుల పనిపడుతుందట. కేవలం మూడంటే మూడే రోజుల్లో మొటిమ తాలూకు మచ్చకూడా మిగలదని చెబుతున్నారు వారు. చూడ్డానికి మామూలు ప్లాస్టర్‌లా కనిపించే ఈ ప్యాచ్‌లు మన దేశ మార్కెట్లో అందుబాటులోకి రావడానికి దాదాపు రెండేళ్లు పడుతుందని అంచనా.



# టూకీగా

పుదీనా టీ తరచూ తాగే వారిని అజీర్ణం అంతగా బాధించదు.

❖ కొన్ని రకాల హార్మోన్ల కారణంగా... పురుషుల్లో కన్నా స్త్రీలలో మైగ్రేన్ తలనొప్పి వచ్చే ముప్పు 50 శాతం అధికం.

❖ రక్తాన్ని పలుచన చేసే ఆస్పిరిన్ వంటి మందులు వాడే వారు వైద్యుల సలహా లేకుండా ద్రాక్షరసం తాగకూడదు.

❖ ప్రపంచవ్యాప్తంగా సగటున ప్రతి ఐదుగురులో ఒకరికి రహస్య భాగస్వామి ఉన్నట్టు వన్‌పోల్ డాట్ కామ్ వారి అధ్యయనంలో తేలింది.

# అమ్మ కోరిక తీరుస్తా!



**డబ్బింగ్ కళకు హీరో ఇమేజ్ తెచ్చిపెట్టిన ప్రతిభావంతుడు... సాయికుమార్. పదమూడేళ్ల వయసుకే డబ్బింగ్ ఆర్టిస్ట్‌గా కెరీర్ ఆరంభించి బాలనటుడిగా ప్రేక్షకుల అభిమానం పొంది హీరో అయిన సాయికుమార్ జీవితంలో ఎత్తుపల్లాలు...**

చుట్టూ కారుచీకటి. భయమేస్తోంది. కానీ వెచ్చగా ఉంది. ఏదో ఒక స్పర్శ... 'నేనున్నాను' అని ధైర్యం చెబుతోంది. వెలుతురు కనిపిస్తోంది. అంతలోనే చీకటయిపోతోంది. ఎక్కణ్నుంచో గుసగుసలు వినిపిస్తున్నాయి. ఎవరో ఇద్దరు మాట్లాడు కుంటున్నారు. సర్వశక్తులూ కేంద్రీకరించి వింటే... ఒక ఆడ, ఒక మగ వాళ్ల జీవితం గురించి, కష్టాల గురించి... మధ్యమధ్యలో నా గురించి మాట్లాడుకుంటున్నారు. ఆ పురుషుడి గొంతులో మగతనం ఉంది. ఆ స్త్రీ స్వరంలో మృదుత్వం ఉంది, అమ్మదనం ఉంది. ఒకరోజు... ఆ చీకట్లోంచి బయటికొచ్చాక తెలిసింది... ఆ మగగొంతు మా నాన్నదని. ఆయనతో మాట్లాడింది మా అమ్మ అని. అంతవరకూ నేనున్నది అమ్మ కడుపులోనని.

ఒక నలభయ్యేళ్ల తర్వాత అనిపించింది నాకు... ఈ వెలుతురు కన్నా ఆ చీకటే గొప్ప దనీ మళ్లీ అమ్మ కడుపులోకి వెళ్లిపోవాలనీ.

...ఒకసారి మదర్స్‌డేకి మా అమ్మకి గిఫ్ట్ ఇవ్వాలనుకున్నాను. షూటింగ్‌లో ఆలస్యమవ డంతో గిఫ్ట్ కొనడం కుదర్లేదు. దాంతో మద్రాస్‌కి వెళ్తూ ఫ్లైట్లో కూర్చుని ఆ ప్రయా ణంలో రాశాను ఇదంతా. రాసి అమ్మకిచ్చాను. ఆరోజు మా అమ్మ ఎంత సంతోషపడిందో మాటల్లో చెప్పలేను.

★ ★ ★

నేను చిన్నప్పటి నుంచీ అమ్మకూచిని. అమ్మంటే నాకు చాలా ఇష్టం. నేను పుట్టిపెరిగిందంతా మద్రాసులోనే అయినా తెలుగు ఇంత బాగా మాట్లాడుతున్నానంటే దానికి కారణం మా అమ్మ. అమ్మకు మన సంస్కృతన్నా సంప్రదాయాలన్నా పురాణాలన్నా ఎంతో గౌరవం. చిన్నప్పుడు ఆర్థికంగా చాలా ఇబ్బందిగా ఉండేది మా పరిస్థితి. మా స్కూలు ఫీజులు కూడా కట్టలేకపోయేవారు. స్కాలర్ షిప్‌లతో చదువుకున్నాం నేనూ మా పెద్ద చెల్లెలూ. నేనెప్పుడూ టెక్స్ట్‌బుక్స్ కొనుక్కోలేదు. సీనియర్ల నుంచీ తీసుకోవడమే. క్యారేజీ తెచ్చుకోనివాళ్లకి స్కూల్లో మధ్యాహ్నం పూట గోధుమన్నం పెట్టేవాళ్లు. అది తినలేక మా చెల్లి ఏడ్చేది. నాకూ ఇష్టం ఉండేది కాదు. ఇలాంటి కష్టాల మధ్య నాకు ఊరట అమ్మ చెప్పే కథలే. ఆమె భారతంలోని కథలు చెప్పేది. భాగవత పద్యాలు నేర్పించేది. అలా నా వ్యక్తి త్వాన్ని తీర్చిదిద్దింది మా అమ్మ.

★ ★ ★

మా నాన్న పి.జె.శర్మ రైల్వే ఉద్యోగి. విజయనగరంలో ఉద్యోగం. అక్కడ జె.వి.సోమయాజులుగారు, జె.వి.రమణ మూర్తిగారు, నాన్న... అంతా కలిసి నాటకాలే స్తుండేవారు. నటనమీద ఆసక్తితో మద్రాసు వెళ్లి చిన్నచిన్న వేషాలు వేస్తుండేవారు నాన్న. 1959లో మద్రాసులో స్థిరపడ్డారు. ఇక, మా అమ్మ... కృష్ణ జ్యోతి. ఒకప్పుడు మహా రాణిలా బతికింది. కర్ణాటకలో బాగేపల్లి అనే ఊరు అమ్మావాళ్లది. వాళ్ల తాతముత్తాతలు మైసూరు రాజుల దగ్గర పనిచేశారు. ఆ రోజుల్లో మా అమ్మ పోలో ఆడేదట. ఆవిడకో ఆంగ్లో ఇండియన్ అసిస్టెంట్ ఉండేదట. నాన్న కోసం అన్నీ వదులుకుని వచ్చేసింది. వాళ్లిద్దరినీ కలిపింది నాటకాలు. ఒకసారి స్టేజి మీద అమ్మని అనార్కలిగా చూసి ఇష్టపడ్డారు నాన్న. అదే పోటీల్లో వేరే నాటకంలో నాన్న శ్రీకృష్ణదేవరాయలుగా నటించారు. ఒకరినొకరు ఇష్టపడ్డారు. దాంతో స్నేహితులంతా కలిసి వాళ్ల పెళ్లి జరిపించారు.

★ ★ ★

1972లో... రాజబాబుగారి పుట్టినరోజు సందర్భంగా డ్రామా(డాక్టర్ రాజారావు ఆర్ట్స్ మెమోరియల్ అసోసియేషన్) అనే సంస్థ తరఫున మద్రాసులో పెద్దఎత్తున ఒక కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఆ కార్య క్రమంలో నేను దుర్యోధనుడి మయసభ సీన్ ఏకపాత్రాభినయం చేశాను. ఆ క్యారెక్టర్ కోసం పెద్దపెద్ద సమాసాలతో ఉండే డైలాగులన్నీ అమ్మే నాకు నేర్పించింది. ఆ ప్రోగ్రామ్‌కి ఇండస్ట్రీలో పెద్దలందరూ వచ్చారు. నా ఏకపాత్రాభినయం చూసి ఎస్వీరంగారావు మెచ్చుకున్న సందర్భం నా జీవితంలో మర్చిపోలేని ఘట్టం.

★ ★ ★

నేను డబ్బింగ్ చెప్పిన తొలి సినిమా... 'సంసారం'. ఇప్పట్లాగా ఎవరి వెర్షన్ డబ్బింగ్ వాళ్లు చెప్పే వీలుండేది కాదు ఆ రోజుల్లో. లూప్‌సిస్టమ్‌లో చెప్పాల్సొచ్చేది. అంటే సీన్‌లో ఉన్న ఆర్టిస్టులందరూ కూర్చుని డబ్బింగ్ చెప్పాల్సిందే. వెళ్లి డబ్బింగ్ థియేటర్‌లో కూర్చున్నాను. అటువైపు ఎన్టీఆర్... ఇటువైపు జమున... మధ్యలో నేను.

ఆ సినిమాలో నటించిన మాస్టర్ శేఖర్‌కి (అతను తమిళబ్బాయి) నాతో డబ్బింగ్ చెప్పించారు. ఆరోజు నాకు బాగా గుర్తు... తన వెర్షన్ చూసుకుని 'రెడీయా' అని నా వైపు చూశారు ఎన్టీఆర్. నేను కూడా 'రెడీ' అన్నాను. ఒకే టేకులో డైలాగ్ ఓకే అయిపోయింది. డైలాగ్ చెప్పడం అయి పోయాక నన్ను దగ్గరికి పిలిచి... 'బాగా చెప్పావు, ఎవరబ్బాయివి' అని అడిగారు ఎన్టీఆర్. నేను చెప్పాను. 'ఓ, అయితే మనబ్బాయివే, వెరీగుడ్ వెరీగుడ్' అని భుజం తట్టారు. ఆరోజంతా ఆయనతోనే ఉన్నాను. అలా ఆ మహానటుడి ఆశీస్సులతో నా డబ్బింగ్ కెరీర్ స్టార్ట్ అయ్యింది. కొన్నాళ్ల తర్వాత... బాలనటుడిగా కూడా అవకాశాలు వచ్చాయి. చైల్డ్ ఆర్టిస్ట్‌గా నా తొలి సినిమా 'దేవుడు చేసిన పెళ్లి'. అందులో నాది గుడ్డివాడి పాత్ర. తర్వాత 'జేబుదొంగ' అనే సినిమాలో చేశాను. ఆ సినిమా దర్శకుడు విక్టరీ మధుసూదన్‌రావు. ఒక సీన్‌లో బాగా చేయలేదని నా చెంప పగలకొట్టారాయన.

## ఏకలవ్యశిష్యుణ్ని

చిన్నప్పటి నుంచీ నాకు శివాజీ గణేశన్ అంటే చాలా ఇష్టం. ఆయనకు నేను ఏకలవ్య శిష్యుణ్ని. ఇప్పటికీ మేకప్ వేసుకునేటప్పుడు ఆయన ఫొటో నా ఎదురుగా పెట్టు కుంటాను. ఆయన నటించిన సినిమాల కలెక్షన్ అంతా నా దగ్గరుంది.



తర్వాత రాజబాబుగారి 'మనిషి రోడ్డున పడ్డాడు', 'పెద్దన్నయ్య' లాంటి సినిమాల్లో చేశాను. ఆ సమయంలో నా కెరీర్‌లో మర్చిపోలేని అవకాశం బాపుగారి 'స్నేహం' సినిమా. బాపు, రమణ, సాలూరి రాజేశ్వరరావుగారు మేమూ అందరం తెనాలి పేటలో ఒకేచోట ఉండే వాళ్లం. అప్పట్లో మా ఇంట్లో టీవీ ఉండేది కాదు. ఆదివారం వచ్చిందంటే పిల్లలందరం సాలూరివారింట్లో చేరిపోయేవాళ్లం. ప్రతి ఆదివారం వాళ్లింట్లో పండగ వాతావరణం ఉండేది. రాజేశ్వరరావుగారికి నేనంటే చాలా ఇష్టం. ఆయన నన్నెప్పుడూ 'దుర్యోధనా, దుర్యోధనా' అని పిలిచేవారు.

★ ★ ★

'స్నేహం' తర్వాత నటుడిగానూ డబ్బింగ్ ఆర్టిస్ట్‌గానూ చాలా ఇబ్బంది పడ్డాను. టీనేజీలో కలిగే మార్పుల కారణంగా అటు బాలనటుడిగా పనికిరాను, ఇటు పెద్దపాత్రలకూ సరిపోను. దాంతో అమ్మమాట విని చదువుమీద శ్రద్ధ పెట్టాను. ఎస్సెల్సీ 58శాతం మార్కులొచ్చాయి. డిగ్రీలో బి.ఎ. పబ్లిక్ రిలేషన్స్‌లో చేరాను. తర్వాత ఎం.ఎ. పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్, అందులోనే ఎం.ఫిల్ కూడా చేశాను. ఆర్నెల్లపాటు తాత్కాలికంగా అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా చేశాను.

కాలేజీలో చదువుతున్నప్పుడే 'తరంగిణి'లో సుమన్ పాత్రకు డబ్బింగ్ చెప్పే అవకాశం వచ్చింది. ఆ సినిమా పెద్ద హిట్టు. దాని తర్వాత చెప్పిన 'పండంటికాపురానికి పన్నెండు సూత్రాలు' కూడా సూపర్‌హిట్టవడంతో సుమన్ అన్ని సినిమాల్లోనూ ఆయనకు డబ్బింగ్ చెప్పే అవకాశం నాకేవచ్చేది. దాంతోపాటే తమిళ సినిమాల్లోనూ వరసపెట్టి అవకాశాలు. రజనీకాంత్, విజయ్‌కాంత్, మమ్ముట్టి, మోహన్‌లాల్, సురేష్‌గోపీ, విష్ణువర్ధన్, అంబరీష్, దేవరాజ్... తమిళ్‌లోకి అనువదించిన తెలుగు సినిమాల్లో చిరంజీవి, బాలకృష్ణ సినిమాలకూ... అమితాబ్‌బచ్చన్‌కీ... ఇలా తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ, హిందీ భాషల సూపర్‌స్టార్లందరికీ డబ్బింగ్ చెప్పాను. ఒక్క కమల్‌హాసన్‌కి తప్ప. ఆయనకు



## కుటుంబం

ఇంటికి పెద్దకొడుకుని, నాకిద్దరు చెల్లెళ్లు... కమల, ప్రియ. ఇద్దరు తమ్ముళ్లు రవి, అయ్యప్ప అందరికీ తెలిసినవాళ్లే. నా భార్య పేరు... సురేఖ. తను నా మేనమామ కూతురే. మాకు ఇద్దరు పిల్లలు. అబ్బాయి ఆది, అమ్మాయి జ్యోతిర్మయి. మా అబ్బాయి నటన మీద ఆసక్తితో సినిమాల్లోకి వస్తానంటే సరేనన్నాను. విజయభాస్కర్ దర్శకత్వంలో 'ప్రేమకావాలి' సినిమాలో హీరోగా చేస్తున్నాడు. ఇక మా అమ్మాయి జ్యోతిర్మయి మెడిసిన్ చదువుతోంది.



నా స్వరం సరిపోదని నా ఫీలింగ్.

'వందేమాతరం'లో రాజశేఖర్‌కి నాతో పట్టుపట్టి డబ్బింగ్ చెప్పించారు టి.కృష్ణ. ఆ తర్వాత తలంబ్రాలు, అంకుశం, ఆహుతి, మగాడు... వరసపెట్టి రాజశేఖర్ సినిమాలు. అలా నేను హీరో అవడానికి ముందే నా వాయిస్ హీరో అయిపోయింది.

★ ★ ★

బాలనటుడిగా కెరీర్ ఫేడ్అవుట్ అయిపోయాక మళ్లీ నేను తెరమీద కనిపించిన సినిమా... 'చాలెంజ్'. అందులో వార్డ్‌బాయ్ పాత్ర. ఆసమయంలో పరుచూరి బ్రదర్స్ నన్నెంతగానో ప్రోత్సహించారు. వాళ్లు రాసే సినిమాల్లో నాకు మంచి క్యారెక్టర్లు ఇప్పించేవారు. ఆ క్రమంలో నటుడిగా నాకు పెద్ద బ్రేకిచ్చిన సినిమా 'కలికాలం'. అదే సినిమా కన్నడంలో 'కుంకుమభాగ్య' పేరుతో తీశారు. కన్నడలోనూ నా క్యారెక్టర్ నేనే చేశాను. ఆ తర్వాత నాకు మంచి క్యారెక్టర్లు వస్తాయనుకున్నాను కానీ రాలేదు. డబ్బింగ్ ఆర్టిస్ట్‌గా ముద్రపడిపోవడమే అందుకు కారణం అనేవారు నాన్న.

★ ★ ★

డబ్బింగ్‌లో రూ.500 స్థాయి నుంచి పాతికవేల స్థాయికి ఎదిగాను. నటన పరంగా మాత్రం పెద్దగా అవకాశాలు వచ్చేవి కావు. ఈ దశలో కన్నడంలో నాకో పెద్ద బ్రేక్ ఇచ్చాడు థ్రిల్లర్ మంజు. ఒకసారి తను నాకు 'పోలీస్‌స్టోరీ' కథ చెప్పాడు. ఆ కథ విన్నాక... 'అరే, మనమైతే భలే ఉండేది ఈ సినిమాలో హీరోగా' అనుకున్నాను. ఎందుకంటే ఆ సినిమాలో కథానాయకుడుగా ముందు నన్నుకోలేదు. కుమారగోవింద్ అనే కన్నడ హీరోని పెడదామనుకున్నారు. ఎందుకో కుదర్లేదు.

తర్వాత 'సర్కిల్ ఇన్‌స్పెక్టర్' అనే సినిమా షూటింగ్ జరుగుతున్నప్పుడు అందులో నేను చనిపోయే సీన్ తీస్తున్నారు. సాధారణంగా సినిమాల్లో ఏ పాత్రయినా చనిపోయే సీన్ తీస్తే, సీన్ అయిపోయాక కెమెరా ఒకసారి ఆఫ్ చేసి, మళ్లీ ఆన్ చేసి ఆ పాత్రధారిని లేవమని చెబుతారు. అప్పుడా ఆర్టిస్ట్ కెమెరా వంక చూసి ఒకసారి నవ్వి లేవాలి. అది తరతరాలుగా వస్తున్న సెంటిమెంటు. ఆరోజు నన్ను అలాగే లేవమన్నారు. లేస్తుంటే థ్రిల్లర్ మంజు నన్ను చూసి 'ఆర్టిస్ట్‌గా పాత సాయికుమార్ చచ్చిపోయాడు, కొత్త సాయికుమార్ పుడుతున్నాడు' అన్నాడు. నేను లేవగానే 'నీకో బ్యాడ్‌న్యూస్... పోలీస్ స్టోరీలో నువ్వే హీరోవి' అన్నాడు. ప్రాక్టికల్ జోక్ అనుకున్నాన్నేను. కానీ కాదు, నిజమే!

ఆ సినిమా ఎంత చరిత్ర సృష్టించిందో అందరికీ తెలిసిందే.

ఆ తర్వాత ఎన్ని సినిమాలు చేసినా 'పోలీస్‌స్టోరీ' ప్రభావం ప్రేక్షకుల మీద అలా ఉండిపోయింది. ఇటీవలి కాలంలో ఆ ఇమేజ్‌ని బ్రేక్ చేసి నాకు మంచిపేరు తెచ్చిపెట్టిన చిత్రాలు... సామాన్యుడు, ప్రస్థానం. సామాన్యుడు సినిమాలో నా పాత్రకు నంది పురస్కారం కూడా వచ్చింది.

★ ★ ★

బుల్లితెర మీద కనిపించడం నాకు కొత్తకాదు. దూరదర్శన్ తెలుగు ప్రసారాలు ప్రారంభమైన కొత్తల్లోనే కొన్ని టెలీఫిలిమ్స్ లోనూ మర్యాదరామన్న వంటి సీరియళ్ల లోనూ నటించాను. చోటా.కె.నాయుడు వంటివారంతా అక్కడే పరిచయం నాకు. ఇటీవలి కాలంలో నా మిత్రుడు సోనోపిక్స్ ప్రసాద్ అడగడంతో ఈటీవీలో 'వావ్' ప్రోగ్రాం చేశాను. అదేసమయంలో జెమినీలో 'డీల్ ఆర్ నో డీల్' అనే షో కూడా చేశాను. బుల్లితెర పుణ్యమాని కుటుంబ ప్రేక్షకులకు ఇంకా దగ్గరయ్యాను.

★ ★ ★

మా అమ్మ పుట్టినూరు బాగేపల్లి. అప్పుడప్పుడూ నాతో... 'యాభయ్యేళ్లయినా బాగేపల్లిలో మార్పులేదురా, ఎప్పటికయినా ఆ ఊరు బాగుపడితే చూడాలని ఉంది' అనేది అమ్మ. ఆ కోరిక తీర్చేందుకే రాజకీయాల్లోకి అడుగు పెట్టాను. బాగేపల్లి నియోజకవర్గం నుంచి భారతీయజనతాపార్టీ తరఫున ఎన్నికల్లో పోటీచేశాను. దురదృష్టవశాత్తూ మూడువేల ఓట్ల తేడాతో ఓడిపోయాను. మళ్లీ ఇంకోసారి పోటీ చేసయినా అమ్మ కోరిక తీరుస్తాను. అలాగే... సినీపరిశ్రమలోకి వచ్చి తాను సాధించాలనుకున్నదానిలో 50 శాతమే సాధించగలిగారు మా నాన్న. నేను 75 శాతం సాధించాననుకుంటున్నా. త్వరలో హీరోగా తెరంగేట్రం చేయబోతున్న మా అబ్బాయి మా నాన్న కోరికను తీరుస్తాడని ఆశిస్తున్నా! ★

# పని(నేర్చిన) మనుషులు!




**ఉద్యోగావకాశాలు పెరుగుతున్నాయి. మహిళల్లోనూ ఉద్యోగాలు చేసేవాళ్లు పెరుగుతున్నారు. ఆదాయాలూ పెరుగుతున్నాయి. మరి, స్త్రీలు ఉద్యోగాలు చేస్తూ ఇంటిపనీ చేయాలంటే... చాలా కష్టం. ఫలితంగా ఇటీవలికాలంలో పనిమనుషులకు గిరాకీ ఏర్పడింది. అందుకే అక్కడ అన్ని పనులూ నేర్పించి సరికొత్త పనిమనుషులను తీర్చిదిద్దుతున్నారు.**

పనిమనుషుల మీద ఫిర్యాదు చేయని గృహిణులు ఉంటారా?

దాదాపుగా ఉండరనే చెప్పాలి. అంట్లు సరిగ్గా తోమలేదనో బట్టలు బాగా ఉతకలేదనో ఇల్లు సరిగ్గా ఊడ్వలేదనో... ఇలా ఏదో ఒక ఫిర్యాదు చేస్తుంటారు. వాళ్లతో పోట్లాడతారు. వాళ్లు మానేస్తే కొత్తవాళ్లు దొరకరన్న భయంతో రాజీపడతారు.

పట్టణాల్లో పనిమనుషులకున్న డిమాండ్ అంతా ఇంతా కాదు. భార్యాభర్తలిద్దరూ ఉద్యోగస్తులయితే పనిమనిషికి రెండుమూడు వేల రూపాయలకుపైగా ఇవ్వడానికి కూడా సిద్ధపడుతున్నారు. మరి, అంత ఖర్చుపెట్టి కూడా వాళ్లు పనులు సరిగ్గా చేయకపోతే ఎలా ఉంటుంది?

ఇలాంటి వాళ్ల సమస్యలు తీర్చేందుకే సరికొత్త పని మనుషులను తయారుచేస్తోంది గుజరాత్‌లోని 'నిర్మల్ ఫౌండేషన్'.

### ఐఐఎమ్ విద్యార్థి ఆలోచన!

వినూత్నమైన ఆలోచన ఉందంటే... దానివెనుక ఓ మేధావి ఉంటారు కదా! ఆయన పేరు నిర్మల్... బీహార్‌లోని శివాన్ గ్రామానికి చెందిన వికలాంగుడు! నిరుపేద కుటుంబంలో పుట్టిన నిర్మల్ హైదరాబాద్‌లోని ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయంలో బీటెక్ చేశారు. తరవాత ఐఐఎమ్ - అహ్మదాబాద్‌లో సీటు సంపాదించారు. అక్కడి నుంచి బయటికొచ్చాక 'నిర్మల్ ఫౌండేషన్' ఏర్పాటుచేశారు. దాని ద్వారా 'జి-ఆటోలు' వ్యాపారానికి శ్రీకారం చుట్టారు. వీటిలో డస్ట్‌బిన్లు, ఎఫ్ఎమ్ రేడియో, మినరల్ వాటర్, వార్తాపత్రికలు, మ్యాగజైన్లు, సిటీలోని పర్యాటక ప్రదేశాల వివరాలు ఉంటాయి. ఆటోడ్రైవర్లకు ఇంగ్లిష్ మాట్లాడటమూ నేర్పించారు. అంతేకాదు... డ్రైవర్లకు బీమా, ప్రమాదాలు జరిగితే వైద్యబీమా, పెన్షన్‌లాంటి సదుపాయాలూ ఉంటాయి. ఆటోలు విజయవంతం కావడంతో 'నిర్మల్ ఉమీద్' పేరిట పనిమనుషుల శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించారు.

### మూడునెలల శిక్షణ!

'పనిమనుషులంటే హీనంగా చూస్తారు కొంతమంది. కానీ, అదీ గౌరవప్రదమైన వృత్తే. అందుకే దానికి మరింత గౌరవం తెచ్చేందుకు మేం శిక్షణ ఇస్తున్నాం. దీన్ని అహ్మదాబాద్ మున్సిపల్ కార్పొరేషన్, గుజరాత్ ప్రభుత్వం, కొన్ని స్వచ్ఛంద సంస్థల సహకారంతో నిర్వహిస్తున్నాం. ఇందులో ప్రతి అభ్యర్థికీ మూడు నెలల శిక్షణ ఉంటుంది. 18-35 ఏళ్ల వయసున్న యువతీయువకులు ఎవరైనా ఇందులో చేరొచ్చు' అంటారు నిర్మల్. మామూలుగా పనిమనుషులు చేసే పనులు... అంట్లు తోమడం, బట్టలు ఉతకడం, ఇల్లు తుడవడం. 'ఉమీద్' శిక్షణ కేంద్రంలో ఈ మూడింటినీ చక్కగా చేయడం ఎలాగో నేర్పిస్తారు. అంట్లు తోమడం, బట్టలు ఉతకడం విషయాలనే తీసుకుంటే... వేటితో మురికి బాగా వదులుతుంది, చేతులకు హాని చేయనివేవి లాంటి అంశాలన్నీ చెబుతారు.

### సరికొత్త సేవలు

"అందరు పనిమనుషులూ చేసే పనులే వీళ్లూ చేస్తే 'నిర్మల్ ఉమీద్' గొప్పదనం ఏముంది? అందుకే మా విద్యార్థుల్ని కొన్ని సరికొత్త సేవలు కూడా అందించేలా తీర్చిదిద్దుతాం" అంటారు నిర్మల్. అవును, ఉమీద్‌లో శిక్షణ పొందేవాళ్లకు ఇంకా చాలా విషయాలు నేర్పుతారు. ఇంట్లో వాషింగ్ మెషీన్, మైక్రోవేవ్ ఓవెన్, వాక్యూమ్ క్లీనర్లలాంటి వాటిని ఎలా ఉపయోగించాలో చెబుతారు.

భార్యాభర్తలు ఉద్యోగాలకు వెళ్లిపోయి పెద్దవాళ్లూ పిల్లలూ ఉంటే వాళ్ల బాగోగులు ఉమీద్ పనిమనుషులే చూసుకుంటారు. వాళ్లు సమయానికి భోంచేసేలా, మాత్రలు వేసుకునేలా చూస్తారు.

ఒకవేళ పిల్లల్ని స్కూలు వరకూ తీసుకెళ్లి, సాయంత్రం తీసుకురావాలన్నా వాళ్లకు చెబితే చాలు! మార్కెట్‌కు వెళ్లి ఏదయినా తీసుకురావాలన్నా అత్యవసరంగా ఇంట్లో పెద్దవాళ్లనూ లేదా పిల్లల్నీ ఆసుపత్రికి తీసుకెళ్లాలన్నా వాళ్లే కారు లేదా బైక్‌ని డ్రైవ్ చేసి తీసుకెళ్తారు. ఇందుకోసం వీరికి డ్రైవింగ్‌లో శిక్షణ ఇచ్చేందుకు మారుతి సుజుకి డ్రైవింగ్ స్కూలు ముందుకొచ్చింది. ఇక్కడ వీరికి ఇంగ్లిష్ కూడా నేర్పుతారు. ఇంట్లోని కంప్యూటర్ నుంచి ఈమెయిల్ పంపగలిగేలా తీర్చిదిద్దుతారు. ఏ పనయినా చక్కగా చేయడం, ఇంటిలోని ప్రతిగదినీ వస్తువునూ పరిశుభ్రంగా ఉంచడం వీరికి నేర్పే మొదటి అంశం.

### రాకపోయినా... బాగాలేకపోయినా...

సాధారణంగా పనిమనుషులు చెప్పకుండానే సెలవులు తీసేసుకుంటుంటారు. కానీ, వీళ్లు అలా కాదు... ఒకవేళ ఎవరైనా ఆ రోజు పనికి రాలేకపోతే వారిస్థానే మరొకర్ని పంపుతుంది నిర్మల్ ఫౌండేషన్.

'ఇన్ని పనులు, పరిశుభ్రంగా చేసేవాళ్లుంటే ఇంకేం కావాలి' అనుకుంటున్నారా?

ఇన్ని చేసినా, ఇంకా మీకు నచ్చకపోయినా, వారి పనుల్లో లోటుపాట్లు కనిపించినా, మీకు వాళ్లపై నమ్మకం కుదరకపోయినా 'వీళ్లు బాగా చేయడంలేదు' అని నిర్మల్ ఫౌండేషన్‌కు ఫిర్యాదు చేయవచ్చు. వెంటనే మీ ఇంటికి మరో కొత్త పనిమనిషిని పంపుతారు.

'మా కేంద్రంలో చేరాలనుకునేవారు రూ.500 ఫీజు కడితే చాలు. మూడు నెలల శిక్షణ తరవాత వాళ్లకు మేమే ఉద్యోగమిస్తాం. ప్రస్తుతం 17 మందికి శిక్షణ ఇస్తున్నాం. ముందుముందు కొన్నివందలమందికి ఇస్తాం. దేశంలో ఈ తరహా కేంద్రం ఇదొక్కటే' అని గర్వంగా చెబుతారు నిర్మల్.

గ్రూప్, సివిల్స్ పరీక్షలకు విద్యార్థులను సంసిద్ధుల్ని చేసి పంపినట్లు పనిమనుషుల్నీ తయారుచేయడం అనే ఆలోచనే వినూత్నంగా లేదూ! ★






శ్రద్ధగా చేయండి... ప్రసంగిస్తున్న నిర్మల్



# అనప... ఎంతో రుచి!



**అనపకాయలు... వీటినే రాయలసీమవాసులు అనుములు అనీ పిలుస్తారు. ఎందుకంటే అక్కడే వీటిని ఎక్కువగా పండిస్తుంటారు. అయితే ఎక్కడ పండించినా ఎండిన అనుములు మాత్రం అంతటా దొరుకుతాయి. ఎందుకంటే నవధాన్యాల్లో ఇవీ ఒకటి. కానీ బఠాణీ మాదిరిగానే పచ్చివి మాత్రం ఈ సీజన్‌లోనే దొరుకుతాయి. వీటితో ఏది వండినా రుచి అమోఘం... అద్భుతమైన పోషకాహారం కూడా. మరి మీరూ ట్రై చేయండి...**






## కావలసినవి

అనపగింజలు: కప్పు, దనియాలు: 2 టీస్పూన్లు, సెనగపప్పు: టీస్పూను, మినప్పప్పు: టీస్పూను, బియ్యం: అర టీస్పూను, ఎండుమిర్చి: 5, దాల్చినచెక్క: చిన్నముక్క, కొబ్బరిపొడి: టీస్పూను

## తయారుచేసే విధానం

★ ముందుగా అనపగింజల్లో కొద్దిగా నీళ్లు పోసి మూతపెట్టి ఐదు నిమిషాలు ఉడికించాలి.

★ మందపాటి కళాయిలో దనియాలు, సెనగపప్పు, మినప్పప్పు, బియ్యం, ఎండుమిర్చి, దాల్చినచెక్క వేసి వేయించాలి.

★ తరవాత వీటికి కొబ్బరిపొడి కూడా చేర్చి మిక్సీలో వేసి మెత్తని పొడిలా చేయాలి.

★ ఇప్పుడు ఉడికించిన అనపగింజల్లో మసాలాపొడి వేసి సరిపడా ఉప్పు, తగినన్ని నీళ్లు పోసి 5 నిమిషాలు ఉడికించాలి. చివరగా తాలింపు చేసి కొత్తిమీర చల్లి వడ్డించాలి. ఇది అన్నంలోకీ రొట్టెల్లోకీ కూడా చాలా బాగుంటుంది.




## కావలసినవి

అనపగింజలు(పితికిన పప్పు): కప్పు, వేరుసెనగపప్పు: పావుకప్పు, వేయించిన సెనగపప్పు: పావుకప్పు, ఉప్పు: సరిపడా, కారం: అర టీస్పూను, నూనె: తగినంత

## తయారుచేసే విధానం

★ ఒలిచిన గింజలను రెండుగంటలపాటు నీళ్లలో నానబెట్టాలి. తరవాత నీళ్లు వంపేసి గింజలను ప్లేటులో వేసి చేత్తో వత్తాలి. అప్పుడు గింజలమీద ఉన్న పై పొట్టు పోయి పప్పు వస్తుంది. దీన్నే పితికిన పప్పు అంటారు. ఈ పప్పుని తడి ఆరకుండానే గుంటలా ఉన్న చిల్లుల గరిటెలో వేసుకుని నూనెలో వేయించి తీయాలి. బాణలిలో నేరుగా వేయకూడదు. గరిటెలో ఉంచే వేయించాలి. బాగా వేగిన తరవాత అవి పైకి తేలతాయి. అప్పుడు గరిటె పైకి తీసి గింజల్ని ఓ గిన్నెలో వేసుకోవాలి. ఇలాగే మొత్తం పప్పు వేయించుకోవాలి.

★ తరవాత బాణలిలో నూనె అంతా తీసేసి కొద్దిగా మాత్రం ఉంచి వేరుసెనగపప్పు వేయించి తీసి, వేయించిన అనపపప్పులో కలపాలి. వేడి తగ్గకుండానే ఉప్పు, కారం, వేయించిన సెనగపప్పు కూడా వేసి కలపాలి. చల్లారిన తరవాత సీసాలో పోసి నిల్వ చేస్తే 15 రోజులవరకూ నిల్వ ఉంటాయి. ఇది పిల్లలు ఎంతో ఇష్టంగా తింటారు.




## కావలసినవి

అనపగింజలు: కప్పు, పచ్చిమిర్చి: 4, ఉప్పు: తగినంత, కరివేపాకు: 4 రెబ్బలు, కొత్తిమీర: కట్ట, నూనె: వేయించడానికి సరిపడా

## తయారుచేసే విధానం

★ పచ్చిగింజలను మిక్సీలో వేసి మెత్తగా రుబ్బుకోవాలి. తరవాత అందులో పచ్చిమిర్చి, ఉప్పు, సన్నగా తరిగిన కరివేపాకు, కొత్తిమీర వేసి ముద్దలా కలపాలి.

★ దీన్ని చిన్న ముద్దలుగా చేసుకుని ప్లాస్టిక్‌కవర్ మీద చిన్న వడల్లా ఒత్తి కాగిన నూనెలో కరకరలాడే వరకూ వేయించి తీయాలి. ఇష్టమయితే ఈ పిండిలో కాస్త బియ్యప్పిండి కూడా కలుపుకోవచ్చు.




## కావలసినవి

లేతగింజలు: అరకప్పు, బియ్యప్పిండి: కప్పు, పచ్చిమిర్చి ముక్కలు: 2 టీస్పూన్లు, ఉప్పు: తగినంత, నూనె: సరిపడా, కొత్తిమీర: కొద్దిగా

## తయారుచేసే విధానం

★ బియ్యప్పిండిలో గింజలు, పచ్చిమిర్చిముక్కలు, ఉప్పు, కొత్తిమీర వేసి కలపాలి.

★ తరవాత తగినన్ని నీళ్లు పోసి ముద్దలా చేయాలి. దీన్ని పెనం మధ్యలో పెట్టి చేత్తో రొట్టెలా వత్తాలి.

★ తరవాత చుట్టూతా నూనె వేసి రెండువైపులా కాల్చి తీయాలి. ఇది మంచి బ్రేక్‌ఫాస్ట్ కూడా.

★ బియ్యప్పిండికి బదులు రాగిపిండి, జొన్నపిండి కూడా కలుపుకోవచ్చు.



– కె.వనజ, హైదరాబాద్

# బాల వినోదిని



## గుర్తుందా?



**ఈ** బొమ్మను నిమిషంపాటు జాగ్రత్తగా గమనించి తర్వాత దీనిపై ఏదైనా అడ్డుపెట్టి కింది ప్రశ్నలకు జవాబులు చెప్పండి.

1. ఎన్ని ఎరుపు రంగు నక్షత్రాలు ఉన్నాయి?
2. ఎన్ని ఎరుపు రంగు వృత్తాలున్నాయి?
3. నీలం రంగులో ఉన్న చదరం, వృత్తం, నక్షత్రాలు ఎన్నో చెప్పండి.
4. ఎరుపు రంగు వృత్తం ఏ రంగు చదరంలో ఉంది?




## వరుస చెప్పండి

**ఇ**క్కడ ఉన్న ఆరు బొమ్మల్ని అవి జరిగిన సమయాన్నిబట్టి వరుసలో అమర్చండి.




## ఒంటరి



**వీ**టిలో ఒకటి తప్ప ప్రతి ఆకారం రెండేసి సార్లు ఉంది. ఒక్కటే ఉన్న ఆ ఆకారం ఏమిటి?

## పదకేళి

**ప**క్కనున్న బొమ్మల ఆధారంగా గళ్లను నింపండి.

అడ్డం




| | | | | | | |
|---|---|---|---|---|---|---|
| 1 | | 2 | | ★ | 3 | 4 |
| | ★ | | ★ | 5 | ★ | |
| 6 | 7 | ★ | 8 | | 9 | ★ |
| ★ | 10 | | ★ | ★ | | ★ |
| ★ | ★ | ★ | 11 | | ★ | 12 |
| 13 | ★ | 14 | ★ | ★ | 15 | |
| 16 | | | | ★ | | ★ |




నిలువు




## తేడాలేంటి?

**ఈ** రెండు బొమ్మల మధ్య తొమ్మిది తేడాలు చెప్పండి.





# మాటకారి

మదనపల్లెలో సోమలింగం అనే వ్యక్తి ఉండేవాడు. తన అతి తెలివితేటలు, మాటకారితనంతో ఎదుటివారిని ఆటపట్టించడమే పనిగా పెట్టుకొనేవాడతడు. ఓరోజు పొరుగు వీధికి చెందిన రామలింగం పనిమీద సోమలింగం ఉండే వీధికి వచ్చాడు. సోమలింగంతో పరిచయం ఉండటంవల్ల ఓసారి పలకరించి వెళ్దామని అతడి ఇంటికి వెళ్లాడు. ఇంటి దగ్గరే ఉన్న సోమలింగం మిత్రుణ్ని ఆప్యాయంగా పలకరిస్తూ 'రా మిత్రమా చాలా రోజులైంది నిన్ను చూసి. ఎలా ఉన్నావు. ఏం తీసుకుంటావు' అని అడిగాడు.

'మంచి నీళ్లు ఇవ్వు చాలు' అన్నాడు రామలింగం.

'మిత్రుడివి, నీకు నీళ్లతో సరిపెడతానా ఏమిటి' అన్నాడు సోమలింగం.

'సరే టీ, కాఫీ అయినా ఫర్వాలేదు' అన్నాడు రామలింగం.

'టీ, కాఫీలా... ఇంట్లో పాలు లేవే' బదులిచ్చాడు సోమలింగం.

'మజ్జిగ ఉన్నా చాలు' అడిగాడు రామలింగం.

'మజ్జిగ ఉదయాన్నే అయిపోయింది' అని చెప్పి, 'నీకు నీళ్లు కలిపిన పదార్థాలు ఇష్టంలా ఉన్నాయి. మరెందుకు నీళ్లే తీసుకో' అని గ్లాసుతో నీళ్లిచ్చాడు. అసలు నీళ్లు ఇవ్వాలనేదే సోమలింగం ఉద్దేశం. కానీ తన తెలివి చూపించడానికి స్నేహితుడితో అలా మాట్లాడాడు.



కొద్దిరోజుల తర్వాత రామలింగం ఇంటికి సోమలింగం వెళ్లాడు. మిత్రుడు కనిపించగానే ఆప్యాయంగా పలకరించాడు రామలింగం. 'ఏం తీసుకుంటావ'ని అడిగాడు.

'మీ ఇంట్లో పులిహోర బావుంటుందని విన్నాను' చెప్పాడు సోమలింగం.

'కానీ పులిహోర ఉదయాన్నే అయిపోయింది' అన్నాడు రామలింగం.

'పలావు ఏమైనా చేశారా'

'పలావు ఈరోజు చేయలేదండి. మీ మాటల్ని బట్టి మీకు బియ్యంతో చేసిన ఏ పదార్థమైనా నచ్చేలా ఉంది. మరెందుకు అన్నమే తినండి' అని చెప్పి, వట్టి అన్నం పెట్టాడు రామలింగం. వట్టి అన్నం తినలేక అయోమయంగా చూస్తూ కూర్చున్నాడు సోమలింగం. గతంలో తాను ప్రవర్తించిన తీరు గుర్తువచ్చింది. స్నేహితుడి ముఖంలో పశ్చాత్తాపాన్ని గమనించిన రామలింగం... తర్వాత పప్పు, కూర, పెరుగు కూడా పెట్టాడు. ఆరోజు నుంచి తన ప్రవర్తనను మార్చుకున్నాడు సోమలింగం.

# ఆ ఒక్కటీ

వీటిలో ఒకటి మాత్రం మిగిలిన వాటికి భిన్నంగా ఉంది. అదేమిటో చెప్పండి.




# దారి కనుక్కోండి

దిగువ వరుసలోని ఏదైనా ఒక అంకె నుంచి బయలుదేరి పైకి చేరుకోవాలి. మీ ప్రతి అడుగు ముందు గడికంటే పెద్ద అంకె ఉన్న గడిలోకే వేయాలి.




# రంగులేద్దాం

చుక్కలున్న భాగాల్ని నీలం రంగుతో నింపండి.



## జవాబులు

**గుర్తుందా?:** 1. రెండు 2. ఒకటి 3. మూడు 4. నీలం.

**ఒంటరి:** ఎడమవైపు దిగువనున్న పాళీ.

**ఆ ఒక్కటీ:** E.

**వరుస చెప్పండి:** 4, 6, 5, 1, 3, 2.

**పదకేళి:** అడ్డం: 1. పంచదార 3. పాము 6. రంపం 8. గొడుగు 10. దివ్వె 11. సుత్తి 15. తేలు 16. పచ్చగడ్డి. నిలువు: 1. పంజరం 2. దారం 4. ముల్లు 5. తాడు 7. పంది 9. గుడ్డు 12. పాలు 13. చేప 14. ఈగ 15. తేనె.

**తేడాలేంటి?:** 1. ఎడమచివర పాప డ్రెస్ చేతి పొడవు, మెళ్లో లాకెట్ 2. నల్లచొక్కా అబ్బాయి ప్యాంటు జేబు జిప్, హెయిర్‌స్టైల్ 3. రెండో అమ్మాయి హెయిర్‌బాండ్ 4. రెండో అబ్బాయి టీషర్ట్ మీద అక్షరాలు 5. నల్లడ్రెస్ అమ్మాయి ప్యాంటు పొడవు, టాప్ మీద చారలు 6. కుడిచివర అబ్బాయి కళ్ళజోడు.

పచ్చని పర్వతాలకీ సుందర సముద్రతీరాలకీ సహజవనరులకీ ఆకాశ వింతలకీ నార్వే పెట్టిందిపేరు. అందునా ఉత్తరార్ధగోళం చివర ఉన్న ఆ దేశంలో విహరిస్తే ఆర్కిటిక్ తీరంలో ఉన్నట్లుంటుంది అంటున్నారు గుంటూరు నివాసి డా.చంద్రమౌళి నాగభైరవ.

# అర్ధరాత్రి సూర్యుణ్ని చూసొచ్చాం!



మా పెద్దబ్బాయి రవిచంద్ర 1998నుంచీ నార్వేలో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పని చేస్తున్నాడు. మా మనవరాలు నేహా అక్కడే పుట్టడంతో నార్వే బయలుదేరక తప్పలేదు. హైదరాబాద్ నుంచి ఆమ్‌స్టర్‌డామ్ మీదుగా ఓస్లోకి ప్రయాణమయ్యాం. సాయంత్రం నాలుగున్నర గంటలకి గార్డెర్‌మోయిన్ విమానాశ్రయంలో దిగి ఇంటికి వెళ్లాం. నార్వే రాజధాని నగరమైన ఓస్లోలో ఉన్న భారతీయ కుటుంబాలన్నీ తరచూ కలుసుకుంటుంటాయి. అలా మా కుటుంబానికి సన్నిహితులైన సుజాఖాన్ కుటుంబంతో కలిసి ఓ వారాంతంలో కారులో స్వీడన్‌కు బయలుదేరాం. ఎందుకంటే నార్వేజియన్లు అంతా సరిహద్దు దాటి స్వీడన్ దేశంలోనే ఎక్కువగా షాపింగ్ చేస్తుంటారు. అక్కడ వస్తువులన్నీ చౌక. చికెన్, మటన్, హాట్ సాఫ్ట్ డ్రింక్స్ కొంటుంటారు. మేం కూడా మాకు కావలసినవన్నీ కొనుక్కున్నాం.



ట్రామ్‌సోలో అర్ధరాత్రి సూర్యుడు!



నీలాకాశంలో వర్ణచిత్రం!!



చలికాలపు నీలివెలుతురులో ట్రామ్‌సో...

## ఖరీదైన నగరం!

ఓస్లోలో జీవనవ్యయం చాలా ఎక్కువ. నార్వే కరెన్సీ క్రొనాల్. మన కరెన్సీలో 8.25 రూపాయల విలువ చేస్తుంది. సిటీబస్సులో అతి తక్కువ చార్జీ అంటే 20 క్రొనార్లు... అంటే సుమారు 165 రూపాయలు. ఒక్క పుచ్చకాయ ముక్క 100 రూపాయలు. టాక్స్ 33 శాతం. అందుకే ఆ నగరం అనేకసార్లు ఖరీదైన నగరంగా రికార్డుల్లో కెక్కింది.

దేశ జనాభా సుమారు 47 లక్షలు. నార్వేజియన్లు ఎంతో స్నేహితంగా ఉంటారు. నేరాలసంఖ్య చాలా తక్కువ. అక్కడ ఉన్న మూడునెలల్లో ఒక్క పోలీసుని కూడా చూడలేదు. తమ సంస్కృతీ సంప్రదాయాలన్నా సంగీతమన్నా ప్రాణమిస్తారు. అందుకే వాళ్ల పండగలన్నీ సంగీత ప్రధానమైనవే. ఫుట్‌బాల్‌ప్రియులు. ఉత్తర ఐరోపాలోని స్కాండినేవియన్ దేశాల్లో ఒకటైన నార్వేలో ఉన్నంత విస్తృతమైన మెట్రో రైలు వ్యవస్థ ప్రపంచంలో మరెక్కడా లేదు. అంతేకాదు... ప్రపంచంలో ఎవ్వరికీ అప్పులేని దేశం కూడా ఇదే. ఇలా చెప్పుకుంటూపోతే నార్వేకెన్నో ప్రత్యేకతలు.

మేం అక్కడికి వెళ్లి ఈ వింతలన్నీ చూస్తుండగానే రెండు నెలలు ఇట్టే గడిచి పోయాయి. ఈలోగా మేం ఎదురుచూస్తోన్న జూన్ 21 రానే వచ్చింది. ఏడాదిలో అతిపెద్ద పగటిరోజుకీ అర్ధరాత్రి సూర్యుడికీ ఈ దేశం ప్రాచుర్యంపొందడం తెలిసిందే. ఈ అద్భుత దృశ్యాన్ని చూసేందుకే ఆరోజున అంతా ఉత్తర భాగంలో ఉన్న ట్రామ్‌సో పట్టణానికి చేరుకుంటారు. ఆరోజు 'ట్రామ్‌సో'లో మిడ్‌నైట్ సన్ మారథాన్ పోటీలు నిర్వహిస్తారు.

## తూర్పు పారిస్!

ట్రామ్‌సో పట్టణ వైశాల్యం సుమారు 22 చదరపు కిలోమీటర్లు మాత్రమే. ఇది ట్రామ్‌సోయా అనే దీవిలో ఆర్కిటిక్ వృత్తరేఖ లోపల ఉంది. జనాభా 53 వేలు. ప్రపంచంలో చేపలు పట్టే అతి పెద్ద గ్రామం అనీ ఆర్కిటిక్ ముఖద్వారమనీ తూర్పు పారిస్ అనీ ఇలా ఈ పట్టణానికి చాలానే పేర్లున్నాయి. ఉత్తరార్ధ గోళానికి సమీపంలో ఉన్న ఒకే ఒక విశ్వ విద్యాలయం ఈ దీవిలోనే ఉంది. చెక్కతో కట్టిన కెథెడ్రల్ కూడా ఇక్కడే ఉంది. పాత కాలంనాటి చెక్కఇళ్లనూ ఇక్కడ చూడొచ్చు.

ఈ ట్రామ్‌సోయా దీవి చుట్టూ ఎత్తైన కొండలు ఉన్నాయి. ఈ దీవిని దేశంలోని



పోలారియం మ్యూజియం

ప్రధాన భూభాగానికి కలుపుతూ ఓ వంతెన ఉంటుంది. దీవి మధ్యలోని చిన్న కొండను తొలిచి నలువైపులకూ రోడ్లు వేశారు. దీనివల్ల దూరం తగ్గడంతో శీతాకాలంలో మంచు సరస్సుమీద ప్రయాణం చేయాల్సిన అవసరం తప్పింది. జూన్ 20వ తేదీనే మొత్తం పదిమంది సభ్యులం కలిసి గార్డెర్‌మోయిన్ విమానాశ్రయంలో బయలుదేరి ట్రామ్‌సోకి చేరుకున్నాం. అద్దె వాహనంలో ముందుగానే బుక్ చేసుకున్న ట్రామ్‌స్‌డేలన్ క్యాంపింగ్ హోటల్‌లోని కాటేజీలకు చేరుకున్నాం. సరిగ్గా పావుగంటలోనే రిఫ్రెష్ అయి కేబుల్‌కారులో కొండపైకి చేరుకున్నాం. ఇక్కడికొచ్చే వాళ్లంతా ఈ దీవిని మొత్తంగా చూసేందుకు ఈ కొండ మీదకి వెళ్లి అక్కడ నుంచి ఫొటోలు తీసుకుంటారు. మేం కూడా ఫొటోలు తీసుకుని మళ్లీ కిందకి వచ్చి సిటీబస్ ఎక్కి పట్టణంలోని ప్రధాన కూడలికి వెళ్లాం. అక్కడ పిజ్జా పేరుతో ఉన్న ఓ రెస్టారెంట్‌లో లంచ్ పూర్తిచేశామనిపించి పక్కనే ఉన్న ప్రొవిజనల్ షాపునకు వెళ్లాం. వంట చేసుకోవడానికి అవసరమైనవన్నీ కొనుక్కున్నాం. ఇక్కడ కాటేజీల్లో అన్ని సౌకర్యాలూ ఉన్న కిచెన్ కూడా ఉంటుంది. సాయంత్రం 5 గంటలకు మళ్లీ బయలుదేరి పట్టణం ప్రధాన కూడలికి చేరి అక్కడ ఉన్న ప్రదేశాలన్నీ చూశాం. ముఖ్యంగా చెప్పుకోదగ్గది పోలార్ మ్యూజియం. 1830వ సంవత్సరంలో ఓ గిడ్డంగిలో దీన్ని నెలకొల్పారట. ఇందులో ధ్రువ యాత్రికులు, వేటగాళ్ల గురించి ఆసక్తికరమైన విషయాలన్నీ ఉంటాయి. రాత్రి పది గంటలకు తిరిగివచ్చాం. వెలుతురు ఏ మాత్రం తగ్గలేదు. కర్టెన్లన్నీ వేసి నిద్రకు ఉపక్రమించాం. అప్పటికీ సూర్యుడు కనిపిస్తూనే ఉన్నాడు.

## అర్ధరాత్రి సూర్యుడు!

ఉత్తరార్ధంలోని చివరి అక్షాంశానికి పైభాగంలో ట్రామ్‌సో ఉండటంతో ఏప్రిల్ నుంచి ఆగస్టు వరకూ అక్కడ పూర్తి చీకటి అంటూ ఉండదు. అంటే దీర్ఘపగళ్లన్నమాట. మే 18 నుంచి జులై 26 వరకూ అర్ధరాత్రి కూడా సూర్యుడు కనిపిస్తూనే ఉంటాడు. 26 నవంబరు నుంచి 15 జనవరి వరకూ సూర్యుడు భూతలంకన్నా కిందకి దిగిపోవడంతో రాత్రులు కూడా సుదీర్ఘంగానే ఉంటాయి. అందునా ఉత్తర భాగంలో ఉన్న కొండల కారణంగా ఆ కాలంలో అస్సలు సూర్యుడే కనిపించడు. అడపాదడపా ఎప్పుడయినా కాస్త వెలుతురు కనిపిస్తే పండగే. చలికాలం మధ్యలో కొద్దిగంటలపాటు మాత్రమే వచ్చే ఆ వెలుతురు కూడా నీలిరంగులో ఎంతో అందంగా ఉంటుందట. ఫిబ్రవరి 21 తరవాత మళ్లీ సూర్యుడు భూఉపరితలంకన్నా పైకి రావడంతో మెల్లమెల్లగా పగటివేళలు పెరిగి ఏప్రిల్‌కి పెద్దవవుతాయి. జూన్ 21 నాటికి సుదీర్ఘంగా మారుతుందన్నమాట. దీన్ని చూడటానికి ట్రామ్‌సో మంచి వేదిక. అందుకే మేం ఈ కాలంలో టూర్ పెట్టుకున్నాం.

మర్నాడు ఉదయం బ్రేక్‌ఫాస్ట్ చేసి మళ్లీ పట్టణంలో విహరించాం. మిడ్‌నైట్ సన్ మారథాన్‌కి పేర్లు నమోదు చేసుకుని కాటేజీకి వచ్చి వంట చేసుకుని తిని కాసేపు విశ్రాంతి తీసుకుని సాయంత్రం పట్టణం అంతా తిరిగాం. ఆకాశంలో ఎక్కడా మేఘాలు లేకపోవడంతో పగలంతా సూర్యుడు కనిపిస్తూనే ఉన్నాడు. అర్ధరాత్రి ఎప్పుడవుతుందా కెమెరాల్లో ఎప్పుడెప్పుడు ఆదిత్యుడిని బంధించేద్దామా అనుకుంటూ ఉన్నాం. అప్పటికే పట్టణంలోని ప్రధాన వీధులన్నీ జనంతో కిటకిటలాడుతున్నాయి. మారథాన్ ప్రారంభమైంది. ముందుగా చిన్న పిల్లలకు 500 మీటర్ల పందెం పెట్టారు. తరవాతి పోటీ 5 కిలోమీటర్లు పెద్దవాళ్లకి... 9 గంటలకు మొదలైంది. అప్పటికి కూడా ఆకాశంలో సూర్యుడు కనువిందు చేస్తూనే ఉన్నాడు. పోటీ ముగిసే సమయంలో హఠాత్తుగా ఆకాశం మేఘావృతమై వర్షం మొదలై అందరినీ ఇబ్బంది పెట్టింది. దగ్గరలో ఉన్న భవనంలోకి పరుగులు తీశాం. సరిగ్గా 40 నిమిషాలకు వర్షం తగ్గింది. 10.35 నిమిషాలకు మూడో పోటీ 10 కిలోమీటర్ల మారథాన్ మొదలైంది. మళ్లీ వర్షం... ఇక మాకు అర్ధరాత్రి సూర్యుడిని చూడగలమన్న ఆశ లేకుండాపోయింది. వర్షం కురుస్తూనే ఉంది. ఎట్టకేలకు 42 కిలోమీటర్ల అతిపెద్ద మారథాన్‌కు సమయం ఆసన్నమయింది. ఇది సరిగ్గా అర్ధరాత్రి 12 గంటలకే మొదలవుతుంది. నిజానికి ఈ చిన్న పట్టణంలో అంత దూరం ఉన్న రహదారులు కూడా లేవు. అందుకే పందెంలో పాల్గొన్నవాళ్లు ట్రామ్‌సో వంతెన దాటి ప్రధాన భూభాగంలోని ట్రామ్స్‌డేలన్ మరియు క్రొకెన్ ప్రాంతాలను చుట్టి మళ్లీ వంతెన ద్వారా పట్టణ ప్రధానకూడలికి చేరాలి. అక్కడ నుంచి మళ్లీ విమానాశ్రయానికి వెళ్లి తిరిగి పట్టణ కూడలికి వస్తేనే మొత్తం దూరం పూర్తి అవుతుంది. మా బృందంలో సుజాఖాన్ మాత్రమే ఈ పోటీలో పాల్గొన్నాడు. అప్పటికే మేమంతా తడిసి ఉండటంతో ఇబ్బందిగా అనిపించి సుజాఖాన్‌కి తోడుగా మరో ఇద్దరిని ఉంచి కాటేజీకి వచ్చేశాం. అప్పటికీ ఆకాశం మేఘాలతో కమ్మేసినా వెలుతురు ఉంది. కానీ ఆదిత్యుడి దర్శనం మాత్రం లభించలేదు. మా కాటేజీ నుంచి ట్రామ్‌సో చుట్టూ ఉన్న కొండలు కనిపిస్తూనే ఉన్నాయి. పోటీ పూర్తయ్యాక 2.40 గంటలకు మా బృందంలోని మిగతా సభ్యులు కాటేజీకి చేరుకున్నారు. తలుపు తీసిన నేను ఆ సమయంలో కనిపించిన సూర్యుడిని చూసి ఆశ్చర్యపోయాను. వెంటనే ఆ సుందరదృశ్యాన్ని కెమెరాలో బంధించాను. మిగిలినవాళ్లను కూడా నిద్రలేపి చూపించాను. మా యాత్ర సఫలమైనందుకు సంతోషించాం.

## ఆర్కిటిక్‌నీ చుట్టొచ్చాం

మర్నాడు ఉదయమే అక్కడకి 500 మీటర్ల దూరంలో ఉన్న పోలారియం మ్యూజియంకు వెళ్లాం. సముద్రపు ఒడ్డున నిర్మించిన ఈ భవనం నిర్మాణం పడిపోతున్న మూడు ముక్కల రూపంలో ప్రత్యేకంగా ఉంటుంది. దీన్ని ఆర్కిటిక్ ప్రాంతానికి నకలుగా చెప్పవచ్చు. ఉత్తర ధ్రువంలో కనిపించే జంతువులు, పక్షులు, మొక్కలు అన్నీ ఇక్కడ కనిపిస్తాయి. థియేటర్‌లో ఆర్కిటిక్ ప్రాంతాన్ని త్రీడీలో చూపిస్తారు. ఓ పెద్ద ఆక్వేరియంలో మూడు మీసాల సీల్ జంతువులు ఉన్నాయి. ఈ ఆక్వేరియం రెండంతస్తులుగా ఉన్నట్లుంటుంది. దీని చుట్టూ ఏర్పాటుచేసిన మంచు అచ్చం ఉత్తరధ్రువాన్నే తలపిస్తుంటుంది. తరవాత ఉత్తరధ్రువానికి మొదటి సాహసయాత్రను చేసి వచ్చిన నావను చూడడానికి వెళ్లాం. దీన్ని సముద్రపు ఒడ్డున ఉన్న ఓ పెద్ద అద్దాలగదిలో ఉంచారు. ఇది చాలా చిన్న నౌక. వంటచెరకుతో పనిచేస్తుంది.

అర్ధరాత్రి సూర్యుడులానే ఆకాశంలో రంగుల కాంతిపుంజాలు నాట్యమాడటం నార్వేజియన్లకు అనుభవైకవేద్యమే. చంద్రకాంతి, నియాన్ లైట్ల కాంతి తక్కువగా ఉండే చీకటి ప్రదేశాల్లో అదీ ఎక్కువగా ఉత్తర నార్వేలోని లోఫ్టెన్‌లోనూ తీర ప్రాంతాల్లోనూ ఈ కాంతులు కనువిందు చేస్తుంటాయి. వీటినే అరోరా బోరీయాలీలు అంటారు. మెరుపుల్లా మెరిసే ఈ రంగులకాంతులు ఒకటి లేదా రెండు నిమిషాలే ఉంటాయి. సాయంత్రం ఆరు గంటలనుంచి అర్ధరాత్రివరకూ అదీ చలికాలంలోనే కనిపిస్తాయి. సూర్యుడి నుంచి వెలువడే కణాలు పెద్దమొత్తంలో భూఅయస్కాంత క్షేత్రంలోకి ప్రవేశించినప్పుడు విడుదలయిన శక్తే ఇలా కాంతి రూపంలో కనిపిస్తుందట. అరోరా బొరియాలీ జోన్‌కి ట్రామ్‌సో పట్టణం మధ్యలో ఉండటంతో వీటిని కూడా ఇక్కడ చక్కగా వీక్షించవచ్చు. అవి చూడాలంటే నవంబరు వరకూ నార్వేలోనే ఉండాలి అనుకుంటూ ఓస్లోకి తిరిగివచ్చాం. ★



కుటుంబసభ్యులతో వ్యాసకర్త

# రాశి ఫలం

గ్రహబలం (జనవరి 23 - 29)

తంగిరాల ప్రభాకర పూర్ణయ్య సిద్ధాంతి





**మేషం** అశ్వని, భరణి, కృత్తిక 1వ పాదం

శుభకార్యమూలక ధనవ్యయం. నూతన వస్తువస్త్రాదులూ గృహోపకరణాలూ కొనుగోలు చేస్తారు. చిరకాల బాకీలు వసూలయ్యే అవకాశాలున్నాయి. నిరుద్యోగులకు కష్టానికి తగిన ఫలితం లభిస్తుంది. ఏ చిన్న అవకాశం వచ్చినా వదులుకోకుండా సద్వినియోగం చేసుకోవడం ఉత్తమం. అందువల్ల ఒకదారి కనిపించగలదు. కుటుంబపరమైన వ్యవహారాల్లో ఇతరుల జోక్యం వల్ల అపార్థాలు చోటు చేసుకునే ప్రమాదం ఉంది, జాగ్రత్తపడండి.



**వృషభం** కృత్తిక 2,3,4 పాదాలు; రోహిణి, మృగశిర 1,2 పాదాలు

సంతోషం కలిగించే వార్తలు వింటారు. అనుకోకుండా జరిగే కొన్ని సంఘటనలు మీకు ఆనందం కలిగిస్తాయి. పుత్రసంతానం విషయంలో జాగ్రత్తలు పాటించాల్సి ఉంది. అనవసర, అవాంఛిత కలహాలు మానసికంగా బాధిస్తాయి. రెండునాలుకలతో మాట్లాడుతూ క్షణక్షణానికీ మాట మార్చేవారివల్ల నష్టసూచనలున్నాయి తస్మాత్ జాగ్రత్త.



**మిథునం** మృగశిర 3, 4 పాదాలు, ఆర్ద్ర, పునర్వసు 1, 2, 3 పాదాలు

మనసులో భయాందోళనలూ దీర్ఘాలోచనలూ ఉంటాయి. లేనిదాన్ని ఉన్నట్టుగా భావించి భయపడుతుంటారు. పాతమిత్రుల వల్ల శుభవార్తలు తెలుస్తాయి. జీవిత భాగస్వామితో మాట్లాడేటప్పుడు సంయమనంతో వ్యవహరించండి. లేనిపోని తొందరపాటు వల్ల అపార్థాలు చోటుచేసుకునే ప్రమాదం. మీ పిల్లల ప్రతిభాపాటవాలకు గుర్తింపు లభించడం వల్ల సంతోషం కలుగుతుంది. వృత్తి, ఉద్యోగాల్లో ఒత్తిడులు తప్పవు.



**కర్కాటకం** పునర్వసు 4వ పాదం; పుష్యమి, ఆశ్లేష

వృత్తి, వ్యాపారాల అభివృద్ధి కోసం చేసే యత్నాలు ఒక కొలిక్కి వస్తాయి. ప్రతిరంగంలోనూ కృషికి తగిన ఫలితం ఉంటుంది. గతంలో ఎదురైన ఆటంకాలూ ప్రతిబంధకాలూ తొలగి వ్యవహారాలన్నీ సాఫీగా సాగిపోతాయి. భాగస్వామ్య వ్యాపారాలు చేసేవారికి స్వతంత్ర భావనలు కలుగుతాయి. స్థిరాస్తి కొనుగోలు యత్నాలు ఫలిస్తాయి.



**సింహం** మఖ, పుబ్బ, ఉత్తర 1వ పాదం

వారం మొదట్లో అనారోగ్య సూచనలు. మోకాళ్ళు, నడుము భాగాల్లో నొప్పితో బాధపడతారు. ప్రధానమైన వ్యవహారాల్లో ముందస్తు ప్రణాళికలు వేసుకోకపోవడంతో ఇబ్బందులు ఎదురయ్యే ప్రమాదం ఉంది. విద్యార్థులకు మానసిక అశాంతి, అస్థిమితం. ఉద్యోగులకు పై అధికారుల నుంచి ఒత్తిళ్లు అధికం. గురు, శుక్రవారాల్లో అపరిచితులతో జాగ్రత్తగా ఉండండి.



**కన్య** ఉత్తర 2, 3, 4 పాదాలు; హస్త, చిత్త 1, 2 పాదాలు

నూతన వస్తు, వస్త్రాదుల కొనుగోలు. దైవకార్యాల్లో చురుగ్గా పాల్గొంటారు. కలహాలు కష్టకారకాలని గ్రహించి కుటుంబసభ్యులతో మెలగేటప్పుడు సంయమనంతో వ్యవహరించండి. అధిక ప్రయాణాలూ అలసటా ఉంటాయి. ప్రతివిషయంలోనూ శ్రమాధిక్యత, ఫలితం మాత్రం సామాన్యం. పెద్దల ఆరోగ్య విషయంలో శ్రద్ధ చూపండి.



**తుల** చిత్త 3, 4 పాదాలు, స్వాతి, విశాఖ 1, 2, 3 పాదాలు

సమయం, సందర్భం లేకుండా చేసే కొన్నిపనులూ తీసుకునే నిర్ణయాల వల్ల ఇబ్బందులు ఎదుర్కొంటారు. పరధ్యానం, అశ్రద్ధ వీడితే ఫలితాలు మీకు అనుకూలం. కళారంగంలో ప్రముఖులకూ ఇతర పనివారికీ శ్రమకు తగ్గ గుర్తింపు లభిస్తుంది. సన్మానసత్కారాది గౌరవాలు లభిస్తాయి. కుటుంబవాతావరణం అంత అనుకూలంగా ఉండదు. వారాంతంలో ఆరోగ్యం జాగ్రత్త.



**వృశ్చికం** విశాఖ 4వ పాదం; అనూరాధ, జ్యేష్ఠ

తలపెట్టిన ప్రతిపనీ నల్లేరు మీద బండి నడకలా సజావుగా, నిర్విఘ్నంగా ముందుకు సాగిపోతుంది. మొహమాటం వల్ల కొంతమందికి వాగ్దానం చేయడం ఇబ్బంది కలిగిస్తుంది. బంధుమిత్రులతో వ్యవహరించేటప్పుడు వారిని చులకన చేసే విధంగా ప్రవర్తిస్తారు. అలా జరక్కుండా జాగ్రత్తపడండి. వారం మొదట్లో కొంత పరీక్షాకాలంగా ఉన్నప్పటికీ పట్టుదలతో ముందడుగు వేస్తారు.



**ధనుస్సు** మూల, పూర్వాషాఢ, ఉత్తరాషాఢ 1వ పాదం

అనవసరమైన మొండితనం, పట్టుదల కారణంగా చేతికి అందివచ్చిన సువర్ణావకాశాలను జారవిడుచుకుంటారు. ఆ తర్వాత బాధపడి ప్రయోజనం లేదని గ్రహించండి. ఆత్మన్యూనతాభావం వెంటాడుతూ ఉంటుంది. అవగాహన లేని విషయాల్లో సొంత నిర్ణయాలు తీసుకోవద్దు. అనుభవజ్ఞుల సలహాలు తీసుకోవడం మేలు. కొన్ని విషయాల్లో ఒంటరిపోరాటం చేయాల్సి వస్తుంది.



**మకరం** ఉత్తరాషాఢ 2, 3, 4 పాదాలు; శ్రవణం, ధనిష్ఠ 1, 2 పాదాలు

అలసత్వం, ఉదాసీనత, అన్నివేళలా పనిచేయవని గ్రహించండి. మంచికోసం ఎంత పాకులాడినా ఫలితం ఉండదు. పైగా అపనింద భరించాల్సి వస్తుంది. బ్యాంకులు, ఇతర ఆర్థిక రంగాల ఉద్యోగులు ఒడుదొడుకులు ఎదుర్కోవలసి వస్తుంది. ఒత్తిడి, పై అధికారుల నుంచి అక్షింతలూ తప్పవు. స్త్రీలకు ఉష్ణసంబంధమైన ప్రమాదాలు సూచితం, జాగ్రత్త.



**కుంభం** ధనిష్ఠ 3, 4 పాదాలు; శతభిషం, పూర్వాభాద్ర 1, 2, 3 పాదాలు

వృత్తివ్యాపారాలు సజావుగా సాగుతాయి. జీవిత భాగస్వామి ఆరోగ్యవిషయంలో జాగ్రత్త పాటించండి. వ్యవహారజ్ఞానం అంతగా లేని వారి మాటల వల్ల ఇబ్బందులు ఎదురయ్యే సూచనలున్నాయి. సంఘంలో గౌరవమర్యాదలు లభించే అవకాశాలను ఒడిసిపట్టండి. వ్యాపారభాగస్వాములతో సమన్వయలోపాలొచ్చే ప్రమాదం ఉంది, జాగ్రత్తగా వ్యవహరించండి.



**మీనం** పూర్వాభాద్ర 4వ పాదం, ఉత్తరాభాద్ర, రేవతి

ఒక వ్యక్తి ద్వారా మీకు అందిన సమాచారం అసంబద్ధంగా ఉండి అయోమయానికి గురిచేస్తుంది. అపరిష్కృత సమస్యలూ వ్యవహారాల్లో సానుకూలత ఏర్పడుతుంది. మిత్రులూ బంధువులూ మాటసాయంతో ఆదుకుంటారు. విద్యార్థులకు మిశ్రమ ఫలితాలు, శ్రమాధిక్యత. ఉద్యోగులకు పై అధికారుల నుంచి వచ్చే ఒత్తిళ్లు అసహనానికి గురిచేస్తాయి. ప్రతిపనిలోనూ కష్టానికి తగ్గ ఫలితం.

# సమీక్ష

## ఆర్థికవికాస సాహిత్యం

**సం**పాదన అందరికీ ఉంటుంది. కొద్దిమంది మాత్రమే దానిని సంపదగా మార్చుకుంటారు. కాస్త పొదుపు అలవాటు చేసుకుని తెలివైన పెట్టుబడిగా మార్చుకుంటే అందరూ ఐశ్వర్యవంతులు కావొచ్చు. అదెలాగో అరటిపండు వలిచిపెట్టినట్టు చెప్పిన పుస్తకమే డాక్టర్ వర్లు రాసిన 'సంపద రహస్యం'. చక్రవడ్డీ చమత్కారం, ఏది అప్పు? ఏది ఆస్తి?, తరగని గని భూమి, సం'షేర్', కొనుగోలు అలవాట్లు, కాటేసే క్రెడిట్ కార్డు, పైప్‌లైన్ ఆదాయం... ఇలా పలు ఆర్థికాంశాల మంచిచెడులను పుస్తకంలో వివరించారు. ఆరు అధ్యాయాలుగా ఉన్న పుస్తకంలో గొప్ప వ్యక్తుల స్ఫూర్తిదాయక విజయాలెన్నిటినో గుదిగుచ్చారు. వ్యక్తిత్వ వికాసానికీ ఇవి ఎంతో దోహదపడతాయి. ఆరోగ్యం, జ్ఞానం, ఆధ్యాత్మిక సంపదలూ జీవితానికి ఎంత అవసరమో వివరించడంతో ఈ పుస్తకం డబ్బు సంపాదన మీద వచ్చిన ఇతర పుస్తకాలకంటే భిన్నమైందిగా నిలుస్తుంది.



**సంపద రహస్యం;** రచన: డాక్టర్ వర్లు; పేజీలు: 288; వెల: రూ.150/-
ప్రతులకు: విశాలాంధ్ర పుస్తక కేంద్రాలు.

– సమసు

## 'ఆమె'రికా జీవితం!

**అ**మెరికాలో ఉన్నా అమలాపురంలో ఉన్నా అనుబంధాల విలువ మారదు. కలలకి రెక్కలు కట్టుకుని డాలర్లదేశానికి పరుగుపెట్టిన వారికి అనుబంధాల విలువేమిటో స్పష్టంగా తెలిసేలా చేశారు రచయిత్రి శ్యామలాదేవి. ఆమె కథల్లో అనుబంధాల తలపోతే అడుగడుగునా కనిపిస్తుంది. ఏడాదికో రెండేళ్ళకో ఒక్కసారి వచ్చే మనవలకోసం మనవరాళ్లకోసం చకోర పక్షుల్లా ఎదురుచూసే వయోధికుల వ్యధని 'నిరాశ' కథ కళ్లకుకడు తుంది. అమెరికాలో పెరుగుతున్న పిల్లల భావో ద్వేగాలూ వాళ్ల పెళ్లిళ్లు చేయడానికి కన్నవారు పడే కష్టాలూ 'అంతా అమెరికామయం'లో బాగా ఆవిష్కరించారు. 'సిరిచుక్క' పాఠకుల్ని బాల్యం లోకి తీసుకెళ్తుంది. కథల్లో ఆంగ్లపదాల వాడుక తగ్గితే బావుండేది. అక్షరదోషాల విషయంలో తగిన జాగ్రత్త తీసుకోవాల్సింది.



**అమెరికా ఇల్లాలి ముచ్చట్లు**
రచన: శ్యామలాదేవి దశిక
పేజీలు: 139; వెల: రూ.100/-
ప్రతులకు: ప్రధాన పుస్తక కేంద్రాలు.

– శ్రీవాణి

## సరికొత్త వాక్యం

'**నా**కున్న చిన్న సెక్టోరియల్ రీడర్‌షిప్ నాకు చాలు'... ఇది దాపరికంలేని రచయిత ప్రకటన. సంప్రదాయ 'కథ'కు బిగించిన చట్రంలో సరిగా ఇమడని 27 రచనల సంపుటి 'శ్యామ్‌యానా'. విశాఖపట్నంలో వైద్యం చదివి, వృత్తిలో రాణించి, అమెరికాలో ఉన్న మెడికోశ్యామ్ (డాక్టర్ శ్యామ్ చిర్రావూరి) ప్రయోగశీలి. అనుభూతుల్ని భావధారగా ప్రవహింపజేస్తూ కథా ప్రక్రియకు విలక్షణ రూపం ఇచ్చారు. చల్ల చిలికి వెన్న తీసినట్టు పాఠకుడు మేధోమథనం చేసి ఇతివృత్తం పట్టు కోవాలి. ప్రాసలు, శబ్దవిన్యాసాలు, ఉపమలు, చమత్కారాలు, పదబంధాలు, ధ్వని, వక్రోక్తి, వినూత్న వాక్యనిర్మాణం, కవితాత్మకశైలి వంటి గుణవిశేషాలు నింపుకున్న కథలివి. అంతర్లీనంగా తాత్త్వికత చోటుచేసుకుంది. సగం పేజీ నుంచి పది పేజీల దాకా ఉన్న రచనలు తెలుగు కథా క్షేత్రంపై వీచిన కొత్త పవనాలు.



**శ్యామ్‌యానా;** రచన: మెడికోశ్యామ్
పేజీలు: 195; వెల: రూ.150/-
ప్రతులకు: విశాలాంధ్ర, నవోదయ పుస్తక కేంద్రాలు.

– జి.రా.

## జీవన దర్పణం

**అ**చ్చమైన తెలంగాణ మాండలి కంలో సాగిన ఎలికట్టె శంకర్‌రావు కథలు జీవితపు మారుమూల కోణాలను మృదువుగా స్పృశిస్తాయి. తెలంగాణ రైతు వేదనతో పాటు గ్రామీణ పేదరికం, పట్టణ వలసల జీవన దైన్యాన్ని కళ్లకు కడతాయి. వర్షాలు పడక, బోర్లపై ఆశలు పెంచుకొని ఆర్థికంగా చితికిపోతున్న తెలం గాణ రైతుల దయనీయ స్థితిని 'దుబ్బచెలక' కథ పట్టి చూపుతుంది. బ్యాంకు రుణాల ఊబిలో కూరుకుపోయి, ప్రాణాలు కోల్పోతున్న వైనానికి 'రుణం తీరింది' కథ చక్కటి నిదర్శనం. ప్రేమానుబంధాలు కేవలం శారీరకమైనవి మాత్రమే కావని చెప్పే 'తాత కథ' కుటుంబ కలహాలతో దూరమవుతున్న యువతరానికి కనువిప్పు కలిగిస్తుంది. ఉమ్చు, తెల్లారింది, కొలుపు... ఇలా మొత్తం 13 కథల్లోనూ రచయిత నేర్పు ప్రస్ఫుటమవుతుంది.



**దుబ్బచెలక**
రచన: ఎలికట్టె శంకర్‌రావు
పేజీలు: 110; వెల: రూ.50/-
ప్రతులకు: అరుణ, 206, సాయి టవర్స్ నాగార్జున కాలనీ, నల్గొండ.

– పున్న సుదర్శన్

# పదవినోదం-1022

| | | | | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|---|---|
| 1 | | 2 | ■ | 3 | | ■ | 4 | ■ | 5 | 6 | ■ |
| | ■ | 7 | | | ■ | 8 | | | ■ | 9 | 10 |
| 11 | 12 | | ■ | 13 | | ■ | | ■ | 14 | ■ | |
| ■ | | ■ | 15 | | ■ | 16 | | 17 | | 18 | ■ |
| 19 | | 20 | | ■ | 21 | | ■ | | ■ | 22 | 23 |
| | ■ | | ■ | 24 | | ■ | 25 | ■ | 26 | ■ | |
| ■ | 27 | | 28 | ■ | 29 | | | | | | ■ |
| 30 | | ■ | 31 | 32 | | ■ | | ■ | | ■ | 33 |
| ■ | 34 | 35 | ■ | | ■ | 36 | ■ | 37 | | 38 | |
| 39 | ■ | 40 | | ■ | 41 | | 42 | | ■ | | ■ |
| 43 | | | ■ | 44 | | ■ | | ■ | 45 | | |
| | ■ | 46 | | ■ | 47 | | ■ | 48 | | | ■ |

## ఆధారాలు

### అడ్డం:

1. ఆనవాలు దొరక్కుండా దొంగ వేసుకునేది (3)
3. సహస్రం (2)
5. ఒక పాదు (2)
7. రుషి బహువచనరూపం? (3)
8. దుష్యంతుడి అత్తగారు? (3)
9. తట్ట (2)
11. సాక్ష్యం (3)
13. హా...ఛ్! (2)
15. వీరు కాదు (2)
16. ఒకరకం చేప కొరకు (3+2)
19. యోచన (4)
21. ఇదికాదు, అది. కచ్చితంగా! (2)
22. రెండు, జంట (2)
24. చిన్నపిల్లల్ని నిద్రబుచ్చడానికి పాడే పాట! (2)
27. తెర (3)
29. శోభన్‌బాబు ప్రధాన పాత్రలో సంగీత వాయిద్యాన్ని పేరులో ఇముడ్చుకున్న సినిమా! (3+3)
30. తెలుగు టీమ్ (2)
31. సన్నగా పొడుగ్గా ఉన్నవాళ్లను ఇలాగంటారు... (3)
34. వానరం (2)
37. మందుబిళ్ల చేదుగా ఉంది... ఒక్కముక్కలో దాన్ని ఏమంటారు? (4)
40. నేత్రాలు (2)
41. మొదటి కారు కాదు, తరవాతది! (2+2)
43. అటునుంచి మరల (3)
44. అరవై నిమిషాలు (2)
45. భద్రపరచుకో! (3)
46. కరవాలం (2)
47. పాత్రలోకి పోస్తుంటే పాలు తొణికి కిందపడు (2)
48. త్రివిక్రమ్ శ్రీనివాస్ దర్శకత్వంలో మహేశ్‌బాబు కథానాయకుడిగా త్రిష నాయికగా విజయవంతమైన సినిమా! (3)

### నిలువు:

1. 'ముగ్గురు మొనగాళ్లు' సినిమాలో ఎంతమంది చిరంజీవులు కనిపిస్తారు? (3)
2. శిష్యుడికి పాఠాలు తెలియజెప్పేవాడు (3)
3. చీకటితెరల్ని చీల్చేది? (4)
4. జనమేజయుడు చివరిదాకా లేడు (4)
6. అర్ధభాగం (2)
10. దంతాలు, ఫలాలు! (2)
12. ఏడో నెలలో (3)
14. తలకిందులుగా అర్థించడమంటే- హిందీలో ఆగు, ఆపు! (2)
15. వర్షం (2)
16. నూరే (2)
17. వర్ణం (2)
18. సంధ్య వికృతి? (2)
19. సిక్సర్ అంటే పరుగులెన్ని? (2)
20. ఈనాడు గ్రూపు సంస్థల నుంచి వెలువడుతున్న ఓ మాసపత్రిక (3)
21. బడలిక లాంటిది (4)
23. 'మాయాబజార్'లో గిల్పం కాదు; దూదిపరుపు! (2)
25. సాగిన కైపు! (3)
26. చెప్పాలిగాని, అలా జరగలేదు! (4)
27. కిందికి జారిపోకుండా గట్టిగా...! (3)
28. తోవ, మార్గం (2)
32. ఆ రోజున మిమ్మల్ని భోజనానికి రమ్మంటున్నారు, అలాగేనని చెప్పండి... (2)
33. ఒక అద్భుత గాయని; ఓ నక్షత్రం పేరు! (2)
35. గజిబిజి లాంటిది (4)
36. ఒకానొక పోరాట విద్య (2)
37. సమీపించు (2)
38. సుబాహుడి సోదరుడు (4)
39. జాగు (3)
41. తల మాయమైన రెంటచింతల! (3)
42. పెద్ద త్రాసు (2)
45. దానం చేసేవాడు (2)

## సమాధానాలు

### పదవినోదం-1021

| | | | | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|---|---|
| 1 తా | 2 లి | ■ | 3 బా | డు | 4 గ | ■ | 5 సం | డే | ■ | 6 వా | ళ్లు |
| ■ | 7 చ | 8 ర | ణం | ■ | 9 దు | హి | త | ■ | 10 తూ | ము | ■ |
| 11 రా | ■ | థం | ■ | 12 మే | లు | ■ | 13 కం | 14 ద | కం | ■ | 15 గు |
| ■ | 16 వి | ■ | 17 దో | షం | ■ | 18 మొ | ■ | డ | ■ | 19 బ | డి |
| 20 చి | న్న | 21 దో | ర | ■ | 22 ద | గ్గ | 23 ర | ■ | 24 జా | లి | ■ |
| మ్మ | ■ | డ్డ | ■ | 25 పె | క్కు | ■ | 26 క్షి | తి | ■ | మి | ■ |
| 27 చీ | రు | ■ | 28 పై | రు | ■ | 29 పి | త | ■ | 30 మ | ■ | 31 ఛా |
| క | ■ | 32 నే | ■ | 33 గు | 34 మా | స్తా | ■ | 35 క | జ్జి | 36 కా | యు |
| 37 టి | 38 మ | టి | 39 నీ | ■ | ర్పు | ■ | 40 సే | ■ | 41 గ | ది | ■ |
| ■ | రీ | ■ | 42 రే | 43 పు | ■ | 44 న | వ | 45 తి | ■ | 46 క | 47 ల |
| 48 దం | చి | 49 న | ■ | 50 రు | 51 చి | గా | ■ | 52 మి | ష | ■ | డా |
| ■ | 53 క | టి | క | మె | కం | ■ | 54 క్షీ | రం | ■ | 55 రే | యి |

### సుడొకు-66

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| 5 | 2 | 6 | 1 | 3 | 4 | 9 | 8 | 7 |
| 1 | 3 | 9 | 7 | 8 | 5 | 6 | 2 | 4 |
| 4 | 8 | 7 | 6 | 2 | 9 | 1 | 5 | 3 |
| 7 | 5 | 3 | 2 | 9 | 6 | 8 | 4 | 1 |
| 9 | 6 | 1 | 4 | 5 | 8 | 3 | 7 | 2 |
| 8 | 4 | 2 | 3 | 7 | 1 | 5 | 6 | 9 |
| 3 | 9 | 4 | 5 | 6 | 2 | 7 | 1 | 8 |
| 2 | 7 | 5 | 8 | 1 | 3 | 4 | 9 | 6 |
| 6 | 1 | 8 | 9 | 4 | 7 | 2 | 3 | 5 |

# సుడొకు-67

ప్రతి వరుసనూ (నిలువూ అడ్డమూ కూడా) 1-9 అంకెలతో పూరించాలి. ఒక వరుసలో ఒక అంకెను ఒకసారి మాత్రమే వాడాలి. తొమ్మిది నలుచదరపు బాక్సుల్లో ప్రతి బాక్సులోనూ 1-9 అంకెలు ఉండాలి.

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| 9 | | | 6 | | | | | |
| 2 | 7 | | | 8 | | | | 6 |
| | 8 | 6 | | 4 | 3 | 1 | 9 | 2 |
| | 9 | | | 1 | 6 | 5 | | |
| | | 5 | | | | 2 | | |
| | | 3 | 4 | 5 | | | 7 | |
| 7 | 5 | 9 | 1 | 6 | | 4 | 8 | |
| 3 | | | | 7 | | | 2 | 5 |
| | | | | | 5 | | | 9 |

# మూగ స్నేహం







‘ఈ రోజు నువ్వు ఏం తిన్నావ్’
‘అడవి దున్న మాంసం’
‘మరి నువ్వు?’
‘పళ్లు’

ఆ పులీ, లేడిపిల్లలకు మాటలొస్తే ఇలాగే మాట్లాడుకుంటాయేమో!

★ ★ ★

ఇవేకాదు... ఇక్కడున్న జంతువులన్నీ పైన చెప్పినట్లే కాకపోయినా వాటి భాషలో అవి కబుర్లు చెప్పుకొంటూనే ఉంటాయి. ఎందుకంటే... ఇవన్నీ మంచి స్నేహితులు. జాతివైరాన్ని కూడా మరిచి ఈ మూగజీవాలు చెట్టపట్టాలేసుకు తిరుగుతుంటే మనుషులుగా పుట్టిన మనమేమో ‘ప్రేమనిచ్చిన ప్రేమవచ్చును’ అన్న మాటను విస్మరించి, కులమత భేదాలూ భాషా ప్రాంతీయ ద్వేషాలతో పరస్పరం కత్తులు దూసుకుంటున్నాం. ఆశ్చర్యంగా లేదూ!















ప్రీమియర్ షో
త్వరలో...
ఐ లవ్ యూ
డాడీ
దర్శకత్వం
ఇంద్రనాగ్
నిర్మాత
సుమన్

ఈనాడు
ఆదివారం
30 జనవరి 2011



# చేతిలో చెయ్యేసి...



# ఆ సలహా అమీర్‌ది!

**కరీనా కపూర్... బాలీవుడ్ టాప్ హీరోలందరితో నటించింది. కొందరు కో-స్టార్ల నుంచి నేర్చుకున్నవీ ఇంకొందరిలో గమనించినవీ... ఇలా కొన్ని విషయాలని చెబుతోంది.**



## ఇద్దరి అలవాటు

'మై ప్రేమ్‌కీ దివానీ హు' వచ్చి ఏడేళ్లవుతోంది. ఆ తరువాత ఇప్పటి వరకూ హృతిక్‌తో కలిసి నటించే అవకాశం రాలేదు. సెట్‌లో ఉన్నప్పుడు ముఖాన్ని పదేపదే అద్దంలో చూసుకోవడం నాకో అలవాటు. హృతిక్‌కి కూడా ఇదే అలవాటుంది.



## ఒకే అభిరుచి

అభిషేక్‌కీ నాకూ 'రెఫ్యూజీ' తొలి చిత్రం. ఇద్దరం నట వారసులం. కాబట్టి మంచి నటులుగా నిరూపించుకోవాలన్న కసితో నటించేవాళ్లం. మా ఇద్దరికీ జంక్‌ఫుడ్స్ అంటే చాలా ఇష్టం. 'రెఫ్యూజీ' షూటింగ్ టైంలో కలిసి హోటళ్లకి వెళ్తుండేవాళ్లం. ఆ సినిమా తరువాత మా ఇద్దరం కలిసి నటించే అవకాశం రాలేదు. కానీ, మేమిద్దరం ఇప్పటికీ మంచి ఫ్రెండ్స్.



## చేతులు వద్దన్నాడు!

పదోయేటి నుంచే అమీర్‌ఖాన్ అభిమానిని. ఓసారి ఇంట్లో మెట్లపై కూర్చున్నాను. చెంపకింద చేతులు పెట్టుకుని ఏదో ఆలోచనలో ఉన్నాను. అమీర్ నన్ను గమనించి 'మంచి నటిగా ఎదగాలనుకుంటే చర్మసౌందర్యాన్ని కాపాడుకోవాలి. ఈ అలవాటు మార్చుకో' అని సలహా ఇచ్చాడు. అప్పట్నుంచి ఆ అలవాటు మానేశా. అమీర్‌తో నటించకపోతే ఏ నటి కెరీర్ సంపూర్ణం కాదనేది నా అభిప్రాయం. అతడి నుంచి ఎన్నో నేర్చుకోవచ్చు.

## కల నిజమైంది

షారుఖ్‌తో కలిసి నటించాలని ఏ నటైనా కలగంటుంది. నా కల 'అశోక'తో నిజమైంది. ఆ తరువాత 'కభీ ఖుషీ కభీ ఘమ్'లో నటించా. షారుఖ్ రొమాంటిక్ సీన్లలో చాలా బాగా నటిస్తాడు. అలాంటి సన్నివేశాల్లో అతడి పక్కన ఇంతవరకూ నటించలేకపోయానన్న లోటుండేది. ఇప్పుడు 'రా.వన్'తో ఆ కల నెరవేరనుంది.





## ప్రతిభావంతుడు

మా ఇద్దరి మధ్య ఒకప్పటి సంబంధం ఇప్పుడు లేదు! దాన్ని పక్కనబెడితే షాహిద్ అంటే నాకు గౌరవం. జీవితంపట్ల అతడికి చాలా స్పష్టత ఉంటుంది. ఎలాంటి పాత్రలోనైనా ఇమిడిపోగల నటుడు. ప్రస్తుతం అతడితో నటించడానికి నాకు ఎలాంటి అభ్యంతరమూ లేదు. మేమిద్దరం ఎప్పుడూ ఫ్రెండ్లీగానే ఉండేవాళ్లం. ఇప్పుడూ అలానే ఉన్నాం.

## తొలిప్రేమ

సల్మాన్‌ఖాన్ అంటే టీనేజ్‌లో నాకు ఎంతో ఇష్టం. 'మైనే ప్యార్ కియా' పోస్టర్స్‌ని నా గదిలో గోడలపై అతికించుకున్నాను. అతడే నా డ్రీమ్ బాయ్ అనుకునేదాన్ని. 'ఆషికీ' సినిమా వచ్చాక ఆ పోస్టర్లు చింపేసి రాహుల్‌రాయ్ ఫోటోలు పెట్టుకున్నా. ఇప్పటికీ ఈ విషయాన్ని గుర్తుచేస్తూ అప్పుడప్పుడూ నన్ను ఆటపట్టిస్తుంటాడు సల్మాన్. అతడో మంచి ఫ్రెండ్.





## మంచి మనసు

అజయ్ దేవగన్ నటన అంటే చిన్నప్పట్నుంచీ ఇష్టం. అతడు మంచి సహనటుడు. 'గోల్‌మాల్ 3'లో అజయ్‌తో కలిసి పనిచేశా. కామెడీ సన్నివేశాల్లో అతడి టైమింగ్ చాలా బాగుంటుంది. అతణ్ని చూసి నేర్చుకోవాల్సింది ఏంటంటే... వ్యక్తిగత విషయాలను సెట్స్‌లో ఎవ్వరితోనూ చర్చించడు. పర్సనల్‌లైఫ్ పర్సనల్‌గానే ఉండాలంటాడు.



## అన్నీ తెలుసు!

సైఫ్‌తో ప్రపంచమంతా తిరిగాను. అతడికి అన్ని విషయాలూ తెలుసు. రాజకీయాల గురించీ మాట్లాడతాడు. సంగీతమూ తెలుసు. క్రీడలతోనూ పరిచయముంది. ఒక్కమాటలో చెప్పాలంటే అతడే ఒక సైన్యం. నన్ను ఒక బిడ్డలా చూసుకుంటాడు.



# మీమాట

ఈ సంచికపై మీ అభిప్రాయాలను sunday@eenadu.netకు మెయిల్ చేయవచ్చు.

## అత్యుత్తమ పాఠశాల

కోరుకొండ సైనికస్కూలుపై ముఖచిత్రకథనం 'వ్యక్తిత్వ శిల్పశాల...' ఆసక్తిదాయకంగా ఉంది. అత్యుత్తమ పాఠశాలల్లో ఉండే వసతులూ, విద్యార్థులకిచ్చే కఠోరమైన శిక్షణా పద్ధతుల గురించి చదివి ఆశ్చర్యపోయాం. జె.కె.భారవి చెప్పిన 'పాటకచేరీ' విశేషాలూ, 'సొరకాయలు ఎన్ని రకాలో', 'ఒకరికి ఒకరు', హ్యారిస్ జైరాజ్ కబుర్లూ, 'సుసంపన్నం' కథా, 'పండగొచ్చింది', 'విదేశీ వైదికులు' అన్నీ బాగున్నాయి.

*– చారగొండ్ల పద్మావతి, మిర్యాలగూడ*

*– బి.వినీత్, కరీంనగర్*

## గుర్తుచేసింది

జనవరి 9వతేదీ సంచిక చాలా బాగుంది. 'పెద్దపండ గొచ్చింది' మన సంస్కృతీ సంప్రదాయాలను గుర్తుచేసింది. 'సుసంపన్నం' కథ భార్యాభర్తల అనుబంధం గొప్పదనాన్ని కళ్లకు కట్టింది. ఈవారం బాలవినోదిని, రుచి అభిరుచి, అంకెల్లో, మంచి మాట, 'పువ్వుల్లో ఫ్యాషన్', 'ఈ అబ్బాయి హెచ్ఐవీ పాజిటివ్' కూడా బాగున్నాయి.

*– శంతన్‌కుమార్ నాయుడు, మద్ది వెంకటగోపి, కలిదిండి వెంకట శ్రీహరి (ఈమెయిల్)*

*– వి.మనోహర్, తాడేపల్లిగూడెం*

## అవి నేర్పాలి

చాలా స్కూళ్లలో పాఠాలు బోధిస్తారు. ఫస్ట్‌క్లాసు మార్కులూ వస్తాయి. కానీ విద్యార్థికి కావలసిన క్రమశిక్షణా వ్యక్తిత్వ వికాస పాఠాలు నేర్పడం లేదు. కోరుకొండ సైనిక స్కూల్లో ఇలాంటి మరెన్నో అంశాలకు ప్రాధాన్యమివ్వడం ప్రశంసనీయం. ఆ పాఠశాల గురించి వినడమేగానీ పూర్తిగా తెలియదు. 'సుసంపన్నం' కథ బాగుంది.

*– రామగిరి లలితాశంకర్, శరత్, స్వీటీ, నూజివీడు*

*– యడ్లసూర్యనారాయణ, విజయనగరం*

## సంక్రాంతి కళ

వివాహబంధం అనేది భార్యాభర్తలు ఒకరి కుటుంబాన్ని మరొకరు ప్రేమించడానికని చెప్పిన 'సుసంపన్నం' కథ స్ఫూర్తిదాయకంగా ఉంది. ఇలాంటి మంచి కథలు అందిస్తున్నందుకు అభినందనలు. గొబ్బెమ్మలతో రకరకాల ముగ్గులతో వాకిళ్లను తీర్చిదిద్దే సంక్రాంతి పండగ గురించి 'పెద్దపండగొచ్చింది'లో చక్కగా వివరించారు. రుచిఅభిరుచి, బాలవినోదిని బాగున్నాయి.

*– ఆలూరి కోటేశ్వరరావు, నెల్లూరు*

*– శ్రీకాళహస్తి వెంకట శేషగిరిరావ్, నెల్లూరు*

## అభినందనీయులు

సంక్రాంతి విశేషాలను 'పెద్ద పండగొచ్చింది'లో నేటి తరానికి అందించడం బాగుంది. 'పాటక చేరీ' అన్నమయ్య పాటవెనుక కథను తెలిపింది. కోరుకొండ సైనికస్కూలు గురించి చాలా విషయాలు తెలుసుకున్నాం. ఆ స్కూలుకు స్థలమూ భవనాలూ విరాళంగా ఇచ్చిన విజయనగరం రాజులు అభినందనీయులు. సొరకాయల ఆకారాలు చూస్తుంటే బీకర్లూ, పిపెట్లూ గుర్తుకొచ్చాయి. 'సుసంపన్నం' కథ, 'ఒకరికి ఒకరు' బాగున్నాయి. 'కళ్లకి కొత్త రంగులు' విపరీత ధోరణిలా అనిపించింది.

*– వీఎస్‌బీకే మోహనరావు, ఏలూరు*

*– వి.సత్యభామ, నిజామాబాద్*

## అదీ మంచి కుటుంబం

భార్యాభర్తలు ఎలా ఉండాలో చక్కగా చెప్పిన అన్నపూర్ణగారి కథ 'సుసంపన్నం' బాగుంది. కోరుకొండ పాఠశాల సిబ్బంది చేస్తున్న కృషి శ్లాఘనీయం. సొరకాయల ఫొటోలు కనువిందు చేశాయి. 'ఒకరికి ఒకరు'లో ప్రముఖ మహిళల భాగస్వాముల పరిచయం ఆసక్తికరం.

*– జి.మహానందయ్య, తాడిపత్రి*

*– ఆడారి వెంకటరమణ, విశాఖపట్నం*

# చురుక్కు చమక్కు


ఏ రాష్ట్రానికీ ఇవ్వనంతగా కేంద్రం మనకిచ్చిందయ్యా.. తెలియక విమర్శించవద్దు!
కిరణ్
పరిశీలిస్తాం
హామీ
చూస్తాం
చేస్తాం
కేంద్ర బృందాన్ని పంపిస్తాం
శేఖర్
బడ్జెట్ సమావేశాలు
ఆహార భద్రత సాధ్యం కాదు.
నల్లధనం ఉన్నవారి పేర్లు బయట పెట్టలేం
ధరల అదుపు అసాధ్యం
పెట్రోలు ధరల పెంపు మా చేతుల్లో లేదు!
ఒక సారి మాటిచ్చాక బయట పెడితే మన నైతికత దెబ్బతింటుంది నాయనా... వచ్చినదారినే వెళ్లు!
నల్లధనవంతులు విదేశీ అకౌంట్లు



వశిష్ఠగోదావరి సంద్రంలో కలిసే సాగరసంగమస్థలం...
ఉవ్వెత్తున ఎగిసిపడే కెరటాల వేద ఘోష...
చుట్టూ పచ్చగా తలలూపుతూ కనిపించే కొబ్బరిచెట్ల నడుమ...
కొలువైన నారసింహక్షేత్రం అంతర్వేది లక్ష్మీనరసింహస్వామి ఆలయం. మాఘమాసంలో
ఆ స్వామికి జరిగే కల్యాణోత్సవం సందర్భంగా
అంతర్వేది క్షేత్రం గురించి కొన్ని విశేషాలు...

# అంతర్వేది... నృసింహ సన్నిధి

త్రేతాయుగంలో రావణబ్రహ్మను సంహరించిన శ్రీరాముడు బ్రహ్మహత్యా పాతకం నుంచి విముక్తి పొందడానికి దర్శించుకున్న క్షేత్రం... ద్వాపరయుగంలో అర్జునుడు తీర్థయాత్రకు వెళ్తూ ఆగిన తీర్థం... అంతర్వేది. వశిష్ఠ మహర్షి కోరికపై శ్రీమహావిష్ణువు ధర్మపత్నీ సమేతంగా వెలసిన పుణ్యస్థలి. ఏటా మాఘమాసంలో రథసప్తమి పర్వదినంతో ప్రారంభమై పదిరోజుల పాటు ఈ క్షేత్రంలో జరిగే తిరుకల్యాణోత్సవాల శోభ నభూతోనభవిష్యతి అంటారు భక్తులు. ఆ పదిరోజులూ అంతర్వేదిలో అడుగడుగునా అణువణువునా భక్తిభావం వెల్లువై పొంగుతుంది. నారసింహ జయజయధ్వానాలతో ఈ క్షేత్రం మారుమోగుతుంటుంది. మాఘశుద్ధ దశమినాడు (ఈ ఏడాది ఫిబ్రవరి 13) స్వామివారి కల్యాణోత్సవం, మర్నాడు (ఫిబ్రవరి 14) మధ్యాహ్నం రెండు గంటలకు దివ్య రథోత్సవం. ఆ వేడుకల్లో స్వామివారి దర్శన భాగ్యం కాగానే భక్తులు ఆనందపారవశ్యంలో మునిగిపోతారు. ఆ క్షణం అపురూపం.. అందరి హృదయాలూ స్వామికే అంకితం!

## స్థలపురాణం...

కృతయుగాన వశిష్ఠ మహర్షికీ విశ్వామిత్రుడికీ పోరు జరిగింది. ఆ సమయంలో విశ్వామిత్రుడు తన మంత్రబలంతో హిరణ్యాక్షుడి కుమారుడైన రక్తవిలోచనుడిని రప్పించి వశిష్ఠ మహర్షి కొడుకులు వందమందినీ చంపించాడట. పుత్రశోకాన్ని భరించలేక పోయిన వశిష్ఠ మహర్షి నరసింహస్వామిని ప్రార్థిస్తూ తపస్సు చేశాడట. అప్పుడు స్వామి ప్రత్యక్షమై రాక్షసుణ్ని సంహరించాడట. అయితే రక్తవిలోచనుడికి ఒక వరం ఉంది. అతని శరీరం నుంచి చిందే రక్తపుబొట్టు ఎన్ని ఇసుకరేణువులపై పడితే అంతమంది రాక్షసులు పుట్టుకొస్తారు. దాంతో స్వామివారు రక్తవిలోచనుని సంహరించే సమయంలో ఒక మాయాశక్తిని సృష్టించారట. ఆ శక్తి తన నాలుకను చాచి రక్కసుని రక్తపుబొట్టు కింద పడకుండా చేయడంతో నరసింహస్వామి చక్ర ప్రయోగం చేసి రాక్షసుణ్ని సంహరించాడట. రాక్షసవధానంతరం ఆ మాయాశక్తి తన నాలుకను విదల్చగా ఆ రక్తం 'రక్తకుల్య' నదిగా మారిందని ప్రతీతి(ఆ మాయాశక్తి నేటికీ అశ్వరూఢాంబిక(గుర్రాలక్కమ్మ)గా స్థానికుల పూజలందుకుంటోంది). తన కోరిక తీర్చిన నరసింహస్వామిని అక్కడే అవతరించాల్సిందిగా వశిష్ఠ మహర్షి కోరిన మీదట స్వామి అంతర్వేదిలో వెలశాడని స్థలపురాణం. మరో కథనం ప్రకారం... బ్రహ్మదేవుడు నీలకంఠేశ్వరుడి అనుగ్రహం కోసం యాగం చేయదలచి దానికి వేదికగా ఈ క్షేత్రాన్ని ఎంచుకున్నాడు కాబట్టి అంతర్వేది అనే పేరు వచ్చిందని చెబుతారు.

## ఆలయనిర్మాణం...

శాసనాల ద్వారా తెలుస్తున్న వివరాల ప్రకారం... పూర్వం మందపాటి కేశవదాసు అనే పశువుల కాపరి అంతర్వేది ప్రాంతంలో గొడ్లు కాసుకుంటుంటే ఒక ఆవు అక్కడ పుట్టలో పాలధారలు విడవటం చూసి భయపడ్డాడు. ఆ రోజు రాత్రి నరసింహస్వామి అతని కలలో కనిపించి తానుండే ప్రదేశం గురించి చెప్పడంతో అతను గ్రామస్థుల్ని కూడగట్టుకుని పుట్టను తవ్విచూడగా విగ్రహం లభ్యమైంది. అప్పుడు కేశవదాసు స్వామికి చెక్కలు, కర్రలతో మందిరం నిర్మించాడట. అనంతరకాలంలో... సప్తసాగర యాత్రకు వచ్చిన రెడ్డిరాజులు జాతిదారువుతో ఆలయాన్ని నిర్మించారని తెలుస్తోంది. ఇక ప్రస్తుతం ఉన్న ఆలయాన్ని బెండమూర్లంకకు చెందిన కొపనాతి ఆదినారాయణ కుమారుడు కృష్ణమ్మ క్రీ.శ. 1823లో నిర్మించినట్లు శాసనాలు చెబుతున్నాయి. తొలుత పెద్దాపురం సంస్థానాధీశుల అధీనంలో ఉన్న ఆలయం తర్వాత మొగల్తూరు రాజుల అజమాయిషీలోకి వచ్చింది. స్వామివారికి ఆయా సంస్థానాధీశులు, ఆలయ నిర్మాత కృష్ణమ్మ సమకూర్చిన బంగారు దివ్యాభరణాలు చాలానే ఉన్నాయి.



వీటిని రాజోలు ఉప ఖజానాలో భద్రపరిచారు. ఏటా కల్యాణోత్సవ సమయాన శ్రీస్వామి, అమ్మవార్లకు వాటిని అలంకరిస్తారు. వీటిలో కిరీటం, వైరుముడి, కంఠె, శఠగోపం, మొహరీల దండ, పచ్చలపతకం, ముత్యాల పతకం తదితర ఆభరణాలు ఉన్నాయి.

కల్యాణం జరిగిన మర్నాడు దివ్యరథంపై స్వామివారిని ఉభయ దేవేరులతో ఊరేగించడం సంప్రదాయంగా వస్తోంది. రథంపై కొలువు తీరిన దివ్యమూర్తులను గుర్రాలక్కమ్మ గుడి వరకు తీసుకువెళ్తారు. స్వామి తన సోదరి అయిన గుర్రాలక్కమ్మకు సారె, చీర పెట్టిన వైనాన్ని ఆద్యంతం భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తారు.

## నర్సన్న కల్యాణమైతేనే..

ఏటా మాఘమాసంలో అంతర్వేది నృసింహ స్వామి కల్యాణం అయిన తర్వాతనే స్థానికంగా పెళ్లిళ్లు జరుగుతుంటాయి. మాఘమాసంలో స్వామివారి కల్యాణానికి ముందు ఎంత మంచి ముహూర్తం ఉన్నా పెట్టుకోరు. ఇది అనాదిగా సంప్రదాయంగా వస్తోంది. స్థానిక పల్లిపాలెం గ్రామంలో అయితే 80 శాతానికి పైగా నృసింహ నామధేయులే కనిపించడం విశేషం. స్వామివారి కటాక్షం ఉన్నంతవరకూ ఏ ఉపద్రవాలూ తమ దరిచేరవని స్థానికుల నమ్మకం. ప్రపంచ వ్యాప్తంగా సునామీ బీభత్సం చేసిన సమయంలోనూ ఈ ప్రాంతమంతా ప్రశాంతంగా ఉండటానికి నరసింహుడి దయే కారణమంటారు.

ఈ క్షేత్రంలో కనిపించే మరో విశేషం... ఏటా మాఘమాసంలో కొద్దిరోజులపాటు సూర్యాస్తమయ సమయంలో కిరణాలు గర్భగుడిలోని స్వామి వారి పాదాలను తాకడం. ఆ దృశ్యాన్ని చూసి భక్తులు పులకించిపోతారు.

ఇంకా, ఈక్షేత్రంలో చూడదగ్గ విశేషాలు... చక్రపెరుమాళ్ విగ్రహం, వశిష్ఠ సేవాశ్రమం, బ్రిటిషర్లు నిర్మించారని చెప్పే లైట్‌హౌస్. ఆలయానికి సమీపంలోనే ఉన్న వశిష్ఠ సేవాశ్రమంలో సప్తరుషుల విగ్రహాలను ప్రతిష్ఠించారు. పక్కనే గురుపుత్ర విశ్వవిద్యాలయం, మాతాశిశు సంరక్షణాలయం, గౌతమి గో యజ్ఞ పరిరక్షణ, పరిశోధనాలయాలు కూడా ఉన్నాయి.

– కడియం త్రినాథస్వామి, న్యూస్‌టుడే, మామిడికుదురు




# ఓప్రా షో... వెండి పండగ!

**ఓప్రా విన్ ఫ్రే షో... ప్రపంచవ్యాప్తంగా ప్రాచుర్యం పొందిన ఎన్నో టాక్‌షోలకు మూలం. 'ఈ టాక్‌షోను మొదలుపెట్టి దాదాపు పాతికేళ్లు కావస్తోంది, ఇక 2011 సెప్టెంబరులో ముగింపు పలుకుతాను' అని ప్రకటించింది ఓప్రా. ఈ నేపథ్యంలో ఆ షో గురించిన కాసిన్ని విశేషాలు...**

'ఓప్రా విన్‌ఫ్రే షో' అసలు పేరు 'ఎ.ఎం.షికాగో షో'. 1983లో ఈ టాక్‌షో నిర్వహణలో తొలిసారి పాలుపంచుకుంది ఓప్రా. అప్పట్లో ఈ షోకి పెద్దగా ఆదరణ లేదనే చెప్పాలి. కానీ ఓప్రా వచ్చాక కొన్ని నెలల వ్యవధిలోనే ఈ షో టెలివిజన్ రేటింగుల్లో అట్టడుగు నుంచి అగ్రస్థానానికి చేరుకుంది.

❖ 1986లో 'ఎ.ఎం.షికాగో షో' పేరు ఓప్రా విన్‌ఫ్రే షో గా మారింది. నాలుగేళ్ల తర్వాత ఈ షోని ఓప్రా సొంతంగా రూపొందించడం మొదలుపెట్టింది. 'హార్పో (HARPO-ఓప్రా అనే పేరుని తిరగేస్తే హార్పో అని వస్తుంది)' పేరిట స్టూడియోను ఏర్పాటు చేసుకుని ఈ షోని తానే నిర్వహించింది.

❖ ఓప్రా విన్‌ఫ్రే షోకు ఇది రజతోత్సవ సంవత్సరం. ఈ షోను మొదలుపెట్టి 2011, సెప్టెంబర్ నాటికి 25 సంవత్సరాలు పూర్తవుతాయి. ఈ పాతికేళ్లలో 5000కు పైగా ఎపిసోడ్స్ ప్రసారమయ్యాయి. ఒక్కో ఏడాదినీ ఒక్కో సీజన్‌గా లెక్కేస్తే అమెరికన్ టెలివిజన్ చరిత్రలో వరసగా 19 సంవత్సరాలపాటు అగ్రస్థానంలో నిలిచిన టాక్‌షో ఇదే.

❖ మీడియాకు అంతగా ఇంటర్వ్యూలివ్వని మైకేల్‌జాక్సన్ ఓప్రావిన్‌ఫ్రే షోకి హాజరయ్యాడు. జాక్సన్ విటిలిగో(బొల్లి) వ్యాధితో బాధపడుతున్న విషయం ప్రపంచానికి ఈ షో ద్వారానే తెలిసింది.

❖ ఓప్రా విన్‌ఫ్రే షోని వారానికి దాదాపు ఐదుకోట్ల మంది చూస్తారని అంచనా. షో జరిగేటప్పుడు స్టూడియోలో మూడొందల మంది వీక్షకులుంటారు. అలా ఈ ఇరవై ఐదేళ్లలో ఈ షోని ప్రత్యక్షంగా చూసిన ప్రేక్షకుల సంఖ్య పదకొండు లక్షల పైమాటే!

❖ ఆస్ట్రేలియా నుంచి ఆఫ్రికా దాకా... ప్రపంచవ్యాప్తంగా 117 దేశాల్లో ఓప్రావిన్‌ఫ్రే షో ప్రసారమవుతోంది.

❖ ఇప్పటివరకూ ఈ షోలో పాల్గొన్న ప్రముఖుల సంఖ్య 900కు పైమాటే. ఇక గిన్నిస్ రికార్డులు సాధించినవారూ జీవితంలో ఘోరకష్టాలను అనుభవించి మానసిక స్థైర్యంతో పైకొచ్చినవారూ... ఇలాంటి వారందరినీ కలుపుకొంటే దాదాపు 28,000 మంది ఈ షోలో పాల్గొన్నారు. అందరికన్నా అత్యధికంగా ప్రముఖ హాలీవుడ్ నటి జూలియారాబర్ట్స్ దాదాపు పదిసార్లు ఈ షోలో పాల్గొంది. పురుషుల్లో ఎక్కువసార్లు ఈ షోలో కనిపించిన ఘనత అమెరికన్ నల్లజాతి గాయకుడు లూథర్ వాండ్రాస్‌కి దక్కింది.

❖ ఇక దేశాధినేతలూ తదితర ప్రముఖుల విషయానికొస్తే... ముగ్గురు ప్రెసిడెంట్లు(బిల్ క్లింటన్, జార్జిబుష్, ఒబామా) ఈ షోకి



హాజరయ్యారు. ఇంకా... నలుగురు (అమెరికా) ప్రథమమహిళలూ ఒక మహారాణి(జోర్డాన్ రాణి రానియా), మరొక మాజీ మహారాణి, ఆరు దేశాల యువరాజులూ ఆరుగురు యువరాణులూ... ఓప్రా షోకి వన్నెతెచ్చారు.

❖ 1989లో తన షోకి వీక్షకాదరణ పెంచుకునేందుకో కొత్త ఆలోచన చేసింది ఓప్రా. అలాస్కా రాష్ట్రానికి చెందిన కొందరు బ్రహ్మచారులను ఎంపిక చేసుకుని వారందరినీ ఒకే విమానంలో షికాగోకి తీసుకెళ్లింది. ఈ విషయాన్ని ముందుగానే ప్రచారసాధనాల ద్వారా హోరెత్తించడంతో ఆ అబ్బాయిలలో తమకు నచ్చేవాడెవరైనా ఉంటారేమోనన్న ఆశతో టీనేజీ అమ్మాయిలు వేలాదిగా ఎయిర్‌పోర్ట్‌కు తరలివచ్చారు.

❖ 2005లో తన షో చూడ్డానికి స్టూడియోకి వచ్చిన 300 మందికీ పప్పుబెల్లాలు పంచిపెట్టినట్టు కార్లు పంచిపెట్టింది ఓప్రా. అందుకు ఆవిడ తన సొంత సొమ్ము వినియోగించలేదను కోండి. తమ సంస్థకు ప్రచారం కోసం ఓ కార్ల కంపెనీ వారు చేసిన ఏర్పాటు అది. పేరు మాత్రం ఓప్రాకే వచ్చింది.

❖ గత పాతికేళ్లుగా తన కార్యక్రమాన్ని క్రమం తప్పకుండా చూస్తున్న ప్రేక్షకుల్లో 300 మందిని 'విశిష్టప్రేక్షకులు' పేరుతో ఎంపిక చేసింది ఓప్రా. ఈఏడాది సిరీస్ ప్రారంభించే నేపథ్యంలో ఆ మూడొందల మందినీ ప్రత్యేకవిమానంలో ఆస్ట్రేలియాకు తీసుకెళ్లి అక్కడే రెండువారాల కార్యక్రమాన్ని రూపొందించింది. ఇందుకోసం అయ్యే ఖర్చులో సగభాగాన్ని ఆస్ట్రేలియా పర్యాటక శాఖ భరించింది. ఇక ఈ సిరీస్‌కి వచ్చిన తొలి విశిష్ట అతిథి జాన్ ట్రవోల్టా.

...అవండీ ఓప్రా షో 'సమ్'గతులు.

ఈ చివరి సిరీస్‌లో భారత్, చైనాలకు ప్రాముఖ్యం ఇస్తానని ప్రకటించిందామె. మరి ఆమాటను ఎంతవరకూ నిలబెట్టుకుంటుందో చూడాలి. ★

## 'ఓప్రా షో'లో మనోళ్లు!

**ఓప్రా విన్‌ఫ్రే షోకి హాజరైన తొలి భారతీయ వ్యక్తి... అందాలసుందరి ఐశ్వర్యారాయ్. అదికూడా ఒకసారి కాదు, రెండుసార్లు పాల్గొంది. మొదటిసారి పెళ్లికాకముందు. ఆ షోలో ఐశ్వర్యారాయ్ ప్రత్యేకంగా రెండు చీరలు తీసుకెళ్లి అందులో ఒక చీరను ఓప్రాతో కట్టించడం విశేషం. పెళ్లయిన**




ఓప్రా చీరకట్టింది...

**తర్వాత ఐషూ తన భర్త అభిషేక్ బచ్చన్‌తో కలిసి మరోసారి పాల్గొంది. ఇక ఆ షోలో కనిపించిన మరొక ఇండియన్ ఆస్కార్ పురస్కార గ్రహీత...ఎ.ఆర్.రెహమాన్. మూడో వ్యక్తి గుజరాత్‌లో ఒక సంస్థానానికి చెందిన యువరాజు మన్వేంద్రసింగ్. స్వలింగసంపర్కి అయిన మన్వేంద్రసింగ్ స్వలింగ సంపర్కులు, లింగమార్పిడి చేయించుకున్నవారి హక్కుల కోసం పోరాడుతున్నారు. షోలో ఈయన 'నేనే పూర్తిస్థాయి పురుషుడినైతే మిమ్మల్ని పెళ్లి చేసుకుని ఉండేవాడిని' అంటూ ఓప్రాకే పెళ్లి ప్రపోజల్ పెట్టారు. 2007లో అక్రిత్ జైస్వాల్ అనే కుర్రాణ్ని కూడా ఓప్రా ఇంటర్వ్యూ చేసింది. మూడేళ్లకే షేక్స్‌పియర్‌ని చదవడం మొదలుపెట్టిన బాలమేధావి అక్రిత్.**



# చేతిలో చెయ్యేసి...

**ఆ చేతులు ఆదుకుంటాయి. అక్షరాలు నేర్పిస్తాయి. శిక్షణ అందిస్తాయి. రుణాలు మంజూరుచేస్తాయి. సామాజిక సమస్యల పరిష్కారంలో అండగా ఉంటాయి. తమిళనాడులోని కాంచీపురంలో ఓ చిన్న స్వచ్ఛంద సంస్థగా ప్రారంభమై అంతర్జాతీయంగా సేవలందిస్తోంది 'హ్యాండ్ ఇన్ హ్యాండ్'.**



కంచిలో సూర్యోదయం బావుంటుంది. బద్ధకంగా నిద్ర లేచిన సూరీడు కామాక్షమ్మ గోపురం వెనుక ఒళ్లు విరుచుకున్నాక కానీ డ్యూటీ మొదలుపెట్టడు. సరిగ్గా అదే సమయానికి... పెర్సీ బార్నవిక్ మార్నింగ్‌వాక్ ప్రారంభమవుతుంది. ఆయన స్విట్జర్లాండులోని ఓ పెద్ద ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ కంపెనీకి చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసరుగా పనిచేశారు. మన దేశంతో ఆయనకున్న అనుబంధం చాలా గొప్పది. భారత్ అజేయశక్తిగా ఎదుగుతోందంటే, ఆర్థిక సంక్షోభాల్లోనూ నిబ్బరంగా వ్యవహరిస్తోందంటే... అందుకు కారణం ఆర్థిక సంస్కరణలతో సాధించిన ఆత్మవిశ్వాసమే. ఆ సంస్కరణలకు ఆద్యుడు దివంగత ప్రధాని పి.వి.నరసింహారావు అన్న సంగతి ప్రపంచానికంతా తెలుసు. తెరవెనుక ఉండి, వ్యూహరచనలో తనవంతు సాయం చేసిన బార్నవిక్ గురించి మాత్రం చాలామందికి తెలియదు. ప్రచారం చేసుకోవాలన్న కోరికా ఆయనకు లేదు. విధి నిర్వహణలో భాగంగా ఆయన భారతదేశానికి చాలాసార్లు వచ్చారు. దేశమంతా తిరిగారు. చూసితీరాల్సిన చారిత్రక ప్రదేశాలన్నీ చూసివచ్చారు. ఎందుకో కంచికి వెళ్లినప్పుడు మాత్రం శాశ్వతంగా అక్కడే ఉండాలనిపించేది. రాజగోపురాలు కాదు, నిరుపేదల గుడిసెలు ఆయన దృష్టిని ఆకర్షించాయి. పట్టుచీరల కంటే, పట్టెడన్నంలేని బతుకులే ఆయన హృదయంలో స్థానం సంపాదించాయి. మురికివాడల్లోని నిరుపేద బాలలు ఆయన నేస్తాలయ్యారు. మార్నింగ్ వాక్‌కి ఆయన ఎప్పుడొస్తారా అని ఎదురు చూసే చిట్టిపొట్టి స్నేహితులు చాలామందే ఉంటారు. కథలు, సామెతలు, సందేహాలు, సమాధానాలు... ఆ కబుర్లకు అంతే ఉండదు. నడక ఓ సాకు మాత్రమే.

అందమైన బాల్యం కార్ఖానాల్లో బందీ కావడం ఆయనకు నచ్చలేదు. 'మీరంతా బడికెళ్లొచ్చుగా?' ఓసారి ఎప్పుడో యాదృచ్ఛికంగా అడిగారు. 'మమ్మల్ని ఎవరు చదివిస్తారు?' ప్రశ్నకు ప్రశ్నే సమాధానమైంది.

ఇంకోసారి చర్చ ఆరోగ్యం మీదికి మళ్లింది?

'రోజూ పాలూగుడ్డూ తీసుకోవాలి' పిల్లలకి సూచించారు.

'మాకెవరు ఇస్తారు? '...ఇంకో ప్రశ్న.

'మీనాన్న ఏదైనా వ్యాపారం చేసుకోవచ్చుగా' సలహా ఇచ్చారు, ఎవరో కుర్రాడికి.

'డబ్బెవరు ఇస్తారు? '

బాణంలా మరో ప్రశ్న.

ఎవరు? ...ఎవరు? ...ఎవరు?

ఆ ఎవరు...తానే ఎందుకు కాకూడదు?

బార్నవిక్ బాధ్యత తీసుకున్నారు.

'నేనున్నాను'..చేతిలో చెయ్యేసి ధైర్యం చెప్పారు. ఆ వెచ్చటి స్పర్శలోంచి 'హ్యాండ్ ఇన్ హ్యాండ్' స్వచ్ఛంద సంస్థ పుట్టుకొచ్చింది. అప్పటికి నాలుగేళ్ల క్రితమే, స్వీడన్‌కు చెందిన కొంతమంది మహిళలు కంచిలో బాల కార్మికులను బళ్లో చేర్పించే కార్యక్రమం చేపట్టారు. తీరాచూస్తే సరైన పాఠశాలలు ఒక్కటీ లేవు. దీంతో తామే ఓ స్కూలు ప్రారంభించారు. బార్నవిక్ మీద వాళ్ల ప్రభావమూ ఉంది. ఆ ఆవరణే 'హ్యాండ్ ఇన్ హ్యాండ్' సేవా కార్యక్రమాలకు ప్రధాన కేంద్రమైంది.

పేదరికం కడుపుచల్లని తల్లి. గంపెడు పిల్లలు. పుట్టెడు సమస్యలు. అనారోగ్యం, నిరక్షరాస్యత, నిరుద్యోగం, బాలకార్మిక వ్యవస్థ, వలసలు...ఆ తల్లి బిడ్డలే. అందుకే, పేదరిక నిర్మూలనే ప్రధాన లక్ష్యంగా ఉపాధి అవకాశాలకు చాలా ప్రాధాన్యమిచ్చింది 'హ్యాండ్ ఇన్ హ్యాండ్'. సూక్ష్మరుణాలు, విద్య, ఆరోగ్యం, పౌరకేంద్రాలు, పర్యావరణం... నిరుపేదల జీవితాలతో ముడిపడిన ఐదు అంశాల చుట్టూ ఆ సంస్థ లక్ష్యాలు పెనవేసుకున్నాయి. ఈ ఎనిమిదేళ్లలో దాని పరిధులు కూడా విస్తరించాయి. కంచితో మొదలుపెట్టి... తమిళనాడులోని పదిహేడు జిల్లాల్లో సేవలు అందిస్తోంది. పాండిచ్చేరి, కర్ణాటక, మధ్యప్రదేశ్‌లలో కార్యక్రమాలు ప్రారంభించింది. దక్షిణాసియా, అఫ్గాన్, బ్రెజిల్ దేశాల్లో స్థానిక స్వచ్ఛందసంస్థల భాగస్వామ్యంలో పనిచేస్తోంది. ఇంటర్ అమెరికన్ డెవలప్‌మెంట్ బ్యాంకుకు సలహాదారుగా వ్యవహరిస్తోంది.

ఇంతతక్కువ కాలంలో 'హ్యాండ్ ఇన్ హ్యాండ్' ఈ స్థాయికి ఎదగడం మామూలు విషయం కాదు. పారదర్శకత, నిజాయతీ, సమస్య మూలాల్ని అర్థంచేసుకునే నైపుణ్యం, పరిష్కారాన్ని కనిపెట్టగల నేర్పు...అన్నింటికీ మించి బార్నవిక్ నిర్వహణ సామర్థ్యం 'హ్యాండ్ ఇన్ హ్యాండ్'ను ఈ స్థాయికి తీసుకొచ్చాయి. ఈ సేవా ఉద్యమానికి అండగా నిలిచిన డాక్టర్ కల్పనాశంకర్ గురించి ప్రత్యేకంగా చెప్పుకోవాలి. ఆమె ఓ ఉన్నతాధికారి సతీమణి. కలెక్టరు భార్యగా బంగళాకే పరిమితం కాకుండా, ప్రజలమధ్యకు వెళ్లేవారు. పేదల సమస్యలు పరిష్కరించేవారు. ఆ అనుభవంతోనే 'హ్యాండ్ ఇన్ హ్యాండ్' స్వచ్ఛంద సంస్థలో బాధ్యతలు స్వీకరించారు. తొలిరోజుల్లో...ఏడాదికి మూడువందల రోజులు మారుమూల పల్లెల్లోనే గడిపేవారు. సంస్థ విస్తరించేకొద్దీ ఆమె బాధ్యతలు పెరిగాయి. ప్రస్తుతం, చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసరు హోదాలో పాలన వ్యవహారాలు చూస్తున్నారు.

అంతర్జాతీయంగా ఇన్ని కార్యక్రమాలు నిర్వహించాలంటే ఎంత డబ్బు కావాలి? ఎన్నివేలమంది సిబ్బంది అవసరమవుతారు?

'నిజమే, ఏ స్వచ్ఛంద సంస్థ నిర్వహణకైనా నిధులు అవసరమే. కానీ, మేం సాధ్యమైనంత పొదుపుగా కార్యక్రమాలు నిర్వహిస్తాం. స్థానిక నైపుణ్యాలను ఉపయోగించుకుంటాం. భారత్‌లోనే కాదు, ప్రపంచంలో ఎక్కడైనా ఇదే



మా విధానం' అంటారు సీయీవో కల్పన. అంతర్జాతీయ సంస్థలు, ప్రభుత్వాలు, కార్పొరేట్ సంస్థలు, దాతలు...అంతా తలోచేయీ వేసి, సంస్థను ముందుకు నడిపిస్తున్నారు.

'నువ్వు ఎన్ని జీవితాల్ని మార్చావు?'

స్వచ్ఛంద సంస్థలో పనిచేస్తున్న ఏ కార్యకర్త కనిపించినా బార్నవిక్ అడిగే తొలిప్రశ్న ఇదే.

ఆ లెక్కన 'హ్యాండ్ ఇన్ హ్యాండ్' సాయంతో మారిన జీవితాల సంఖ్య...ఆరు లక్షల పైమాటే.

ఆ మార్పు అంత సులభంగా ఏం సాధ్యపడలేదు. ప్రతి ప్రయత్నం ఒక పాఠమే. ప్రతి వైఫల్యం ఒక అనుభవమే. తొలిరోజుల్లో బాలకార్మిక వ్యవస్థ మీద దృష్టిపెట్టినప్పుడే, సమస్య మూలాలు అర్థమయ్యాయి. ప్రతి ఇంట్లో ముగ్గురు నలుగురు పిల్లలు. ఒక్కరు కూడా బడికెళ్లరు. ఆలయాల దగ్గర అడుక్కుంటూనో, పట్టుపరిశ్రమలో పనిచేస్తూనో బాల్యాన్ని బుగ్గిపాలు చేసుకుంటున్నవారే ఎక్కువ. కారణం ..అమ్మానాన్నల ఆర్థిక పరిస్థితి. ముప్పుతిప్పలు పెడుతున్న అప్పులు. ఆ పిల్లలు పుట్టుకతోనే షావుకార్లకు బానిసలై పోతున్నారు. ఐదువేల కోసం, పదివేల కోసం వెట్టిపాలైన వాళ్లూ ఉన్నారు. మూడుపూటలా పొయ్యి వెలగడమే గగనమైన కుటుంబాల్లో పౌష్టికాహారం ఎక్కడి నుంచి వస్తుంది? రోగాల్ని తట్టుకునేశక్తి అసలెక్కడ ఉంటుంది? ఈ సమస్యల వలయాన్ని ఛేదించేదాకా... ఏ మార్పూ సాధ్యం కాదు. అందుకే, ముందుగా కన్నవారిమీద దృష్టిసారించింది. పరిస్థితుల్ని మార్చేప్రయత్నం మొదలుపెట్టింది. అందులోనూ మహిళల సమర్థత మీద, వాళ్ల పట్టుదల మీద బార్నవిక్‌కు చాలా నమ్మకం. కుటుంబం బాగుపడాలన్న తపన ఆమెతో ఎన్ని అద్భుతాలైనా చేయిస్తుందని ఆయన విశ్వాసం. ప్రయోగాత్మకంగా వంద నిరుపేద కుటుంబాలను ఎంచుకున్నారు. ఒక్కో మహిళకూ పాతికవేల చొప్పున అప్పుగా ఇచ్చారు. బొమ్మల తయారీ, పశుపోషణ, పూలదుకాణం...ఎవరికి నచ్చిన వ్యాపారాన్ని వారు ఎంచుకోవచ్చు. ఏడాది తిరిగేలోపు జీవితాలే మారిపోయాయి. నెలనెలా స్థిరమైన ఆదాయాన్ని కళ్లజూడటం మొదలుపెట్టారు. అప్పు తీర్చగల స్తోమత వచ్చింది. ఆ అనుభవంతో లక్ష్యసాధనలో 'హ్యాండ్ ఇన్ హ్యాండ్'కు ఓ స్పష్టత వచ్చింది. అప్పుడే, మైక్రోఫైనాన్సింగ్ విభాగం ప్రాణం పోసుకుంది.

చిన్నచిన్న మొత్తాలు పెద్ద ఫలితాలే సాధించాయి. ఆ పదివేలో పాతికవేలో లేకపోవడం వల్లే నిన్న మొన్నటిదాకా కూలీలుగా పనిచేసినవారూ కార్మికులై బతుకు వెళ్లదీస్తున్న వారూ...తమదైన ఓ వ్యాపార సామ్రాజ్యానికి అధినేతలు అయ్యారు, అది చిన్నదే కానివ్వండి. శిల్పుల కుటుంబానికి చెందిన పద్మావతి పదిహేనువేల రుణం తీసుకుని, కుటుంబ వృత్తికి అవసరమైన ముడిసరుకు కొనుక్కుంది. భర్తతో కలిసి వ్యాపారం చేస్తోంది. 'నాకిప్పుడు ఎంత సంతోషంగా ఉందో!' అంటుందామె కళ్లింతలు చేసుకుని. పదోతరగతి దాకా చదివిన నిర్మల బ్యూటీపార్లర్ ప్రారంభించింది. ఆ ఆదాయంతో పిల్లల్ని చదివించుకుంటోంది. నజ్మా సైకిలు రిపేరు దుకాణం ఈమధ్యే లాభాల్లోకి వచ్చింది. తమిళనాడులోని పల్లె ప్రాంతాల్లో ఇలాంటి విజయగాథలు చాలా వినిపిస్తాయి.

'సాయం చేయడం అంటే, డబ్బు ఇవ్వడం కాదు. డబ్బు సంపాదించుకునే మార్గం చెప్పడం, అందుకు అవసరమైన శిక్షణ ఇప్పించడం...' అని బార్నవిక్ అభిప్రాయం. సూక్ష్మరుణాలకు మహిళల ఎంపిక కూడా అచ్చంగా ఆ మార్గంలోనే నడుస్తుంది. సంస్థ కార్యకర్తలు పల్లెపల్లెకూ వెళ్తారు. మహిళల్ని కలుసుకుంటారు. అవసరాలు తెలుసుకుంటారు.



## ఎంవీ ఫౌండేషన్ సహకారంతో...



ఉపాధి అవకాశాల్ని సృష్టించడం ద్వారా పేదరికాన్ని నిర్మూలించాలన్నది బార్నవిక్ ఆలోచన. ఆ దిశగా ఆయన అంకిత భావంతో కృషిచేస్తున్నారు. బాలకార్మికుల సంక్షేమానికి ఏదైనా మంచి కార్యక్రమం చేపట్టాలన్న ఆలోచన రాగానే 'హ్యాండ్ ఇన్ హ్యాండ్' ప్రతినిధులు మామిడిపూడి వెంకటరంగయ్య ఫౌండేషన్‌ను సంప్రదించారు. మేం ఆ రంగంలో ఎన్నో ప్రయోగాత్మక కార్యక్రమాలు చేపట్టాం. ఆ అనుభవంతోనే ప్రాజెక్టుల రూపకల్పనలో వారికి సహకరించాం. తమిళం బాగా తెలిసిన కొంత మంది కార్యకర్తలు కాంచీపురానికి వెళ్లి శిక్షణ ఇచ్చి వచ్చారు. బ్రిడ్జి కోర్సుల ఏర్పాటు కూడా మా ఆలోచనే. బోర్డు సమావేశాల్లో చర్చలకూ మేధో మథనానికీ బార్నవిక్ చాలా ప్రాధాన్యం ఇస్తారు. వివిధ సందర్భాల్లో ఆయనతో నా ఆలోచనల్నీ భావాల్నీ పంచుకునే అవకాశం వచ్చింది.

– ఆర్. వెంకట్‌రెడ్డి, ఎంవీ ఫౌండేషన్ ప్రాజెక్టు కోఆర్డినేటర్
'హ్యాండ్ ఇన్ హ్యాండ్' బోర్డ్ ఆఫ్ ఇండియా ట్రస్టీ

## అంకెల్లో... అద్భుతాలు!

జూన్ 2010 నాటికి 'హ్యాండ్ ఇన్ హ్యాండ్' తమిళనాడులోని పద్దెనిమిది జిల్లాలతోపాటు పాండిచ్చేరి, కర్ణాటక, మధ్యప్రదేశ్ రాష్ట్రాలకూ విస్తరించింది. దక్షిణాఫ్రికా, అఫ్గానిస్థాన్, బ్రెజిల్‌లలో సేవలందిస్తోంది.

★ సుమారు 40వేల స్వయం సహాయక సంఘాలను ఏర్పాటుచేసింది. ఇందులో 5.7 లక్షలమంది మహిళలు సభ్యులు. వీళ్లంతా కలిసి 4.7లక్షల వ్యాపారాలు ప్రారంభించారు.

★ ఇప్పటిదాకా రూ.208 కోట్ల మొత్తాన్ని సూక్ష్మరుణాలకింద మంజూరు చేశారు. సంస్థ ప్రోత్సాహంతో బ్యాంకులూ ఇతర సంస్థలూ ఇచ్చిన రుణాలు రూ.200 కోట్లు.

★ 'హ్యాండ్ ఇన్ హ్యాండ్' పాఠశాలలూ విద్యాకేంద్రాల్లో సుమారు రెండువేలమంది చిన్నారులున్నారు. మధ్యలో బడిమానేసిన పిల్లలకోసం 48 ట్రాన్సిట్ స్కూళ్లను ఏర్పాటు చేశారు.

★ వైద్యశిబిరాల ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో 1.2 లక్షలమంది నిరుపేదలకు పరీక్షలు నిర్వహించారు.

★ 3 వేల మరుగుదొడ్లు నిర్మించారు.

★ పోషకవిలువల లోపంతో బాధపడుతున్న మూడువేల మంది చిన్నారులకు పోషకాహారాన్ని అందిస్తున్నారు.

★ మారుమూల గ్రామాల్లో వైద్యసేవలకోసం 10 ప్రజావైద్య కేంద్రాలు ఏర్పాటు చేశారు.

★ లక్షన్నర కుటుంబాలు చెత్తనిర్వహణ కార్యక్రమాన్ని చేపడుతున్నాయి.

★ 2200 పౌరసేవా కేంద్రాలు ఏర్పాటు చేశారు.

★ 610 పంచాయతీల్లో బాలకార్మిక వ్యవస్థకు వ్యతిరేకంగా పోరాటం సాగించారు. ఫలితంగా అవన్నీ బాలకార్మికుల్లేని పంచాయతీలుగా రికార్డులకెక్కాయి.

★ 'హ్యాండ్ ఇన్ హ్యాండ్'లో సుమారు 2500 మంది పనిచేస్తున్నారు. స్వచ్ఛంద సేవకుల సంఖ్య 38,000.

ఆసక్తులు అర్థంచేసుకుంటారు. చదువులు చెబుతారు. చేతివృత్తుల్లో శిక్షణ ఇస్తారు. వడ్డీ లెక్కగట్టడం, ఖాతాలు నిర్వహించడం నేర్పిస్తారు. స్వయం సహాయక బృందాలు ఏర్పాటు చేస్తారు. ఓ వ్యాపార సంస్థను సమర్థంగా నడుపుకునేలా సానబట్టడమే, ఇక్కడ ప్రధాన లక్ష్యం. సభ్యులంతా తమ సంపాదనలోంచి కొంత భాగాన్ని తీసిపెట్టి, అవసరమైనవారికి అప్పుగా ఇచ్చుకుంటారు. అది కూడా వ్యాపారపరమైన అవసరాలకే. మలిదశలో సంస్థ తనవంతుగా మరింత రుణాన్నిస్తుంది. ఇందుకు ప్రత్యేకంగా నాన్ బ్యాంకింగ్ ఫైనాన్షియల్ కంపెనీని ఏర్పాటు చేశారు. ఇక్కడ నిబంధనల పేరుతో ఇబ్బంది పెట్టరు. తాకట్టు అనీ, హామీకత్తు అనీ వేధించరు. తిరిగి చెల్లించాలన్న చిత్తశుద్ధే తిరుగులేని అర్హత. మార్కెట్‌తో పోలిస్తే వడ్డీ కూడా తక్కువగానే ఉంటుంది.

## ప్రజల ఆసుపత్రులు

పేదరికం, అనారోగ్యం జంట కష్టాలు. ఒకటున్నచోట మరొకటి ఉండితీరుతుంది. పేదరికం నుంచి బయటపడాలంటే అనారోగ్యానికి దూరంగా ఉండాలి. సర్కారీ దవాఖానాల్లో డాక్టర్లుండరు. కార్పొరేట్ ఆసుపత్రులేమో లోపలికి కూడా రానివ్వవు. అందుకే, 'హ్యాండ్ ఇన్ హ్యాండ్' ప్రజల చేత, ప్రజల కోసం ప్రజలే నిర్వహించుకునే వైద్యశాలల్ని ప్రోత్సహిస్తోంది. కమ్యూనిటీ హాలులోనో, పంచాయతీ ఆఫీసులోనో ఆసుపత్రి నడుస్తుంది. కుర్చీలూ టేబుళ్లూ అక్కడున్నవే వాడుకుంటారు. డాక్టర్లకూ నర్సులకూ సంస్థ జీతాలిస్తుంది. మందుల్ని కార్పొరేట్ కంపెనీలు స్పాన్సర్ చేస్తాయి. చెల్లించాల్సిన ఫీజు ఐదు రూపాయలు. ఆ మొత్తాన్ని నిర్వహణ ఖర్చులకు వాడుకుంటారు. వారానికోరోజు డాక్టరు వస్తాడు. రోగులే ఆ ఆసుపత్రి యజమానులు కాబట్టి శ్రద్ధగా వైద్యం చేస్తాడు. ఈ ప్రయోగం చాలా విజయవంతమైంది. ఈ పద్ధతిలోనే భవిష్యత్తులో నర్సింగ్‌హోమ్‌లూ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రులూ రూపుదిద్దుకోవాలని బార్నవిక్ ఆలోచన. వీటి నిర్వహణకు ఐఐటీ మద్రాసు విద్యార్థులు సాంకేతిక సహాయం అందిస్తున్నారు. పర్యావరణంలో ఏ తేడా వచ్చినా ఆ ప్రభావం ముందుగా పేదల మీదే పడుతుంది. పరిసరాల్లోని అపరిశుభ్రత కారణంగా వచ్చే అంటు వ్యాధులు







పూరిగుడిసెల మీదే దాడి చేస్తాయి. అందుకే 'హ్యాండ్ ఇన్ హ్యాండ్' గ్రామాల్లో పర్యావరణ మిత్రులను నియమించింది. ప్రజల్లో అవగాహన పెంచడమే వీళ్ల బాధ్యత. ప్రతి ఇంటికీ ఓ చెత్తకుండీ ఇస్తారు. చక్రాల బళ్లలో చెత్త సేకరించి, ఊరిచివర కుప్పగా పోస్తారు. పనికొచ్చే వ్యర్థాలతో వర్మీకంపోస్టు తయారు చేస్తారు. దాన్ని స్థానిక రైతులకు నామమాత్రపు ధరకే అందిస్తారు. స్వయం సహాయక సంఘాల్లోని మహిళలకు పారిశుద్ధ్యం మీద అవగాహన కల్పిస్తారు. ప్రతి ఇంట్లో మరుగుదొడ్డు ఏర్పాటు చేసుకునేలా ప్రోత్సహిస్తారు. అవసరమైతే అందుకు రుణాలిస్తారు. నిర్వహణ సరిగాలేని అంగన్‌వాడీ కేంద్రాల బాధ్యత కూడా సభ్యులే తీసుకుంటారు. వంటగదులనూ మరుగుదొడ్లనూ అద్దాల్లా ఉంచుతారు. ఖాళీ స్థలాల్లో మొక్కలు పెంచుతారు. పళ్లూ పూలూ ప్రజలకే పంచుతారు. చెక్‌డ్యాములు నిర్మించి భూగర్భజలాల పెరుగుదలకు సహకరిస్తారు.

'హ్యాండ్ ఇన్ హ్యాండ్' సహకారంతో గ్రామాల రూపురేఖలే మారిపోయాయి. ముదిచూర్, కారపక్కం గ్రామాలు నిర్మల్ పురస్కారాల్ని అందుకున్నాయి. ప్రజల

# దానాలొద్దు, పెట్టుబడులు కావాలి!

**'హ్యాండ్ ఇన్ హ్యాండ్' వ్యవస్థాపకుడు బార్నవిక్**

ఏ మేనేజ్‌మెంట్ నిపుణుడూ పదవీవిరమణ చేయడు. చేసినా అది ఉద్యోగానికే, సంపాదనకు కాదు. కన్సల్టెంట్‌గా సేవలందిస్తూనో, బిజినెస్ స్కూళ్లలో పాఠాలు చెబుతూనో బ్యాంకుఖాతాలో ఎంతో కొంత జమచేసుకుంటూ ఉంటారు. బార్నవిక్ మాత్రం పదవీ విరమణ తర్వాత సరికొత్త జీవితాన్ని ప్రారంభించారు. 'హ్యాండ్ ఇన్ హ్యాండ్' పేరుతో ఓ సంస్థను ప్రారంభించి, తన సంపాదనలోంచి దాదాపు యాభైకోట్లు ఆ సంస్థకు కేటాయించారు. అలా అని ఆయనేం, కుబేరుల ఇంట్లో పుట్టలేదు. దక్షిణ స్వీడన్‌లోని ఓ మధ్య తరగతి కుటుంబంలో జన్మించారు. తండ్రికి ముద్రణ సంస్థ ఉండేది.



కాలేజీరోజుల్లో చురుకైన విద్యార్థిగా పేరు తెచ్చుకున్నారు. స్టాన్‌ఫర్డ్ గ్రాడ్యుయేట్ స్కూల్ నుంచి పట్టా అందుకున్నాక, వివిధ సంస్థల్లో కీలక బాధ్యతలు నిర్వహించారు. ఎక్కడ పనిచేసినా 'మరింతమందికి ఉపాధి' అన్నదే నినాదం. కెరీర్ తొలిరోజుల్లో ఓ సాదాసీదా సంస్థ పాలన బాధ్యతలు చూస్తున్నప్పుడే, ఏడాదికాలంలో నూటయాభై మందికి ఉద్యోగాలిచ్చారు. ఆ నిర్ణయానికి యాజమాన్యం కూడా అడ్డుచెప్పలేకపోయింది. ఎందుకంటే, ఆ సంవత్సరం విపరీతమైన లాభాలొచ్చాయి. ఇప్పటికీ, యూరప్‌లోని సమర్థులైన సీఈవోల జాబితాలో బార్నవిక్ పేరు కనిపిస్తుంది. అలా అని, ఆయన ప్రచార ఆర్భాటాలంటే ఇష్టపడరు. లండన్‌లోని కార్యాలయ సిబ్బంది సంఖ్య రెండంటే రెండే, ఆయన కాకుండా మరొకరు! సెక్రెటరీ సాయంతోనే పనులన్నీ చక్కబెట్టుకుంటారు. 'విరాళాలూ వితరణలూ పేదరికాన్ని రూపుమాపలేవు. పేదల్లో వ్యాపార నైపుణ్యాన్ని పెంపొందించగలిగితే సగం సమస్య పరిష్కారం అయినట్టే' అంటారాయన. అందుకే హ్యాండ్ ఇన్ హ్యాండ్‌ను 'స్వచ్ఛంద సంస్థ' అంటే అస్సలు ఒప్పుకోరు. 'పేదలే పునాదులుగా ఏర్పాటైన కంపెనీ అది' అని సరిదిద్దుతారు. అక్కడ పనిచేస్తున్న సిబ్బందికి కార్పొరేట్ సంస్థ ఉద్యోగుల్లా టార్గెట్లు ఉంటాయి. ఫలితాల మీద ఎప్పటికప్పుడు బేరీజు ఉంటుంది.

బార్నవిక్ వయసు డెబ్బై. ఆయనకు ముగ్గురు కొడుకులు. ఆరుగురు మనవళ్లూమనవరాళ్లూ. ఎనభైశాతం సమయాన్ని 'హ్యాండ్ ఇన్ హ్యాండ్'కు కేటాయిస్తారు. మిగిలిన ఇరవైశాతంలో పదిశాతం కుటుంబానికి, మరో పదిశాతం ప్రపంచాన్ని చుట్టిరావడానికి. ఆయనకు పర్యటనలంటే మహా ఇష్టం. అలాంటి ఓ పర్యటనే, బార్నవిక్‌ను కంచిపట్టణానికి మంచి మిత్రుణ్ని చేసింది.




ఆరోగ్య పరిస్థితి కూడా మునుపటికంటే మెరుగుపడింది.

## బడిగంటలు

చదువు ఆలోచనాశక్తిని పెంచుతుంది. ఆత్మవిశ్వాసాన్ని నింపుతుంది. అందుకే, 'హ్యాండ్ ఇన్ హ్యాండ్' పేదరిక నిర్మూలన కార్యక్రమాలతోపాటు అక్షరాస్యతకూ అధిక ప్రాధాన్యమిచ్చింది. మనదేశంలో బడివయసు పిల్లల్లో కోటి మందికిపైగా పాఠశాల మొహం చూడటంలేదు. మధ్యలో మానేస్తున్నవారు ఎంతోమంది. అంతా బాలకార్మికుల అవతారమెత్తుతున్నారు. వాళ్లందర్నీ బళ్లో చేర్పించాలన్నది 'హ్యాండ్ ఇన్ హ్యాండ్' ఆశయం. ప్రభుత్వం కూడా సరిగ్గా ఇలాంటి ఆలోచనతోనే వివిధ పథకాలు ప్రారంభించింది. అధికారుల్లో చొరవ తగ్గడంతో అవన్నీ చాలావరకు కాగితాలకే పరిమితం అవుతున్నాయి. లోపాల్ని అధిగమించగలిగితే, ఇక సమస్యేముంది? ఆ బాధ్యత 'హ్యాండ్ ఇన్ హ్యాండ్' తీసుకుంది. ప్రభుత్వ పాఠశాలల్లో ఎలాంటి సమస్యలున్నా వెంటనే ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తుంది. పరిష్కారానికి ప్రజలే కృషిచేసేలా చేస్తుంది. అలా వీలుకాని చోట్ల పిల్లల కోసం పాఠశాలలు, పెద్దలకోసం వయోజన విద్యాకేంద్రాలు ఏర్పాటు చేస్తుంది. రెసిడెన్షియల్ స్కూళ్లు నడుపుతుంది. పదోతరగతి ఫెయిలై, అంతటితో చదువు ఆపేద్దామనుకునేవారికి ప్రత్యేకంగా ట్యూషన్లు చెబుతుంది. పైచదువులకు ప్రోత్సహిస్తుంది. ప్రభుత్వ ఉపాధ్యాయులకు ఆధునిక బోధన పద్ధతుల మీద అవగాహన కల్పిస్తుంది. 'హ్యాండ్ ఇన్ హ్యాండ్' చొరవతో దాదాపు ముప్పైవేల మంది పిల్లలు బడిబాట పట్టారు. ఆ విద్యార్థుల్లో సుప్రియ కూడా ఉంది. తను అరుంపులియూర్ గ్రామంలోని ఓ నిరుపేద కుటుంబంలో పుట్టింది. అమ్మానాన్నలకు ఏడుగురు సంతానం. చదువంటే ప్రాణం. ఆరో తరగతి దాకా వచ్చింది. ఈడొచ్చిన పిల్లని బడికి పంపడమేమిటని వాళ్ల నానమ్మ అడ్డుచెప్పడంతో పుస్తకాలు అటకెక్కాయి. ఆ చదువుల తల్లి మొహం చిన్నబోయింది. 'హ్యాండ్ ఇన్ హ్యాండ్' కార్యకర్తలకు సుప్రియ సమస్య తెలిసింది. పెద్దల్ని ఒప్పించి సంస్థ ఆధ్వర్యంలో నడుస్తున్న 'పూంగవనం' (పూలతోట) స్కూలుకు తీసుకెళ్లారు. వయసుకు తగిన పరిజ్ఞానం సంపాదించాక, ప్రభుత్వ పాఠశాలలో చేర్పించారు. ఇప్పుడు పదోతరగతి చదువుతోంది. క్లాసులో అందరికంటే చురుకైన విద్యార్థి తనే.

## చైతన్య కేంద్రాలు

చిన్న గది. అందులో ఇంటర్నెట్ సౌకర్యం ఉన్న ఒకటి రెండు కంప్యూటర్లు. పక్కనే ఓ బల్ల మీద ఒకటిరెండు దినపత్రికలు, వారపత్రికలు. అరల్లో కొన్ని పుస్తకాలు. 'హ్యాండ్ ఇన్ హ్యాండ్' ఆధ్వర్యంలో నడుస్తున్న పౌర కేంద్రాలన్నీ దాదాపు ఇలానే ఉంటాయి. వీటిని ఎవరైనా ఉపయోగించుకోవచ్చు. ఎలాంటి రుసుమూ ఉండదు. ఓటర్ల జాబితాలో పేరు నమోదు చేసుకోవడం, రేషన్ కార్డు కోసం దరఖాస్తు చేసుకోవడం, వృద్ధాప్య పించన్లకు అర్జీ పెట్టుకోవడం... ప్రజలకు అవసరమైన ఏ పని అయినా ఇక్కడ చేసిపెడతారు. ప్రభుత్వ పథకాల గురించి సమాచారం అందిస్తారు. చట్టాలమీద అవగాహన కల్పిస్తారు. అందులోనూ ప్రజల చేతిలోని పాశుపతాస్త్రం... సమాచారహక్కు చట్టం మీద చైతన్యం కలిగిస్తారు. ఆ గదులు చిన్నవే కావచ్చు, అందులో పనిచేస్తున్న 'హ్యాండ్ ఇన్ హ్యాండ్' కార్యకర్తల హృదయాలు మాత్రం చాలా విశాలం. ఎవరికి ఏ సాయం అవసరమైనా కాదనకుండా చేసిపెడతారు. చాలావరకు వీటిని స్వయం సహాయక బృందాల మహిళలే నిర్వహిస్తారు. గ్రామంలో రోడ్లు అధ్వానంగా ఉన్నా, కుళాయిలో నీళ్లు రాకపోయినా, వీధిదీపాలు వెలగకపోయినా, ప్రభుత్వోద్యోగులు సక్రమంగా పనిచేయకపోయినా, స్కూళ్లలో సౌకర్యాలు మెరుగ్గాలేకపోయినా... ఇలా ఏ సమస్య వచ్చినా ప్రజలు ధైర్యంగా పోరాడేలా తీర్చిదిద్దుతాయి ఈ కేంద్రాలు. వీటి నిర్వహణ ద్వారా మహిళా సంఘాలు ఎంతోకొంత ఆదాయాన్ని సంపాదించుకుంటున్నాయి. డెస్క్‌టాప్ పబ్లిషింగ్, ప్రింట్లు అందించడం తదితర సేవల్ని ఇక్కడ తక్కువ ధరకే చేసి పెడతారు. యాభై రూపాయల ఫీజుతో కంప్యూటర్ పాఠాలు కూడా నేర్చుకోవచ్చు. ఈమధ్యే మొబైల్ సిటిజన్ సెంటర్లు కూడా ప్రారంభించారు. ఇవి పల్లెపల్లెకూ వెళ్లి సేవలందిస్తాయి.

కంచి సమీపంలోని అలీసూర్ గ్రామంలో వందకుపైగా దళిత కుటుంబాలు ఉన్నాయి. పన్నెండేళ్లక్రితం ప్రభుత్వం వందగజాల చొప్పున ఇళ్ల స్థలాలు మంజూరుచేసింది. పట్టాలు కూడా వచ్చాయి. అయితే అదంతా కాగితాలకే పరిమితం. పెత్తందార్లు ఆ స్థలాల్ని కబ్జా చేశారు. 'హ్యాండ్ ఇన్ హ్యాండ్' కార్యకర్తలు సమాచారహక్కు చట్టం గురించి చెప్పిన మాటలు వాళ్లలో ఆలోచన రేకెత్తించాయి. సమాచారం కోసం దరఖాస్తు చేసుకున్నారు. సమాచారం వచ్చాక 'అయ్యా ఇదీ పరిస్థితి...' అని కలెక్టరుకు వివరించారు. డొంకంతా కదిలింది. ఆ దళితులకు జానెడు నీడ దొరికింది.

ఆయుధం ప్రభుత్వం ఇచ్చింది.

గురిపెట్టడం 'హ్యాండ్ ఇన్ హ్యాండ్' నేర్పించింది.

ఇక, ఎదురేముంది? ★



## అవీ ఇవీ

## ధ్యానమె ఆనందం



ఒత్తిడికి మందు, ఆందోళనకు ఔషధం, ఆనందానికి మార్గం... ధ్యానం గురించి చాలామంది చెప్పే మాటలివి. ఇవే కాదు, ధ్యానంతో ఇంకా బోలెడు లాభాలున్నాయంటున్నారు పరిశోధకులు.

★ ధ్యానం కారణంగా మానసిక ప్రశాంతత కలిగి ఆలోచనల తీవ్రత తగ్గుతుంది. స్థిరంగా ఒక విషయం గురించి ఎక్కువసేపు ఆలోచించగలుగుతారు. ఏకాగ్రత పెరుగుతుంది.

★ ధ్యానం చేయనివారితో పోలిస్తే నిత్యం కనీసం పదినిమిషాలైనా మెడిటేషన్ చేసేవారిలో ప్రతికూల భావనలు కలగడం చాలా తక్కువని తేలింది. అలాగే క్లిష్టమైన సమయాల్లో సరైన నిర్ణయం తీసుకునే శక్తి కూడా పెరుగుతుంది.

★ రోజూ ధ్యానం చేసేవారి మెదడులో... సానుకూల భావనలను ప్రభావితం చేసే 'ప్రీ ఫ్రంటల్ కార్టెక్స్' భాగం బాగా ఉత్తేజితం అవడం గమనించారు శాస్త్రజ్ఞులు.

★ ధ్యానం చేసేవారు ఓటమిని కూడా స్థితప్రజ్ఞతతో ఎదుర్కొంటారు.

## క్యారెట్‌తో కళ



'పిల్ల తెల్లగా లేకపోతేనేం, లక్ష్మీదేవిలా కళగా ఉంది' అనే మాట మనం తరచూ వినేదే. ఆ మాట నిజమేనని శాస్త్రవేత్తలూ తేల్చేశారు. 'తెల్లటి తెలుపులో అందంగా ఉండొచ్చేమోగానీ... పసిమిరంగులో ఉండేవారిలోనే ఆకర్షణ ఉంటుంది' అంటున్నారు. సెయింట్ ఆండ్రూస్, బ్రిస్టల్ యూనివర్సిటీ సంయుక్తంగా నిర్వహించిన అధ్యయన ఫలితమిది. మామూలుగా తెల్లగా ఉండేవారు కూడా రెండు నెలలపాటు కెరోటినాయిడ్లు అధికంగా ఉండే క్యారెట్లూ ఇతర కూరగాయలూ పండ్లూ తిన్నప్పుడు వారి శరీర ఛాయ కొంత పసిమిరంగుకు మారి ఆకర్షణీయంగా కనపడతారని చెబుతున్నారు వారు. ఒంటి రంగు, ఆకర్షణ పక్కనపెట్టినా... వాటిని తినడం ఆరోగ్యానికి అన్నివిధాలా మంచిదే కాబట్టి జంక్‌ఫుడ్‌కి కాస్త కామా పెట్టి ఆరోగ్యాన్ని పెంచే పండ్లూ కూరగాయలపై దృష్టిపెట్టాలని సూచిస్తున్నారు.

## వ్యాయామమే రక్ష



గతంతో పోలిస్తే... ప్రోస్టేట్ క్యాన్సర్ బారిన పడేవారి సంఖ్య ఇటీవలి కాలంలో పెరిగింది. పురుషుల శృంగార జీవితాన్ని దెబ్బతీసే ఈ క్యాన్సర్ ముప్పు నుంచి తప్పించుకోవడానికి వ్యాయామమే మార్గం అంటున్నారు పరిశోధకులు. హార్వర్డ్ స్కూల్ ఆఫ్ పబ్లిక్ హెల్త్, యూనివర్సిటీ ఆఫ్ కాలిఫోర్నియా పరిశోధకులు సంయుక్తంగా రీసెర్చి చేసి మరీ ఈ విషయాన్ని చెబుతున్నారు. పరిశోధనలో భాగంగా 2,705 మంది ప్రోస్టేట్ క్యాన్సర్ బాధితుల వ్యాయామ అలవాట్లను అధ్యయనం చేశారు వారు. ఆ పరిశోధన ఫలితాలను బట్టీ... ఇప్పటికే ప్రోస్టేట్ క్యాన్సర్‌తో బాధపడుతున్నవారు వారానికి కనీసం నాలుగ్గంటలైనా చెమటలు పట్టేలా కసరత్తులు చేస్తే ఈ వ్యాధి కారణంగా మరణం సంభవించే ముప్పు 61 శాతం తగ్గుతుందని కూడా సెలవిస్తున్నారు.

## తెలుపంటే భయమా?



వయసు మీద పడ్డాక జుట్టు నెరిసినా పెద్ద బాధనిపించదుకానీ... టీనేజీలో ఉండగా ఒక్క తెల్లవెంట్రుక కనపడ్డా భలే బాధగా ఉంటుంది. తెల్లబడ్డ వెంట్రుకలను నల్లబరిచే అవకాశాలు లేవుగానీ... కొన్ని జాగ్రత్తలు పాటిస్తే బాలనెరుపును నియంత్రించవచ్చంటున్నారు సౌందర్యనిపుణులు. అవేంటంటే...

❖ ఐరన్, ఎ, బి విటమిన్లూ అధికంగా ఉండే పదార్థాలను ఎక్కువగా తినాలి. అన్నిరకాల ఆకుకూరలూ టొమాటోలూ క్యాలీఫ్లవర్, పసుపు/ఎరుపు రంగుల్లో ఉండే పండ్లూ ఎక్కువగా తినాలి. మాంసకృత్తులు పుష్కలంగా లభ్యమయ్యే పదార్థాలు తింటే జుట్టు సహజమైన మెరుపును సంతరించుకుంటుంది.

❖ కొద్దిపాటి అల్లం తురుములో కాస్తంత తేనె వేసుకుని ఆ మిశ్రమాన్ని ప్రతిరోజూ ఒక టీస్పూన్ చొప్పున తినండి.

❖ ఉసిరికాయలను ఎండబెట్టి పొడి చేసి ఆ పొడిని రోజూ ఒక టీస్పూన్ చొప్పున తీసుకోండి.

❖ తాజా ఉసిరికాయలను తీసుకుని ముక్కలుగా తరిగి కొబ్బరినూనెలో వేసి కాగనివ్వండి. బాగా మరిగినాక స్టవ్ మీద నుంచి దించి చల్లారనివ్వండి. తర్వాత వడకట్టి రోజూ ఆ నూనె రాసుకోండి.

❖ ఆవుపాల నుంచి వచ్చే వెన్నలో బాల నెరుపును అరికట్టే గుణాలుంటాయి. ఆవు వెన్నను తలకు రాసుకుని ఒక గంట తర్వాత కుంకుడుకాయలతో తలస్నానం చేయండి. కొద్దిపాటి ఆవు వెన్నను నిత్యం ఆహారంలో భాగం చేసుకున్నా మంచిదే.

❖ కరివేపాకులోనూ వెంట్రుకలు తెల్లబడకుండా నివారించే గుణాలున్నాయి. కాబట్టి కూరల్లో వేసుకునే కరివేపాకును ఏరిపారెయ్యకుండా తింటే మంచిది.

❖ ఒత్తిడి, ఆందోళన అధికమైనా కూడా వెంట్రుకలు తెల్లబడతాయి. కాబట్టి వాటిని తగ్గించుకుంటే సగం సమస్య తీరినట్టే.

కుర్చీలో కూర్చుని తల కొంచెంగా పైకెత్తి కళ్ళు మూసుకుని ఉన్న తల్లిని చూసి ఆ గదిలోకి వచ్చిన మహేంద్ర ఆశ్చర్యపోయాడు. ఆ వేళప్పుడు కంప్యూటర్ ముందు కూర్చుని పనిచేసుకుంటూనో లేకపోతే ఇంటిపనులు చక్కబెట్టుకుంటూనో హడావుడిగా ఉండే అమ్మ ఏదో ఆలోచిస్తూ, తను వచ్చిన సంగతి కూడా గమనించనంత పరధ్యానంగా ఎందుకుందో..?

తల్లి దగ్గరకు వెళ్ళి భుజంమీద చేయివేసి "ఏమిటమ్మా ఆలోచిస్తున్నావ్? ఏమైనా సమస్యా..?" అడిగాడు.

వినీల మెల్లగా కళ్ళు తెరిచింది. "మహీ, నువ్వు చెప్పు... నేను ఎవర్ని?" మెల్లని స్వరంతో అడిగింది.

మహేంద్రకి నవ్వొచ్చింది. "చిన్నప్పుడు నువ్వు చెప్పిన కథలోని ఈగలా నువ్వూ నీ పేరు

# ప్రేమతో...

– గోగినేని మణి



మర్చిపోయావా?" తమాషాగా అన్నాడు.

వినీల సీరియస్‌గా చూస్తూ "నేను అడిగింది... నీకు... నేను..." అంది.

"అదేం పిచ్చిప్రశ్న" అంటూ చిన్నగా నవ్వాడు. "నువ్వు నాకు అమ్మవి... బంగారు బొమ్మవి... పగడాల కొమ్మవి... ఇంకా ఇంకా వర్ణించాలనుందిగానీ సరైన మాటలు తోచటంలేదు మరి" అల్లరిగా అన్నాడు.

ఆమెకి ఎదురుగా ఉన్న టేబుల్‌పై కూర్చుంటూ అక్కడున్న ఫైళ్లను పక్కకి జరుపుతూ యథాలాపంగా చూసిన అతను చటుక్కున వాటిని చేతిలోకి తీసుకున్నాడు.

"రేవతీ ఇండస్ట్రీస్... రేవతీ ఇంటర్నేషనల్ స్కూల్... ఇదేమిటీ ఆవిడ పేర్లు పెట్టారూ?" విస్మయంగా చూశాడు. "ఈ సలహా నాన్నకి నువ్వే ఇచ్చావా?" అతని మాటల్లోకి పదును వచ్చింది.

వినీల లేదన్నట్లుగా తల అడ్డంగా ఊపి "నాకూ ఈ విషయం ఇపుడు వీటిని చూశాకనే తెలిసింది. కనీసం నన్ను సలహా కూడా అడగలేదు" అంది బరువుగా నిట్టూరుస్తూ.

మహేంద్రకి అప్పటికి అర్థమైంది... తల్లి అలా ఎందుకుందో.

ఇదేమిటి, నాన్న ఇలా ఎందుకు చేశారు? బిజినెస్ మొదలుపెట్టగానే, తన ఆస్తిపాస్తులు పెట్టుబడి పెట్టాల్సివస్తుందేమో... ఆ బిజినెస్ ఎలా ఉంటుందో... అనే భయాలతో చిన్న విషయాలకే నాన్నతో గొడవ పెట్టుకుని, కన్న మమకారం కూడా లేకుండా రెండేళ్ళ పసివాడినీ వదిలేసి విడాకులు తీసుకుని వెళ్ళిపోయిన ఆవిడ పేరు... తాము ఎంతో ప్రతిష్ఠాత్మకంగా ప్రారంభిస్తున్న ప్రాజెక్టులకు పెట్టడంలో తండ్రి ఉద్దేశ్యం ఏమై ఉంటుంది? మహేంద్రకు అయోమయంగా అనిపించింది.

కొంచెం పక్కకువెళ్ళి సెల్‌ఫోనులో మాట్లాడి మళ్ళీ వినీల దగ్గరకు వచ్చాడు. ఆమె భుజాల చుట్టూ చేతులు వేసి అనునయంగా అన్నాడు "నాన్నని గట్టిగానే అడిగాను. ఎవరినో కలవటానికి ఎక్కడికో వెళ్ళబోతున్నారట. ముందు ఇక్కడికి వస్తానని అన్నారు. ఏం చెబుతారో చూద్దాం. నేను మాత్రం దీనికి ఒప్పుకోను. నీ పేరే పెట్టాలని కచ్చితంగా చెబుతాను".

వినీల అతనివైపు చురుగ్గా చూసింది. "ఏం అంటున్నావ్ మహీ? నా పేరు పెట్టలేదని బాధపడుతున్నాననుకుంటున్నావా? ఛ...ఛ... అదేంకాదు" అంటూ తల అడ్డంగా ఊపింది. "నన్నడిగి ఉంటే... నీ పేరో, మీ నాన్న పేరో పెట్టమని చెప్పేదాన్నేమో! రేవతి... ఆవిడొక ముగిసిపోయిన అధ్యాయమని నేను నమ్మాను. కానీ మీ నాన్న మనసులో ఆమెకింతటి స్థానముందని హఠాత్తుగా తెలిసేసరికి షాకయ్యానంతే! అందుకే, నీకయినా... నేను అమ్మనా... లేక పిన్నినా... అని అనుమానం వచ్చి అడిగాను" కంఠం బొంగురుపోయింది.

మహేంద్ర మొహం పాలిపోయింది. ఏం మాట్లాడలేని వాడిలా ఒక నిమిషం నిశ్శబ్దంగా ఉండిపోయాడు. తర్వాత మెల్లగా అన్నాడు "నేను మాటలు నేర్చుకునే వయసునుండీ నిన్నే అమ్మగా పిలుస్తూ... నీ ఒడిలోనే పెరిగాను. నాకు జన్మనిచ్చింది వేరొకరని... ఆరునెలల క్రితమే కదా నాకూ తెలిసింది. అంత మాత్రాన నువ్విలా అడగటమే నాకు చాలా అవమానంగా ఉందమ్మా" అతని గొంతు గద్గదమైంది.

వినీల కళ్ళల్లోకి నీళ్ళు వచ్చేశాయి. "ఛ... నువ్వు బాధపడకురా. ఏవో పిచ్చి ఆలోచనలతో మనసు పాడై... నిన్నలా అడిగా... అంతే. నాకు తెలుసు... నేనే నీకు అమ్మనని. ఈ సంతృప్తి చాలు".

వినీల చెంపలమీదుగా జారిన కన్నీళ్ళను తుడిచి మహేంద్ర అక్కడే ఉన్న సోఫాలో మౌనంగా కూర్చున్నాడు, తండ్రి రాకకోసం ఎదురుచూస్తూ. అవును, అతను మాత్రమే ఈ చిక్కుముడిని విప్పగలడు.

వినీల మళ్ళీ కళ్ళు మూసుకుని ఆలోచనల్లో మునిగిపోయింది.

పెళ్ళి ప్రపోజల్ తెచ్చినప్పుడు చైతన్య తనతో ఏమన్నాడు- 'పెద్దల ఇష్టప్రకారం రేవతిని పెళ్ళి చేసుకున్నాగానీ తనకి భార్యగా నా మనసులో చోటు ఇచ్చాను. ఏ లోటూ లేకుండా చూసుకున్నాను. అయినా నన్నూ సంసారాన్నీ కాలదన్ని వెళ్ళిపోయింది. ఇపుడు నేనిష్టపడిన అమ్మాయిని నా జీవితంలోకి ఆహ్వానించి నా అదృష్టాన్ని పరీక్షించుకోవాలనుకుంటున్నాను. నువ్వు కాదంటే, నా జీవితంలో ఇక పెళ్ళి ప్రసక్తే ఉండదు'. ఆ మాటల్లోని ప్రేమకు తను మైమరిచిపోయింది.

పెళ్ళయిన కొత్తల్లో ఒకసారి భోజనాల సమయంలో- 'రేవతి వంటలు బాగా చేసేదా?' అని తను యథాలాపంగా అడిగిన ప్రశ్నకి అతనికెంత కోపం వచ్చిందో! 'వంటలు చేయటమే కాదు, అగ్గిపుల్ల అవసరం లేకుండానే మంటల్నీ పుట్టించగల సమర్థురాలు. రేవతినీ ఆమె జ్ఞాపకాల్నీ నా మనసులోంచి పూర్తిగా తుడిచేశాను. ఇంకెప్పుడూ నా దగ్గర తన గురించి మాట్లాడకు' ఆజ్ఞలా కఠినంగా చెప్పాడు. అప్పటి తర్వాత తనుకూడా మళ్ళీ ఎప్పుడూ రేవతి ప్రస్తావన తేలేదు.

చైతన్య తోడిదే తన లోకమన్నట్లుగా బతికింది. అతని సహజీవనం తనకొక అపురూప వరం అనుకుంది. తన సొంత కూతురినైనా ఆ సంవత్సరం రెసిడెన్షియల్ కాలేజీలో చేర్పించిందిగానీ మహేంద్రని మాత్రం ఒక్కరోజు కూడా ఎప్పుడూ విడిచి ఉండలేదు. కాలేజీ స్టూడెంట్ అయినా ఇప్పటికీ చిన్నపిల్లాడిలా తన కొంగుపట్టుకుని తిరుగుతున్నట్లుగా ఇంట్లో తనవెంటే ఉంటాడు. అంతగా తన ప్రేమాభిమానాల్ని పంచి ఇచ్చింది. మహికి తల్లికాగలిగిందిగానీ చైతన్య మనసులో స్థానం సంపాదించుకోలేకపోయిందన్న నిజం ఇప్పుడు కదా తెలిసింది. అతని మనసులో రేవతి మాత్రమే ఉందా..?!

వినీలకి దుఃఖం ఎగదన్నుకు వచ్చింది. తడి అయిన కళ్ళు తుడుచుకుంటూనే చైతన్య లోపలికి వచ్చిన అలికిడికి తలతిప్పి చూసింది.

సోఫాలో కూర్చున్న కొడుకు పక్కనే కూర్చుని చైతన్య చేతిలోని బ్రీఫ్‌కేసును ఒళ్ళో పెట్టుకున్నాడు. మహేంద్ర వెంటనే దాడి మొదలుపెట్టాడు.

"ఇప్పుడు చెప్పండి... మీరు చేసిన పనికి

అర్థమేమిటో, ఎలా సమర్థించుకుంటారో!" తండ్రి వైపు కోపంగా నిష్ఠూరంగా చూశాడు. "అయిదేళ్ళుగా ఈ ప్రాజెక్టుల కోసం మీరిద్దరూ ఎంతగా శ్రమపడ్డారో నాకు తెలుసు. మీ శక్తిసామర్థ్యాల కంటే అమ్మ కృషే ఎక్కువనే సంగతీ నాకు తెలుసు. అలాంటిది.... మీరు ఈ ప్రాజెక్టులకు ఎవరో ఆవిడ పేరు..."

చైతన్య మధ్యలోనే అడ్డంవచ్చి "ఎవరో ఆవిడ అనకు. ఆమె నీ కన్నతల్లి" అన్నాడు. అతని కంఠం బరువుగా మారింది.

మహేంద్ర చివ్వున తలతిప్పి రోషంగా అన్నాడు "మీరు ఇంకా ఆమెని భార్యగా అభిమానిస్తున్నారేమోగానీ నాకుమాత్రం ఎటువంటి బంధుత్వమూ లేదు. డబ్బు లెక్కలే ముఖ్యమనుకుని... మాటలైనారాని పసివాడనే మమకారం లేకుండా నిర్దాక్షిణ్యంగా ఆమె వెళ్ళిపోయినా అమ్మ ఒడిలో అపురూపంగా పెరిగే అదృష్టం మాత్రం నాకు లభించింది. ఆమెని 'అమ్మ' అని పలకటానికే కాదు... ఆలోచనల్లో కూడా అంగీకరించను".

అతని మాటలకు వినీల మొహంలోకి వెలుగొచ్చింది. చైతన్యవైపు నిరసనగా చూసి ఏదో అనబోతుంటే "ఒక్కక్షణం నువ్వుండమ్మా" అంటూ మహేంద్ర చేయి చాపాడు. "నాన్నా, నావి చిన్నపిల్లాడి మాటలని కొట్టిపారెయ్యకండి. నేనూ మేజర్ని అయ్యాను. మంచీ చెడూ విచక్షణ తెలుసు. మీరు చేసినపని నాకూ అమ్మకీ కూడా అవమానకరం. ఆ పేర్లు వెంటనే మార్చెయ్యండి" తనమాటే కచ్చితమన్నట్లుగా తండ్రితో అన్నాడు.

చైతన్య భారంగా నిట్టూర్చాడు. "నిజమే. నువ్వు మేజరువి అయ్యావు. ఏ విషయమైనా అర్థంచేసుకోగలవు కాబట్టి... నీకో విషయం చెబుతాను. ఆ తర్వాత మీరిద్దరూ చెప్పినట్లే చేస్తాను. నాకేం అభ్యంతరం లేదు. నాకు మూడునాలుగేళ్ళ క్రితమే తెలిసినా, మీకు అనవసరమైన ఆందోళన కలిగించటమెందుకనే ఉద్దేశ్యంతో చెప్పలేకపోయిన విషయం... ఇప్పుడు సందర్భం వచ్చింది కాబట్టి చెబుతాను" అన్నాడు.

"మా చిన్నాన్నగారి అమ్మాయి కల్పన మీకూ తెలుసుగా. తనూ రేవతీ క్లోజ్ ఫ్రెండ్స్. నాలుగేళ్ళు అవుతోందనుకుంటా... కల్పనని ఎవరో బంధువుల పెళ్ళిలో కలిశాను. రేవతి గురించి మాట్లాడబోతోంటే తన ప్రసక్తి నా దగ్గర తేవద్దంటూ కోపంగా మందలించాను. అప్పుడు కల్పన నాతో ఒకమాట అంది. 'ఆ మధ్య రేవతి నాకో ఉత్తరం రాసి, చదివాక చింపెయ్యమని అంది. ఎందుకోగానీ ఆ పని చేయలేక దాచి ఉంచాను. అది నీకు పోస్టు చేస్తాను. నువ్వు చదివి చింపెయ్యి' అని చెప్పింది. నేనూ చింపకుండా ఆఫీసులో నా పర్సనల్ లాకర్లో ఉంచేశాను. ఇప్పుడది తీసుకువచ్చాను. మీరూ చదివాక మీ నిర్ణయం చెప్పండి. నేను పని చూసుకుని కాసేపట్లో మళ్ళీ వస్తాను" అంటూ బ్రీఫ్‌కేసు తెరిచి ఒక కవరును తీసి మహేంద్ర చేతుల్లోపెట్టి చైతన్య చకచకా బయటకు వెళ్ళిపోయాడు.

వినీల, మహేంద్ర ఇద్దరూ పక్కపక్కనే కూర్చుని ఒక్కసారిగానే ఆ ఉత్తరం చదివారు.

**కల్పనా,**

*ఈరోజు నీతో మాట్లాడి ఇంటికి వచ్చిన దగ్గర్నుంచీ ఎందుకోగానీ మనసు చాలా భారంగా ఉంది. నా మనసులోని మాటను కనీసం ఒక్కరికైనా చెప్పాలని ఇప్పుడనిపిస్తోంది. అందుకే ఈ ఉత్తరం. అమ్మా నాన్నలతోనైనా చెప్పుకోలేని విషయాలు స్నేహితులతోనే పంచుకోగలుగుతాం... అవునా!*

*నాకు చాలా పొగరని నువ్వు కోప్పడ్డావు. నిజమే. ఇదేదో గొప్ప విషయం అన్నట్లుగా చెప్పుకోవటం కాదు... నిజాయితీగా నా బలహీనతని ఒప్పుకుంటున్నాను... అంతే. చిన్నప్పటి నుండీ ఇంట్లోవాళ్ళు చేసిన అతి గారాబమే కారణమనుకుంటాను. అమ్మావాళ్ళే కాదు... అక్క, అన్నయ్య కూడా వాళ్ళదగ్గరున్నది నేనడిగితే కాదనకుండా సంతోషంగా ఇచ్చే సేవాళ్ళు. ఇష్టమైనవాళ్ళకి మన కిష్టమైనదైనా ఇష్టంగా ఇవ్వటంలోనూ ఆనందం*



*ఉంటుందని ఆ తర్వాత తెలిసిందిగానీ అప్పట్లో తెలియదు. నేనేదో స్పెషల్ అనుకునేదాన్ని.*

*కొంచెం పెద్దయ్యాక అర్థమైంది... అందరి కంటే చిన్నదాన్నని ఇంట్లోవాళ్ళు గారాబం చేశారేతప్ప నాలో ప్రత్యేకతలేమీలేవనీ... చాలా మామూలు అమ్మాయినేననీ. అయినా చిన్నప్పుడే నాలో వేళ్ళూనుకున్న పొగరు అలాగే ఉండిపోయిందనుకుంటా.*

*అమ్మానాన్నలు నాకు పెళ్ళి సంబంధాలు చూస్తున్నప్పుడు నాకో ఆలోచన వచ్చింది. వాళ్ళెలాగూ మా ఆర్థిక స్తోమతకు సరితూగే సంబంధాలనే తీసుకువస్తారు. పెళ్ళిచూపుల్లో... నేను నచ్చలేదని ఎదుటివ్యక్తి తోసిపుచ్చే అవకాశమూ ఉంటుంది. అది నేను భరించలేను. అలాంటి సందర్భం రాకూడదని, మా ఇంటికి వచ్చిన నాన్నగారి స్నేహితుడి కొడుకు నాకు నచ్చాడనే విషయాన్ని అమ్మావాళ్ళకు పరోక్షంగా తెలియజేశాను. నా ఇష్టాన్ని వాళ్ళు కాదనలేరని తెలుసు కదా. మా ఇద్దరి పరిస్థితులనుబట్టి పెళ్ళికొడుకుగా అతనికి... చదువు, ఉద్యోగం, అందం, తెలివితేటలు లెక్కలోకి తీసుకుంటే పదికి పదీ పడతాయిగానీ ఆర్థిక స్తోమతకైతే పదికి మూడు మించవు. నాకైతే ఆర్థిక పరిస్థితికి పదికి పది మార్కులూ పడితే మిగతా విషయాలకు నాలుగైదుకంటే రావు.*

*అతని పెద్దవాళ్ళు 'పిల్ల మరీ తీసికట్టుగా లేదు, బాగానే ఉంది. ఈ పెళ్ళి చేసుకుంటే ఒక్కసారిగా నాలుగుమెట్లు ఎక్కేస్తావు. అంతస్తు పెరుగుతుంది' అంటూ పెళ్ళికి ఒప్పిస్తారని నేను ఊహించాను. నాకు లోకజ్ఞానం బాగానే ఉందన్నమాట! నా అంచనా తప్పలేదు. చైతన్యతో నా పెళ్ళి జరిగింది. నన్నెవరైనా కాదనే సందర్భం రాకుండా అలా జాగ్రత్తపడ్డాను.*

*పెళ్ళికి చైతన్య ఏ కారణంతో ఒప్పుకున్నాగానీ అసంతృప్తి ఛాయలేవీ లేకుండా ఆనందంగానే కనిపించాడు.*

*పెళ్ళయ్యాక ఉద్యోగం మానేసి బిజినెస్ చేస్తానని అంటే నేనేం అభ్యంతరం చెప్పకుండా నా పేర ఫిక్స్‌డ్ డిపాజిట్లలో ఉన్న డబ్బులో కొంత ఇచ్చాను. జీవితం సాఫీగానే ఉంది. మూడేళ్ళకు మహీ పుట్టాడు. వాడంటే చైతన్యకు ఎంత ప్రాణమంటే... ఇంట్లో ఉన్నప్పుడు వాడిని ఒక్క నిమిషమైనా వదిలేవాడు కాదు.*

*బిజినెస్‌ని ఇంకా పెంచే ఆలోచనతో చైతన్య బాగా కష్టపడుతున్నాడు. ఒకరోజు రాత్రి పది గంటల వేళప్పుడు ఆఫీసు గదిలో ఏవో ఫైల్సు చూసుకుంటుంటే, ఇక పడుకోమని చెప్పటానికి వెళ్ళాను. నేను పలకరించగానే 'ఇవన్నీ ఒకసారి చెక్ చేసెయ్యి వినీలా...' అనేసరికి ఆశ్చర్యపోతూ వినీల ఎవరని అడిగాను. తుళ్ళిపడి 'నేనింకా ఆఫీసులోనే ఉన్నాననుకున్నాలే...' అంటూ నవ్వి రెండునెలలక్రితం తనకి పి.ఏ.గా చేరిన అమ్మాయని చెప్పాడు. చురుకుదనం, తెలివితేటలూ ఉన్న ఆ అమ్మాయి... ఎవరైనా నాలుగునెలల సమయం తీసుకునే పనిని ఒక్కనెలలోనే పూర్తిచేయగలదని ప్రశంసించాడు.*

*'ఇలా ఇంట్లో పనిచేసుకునే సమయంలోనూ తను మీకు తోడుంటే బిజినెస్‌లో నాలుగు నెలలకి వచ్చే లాభాలు ఒక్క నెలకే వచ్చేస్తాయేమో' సరదాకి అన్నట్లుగా నేనన్న మాటల్ని చైతన్య కాదనలేదు. 'ఆఫీసులోనే కాకుండా ఇంటికీ వచ్చి ఇప్పటివరకూ ఉండటానికి ఎలా వీలవుతుంది... తనకీ పర్సనల్ లైఫ్ ఉండదా? ' అన్నాడు.*

*ఇది నేనూహించని సమాధానం!*

*తన గురించి మాట్లాడుతున్నపుడు చైతన్య కళ్ళల్లో కనిపించిన మెరుపులు నా మనసును చివుక్కుమనిపించాయి.*

*ఆ తర్వాత ఏవో పనులు కల్పించుకుని ఆఫీసుకు వెళ్ళి వినీలను గమనించాను. అందమే కాదు... తన మాటల్లో, నవ్వులో ఎవరినైనా ఆకట్టుకునే ఆకర్షణా ఉంది. అందరితో చనువుగా, సరదాగా మాట్లాడినా ఎవరినీ హద్దులుదాటి తన పరిధిలోకి రానివ్వదనీ తెలుసుకున్నాను. వ్యక్తిత్వమూ విలువలూ ఉన్న ఆ అమ్మాయి ఎట్టి పరిస్థితుల్లోనూ వివాహితుడైన చైతన్యతో హద్దుమీరే స్నేహానికి అంగీకరించదని నమ్మకమూ కలిగింది.*

*కానీ... చైతన్యలోనే ఏదో మార్పు! నిరాసక్తంగా యాంత్రికంగా ఉంటున్నాడనిపించింది. వినీల ఆకర్షణ నుండి తట్టుకోవటానికి వైవాహిక బంధానికి కట్టుబడి ఉండాలనే నియమానికీ మధ్య నలిగిపోతున్నాడా... ఈ అమ్మాయి నాకు ముందే*

ఎందుకు తటస్థపడలేదూ అని మథనపడుతున్నాడా... అనే అనుమానాలు నన్ను చుట్టుముట్టాయి. కొన్నాళ్ళుపోతే విడాకులు అడుగుతాడేమోననే సందేహమూ కలిగింది. ఆ ఆలోచన రాగానే, నాలోని అహం నన్ను ఊరుకోనివ్వలేదు. ముందుగా నేనే ఆ పని చేయాలని నిర్ణయానికి వచ్చేశాను. అవును, చైతన్య నన్ను విడాకులు అడగటాన్ని నేను తట్టుకోలేను.

ఎవరిలోనూ నూటికి నూరు శాతంగా అన్నీ మనకు నచ్చే మంచి లక్షణాలే ఉండవనే సంగతి అందరికీ తెలిసిందే! చైతన్యలోనూ నాకు నచ్చని చిన్న విషయాల్నే ఎంచి పట్టుకుని చిరాకు, అసహనంతో గొడవల్ని పెంచుకుని విడాకుల వరకూ సాగదీశాను. వ్యాపారంలో నా డబ్బు పెట్టుబడి పెట్టాల్సివస్తుందని భయపడుతున్నాననీ డబ్బు మనిషిననీ చైతన్య నిందిస్తే మౌనంగా భరించాను. సర్దుకుపోగలిగే చిన్న విషయాలకే రాద్ధాంతం చేసే మనిషి గురించి పాపం తను మాత్రం అంతకుమించి ఏం అనుకుంటాడూ..?

విడాకుల ఆలోచన నుండి నన్ను మళ్ళించటానికి చైతన్య చాలా ప్రయత్నమే చేశాడు. అందుకు కారణం నేను కాదు, మహీ మాత్రమే! నేను మనసు గట్టిచేసుకుని ఎప్పుడైతే మహీ తన దగ్గరే ఉంటాడని చెప్పానో అప్పుడిక అంగీకారసూచకంగా నిశ్శబ్దమైపోయాడు. నా నిర్ణయం స్థిరపడిపోయింది.

ఇక్కడ నాకున్న ఒక అలవాటు గురించీ చెప్పటం అవసరమనిపిస్తోంది.

ఒకసారి నేను కారులో వస్తూ ఒక కూల్‌డ్రింకు షాపు దగ్గర ఆగాను. ఆ సమయంలో పెద్ద గంపతో ఎక్కబోయిన పెద్దావిడను కండక్టరు కోప్పడుతూ ఆపేసి బస్సును ముందుకు పోనిచ్చేశాడు. నా కారులో ఎక్కించుకుని నాలుగైదు కిలోమీటర్ల దూరంలో ఉన్న వాళ్ళ పాక దగ్గర దింపినప్పుడు ఆమె ముఖంలో వెల్లువైన ఆశ్చర్యానందాల్ని చూడవలసిందే! ఇంటికి ఆకుకూరలమ్మే అవ్వ పాతచీర అడిగితే రెండు కొత్తచీరలు ఇవ్వటం... రోడ్డుపక్కన నిలబడి రూపాయో, అర్ధో అడిగినవాళ్ళకు వంద రూపాయలివ్వటం... ఇలాంటి పనులు తరచూ కాకపోయినా అప్పుడప్పుడూ చేయటం, వాళ్ళ ఆశ్చర్యానందాల్ని చూడటం నాకిష్టం!

చైతన్యా నేనూ కోర్టులచుట్టూ తిరిగేపని లేకుండా లాయరు దగ్గర పత్రాలు రాసుకుని విడిపోయాం. నాకు డబ్బుకేం లోటులేదుగా, వేరే వచ్చేశాను. అమ్మావాళ్ళ దగ్గరకు వెళ్ళలేదు... బంగారంలాంటి సంసారాన్ని పొగరుతో వదిలేసుకున్నాననే సాధింపులు నిత్యమూ ఎదుర్కోవలసివస్తుందని!

మొదట బిజినెస్ కోసం నా దగ్గర తీసుకున్న డబ్బును చైతన్య రెట్టింపుగా నాపేర బ్యాంకులో వేశాడు. దానిని నేను మహీ పేర తర్వాత మార్చాను. చైతన్యకు మంచిపేరు ఉంది. ఎవరైనా పెట్టుబడి పెడతారు. ఆర్థికంగా పైస్థాయికి తొందరలోనే చేరుకుంటాడని నాకు తెలుసు.

నీకో విషయం చెబుతాను. నా చిన్నప్పుడు మేము అన్ని సౌకర్యాలూ ఉన్న చాలా పెద్ద ఇంట్లో అద్దెకుండేవాళ్ళం. ఇల్లు కట్టమని అమ్మ పోరుతుంటే... బిజినెస్ పనులతో తీరికలేకనో అంత డబ్బు అప్పట్లో ఇంటిమీద పెట్టడం ఇష్టంలేకనోగానీ నాన్నగారు 'ఇంత మంచి ఇంట్లో సుఖంగా ఉన్నాం కదా' అనేవారు. అమ్మేమో 'సొంతం కానిది ఇంద్రభవనం అయితే మాత్రం ఎందుకూ, మనది అనుకునే ఇల్లు ఎంత చిన్నదైనా ఆ సంతృప్తీ ఆనందం వేరు, మీకర్థంకాదుగానీ...' అంటుండేది.

చైతన్య మనసులో నేను కాకుండా ఇంకెవరో ఉన్నారనిపించగానే ఇంద్రభవనంలాంటి సంసారజీవితాన్ని వదిలేసి, నాది అనుకునే చిన్న ఇల్లులాంటి ఒంటరి జీవితంలోకి ప్రవేశించాను. దీనిని ఎవరైనాసరే పిచ్చితనమో మూర్ఖత్వమో అనే అంటారు. నా మనస్తత్వాన్నిబట్టి ఆలోచిస్తేనే అర్థమౌతుంది.

కొన్ని విషయాల్లో నాకూ నాలెడ్జి బాగానే ఉందని మళ్ళీ రుజువైంది. నేనూహించినట్లుగానే



మేం విడిపోయిన కొన్నాళ్ళకే చైతన్య వినీలను పెళ్ళి చేసుకున్నాడు. నచ్చిన అమ్మాయితో సహజీవనం, మహీ... నేనిచ్చిన ఈ రెండు కానుకలకే చైతన్యలో ఆశ్చర్యానందాలు ఎలా వెల్లువై పొంగివుంటాయో ఊహించుకుని నేనూ సంతృప్తిచెందాను. నిజం!!

నేనేదో త్యాగం చేశానని అనుకోవటంలేదు. నా మనస్తత్వం ప్రకారం నాకు చేయాలనిపించింది చేశాను... అంతే! చైతన్య మనసులోకి ఇంకెవరో అడుగు పెడుతున్నారని అనిపించగానే అతనితో కలిసి ఉండటం నాకిష్టం లేకపోయింది. కానీ నా మనసులో మాత్రం అతనిపట్ల ప్రేమ అలాగే ఉంది. అందుకే మళ్ళీ పెళ్ళి చేసుకోమని స్నేహితులు ఇచ్చిన సలహాని వినలేదు.

మహీ లేనిలోటు పూడ్చుకోవటానికి మాత్రం నేను చాలా కష్టపడ్డాను. నాకెంతో అభిరుచి ఉన్న సంగీతంలో సాధన... స్నేహితులతో షికార్లు... ప్రయాణాలు... ఏ సరదాలూ సంతృప్తినివ్వలేదు. అనాథశరణాలయం నుండి చిన్న పాపని తెచ్చుకున్నాక కొంత సాంత్వన కలిగింది. ఇంకో పది మంది పిల్లల ఆలనా పాలనా ఖర్చులన్నీ భరించే విధంగా దత్తత తీసుకున్నాను. అప్పుడప్పుడూ వాళ్ళందర్నీ ఇంటికి తీసుకువస్తుంటాను.

కన్నకొడుకును ఒక్కసారైనా కలుసుకోని కఠినాత్మురాలినని కదూ నువ్వు అన్నావ్..? కల్పనా... నీకో విషయం చెప్పనా? మహీ ప్లేస్కూలుకు వెళ్ళటం దగ్గర్నుంచీ వాడు ఏ స్కూలు మారినా, నేను ప్రతిరోజూ చూస్తూనే ఉన్నాను. యూనిఫామ్‌లో, బ్యాగు తగిలించుకుని, స్కూలు బస్సు దిగి స్కూలులోకి ముద్దుముద్దుగా నడుస్తూ వెళ్ళటాన్ని... దూరంగా కారు దగ్గర నిలబడి చూడటం నా దినచర్య! మహీని చూస్తూ నా చేతుల్లోవున్న పాపను గుండెలకు హత్తుకుంటే, వాడిని దగ్గరకు తీసుకున్నట్లుగానే ఆనందం కలిగేది. ఏ సబ్జెక్టులో మంచి మార్కులు వచ్చాయి, ఏ ర్యాంకులో ఉంటున్నాడు... ఇలాంటి విషయాలన్నీ తెలుసుకుంటూనే ఉన్నాను. తన పెరుగుదలను దూరంనుండే గమనిస్తూ సంతృప్తిపడుతున్నాను.

పెద్దవాడయ్యాక ఏ విషయం తెలిసినా ఫర్వాలేదుగానీ... వినీల ఒడిలో తల్లిప్రేమను పొందుతూ పెరుగుతున్న పసివాడికి కనిపించి అనవసరమైన కలవరం కలిగించటమెందుకని నేనే కఠినమయ్యాను.

ఇంత వివరంగా రాసిన ఉత్తరం చదివాక అయినా... కల్పనా... నీకు అర్థమయ్యానా? ఏమో, ఈ విషయంలో నాకు అనుమానంగానే ఉంది. ఎందుకంటే, సరిపడక విడాకులు తీసుకున్నవాళ్ళని చూసివుంటావుగానీ, ప్రేమిస్తూనే విడాకులిచ్చిన వాళ్ళగురించి విని కూడా ఉండవు మరి! అవునా..?

ఇప్పుడు నా మనసు తేలికయింది.

ఈ విషయాలన్నీ ఎవరికీ చెప్పకు. చదివిన వెంటనే ఈ ఉత్తరం చింపెయ్యటం మరచిపోకు.

నీ స్నేహితురాలు

**రేవతి**

ఉత్తరం చదవటం ముగించిన మహేంద్ర, వినీల దిగ్భ్రాంతిలో మునిగిపోయారు.

వినీల కళ్ళు మళ్ళీ ధారలుకట్టాయి... ఇప్పుడు ఇంకొక కారణంగా!

అప్పుడే లోపలకు వచ్చిన చైతన్య బరువెక్కిన మనసులతో విగ్రహాల్లా ఉన్న వాళ్ళకెదురుగా కూర్చుని నిదానంగా అడిగాడు. "ఈ ఉత్తరం చదివాక... అన్నాళ్ళ తర్వాత చేయగలిగిందేమీ లేదు కనుక మిన్నకుండిపోయాను. ఇప్పుడు... రేవతి ఇచ్చిన కానుకలకు ప్రతిస్పందనగా నా అభిమానాన్ని చూపించే మార్గం ఇదేనని అనుకున్నాను. మీరిద్దరూ ఇప్పుడు చెప్పండి... పేర్లు మార్చెయ్యనా..? "

"వద్దు... వద్దు..." ఇద్దరూ ఒక్కసారే అన్నారు.

"ఇప్పటివరకూ నాకు ఒక చెల్లి మాత్రమే అనుకున్నాను. పన్నెండుమందికి అన్నయ్యనని తెలిసి చాలా ఆనందంగా ఉంది. నాన్నా, ఒకసారి ఆ అమ్మనూ చూసి వస్తాను" మహేంద్ర ఉద్వేగంగా అన్నాడు.

'అమ్మ' అనే మాటను మహేంద్ర ఇష్టంగా పలకటాన్ని గమనించిన చైతన్య తేలికగా నిట్టూర్చాడు.

వినీల మహేంద్ర చేయి పట్టుకుని "మహీ... నువ్విప్పుడు... ఇద్దరు అమ్మలున్న అదృష్టవంతుడివి. వెళ్ళిరా... అమ్మ ఆశీస్సులు తీసుకో..." ఆర్ద్రంగా అంది.

★

# నా షూస్ జపాన్‌వి

కొద్ది సంవత్సరాల క్రితం నేను అలాస్కా వెళ్ళాను. హిమపాతాలు, సముద్రపు నీటిలో తేలియాడుతున్న పెద్ద పెద్ద ఐస్ కొండలు ఒక విభిన్నమైన వినోదాన్ని కలిగించాయి. వీటిని చూడాలంటే ఏడు రోజుల పాటు పడవలో ప్రయాణించవలసి ఉంటుంది. 3,000 మంది పర్యాటకులు మరియు వాళ్ళకు సేవలు అందించేందుకు 2,500 మంది సిబ్బంది ఉంటారు. ఇది నిజంగా అత్యున్నతమైన ఆతిథ్యం. మొట్టమొదటి సారిగా పడవ ఎక్కడంతో పడవలోనే ఇచ్చే డిన్నర్ నిజంగా చాలా గొప్ప అనుభూతి అనే విషయం నాకు తెలియదు. మొదటి రోజున సాయంత్రం జాగింగ్ చేసిన తరువాత, నేను నేరుగా డైనింగ్ హాలులోకి వెళ్ళి కూర్చున్నాను. జీన్స్, టి-షర్టు, మరియు స్పోర్ట్స్ షూస్ ధరించిన ఏకైక వ్యక్తిని తానేనని విషయం నాకు తెలిసింది. వెంటనే కేర్‌టేకర్ వచ్చి పరిసరాల గురించి నాకు తెలిసేలా చేస్తూ, నా స్పోర్ట్స్ షూస్‌ని టేబుల్ కింద పెట్టవలసిందిగా నన్ను కోరారు. మిగతావాళ్ళందరూ సాంప్రదాయక దుస్తులు ధరించివున్నారు. నగలు ధరించిన ఐరోపా మరియు అమెరికా పర్యాటకుల్లో మొరటుదానిగా కనిపించిన ఏకైక ఈడియట్‌ని నేనే. దీంతో నేను త్వరగా డిన్నర్ పూర్తిచేసి ఆ తరువాతి ఏడు రోజుల డిన్నర్‌లకు నా దుస్తులను సిద్ధం చేసుకునేందుకు గదికి వెళ్ళిపోయాను. ఇవాళ్టికి కూడా, "స్పోర్ట్స్ షూస్" అనే మాటలు అలాస్కాలో నీ నా వికృత రూపాన్ని నాకు గుర్తుచేస్తుంటాయి.

కానీ నేడు, స్పోర్ట్స్ షూస్‌ని నేను నా చిరకాల సహవాసిలుగా చూస్తాను, ఎందుకంటే నేను తక్కువ సమయంలో ప్రయాణం చేయవలసివస్తే, స్పోర్ట్స్ షూస్, జీన్స్, ఫార్మల్/సెమి-ఫార్మల్ టాప్, విమానం లోపల చల్లదనం నుంచి పరిరక్షించేందుకు నడుముకు కట్టుకునే స్వెట్టర్, డబ్బు, పాస్‌పోర్టు, టిక్కెట్ పెట్టుకునేందుకు భుజానికి తగిలించుకునే ఒకమోస్తరు సైజులో ఉన్న పర్సు ధరిస్తాను మరియు నా మేకప్ బాక్సు నాకు ఇష్టమైన వేషధారణలు. పూర్తి స్వేచ్ఛగా మరియు స్టైల్‌గా కూడా ఉంటాయి.

మీరు రోజంతా నడవవలసివస్తే తేలికపాటి బరువు, మెత్తని సోల్, కొద్దిగా ఎగిరిపడే యాక్షన్ ఉన్న స్పోర్ట్స్ షూస్‌ని ఎల్లప్పుడూ ఎంచుకోవాలి. వాటి రంగు నల్లగా, ముదురు గోధుమరంగుగా గానీ లేదా నీలంగా గానీ ఉండాలి, దీనివల్ల అన్ని డ్రెస్‌లకూ నప్పేలా ఉంటాయి.

అనేక సార్లు, ప్రయాణం చేయడానికి ముందు మనం కొత్త చెప్పులు లేదా బూట్లు ధరిస్తుంటాము. ఇవి ఇబ్బంది కలిగిస్తుంటాయి, ఎందుకంటే ఇలాంటి కొత్త చెప్పులకు అలవాటు పడకపోవడం వల్ల మనకు షూస్ వల్ల గాయం కలుగుతుంది లేదా జారిపోయే పాదరక్షల వల్ల నేలపై పడిపోతుంటాము కూడా. కాబట్టి ప్రయాణం ప్రారంభించడానికి ముందు కొత్త పాదరక్షలకు అలవాటుపడటం అత్యుత్తమం. నాకు బాల్యంలో తరచుగా ఒకే ఒక జత చెప్పులు ఉండేవి మరియు చెప్పులు లేకుండానే నేను స్కూలుకు వెళుతుండేదాన్ని. ఒకసారి మా నాన్నగారు కొత్త చెప్పులు కొనిపెట్టగా వాటిని వేసుకోవడం అలవాటు లేకపోవడంతో నేను వాటిని స్కూలులో మరచిపోయాను. మరుసటి రోజు, అవి తెగిపోయి కనిపించాయి, దీనికి కారణం అదే రోజు మా స్కూలులో జరిగిన ఒక శిబిరమే. జీవిత కాలానికి ఉపయోగకరమైన గుణపాఠాలు నేర్పిన ఆ రోజులు ఎంత మధురమైనవో.

చెప్పులకు లేదా షూలకు వేరేగా బడ్జెట్ కేటాయించాలనే విషయాన్ని ఎవ్వరూ మరచిపోకూడదు, ఎందుకంటే మన జీవితాంతం మన పాదాలను పరిరక్షించేవి పాదరక్షలే కాబట్టి.


**వీణా పాటిల్**
మేనేజింగ్ డైరెక్టర్



సెలవు...
ఎంత తక్కువైతే,
అంత ఉత్తమం!
ఇప్పుడు మీరు తప్పకుండా ప్రయాణించాలి!



All International Tours are Ex-Hyderabad

One and Two Countries

| | | | |
|---|---|---|---|
| 27990 ~~32990~~ QT-థాయ్‌లాండ్ - 5 రోజులు 5 మార్చి | 40990 ~~45990~~ D2-దుబాయ్ షాపింగ్ ఫెస్టివల్ 4 రోజులు-15 ఫిబ్రవరి, 12 మార్చి | 58990 ~~68990~~ M3-మారిషస్ 5 రోజులు- 16 మార్చి | 61990 ~~70990~~ ML-శ్రీలంక మాల్దీవ్స్ 7 రోజులు-7 మార్చి |

Three and Indian Tours

| | | | |
|---|---|---|---|
| 56990 ~~69990~~ Q3-సింగపూర్-థాయ్‌లాండ్-మలేసియా 8 రోజులు-19 ఫిబ్రవరి, 4 మార్చి | 59990 ~~74990~~ Q4-సింగపూర్-థాయ్‌లాండ్-మలేసియా 10 రోజులు-5 మార్చి | 13975 ~~15975~~ H6-షిమ్లా-కులు-మనాలి 8 రోజులు-10 ఫిబ్రవరి, 2,12,20, 25 మార్చి | 16975 ~~19975~~ N6-నైనిటాల్, ఎం'గ్రీ సి'బెట్ పార్కు 8 రోజులు- 7,15,23,31 మార్చి |

Today all our offices will remain open from 10 am to 6 pm.
*USD=₹ 47. Prevailing Rate will apply. Terms & Conditions Apply.

KESARI
World Class Travel Company

K&S
KESARI COST SAVER TOURS

Hyderabad: 2335 5151
www.knstours.in

Advt.

# వెలకట్టగలరా...

**ఖరీదు కట్టే షరాబులుండాలే కానీ కూజాకూ, కుర్చీకీ కూడా కోట్ల రూపాయల వెలకట్టే కాలమిది. నమ్మబుద్ధి కావడంలేదా... అయితే, ప్రపంచంలోనే విలువైన ఈ వస్తువుల విశేషాలు చదవండి మీకే తెలుస్తుంది.**

## ఇంద్రభవనం



27 అంతస్తుల ఇల్లు. గ్రౌండ్ ఫ్లోర్‌లో కృష్ణుడి మందిరం, మొదటి ఆరంతస్తులూ కార్ పార్కింగ్‌కి. అందులో 168కార్లను పెట్టొచ్చు. తర్వాతి అంతస్తుల్లో వేలాడే తోటలు, జిమ్, హెల్త్ స్పా, ఐస్‌క్రీమ్ రూమ్, డాన్స్ స్టూడియో, స్విమ్మింగ్ పూల్స్, సినిమా థియేటర్ ఉంటాయి. ఇందులోని థియేటర్లో 50మంది హాయిగా కూర్చుని సినిమా చూడొచ్చు. ఇక అన్నిటికన్నా పైనున్న నాలుగు అంతస్తుల్లో యజమానులు ఉంటారు. ఆ పైనున్న మరో అంతస్తులో గ్రంథాలయమూ ఉంది. ఈ ఆకాశహర్మ్యం పైన మూడు హెలీకాప్టర్లు ల్యాండ్ అవ్వడానికి వీలుగా హెలీ ప్యాడ్లు కూడా ఉన్నాయి. మనదేశంలోకెల్లా ధనికుడూ ప్రపంచ సంపన్నుల్లో నాలుగో వ్యక్తి అయిన ముఖేష్ అంబానీ ముచ్చటపడి ముంబయిలో కట్టుకున్న విలాసవంతమైన ఇల్లు ఇది. 'ఆంటిలియా'గా పిలిచే ఈ ఆకాశహర్మ్యం విలువ 4500కోట్ల రూపాయలు. అందుకే, ప్రపంచంలోనే ఖరీదైన ఇల్లుగా రికార్డు సృష్టించింది. ఇంతకీ ఇంత పెద్ద భవంతిలో ఎవరెవరుంటారో చెప్పలేదు కదూ! ముఖేష్‌అంబానీ, అతని భార్య, ముగ్గురు పిల్లలు, ఆరువందలమంది పనివాళ్లూ ఉంటారు. అన్నట్లూ ఈ భవనానికి ఒక నెలకు అయ్యే కరెంటు బిల్లు దాదాపూ డెబ్బై లక్షల రూపాయలట.





## పలుకే బంగారమాయెనా...



ఐఫోన్‌లు ఇపుడు మధ్యతరగతి వారిక్కూడా అందుబాటులోకి వచ్చాయి. అలా అని అన్ని ఐఫోన్‌లూ అందరూ కొనగలరనుకుంటే పొరబడినట్లే. 'స్టార్ట్ హగ్స్' కంపెనీ రూపొందించిన 'ఐఫోన్ 4 డైమండ్ రోజ్ ఎడిషన్' ధర అక్షరాలా 36.01కోట్ల రూపాయలు మరి. అంత ఖరీదెందుకంటారా... ఈ ఫోన్ వెనుక భాగాన్ని అచ్చంగా రోజ్‌గోల్డ్‌తోనూ చుట్టూ ఉన్న ఏంటినా బ్యాండ్‌ను వంద క్యారెట్ల వజ్రాలతోనూ రూపొందించారు. అంతేకాదండోయ్, ఫోన్ ముందు భాగంలో ఉన్న యాపిల్ లోగోలో 53వజ్రాలూ, ప్లాటినంతో చేసిన హోమ్ బటన్‌కు 7.4 క్యారెట్ల గులాబీ వజ్రాన్నీ అమర్చారు.

## వజ్రాల మూట



డబ్బులూ విలువైన వస్తువులూ ఉంటే హ్యాండ్ బ్యాగ్‌ను జాగ్రత్తగా చూసుకుంటాం. అదే ఖాళీ బ్యాగునైతే ఏదో మూల పడేస్తాం. జపనీస్ డిజైనర్ 'గిన్జా తనకా' రూపొందించిన ఈ డైమండ్ బ్యాగును మాత్రం అందులో ఏం లేకపోయినా లాకర్‌లో పెట్టి దాచుకోవాల్సిందే. దీని ఖరీదు రూ. తొమ్మిది కోట్లు మరి. ప్లాటినంతో రూపొందించిన ఈ బ్యాగ్‌ను తగిలించుకోవడానికి వజ్రాలు పొదిగిన స్ట్రాప్ ఉంటుంది. దీన్ని అవసరమైనపుడు తీసి నెక్లెస్‌గానూ, బ్రేస్‌లెట్‌లానూ వేసుకోవచ్చు. ఇక బ్యాగ్ ముందుభాగంలో ఉన్న బటన్‌ను ఎనిమిది క్యారెట్ల వజ్రంతో చేసి దాని చుట్టూ ఎనభై చిన్న వజ్రాలను పొదిగారు. దీన్ని కూడా కావల్సినపుడు తీసి జడలో క్లిప్‌లా పెట్టుకోవచ్చు.

## మెరిసింది చెట్టు



క్రిస్మస్‌ట్రీని రంగుల లెడ్‌లైట్లూ, బెలూన్లతో అందంగా అలంకరించి పండుగ జరుపుకోవడం సామాన్యులందరూ చేసేదే. కోట్లకు పడగలెత్తినవారు కూడా ఇలా మామూలు క్రిస్మస్ ట్రీని పెడితే విశేషం ఏముంటుందీ..? ప్రపంచంలోని ఖరీదైన హోటళ్లలో ఒకటైన అబుదాబీ, ఎమిరేట్స్ ప్యాలెస్ హోటల్ నిర్వాహకులు కూడా ఇలాగే అనుకున్నట్లున్నారు. ఏకంగా 49.52కోట్ల రూపాయల క్రిస్మస్ ట్రీని హోటల్‌లో పెట్టారు. 43అడుగుల ఎత్తున్న ఈ కృత్రిమ చెట్టును బంగారు, వెండి తీగలతోపాటు, 181వజ్రాలూ, ఎన్నో రకాల ముత్యాలూ, ఎమరాల్డ్స్, ఇతర విలువైన రత్నాలూ పొదిగిన ఆభరణాలతో అలంకరించినందుకు అంత ఖర్చయిందట.

## నేనే నంబర్ వన్



ఫోన్ నంబర్ అయినా, కారు నంబర్ అయినా ఫ్యాన్సీ నంబర్ అయితే, అదో గొప్ప. అందుకే, నచ్చిన నంబర్‌ను సొంతం చేసుకోవడానికి కొందరు లక్షలు గుమ్మరిస్తుంటే మరికొందరు కోట్లు ఖర్చుపెట్టడానిక్కూడా వెనుకాడ్డం లేదు. యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌కు చెందిన 'సాయిద్ కౌరి' ఒకటో నంబర్ లైసెన్సు ప్లేటు కోసం రూ.63 కోట్లు ఖర్చుపెట్టాడు. తను నంబర్ వన్ స్థానంలో ఉండాలనే ప్రపంచంలోనే ఎక్కువ ఖరీదుపెట్టి ఈ లైసెన్సు ప్లేటు కొన్నాడట.

## వజ్రం విలువైనది



మామూలు వస్తువుల ధరలే ఆకాశాన్నంటుతున్నాయి. అలాంటిది విలువైన వజ్రం... అందులోనూ అందమైనదీ, అరుదైనదీ అంటే దాని విలువ ఎలా ఉంటుందో చెప్పనక్కర్లేదు. గులాబీ రంగు వజ్రాలు దొరకడం చాలా అరుదు. దొరికినా 20క్యారెట్ల బరువు తూగేవి అసలు ఉండవనే చెప్పాలి. అందుకే, బ్రిటన్ వాసి హ్యారీ విన్‌స్టన్ తన దగ్గరున్న 24.78 క్యారెట్ల గులాబీరంగు వజ్రాన్ని వేలం వేసి 207కోట్ల రూపాయలకు అమ్మాడు.

## కూజాకు కోట్లు



లండన్‌లోని 'బెయిన్ బ్రిడ్జెస్' ఆక్షన్ హౌస్‌లో అమ్ముడైన ఈ పింగాణీ కూజా విలువ అక్షరాలా 383కోట్ల రూపాయలు. 18వ శతాబ్దానికి చెందిన ఈ కూజా ఈమధ్యే లండన్‌లోని ఓ ఇంట్లో పాత సామగ్రిలో దొరికింది. దాని విలువను గుర్తించిన ఆ ఇంటి యజమానులు వేలంపాటకు తీసుకురాగా ఓ చైనా వ్యాపారి అంత సొమ్ము పోసి కొన్నాడు. ప్రస్తుతం ఇదే ప్రపంచంలో ఖరీదైన కూజా.

## విలువైన విజ్ఞానం...

రూ.51.77 కోట్లు... 'బర్డ్స్ ఆఫ్ అమెరికా' అనే పుస్తకం ఖరీదు ఇది. వన్యప్రాణి చిత్రకారుడైన 'జాన్ జేమ్స్ ఆడబన్' అమెరికాలో ఉండే అయిదు వందల జాతుల పక్షుల నిలువెత్తు చిత్రాలను గీసి ఆ పెయింటింగులన్నిటినీ 1827లో ఓ పుస్తకంగా అచ్చు వేయించాడు. 435 చిత్రాలతో మూడడుగుల ఎత్తూ రెండడుగుల వెడల్పూ ఉన్న ఈ పుస్తకాన్ని తర్వాత 119 కాపీలుగా ముద్రించి అందులోని నలుపూ తెలుపూ చిత్రాలను ప్రముఖ చిత్రకారులతో రంగుల్లోకి మార్పించారు. రకరకాల పక్షుల పెయింటింగులున్న 'బర్డ్స్ ఆఫ్ అమెరికా' ఆఖరి కాపీ గత డిసెంబరులో 'సోత్‌బె' ఆక్షన్ హౌస్ వారి వేలంలో అమ్ముడై ప్రపంచంలోనే విలువైన పుస్తకంగా రికార్డు సృష్టించింది.





## సింహాసనం..!



1917లో ప్రముఖ ఐరిష్ డిజైనర్ 'ఎలీన్ గ్రే' ప్రత్యేకంగా రూపొందించిన కుర్చీ ఇది. మధ్య భాగమంతా గోధుమ రంగు లెదర్‌తో కుట్టి, చేతులను డ్రాగన్ ఆకారంలో ప్రత్యేకంగా రూపొందించడంతో ఈ కుర్చీ డ్రాగన్ ఆర్మ్ చైర్‌గా ఎంతో ప్రాచుర్యం పొందింది. ఇన్నాళ్లూ ఈస్ సెయింట్ అనే ఆయన దగ్గరున్న ఇది గతేడాది ప్యారిస్‌లోని క్రిస్టీస్ ఆక్షన్ హౌస్‌కి చేరింది. వందేళ్ల చరిత్ర ఉన్న డ్రాగన్ చైర్‌ను సొంతం చేసుకోవడానికి ఎంతోమంది క్యూలు కట్టారు. చివరికి ప్యారిస్‌కు చెందిన రాబర్ట్ అండ్ చెస్కా వల్లోయిస్ ఆర్ట్‌గ్యాలరీ 126కోట్ల రూపాయలకు దీన్ని చేజిక్కించుకుంది.

# పచ్చని కానుక!



**మీ ఇంట్లో... మీ డ్రాయింగ్‌రూమ్‌లో...
మొక్కల్ని పెంచుకోవాలనుకుంటున్నారా?
నో ప్రాబ్లమ్... ఓ గాజుబీకరు,
కాసిని నీళ్లు, ఓ వెదురు
మొక్క ఉంటే చాలు...
మీ టేబుల్‌మీదే పచ్చదనం
పరిఢవిల్లుతుంటుంది. అదెలా సాధ్యం అంటారా?!**



హైడ్రోపోనిక్స్... కాస్తయినా మట్టి అవసరం లేకుండా కేవలం కాసిని నీళ్లలోనే మొక్కల్ని పెంచుకోగలిగే విధానం. అందునా ఈ పద్ధతిలో అత్యంత సులభంగా పెంచగలిగేవి వెదురుమొక్కలే. అందుకే ఇటీవల చాలామంది ఇళ్లలోనూ ఆఫీసుల్లోనూ వెదురుమొక్కలు ఏపుగా ఎదుగుతున్నాయి. ఆహ్లాదాన్ని పంచి ఇస్తున్నాయి. కొందరయితే అదృష్టం కోసం వీటిని కొంటున్నారు. మొత్తమ్మీద ఇది ఓ పాపులర్ ఇంటీరియర్ డెకరేటివ్ పీస్.

చిత్రమేమంటే అంతా వెదురుగా పిలిచే ఈ మొక్క నిజంగా వెదురు కాదు. ఉష్ణమండలంలోని వర్షారణ్య అడవుల్లో పెరిగే ఈ మొక్క అసలు పేరు డ్రాసియానా. చూడ్డానికి వెదురు లానే అనిపిస్తుంది. కాంతి తక్కువన్నా అసలు లేకున్నా కూడా సులభంగా పెరగడమే ఈ మొక్క ప్రత్యేకత. అందుకే ఇంట్లోనూ ఆఫీసుల్లోనూ ఎక్కడ పెట్టినా ఎంచక్కా పెరుగుతుంది లక్కీ బ్యాంబూ. పైగా టేబుల్‌మీద ఫ్లవర్‌వేజ్‌లా అలంకరించుకునేంత చిన్న సైజుల్లోనూ ఇవి దొరుకుతున్నాయి.

## ఎలా పెంచాలి?

గాజుబీకరు లేదా పాత్రలో అడుగున మొక్కకు ఊతంకోసం కొన్ని గులకరాళ్లు పోసి కాండం మునిగేవరకూ నీళ్లు పోసి మొక్కను ఉంచాలి. బీకరులో పోసేది ఉప్పు నీరయితే మొక్క దెబ్బతింటుంది. ఫిల్టర్‌వాటర్ అయితే మంచిది. గాజు తలుపుల్లో నుంచి వెలుతురు వచ్చే ప్రాంతాల్లోగానీ లేదా నియాన్‌లైట్ల వెలుతురుగానీ తగిలేలా ఉంచితే త్వరగా పెరుగుతుంది. అంతేతప్ప వీటికి నేరుగా సూర్యకాంతి తగలకూడదు. అలా తగిలితే లేత ఆకులు దెబ్బతింటాయి. నీటిని రెండువారాలకోసారి మార్చాలి. నీటిని మధ్యమధ్యలో కదుపుతుండాలి. న్యూట్రియంట్ సొల్యూషన్ కూడా కలపొచ్చు. కానీ అది మరీ ఎక్కువయితే కొత్తగా వచ్చే వేళ్లు మాడిపోతాయి. ఈ ద్రావణం నర్సరీల్లో కూడా దొరుకుతుంది. లేదంటే మనమే ఇంట్లో స్వయంగా తయారుచేసుకోవచ్చు. అదెలా అంటే ఫాస్ఫేట్, సల్ఫర్, కాల్షియం, సోడియం, మెగ్నీషియం, నైట్రేట్ లవణాలను సమపాళ్లలో తీసుకుని తగినన్ని నీళ్లలో కలపాలి. మొత్తం ఎరువుకి పది రెట్లు నీళ్లు కలపాలి. అప్పుడే దాన్ని మొక్క చక్కగా పీల్చుకోగలుగుతుంది.

## కర్లీ బాంబూ

ఈ ఇంటీరియర్ వెదురు మొక్కల్లో రకాలూ ఉన్నాయి. కొన్ని నిట్టనిలువుగా పెరిగితే మరికొన్ని వంపులు తిరుగుతూ పెరుగుతుంటాయి. వీటినే చైనీస్ బ్యాంబూ, కర్లీ బ్యాంబూ అంటున్నారు. వెదురుతోపాటు మనీప్లాంట్, స్పైడర్‌ప్లాంట్, ఆర్కిడ్, ఇతర క్రోటన్ మొక్కల్నీ కూడా మంచి ఇంటీరియర్ ప్లాంట్లుగా పెంచుకోవచ్చు. లక్కీబ్యాంబూ మొక్కలయితే మార్కెట్లో రెడీమేడ్‌గా రకరకాల ఆకారాల్లో దొరుకుతున్నాయి. దాంతో ఇవి వేడుకల్లో పచ్చని కానుకలుగానూ మన్ననలు అందుకుంటున్నాయి. మరి మనమూ పెంచుకుందామా? ★











# ఇక్కడే పుట్టి ఎక్కడో పెరిగి!





'ఇండియాలో గెలిస్తే
ఇంటర్నేషనల్‌గా గెలిచినట్టే.'
ఇప్పుడు ఎన్నో కంపెనీల సక్సెస్ మంత్ర ఇది!
కొత్త వస్తువులు ఏవైనా భారత్‌లోనే
తయారుచెయ్యాలని పోటీ పడుతున్నాయి
ఎన్నో సంస్థలు. మరి, ట్రెండ్ ఇలా ఎందుకు
మారిందో తెలుసుకుందామా!




మనకు 'ఫారిన్ ట్యాగ్' పిచ్చి! వాచీలైనా డ్రెస్సులైనా బైకులైనా కార్లైనా ఫోన్లైనా, టీవీలైనా... ఏవైనా సరే, 'మేడ్ ఇన్ జపాన్' లేదా 'మేడ్ ఇన్ బ్రిటన్' లాంటి ఏదో ఒక విదేశీ స్టాంప్ ఉంటే చాలు ఎగబడి మరీ కొనేస్తాం. ఫారిన్ బ్రాండ్ వస్తువులు మన మార్కెట్లో హాట్ కేకులు.

అయితే, గాలి ఎప్పుడూ ఒకే దిశలో వీచదు. అప్పుడప్పుడూ దిశ మార్చుకుంటుంది. ఇప్పుడు 'విదేశీ ట్యాగ్' గాలి అట్నుంచి ఇటు వీయడం మొదలైంది. విదేశీ కంపెనీలు రూటు మార్చుకుని భారత్ బాట పడుతున్నాయి. వస్తువేదైనా సరే, 'ఇండియాలో తయారైతే చాలు' అనుకుంటున్నాయి. కార్లు, సెల్‌ఫోన్లు, ఆహార ఉత్పత్తులు, టెక్నాలజీ... ఇలా ప్రతీ విషయంలో భారతీయ వినియోగదారుడు ఏం కోరుకుంటున్నాడో చూస్తున్నాయి.

### కారుల షికారు

ఈ మధ్య ఫోర్డ్ కంపెనీ ఫిగో కార్లను ఇండియాలోనే తయారుచేసింది. దాదాపు వెయ్యిమంది స్వదేశీ ఇంజినీర్లు రెండేళ్లపాటు శ్రమించి ఫిగోను రూపొందించారు. ఇది మార్కెట్లోకి వచ్చిన 25 వారాల్లోనే దాదాపు 30 వేల కార్లు అమ్ముడయ్యాయి. ఫిగో ఇండియా మార్కెట్లో సూపర్ సక్సెస్. దాంతో ఈ మోడల్‌ను మెక్సికో, ఆఫ్రికా, మధ్య ఆసియాలతో పాటు మొత్తం 50 దేశాల్లో విడుదల చేసింది. ఈ మధ్యనే మార్కెట్లోకి వచ్చిన టొయాటా ఇటోస్ కారు కూడా ఇక్కడే రూపుదిద్దుకుంది. మనదేశానికి చెందిన దాదాపు 2000 మంది నిపుణులూ జపాన్‌కి చెందిన మరికొంతమందితో కలసి 'ఇటోస్'ని మనదేశంలోనే తయారు చేశారు. మార్కెట్లో ఇదీ సూపర్ హిట్! ఆ తరువాత బ్రెజిల్, దక్షిణాఫ్రికా, చైనాల్లో ప్రవేశించింది. అయితే, ప్రపంచ ప్రఖ్యాత కంపెనీలు మనదేశంలోనే కొత్త మోడళ్లు ఎందుకు తయారు చేస్తున్నాయా... అంటే, చాలా కారణాలున్నాయి. 2008 తరువాత అన్ని దేశాల ఆర్థిక వ్యవస్థల్లోనూ ఎన్నో మార్పులు వచ్చాయి. ముఖ్యంగా భారత్, చైనా లాంటి దేశాల్లో వినియోగదారుడి మనస్తత్వం మారింది. తక్కువ ఖరీదులో ఎక్కువ ప్రయోజనాలు కోరుకుంటున్నాడు. అందుకే ఎక్కువ మైలేజీ ఇచ్చే చిన్నకార్లకు డిమాండ్ పెరిగింది. ఈ డిమాండ్‌ని అర్థం చేసుకున్న కంపెనీలు మనకు సరిపోయే మోడల్స్‌ని ఇక్కడే తయారు చేస్తున్నాయి. దేశీయంగా నానో కారు కూడా వినియోగదారుల్ని బాగానే ఆకర్షించింది. ఇప్పుడీ కారు విదేశాల్లోకీ దూసుకుపోనుంది. కొత్త మోడల్ కార్లు మాత్రమే కాదు, కొత్తరకం ఆహార ఉత్పత్తులు కూడా ఇక్కడే తయారౌతున్నాయి.

### అదీ కారణం!

ఇప్పటికే చాలామంది ఇళ్లల్లో పిల్లలకి ఫలహారంగా మ్యాగీ నూడుల్స్‌ని పెడుతుంటారు. పట్టణ ప్రాంతాల్లోనే కాకుండా గ్రామీణ భారతానికీ నూడుల్స్‌ని పరిచయం చేద్దామని రెండు రూపాయల చిన్న ప్యాక్‌లను ప్రవేశపెట్టింది సదరు కంపెనీ. ఆ ఐడియా సక్సెస్. తరువాత పాకిస్తాన్‌లో. ఆపై ఆస్ట్రేలియా, న్యూజిలాండ్‌లలో. ప్రపంచవ్యాప్తంగా పాపులరయిన కుర్‌కురేలు కూడా మేడ్ ఇన్ ఇండియానే! ఇక, మనదేశంలో వివిధ పట్టణాల్లో దర్శనమిస్తుంటాయి కె.ఎఫ్.సి. హోటల్స్. వీళ్లీ మధ్య ఓ డ్రింక్‌ని ఇక్కడే తయారుచేశారు. చాక్లెట్, కాఫీ, కుకీ బైట్స్‌తో కలగలిసిన ఆ పానీయం మనవాళ్లకు భలేగా నచ్చేసింది. మెక్‌డోనాల్స్ వారు శాకాహారుల కోసం రూపొందించిన ఇండియన్ బర్గర్ కూడా మనవాళ్లకు నచ్చింది! ఇంకేం, దీనికీ వీసా లభించేసింది. ఐరోపా దేశాలకు తుర్రుమంది. ఇలాగే కొన్ని రకాల వాటర్ ప్యూరిఫైర్లూ నోకియా మొబైల్ అప్లికేషన్లూ ఇంకా ఎన్నో.... మనదేశంలోనే తయారవుతున్నాయి. ప్రస్తుతం విదేశాల్లో 'మేడ్ ఇన్ ఇండియా' ట్యాగ్‌కి గిరాకీ పెరుగుతోంది. ఎన్నో కంపెనీలు కొత్త ఆవిష్కరణ అంటే ముందు భారత్‌కే ప్రాధాన్యం ఇస్తున్నాయి. అయితే, ఉన్నట్టుండి గాలి ఇలా మళ్లడానికి ప్రధాన కారణం ఆర్థికమాంద్యమే అనేది నిపుణుల విశ్లేషణ.

బహుళజాతి కంపెనీలు ప్రస్తుతం వ్యాపార వ్యూహాలను మార్చుకున్నాయి. కొత్త వస్తువు తయారు చెయ్యాలనుకున్నప్పుడు తక్కువ ఖర్చులో మంచి ప్రమాణాలతో రూపొందించాలని ఆలోచిస్తున్నాయి. అలాంటప్పుడు ముందుగా కనిపించేది మనదేశమే. ప్రపంచ దేశాల్లో త్వరగా అభివృద్ధి చెందుతున్న దేశం మనది. మానవ వనరులకు కొరతలేదు. మధ్యతరగతి, ఎగువ మధ్య తరగతి ప్రజలు ఎక్కువ. కాబట్టి ఇక్కడ మార్కెట్‌కి అనుగుణంగా ఏ వస్తువును తయారు చేసినా అది ప్రపంచవ్యాప్తంగా క్లిక్ అవుతుందన్నది ఓ నమ్మకం. 'వినియోగదారులు వెనకటిలా లేరు. అభిరుచులు ఎప్పటికప్పుడు మారిపోతున్నాయి. ఆ మార్పు ఇండియాలో స్పష్టంగా కనిపిస్తుంది' అంటారు కె.ఎఫ్.సి.కి చెందిన వర్మ. 'కొత్త ఆవిష్కరణల విషయంలో మన ఇండియన్ బ్రాండ్‌కి ప్రపంచ స్థాయి గుర్తింపు ఎప్పట్నుంచో ఉంది. యోగా ఆయుర్వేదం లాంటివెన్నో ప్రపంచవ్యాప్తమయ్యాయి. ఇప్పుడీ కార్లూ ఫోన్లూ లాంటి ఉత్పత్తులు కూడా మన దేశంలోనే తయారవడం గర్వకారణం' అంటారు టాటా సంస్థలకు చెందిన గోపాలకృష్ణన్. ★









# రాజకీయాలు వద్దనేది అమ్మ!



**'మా అమ్మ చెప్పినట్టు వైద్యురాలినయ్యాను, వైద్యుణ్ని పెళ్లి చేసుకున్నాను, విదేశీ డిగ్రీలు సంపాదించాను... కానీ, చివరికి అమ్మ వద్దన్న రాజకీయాల్లోకే ప్రవేశించాను' అంటున్న రాష్ట్రమంత్రి జెట్టి గీతారెడ్డి మనసులోమాటలివి...**

ఒకవైపు చెన్నారెడ్డి... మరొకవైపు, సినిమాల్లో మాత్రమే చూసిన ఎన్టీఆర్... వామపక్ష నేత సీహెచ్ రాజేశ్వర రావు... అందరూ హేమాహేమీలే!

ఎమ్మెల్యేగా గెలిచి శాసనసభలోకి అడుగు పెట్టిన ఆ రోజు... నా జీవితంలో మర్చిపో లేనిది. అందులోనూ ఒకప్పుడు మా అమ్మ అడుగుపెట్టిన అసెంబ్లీలో నేనూ ఓ ప్రజా ప్రతినిధిగా అడుగుపెట్టడం పెద్ద గౌరవంగా అనిపించింది.

మా అమ్మ... జె. ఈశ్వరీబాయి.

పరిచయం అక్కర్లేని పేరు.

ఆమె కడుపున పుట్టడమే నా అదృష్టం. దళితులు ఎన్నో కష్టాలు పడుతున్న రోజుల్లోనే ఎలాంటి అనుభవం లేకుండానే రాజకీయాల్లోకి ప్రవేశించి కౌన్సిలర్‌గా పోటీచేసి గెలిచి అంచెలంచెలుగా ఎదిగి రిపబ్లికన్ పార్టీ అధ్యక్షురాలయింది అమ్మ. శాసనసభలో ఒక ప్రతిపక్షనేత అయుండీ మహిళాశిశు సంక్షేమ విభాగం అధ్యక్షురాలిగా చేసింది. అలాంటి క్యాబినెట్ ర్యాంకు హోదా ఒక ప్రతి పక్షనేతకు ఇవ్వడం అదే మొదలనుకుంటా.

చిలకలగూడలో మా తాతయ్యావాళ్లది పెద్ద భవంతి ఉండేది. అక్కడ ఆరుబయట బోలెడంత ఖాళీ స్థలం. అందులో అమ్మ చుట్టుపక్కల పేదపిల్లలకు పాఠాలు చెప్పేది. నేను పుట్టిన రెండేళ్లకే మా నాన్న (లక్ష్మీనారాయణ) చనిపోయారు. అయినా నాకు ఆయన లేని లోటు తెలీకుండా చాలా సుకుమారంగా పెంచింది అమ్మ.

❖ ❖ ❖

ఒక ప్రజాప్రతినిధిగా అమ్మ తమ సమస్యలు తీరుస్తుందన్న ఆశతో రోజూ చాలా మంది మా ఇంటికి వస్తుండేవాళ్లు. నేనప్పటికి చాలా చిన్నపిల్లని. పొద్దున నిద్రలేచేసరికే ఇల్లంతా వాళ్లే ఉండేవారు. నేను చూస్తూ కూర్చుంటే 'నువ్వెళ్లి చదువుకో, ఈ రాజకీయాలు నీకొద్దు. నువ్వు బాగా చదివి డాక్టరవ్వాలి' అనేది అమ్మ.
మా నాన్న వైద్యుడు కాబట్టి నేను కూడా ఆ వృత్తిలోకే ప్రవేశించాలనుకునేది అమ్మ. అందులోనూ గైనకాలజిస్టు కావాలని నాకు పదేపదే చెప్పేది.

ఎక్కడైనా పేదవాళ్లకు అన్యాయం జరుగు తోందంటే వెంటనే అక్కడికి వెళ్లిపోయేది. మాకో ఆకుపచ్చ ఫియెట్ కారుండేది. అమ్మ బాగా వేగంగా నడిపేదా కారుని. ఆరోజుల్లో పుచ్చలపల్లి సుందరయ్య, తెన్నేటి విశ్వనాథం, గోరాశాస్త్రి వంటి మహామహులు మా ఇంటికి వస్తుండేవారు. అమ్మ వాళ్లకు వండిపెడు తుండేది. ఆనాటి రాజకీయాల గురించీ వాళ్లు పాటించే విలువల గురించీ తల్చుకుంటుంటే ఇప్పటికీ ఆశ్చర్యంగా ఉంటుంది నాకు. వాళ్లందరినీ చూడటం నా అదృష్టమే.

❖ ❖ ❖

ప్రాథమిక విద్య వరకూ సెయింట్‌ఆన్స్ పాఠశాలలో చదువుకున్నాను. కానీ అక్కడ తెలుగు లేకపోవడంతో సెయింట్‌ఫ్రాన్సిస్ స్కూల్‌కి మార్చింది అమ్మ. ఆ తర్వాత నిజామ్ కాలేజ్‌లో చేరి పీయూసీ చేశాను. చిన్నప్పటి నుంచీ చదువులోనే కాకుండా సాంస్కృతిక కార్యక్రమాల్లో బాగా పాల్గొనే దాన్ని. వక్తృత్వ పోటీలు జరిగాయంటే నా పేరు ఉండాల్సిందే. బహుమతులూ వచ్చేవి. స్కూల్ స్థాయి నుంచి కూడా ఇంగ్లిష్ బాగా మాట్లాడ్డమే అందుకు కారణం. బడిలో నా ఇంగ్లిష్ చూసి అందరూ నన్ను 'ఇంగ్లిష్ ప్రొఫెసర్' అనేవాళ్లు. అంతర్ కళాశాలల నాటక పోటీల్లోనూ ఒకసారి నాకు ఉత్తమనటి బహుమతి వచ్చింది.

అర్జునుడికి ఎలా లక్ష్యం ఉందో నాక్కూడా అలాగే చిన్నప్పటి నుంచీ ఒక లక్ష్యం స్థిరంగా ఉండేది. అమ్మ చెప్పింది కాబట్టి వైద్యురాలిని కావాలి. అందులోనూ గైనకాలజీ చెయ్యాలి. అదేలక్ష్యంతో చదివి ఎంబీబీఎస్ పూర్తిచేశాను. గాంధీ ఆసుపత్రిలో హౌస్‌సర్జన్‌గా చేస్తున్నప్పుడు రామచంద్రారెడ్డిగారితో పరిచయమైంది. అది ప్రేమగా మారింది. పెళ్లి చేసుకున్నాం. పెళ్లయ్యాక ఇద్దరం కలిసి ఆస్ట్రేలియా వెళ్లాం.

అక్కడ మహిళలు ఉద్యోగం చెయ్యడం చాలా అరుదు. నేను ఇక్కడ ఎంబీబీఎస్ చేశాను కాబట్టి అక్కడే ఏదైనా ఆసుపత్రిలో ఉద్యోగం చేస్తూ పీజీ చేద్దామని దరఖాస్తు చేసే దాన్ని. ఎక్కడికెళ్లినా 'నువ్వెందుకు పీజీ చేయడం, హాయిగా ఇంట్లో కూర్చుని కుటుంబ బాధ్యతలు నిర్వర్తించక?' అనేవారు. నాకు బాగా కోపమొచ్చేది. 'నేను ఎనిమిదివేల మైళ్ల దూరం ప్రయాణించి భారతదేశం నుంచి ఇక్కడకు వచ్చింది ఇంట్లో కూర్చోవడానికి కాదు, గైనకాలజీ చెయ్యాలన్నది నా లక్ష్యం, నేను దాన్ని సాధిస్తాను' అని కోపంగా చెప్పేదాన్ని. అలా కోపంగా మాట్లాడితే ఉద్యోగం రాదని తెలుసు. అయినా అలాగే సమాధానమిచ్చేదాన్ని. మొత్తానికి క్రౌన్‌స్ట్రీట్ అనే ఆసుపత్రిలో ఉద్యోగం వచ్చింది. తర్వాత కాంటర్‌బరీ ఆసుపత్రిలో కూడా పనిచేశాను. కానీ 'ఆస్ట్రేలియన్ డిగ్రీలకు మన దేశంలో పెద్దగా గుర్తింపు ఉండదు, లండన్ డిగ్రీ అయితే మంచిది' అని కొందరు చెప్పడంతో ఇద్దరం కలిసి లండన్‌కి వెళ్లి ప్రాక్టీస్ చేస్తూనే చదువుకున్నాం. తర్వాత అక్కణ్నుంచీ రియాద్‌కు వెళ్లి ఉద్యోగం చేశాం. కానీ మా అమ్మకు మాత్రం నేను వైద్యురాలిగా మనదేశంలోనే సేవలందించాలనే కోరిక ఉండేది. అందుకే మాకు చెప్పకుండా ఒక ఆసు

## బాబా భక్తురాల్ని

మా అమ్మ షిర్డీసాయిబాబా భక్తురాలు. మేము సత్యసాయి బాబా భక్తులం. 1980లో మావారికి మెదడులో రక్తం గడ్డకట్టి పక్షవాతం లాగా వచ్చింది. కొందరు సాయిభక్తుల మాట ప్రకారం ఆయన్ని బాబా దగ్గరకు తీసుకెళ్లిన కొద్దికాలంలోనే తగ్గిపోయింది. అప్పట్నుంచీ ఆయనను ఆరాధిస్తున్నాం. నేనెంతగానో ప్రేమించిన మా అమ్మ 1991లో చనిపోయింది. ఆ వెలితి చాలా ఉండేది నాకు. 1992లో బాబా హైదరాబాద్ వచ్చినప్పుడు ఆయన్ను కలిసి ఆయన ముందు ఏడ్చేశాను. 'అందరూ పోవల్సిందేకదా బంగారూ, నేనున్నాగా నీకు' అన్నారాయన. ఆ క్షణమే నాకా వెలితి పోయింది. అప్పట్నుంచీ ఇప్పటివరకూ బాబానే మా అమ్మలాగా భావిస్తాను. 'ఏది జరిగినా మనమంచికే' అనే స్థితప్రజ్ఞత మాకు బాబా వల్లే అలవడింది.

పత్రి కూడా కట్టడం ప్రారంభించింది.

❖ ❖ ❖

1980లో ఇక్కడికొచ్చినప్పుడు అమ్మ కడుతున్న ఆసుపత్రిని చూసి ఆశ్చర్యపోయాను. గాంధీహాస్పిటల్ సలహామండలిలో సభ్యురాలు అమ్మ. కాబట్టి అందరు వైద్యులతో సంబంధం ఉండేది. మేం వచ్చేసరికే ఆసుపత్రిని ఇక్కడి వైద్యులతో ప్రారంభించేసింది. అమ్మ పట్టుదల చూసి ఆశ్చర్యపోయాం. ఇంకా ఎన్నాళ్లు విదేశాల్లో ఉంటారు. ఇక్కడికొచ్చి సేవ చేయండి అంటుండేది. అప్పటికి మేం రియాద్‌లో ఉన్నాం. ఒకసారి అక్కడికి ఇందిరాగాంధీ, రాజీవ్‌గాంధీ, సోనియా వచ్చారు. వాళ్ల కోసం రియాద్ రాజు ఇచ్చిన విందుకు మమ్మల్ని కూడా ఆహ్వానించారు. రాజీవ్, సోనియాలతో అప్పుడే పరిచయమైంది. వాళ్లు మమ్మల్ని ఇండియాకి వచ్చి సేవచేయాల్సిందిగా ఆహ్వానించారు. అమ్మ కోరిక కూడా అదే కావడంతో ఇక్కడికి వచ్చేయాలని నిశ్చయించుకున్నాం. కానీ మా ప్రయాణం ఒక చేదు సంఘటనతో ముగిసింది.

❖ ❖ ❖

రియాద్ నుంచి మా వైద్యపరికరాలూ గృహోపకరణాలూ దుస్తులూ అన్నీ ఒక ఓడలో పంపించాం. వాటిని ఓడలో వేశాక... అప్పటికే బుక్ చేసిన ఒక బెంజ్ కార్ కోసం స్టుడ్‌గార్డ్(జర్మనీ) వెళ్లాం. అక్కణ్నుంచి ఆ కారు తీసుకుని లండన్ మీదుగా బొంబాయి చేరుకుని, రోడ్డుమార్గం గుండా మా సామానంతా హైదరాబాద్‌కి చేరవెయ్యాలి. ఇదీ మా ప్రణాళిక. అనుకున్నట్టుగానే బొంబాయికి చేరుకుని కంటెయినర్ దగ్గరకు వెళ్లేసరికి... వేసిన తాళం వేసినట్టే ఉంది. లోపల సామానంతా దొంగిలించేశారు. ఖరీదైన వైద్యపరికరాలూ ఇతర గృహోపకరణాలూ నా పెళ్లిచీరతో సహా మొత్తం పట్టు చీరలూ... ఒక్కటి కూడా లేదు. కిందంతా సిగరెట్ పీకలూ అగ్గిపెట్టెలూ పేకముక్కలూ ఉన్నాయి. ఓడ బొంబాయి పోర్టుకొచ్చాకే ఇదంతా జరిగింది. ఓడలో ఆ సామాను ఎక్కించేముందు వాటి విలువ 68వేల రూపాయలుగా రాశారు పోర్ట్ అధికారులు. ఆ బీమా డబ్బులు కూడా ఇవ్వమన్నారు ఇక్కడి అధికారులు. పోనీ వదిలేద్దామా అంటే... 1982లో రూ.68 వేలంటే చిన్న మొత్తం కాదు. దాంతో ఢిల్లీకి వెళ్లి రాజీవ్ గాంధీతో మాట్లాడేందుకు ప్రయత్నించాం. కానీ ఆయన అపాయింట్‌మెంట్ దొరకలేదు. అప్పుడు సోనియాగాంధీని ఇంటివద్ద కలిసి విషయం చెప్తే ఆవిడ వెంటనే రాజీవ్‌తో మాట్లాడి పోర్టు అధికారులతో మాకు డబ్బు ఇప్పించే ఏర్పాటు చేశారు.

❖ ❖ ❖

హైదరాబాద్‌కొచ్చాక అమ్మ కట్టించిన ఆసుపత్రిలో వైద్యం ప్రారంభించాం. కొద్దిరోజుల్లోనే నాకు సంతానసాఫల్య వైద్యురాలిగా మంచి పేరొచ్చింది. నేనలా మంచి పేరుతెచ్చుకోవడంతో అమ్మ చాలా సంతోషించేది. 'నీలాంటి ఒక్క కూతురుంటే చాలు, నా కోరికలన్నీ తీర్చావు' అని పొంగిపోయేది. కాకపోతే ఆమె 'నువ్వు రాజకీయాలకు మాత్రం సరిపోవు, అందులోకి మాత్రం ఎప్పుడూ వెళ్లకు' అని తరచూ అంటుండేది. కానీ విధివశాత్తూ నేను రాజకీయాల్లోకే వచ్చాను.

❖ ❖ ❖

ఇక్కడికొచ్చాక కూడా మేం రాజీవ్‌గాంధీతో ఉత్తరప్రత్యుత్తరాలు జరుపుతుండేవాళ్లం. ఆయన సూచన మేరకే 1986లో నేను రాజకీయాల్లోకి అడుగుపెట్టాను. అప్పట్లో... పేదలకు కూడా మంచి వైద్యం అందుబాటులో ఉంచడానికి రాజీవ్‌గాంధీ తన నియోజకవర్గం(అమేథీ)లో 'మొబైల్ మెడికల్ వ్యాన్' పథకాన్ని రూపొందించారు. ఈ కార్యక్రమంలో భాగంగా వైద్యులు వాహనంలో మారుమూల పల్లెల్లో తిరుగుతూ పేదలకు వైద్యం చేస్తారు. ఆ పథకం నాకు బాగా నచ్చి నేను కూడా 'రాజీవ్‌గాంధీ మొబైల్ మెడికల్ వ్యాన్' అని ఒక వాహనాన్ని ఏర్పాటు చేసుకుని ఊరూరా తిరుగుతూ వైద్యం చేయడం మొదలుపెట్టాను. రోజంతా వైద్యం చేసి, సాయంత్రం పూట... రాజీవ్‌గాంధీ, కాంగ్రెస్‌పార్టీ పేదలకు చేస్తున్న మేలు గురించి వారికి చెప్పేవాళ్లం. పార్లమెంటు ఎన్నికలప్పుడు రాజీవ్‌గాంధీ నన్ను ఎంపీగా పోటీచేయమన్నారు. సిద్దిపేట, సికింద్రాబాద్... ఈ రెండు నియోజకవర్గాల్లో ఏదోఒకదాన్ని నన్నే ఎంచుకోమన్నారు. అప్పుడు నేను సికింద్రాబాద్ నుంచి పోటీ చేస్తానన్నాను. కానీ అది రిజర్వుడు స్థానం కాకపోవడంతో స్థానికంగా రాజకీయ సమస్యలు వస్తాయని భావించి సిద్దిపేట నుంచి పోటీ చేయమన్నారు. సరేనన్నాను. ఆఖరుక్షణంలో అక్కడా చుక్కెదురైంది. 'ఇప్పుడే రాజకీయాల్లోకి ప్రవేశించింది... పార్లమెంటుకు పంపించడం ఎందుకు' అని కొందరు సీనియర్లు అడ్డుచెప్పడంతో నాకు సీటు రాలేదు. దాంతో రాజీవ్ గాంధీ ఎమ్మెల్యే టిక్కెట్ ఇస్తానన్నారు. అప్పట్లో గజ్వేల్ ప్రాంతంలో ఎక్కువగా వైద్య సేవలు అందించేదాన్ని కాబట్టి అక్కణ్నుంచి పోటీ చేస్తానన్నాను. అన్నట్టుగానే అక్కడ టిక్కెట్ ఇచ్చారు. పోటీచేసి ఐదువేల ఆధిక్యంతో గెలిచి శాసనసభలో అడుగుపెట్టాను.

❖ ❖ ❖

నేను ఎమ్మెల్యేగా ఎన్నికైన సంవత్సరం 1989. ఇప్పుడు 2011.

ఇరవైరెండేళ్లు..! ఈ రెండు దశాబ్దాల్లో ఎన్నో పదవులు చేపట్టాను. ఎన్నికల్లో గెలిచాను, కొన్నిసార్లు ఓడాను.

పదవులు వస్తాయి, పోతాయికానీ మన వ్యక్తిత్వాన్ని నిర్ణయించేది మన మంచితనమే. అందుకే అప్పటికీ ఇప్పటికీ ఎప్పటికీ దానికే నా ప్రాధాన్యం. ★



## బంగరు పంజరం

రియాద్‌లో భోజనం, బస, రవాణావసతి అన్నీ వాళ్లే చూసుకునేవాళ్లు. మాకిచ్చే జీతం దేనికి ఖర్చుపెట్టాలో అర్థమయ్యేది కాదు. అంత డబ్బుండేది. అన్ని ఉన్నా అక్కడ స్వేచ్ఛ ఉండేది కాదు. అక్కడి పద్ధతుల్నే పాటించాలి, వారి వస్త్రధారణ నియమాలను అనుసరించాలి. అక్కడ చూసిన మరో వింత... గోల్డ్ సూక్. అంటే అక్కడ వరసగా అన్నీ బంగారు ఆభరణాల దుకాణాలే ఉంటాయి. బంగారు గొలుసులను గజాల లెక్కన అమ్మేవాళ్లు. అలా ఎన్నో వింతలక్కడ. ఆసుపత్రికి వచ్చే గర్భిణులతో మాట్లాడ్డం కోసం కొద్దిగా అరబిక్ కూడా నేర్చుకున్నాను. ఇప్పటికీ అరబిక్ పదాలు కొద్దికొద్దిగా గుర్తున్నాయి.

## మనవరాలితో కాలక్షేపం

మా అల్లుడు సుధీర్ ఎంబీయే పట్టభద్రుడు. ఐఎస్‌బీ గ్రాడ్యుయేట్. మా ఆసుపత్రి వ్యవహారాలు అమ్మాయి మేఘన, అల్లుడు కలిసి చూసుకుంటారు. మా మనవరాలు... ఆకృతి. ఇంట్లో ఉన్నప్పుడు ఆకృతితోనే నాకు కాలక్షేపం.

❖ కుక్కలంటే నాకు బాగా ఇష్టం. ఐదు కుక్కల్ని పెంచుతున్నాను. నేను ఇంట్లోకి అడుగుపెట్టగానే పరిగెత్తుకుంటూ వచ్చి నా చుట్టూ తిరుగుతాయవి.

❖ పుస్తకాలు చదువుతాను కానీ... అన్నీ ఆధ్యాత్మిక పుస్తకాలే. పరమహంస యోగానంద, వివేకానంద తదితరుల రచనలు మాత్రమే.

# 'భారతం'లో హాలీవుడ్ వేట!

**ట్వంటీయత్ సెంచరీ ఫాక్స్, వాల్ట్‌డిస్నీ, వార్నర్ బ్రదర్స్... ఈ హాలీవుడ్ చిత్రనిర్మాణ సంస్థలన్నిటి కన్నూ ఇప్పుడు భారతీయ మార్కెట్ పైనే!**

ప్రపంచంలో ఏటా అత్యధికంగా సినిమాలు విడుదలయ్యే దేశం మనదే. సగటున ఏడాదికి వెయ్యి సినిమాలు విడుదలైతే అందులో దాదాపు 500 హిందీ, తెలుగు సినిమాలే. ఇవికాక, ఇంకా తమిళ, మలయాళం, కన్నడం, మరాఠీ, బెంగాలీ, భోజ్‌పురీ... తదితర భాషలన్నిటిలో కలిపి నాలుగైదు వందల సినిమాలు వస్తున్నాయి. 2012 నాటికి మనదేశంలో వినోదరంగం విలువ రూ.6000 కోట్లు దాటుతుందని అంచనా. వీటన్నిటికీ మూలమైనవారు నూటపది కోట్ల మంది ప్రేక్షకులు. ఈ గణాంకాలన్నీ చూస్తే ఏ చిత్ర నిర్మాణ సంస్థకైనా ఆశపుట్టడం సహజం. అందుకే హాలీవుడ్ సంస్థలకు మన దేశ మార్కెట్ బంగారు బాతులా కనిపిస్తోందిప్పుడు. వార్నర్‌బ్రదర్స్, ట్వంటీయత్ సెంచరీ ఫాక్స్, పారామౌంట్ పిక్చర్స్, వాల్ట్‌డిస్నీ లాంటి సుప్రసిద్ధ హాలీవుడ్ నిర్మాణ సంస్థలన్నీ మన దేశంపై కన్నేశాయి. ఒకదాని తర్వాత ఒకటిగా మన మార్కెట్లోకి అడుగు పెడుతున్నాయి.

***భారతదేశమే...***

2008 మే నెలలో వయాకామ్ సంస్థ మన దేశంలోని నెట్‌వర్క్18తో కలిసి టీవీసీరియళ్లు నిర్మించేందుకు ఒప్పందం కుదుర్చుకుంది. 'చిత్ర నిర్మాణ సంస్థలను ఊరించే మూడు ప్రధాన మార్కెట్లలో ముఖ్యమైనదీ ఆసియాలోనే అగ్రస్థానంలో నిలిచేదీ భారతదేశమేనంటే అతిశయోక్తికాదు' అన్నారు వయాకామ్ సంస్థ అధిపతి టామ్‌ఫ్రెస్టన్ ఈ ఒప్పందం కుదుర్చుకునే సందర్భంలో. 'చైనాలో ఏడాదికి 20కన్నా ఎక్కువ విదేశీ చిత్రాలు విడుదలచేసే వీలు లేదు. విదేశీ యానిమేషన్ చిత్రాలను విడుదల చేసేందుకే ఒప్పుకోరు' అంటారు వాల్ట్‌డిస్నీ అధినేత ఆండీబర్డ్. ఆయన అన్నట్టుగానే మిగతా హాలీవుడ్ సంస్థల కన్నా వేగంగా మన మార్కెట్లోకి చొచ్చుకువచ్చింది వాల్ట్‌డిస్నీ. గత రెండేళ్లలో హిందీలో 'రోడ్‌సైడ్ రోమియో', 'దో దోనీ చార్' చిత్రాలు నిర్మించిన ఈ సంస్థ తెలుగులోనూ దర్శకేంద్రుడు రాఘవేంద్రరావుతో కలిసి 'అనగనగా ఒక ధీరుడు' పేరుతో ఫాంటసీ థ్రిల్లర్‌ను రూపొందించింది. ఈ సినిమాను తెలుగుతో పాటు తమిళంలోనూ విడుదలచేసి మార్కెట్ చేసుకునేందుకు వీలుగా... అక్కడ కూడా ఆదరణ ఉన్న సిద్ధార్థ, కమలహాసన్ కుమార్తె శ్రుతిహాసన్‌లను ఎంచుకోవడంలోనే డిస్నీసంస్థ ముందుచూపు అర్థమవుతుంది.

ఇవేకాదు, 'తారే జమీన్ పర్' సినిమాతో పాపులర్ అయిన కుర్రాడు దర్శీల్ సఫారీ ప్రధాన పాత్రలో డిస్నీ సంస్థ నిర్మించిన 'జోక్కొమాన్' సినిమా కూడా చిత్రీకరణ పూర్తిచేసుకుని విడుదలకు సిద్ధమైంది. వచ్చే రెండుమూడేళ్లలో హిందీ, తెలుగు, కన్నడ భాషల్లో మరో ఆరు సినిమాలను తీసే ప్రణాళికల్లో ఉందీ సంస్థ.










మరో ప్రముఖ సంస్థ వార్నర్ బ్రదర్స్ కూడా 2008లోనే 'సాస్ బహు ఔర్ సెన్సెక్స్' చిత్ర సమర్పణతో బాలీవుడ్‌లో అడుగు పెట్టింది. తర్వాత అక్షయ్‌కుమార్, దీపికా పదుకొనే జంటగా 'చాందినీ చౌక్ టు చైనా' చిత్రాన్ని నిర్మించింది. వార్నర్‌బ్రదర్స్, రమేష్ సిప్పీ ప్రొడక్షన్స్, పీపుల్‌ట్రీ ప్రొడక్షన్స్ కలిసి నిర్మించిన చిత్రమిది. వచ్చే రెండుమూడేళ్లలో దక్షిణాది భాషల్లోనూ సినిమాలు రూపొందించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తోందీ సంస్థ.

***తొలి అడుగు***

అసలు మనమార్కెట్‌లోకి అడుగుపెట్టి హిందీలో ఒక సినిమా తీసిన తొలి హాలీవుడ్ సంస్థ... సోనీ పిక్చర్స్ ఎంటర్‌టైన్‌మెంట్. 2008లో ఈ సంస్థ తీసిన 'సావరియా' ఆశించినంత విజయం సాధించనప్పటికీ ప్రపంచ వ్యాప్తంగా నలభై దేశాల్లో విడుదల చేయడంతో దాదాపు రూ.80కోట్లు సంపాదించి పెట్టింది.

ఇక... టెర్మినేటర్, అవతార్ లాంటి సినిమాలతో భారతీయ ప్రేక్షకులకు చిరపరిచితమైన నిర్మాణ సంస్థ ట్వంటీయత్ సెంచరీ ఫాక్స్. మరో ప్రముఖ సంస్థ 'స్టార్ నెట్‌వర్క్'తో కలిసి 'ఫాక్స్ స్టార్' పేరుతో షారుక్ హీరోగా వచ్చిన 'మై నేమ్ ఈజ్ ఖాన్' చిత్ర హక్కుల్ని కొనుగోలు చేసి ప్రపంచవ్యాప్తంగా విడుదల చేసింది.

***ఇట్నుంచి అటూ...***

హాలీవుడ్ సంస్థలు మన సినిమాలు తీయడమే కాదు... మన భారతీయ సంస్థలు అమెరికాలో మార్కెట్ పెంచుకునే ప్రయత్నాలూ జరుగుతున్నాయి. అనిల్ అంబానీ నేతృత్వంలోని రిలయన్స్ ఎంటర్‌టైన్‌మెంట్ సంస్థ అమెరికాలో భారతీయులు అధికంగా ఉన్న ప్రాంతాల్లో థియేటర్లను భారీగా కొనుగోలు చేస్తోంది. అంతేకాదు, వినోద రంగంలో తమదైన ముద్ర వేయాలనుకుంటున్నట్టు రిలయన్స్ సంస్థ 2008 కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో ఘనంగా ప్రకటించింది కూడా.

యూటీవీ మోషన్ పిక్చర్స్ సంస్థ ట్వంటీయత్ సెంచరీ ఫాక్స్ సంస్థతో కలిసి 'ఐ థింక్ ఐ లవ్ మై వైఫ్', 'ద హ్యాపెనింగ్ (ఈ సినిమాకి దర్శకుడు- ప్రవాసభారతీయుడు మనోజ్ శ్యామలన్ నైట్)', 'ద నేమ్‌సేక్' అనే సినిమాల నిర్మాణంలో పాలుపంచుకుంది.

ఇంకా మరెన్నో సంస్థలు హాలీవుడ్ సంస్థలతో కలిసి సంయుక్త ప్రాజెక్టులు చేపట్టి భారతీయుల సత్తా చూపేందుకు సిద్ధంగా ఉన్నాయి. ★

# ఉసిరి... పోషకాల సిరి

## ఉసిరికాయ పచ్చడి



### కావలసినవి

**ఉసిరికాయలు:** అరకిలో, **రాతిఉప్పు:** ఒకటిన్నర కప్పులు, **ఇంగువ:** టీస్పూను, **నువ్వులనూనె:** ఒకటిన్నర కప్పులు, **ఆవపొడి:** 3 టేబుల్‌స్పూన్లు, **కారం:** ఒకటిన్నర కప్పులు, **జీలకర్ర:** టీస్పూను, **మెంతిపొడి:** 2 టీస్పూన్లు, **పసుపు:** టీస్పూను, **నిమ్మకాయలు:** 4

### తయారుచేసే విధానం

★ ఉసిరికాయల్ని కడిగి పొడిబట్టతో తుడిచి ఎక్కడా తడి అంటకుండా కాసేపు ఎండనివ్వాలి. కాయలకు నిలువుగా గాట్లు పెట్టి ఉంచాలి.

★ రాతి ఉప్పుని మెత్తగా దంచాలి. తరవాత కాయల్ని ఓ జాడీలో వేసి పసుపు, ఉప్పు, కారం, ఆవపిండి, మెంతిపొడి వేసి బాగా కలిపి రెండుమూడు రోజులు ఊరనివ్వాలి. కాయ ఊరి పచ్చడిలో నీళ్లు వస్తాయి. ఇప్పుడు గరిటెతో బాగా కలపాలి. తరవాత బాణలిలో నూనె పోసి కాగాక ఇంగువ వేసి ఓ క్షణం మరిగించి దించాలి. నూనె బాగా ఆరిన తరవాత పచ్చడిలో కలిపి నిమ్మరసం పిండి ఉప్పు సరిచూడాలి.

## రుచి అభిరుచి

## పెరుగుపచ్చడి



### కావలసినవి

**ఉసిరికాయలు:** పావుకిలో, **పచ్చిమిర్చి:** ఆరు, **పెరుగు:** లీటరు, **ఇంగువ:** చిటికెడు, **పసుపు:** పావుటీస్పూను, **నూనె:** సరిపడా, **ఉప్పు:** తగినంత. **కరివేపాకు:** రెండు రెబ్బలు, **ఆవాలు:** టీస్పూను, **మినప్పప్పు:** టీస్పూను

### తయారుచేసే విధానం

★ ఉసిరికాయల్ని గింజలు తీసేసి నిలువుముక్కలుగా కోయాలి. మరీ ముక్కలుగా నమలడం ఇష్టంలేనివాళ్లు కాస్త కచ్చాపచ్చాగా ఉండేలా ఓసారి దంచి తీయవచ్చు.

★ పాన్‌లో కొద్దిగా నూనెవేసి ఆవాలు, ఇంగువ, పచ్చిమిర్చి, కరివేపాకు వేసి వేయించాలి. ఉసిరికాయ తొక్కు కూడా వేసి వేగనివ్వాలి. తొక్కునుంచి బయటకు వచ్చిన నీళ్లన్నీ ఆవిరయ్యేవరకూ వేయించాలి. తరవాత పసుపు, ఉప్పు, పెరుగు వేసి బాగా కలపాలి.

## ఆమ్లా రబ్రి

### కావలసినవి

**క్రీమ్‌మిల్క్:** లీటరు, **కోవా తురుము:** అరకప్పు, **పంచదార:** 4 టేబుల్‌స్పూన్లు, **పిస్తా:** 8, **యాలకులు:** మూడు, **గులాబీ రేకులు:** కొద్దిగా, **ఆమ్లా మురబ్బా:** ఆరుముక్కలు

### తయారుచేసే విధానం

★ మందపాటి గిన్నెలో పాలు పోసి మరిగించాలి. అందులోనే కోవా, పంచదార కలిపి తక్కువ మంటమీద 45 నిమిషాలపాటు మరిగించాలి.

★ పాలు చిక్కబడి సగమయ్యేవరకూ మరిగించి కిందకి దించి చల్లారనివ్వాలి.

★ ఇప్పుడు ఇందులో సన్నగా తరిగిన పిస్తా పప్పు ముక్కలు, యాలకులపొడి వేసి కలపాలి.

★ తరవాత మురబ్బాలోని ఉసిరి కాయలను సన్నగా తరిగి కలపాలి.

★ చివరగాపైన అందంగా గులాబీ రేకులు కొన్ని మురబ్బా ముక్కలను అలంకరిస్తే సరి.



## మురబ్బా



### కావలసినవి

**ఉసిరికాయలు:** అరకిలో, **సిట్రిక్‌యాసిడ్:** అరటీస్పూను, **పంచదార:** అరకిలో, **కెవ్రా (మొగలిపూల) ఎసెన్స్:** 4 చుక్కలు

### తయారుచేసే విధానం

★ ఉసిరికాయలు కడిగి తుడిచి ఫోర్క్‌తో కాయ మొత్తం గాట్లు పెట్టాలి.

★ తరవాత స్టెయిన్‌లెస్ స్టీలు గిన్నెలో పంచదార, ఉసిరికాయలు వేసి రాత్రంతా నాననివ్వాలి.

★ తరవాతిరోజు సిట్రిక్ యాసిడ్ వేసి కలిపి తక్కువ మంటమీద ఉసిరికాయలు మెత్తబడి పంచదార పాకం చిక్కబడేవరకూ ఉడికించాలి.

★ దించిన తరవాత కెవ్రా ఎసెన్స్ కలిపి చల్లారాక పొడి గాజుసీసాలో భద్రపరిస్తే నిల్వ ఉంటాయి. వీటిని రోజూ ఒకటి తింటే రోగనిరోధకశక్తి పెరుగుతుంది.

## ఉసిరి సబ్జి



### కావలసినవి

**ఉసిరికాయలు:** ఎనిమిది, **టొమాటోలు:** ఆరు, **అల్లంవెల్లుల్లిముద్ద:** 2 టీస్పూన్లు, **కరివేపాకు:** నాలుగు రెబ్బలు, **కారం:** టీస్పూను, **పసుపు,** అరటీస్పూను, **దనియాలపొడి:** టీస్పూను, **పంచదార:** 2 టీస్పూన్లు, **ఉప్పు:** ముప్పావుటీస్పూను, **నూనె:** 4 టేబుల్‌స్పూన్లు, **ఆవాలు:** అరటీస్పూను, **కాలోంజి**(నల్ల ఉల్లి విత్తనాలు): అరటీస్పూను, **మెంతులు:** పావుటీస్పూను, **ఇంగువ:** చిటికెడు

### తయారుచేసే విధానం

★ ముందుగా ఉసిరికాయలను ఆరుముక్కలుగా కోయాలి.

★ అరలీటరు నీళ్లు తీసుకుని అందులో అరటీస్పూను ఉప్పు, 2 టీస్పూన్ల పంచదార వేసి ఉసిరి ముక్కలు వేసి ఐదు నిమిషాలు ఉడికించి నీళ్లు వంపేసి పక్కన ఉంచాలి.

★ స్టవ్‌మీద బాణలి పెట్టి నూనె వేసి కాగాక, అల్లంవెల్లుల్లి, కరివేపాకు వేసి వేయించాలి. తరవాత ఇంగువ, ఆవాలు, మెంతులు, కాలోంజి గింజలు వేసి మంచవాసన వచ్చేవరకూ వేయించాలి. తరవాత పసుపు, కారం, దనియాలపొడి, మిగిలిన ఉప్పు వేసి కలపాలి. ఇప్పుడు సన్నగా తరిగిన టొమాటోముక్కలు వేసి నూనె తేలేవరకూ ఉడికించాలి.

★ చివరగా ఉడికించిన ఉంచిన ఉసిరి ముక్కలు వేసి సిమ్‌లో పెట్టి ఓ ఐదునిమిషాలు ఉంచి వడ్డిస్తే రుచితోపాటు ఆరోగ్యకరం కూడా.

# బాల వినోదిని



## సరిచూడండి

**ఈ** చిత్రాన్ని జాగ్రత్తగా గమనించి, ప్రశ్నమార్కు స్థానంలో ఎన్ని జామపండ్లు ఉండాలో చెప్పండి?




## అంకెలాట

**ఇ**క్కడ అంకెలతో ఎన్నో దారులున్నాయి కదా! వీటిలో పైనుంచి ఏ దారిలో కిందకు చేరుకుంటే అంకెల మొత్తం 37 వస్తుందో చెప్పండి.




## ఆటాడుకుందాం

**ఎందరు ఆడాలి?:** ఇద్దరు మాత్రమే ఆడాలి. ఒకరు తెల్ల చుక్కలున్న ఎదురెదురు భుజాల్ని కలపాలి. మరొకరు ఎర్ర చుక్కలున్న భుజాల్ని కలపాలి. ఎవరు ముందు రెండు భుజాల్ని కలిపితే వారిదే విజయం.

**నియమాలేంటి?:** 1. మొదటివ్యక్తి తాను ఎంచుకున్న రంగులోని ఏవైనా రెండు చుక్కల్ని గీతతో కలపాలి. తర్వాత రెండో వ్యక్తి వేరేరంగు చుక్కల్ని గీతతో కలపాలి.

2. ముందుగీసిన గీతతో సంబంధం లేకుండా మధ్యలో ఎక్కడైనా చుక్కల్ని కలుపుతూ కూడా గీతగీయొచ్చు.

3. ఒకరు గీసిన గీతను దాటుకుంటూ వేరొకరు గీయకూడదు.



## ఆ రెండూ?

**వీ**టిలో ఏ రెండు ఆకారాలు ఒకేలా ఉన్నాయో చెప్పండి.










## తేడాలేంటి?

**ఈ** రెండు బొమ్మల మధ్య తొమ్మిది తేడాలు ఉన్నాయి. అవేంటి?





## చెప్పండి చూద్దాం?

ఈ నాలుగు పదాలలో ఉన్న ప్రత్యేకత ఏమిటో చెప్పండి.

BANANA UNEVEN

POTATO GRAMMAR

## బొమ్మగీద్దాం

అంకెల్ని వరుస క్రమంలో కలుపుతూ పోతే బొమ్మ వస్తుంది.



## విప్పండిచూద్దాం

1. తమ్ముడు కుంటుతూ మైలు నడిచేసరికి, అన్న పరుగెత్తుకుంటూ పన్నెండు మైళ్లు నడుస్తాడు?
2. నిండు కుండలో బెండు తేలుతోంది?
3. చక్కనమ్మకు చుక్కల చీర.
4. చెయ్యనికుండ, వెయ్యని సున్నం, పొయ్యని నీళ్ళు, తియ్యగాగనుండు. ఏమిటది?
5. తోవలో పుట్టేది తోవలో పెరిగేది తోవన పోయేవారి కొంగుపట్టేది. ఎవరది?

## శ్రమ విలువ

పిఠాపురంలో రంగాచారి అనే స్వర్ణకారుడు ఉండేవాడు. అతడు ఆ ఊరి జమీందారు కుటుంబానికి కావాల్సిన ఆభరణాలు తయారు చేసేవాడు. రంగాచారి వయసు మీరడంతో అతడి కొడుకు గోపాలా చారికి ఆ బాధ్యత వచ్చింది. గోపాలా చారి తండ్రిలా నైపుణ్యం ఉన్నవాడే కానీ పనిపట్ల శ్రద్ధ తక్కువ. తండ్రి సంపాదించిన డబ్బు ఖర్చుచేస్తూ రోజూ స్నేహితులతో సరదాలూ కబుర్లలో మునిగిపోయేవాడు.

జమీందారు ఓరోజు గోపాలాచారికి కొంత బంగారం ఇచ్చి, వడ్డాణం, గొలుసు తయారు చేయమన్నాడు. గోపాలాచారి ఆ బంగారం తీసుకొని రెండు వందల రూపాయలిచ్చి వేరే కంసాలిచేత ఆభరణాలు చేయించాడు. ఈ విషయం జమీందారుకి తెలిసి గోపాలాచారి ఆభరణాలు పట్టుకొని ఇంటికి వచ్చినపుడు తయారీ ఖర్చుగా



వంద రూపాయలు ఇచ్చాడు. మరో మాటలేకుండా వెళ్లిపోయాడు గోపాలాచారి. అతడు వేరేవారి చేత నగలు చేయించిన ప్రతిసారీ తయారీ ఖర్చులో సగం మాత్రమే జమీందారు ఇచ్చేవాడు. కానీ గోపాలాచారి ఎప్పుడూ ఆ విషయమై అభ్యంతరం చెప్పలేదు. ఇలా చేస్తుండటంతో కొన్నాళ్లకు తండ్రి సంపాదించిన డబ్బు పూర్తిగా అయిపోయింది.

తర్వాత ఓరోజు జమీందారు పిలిచి నగలు చేయమని చెప్పాడు. గోపాలాచారి వారం రోజులు కూర్చొని కష్టపడి ఆభరణాలు తయారుచేశాడు. వాటిని పట్టుకొని జమీందారు ఇంటికి వెళ్తే ఎప్పటిలానే డబ్బు తక్కువచేసి ఇచ్చాడు.

'మీకు శ్రమవిలువ తెలిసినట్టులేదు. వారం రోజులు కష్టపడితే ఇచ్చే ప్రతిఫలం వంద రూపాయలేనా' అని కోపగించుకున్నాడు గోపాలాచారి. 'నీకు శ్రమ విలువ తెలియజేయాలని ఇన్నాళ్లూ తక్కువ డబ్బు ఇచ్చాను. ఇప్పుడు నీలో మార్పు వచ్చింది. నువ్వు ఆర్థికంగా ఇబ్బంది పడినపుడు ఆ డబ్బు ఇద్దామని దాచి పక్కనపెట్టాను. ఇదిగో ఆ డబ్బు. ఇకనుంచి నువ్వే కష్ట పడి పనిచేయి. ఎంత డబ్బు కావాలో అడిగి తీసుకో' అని చెప్పాడు జమీం దారు. తన పొరపాటును గ్రహించిన గోపాలాచారి అప్పట్నుంచి కష్టపడి పని చేయడం అలవాటు చేసుకున్నాడు.

## వరుసలో

ప్రశ్నమార్కు స్థానంలో వచ్చే ఆకారం పక్కనున్న నాలుగింటిలో ఏదో చెప్పగలరా?




## జవాబులు

సరిచూడండి: 4. వరుసలో: B

అంకెలాట: 1225125232123112 11

ఆ రెండూ?: 2, 5.

చెప్పండి చూద్దాం?: మొదటి అక్షరం తీసి చివర చేర్చి వెనుకనుంచి చదివినా అదే పదం వస్తుంది.

తేడాలేంటి?: 1. గడియారంలో సమయం 2. బంతి మీద రంగులు 3. కూర్చున్న బాబు టోపీ 4. పాప చేతిలోని మొక్కజొన్న కండె 5. ఒడిలో చిన్నబాబు కళ్ళు 6. తల్లి చెవిరింగు 7. పెద్దచెట్టు వెనుకనున్న కొమ్మ 8. తండ్రి చొక్కా చేతులు 9. బెలూన్ మీద డిజైన్.

విప్పండిచూద్దాం: 1. గంటల ముల్లు, నిమిషాల ముల్లు 2. వెన్న 3. ఆకాశం 4. కొబ్బరికాయ 5. ఉత్తరేణి మొక్క.



# చక్కనమ్మకు చుక్కల ఫ్యాషన్



**తెల్ల చుక్కలూ నల్ల చుక్కలూ పచ్చ చుక్కలూ ఎర్ర చుక్కలూ... మామూలుగా చూస్తే అందులో ఏ ప్రత్యేకతా కనిపించదు. అదే డ్రెస్సులూ, చీరలూ, యాక్సెసరీస్‌మీద చుక్కల ప్రింట్లు కనిపిస్తే మాత్రం ఎవరైనా 'వావ్' అనాల్సిందే. అందుకే, యాభైల్లో మొదలైన పోల్కా డాట్స్ ఫ్యాషన్ ఇప్పటికీ కొత్తగానే కనిపిస్తోంది. అన్నట్లూ 2011 సంవత్సరాన్ని ఏలడానికి ఈ చుక్కల ఫ్యాషన్ మళ్లీ రంగంలోకి దిగింది.**

చుక్కల గౌను వేస్తే చిన్నారులు ఎంత ముద్దుగా కనిపిస్తారో అమ్మాయిలు అంత అందంగా మెరుస్తారు. అలా అని కాస్త వయసున్న మహిళలకు ఇది సూట్ కాదనుకుంటే పొరబడినట్లే. చుక్కల డిజైన్లు ఎవరికైనా చక్కగా సరిపోతాయి. అందుకే, నిన్న మొన్న బాలీవుడ్‌లోకి అడుగు పెట్టిన సోనమ్ కపూర్ దగ్గర్నుంచీ అలనాటి నటి హేమమాలిని కూడా ఈమధ్య పోల్కా డాట్ డిజైన్లతో మెరిసిపోతున్నారు. గతేడాది చివరిలో అంతర్జాతీయ ఫ్యాషన్ షోలలో మోడళ్ల ఒంటి మీద తళుక్కుమన్న పోల్కాడాట్ డిజైన్లు ఇపుడు హాట్ ట్రెండ్‌గా మారిపోయాయి. నిజానికి ఈ చుక్కల ఫ్యాషన్ ఇప్పటిది కాదు, యూరోపియన్ దేశాల్లో 1950ల్లోనే పోల్కాడాట్స్ ఫ్యాషన్ మొదలైంది. తర్వాత వాల్ట్ డిస్నీ క్యారెక్టర్ మిన్నీమౌస్ వేసుకున్న చుక్కల గౌను దీనికి మరింత ప్రాచుర్యం తెచ్చింది. అలా మొదలైన డాట్స్ ఫ్యాషన్‌కు రకరకాల మెరుగులు దిద్దుతూ ఎప్పటికప్పుడు కొత్త రూపాన్ని ఇస్తున్నారు డిజైనర్లు. ప్రస్తుతం చిన్న పిల్లల గౌన్లు, నైట్ డ్రెస్సుల దగ్గర్నుంచీ అమ్మాయిల ఆధునిక దుస్తుల వరకూ పోల్కాడాట్స్ ఫ్యాషన్ దూసుకుపోతోంది. మనదేశంలోని సంప్రదాయ దుస్తులైన చీరలూ, చుడీదారుల్లోనూ ఈ పోల్కాడాట్స్ చక్కగా ఇమిడిపోయాయి. కేవలం దుస్తుల్లోనే కాకుండా స్కార్ఫ్, షూ, చెప్పులూ, బ్యాగులూ, టోపీలూ ఇతర యాక్సెసరీస్, పిల్లల ఆటవస్తువులూ, కర్టెన్లూ, దుప్పట్లతో పాటు ఇంట్లో వాడే వస్తువుల్లో కూడా చుక్కల డిజైన్ల హవా నడుస్తోంది.

అందుకే, ఈమధ్య టాలీవుడ్, బాలీవుడ్ భామలు పార్టీలూ, ఫంక్షన్లలో పోల్కా డాట్స్ ఫ్యాషన్‌తో మెరిసిపోతున్నారు. అనుష్క, అసిన్‌లాంటి వారు చుక్కల సల్వార్ కమీజ్‌లలో దర్శనమిస్తుంటే, ప్రియమణి, నమిత, విద్యాబాలన్‌లు ఆధునిక దుస్తుల్లో పోల్కాడాట్స్‌ను వేస్తున్నారు. ఇక అలనాటి అందాల నటీమణులు హేమమాలిని, శోభనలు చుక్కల చీరలు కట్టి కనువిందు చేస్తున్నారు. మరి మనమూ పోల్కాడాట్స్‌ను ట్రై చేద్దామా...

















## ఇలా వేసుకోవచ్చు

పార్టీలకు పెద్ద పెద్ద చుక్కలున్న డ్రెస్సులు వేసుకుంటే బాగుంటుంది. పోల్కాడాట్స్ ఫ్యాషన్‌లో తెలుపూ నలుపూ కాంబినేషన్ ఎప్పటికీ ఎవర్‌గ్రీన్. ఆఫీస్ వేర్‌గా వేసుకోవాలనుకున్నపుడు తెలుపు డ్రెస్ మీద నలుపు చుక్కలున్నదైతే బాగుంటుంది. మిగిలిన సమయాల్లో రంగుల పోల్కాడాట్స్‌వి ఏవైనా బాగానే ఉంటాయి.

గౌన్లూ, చీరలూ, నైట్‌డ్రెస్సులను పక్కన పెడితే డ్రెస్సులకు మొత్తమంతా చుక్కలుండే కన్నా సాదా లెగ్గింగ్స్, స్కర్టుల మీదికి చుక్కల టాప్స్ వేసుకుంటే మ్యాచింగ్ అదురుతుంది. వీటిని రివర్స్‌లో... అంటే చుక్కల స్కర్టు మీదికి సాదా టాప్ వేసుకోవచ్చు. యాక్సెసరీస్ కూడా అంతే, పోల్కాడాట్స్ ఉన్న దుస్తుల మీదికి డాట్స్ లేనివే మ్యాచ్ అవుతాయి. ఇక సింగిల్ కలర్ డ్రెస్సుల మీదికి చుక్కల స్కార్ఫ్ కట్టుకోవచ్చు. డాట్స్ ఉన్న హెయిర్ బ్యాండ్, బ్యాగ్, చెప్పులు, గాజు, టోపీ లాంటి వాటిని కూడా విడివిడిగా ప్రయత్నించవచ్చు. నలుపూ తెలుపూ పోల్కాడాట్స్ మీదికి రంగుల యాక్సెసరీస్ అయితే బాగా కనిపిస్తాయి. ఫ్లోరల్ డిజైన్ కాంబినేషన్‌లో కూడా పోల్కాడాట్స్‌ను వేసుకోవచ్చు.







# శతాధిక కవలలు



వెల్ష్ కంట్రీసైడ్, బ్రికాన్‌కు చెందిన ఇనా పగ్, లిలీ మిల్‌వార్డ్‌లు కవల పిల్లలు. 1910లో వాళ్లు పుట్టినపుడు ఇంట్లో పెద్ద పార్టీ చేసుకున్నారట తల్లిదండ్రులు. వాళ్లు చెప్పిన ఆ సంగతులు గుర్తు చేసుకుంటూ ఈ ఏడాది పుట్టినరోజు కేక్ కట్ చేసిన ఈ అక్కచెల్లెళ్లను చూస్తే అందరికీ ఆశ్చర్యమే. అవును మరి, ఇది వారికి నూట ఒకటో పుట్టినరోజు. అంతేకాదు, ప్రపంచంలో ఎక్కువ కాలం బతికిన కవలలు వీరేనట. గతేడాది గిన్నిస్ రికార్డుల్లో స్థానం కూడా సంపాదించారు. ఇంతకీ వారిద్దరూ ఇంతకాలం ఆరోగ్యంగా బతకడానికి కారణమేంటీ అంటే... నవ్వుతూ ఉండడం, కష్టపడి పనిచేయడం అంటారు.

# దూసుకుపోయే బూట్లు

చైనాలోని ఉగాంగ్ గ్రామం కొండ ప్రాంతంలో ఉన్న మారుమూల పల్లెటూరు. కనీస సౌకర్యాలు కూడా లేని ఆ ఊరి నుంచి పాఠశాలకు వెళ్లాలంటే ఇరవై కిలోమీటర్ల దూరం నడవాల్సిందే. దాంతో చాలామంది పిల్లలు చదువుకి దూరమవుతున్నారు. బడికి వెళ్లేవారూ ఉదయం మూడుగంటలకు లేచి నాలుగ్గంటలు నడిస్తే గానీ స్కూలుకి సమయానికి చేరలేని పరిస్థితి. ఇదంతా చూసిన రైతు 'జావో జికిన్' ఈ సమస్యకు పరిష్కారాన్ని చూపాలనుకున్నాడు. ఎన్నో ప్రయత్నాలు చేసి చివరికి 'ఎలక్ట్రిక్ షూస్'ను తయారు చేశాడు. రోలర్ స్కేట్స్ చక్రాలున్న ఈ బూట్లు బ్యాటరీతో నడుస్తాయి. ఒకసారి చార్జ్ చేసిన బ్యాటరీలతో మూడుగంటలు ప్రయాణించొచ్చు. సో, ఈ బూట్లు వేసుకుని హ్యాండిల్‌కు ఉన్న బటన్‌ను స్టార్ట్ చేస్తే చాలు, రోజుకు వంద మైళ్లు ప్రయాణించొచ్చు. ఇప్పటికే ఈ ఎలక్ట్రిక్ షూస్ మీద పేటెంట్ తీసుకున్న జావో త్వరలోనే వీటిని అందరికీ అందుబాటులోకి తీసుకొస్తాడట.



# మర్యాదలు నేర్చుకుంటున్నారు

పోలీసులంటేనే సామాన్యులు కాస్త భయపడతారు. అలాంటిది ఏదైనా కంప్లైంట్ ఇవ్వడానికీ, సలహాలు తీసుకోవడానికీ వచ్చినపుడు వాళ్లు కసురుతూ మాట్లాడితే బాధితులు పోలీసుల దగ్గరకు రావడానికి ఇంకా ఇబ్బందిపడతారు. మాంచెస్టర్‌లో చేసిన ఓ సర్వేలోనూ ఇదే తేలింది. అక్కడి పోలీసులు బాధితులు ఫోన్ చేసినపుడు కూడా సరిగా సమాధానం ఇవ్వడంలేదట. దీంతో సూపరింటెండెంట్ 'నదీమ్ బట్' పోలీసులకు మర్యాద పూర్వకమైన ప్రవర్తనను నేర్పించాలనుకున్నారు. అందులో భాగంగా 'జాన్ లూయిస్' బట్టల షోరూమ్‌కి పంపించారు. అక్కడికెందుకంటారా... ఆ షాపులోని సేల్స్‌మెన్ వినియోగదారులతో మర్యాదగా ఉండడంతో పాటు వాళ్లు అడిగిన దానికి ఎంతో ఓపిగ్గా సమాధానం చెబుతారట. అందుకే, వారి దగ్గర శిక్షణ పొందితే పోలీసులకు బాధితులతో ఎలా మాట్లాడాలో తెలుస్తుందని అక్కడికి పంపించారట. అవును మరి, సత్ప్రవర్తనను నేర్చుకోవడానికి చిన్నా పెద్దా అనే తేడా ఏముంది?




# జోరుగా హుషారుగా...

చిన్నతనంలో స్టేజ్ మీద పాడాలనీ నటించాలనీ ఉంటుంది. కానీ అన్ని కోరికలూ అందరికీ తీరవు. వయసు మళ్లాక 'అయ్యో అప్పుడు ఛాన్స్ దొరకలేదే' అని బాధపడతారు. అలాంటి బామ్మలూ తాతయ్యలు తమ ఆసక్తిని నలుగురికీ చూపించే అవకాశాన్ని కల్పిస్తూ ప్రతి ఏటా 'సూపర్ గ్రాండ్ మదర్ అండ్ సూపర్ గ్రాండ్ ఫాదర్' పోటీని నిర్వహిస్తోంది జార్జియాలోని ఓ స్వచ్ఛంద సంస్థ. 70ఏళ్లు దాటిన వారెవరైనా ఈ పోటీలో పాల్గొని తమకి ప్రావీణ్యం ఉన్న ఏ విద్యనైనా ప్రదర్శించొచ్చు. విజయం సాధించినా సాధించకపోయినా వారి కోరిక తీరిందన్న తృప్తితో మిగిలిన జీవితాన్ని హాయిగా గడిపేస్తారన్నది ఈ పోటీ ఉద్దేశం. ఈమధ్యే జరిగిన పోటీలో ఎంతోమంది బామ్మలూ తాతయ్యలూ పాల్గొని ఇలా ఆడి పాడారు.

# టీచర్ రోబోలు



కొరియాలో బడి పిల్లలకు స్పోకెన్ ఇంగ్లిష్ నేర్పించాలంటే బోల్డంత జీతాలిచ్చి టీచర్లను విదేశాల నుంచి తీసుకురావాల్సిందే. దాంతో ప్రభుత్వానికి అదో పెద్ద భారమై పోయిందట. ఇక లాభం లేదనుకున్న అధికారులు రోబో టీచర్లను రంగంలోకి దించారు. 'కొరియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ' రూపొందించిన ఈ రోబో తల భాగంలో టీవీ స్క్రీన్ ఉంటుంది. రిమోట్‌తో పనిచేసే ఈ స్క్రీన్ ద్వారా ఫిలిప్పీన్స్ నుంచి ఇంగ్లిష్ టీచర్లు కొరియాలో ఉన్న పిల్లలతో నేరుగా మాట్లాడుతూ పాఠాలు చెబుతారు. ఇక టీచర్ మాటలకనుగుణంగా చేతులు కదల్చడం రైమ్స్‌లాంటివి పాడుతున్నపుడు డాన్స్ చేయడం రోబోట్ పని. నేరుగా వీడియో కాన్ఫరెన్స్‌లో చెబితే పిల్లలు ఆసక్తి చూపరు కాబట్టి వారి మాటలకనుగుణంగా హావభావాలు పలికించే రోబోను తయారు చేశారు కొరియన్లు. దీనివల్ల మరో ఉపయోగం కూడా ఉంది. మామూలు టీచర్లతో పోలిస్తే రోబో టీచర్ల ముందు పిల్లలు ఏ భయమూ లేకుండా తమ భావాలను వ్యక్తం చేస్తూ ఆడుతూ పాడుతూ ఆంగ్లాన్ని నేర్చేసుకుంటున్నారట.



# రాశి ఫలం

గ్రహబలం (జనవరి 30 - ఫిబ్రవరి 5)

తంగిరాల ప్రభాకర పూర్ణయ్య సిద్ధాంతి





**మేషం** అశ్విని, భరణి, కృత్తిక 1వ పాదం

వ్యాపారస్తులు సంయమనం పాటించాలి. ఉద్యోగులకు కొన్ని సమస్యలు ఎదురవుతాయి. కానీ చివరకు జయం కలుగుతుంది. అవసరాలకు తగ్గట్టు ఏదోవిధంగా ధనం చేతికి అందుతుంటుంది. శుభకార్యాల్లో పాల్గొంటారు. విద్యార్థులకు అనువైన కాలం. ఆరోగ్యం మిశ్రమం. అయినవాళ్లతోనే మాటలు పడవలసి వస్తుంది. చంద్రశేఖరుణ్నీ సూర్యుణ్నీ ఆరాధించడం ఉత్తమం.



**వృషభం** కృత్తిక 2,3,4 పాదాలు; రోహిణి, మృగశిర 1,2 పాదాలు

గురుబలం బాగుంది. కళాకారులకూ రైతులకూ అధికశ్రమ, అందుకు తగ్గ ఉత్తమ ఫలితాలుంటాయి. ఇంటాబయటా సమస్యలు రావచ్చు. ఉత్తరదిశ ప్రయాణాలుంటాయి. మోకాళ్ళనొప్పులు, గొంతు నొప్పి వంటివాటితో బాధపడే సూచనలున్నాయి. భార్య ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించండి. కొత్తవస్తువులు కొనుగోలు చేస్తారు.



**మిథునం** మృగశిర 3, 4 పాదాలు, ఆర్ద్ర, పునర్వసు 1, 2, 3 పాదాలు

నూతన వ్యాపారవ్యవహారాలపై దృష్టి కేంద్రీకరిస్తారు. అప్పుడప్పుడూ మానసిక అస్థిమితం, వైరాగ్యం ఎదురవుతాయి. దైవకార్యాలలో పాల్గొంటారు. విద్యార్థులకు వృద్ధి, కళాకారులకు ఆనందం. కొత్తవారితో పరిచయాలై స్నేహితులుగా మారతారు. పాతమిత్రుల కలయికతో ఆనందిస్తారు.



**కర్కాటకం** పునర్వసు 4వ పాదం; పుష్యమి, ఆశ్లేష

వారమంతా రాజభోగం. కాకపోతే అకాల ప్రయాణాల కారణంగా కొంత మానసిక ఒత్తిడి ఉంటుంది. ఏ విషయంలోనైనా స్వీయనిర్ణయాలు తీసుకుని ఆచరిస్తారు. డబ్బు బాగా ఖర్చుచేస్తారు. సంతానం వల్ల ఆనందం పొందుతారు. శాస్త్ర, సాంకేతిక రంగాలవారికీ కళాకారులకూ ఉత్తమ ఫలితాలు. స్థిరాస్తి కొనుగోలు చేస్తారు. వ్యాపారులకు లాభాలతోపాటు సమస్యలు కలుగుతాయి. స్త్రీ వ్యతిరేకత, దడ ఉంటాయి జాగ్రత్త.



**సింహం** మఖ, పుబ్బ, ఉత్తర 1వ పాదం

ఏదో సాధించాలన్న తపన ఉంటుంది. అకాల ప్రయాణాలు సూచితం. ఆకస్మిక ధనవ్యయం. ఉద్యోగులకు పై అధికారుల వల్ల మాటపడాల్సి వస్తుంది. శారీరక నిస్త్రాణ అధికంగా ఉంటుంది. ఏ వ్యవహారంలోనైనా నిదానంగా యత్నిస్తే సత్ఫలితాలుంటాయని గ్రహించండి. విద్యార్థులకూ కర్షకులకూ కళాకారులకూ ఉన్నతి.



**కన్య** ఉత్తర 2, 3, 4 పాదాలు; హస్త, చిత్త 1, 2 పాదాలు

తూర్పుదిశా ప్రయాణాలు ఫలిస్తాయి. సంతతి విద్య, ఆరోగ్యాలు సంతృప్తినిస్తాయి. ఇంటి అలంకరణలో కొన్ని మార్పులూ చేర్పులూ చేపడతారు. శుభకార్యాల్లో పాల్గొంటారు. వ్యాపారస్తులకు ధనవ్యయం సూచితమవుతోంది. ధనానికీ మాటకూ లోటురాదు. రాజకీయనాయకులకూ వైద్యులకూ శుభసమయం.



**తుల** చిత్త 3, 4 పాదాలు, స్వాతి, విశాఖ 1, 2, 3 పాదాలు

ఎన్ని సమస్యలు ఎదురైనప్పటికీ ముందుజాగ్రత్తతో స్వతంత్ర భావాలతో ముందడుగు వేస్తారు. ఆదాయం ఒకటి ఖర్చు నాలుగు అన్నట్టుగా ఉంటుంది పరిస్థితి. అయినా ఖర్చును లక్ష్యపెట్టరు. సంఘకార్యాల్లో ఇతరులకు ఆదర్శంగా నిలుస్తారు. విద్యార్థులకూ వ్యాపారులకూ అనుకూల కాలం. శాస్త్రకళాకోవిదులకు గుర్తింపు, ధనలబ్ధి.



**వృశ్చికం** విశాఖ 4వ పాదం; అనూరాధ, జ్యేష్ఠ

నూతన వస్తు సేకరణ చేస్తారు. శుభకార్యాల్లోనూ సాంఘిక కార్యక్రమాల్లోనూ పాల్గొంటారు. లోపల ఎలా ఉన్నా పైకి ఉత్సాహాన్ని ప్రదర్శిస్తారు. అలంకరణల కోసం డబ్బు ఖర్చు చేస్తారు. వ్యాపారులకూ కళాకారులకూ ధనలబ్ధి, ఉత్సాహం. అనుకూల ప్రయాణాలుంటాయి. ఆహార ప్రియత్వం పెరుగుతుంది. చమత్కార, ప్రియభాషణలు చేస్తారు.



**ధనుస్సు** మూల, పూర్వాషాఢ, ఉత్తరాషాఢ 1వ పాదం

అన్నిటా సమస్యలే. అయినప్పటికీ వ్యవహారాలు నిదానంగా ఫలిస్తాయి. ఆరోగ్యం విషయంలో జాగ్రత్తగా ఉండండి. మీ ప్రతీ కదలికనూ ఇతరులు గమనిస్తూ ఉంటారు, జాగ్రత్త. దురదలు, పీడ కలలు, నిద్రలేమి, శిరోవేదన అధికంగా సూచితమవుతున్నాయి. విద్యార్థులు అధిక శ్రద్ధతో చదవాల్సిందే.



**మకరం** ఉత్తరాషాఢ 2, 3, 4 పాదాలు; శ్రవణం, ధనిష్ఠ 1, 2 పాదాలు

భూలాభం, వ్యాపారలాభం, స్త్రీ వ్యతిరేకత తదితర వ్యవహారాల గురించి ఆలోచనలు కలిగి ఉంటారు. ధన, వస్తు, వాహనాది విషయాల్లో జాగ్రత్త పాటించాలి. వ్యాపారులకు ఉన్నత లాభాలూ అనుకూల కదలికలూ ఉంటాయి. కళాకారులకు గుర్తింపు, ఉన్నతి. శుభకార్య యత్నాల్లో కొంత కదలిక వచ్చినట్లే వచ్చి స్తంభిస్తాయి. నట, గాయకులకు, కళాకారులకు పురోభివృద్ధి. వ్యాపారులకు ఉత్సాహం.



**కుంభం** ధనిష్ఠ 3, 4 పాదాలు; శతభిషం, పూర్వాభాద్ర 1, 2, 3 పాదాలు

శ్రమ అధికం. ఆరోగ్యరీత్యా ఇబ్బందులు. ఏదో సాధించాలనే తపన ఉంటుంది. సాధనలోనూ కొంత అభివృద్ధి. కొత్తకొత్త ప్రణాళికలు వేస్తారు. ఉద్యోగస్తులకు మానసిక ఆందోళన ఉంటుంది. భూమి కొనుగోలు, గృహ నిర్మాణ యత్నాలు ఆశించవచ్చు. గాయకులకు ఉన్నతి. ఆర్థిక లావాదేవీలు అనుకూలం.



**మీనం** పూర్వాభాద్ర 4వ పాదం, ఉత్తరాభాద్ర, రేవతి

దడ, భయం వంటి లక్షణాలతో మానసికంగా ఆందోళన చెందుతారు. వ్యాపారవ్యవహారాల్లో స్వతంత్ర ఆలోచనలు కలుగుతాయి. కొద్దిగా ముందుచూపుతో వ్యవహరిస్తే లాభం. తల్లి తరఫు బంధువుల్లో ఒకరి ఆరోగ్యం గురించి ఆందోళన చెందుతారు. ప్రయాణాల్లో జాగ్రత్త అవసరం. వ్యాపారులకు వృద్ధి, శుభకార్య సందర్భాలు అనుకూలిస్తాయి. వస్తు లాభం.

# సమీక్ష

## ఆధ్యాత్మిక అక్షరమాల!

అఆఇఈ... అహం నించి ఆత్మ దాకా, ఇహం నించి ఈశ్వరుడిదాకా ...అన్న శీర్షికకు సంక్షిప్త రూపం. ఆధ్యాత్మిక సాహిత్యం చేదు గుళిక లాంటిది. దాన్ని తేనెలో ముంచి తియ్యతియ్యగా మన చేతిలో పెట్టారు రచయిత మల్లాది వెంకట కృష్ణమూర్తి. ఓపట్టాన కొరుకుడు పడని విషయాల్ని ఆహ్లాదంగా చెప్పడానికి ఆయన ఎంచుకున్న పద్ధతి వైవిధ్యంగా ఉంది. ప్రతి వ్యాసాన్నీ హాస్యంతో ప్రారంభించారు. ఆ తర్వాత చక్కని శ్లోకాన్ని తాత్పర్యసహితంగా వివరించారు. విషయం సుబోధకం కావడానికి చిన్నచిన్న కథలూ ఆసక్తికరమైన సంఘటనలూ జోడించారు. పాపపుణ్యాలు, దానగుణం, ఇంద్రియ నిగ్రహం, మరణం, వాగ్దోషాలు...దాదాపు డెబ్బై వ్యాసాలూ ఆధ్యాత్మిక, మానసిక వికాసానికి ఉపకరించేవే. ఈ పుస్తకాన్ని కొని చదవడమే కాదు, ఆత్మీయులకు కానుకగా ఇవ్వమని రచయిత సిఫార్సు చేస్తున్నారు. మంచి సూచన.




**అఆఇఈ** (అహం నించి ఆత్మ దాకా ఇహం నించి ఈశ్వరుడి దాకా)
రచన: మల్లాది వెంకట కృష్ణమూర్తి; పేజీలు: 143; వెల: రూ.90/-
ప్రతులకు: ప్రధాన పుస్తక కేంద్రాలు.

– వకుళ

## కమ్మని అనువాదం!




ఇది అనువాద కవిత్వమైనా అనువాదకుడు తనదైన భావనాస్రవంతి లోకి, భాషలోకి అనుసృజన చేయడం వల్ల స్వతంత్ర కవిత్వంలానే అనిపిస్తుంది. ఇరవైమూడు భాషల్లోని కవిత్వాలను తెలుగు పాఠకులకు చేరువచేశారు ముకుందరామారావు. భాష ఏదైనా, సంస్కృతీ సంప్రదాయాలు ఏవైనా మానవీయ అనుభూతుల సారం ఒక్కటే అనిపిస్తుంది ఈ పుస్తకం చదివాక. ఇందులో మొత్తం 52 మంది కవులు రాసిన 71 కవితలున్నాయి. 'ఈ రాత్రి నేను రాయగలను' కవితలో 'ప్రేమ పొట్టిది, మరపు పొడవైనది' అంటారు కవి. ఎంత చక్కని భావన! ఇలాంటి ఆణిముత్యాలు ఇంకా చాలా ఉన్నాయి.

**అదే ఆకాశం** (అనేక దేశాల అనువాద కవితలు)
**అనువాదం:** ముకుందరామారావు; పేజీలు: 108; వెల:రూ.60/-
**ప్రతులకు:** ప్రధాన పుస్తక కేంద్రాలు.

– సి.వి.సర్వేశ్వరశర్మ

## అక్షర నివాళి

శ్రీశ్రీకి నూరేళ్ళు నిండాయి. ఈ వంద ఏళ్ళలో శ్రీశ్రీ జీవితం-సాహిత్యం-రాజకీయాలు ఎలా నడిచాయో, ఎవరెవరు ఏ రకంగా వాటి గురించి అనుకున్నారో 'తారీఖులు దస్తావేజులు ఇవి కావోయ్ చరిత్ర సారం' అని అన్నా, వాటిప్రకారం కూడా శ్రీశ్రీ ఎలా ఉన్నాడో తెలియబరిచే ఒక విస్తృత రచన తెలకపల్లి రవి రాసిన 'శ్రీశ్రీ జయభేరి'. శ్రీశ్రీ తొలి అడుగుల నుండి మొదలుపెట్టి- కవితా ప్రభవం, ప్రస్థానం, జీవితం, ఎర్రజెండా, విరసం-'విరసం', విమర్శలు విశ్లేషణలు, ఆఖరి రోజులు, సాహిత్య వారసత్వం అని తొమ్మిది ప్రకరణాలుగా -అనేక అంశాల సమాహారంగా, పూర్వాపరాలను పేర్కొంటూ ఈ రచన చేశారు. శ్రీశ్రీకి ఉన్న మార్క్సిస్టు సిద్ధాంత పరిజ్ఞానం పరిమితం అయినా అవసరమైన అవగాహన మాత్రం ఉంది. శ్రీశ్రీ కొత్తను ఆహ్వానించగల సహృదయుడు. 'రసన' అనే రచనాత్మక రసస్పందన సిద్ధాంతాన్ని, గురజాడ, వేమనలపై వేసిన అంచనాలను చూసినపుడు కవిగానేకాక విమర్శకునిగా శ్రీశ్రీ ఏమిటో తెలుస్తుందని ఈ పుస్తకం తెలుపుతుంది. 'శ్రీశ్రీ జయభేరి' నూరేళ్ళ శ్రీశ్రీకి ఎగరేసిన బావుటా. ఒక ఆసక్తిదాయకమైన కవి గురించిన విస్తృత రచన. తెలకపల్లి రవి అభినందనీయులు.



**శ్రీశ్రీ జయభేరి** (జీవితం-సాహిత్యం-రాజకీయాలు)
రచన: తెలకపల్లి రవి; పేజీలు: 356; వెల: రూ.100/-
**ప్రతులకు:** ప్రజాశక్తి పుస్తక కేంద్రాలు.

– సుధామ

## బుజ్జాయీ...వాళ్లనాన్నా!

దేవులపల్లి కృష్ణశాస్త్రిగారి అబ్బాయి బుజ్జాయి (అసలు పేరు సుబ్బరాయశాస్త్రి, వయసు ఒకటి తక్కువ ఎనభై) తన గురించి తాను రాసుకున్న పుస్తకమిది. తన తండ్రికి సంబంధించీ చాలా జ్ఞాపకాలున్నాయి. కృష్ణశాస్త్రి తన ముద్దుల కొడుకును బడికి పంపకుండా, సభలకూ సాహితీ కార్యక్రమాలకూ వెంటబెట్టుకు వెళ్లినందుకు ఓరకంగా మంచే జరిగింది. బుజ్జాయికి లోకజ్ఞానం అబ్బింది. చాలామంది ప్రముఖులతో పరిచయాలు ఏర్పడ్డాయి. అవన్నీ ఈ పుస్తకానికి ముడిసరుకుగా పనికొచ్చాయి. పోస్టర్లు చూసి అక్షరాలు నేర్చుకోవడం, పదిహేనో ఏట బొమ్మల పుస్తకం అచ్చేయించుకోవడం వగైరా వగైరా అనుభవాలు ఆసక్తికరంగా ఉన్నాయి. మద్రాసు-హైదరాబాద్ మధ్య మకాం మార్పులు, పిల్ల పెళ్లికుదిరింది వ్యవధి లేకపోతే ఎలా చేయాలని వణికిపోవడం...ఇంకా ఎన్నో మధ్యతరగతి ఆలోచనల్ని దాచుకోకుండా పంచుకున్నారు. చేయితిరిగిన చిత్రకారుడైన బుజ్జాయి అక్షరాలు, ఒకనాటి ఆంధ్రదేశాన్నీ ఆ అనుబంధాల్నీ సచిత్రంగా కళ్లముందు నిలుపుతాయి.




**నాన్న-నేను**
రచన: బుజ్జాయి; పేజీలు: 196; వెల: రూ.150/-
ప్రతులకు: ప్రధాన పుస్తక కేంద్రాలు.

– కె.వి.ఎల్.నరసింహశాస్త్రి

# పదవినోదం-1023

|  |  |  |  |  |  |  |  |  |  |  |  |
|---|---|---|---|---|---|---|---|---|---|---|---|
|  | 1 |  | 2 |  | 3 |  |  | 4 |  | 5 | 6 |
| 7 |  |  | 8 | 9 |  |  | 10 |  | 11 |  |  |
|  |  | 12 |  |  |  | 13 |  |  | 14 | 15 |  |
| 16 |  |  | 17 |  |  |  | 18 |  |  |  |  |
|  |  | 19 |  |  |  | 20 |  |  | 21 |  |  |
|  | 22 |  |  |  | 23 |  |  | 24 |  |  |  |
| 25 |  |  |  | 26 |  |  | 27 |  |  |  | 28 |
|  |  |  | 29 |  |  | 30 |  |  |  | 31 |  |
| 32 |  | 33 |  |  | 34 |  |  |  | 35 |  |  |
| 36 |  |  |  | 37 |  | 38 |  | 39 |  |  |  |
|  |  | 40 |  |  |  | 41 | 42 |  |  | 43 |  |
|  | 44 |  |  | 45 |  |  |  |  | 46 |  |  |

## ఆధారాలు

**అడ్డం:**

1. వందలో అయిదోవంతు? (3)
3. వ్రణం అంటే? (2)
5. ఖైదు (2)
7. ఒకప్పటి న్యూజిలాండ్ క్రికెట్ దిగ్గజం రిచర్డ్ ...! (2)
8. వాడుక (3)
10. ఖరం అంటే ఏమిటో తెలుసా? (3)
12. అడ్డం అయిదుతో పంచదార పంట! (1)
13. బహిష్కరణ (2)
14. దుర్యోధనుడి మేనమామ? (3)
16. సంతోషం (2)
17. పెళ్ళి, కల్యాణం (3)
18. సుగ్రీవుడి సోదరుడు (2)
19. శంక, అనుమానం (3)
20. ఒట్టు; ఆనతి అక్షరం కోల్పోయినా అర్థం అదే! (2)
21. తటాకం (3)
23. సైగ (2)
24. దమయంతి వరించినవాడు (3)
25. అన్యమనస్కత (3)
26. పదిలం (2)
27. ప్రాయం (3)
29. శరీరం (2)
30. గతించిన సంవత్సరం (3)
31. ఇది కొట్టుకోవడం ఆగిపోయిందంటే బతికి ఉన్నాడో లేదో అనుమానించాల్సిందే! (2)
33. సహస్రాలు (2)
35. ఇచ్ఛ (3)
36. ఇది వేయడమంటే అందరికీ తెలియజెప్పడం, చాటడం (3)
37. తండ్రి గరగర, తల్లి పీచుపీచు, బిడ్డలు రత్నమాణిక్యాలు? (3)
39. కలపను పరపరా కోసేది? (2)
40. పంక్తి, శ్రేణి (3)
41. గడి కలిగిన ఒక రకం నేల! (3)
44. ఆలకించే (2)
45. తోము (2)
46. బంగారం (3)

**నిలువు:**

1. నూనె లేకుండా ఆవిరి మీద తయారయ్యే టిఫిన్! (2)
2. శత్రువు (2)
3. పెట్ట కాదు! (2)
4. రజతం (2)
6. మజ్ను సినిమాలో నాగార్జున పక్కన నాయిక? (3)
7. అమృతమథనం సమయంలో వెలువడ్డ మహాగరళం (4)
9. 'వారివివాహం' మధ్యమ లోపంతో మబ్బు! (4)
10. తుపాను (4)
11. అవస్థ (2)
15. తనయుడు (4)
17. వేరే దేశం (3)
20. ఆనతి, ఆదేశం లాంటిది (2)
21. అందం, సౌందర్యం (3)
22. యుద్ధం (3)
23. సముద్రం వికృతి? (2)
24. కృష్ణుడు-నారాయణుడు, అర్జునుడు- ? (3)
26. భీతి (2)
27. అల్లు అర్జున్ ముఖ్యపాత్రలో ఒక సినిమా? (3)
28. ఎడమ కన్ను కాదు (4)
29. పాదం (2)
31. స్త్రీ, అల్లెతాడు! (2)
32. పరాజయం (3)
33. తెల్లవారుజామునే (4)
34. పిల్ల, బిడ్డ (2)
35. ఆగ్రహం (2)
37. ఆకురసం (3)
38. అలాగే (2)
39. వారిని లోపలికి రమ్మని గౌరవంగా ఆహ్వానించండి! (2)
42. సింహాసనం (2)
43. ప్రసిద్ధి (2)

# సుడోకు-68

ప్రతి వరుసనూ (నిలువూ అడ్డమూ కూడా) 1-9 అంకెలతో పూరించాలి. ఒక వరుసలో ఒక అంకెను ఒకసారి మాత్రమే వాడాలి. తొమ్మిది నలుచదరపు బాక్సుల్లో ప్రతి బాక్సులోనూ 1-9 అంకెలు ఉండాలి.

|  |  |  |  |  |  |  |  |  |
|---|---|---|---|---|---|---|---|---|
|  |  |  | 7 |  | 8 | 1 | 5 |  |
| 1 |  | 7 | 2 |  |  |  |  | 6 |
|  |  |  |  | 5 |  | 9 |  | 7 |
|  |  |  |  | 8 |  | 5 | 6 | 3 |
|  | 1 | 3 | 6 |  | 7 | 2 | 4 |  |
| 8 | 4 | 6 |  | 2 |  |  |  |  |
| 7 |  | 4 |  | 1 |  |  |  |  |
| 9 |  |  |  |  | 6 | 8 |  | 2 |
|  | 2 | 1 | 8 |  | 5 |  |  |  |

## సమాధానాలు

### పదవినోదం-1022

|  |  |  |  |  |  |  |  |  |  |  |  |
|---|---|---|---|---|---|---|---|---|---|---|---|
| 1 ము | సు | 2 గు |  | 3 వె | య్యి |  | 4 జ |  | 5 దో | 6 స |  |
| గ్గు |  | 7 రు | షు | లు |  | 8 మే | న | క |  | 9 గం | 10 ప |
| 11 రు | 12 జు | వు |  | 13 తు | మ్ము |  | మే |  | 14 రు |  | ళ్లు |
|  | లై |  | 15 వా | రు |  | 16 వం | జ | 17 రం | కో | 18 సం |  |
| 19 ఆ | లో | 20 చ | న |  | 21 అ | దే |  | గు |  | 22 జ | 23 త |
| రు |  | తు |  | 24 జో | ల |  | 25 క |  | 26 చె |  | ల్పం |
|  | 27 ప | ర | 28 దా |  | 29 స | న్నా | యి | అ | ప్ప | న్న |  |
| 30 జ | ట్టు |  | 31 రి | 32 వ | ట |  | పు |  | లే |  | 33 చి |
|  | 34 కో | 35 తి |  | స్తా |  | 36 జూ |  | 37 చే | దు | 38 మా | త్ర |
| 39 ఆ |  | 40 క | ళ్లు |  | 41 రెం | డో | 42 కా | రు |  | రీ |  |
| 43 ల | ర | మ |  | 44 గం | ట |  | టా |  | 45 దా | చు | కో |
| స్యం |  | 46 క | త్తి |  | 47 చిం | దు |  | 48 అ | త | డు |  |

### సుడోకు-67

|  |  |  |  |  |  |  |  |  |
|---|---|---|---|---|---|---|---|---|
| 9 | 3 | 4 | 6 | 2 | 1 | 8 | 5 | 7 |
| 2 | 7 | 1 | 5 | 8 | 9 | 3 | 4 | 6 |
| 5 | 8 | 6 | 7 | 4 | 3 | 1 | 9 | 2 |
| 8 | 9 | 7 | 2 | 1 | 6 | 5 | 3 | 4 |
| 1 | 4 | 5 | 3 | 9 | 7 | 2 | 6 | 8 |
| 6 | 2 | 3 | 4 | 5 | 8 | 9 | 7 | 1 |
| 7 | 5 | 9 | 1 | 6 | 2 | 4 | 8 | 3 |
| 3 | 1 | 8 | 9 | 7 | 4 | 6 | 2 | 5 |
| 4 | 6 | 2 | 8 | 3 | 5 | 7 | 1 | 9 |

# చైనా ఉగాది...

# చెవుల పిల్లి ఏడాది










**చాం**ద్రమానం ప్రకారం ఫిబ్రవరి మూడున చైనా కొత్త సంవత్సరంలోకి అడుగుపెడుతోంది. సో, క్యాలెండర్లు, గ్రీటింగ్ కార్డుల దగ్గర్నుంచీ గ్యాడ్జెట్స్, గృహోపకరణాల వరకూ చైనా వీధుల్లో ఎటు చూసినా ప్రస్తుతం కుందేలు ప్రతి రూపాలే దర్శనమిస్తున్నాయి. కొత్త సంవత్సరానికీ కుందేలుకీ సంబంధమేంటీ అంటారా... పన్నెండు రకాల జంతువుల పేర్లతో పిలిచే చైనా సంవత్సరాల్లో 2011 కుందేలు నామ సంవత్సరం. రాశి చక్రం ప్రకారం మనం అదృష్ట రత్నాలు ధరించినట్లు చైనీయులు ఏ జంతువు పేరుతో సంవత్సరం ప్రారంభమైతే దాన్నే ఆ ఏడాదికి అదృష్టచిహ్నంగా భావిస్తారు. అంతేకాదు, కుందేలు నామ సంవత్సరంలో పుట్టినవారు మేధావులూ అంతర్ముఖులూ సున్నితమనస్కులూ అనీ 'నొప్పింపక తానొవ్వక' పద్ధతిలో సౌమ్యంగా హుందాగా వ్యవహరిస్తూ అందరినీ ఆకట్టుకుంటారనీ న్యాయ, రాజకీయ, వ్యాపార రంగాల్లో బాగా రాణిస్తారనీ జాతకం కూడా చెబుతారు.




ప్రీమియర్ షో
త్వరలో...
ETV
ఐ లవ్ యూ
డాడీ
దర్శకత్వం
ఇంద్రనాగ్
నిర్మాత
సుమన్